మానవుడు

మూలం : గురుదత్

అనువాదం : కూనపరాజు సత్యనారాయణరాజు

ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ.

ఆదర్శ ప్రచురణ :

ప్రథమముద్రణ

నవంబరు, 1963

సాదాప్రతి : రు. **6-00**

లైబ్రరీ ఎడిషన్ : రు **7-50**

ముద్రణ :

త్రినాథ్ ఆర్టు ప్రింటర్సు.

విజయవాడ-2

అంకితం

సహృదయులు, స్నేహితులు అయిన

డా. ఆమంచర్ల శంకర్రావు, M.D., D.P.M. గారికి

కృతజ్ఞతతో

—కె. యస్. రాజు

మానవుడు

మొదటి భాగము

1

"నాన్నా! అమ్మ ఏడుస్తోందే?" మూడు సంవత్సరాల బాలుడు ప్రక్కన కూర్చుని కుతూహలంతో తండ్రిని అడుగుతున్నాడు. ప్రౌఢావస్థలో నున్న ఆ పురుషుడు ఒక గదిలో పదిమంది పిల్లలమధ్య కూర్చుని చింతాగ్రస్థమైన ముఖంతో ప్రక్కగదివైపు చూస్తున్నాడు. ఆ గది తలుపులు మూసివున్నాయి.

పురుషుని శరీరంమీది బట్టలు అస్తవ్యస్తమయి వున్నాయి. తలమీదకూడా ఏమీ లేదు. గది చాలా పెద్దది. అయినప్పటికీ పదకొండు ప్రాణులు దానిని ఆవరించటంవల్ల అది ఇరుకుగా అగుపిస్తోంది.

పిల్లలందరిలోనూ పెద్దది ఆడపిల్ల. ఆమె వయస్సు పదిహేను సంవత్సరాలుంటుంది. ఆమె ఒక మామూలు సల నార్, చొక్కా తొడుక్కుంది. తలదువ్వుకుని చాలాకాలం కావటంవల్ల జుట్టుమాసి వీపుమీద వ్రేలాడుతోంది. పాదరక్షలు లేవు. ఇంటపనులు చేయటంవల్ల చేతులు [illegible] కాన్ని కోల్పోయి కొంచం మోటుగా వున్నాయి.

మధ్యాహ్నసమయం దాటింది. పిల్లలందరు [illegible] భోజనం ముగించారు. పెదమ్మాయి కమల పిల్లలందరకూ

భోజనంపెట్టి, తిన్న కంచాలు కడిగి, గదిలో ఒకమూల మంచం వాల్చుకుని విశ్రమిస్తోంది.

ఇంతలో మూసిన గదిలోనుంచి కెవ్వుమని ఒక కేక వినిపించింది. పురుషునిదృష్టి అటు మళ్ళింది. తల్లి బాధను గురించి ప్రవేశించే ఆ బాలుడుకూడా ఏడవటం ఆరంభించాడు. కాని పురుషునిధ్యానం పిల్లవానిమీదకు పోలేదు. బాలుడు లేచి గదివైపు పరుగెత్తాడు. ఏడుసంవత్సరాల మరొక బాలుడు లేచి అతని చెయ్యిపట్టుకుని "ఆగు, లోపలికి వెళ్ళకు" అన్నాడు.

"అమ్మ ఏడుస్తోంది!"

"అమ్మకు బాధగావుంది."

"లోపల డాక్టరమ్మ వుంది. చెవులు కోసేస్తుంది."

పిల్లలందరిలో అందరికంటె చిన్నవాడైన ఒక చంటిబిడ్డకూడా వున్నాడు. వాడు పిల్లలందరిమధ్యనున్న తండ్రి వడిలో నిదురపోతున్నాడు. ఆ ఆక్రందన తరువాత గదిలో నిస్తబ్దత ఆవరించింది. మొదట్లో వినిపించే "ఊ: ఊ:" అనే మూలుగుకూడా అంతర్ధానమయిపోయింది. రెండు నిముషాల వరకూ ఆ పురుషుడు మూసిన గుమ్మంవైపు చూస్తూ కూర్చున్నాడు. గదిలోపల నిస్తబ్దత ఆవరించేసరికి, అతని హృదయంలో కంగారు బయలుదేరింది. వడిలోని పిల్లవాడిని కమల చేతికిచ్చి గదితలుపు సందువద్ద చెవులుంచి వింటున్నాడు.

గదిలోంచి నెమ్మదిగా "ఉవాఁ, ఉవాఁ" అనే ఏడ్పు వినిపించింది. ఏడుపు పెద్దది కావటం మొదలిడింది. అత

అప్పుడే జన్మించిన శిశువుయొక్క రోదనధ్వని. అది వినగానే పురుషుని ముఖంనుంచి విషాదరేఖలు దూరమయ్యాయి.

పిల్లలందరూ కొత్తగా పుట్టిన శిశువు ఏడ్పువిని తండ్రి ముఖంవైపు ప్రశ్నముఖంతో చూశారు. ఇంకా కమల మంచంమీద పడుకుని ఆలోచనా నిమగ్నురాలై వుంది. ఆమె ఏదో స్వప్నలోకంలో విహరిస్తూన్నట్టు అనుపిస్తోంది. ఆమె మనసు ఈగదిలోలేదు.

మూసిన తలుపులు కొంచెం తెరచుకున్నాయి. ఒక స్త్రీ, బహుశా దాయిలావుంది. ముఖం బయటకు పెట్టి "వేడి నీళ్ళు కావాలి" అంది.

పురుషుడు కమలను పిలిచి "వేడినీళ్ళు తీసుకురా!" అన్నాడు.

కమల స్వప్నజగత్తునుంచి బయటకు వచ్చింది.

నిదురపోయిన బాలకుని అక్కడే విడిచిపెట్టి గదినుంచి బయటకు వచ్చింది. గదిప్రక్కని వసారాలో పొయ్యిమీద నీళ్ళు కాగుతున్నాయి. దాయి చెప్పినమీదట ఒక తప్పాళాలో నీళ్ళుపోసి ముందే పొయ్యిమీద పెట్టి వుంచింది. తప్పాళాలోని నీటిని ఒక బాల్చీలోనికి దిమ్మరించి గదిలోనికి తీసుకు వెళ్ళింది, కమల. దాయి బాల్చీ తీసుకుని లోపల వుంచి తలుపులు మూసివేసింది.

కమల అడిగింది. "నాన్నా? ఎవరు!"

"తెలియదమ్మా!" తండ్రిముఖంమీది చింతారేఖలు కొంతవరకు మాసిపోయాయి. మళ్ళా కమల పిల్లాడిప్రక్కన పడుకొని స్వప్నలోకంలో మునిగిపోయింది.

కమల తమనాశనాన్నైన పరమానంద్ లేచి, నిదుర పోతున్న బాలుని ఎత్తుకుని బయట వరండాలోకి వెళ్ళాడు. తండ్రి అతనివంక చూస్తున్నాడు. కాని పరమానంద్ మాత్రం తండ్రివంక చూడనైనాలేదు.

పరమానంద్ నిక్కరు, చొక్కా తొడుక్కున్నాడు. నిక్కరుక్రింద కాళ్ళు నగ్నంగానే వున్నాయి. చెప్పులు తొడుక్కొని ఇంటిమెట్లు దిగి క్రిందకు వచ్చాడు.

పరమానంద్ కన్న చిన్నవాడైన సదానంద్ కూడా నిక్కరు, చొక్కా తొడుక్కున్నాడు. అతనుకూడా లేచి వట్టి కాళ్ళతోనే మెట్లుదిగి పరమానంద్ దగ్గరకు వచ్చాడు. ఇద్దరూ ఇంటిక్రిందనున్న సందులో నుంచున్నారు.

పరమానంద్ వయస్సు పదునాలుగేండ్లు. సదానంద్ వయసు పన్నెండున్నర వత్సరాలు. ఇద్దరూకూడా తమ తరువాత ముగ్గురు నలుగురు పిల్లలజననం చూసే వున్నారు. ఇవేళ జరిగినట్టే మునుపుకూడా జరగటం ఇద్దరికీ బాగా జ్ఞాపకం వుంది. వేడినీళ్ళు గదిలోకి వెళ్ళగానే తమకొక తమ్ముడో చెల్లెలో పుట్టినట్టు గ్రహించారు.

పరమానంద్ ఇంటిగుమ్మంలో పిల్లవాణ్ణి వళ్లో పడుకోబెట్టుకుని కూర్చున్నాడు. అతని దగ్గరనే నుంచుని సదానంద్ అడిగాడు "ఈసారి ఏంపేరు పెడతారు?"

మందహాసంతో పరమానంద్ అడిగాడు. "మగపిల్లవాడా, ఆడపిల్లా?"

సదానంద్ కు ఈ విషయం తెలియదు. అందుచేత మాట్లాడలేదు. ఇంతలో చంకన బిందెతో ఒకస్త్రీ నీళ్ళకోసం

ఆ వీథంటూవచ్చింది. కుఱ్ఱవాళ్ళిదరూ కూర్చోనడం చూచి ఏమిటీ? ఈసారి తమ్ముడా? "చెల్లాయా?" అని అడిగింది.

"తెలియదు."

"ఎంతమందయ్యారు, మీరు?"

పరమానంద్ చిరునవ్వునవ్వాడు. "మీఅమ్మ అదృష్ట వంతురాలు." అంటూ వెళ్ళిపోయింది, నూతివైపు, ఆ పడతి.

2

పరమానంద్ తండ్రిపేరు నందలాల్. అతనికి ఇరు వయ్యోవ ఏట పెళ్ళి అయింది. అప్పటికి అతని భార్య, లక్ష్మి పదిహేను సంవత్సరాల యువతి. పెళ్ళయిన సంవత్సరానికి కమల జన్మించింది. తరువాత ఏడాదిన్నర, ఏడాదిన్నరకు పరమానంద్, సదానంద్, దేవానంద్ అనే ముగ్గురు కుఱ్ఱాళ్ళు పుట్టారు. అప్పటికి నందలాల్ పాతికి ఏండ్ల వాడయ్యాడు. లక్ష్మికి ఇరవై ఏండ్లు నిండాయి.

నందలాల్ కుంవర్‌సేన్ అనేవకీలుగారిదగ్గర గుమాస్తా. మంచి ఆదాయం వచ్చేది. అందుచేత నలుగురి పిల్లలు కలిగినప్పటికీ, అతనికేమీ కష్టమనిపించలేదు. లక్ష్మిమాత్రం తొందర తొందరగా పిల్లలు కలుగటంవల్ల సిగ్గుపడుతుండేది. పక్కింటివాళ్లు "కుక్కలా పిల్లల్ని కనేస్తోంది" అనటం వింది.

అప్పటిలో ఒక సంఘటన జరిగింది. కుంవర్‌సేన్ వయస్సు నలభై ఏండ్లు నిండింది. ఆయనకు సంతానం కలుగ లేదు.

మొదట్లో కుంవర్‌సేన్ తన భార్యను డాక్టర్లకు, ఆయుర్వేద వైద్యులకు, అనేకమందికి చూపిస్తుండేవాడు. కాని ఏమీలాభం కన్పించలేదు. తరువాత ఆయన డాక్టరుచేత తన పరీక్షచేయించుకున్నాడు. డాక్టరు ఆయన శుక్లాన్ని పరీక్షచేసి ఆయనకు సంతానం కలుగదని చెప్పాడు.

డాక్టరు చెప్పినవిషయాన్ని కుంవర్‌సేన్ తన భార్యకు తెలియనివ్వలేదు. అయినప్పటికీ ఆయనకు ఈ ప్రపంచంమీద విరక్తి కలుగటం ఆరంభించింది. ఉన్నట్టుండి విదేశాలన్నీ యాత్ర చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. అంటే నందలాల్ నిరుద్యోగి అవుతాడన్నమాట.

ఇది వినగానే నందలాల్ చాలా గాబరాపడ్డాడు.

వకీల్‌గారినడిగాడు. "ప్లీడరుగారూ? నాగతిఏమికాను?"

"నువ్వు ఎవరయినా మరొక వకీలుదగ్గర చేరు."

"దానికి చాలా సమయం పడుతుందండి. నాయింట్లో యిప్పుడు తిండికికూడా ఏమీలేదు."

ఇది వినగానే వకీలు గంభీర ఆలోచనలో పడ్డాడు. కొంచంసేపుండి ఆయనన్నారు.,- "సరే, నువ్వు మాయింటి వ్యవహారాలు చూస్తూవుండు. తోటవాడు, కాపలావాళ్ళ చేత సరిగా పనిచేయిస్తూండు. నేను నెలకొక వంద యిస్తూంటాను. తక్కినది కచేరీలో సంపాదించుకుని, కాలంగడుపుకో."

వకీలుగారు విదేశాలలో రెండు సంవత్సరాలున్నారు. ఈమధ్యలో నందలాల్ పిల్లలను పుట్టించడం ఆపుచేశాడు. తన భార్య మంచి పంటనేలలాంటిదని అతడు గ్రహించాడు. అందుచేత అతను స్త్రీ సంసర్గమే కట్టిపెట్టేశాడు.

లక్ష్మికూడా ఈకార్యంలో భర్తతో పూర్తిగా సహ కరించింది. రాత్రిళ్లు ఆమె పిల్లలను తీసుకుని గదిలోపల పండుకుని గొళ్లెంపెట్టుకునేది. భర్తమాత్రం వరండాలో పడుకునేవాడు. ఇక పగటివేళంటే భార్యాభర్తలు ఏకాంతంగా కలుసుకునే సమయమే వచ్చేదికాదు.

కుంవర్ సేన్ రెండు సంవత్సరాలవరకూ విదేశాలలో గడిపాడు. స్వదేశం చేరేసరికి ఆయన మనస్సు కొంచెం స్థిర పడింది. తిరిగి తనపని ప్రారంభించాడు. అందుచేత నందలాల్ ఆర్థిక స్థితి తిరిగి బాగుపడింది.

ఆదాయమొచ్చే మార్గం కన్పించగానే నందలాల్-లక్ష్మి తిరిగి సంసర్గం ఆరంభించారు. తొమ్మిదినెలల తరువాత లక్ష్మి ఇద్దరు కవలపిల్లల్ని కన్నది. వాళ్ళకు ప్రభా, రమ అని పేర్లు పెట్టారు.

తనభార్య ఇద్దరు పిల్లలకూ ఒకేసారి పాలు యివ్వడం చూసి నందలాల్ నవ్వుతుండేవాడు అతను ఆమెతో - "సంయమంవల్ల ఏమిలాభం జరిగింది?

ఇంతకుముందు సంవత్సరంన్నరకు ఒక బిడ్డ అయితే, ఈసారి రెండున్నర సంవత్సరాలకు ఇద్దరుకలిగారు." అన్నాడు.

లక్ష్మిలోకూడా సంయమంగా వుండాలనే వుత్సాహం చచ్చిపోయింది. అక్కడనుంచి పిల్లలందరినీ బయటిగదిలో పడుకోబెట్టి భార్యాభర్తలు లోపలిగదిలో పడుకోవటం ఆరంభించారు. పరిణామంగా ప్రసవించిన ఆరునెలలకే తిరిగి గర్భం దాల్చటం మొదలిడింది. [illegible] లోపుగానే తిరిగి బిడ్డ తయారైంది.

ఈసారి పదకొండవ శిశువు జన్మించాడు. తొలిసారి బిడ్డకు పదిహేనేళ్ళ వయస్సు వచ్చింది. ఇంటి పనంతా కమలే చెయ్యవలసివస్తోంది. తల్లి పిల్లల్ని కనడం, వాళ్ళను పెంచడం లోనే మునిగివుంటోంది. దానివల్ల కమల స్కూలుకు వెళ్ళి నప్పటికీ అయిదవ తరగతిమించి చదువలేకపోయింది. ఇంటి పని బాగా పెరిగింది. అందుచేత ప్రభ, రమల సహాయంతో కూడా పూర్తికావటంలేదు. ఆమె ఎప్పుడూ అలసటగానే వుంటోంది. ప్రభా, రమలు స్కూలుకు వెడుతున్నారు. కాని ఇంటదగ్గర చదువుకునేందుకు అవకాశం దొరకటంలేదు. అందుచేత క్లాసులో తక్కిన ఆడపిల్లలకన్న ఎప్పుడూ వెనక బడే వుంటున్నారు.

ప్రభ, రమల తరువాత నలుగురి మగపిల్లలున్నారు. ఇప్పుడు మరొక మగబిడ్డ కలిగాడు. ఈసారి లక్ష్మి చాలా బాధపడింది. ఇంతమంది పిల్లలు కలగటంవల్ల ఆమె చాలా నీరసపడిపోయింది. ఆమెలో ప్రసవించే శక్తికూడా బాగా క్షీణించిపోయింది.

అదృష్టవశాత్తు అది ఆదివారం. నందలాల్ కచేరీకి పోనక్కరలేదు. అందుచేత ఉదయంనుంచీ పిల్లలను చక్క బెడుతూ కూర్చున్నాడు. తన భార్య ప్రసవ పీడనతో ఏడు స్తూంటే, ఆయన భయపడే పిల్లల్ని ఊరుకోబెడుతున్నారు.

మధ్యాహ్నం దాదాపు మూడుగంటలకు ప్రసవించింది, లక్ష్మి. పురుటింటిలోని పనంతా పూర్తిచేసి దాయి బయటకు రాగానే నందలాల్ పిల్లలతో సహితంగా లోపలికి వెళ్లాడు. కమలమాత్రం మంచంమీదనే నిదురపోయింది. ఆమెగది

లోపలికి వెళ్ళలేదు. పరమానంద్, సదానంద్ ఇద్దరూ ఇంటి గుమ్మందగ్గర కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

దాయి తన బాక్సు తీసుకుని బయటకు దిగి వస్తూ, వాళ్ళిద్దరూ కూర్చుని మాట్లాడుకోనడం చూసి, నవ్వుతూ, "మీతమ్ముణ్ణి చూడటానికి వెళ్ళారా?" అంది.

సదానంద్, "వాడికంటే యేమైనా విలక్షణంగా వున్నాడా?" అనడిగాడు.

ఈ ప్రశ్నకు దాయి జవాబు చెప్పలేకపోయింది. మౌనంగా ఇంటినుండి బయటకు వెళ్ళిపోయింది. తరువాత సదానంద్ – "అయితే యీసారి పిల్లాడన్నమాట?"

"అంతే అయినట్టుంది."

"అదెలా జరుగుతుంది?"

ఈప్రశ్నకు ఏమి జవాబివ్వాలో పరమానంద్‌కు తెలియదు. అందుచేత మాట్లాడలేదు.

సదానంద్ వయస్సు పన్నెండున్నర సంవత్సరాలుంటుంది. డి. ఏ. వి. స్కూలులో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు.

"నాన్నగారు రెండునెలలనుంచి ఫీజు కట్టలేదు. ఇక మీదట ఆయన ఇవ్వలేరు. నాపేరు స్కూలు రిజిష్టరునుంచి కొట్టివేస్తారు."

"నేను జీతం కట్టనక్కరలేదు. కాని చదువుకునేందుకు నాదగ్గర పుస్తకాలులేవు"

దానిమీదట ఇద్దరూ ఒకరిముఖం ఒకరు చూసుకోడం ఆరంభించారు.

వాళ్ళ పొరుగునే రామ్‌లాల్ అనే ఒకవ్యక్తివున్నాడు. అతనికి వీధిచివర దుకాణంవుంది. దుకాణానికి వెళ్తూ వస్తూ వాళ్ళిద్దరూ విచారంగా కూర్చొనడం చూసి, "ఏమ్! ఏం చేస్తున్నావ్!" అన్నాడు.

"ఏంలేదు."

"నీకింకొక తమ్ముడు పుట్టాడని విన్నాను!"

"ఆఁ, విన్నాము."

"అయితే ఇంకా చూడలేదా?"

"లేదు."

"ఏం?"

"ఏదైనా క్రొత్తవిషయం ఏమీకాదుగా?"

రామ్‌లాల్ నవ్వాడు. అతను వెళ్ళిపోయిన తరువాత సోదరులిద్దరూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

3

వకీల్ కుంవరసేన్‌గారి ప్రాక్టీసు బాగావుంది. మున్షీ నందలాల్ ఆదాయం కూడా బాగా వస్తోంది. ఒకొక్కొక్కనెల అతని ఆదాయం వెయ్యిరూపాయలుకూడా దాటుతోంది.

అయినప్పటికీ నందలాల్ ఇంటి పరిస్థితి ఏమీ బాగా లేదు. ఒకవైపున పదకొండుగురు సంతానాన్ని పోషించటం, వాళ్ళకు బట్టలు, చదువులకు ఖర్చుపెట్టడమే కాకుండా, నందలాల్ త్రాగుడుకు, వేశ్యలకు అలవడ్డాడు. తక్కిన గుమాస్తాలందరితో పోల్చి చూసుకుంటే తనింట్లో సంతానం ఊరికే పెరిగిపోవటం చాలా బాధగావుంది, నందలాల్‌కు. నందలాల్

నెత్తినీద అది చాలా బరువుగా తయారవుతోంది. ఈ బరు
వును, భారాన్ని మరచిపోయేందుకు నందలాల్‌కు మద్యపానం
వేశ్యాగమనం ఉపాయాలుగా అగుపించాయి.

పదకొండవ సంతానం కలిగిన మరునాడు తెల్లటి ఉత
కిన బట్టలు వేసుకుని వకీలుగారి కార్యాలయానికి వెళ్ళాడు
నందలాల్. వకీలుగారి కార్యాలయం ఆయన ఇంట్లోనే ఒక
హాలు. వకీలుగారు యింకారాలేదు. కాని చాలామంది జన
ప్రోగుపడ్డారు.

నందలాల్ కాకుండా మరొక గుమాస్తా కూడా
వున్నాడు. కాని అతనంటే వకీల్‌గారికి అంతగా ఇష్టంలేదు
పైగా కస్టమర్స్‌కి కూడా అతనిమీద అంతగా నమ్మకంలేదు
అందుచేత నందలాల్ రాగానే కస్టమర్స్ అందరూ అతన్ని
చుట్టుముట్టారు.

నందలాల్ ఎప్పుడూ ఎవరైనా క్రొత్త కస్టమర్
వచ్చారా, లేదా అని చూస్తుంటాడు. ఇవేళకూడా ఒకక్రొ
కస్టమర్ వచ్చాడు. నందలాల్ ముందుగా అతన్నే పలకరించాడు

ఆయన తన విషయంలో చెప్పుకున్నాడు. "నాపే
హీరాలాల్. మామామయ్య నన్ను దత్తత చేసుకున్నా
కాని వ్రాతచేతలేమీ జరుగలేదు. చుట్టాలూ, ఇరుగు పొరు
వాళ్ళు సాక్ష్యం యివ్వటానికి సిద్ధంగా వున్నారు.

మా మామయ్యపేరు సూరజ్‌లాల్. ఆయన మర
చాడు. దగ్గర దగ్గర పదిలక్షల సంపత్తిదాకా విడిచిపోయా
ఇప్పుడు ఆయన అన్నకొడుకులు రమణలాల్, సుమన్‌లా
తమే వారసులమని ప్రకటిస్తున్నారు.

నాకు యీ విషయం నోటీసు యిచ్చారు. నేను యీ విషయంలో వాళ్ళని యెదుర్కొని, నేనే ఉత్తరాధికారినని నిరూపించాలి."

"ఈవిషయంలో మీరుప్రయత్నించవలసిందే. గెలవటానికి కూడా మంచి అవకాశాలున్నాయి. ముందు మీరు వకీలుగారి కన్సల్టేషన్ ఫీజు అయిదువందలు, గుమాస్తా ఫీజు యాభై రూపాయలు చెల్లించవలసి వుంటుంది."

నందలాల్ మాటలు విన్న తరువాత ఆలోచించి, ఒక గంటలో డబ్బు చెల్లిస్తానని చెప్పాడు మీరాలాల్.

సరిగ్గా ఎనిమిది గంటలకు కుంవర్ సేన్ ఆఫీసుగదిలోకి వచ్చారు. నందలాల్ ఆఫీసుఫైళ్ళు తీసుకుని లోపలికివెళ్ళాడు.

కుంవర్ సేన్ కొంచెం విచారంగా అగుపించారు. దాని మీదట నందలాల్ ప్రశ్నించాడు. "బాబూ! మీరీవేళ అస్వస్థతగా వున్నట్టున్నారు?"

"అస్వస్థత ఏమీ లేదోయ్... పోనియ్ దాని కేంగాని!"

"నావల్ల ఏమైనా జరుగగలదంటే చెప్పండి బాబూ!" చెప్పటానికి కుంవర్ సేన్ సందేహించాడు. కొంచెం ఆలోచించి, "చూడు నందలాల్! నాకు సంతానం లేనిమాట నీకు తెలిసిందే. రమాకాంత్ ఇంట్లో యీసారి మగబిడ్డ పుట్టినట్టయితే దత్తత చేసుకుందామని మా ఆవిడ నిశ్చయించింది. వాళ్ళ ఇంట్లో వరుసగా అయిదుగురు మగబిడ్డలు కలిగారు. నిన్న వాళ్ళింట్లో ఆడబిడ్డ పుట్టింది. దానిమీదట మా ఆవిడకు చాలా విచారం కలిగింది. మగపిల్లాడిని పెంచుకుందామని నిశ్చయించుకుంటే ఆడిపిల్ల కలిగింది."

"పండిత్‌జీ!" నందలాల్ గంభీరంగా అన్నాడు. "ఒక మాట చెబుతాను. కోపగించుకోరుకదా?"

"చెప్పు."

"ఆఖరకు మీరు రమాకాంత్ ఇంటి బిడ్డనే దత్తత చేసుకోవలసిన అవసరం ఏముంది. ఆమాత్రం ఎవరింటి బిడ్డనైనా చేసుకోవచ్చు."

"రమాకాంత్ భార్య, నా భార్య స్నేహితురాళ్ళు."

"అయితేమాత్రం ఏమండి? మీరొకపిల్లాడిని దత్తత చేసుకోండి. రమాకాంత్ కూతుర్ని ఆ పిల్లాడికిచ్చి పెళ్ళి చెయ్యండి. ఇటు పిల్లాడూ దక్కుతాడు, అటు రమాకాంత్ కూతురూ మీ యింటిది అవుతుంది. రెండుకార్యాలూ నెరవేరుతాయి."

కుంవర్ సేన్ నందలాల్ మాటలకు నవ్వాడు. వాస్తవానికి నందలాల్ ఇటువంటి జతకార్యాలను పూర్తిచేయటంలో చాలా ప్రవీణుడు. ఎప్పుడైనా దావా విషయాల్లో అడ్డంకులు వస్తే చక్కగా ఆలోచించి వాటిని విడదీసి కార్యం సానుకూల పర్చేవాడు.

కాని ఇదిదావాకాదు. అయినప్పటికీ సలహా బావుంది. కుంవర్ సేన్ అడిగాడు, "అయితే పిల్లాడు ఎక్కడ దొరుకుతాడు?"

"నేను వెదుకుతాను. నిన్న మాయింట్లో పదకొండవ సంతానం కలిగింది. మగపిల్లాడు. అయ్యగారికి పిల్లాడు నచ్చితే పని జరిగిపోతుంది. అటు మీ కార్యం, ఇటు రమాకాంత్ కార్యం, నా కార్యం అన్నీ నెరవేరుతాయి."

నందలాల్ ప్రస్తావన కుంవర్ సేన్‌కు ఒక నూతన జ్యోతిలా కన్పించింది. ఆయన కుర్చీలోంచి లేచి తన భార్యతో మాట్లాడేందుకని లోపలికి వెళ్ళారు.

నందలాల్ తన తెలివైన ప్రస్తావనకు సంతోషిస్తూ వకీల్‌గారి ప్రతీక్షణలో అక్కడనే నుంచున్నాడు. ఒక అర గంట లోపుగా వకీల్‌గారు తన భార్యతో సహితంగా హాలు లోకి వచ్చారు. వకీల్‌గారికి తన భార్యను ఒప్పించడానికి హైకోర్టులో జడ్జీల నొప్పించడానికంటే ఎక్కువ ప్రయత్నం చెయ్యవలసివచ్చినట్టుంది. రాగానే కుంవర్ సేన్ అన్నారు. "నందలాల్ ! ఈవిడ ఏదో అడగాలంటోంది. కాస్త ఈవిడకు చెప్పు."

నందలాల్ వకీలుగారి డ్రాయిరుముందు నుంచున్నాడు. వకీల్‌గారు ఒకకుర్చీలో కూర్చున్నారు. ఆయనభార్య సరోజినీ దేవి కూడా మరొక కుర్చీలో కూర్చుంది.

సరోజినీదేవిగారు కూడా ఏడుస్తూండటంవల్ల కళ్ళు ఎఱ్ఱబడి వుండటం గమనించాడు నందలాల్. అందుచేత నందలాల్ సానుభూతి ఉట్టిపడేలాగ ముఖంపెట్టి నుంచున్నాడు. సరోజినమ్మ అడిగింది — "మీరు ఏం వర్ణం?"

"సారస్వత బ్రాహ్మణులం."

"ఏ ప్రాంతీయులు ?"

"కాంగడాజిల్లా - భట్టగ్రామము. అక్కడ మా పెద్ద న్నయ్య వ్యవసాయం చేస్తున్నాడు. నేను అక్కడినుంచి వచ్చి పదహారేళ్ళయ్యింది."

"మీకు పిల్లలెంతమంది ?"

"నిన్న పదకొండవ సంతానం కలిగింది."

"మీ భార్య చాలా అదృష్టవంతురాలు."

"అవునండి." నందలాల్ మనస్సులో భార్యను తిట్టుకుంటున్నాడు.

"అయితే మీ అబ్బాయిని మాకిస్తారా ?"

"అంతకంటే నాకు అదృష్టమేముందండి !"

"ఎలా వుంటాడు ?"

"చూడటానికి చాలా అందంగా వుంటాడు. తమరు చూసుకోండి. భగవంతుడి దయవల్ల ఎనమండుగురు కొడుకులు. ఎవరు నచ్చితే వాళ్ళనే తీసుకోవచ్చును."

"మంచిది. ఇవేళ సాయంకాలం మీ ఇంటికి చూసేందుకు వస్తాను."

"మామీద చాలా దయ చూపించారు !"

సరోజినీదేవి లేచి వెళ్ళిపోయిన తరువాత కుంవర్ సేన్ నవ్వుతూ అన్నాడు – "అమ్మగారిని ఒప్పించేదుకు చాలా వాదించవలసివచ్చింది. ఈమాత్రం ఏ కేసులోనైనా వాదిస్తే అయిదువందలువచ్చేవి. నందలాల్ చిరునవ్వుతో అన్నాడు–"ఆ మాత్రం ఫీజు ఏర్పాటు చెయ్యనే చేశాను ప్రభూ. అయిదు వందలు యివేళ వస్తాయి."

"నందలాల్ ! నువ్వు చాలా ప్రయోజకుడివి. ఈ పని కాస్తా అయిపోతే నా నెత్తిమీద భారం తగ్గిపోయినట్టే."

నందలాల్ కూడా చాలా ఆనందించాడు.

4

ఈ వేళ నందలాల్‌కు డెబ్భైరూపాయలకుపైగా ఫీజు లభించింది. ఈధనాన్ని అతని ఉద్దేశ్యంలో సదుపయోగపరచ డానికి కచేరీనుంచి తిన్నగా మధిరాగృహానికి బయలుదేరాడు. మున్షీ రాధాకృష్ణ అనే అతని మిత్రుడొకడు ఒక బీదవకీలు దగ్గర గుమాస్తాగా వుంటున్నాడు. ఆ వకీలుగారి పని అంతగా బాగుండలేదు. అందుచేత పాపం ఆగుమాస్తా బక్కచిక్కినపిల్లిలా నందలాల్ వెనుకాల తిరుగుతుంటాడు. నందలాల్‌కు విశేషా దాయం లభించిన రోజున తన మిత్రుణ్ణికూడా వెంటతీసుకు పోయి అతని కష్టాలు మరపించటానికి ప్రయత్నిస్తుంటాడు.

ఇద్దరూ అనార్కలీ బజారులోని మధిరా - గృహానికి వెళ్ళారు. స్వదేశీ సారాయి రెండుసీసాలు, నాలుగు ఆమ్లెట్లు ముందుపెట్టుకున్నారు.

మాట్లాడుకుంటూండగా కుంవర్ సేన్ గారిభార్య ఈవేళ బిడ్డను చూసుకునేందుకు తనయింటికి వస్తానని చెప్పినవిషయం జ్ఞాపకమొచ్చింది, నందలాల్‌కు. త్రాగటం మొదలెట్టాడో లేదో ఈ విషయం జ్ఞప్తికిరాగానే లేచినుంచున్నాడు. సీసాలో సగం రాధాకృష్ణ గ్లాసులో పోసి తక్కింది తను రెండు గుక్కల్లో త్రాగివేశాడు. మరొక చిన్నసీసా జేబులో వేసు కున్నాడు. తరువాత బిల్లు చెల్లించి బయటకువచ్చి టాంగాలో ప్లీడరుగారి ఇంటికి వెళ్ళాడు.

కాని అక్కడకు తీరా వెళ్తే, వకీలుగారు భార్యతో సహాతం కారులో యెక్కడకో వెళ్ళారని తెలిసింది. వకీలు

గారికి అతని ఇంటి ఎడ్రసు తెలుసు. తన యింటికే వెళ్ళి వుంటారని అనుకున్నాడు. నందలాల్ తిన్నగా అదేటాంగాలో తనింటికి జేరుకున్నాడు. ఇంటిముందు కారుచూసి వకీలుగారు ఇంకా తనింట్లోనే వున్నారని గ్రహించాడు.

వకీలుగారు రావటం అతని ఇంటికే వచ్చారు. కాని నందలాల్ రావటానికి కొంచెం ముందుగా మరొకచోటకు వెళ్ళారు. పరమానంద్ ఇంటిగుమ్మంలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు.

నందలాల్ అతన్ని దీర్ఘాలోచనలో మునిగి వుండటం చూసి అన్నాడు. "ఏమిరా! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఇవేళ పుస్తకాలు లేనందున మాస్టారు కొట్టారు."

"ఏం? పాఠం చదువలేదా?"

"పాఠం ఒకస్నేహితుడి పుస్తకంలో చదువుకెళ్ళాను."

"అయితే యెందుకు కొట్టారు?"

"ఆయన పుస్తకాలు చూస్తున్నారు. కాని నాదగ్గర లేవు. నాకు పాఠం వచ్చునని చెప్పేను. ఆయన విసుక్కుని నాకుపుస్తకాలు కావాలోయి పాఠంకాదు అన్నారు."

"మీ మేష్టరు చాలా మూర్ఖుడులా వున్నాడే."

"అవును. నేను చదువు మానేద్దామని నిశ్చయించుకున్నా. అటువంటి మూర్ఖునిదగ్గర చదవటం యిష్టంలేదు."

"పుస్తకాల కెంతవుతుంది?"

"అయిదు రూపాయల పావలా"

"చాలా ఖరీదు చెప్పావు?"

"అవికాకుండా అర్థరూపాయివి రెండుకాపీలుకావాలి"

నందలాల్ జేబునుంచి డబ్బులు తీస్తున్నాడు. ఇంతలోనే దాయి మెట్లు దిగివచ్చి నందలాల్‌ను చూసి అడిగింది.
"బాబుగారు! నాఫీజు యిచ్చివెయ్యండి. అమ్మగారు ఇవేళ బాగా వున్నారు."

"నీ బిల్లెంత ?"

దానిమీదట దాయి బిల్లుతీసి అతనిముందు పెట్టింది. బిల్లు ముఫ్ఫైరూపాయల పదిహేనణాలుంది. ఇరువై రూపాయలు ఆమెఫీజు, తక్కినది మందుఖర్చు.

బిల్లుచూసి, "గతసారి నువ్వు ఫీజు పదిహేనే తీసుకున్నావుగా ?" అనడిగాడు నందలాల్.

"అవును. ఈసారి రెండుగంటలు యెక్కువపట్టింది. వచ్చేసారి ముప్ఫై తీసుకోవచ్చు."

"ఎందుచేత ?"

"మీ ఆవిడ చాలా బలహీనమయిపోతోంది. వచ్చేసారి కాన్పుకు చాలా జబ్బు చెయ్యవచ్చుకూడాను!"

"అలా అనకు, భగవంతుడు చల్లగా చూడాలి. ఇదిగో తీసుకో."

ముప్ఫైఒక్క రూపాయి లెక్కపెట్టి దాయిచేతుల్లో పెట్టాడు. దాయి వెళ్ళిపోయిన తరువాత పరమానంద్‌కు డబ్బు యివ్వబోతున్నాడు. అప్పుడే మెట్లపైనుంచి కమల పిలిచింది. "నాన్నా, దాయికి డబ్బు యిచ్చేముందు పైకిరండి. అమ్మ పిలుస్తోంది."

"కాని దాయి డబ్బు పట్టుకుపోయింది."

"మీరు రండి. అమ్మ పిలుస్తోంది."

నందలాల్ పరమానందకు డబ్బు ఇవ్వకుండా మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాడు. పరమానంద్ అతనివైపు చూస్తూవుండి పోయాడు.

నందలాల్ తన భార్య పడుకునివున్న లోపలిగదిలోకి వెళ్ళాడు. తనభార్య తెల్లగాపాలిపోయిన ముఖంచూసి అతను ఆశ్చర్యపోయాడు. అతనునుంచుని వుండడం చూసి అతని భార్య నెమ్మదిగా "కూర్చోండి" అంది.

నందలాల్ కూర్చున్నాడు. లక్ష్మి, "ఇంకెందుకండి ! ఆ జేబులోనివి ఇక్కడ కెందుకు తెచ్చారు ?"

అనుకోకుండానే నందలాల్ చెయ్యి తన జేబుమీదకు పోయింది. వెంటనే మాట మార్చేస్తూ, 'వకీలుగారు, ఆయన భార్య ఇక్కడకు వచ్చారా ?"-అడిగాడు.

"వచ్చారు. కాని మీరు ఈ సారాయికోసం పిల్లల్ని అమ్మటం ఎప్పటినుంచి మొదలెట్టారు ?"

"ఎవరి నమ్మాను ?"

"ఇతన్నే, ఇంకెవరిని ?" లక్ష్మి మంచంమీద పరున్న బిడ్డను చూపిస్తూ అంది. "వకీలుగారికి అమ్మారుకదూ ?"

"నేను అమ్మలేదు. ఆయన దత్తతచేసుకుంటున్నారు."

"అయితే పట్టణంలో ఇంకెవ్వరూ కన్పించలేదా ! వీడిమీదనే దృష్టిపడింది ! ఏమాత్రం డబ్బు తీసుకున్నారో చెప్పండి ?"

"నే నేమీ తీసుకోలేదు. వీడిని తన బిడ్డగాచేసుకుంటున్నారు. లక్షలాది సంపద వీడిపేర వ్రాస్తారు, దానితోపాటు నిన్ననే పుట్టిన ఒక మిత్రుడి కూతుర్ని వీడికిచ్చి పెళ్ళిచేస్తారు."

"నాకు తెలిసిందిలెండి. రమాకాంత్ భార్య అయిదు వేలడిగిందని వాళ్ళు చెప్పారు. మీకుకూడా అంతేయిస్తారు. ఇప్పుడు ఒక వందరూపాయల నోటు ఇక్కడపెట్టి వెళ్ళారు. పిల్లాడికి పదమూడవరోజువరకూ పాలిచ్చేందుకని. తరువాత దాది నొకదాన్ని పెట్టుకుంటారట. అంటే పదమూడవరోజు వరకూ నేను వాళ్ళ నౌకరునన్నమాట. ఈ పదమూడు రోజులకూ కూలి ఈ వందరూపాయలూను."

నందలాల్ లక్ష్మి యింత భావమయంగా వుంటుందనుకోలేదు. తను చాలా కష్టపడి వేసిన ప్లానంతా ఈమె బూడిద చేయలేదుకదా, అని అనుమానించాడు. తరువాత, "రమాకాంత్ భార్య ఏమి తీసుకుందో, దానితో నాకు సంబంధం లేదు. మనింట్లో పిల్లలు ఊరికే తెగ పెరిగిపోతున్నారు. వాళ్ళందరికి ఇంట్లో కాళీ సరిపోవడంకూడాలేదు. పొరిగింటి ఇంట్లో కాళీవుంటే, అక్కడ వుంచేందుకు యేర్పాటు చేశాను. పొలంలో కూరగాయలు ఎక్కువకాస్తే, మిత్రులకూ పొరిగింటి వాళ్ళకు పంచిపెట్టుకోమా ?" అన్నాడు.

"అయితే వీళ్ళందరూ కూరగాయలన్నమాట. అందుకోసం వీళ్ళతిండీ, బట్టమాట విడిచిపెట్టి, జేబులోని ఆసీసాలకు ఖర్చు పెడుతున్నారు !"

నందలాల్ మంచిమాటకారి. వెంటనే, "చూడురాణీ! నీమాటేకాని నామాటకూడా కాస్త వింటావా, లేదా ?" అన్నాడు.

అమ్మా, నాన్నమధ్య ఏదో తర్కం జరగటం చూసి పిల్లలందరూ వాళ్ళచుట్టూ చేరారు. వాళ్ళందరినీ చూసి

నందలాల్, "ఒరే ఏమి! సదానంద్! కమలా! మీరం దరూ బయటకు వెళ్ళండి. నేను మీయమ్మతో కొంచెం మాట్లాడాలి! ఇక వెళ్ళండి. కొంచెంసేపటిలో పిలుస్తాను."

అందరికంటే ముందు కమల బయటకుపోయింది. పుస్త కాలకు డబ్బులడుగుదామని పరమానంద్ అక్కడే నుంచు న్నాడు. కాని తల్లి సంకేతంమీద అతనుకూడాబయటకు వెళ్ళి పోయాడు. తరువాత సదానంద్ మొదలైన పిల్లలందరూ బయటకు వెళ్ళిపోయారు.

పిల్లలందరూ వెళ్ళిపోయిన తరువాత, మంచంప్రక్కన భూమిమీద పరచివున్న చాపమీద కూర్చుని నందలాల్ అన్నాడు-"సారాయి ఇంటికి తీసుకురావటం మానేసి రెండే ళ్ళయ్యింది. ఇవేళకూడా నాకోసమని తేలేదు. ఇది నీకోసమని తెచ్చాను. ఒకొక్క చెమ్చాడు రోజుకు రెండుసార్లు తీసు కున్నావంటే నీరసం వెంటనే తగ్గిపోతుంది. డాక్టరుగారు చెప్పారు, నిన్న దాయికూడా చెప్పింది. బ్రాంది, పాలతో తీసుకున్నట్టయితే వెంటనే నీ ఆరోగ్యం బాగుపడుతుందని. ఇది పదిహేనురోజులు వస్తుంది."

దాయిపేరు వినగానే లక్ష్మి దృష్టి అటువైపుపోయింది.

"దాయి ఏమైనా తీసుకుందా ?" అనడిగింది.

"అవును. ముప్ఫైయొక్కరూపాయి తీసుకుంది."

"వకీలుగారి భార్యదగ్గరకూడా తీసుకుందే ?"

"అలాగా. ఇది చాలా మోసకారి. కాని వాళ్ళెంద కిచ్చారు ?"

"అసలు విషయమేమంటే అయిదున్నర గంటలకు మీా వకీలుగారు, ఆయన భార్యవచ్చి మీారెక్కడికి కెళ్ళారని అడుగు తున్నారు. మీారింకా కచేరీనుంచి రాలేదని పమీా చెప్పాడు. ఇద్దరూ మెట్లెక్కి కమలతోపాటు లోపలికి వచ్చారు. నేను వకీల్ గారిని చూశానుకదూ.

ఆయన తనభార్యనుపరిచయం చేశారు. ఇక్కడకూర్చు నేందుకు కుర్చీలు, బల్లలూ ఏమీా లేవు, మీా సంపాదనంతా సారాయికే అయిపోతోంది. పాపం వాళ్ళు ఈ చాపమీాదనే కూర్చున్నారు. ఫలహారం తీసుకోమని అడిగితే, ఇప్పుడే టీ తీసుకువచ్చామన్నారు. వకీలుగారి భార్య బిడ్డని వళ్లోకి తీసుకుని 'బావున్నాడు పుష్టిగా' అన్నారు."

"దానిమీాదట వకీలుగారు 'చాలా అందంగావున్నాడు' అన్నారు."

"ఆవిడ నాతో అన్నారు; 'చెల్లమ్మా! ఈ పిల్లాడ్ని మేము దత్తత చేసుకుంటున్నాం. ఇప్పుడే ఇతన్ని మేము తీసు కెళ్ళటం కష్టం. ఇంకా పదకొండురోజులు గడిచిన తరువాత తీసుకెళ్తాం. ఇవేళనుంచి ఇతనికయ్యే ఖర్చంతా మేమేభరిస్తాం. ఇంకా నీపాలే త్రాగుతున్నట్టున్నాడు. అందుకుగాను యిది వుంచు.'

"ఆవిడ వందరూపాయల నోటొకటి పిల్లాడినెత్తికింద పెట్టి, 'తక్కిన విషయాలు ఇతని తండ్రితో మాట్లాడుతాం' అన్నారు.

"వారు లేచి వెళ్ళిపోతుంటే దాదివచ్చింది. వారు ఆమె నడిగారు, నీ ఫీజెంత? అని.

"అది ముప్పైరూపాయల పదిహేనణాలడిగింది. వకీలు గారు ముప్పైఅయిదురూపాయలిచ్చి, 'జాగ్రత్తగా చూడు. పదకొండవరోజున ఇంకా ఇస్తాం' అన్నారు.

"ఇలా అని ఇంకేమీ అనకుండా బయటకు వెళ్ళి పోయారు. గుమ్మందాటి బయటికి వెళ్ళి, వకీలుగారి భార్య తిరిగివచ్చి ఇతనిపెళ్ళికోసం ఒక ఆడపిల్లనుకూడా మాట్లాడాం అన్నారు.

"అయితే నువ్వేమన్నావు?" నందలాల్ జడుస్తూ అడిగాడు. బహుశా లక్ష్మి చీవాట్లు పెట్టిందేమోనని అనుకున్నాడు, అతను.

"పిల్లల్ని కొనుక్కునే ఆవిడను చీవాట్లు పెడదామనుకున్నాను. కాని ఇంతలోనే వకీలుగారు లోనికివచ్చి, "సరోజిని, డియర్? ఇకరా. మనమింకొకచోటుకు వెళ్ళాలి.' అన్నారు.

"ఈవిధంగా నేనేమీ మాట్లాడటానికి వీల్లేకపోయింది. వాళ్ళు వెళ్ళిపోయారు."

"చాలామంచిపని జరిగింది. నందలాల్ అన్నాడు. "లక్ష్మి! ఒక్కవిషయం జ్ఞాపకంవుంచుకో. వకీలుగారు సహృదయులు. ఆయన భార్యకుమాత్రం డబ్బంటే అభిమానం: కాని వాళ్ళడబ్బుతో మనకేమిపని. అబ్బాయి అక్కడకువెళ్తే సుఖపడతాడు; చదువుకుంటాడు, పెద్దవాడవుతాడు. నువ్వా ఆనందిస్తావ్, ముసలితనంలో నాకూ ఆసరాగా వుంటాడు.

"సరే ఇలా చూడు. నువ్వు చాలానీరసంగావున్నావు. ఇదొక చమ్చాడు తీసుకో. పది పన్నెండు రోజుల్లోనే గుఱ్ఱంలా చకచకా నడుస్తావు."

"తరువాత మీరు పన్నెండవ వాడికోసం ప్రయత్నం చెయ్యొచ్చు."

"లేదు, లేదు, రాణీ! ఇక నేను నిన్ను ముట్టుకోనుకూడా? నీకిష్టమయితే రాత్రులు ఎక్కడికైనా వెళ్ళి పండుకుంటా."

నందలాల్ ఇంకేమీ అనకుండా ఒక గ్లాసు తీసుకుని, అందులో అరపెగ్ బ్రాందీపోసి "తీసుకోరాణీ. ఇది ఔషధంమాత్రమే. ఇంతమాత్రం దానికి నిషా ఎక్కదులే." అన్నాడు

లక్ష్మికి చాలా నీరసంగావుంది. గ్లాసు తీసుకుని త్రాగేసింద. త్రాగగానే కొంచెం ముఖం తిరిగింది. రుచిమాత్రం ఏదో ఇంగ్లీషు మందుల్లానేవుంది. త్రాగిన రెండు నిమిషాలకు శరీరంలో వేడి పుట్టింది. కాస్త తేలికయినట్టుగావుంది శరీరం.

5

సరోజినీదేవి ఇచ్చిన వందరూపాయలూ మార్చి స్కూలు ఫీజు, పుస్తకాలు, పిల్లల బట్టలు, తన బట్టలకు ఖర్చు చేసింది లక్ష్మి.

తరువాత సరోజిని చాలాసార్లు వచ్చింది. ప్రతిసారీ లక్ష్మిప్రక్కన కూర్చుని పిల్లవాణ్ణి వళ్ళోకి తీసుకుని ముద్దుపెట్టుకుని లాలించేది. ఇన్నాళ్ళనుంచీ ఆమె ఈ యింటి పరిస్థితి చూస్తోంది. చాలా హేయంగా వుంది. ఆ పరిస్థితి ఒకరోజున ఆమె లక్ష్మిని అడిగింది. "చెల్లాయి ? మున్షీగారి సంపాదన బాగావుంది. అయినప్పటికీ ఇంటి పరిస్థితి ఇట్లా వుండటానికి కారణం ?"

"ఏంచెప్పను అక్కా! పదకొండుమంది పిల్లలు, నేను, ఆయన సంపాదనంతా బ్లాటింగ్ పేపరులా పీల్చేస్తున్నాం. ఘూతిండికి సరిపోగా మిగిలింది పిల్లల చదువులకు, బట్టలకు సరిపోతోంది."

"అయితేమాత్రం! వెయ్యిరూపాయలు ఈమాత్రం దానికే అయిపోతాయా?"

"వెయ్యా?" లక్ష్మి ఆశ్చర్యంతో అడిగింది. "మా కెప్పుడూ మూడువందలకన్న యెక్కువ ఇవ్వటంలేదే?"

"సరే. తక్కింది ఏమవుతున్నట్టు?"

సరోజిని మాటలు గుమాస్తాగారు, ఆయన భార్యమధ్య దెబ్బలాటకు కారణమయ్యాయి. ఆ రాత్రి గుమాస్తా త్రాగి వచ్చాడు. రాగానే తిన్నగా తనమంచంమీద పడుకున్నాడు.

లక్ష్మి ప్రసూతి గృహంనుంచి బయటకు వచ్చేసింది. నందలాల్ వచ్చి పండుకోగానే లక్ష్మివచ్చి మంచంమీద ఒక మూల కూర్చుని అడిగింది, "ఇవేళ భోజనం చెయ్యరా?"

"చెయ్యను."

"ఏం?"

"బజారులో తినివచ్చాను."

"ఎంత ఖర్చయ్యింది?"

"ఏదో పావలా పూరీలు, రెండణాల రొట్టెలు."

"సారాయి ఎంతది త్రాగారు?"

"ఒక మిత్రుడు బిల్లు ఇచ్చేశాడు. ఏమీ ఖర్చవ్వ లేదు."

"మీ మిత్రునికి బిల్లెంతయ్యింది?"

"నాకు తెలియదు."

"అయితే వెదకనివ్వండి. మీ జేబులో ఎంతవుందో."

"ఎందుకు?"

"ఇవేళ మీకు నలభై రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది."

"శుద్ధ అబద్ధం. ఎవరుచెప్పారు? ఒక కస్టమరుదగ్గర చాలా కష్టంమీద నాలుగు రూపాయలు తీసుకోగలిగాను. అందులో అర్ధరూపాయి మిగిలింది. ఆరణాలు తిండికయ్యింది. ఇక బేడ మిగిలింది."

"సరే. చూడనివ్వండి."

పడుకునేముందు నందలాల్ కోటుతీసి చిలకకొయ్యకు తగిలించాడు. లక్ష్మి జేబులు వెదకడం ఆరంభించింది.

జేబులో ఒక రుమాలువుంది. అది సారాయి వాసన వస్తోంది. రుమాలుకు ఒకమూల ఒక రూపాయి ముడివేసి వుంది. జేబులో బేడకాసు ఒకటి విడిగావుంది. కోటు లోపలి జేబులో ఒక డబ్బావుంది. లక్ష్మి ఆ డబ్బా తీయగానే మున్షీ లేచివచ్చి దాన్ని లాక్కొని, "ఒకవిషయం చెప్పడం మర్చి పోయాను. ఈ డబ్బాలో దుద్దులు వున్నాయి. నీకోసమే తెచ్చాను."

లక్ష్మి మళ్ళీ డబ్బా లాగేసుకుంది. డబ్బా తెరచి చూచింది. "చాలా అందంగా వున్నాయి" అంది. తరువాత ఏదో అందామనుకుని వెంటనే ఆగిపోయింది. డబ్బా అడుగున ఒక కార్డుపడివుంది. నందలాల్ దానిమాట మర్చిపోయాడు.

దానిమీద "నిర్మలారాణికి ప్రేమపూర్వకమైన బహుమతి" అని వ్రాసివుంది.

అది చూడగానే లక్ష్మిముఖం కందగడ్డలా ఎఱ్ఱబడి పోయింది. నందలాల్‌కి ఇంకా ఆ కార్డుమాట జ్ఞాపకంరాలేదు. అతను, "ఈ దుద్దులు నీకోసమే తెచ్చాను. సరే ఇకవెళ్ళు. నన్ను నిద్రపోనియ్యి." అన్నాడు.

లక్ష్మి లోపలిగదిలో నిదురపోతుంది. డబ్బామూత వేసి కొంచెంసేపు నందలాల్ ముఖంవైపుచూసి, వెళ్ళి పోయింది.

ఇంట్లో రెండే గదులున్నాయి. పరమానంద్, సదానంద్ చదువుకుని చదువుకుని బయటిగదిలో నిదురపోయారు. ప్రభ, రమ ఇంకా తమ అన్నయ్యల బట్టలకు టాకీలు వేస్తున్నారు. చిన్నపిల్లలందరూ ఒకేపక్కమీద పడుకున్నారు. కమల ఒక్కర్తేమాత్రం తమ తల్లిదండ్రులమాటలు వింటూ కొంచెం కొంచెం అర్థం చేసుకుంటోంది. ఆఖరిమాటలు విని కూడా అర్థం చేసుకోలేకపోయింది. తనతల్లి కళ్ళంటా అశ్రువులు ప్రవహించడం చూసింది.

లక్ష్మి లోపలిగదిలోకి వెళ్ళగానే, అమెకూడా లోనికి వచ్చి అడిగింది, "అమ్మా, ఏమిటే ?"

"సర్వనాశనం తల్లీ! ఇన్నాళ్ళనుంచి మీనాన్నగారు మనకోసమే కష్టపడి, చెమట ఓడ్చి సంపాదించిపెడుతున్నారనుకున్నా. కాని ఇవేళ సరోజినీదేవి ఆయన ఆదాయం నెలకు వెయ్యిరూపాయలు పైబడివుంటుందని చెప్పారు. మూడు వందలు దాటి మనకెప్పుడూ ఇవ్వలేదు. తక్కినదంతా ఆయన

ఇటువంటి ఆడవాళ్ళను తగలేస్తున్నాను." అని దుద్దులుడబ్బా మూతతీసి, కార్డు చూపించింది.

కమలా కాస్త కూస్తో అర్థం చేసుకోగలదు. కాని తన మనస్సులోని మాటను మాత్రం వ్యక్తం చెయ్యలేదు. తన తల్లి కళ్ళలోని అశ్రువులను చూడగానే ఆమె కళ్ళలోకూడా కన్నీళ్ళు తిరిగివచ్చాయి.

తల్లి అంది, "కమలా! ఇవి తీసుకో. వీటిని నీపెట్టెలో పెట్టుకో. నేను సమస్యను పరిష్కరించటానికి ప్రయత్నిస్తా."

మరుసటిరోజునకూడా నందలాల్‌కు మంచి ఆదాయ మొచ్చింది. మీరాలాల్ దావా చెయ్యటానికి ఫీజుకట్టి వెళ్ళి పోయాడు.

సాయంకాలం అతను రాధాకృష్ణను వెదకటానికి వెళ్ళే సరికి అతను ఖాళీగాలేడు. అందుచేత ఒంటరిగానే బయలు దేరాడు. ఈవేళ అనార్కలీ బజారులోని కరొనేషన్ హోట లకు చేరుకున్నాడు. అక్కడ పనివాళ్ళు నందలాల్‌ను బాగా యెరుగుదురు. ఆయన వెళ్ళగానే ఒక నౌకరు ఆయన్ను పైకి తీసుకువెళ్ళాడు. ఆయన కూర్చోగానే. పంతులుగారూ, ఏమి కావాలి ?" అనడిగాడు.

"నిర్మలను పిలువు."

"ఆవిడ నిన్న వచ్చింది. మీకోసం చాలాసేపు చూసింది."

నిన్న తను నిర్మలకోసం దుద్దులు తెచ్చినట్టుగా నంద లాల్‌కు జ్ఞాపకం వచ్చింది. కాని వాటిని లక్ష్మి తీసుకుంది. ఈ విషయం జ్ఞాపకం రాగానే అతనిముఖంలో రక్తంచుక్క

కూడా లేదు. సబ్బాలోషం హిందీలో వ్రాయబడిన చీటీ మాటకూడా జ్ఞాపకం వచ్చింది.

హోటలువాడు పంతులుగారి ముఖంచూచి "ఏం జరిగిందండి ?" అనడిగాడు.

"ఏం లేదు. ఆమె నిన్న ఎంతవరకూ వుంది ?"

"ఒక గంటసేపు."

"సరే. ఇవేళ పిలవకు. ఆవిడకు ఒకవస్తువు తీసుకురావాలి. మర్చిపోయాను."

"సరే. మీకేం కావాలి ?"

"రెండు ఆమ్లెట్లు, ఒక పెగ్ విస్కీ."

ఆమ్లెట్లు తిని, విస్కీ త్రాగిన తరువాత వాడికి ఒక రూపాయి టిప్స్ ఇచ్చి వూగుతూ ఇంటికి బయలుదేరాడు.

ఇంటిదగ్గర కుంవర్ సేన్, సరోజినీదేవి వచ్చి వున్నారు. వారు పిల్లవాడ్ని తీసుకువెళ్దామనుకుంటున్నారు. కాని పిల్లవాడిని చూసేందుకు మంచి దాది ఎవరూ కన్పించలేదు.

సరోజినీదేవికి ఒక విషయం తట్టింది. ఆమె లక్ష్మితో అంది, "చెల్లాయి ! పిల్లాడు ఇంకా చాలా చిన్నవాడు. అతన్ని చూడటానికి ఎవరైనా సంరక్షకులు కావాలి. ఎవరైనా మంచి దాది దొరకేవరకూ కమలను మాతో పంపించినట్టయితే మీకు చాలా కృతజ్ఞులమై వుంటాం. కమలకు తన తమ్ముడంటే ఇష్టంకూడాను. ఆమె పిల్లాడ్ని ప్రేమిస్తుంది."

లక్ష్మికి ఈ ప్రస్తావన నచ్చలేదు. తల్లి గంభీరంగా వుండడం చూసి కమల అంది, "నేను వెడతాను."

"చాలా మంచిదానవు. నాకు తెలుసు నువ్వువస్తావని." కాని లక్ష్మి, "నాన్నగారిని అడిగివెళ్ళు కమలా !" అంది.

"ఆయన మనల్ని ఎప్పుడు అడిగారు ?"

"నిన్నేమి అడుగుతారు ?"

"పరాయి స్త్రీలకు ముద్దులు మనల్ని అడిగి యిస్తు న్నారా ?"

"నోర్ముయ్ !" లక్ష్మి కోపంతో అంది.

మున్షీగారి చరిత్రమీంద సరోజినీదేవికి మొదటినుంచీ అనుమానం వుంది. అది యిప్పుడు కమల మాటలతో నిర్ధా రణ అయిపోయింది. ఆమె లక్ష్మికి నచ్చచెప్పటానికి అంది, "కమలకు మా ఇంట్లో ఏవిధమైన ఇబ్బంది వుండదు. పైగా ఇష్టమొచ్చినప్పుడల్లా మిమ్మల్ని చూడటానికి వస్తూంటుంది. అవునా, కమలా ?" తరువాత కమలను ప్రోత్సహిస్తూ అంది. "నువ్వు నీ బట్టలు తీసుకుని సిద్ధంగా వుండు. పంతులుగారు వచ్చేవరకూ కూర్చుని నీ విషయంలోకూడా అనుమతి తీసు కుందాం."

యవ్వనవతియైన తన కుమార్తెను ఒకళ్ళింటికి పంపడం, అందులోనూ ఒక నౌకరు రూపంలో పంపడం సుతరామూ ఇష్టంలేదు లక్ష్మికి. ఆమె ఏదో చెబుదామనుకుంది. కాని కమల బయటకు వెళ్లేంతవరకూ సరోజిని ఏమీ చెప్పటానికి అవకాశం ఇవ్వలేదు. ఆమె బయటకు వెళ్ళిన తరువాత సరో జిని అంది. "ఇవేళ పిల్లాణ్ణి మేము తీసుకువెడుతున్నాం. లక్ష్మి చూడమ్మా ! ఏమీ మొఖమాటపడకు. పిల్లాణ్ణి మావాడిగా చేసుకునేందుకు నీ కేమివ్వమంటావు ?"

"డబ్బుతో ఎవరైనా తనవారవుతారా?"

"అయితే ఎట్లా అవుతారు?"

"అది సాకేం తెలుసు? ఇటుచూస్తే నాలో ఒకభాగమైన కమలే అవకాశంరాగానే నన్ను విడిచిపెట్టడానికి సిద్ధమయిపోయింది."

"నేను పిల్లవాడి భావాలగురించి కాదు మాట్లాడేది. నీకష్టం విషయంలో మాట్లాడుతున్నా. ఈసారి నువ్వు చాలా కష్టాలు వెళ్ళబోశావని విన్నాను."

"దానికి ఖరీదు నేను తీసుకోలేను. అలా చేస్తే నాపిల్లవాణ్ణి అమ్మినట్టుగా ఉంటుంది. మీరు వీణ్ణి తీసుకువెళ్ళండి. కాని ఒక్కవిషయం అడగాలనుకుంటున్నా. ప్రతిస్త్రీకూడా, అదే విషయంకోసం ఎన్ని కష్టాలనయినా వెళ్ళబోస్తుంది. వీణ్ణి నా కుమారుడుగా చెప్పుకునే అధికారం నాకు ఉండాలని మాత్రం నేను కోరుకుంటున్నా."

"అవునవును. వీడికి ఇద్దరు తల్లులుంటారు. వాడు ఎవరిని ఎక్కువ ప్రేమించాలో, కోరుకోవాలో, ఆ విషయం వాడికే విడిచిపెట్టేస్తాం."

వకీలుగారుకూడా తన భార్య మాటలను సమర్థిస్తూ అన్నారు, "సరోజినీదేవి కొక పుత్రుడుకోసం ఎంత వెచ్చించాలో మాకు తెలియదా అమ్మా? లక్ష్మీదేవీ! నువ్వు నిశ్చింతగావుండు. పిల్లాడిద్వారా మాకు మీకు బంధుత్వం యెప్పుడూ బలంగానే ఉంటుంది. భగవంతుడు దయచూస్తే ఉత్తరోత్తరాకూడా అధికమవుతుంది."

"కమలకు భోజనంచెయ్యడంలో మొహమాటముంది."

"చెల్లాయి! నువ్వు నిశ్చింతగా ఉండు. ఇక్కడకంటే మాయింటిదగ్గర ఆమెకు చాలా సురక్షిత వాతావరణం లభిస్తుంది."

లక్ష్మికి కమలతండ్రి రోజూ త్రాగి రావటం, బజారు వేశ్యలంటా తిరగడం జ్ఞాపక మొచ్చాయి. ఆమె మాట్లాడ కూరుకుంది.

అదే సమయానికి ఊగుతూ వచ్చాడు, నందలాల్. అక్కడ కుంవర్ సేన్, సరోజినీదేవి ఉండటం చూసి కంగారు పడ్డాడు. కుంవర్ సేన్ గారు అతన్ని చెయ్యిపట్టుకుని ఊపగానే కాస్త తెలివిలోకి వచ్చాడు. దానిమీదట కుంవర్ సేన్ అన్నారు, "మేము పిల్లాడ్ని తీసుకెళ్తున్నాం. కొన్నిరోజుల పాటు అతని సంరక్షణకోసం కమలకూడా మాయింటిదగ్గరనే ఉంటుంది."

"సరే తీసుకువెళ్ళండి. నేనేగా మీకలా చెయ్యమని చెప్పింది."

లక్ష్మి ఉద్రేకంతో అంది, "కమలకూడా వెడుతోంది."

"అయితే ఏం? అబ్బాయి పెద్దాడు కాగానే వచ్చే స్తుంది."

ఇంకేమీ అనలేకపోయింది, లక్ష్మి.

6

కుంవర్ సేన్, సరోజినీదేవి క్రిందకు దిగివచ్చేశారు. వెను కాల కమలకూడా తన బట్టలమూట చంకలో పెట్టుకుని, పిల్లాణ్ణి ఎత్తుకుని దిగివచ్చేసింది. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత

లక్ష్మి కోపంతో "ఇవేళకూడా యెవరైనా త్రాగించారా ? అనడిగింది.

"లేదు. ఇవేళ నా డబ్బులతోనే త్రాగాను."

"ఎంత ఖర్చయ్యింది ?"

"మూడురూపాయలు మాత్రమే."

"అయితే తక్కిన డబ్బేమయ్యింది ?"

"ముందు నిన్నటి దుద్దులు ఇలా ఇయ్యి ?"

"ఎందుకు ? అవి నాకోసమే తెచ్చారుగా. నేను కమల కిచ్చాను. అదికూడా పట్టుకుపోయింది."

"అయితే డబ్బు ఇవ్వను."

"ఇవ్వద్దు. నిద్రపోండి."

"నా జేబులోది తీసేసుకుంటావా ? నిన్న రూపాయి బేడ ఉండాలి తీసేసుకున్నావుగా !"

"ఇవేళకూడా ఉన్నదంతా, తీసేసుకుంటా !"

"ఏం ?"

"ఎందుకంటే, నేను మీ పిల్లలతల్లిని. వాళ్ళతిండీ, బట్టలకు డబ్బు కావాలి !"

"ఆవిషయం నేను చూసుకుంటా. ముందు వకీలుగారు ఏమాత్రం ఇచ్చారో చెప్పు."

"ఇవ్వబోయారు. నేను తీసుకోలేదు."

"ఏం ?"

"నేను నాపిల్లలను అమ్మలేను ?"

"చాలా వింతమనిషివే ? ఇంట్లో తిండానికి కట్టుకునేం

దుకూ లేదుకాని, ఊరికే భూమి పండినట్టుగా పిల్లల్ని కంటున్నావు ?"

తన భర్తకు వెయ్యిరూపాయలు దాకా ఆదాయ మొస్తుందని, వేశ్యలవెంబడి తిరుగుతున్నాడని తెలిసినప్పటి నుంచీ లక్ష్మికి తల మంటగావుంది. ఆమె రోజంతా ఏవిధంగా అతని దగ్గర డబ్బు లాక్కోవాలా అని ఆలోచిస్తూ కూర్చొం టోంది. అందుచేత ఆమె ఈవేళ క్రోధంతో అంది, "ఇంట్లో తిండికి ఉండటంలేదంటే దానికి కారణం మీరు పరాయి ఆడాళ్ళమీద తగలెయ్యడమే ?"

"అది అబద్ధం."

"అయితే నిర్మల యెవరు ?"

"ఆమె నారెండవ భార్య."

"ఒకదాన్ని పోషించటానికి ఓపిక లేకపోతోంది కాని, రెండవదాన్ని వుంచుకున్నారు ?"

"చూడు లక్ష్మి ! ఒక విషయం చెబుతాను. నిర్మల నీకుమల్లే ఊరికే పిల్లల్ని పుట్టించదు. ఆమె అయిదు సంవత్స రాలనుంచి నాతోవుంది. ఒక బిడ్డకూడా పుట్టలేదు. ఈ అయి దేళ్ళలోనూ నేను తాకానో లేదో ముగ్గురు బిడ్డల్నికన్నావు."

"అయితే ఇది నా అవగుణమా ?"

పూర్తిగాను. ఇకచెప్పు, ఈవిధంగా బిడ్డల్నికంటూంటే ఏమిచేసేది ?"

"మీరు నన్ను తాకకుండా వుంటే సరి. బీజంవెయ్యక పోతే, వాళ్ళు పుట్టనే పుట్టరు."

"అయితే పెళ్ళెందుకు చేసుకున్నది."

"పిల్లలు పుట్టించడానికి. వివాహమయిన తరువాత పురోహితుడుగారు పుత్ర పౌత్రులతో వందేళ్ళు వర్థిల్లమని ఆశీర్వదించినమాట జ్ఞాపకం లేదా?"

నందలాల్‌కు నవ్వు వచ్చింది. "చెప్పి వుండవచ్చు. నాకు జ్ఞాపకం లేదు. నేను వేదికమీద కూర్చుని, నీ అందాన్ని గూర్చి, నీతో ఆ ఘడియలు ఎప్పుడు వస్తాయా అని ఆలోచిస్తూ కూర్చున్నా. నాకు ఆశీర్వాదాలూ వినపడలేదు, వేద-మంత్రాలూ వినపడలేదు."

"వివాహానంతరం నిన్ను మాయింటికి తీసుకెళ్లేందుకు నేను ఎంత ఉత్సాహపడ్డానో నీకు జ్ఞాపకంలేదు. అదంతా నీతో కలయికకు నేను పడే ఆరాటన."

"కాని నువ్వు మాయింటికి వచ్చిన పదిహేనురోజులకే వేవిళ్లు మొదలెట్టేసరికి నా సుఖ - స్వప్నాలన్నీ భగ్నమయి పోయాయి.

'కోడల్ని బాధపెట్టకు, దాని కడుపులో బిడ్డవున్నాడు.' అంది అమ్మ.

"తరువాత లాహోరు వచ్చాను. వచ్చిన పదిహేను రోజులకు మళ్ళీ అదేకథ ప్రారంభమయ్యింది. నిన్ను ఊరుకు పంపిస్తే సంవత్సరం తరువాత కమలతోపాటు పరమానంద్‌ను తీసుకువచ్చావు.

"తరువాత నిన్ను గ్రామమే పంపించలేదు. అమ్మ చని పోయింది. పొలాన్ని సోదరులు ఆక్రమించుకున్నారు. తరువాత కూడా నీకు పిల్లలు కలగడం మొదలెట్టారు. నేను సంయమతో విసిగిపోయాను.

"ప్రభ, రమ పుట్టటానికి ముందరిమాట. ఒక రోజున షావుకారు కొట్లో బట్టలు కొనేందుకు వెళ్ళాను. అక్కడొక పదిహేను పదహారేండ్ల అమ్మాయి బ్లౌజుగుడ్డ కొంటోంది. ఆమె ఒక పట్టుగుడ్డ కొంటోంది. షావుకారు మూడు రూపాయల ముప్పావలా అడిగాడు. ఆమె డబ్బులు తీసి షావుకారు చేతిలో పెట్టింది. ఆయన మరొకరూపాయి అడిగాడు. డబ్బులన్నీ పూర్తిగా యిచ్చివేశానంది, అమ్మాయి. ఇద్దరిలోనూ దెబ్బలాట ప్రారంభమయ్యింది. నేను చూస్తూనే వున్నాను, అసలు అమ్మాయి రెండురూపాయల ముప్పావలాయే ఇచ్చింది. కాని అమ్మాయి నమ్మకంగా తను మూడూ ముప్పావలా ఇచ్చానంటోంది. దెబ్బలాట పెద్దదవటం చూసి నేను నెమ్మదిగా జేబులోంచి ఒక రూపాయి తీశాను. గుప్పెట్లో పెట్టుకుని కొంచెం వంగి, ఇక్కడొక రూపాయిపడివుంది. ఎవరిది?' అన్నాను. చెయ్యి పైకెత్తి రూపాయి చూపించాను.

"అమ్మాయి ముఖం ఎఱ్ఱబడిపోయింది. రూపాయి నేను జేబులోంచి తీశానని ఆమె గ్రహించింది. ఆమె సందేహాన్ని పాతమార్చేందుకుగాను నేను చెయ్యి ముందుకు చాపి 'ఈ రూపాయిమీదనుకుంటాను' అన్నాను.

"ఇంతలో ఆ అమ్మాయి తెలివితెచ్చుకుంది. రూపాయి తీసుకుని షావుకారుకు యిస్తూ, 'క్షమించండి. నాచేతిలోంచి పడిపోయినట్టుంది.' అంది.

"షావుకారు కౌంటరకు రెండవవైపు నున్నాడు. ఆయన నా తతంగాన్ని చూడలేదు. ఆయన రూపాయి తీసు

కుని రసీదుతో సహితంగా బట్ట యిచ్చివేశాడు, అమ్మాయి
గుడ్డతీసుకుని వెళ్ళిపోయింది.

"నేనుకూడా బట్టలు తీసుకుని ఇంటికి బయలుదేరాను
కాని కొంచెం దూరంలో అమ్మాయి నుంచుని వుండటం
చూసి నవ్వాను. తరువాత వెంటనే ముఖం ప్రక్కకు తిప్ప
కుని ఇంటికి బయలుదేరాను. ఆ అమ్మాయి నావెనువెంట
వస్తూఅంది, 'మీరు చాలా సహాయంచేశారు. ధన్యవాదాలు.

"నేనన్నాను, 'ధన్యవాదాలు చెప్పనవసరంలేదు. కాని
నువ్వు అబద్ధ మెందుకాడావు ?'

"నాకు గుడ్డ బాగా నచ్చింది. కాని నాదగ్గర పూర్తిగ
డబ్బులేదు. అటువంటి పరిస్థితిల్లో చేసేదేమిటి ?"

"మీ నాన్నగారు ఏం పనిచేస్తారు ?"

'ఆయనలేరు. అమ్మ నూలువడికి రోజూ నాలుగైదు
అణాలు సంపాదిస్తుంది. మా యింట్లోసగం అద్దెకిచ్చింది. దాని
మీద నెలకు ఇరవై రూపాయలు వస్తాయి. దానితో యేదో
మామూలు భోజనం దొరుకుతోంది. కాని మంచి బట్టలు
మంచి తిండి దొరకవు.'

'నువ్వు ఏం చేస్తుంటావు ?'

'మీరు చూడనే చూచారుగా.'

'అంటే ఏది కావలస్తే అది తీసుకుని డబ్బులివ్వకుండా
ఇచ్చానని బొంకుతుంటావన్నమాట.'

'మీరు సరిగ్గా అర్థం చేసుకున్నారు.'

'కాని అలా చెయ్యడంవల్ల ఎప్పుడో ఒకప్పుడు జైల
ప్రాప్తించవచ్చు.'

'ఏంచెయ్యను? తినడానికి అక్కడైనా దొరుకుతుందిగా?'

'అయినప్పటికీ అక్కడ చాలా కష్టపడాలి.'

'మీరు నిజమే చెప్పారు. కాని చెయ్యటానికి యింత కంటే ఏమీ కనబడటం లేదు.'

'నేనొక ఉపాయం చెబుతాను.'

'చెప్పండి.'

'నాకూడా ఆ ఎదుటి హోటలికిరా. అక్కడ తృప్తిగా టీ త్రాగుదువుగాని. నామాట ఒప్పుకుంటే నీజీవితం సుఖంగా గడుస్తుంది కూడా.'

'టీతోపాటు, ఏమైనా తినడానికి దొరుకుందా?'

'దొరుకుతుంది.'

"మేమిద్దరం ఒక హోటలులోకి వెళ్ళాము. నేను అమ్మాయి నడిగాను, 'ఏమైనా చదువుకున్నావా?' అని.

'ఏడవతరగతి వరకూ చదువుకున్నా, పైకిచదవటానికి డబ్బూలేదు, ఇష్టంలేదు.'

'నువ్వు ప్రస్తుతం చేసేపని చాలా అపాయకరమైనది. ఇంతకంటే పెళ్ళిచేసుకోనడం మంచిది.'

'కాని నన్నెవరు పెళ్ళిచేసుకుంటారు?'

'నే చేసుకుంటాంగా.'

'ఇంతలోనే సప్లయరు రసగుల్లాలు, పకోడీలు, టీ తీసుకువచ్చాడు. అమ్మాయి నావంక చూడకుండా, నన్నేమీ అడగకుండా తినడం ఆరంభించింది. ఆమె వేగంగా తినడం చూస్తే ఆమె చాలా ఆకలిగా వుందని తెలిపోయిది. నేను టీ

తయారుచేశాను. కాని ఆమె నావంక చూడనైనా లేదు. తిండి కానిస్తూనే వుంది.

"నేను ఆమెను వివాహం చేసుకోడంలో గల అభిప్రాయాన్ని చెబుదామనుకున్నా. కాని ఆమెకు అంతా తెలుసు. ఆమెకేదైనా అత్యంతావసరమైన వస్తువు కావలసినప్పుడు ఎవరినైనా సంతోషపెట్టవలసిందేనని చెప్పింది. దాని మీద నేనన్నాను.

'నాకీ విధానం నచ్చలేదు. నీకే వస్తువు కావలసినా నన్నే అడుగుతూవుండు. నువ్వు కేవలం నన్నొక్కడినే సంతృప్తి పరచు. నేను నిన్ను వేశ్యగా చూడలేను.'

'కాని నా అవసరాలు పూర్తి చెయ్యకపోతేను ?'

'అలా జరగదనే నా అభిప్రాయం. అలాజరిగినట్లయితే నన్ను విడిచిపెట్టి నీ అవసరాలు ఎక్కడ పూర్తయితే అక్కడ తీర్చుకో.'

'అయితే నాకు నగలుకూడా కొంటారా ?'

'అవును, ఎందుకు కొనను ?'

"ఈవిధంగా మాట నిశ్చయమయ్యింది. ఆమె నా భార్య అయిపోయింది. ఆమే నిర్మల."

"నిన్న ఆమెకోసం దిద్దులు తెచ్చాను. కాని నిషాలో మర్చిపోయాను. నాటిని అరవై రూపాయలకు కొన్నాను. నిన్న ఆమె వీటికోసం మొదుకు చూసింది."

7

ఈ కథవల్ల లక్ష్మికేమీ సంతోషం కలుగలేదు. ఆమె కోపం కూడా చల్లారలేదు. ఆమె అంది, "మీ కింతమంది పిల్లలన్న సంగతి నాకు తెలియదు.

నేను చెప్పేదేమంటే. ఈ పిల్లల్ని మీరు కన్నారు. వాళ్ళ తిండికి, బట్టకు, చదువులకు ఖర్చుపెట్టగా మిగిలింది మీ యిష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టుకోండి. నాకేమీ కష్టంవుండదు."

"వీళ్ళందరిని నేను పోషించలేను."

"చెయ్యవలసిందే. పిల్లల్నికన్న తరువాత అదేమీ కుదరదు.

"అందులో నా దోషమేమీలేదు. పిల్లలు కలగడానికి నేనే ముఖ్యుణ్ణయితే నిర్మలకు కూడా పుట్టేవుండును."

"అది బంజరు భూమి."

"అయినా అదే నాకిష్టం."

"అయితే వీళ్ళందరినీ పోషించేదెట్లా ?"

"పిల్లాణ్ణి పిల్లను యిచ్చావుగా, వాళ్ళనే అడుగు."

"వాళ్ళమైనా కోడిపిల్లలనుకున్నారా, అమ్మటానికి ?"

"నాకువాళ్ళు అంతకంటే ఏమివిలువైనవాళ్ళు కాదు."

తల్లితండ్రులమధ్య ఈ వాదాన్ని పిల్లలందరూ వింటున్నారు. దాని సారాంశాన్ని పరమానంద్ బాగా అర్థం చేసుకుంటున్నాడు. ఈవిషయంమీద ఆలోచిస్తూ నిదురపోయాడు. కల వచ్చింది. కలలో తండ్రితో దెబ్బలాడుతున్నాడు. తండ్రి అంటున్నాడు, "నువ్వు మీ అమ్మకొడుకువు. నేను నీమీద ఖర్చు చెయ్యను."

మరునాటిరోజు ఉదయం నందలాల్ కాలకృత్యాలు తీర్చుకుని భోజనానికి కూర్చున్నాడు. లక్ష్మి భోజనం వడ్డించింది. దానిమీదట నందలాల్ అడిగాడు, "పిండి, నెయ్యి లేదని చెప్పావుగా ?"

"నిన్న సాయంకాలానికి లేవు. జేబులోనుంచి పదమూడు రూపాయలు తీశాను. సదానంద్ పిండి, నెయ్యి తేవటానికి వెళ్ళాడు. రమనుకూడా తీసుకువెళ్ళి పప్పు అవీ తెస్తాను."

"అయితే నాడబ్బు తీసివేశావన్నమాట."

"మీ జేబులోంచి నేను తీసుకున్నది, నాడబ్బు."

"నీ బాబుదా ?"

"కాదు ! నా పిల్లల బాబుది. పిల్లలకోసమే తీశాను."

"నాడబ్బు యిచ్చేసెయ్యి."

"నే నెక్కడి కెళ్ళను ?"

"నీ యిష్టమొచ్చిన చోటకు."

గరటితో పరమానంద్‌కు పప్పు వేస్తోంది, లక్ష్మి. ఈ గరిటెతో భర్తతల బద్దలకొడదామా అనిపించింది మనస్సులో. కాని తన సంస్కారబలంవల్ల అలా చెయ్యలేకపోయింది. ఆమె మెదలకుండా పరమానంద్‌కు పప్పు వేసింది.

నంద్‌లాల్ చెయ్యి కడుక్కుని లేచి బట్టలు తొడుక్కునేందుకు పక్కగదిలోకి వెళ్ళాడు. ఆయనకోటు తొడుక్కుని జేబులో చెయిపెట్టేసరికి జేబులో ఒక్కరూపాయి మాత్రమే వుంది. దానితో అతనికి మళ్ళీ కోపంవచ్చింది, పళ్ళుగొత్తుకుంటూ వంటింట్లోకి వచ్చి "నాడబ్బు ఇయ్యి" అని అరిచాడు.

అదే సమయానికి పిండిమూట తలమీద పెట్టుకుని, నెయ్యి క్యారియర్ చేతితో పట్టుకుని వచ్చాడు, సదానంద్. లక్ష్మి అతనివేపు వేలెట్టిచూపిస్తూ, "అవిగో మీరూపాయలు" అంది.

క్రోధావేశంలో సదానంద్ నేలమీద పెట్టినమూటను, క్యారియర్‌ను తన్నివేశాడు, నందలాల్. దానితో నెయ్యి క్యారియర్ దూరంగా వెళ్ళిపడింది. మూత ఊడిపోయింది. నెయ్యంతా నేలమీద వలికిపోయింది. దానితో లక్ష్మికి చెప్ప రానంత దుఃఖం కలిగింది. వాళ్ళింట్లో ఎప్పుడో కాని నెయ్యి వుండదు. తరచు వట్టి రొట్టెలు. పప్పుతోనే రోజులు గడచి పోతాయి. ప్రపంచమంతా రసాతలంలోకి దిగిపోతోందా అని పించింది, లక్ష్మికి. ఆమె కోపంతో అంది, "పిల్లల నోటినుంచి రొట్టెలు లాగుకొనటం నేను చూడలేను."

ఆమెలేచి, వలికిపోయిన నెయ్యి, పాత్రలోనికి యెత్తు తోంది. దానిమీదట నందలాల్ ఆమెజుట్టు పట్టుకుని పైకి లేపేందుకు గట్టిగా లాగుతూ, "నాకు పిల్లలసంగతి తెలియదు. నా డబ్బు తీసుకురా."

పరమానంద్ పరిస్థితంతా చూస్తున్నాడు.

అతను రాత్రి తల్లితండ్రుల మధ్యమాటలు విన్నందున మనస్సు విచారంగా వుంది. అతను మిత్రుల ఇంటికి వెడుతూ వుంటాడు. వాళ్ళ తిండికి బట్టలకు తన తిండి-బట్టలకు ఎక్కడా సామ్యం లేదు. రాత్రి విన్నమాటల్ని బట్టి తన తండ్రికి మరొక భార్య వుందని, ఆమెకోసం నగలుకూడా కొంటున్నాడని తెలియగానే తండ్రిమీద అసహ్యం వేసింది. ఇప్పుడు తల్లి

జుట్టుపట్టుకొని గుంజుతూంటే ఇక సహించలేకపోయాడు. అతను తిండి మానేసి లేచి నుంచుని, "అమ్మను విడిచిపెట్టు." అన్నాడు.

కాని నందలాల్ వినిపించుకోలేదు. జుట్టును యింకా గట్టిగా లాగుతూ, "నా డబ్బు తే" అని అరిచాడు.

లక్ష్మి నోటంట "అయ్యో... అయ్యో... ..." అన్న ఆర్తనాదాలు వెలువడ్డాయి. ఆమె నేలమీద పడిపోయింది. పరమానంద్ ఇక సహించలేక పోయాడు. అతను నందలాల్ ముఖంమీద గట్టిగా ఒక గుద్దు గుద్దాడు.

అలా జరుగుతుందని నందలాల్ ఎప్పుడూ అనుకోలేదు. కణతమీద తగిలింది గుద్దు. లక్ష్మి జుట్టువిడిచిపెట్టి ముఖంమీద చెయ్యి వేసుకున్నాడు. అతనింకా ఆ బాధను శాంతపర్చుకుంటుంటే పరమానంద్ చెవిమీద మరొక గుద్దు గుద్దాడు. నందలాల్ ముఖం తిరుగుతోంది. పరమానంద్ మూడవ గుద్దుకు చెయ్యి పైకెత్తేసరికి కుంటుకుంటూ - తూలుతూ మెట్లుదిగి పరుగెత్తడం ఆరంభించాడు. రక్తబిందువులు మెట్లమీదపడటం తల్లి చూసింది. దానితో కంగారుపడి గబగబా క్రిందకు దిగి వచ్చింది.

నందలాల్ మెట్లుదిగివచ్చి బయటకూర్చుని ముక్కునెంట వచ్చే రక్తాన్ని తుడుచుకుంటున్నాడు. కళ్ళక్రిందను, కణతలు వాచిపోయాయి. మెట్లమీద నుంచుని పిలిచింది, లక్ష్మి. "పైకి రండి, నీళ్ళపట్టీ వేస్తాను."

"ఇక హద్దుమీరి పోయింది. నే నిక చచ్చిపోయా ననుకోండి. ఇక నన్ను నాదారికి విడిచిపెట్టెయ్యండి." ఇలా

అని లేచి సందునుండి బయటకు వెళ్ళిపోయాడు. తల పట్టుకుని అక్కడే కూర్చుని ఏడుస్తోంది, లక్ష్మి.

పరమానంద్, తక్కిన పిల్లలు మెట్లమీదనుంచుని తమ తండ్రి వస్తాడా, రాడా అని చూస్తున్నారు. పరమానంద్ మనస్సులో అతనురాకుండావుంటేనే మంచిదనుకుంటున్నాడు. చిన్నపిల్లలందరూ పరమానంద్‌ను దోషిగా భావిస్తున్నారు.

సదానంద్ పరమానంద్‌ను అడిగాడు, "అన్నయ్యా! ఇప్పుడు ఏమవుతుంది?"

"చూశావుగా అమ్మను కొడుతున్నాడు. పైగా నెయ్యంతా క్రిందవలకబోశాడు."

"కాని నువ్వెందుకు కొట్టావు?"

"అమ్మను చంపేస్తే ఏమవుతుంది?"

"కాని ఇక నాన్నగారు రాకపోతే?"

"రాకపోతే సరి."

"తిండి – తిప్పలు ఎలాగ?"

"మనం నౌకరీచేద్దాం."

"మరి చదువు!"

"ఇక చదవటం జరుగదు."

పరమానంద్ వయస్సులో సదానంద్‌కంటె కేవలం ఒకటిన్నర సంవత్సరాలే పెద్ద. అయినప్పటికీ తండ్రిమాటల్ని అతనికంటె చాలాబాగా అర్థంచేసుకోగలడు. తను వెంటనే నౌకరీ చెయ్యవలసివుంటుందని అతను ఒక సంవత్సరంక్రితమే గ్రహించాడు. అతను తన తల్లిదుర్దశను, ప్రసవించినప్పటి మూలుగులను బాగా అర్థంచేసుకున్నాడు.

శాస్త్రి మాటలతో నిర్మలవిషయం తెలుసుకున్నాడు. ఆ తరువాత కూడా తను చగసటంలో అర్థం లేదనుకున్నాడు. ముందు భోజనానికి తగిన ఏర్పాట్లుచేసుకోవాలి. తండ్రి ఇక తమకేమీ యివ్వడు.

నందలాల్ వెళ్ళిపోయిన తరువాత పరమానంద్ తల్లి దగ్గరకువెళ్ళి అడిగాడు, "అమ్మా! పైకి రా. ఇకఆయనదగ్గర నుంచి ఏమైనాఆశించడం గొడ్డుటావుదగ్గర పాలు ఆశించినట్టే."

తల్లి కళ్ళు తుడుచుకుని మెట్లెక్కుతూ అంది, "ఏమీ ఏమిట్రా అలా చేశావు?"

"అమ్మా! ఏదోరోజున యిది జరగవలసిందే. ఈ విధంగా జీవితం గడువనే గడవదు."

"ఆయన నీ తండ్రి. ఆయన్ను కొట్టకూడదు."

"కాని నువ్వు నా తల్లివమ్మా. నా తల్లిని యెవ్వరూ కొట్టడానికి వీల్లేదు."

"కాని యిక మనమంతా ఆకలితో చావాలి."

"ఏం? భగవంతుడు మనకు తిండి యివ్వడా?"

"దానికి పురుషార్థం కావాలి. నువ్వింకా చిన్నవాడివి. నౌకరి నీవల్ల అయ్యేదికాదు. నువ్వింక పదవతరగతికూడా పూర్తి చెయ్యలేదు."

"చదువు ఇంక జరగడం కష్టం. కాని అమ్మా! సదానంద్, నేను తొందరలోనే సంపాదించడం మొదలెడతాం."

తల్లికి ఈమాట నచ్చలేదు. అందుచేత ఆమె మనస్సులో యింకేవో ఏర్పాట్లు ఆలోచించుకుంటోంది. ఆమె అడిగింది. "సరే, వకీలుగారి బంగళా ఎక్కడో తెలుసా?"

"తెలుసు. కాని నేను ఆయనదగ్గర నౌకరీ చెయ్యను."

"ఏం?"

"మన తమ్ముణ్ణిఇచ్చామో లేదో, మనకుటుంబమంతా వాళ్ళమీద పడిందనుకుంటారు."

"నేను నిన్ను వారిదగ్గరకు నౌకరీకోసం పంపను. నేను బేబీని, కమలను ఒకసారి చూసివద్దామనుకుంటున్నా."

"కాని, వారితో నాన్నమాట చెప్పొద్దు అమ్మా!"

"నాయనా! ఆయనే స్వయంగా చెబితే?"

8

నందలాల్ కుంవర్ సేన్‌గారి దగ్గరకు వెళ్ళేసరికి అతని ముఖంమీద పట్టీలున్నాయి. అతను దారిలో డాక్టరుచేత మరహమ్ - పట్టీలు వేయించుకున్నాడు. వకీలుగారు అతని పరిస్థితి చూసి అడిగారు, "అదేమిటి?"

"దారిలో ఒక ఎద్దు పొడిచిందండి."

తరువాత ఇద్దరూ పనిలో నిమగ్నులైపోయారు. సరిగ్గా పదిగంటలకు ఇద్దరూ కారులో కచేరీ చేరుకున్నారు. వాళ్ళు వెళ్ళిన అరగంటకు లక్ష్మి, పరమానంద్ వకీలుగారి ఇంటికి చేరుకున్నారు. పరమానంద్ తల్లిని అక్కడ విడిచిపెట్టి నౌకరీ వెదుక్కునేందుకు బయలుదేరాడు.

లక్ష్మి ఆవరణలోనికి అడుగుపెట్టగానే మొట్టమొదటిసారిగా ఆమెదృష్టి కమలమీద పడింది. పిల్లవాణ్ణి 'పెరాంబ్యులేటర్'లో కూర్చోబెట్టి ఆవరణలోని లాన్‌మీద త్రిప్పుతోంది.

పిల్లవాడు బండిలో నిదురపోతున్నాడు. కమల తల్లిని చూచి బండి ఆమెవద్దకు గెంటుకుంటూవచ్చి, "అమ్మా చూడవే, బండి యెంత అందంగా వుందో." అంది.

తల్లి తన ఆనందాన్ని ప్రకటించింది. తరువాత, "నువ్వెలా వున్నావో చెప్పమ్మా" అనడిగింది.

"పెద్దమ్మ కట్టుకునేందుకు నాకీ బట్టలిచ్చింది. నాబట్టలు విప్పించివేసి వనమాలి భార్యకు యిచ్చివేసింది."

"తరువాత?" మనస్సులోని ఆనందాన్ని బయటపడ కుండా అడిగింది.

"ఆవిడ నన్ను తనపక్కనే కూర్చోపెట్టుకుని భోజనం చేయించింది. ఉదయం టీ కూడా ఇద్దరం కలిసే త్రాగాము."

"ఏమీ కష్టం లేదుకదా?"

"లేదమ్మా! హాయిగా వుంది."

—ఈసమయానికి సరోజినీదేవి ఇంటినుంచి బయటకు వచ్చింది. అప్పుడు వీరిద్దరూ మాట్లాడుకోవటం విన్నది. ఆమెదగ్గర కొచ్చి లక్ష్మి చెయ్యిపట్టుకుని లోనికి తీసుకెళ్తూ కమలతో, "పిల్లని లోపలికి తీసుకువెళ్ళి ఊయల తొట్లో పడుకోపెట్టి, నువ్వు పాఠం చదువుకో."

లక్ష్మి ప్రశ్నపూర్వక దృష్టితో కమలవంక చూసింది. కాని సరోజినీదేవియే సమాధానం ఇచ్చింది. "ఇంత పెద్ద దయినా ఇంకా హిందీలో అయిదవ తరగతి పుస్తకమే చదువుతోంది. నేను ఈమెను చదవిస్తాను."

లక్ష్మి చిరునవ్వు నవ్వి మాట్లాడటానికి పూనుకుంది. కాని వెంటనే ఇంట్లో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది, ముఖం

లోని చిరునవ్వు మాయమయిపోయింది. ఆమె ముఖంలోని భావపరివర్తనను సరోజినీదేవిగమనించింది. ఆమెనుడ్రాయింగు రూములోనికి తీసుకువెళ్ళి అంది, 'మేము మీ ఇంటిదగ్గర నుంచి తిన్నగా బజారుకు వెళ్ళాము. అక్కడ పిల్లాడికొ్కావల సిన సామానులన్నీ కొన్నాము. బట్టలు, పాలడబ్బాలు, ఆడిం చడానికి బండి, పరుండేందుకు ఊయల మొదలైనవన్నీ తెచ్చాము.

"కమల నన్నడిగింది, 'మిమ్మల్ని ఏమని పిలిచేది?' అని. నేను 'పెద్దమ్మ' అని పిలువమని చెప్పాను."

ఇవేళ మీయింటి పరిస్థితంతా పూర్తిగా తెలుసు కున్నాను. అంతా తెలిశాక నాకు చాలా దుఃఖం కలిగింది. మున్షీగారు యింటిసంగతిబొత్తిగా చూడటంలేదు.ఈవిషయం లో వకీలుగారితోచెప్పి ఏదోవొక ఏర్పాటు చెయ్యాల్సిందే."

"చూడు లక్ష్మీ! రమాకాంత్ భార్య నాకు చిన్న ప్పటినుంచీ స్నేహితురాలు. ఆవిడ భర్త ప్రభుత్వోద్యోగి. నెలకు అయిదువందలు జీతం. ఏలోటూ లేదు. నిన్న పిల్ల విషయంలో మాట్లాడేందుకు వెళ్తే ఇలా అంది, "ఆడపిల్లను ఊరికే యెక్కడ యివ్వగలం? ఏమి ఇస్తావో చెప్పు?" అని

"నీ ఇష్టమొచ్చినంత అడుగు," అన్నాను.

"అయిదువేలని చెప్పింది. నేను ఒప్పుకున్నాను. కాని రాత్రి నీతో మాట్లాడిన తరువాత నాకెంతో భేదం కన్పిం చింది. నా మనస్సులో ఒకమంచి కుటుంబంతో సంబంధం ఏర్పడిందని అనుకున్నా. భగవంతుడికి అనేక ధన్యవాదాలు. కమల చాలా మంచిపిల్ల. సభ్యమైనది, మంచి శీలవతి. అంద

మైనది. కాని మీయింటిపరిస్థితి బాగుచెయ్యడానికి ఏదొకటి చెయ్యాలని గట్టిగా వుంది.''

ఈసానుభూతివాక్యాలు లక్ష్మిమీద చాలాప్రభావాన్ని వేశాయి. రాత్రిజరిగిన సంఘటన జ్ఞాపకం చేసుకుని ఏడ్చింది. ''ఏమిటి, చెల్లాయి?'' అనడిగింది, సరోజిని.

''ఏమీలేదమ్మా; మీసానుభూతి మాటలువినగానే ఆనందభాష్పాలు వచ్చాయి'', అంటూ చాలాకష్టంమీద రాత్రిజరిగిన సంఘటన నోటిబయటికి రాకుండా కాపాడుకుంది.

''ఒకవిషయం చెప్పడం మర్చిపోయాను,'' అంటూ గంభీరంగా ముఖంపెట్టి చెప్పింది సరోజిని, ''దారిలో మున్షీ గారిని ఎద్దుపొడిచిందట, గాయాలు తగిలాయి.''

''ఎద్దా!'' ఆశ్చర్యంతో అడిగింది లక్ష్మి. కాని వెంటనే తనభర్త వాస్తవిక సంఘటనను దాచివుంచాడని అర్థంచేసుకుని దానితోఆయన ఇంటికి తిరిగివస్తారని మనస్సులో ఆశ కల్గింది.

సరోజిని తరువాతఅంది, ''ఏదోడాక్టరుగారిదగ్గర పట్టీలు వేయించుకు వచ్చారు. పెద్దప్రమాదకరమైన మేమీకాదట!''

లక్ష్మి తన మనస్సులోని మాటను బయటకు రానీయ లేదు. తరువాత అవీ ఇవీ చెప్పుకున్నారు. పిల్లాడికి పాలుపట్టే సమయం అయ్యేసరికి కప్పులో పాలుకలిపి తెచ్చింది కమల. పిల్లవాణ్ణిలేపి అతనినోట్లో పాలసీసాతిత్తెను పెట్టింది. పిల్లాడు పాలు త్రాగుతున్నాడు. పిల్లవాడిస్థితిచూసి లక్ష్మికి చాలా తృప్తి ఆనందం కలిగాయి.

దగ్గరదగ్గిర ఒంటిగంటకు ఇంటికి తిరిగివచ్చింది, లక్ష్మి. సాయంకాలం నాలుగుగంటలకు వకీలుగారు ఇంటికి వచ్చారు. టీ త్రాగేసమయానికి సరోజిని కమలను కూడా తనదగ్గరకూర్చో బెట్టుకుంది. టీ త్రాగుతూ, "ఇవేళ నందలాల్ ఆదాయం ఎంత వుంటుంది?"

"బహుశా ఏభై రూపాయ లుంటుందేమో అనుకుం టాను."

"మీరొకపని చెయ్యండి. అతని సంపాదనలో ఒక భాగం అట్టేపెట్టి అతనిభార్యకు ఇవ్వండి. ఆమె, తక్కిన పిల్లలు ఆకలితో మాడుతున్నారు."

"అది అసంభవం. డబ్బువిషయంలో నాఫీజు కూడా అతనే వసూలుచేస్తాడు. తనభాగం తనదగ్గర వుంచుకుని నాది నాకిస్తుంటాడు."

"ఆయనకు నచ్చచెప్పి తీసుకోండి."

"నేనెందుకు తీసుకునేది. అతనేస్వయంగా భార్యకిస్తాడు"

"ఆయన ఇవ్వడు. తన సంపాదనంతా సారాయికి, వేశ్య లకు తగలేస్తున్నాడు."

"మున్షీ మనకు చాలాఅవసరమైన మనిషి. అతనితో ఏమాత్రం జబర్దస్తీ చేసినా పారిపోతాడు. దానివల్ల మనకు చాలా హాని కలుగుతుంది. అటువంటి పనివాడు దొరకడం చాలాకష్టం."

"కాని ఇది అన్యాయంకాదా? నెలకు వెయ్యిరూపా యలు సంపాదించేవ్యక్తి ఇంట్లో, పిల్లలు ఆకలితో వుండవలసి వస్తోంది. నిజంగా చాలా అనర్థం జరుగుతోంది."

కువర్‌సేన్ కొంచెంసేపు ఆలోచించాడు. తరువాత, "సరే, నేను చెప్పిచూస్తాను," అన్నారు.

మరునాడు నందలాల్ పట్టీలు విప్పేశాడు. గాయాల మీద స్టికింగ్‌ప్లాస్టర్ వేసుకున్నాడు. అతని ముఖంవంక చూసి, "ఇవేళ గాయాలు తగ్గినట్టున్నాయే?" అన్నారు.

"అవునండీ, చాలామట్టుకు తగ్గిపోయినట్టే."

కువర్‌సేన్ తక్కిన విషయాలు ఆరంభించారు. "నందలాల్! ఆదాయం బాగుందికదా, అయినప్పటికీ మీ ఆవిడ బట్టలు చిరిగే వుంటాయేం?"

"అవునండి. దానికి ఖర్చుచెయ్యటం తెలియదు. అందు చేతనే ఎంత ఆదాయం వచ్చినా ఎప్పుడూ వెలుగుండదా!"

"నిన్న మీఆవిడకు ఏమాత్రం ఇచ్చావు?"

"నిన్ననా? ఏమీ ఇవ్వలేదండీ".

"ఏం? నిన్న నీ ఆదాయం ఏభై రూపాయలకు తక్కువ కాకుండా వుంటుందని నాఅభిప్రాయం."

"అవునండీ! నేను లక్ష్మికి ఏమీ ఇవ్వలేదు. ఇకమీదట ఏమీ ఇవ్వదలచుకోలేదు కూడాను."

"ఏం?"

"ఆమెకు ఖర్చుచెయ్యటం తెలియదులెండి. నేను ఇచ్చే దంతా కొన్నిగిత్తల్ని పెంచడంలో తగలేస్తోంది. పైగా ఆ గిత్తల చేతనే నన్ను పొడిపిస్తోంది."

"లక్ష్మి గిత్తల్ని పెంచుతుందా?" వకీలుగారికి ఆశ్చర్యం వేసింది. మున్షీ వ్యంగాత్మకంగా చెబుతున్నాడనుకున్నారు.

నందలాల్ అన్నాడు, "అవునండి. నిన్న వాటిల్లోని ఒక గిత్తే నన్నుపొడిచింది. నన్నుచంపెయ్యాలని ప్రయత్నించింది. కాని భగవంతుడి దయవల్ల తప్పించుకు బయట పడ్డాను."

నందలాల్! ఇలాచూడు! నువ్వు మంచి చమత్కారంగా మాట్లాడగలవు. కాని నేనుకూడా వకీలునే. నిర్మల ఎవరోచెప్పు?"

"అయితే మీరు నన్ను ఉద్యోగంనుంచి తీసేద్దామనుకుంటున్నారా?"

నేనేమీ అలా అనలేదే. కాని నువ్వు మానెయ్యాలంటే మానెయ్యవచ్చు. నందలాల్ పోయినంతమాత్రాన మాకు యోగ్యులు కరువైపోరు."

లక్ష్మి వకీలుగారికి విషయమంతా చెప్పివుంటుందని నమ్మకం కలిగింది నందలాల్‌కు. అందుచేత విషయమంతా స్పష్టంగా చెప్పెయ్యడం మంచిదనుకున్నాడు. "నౌకరీమాట తరువాత చూసుకుందాం. ముందు నిర్మల విషయంలో వినండి ఆమె నారెండవభార్య. గత అయిదు సంవత్సరాలనుంచీ నాతోనే వుంటోంది. రోజూసాయంకాలం ఆమెదగ్గరకు వెళ్తాను. ఇక నేను లక్ష్మిని విడిచిపెట్టెయ్యదలచు కున్నాను. ఇక పూదట నిర్మలతోనే నేను కాపుర ముండేది. నిన్నటినుంచి నేను లక్ష్మి దగ్గరకు వెళ్ళలేదు. ఆమెకోడుకే నిన్న నన్ను కొట్టింది. ఈ గాయాలు దానివల్లనే తగిలాయి.

"బావుంది, ఇదా విషయం! ఈ గిత్తల్ని ఆమె పెంచుతోందా!

"కాని నందలాల్! ఈ గిత్తలకు వెయ్యవలసిన మేతను నువ్వు మరొక ఆవుముందు వెయ్యడంకూడా నిజమేకదా!"

"నిర్మలనాకు లక్ష్మికంటే ఎక్కువ ఇష్టమైనది. ఆమె నాసుఖానికీ, ఆనందానికీ ఎక్కువ కారకురాలుగావుంది. అందుచేత ఆమెకు లక్ష్మికంటే ఎక్కువఇస్తాను. ఇకమీదట లక్ష్మి, పుత్రుల ప్రవర్తనవల్ల అదికూడా ఇవ్వను."

కుంవర్ సేన్ అదివిని ఆశ్చర్యపోయారు. విషయం ఇంత వరకూ వస్తుందని ఆయన అనుకోలేదు. పిల్లలు ఇతన్ని కొట్టేరా? చిన్నచిన్న పిల్లలు ఇతన్ని ఎందుకు కొడతారా, అని ఆలోచించారు. ఆయన నందలాల్ నడిగారు "నిన్నదెబ్బలాట ఎందుకు జరిగింది చెప్పగలవా?"

"ఆవిషయం చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను. మీరు లక్ష్మినే అడగవలసింది."

"ఈ విషయంలో అసలు లక్ష్మి ఏమీ చెప్పలేదు. నీకు వ్యతిరేకంగా ఒక్కమాటకూడా అనలేదు. నేనింకేమి అడుగను? నేను కేవలం నాఅనుమానాన్ని పురస్కరించుకుని అడుగుతున్నా. దెబ్బలాటవిషయం మొట్టమొదట నీనోటనే వెలువడింది. దెబ్బలాటకు కారణం నువ్వేచెప్పగలవు."

"అది నాకుటుంబ విషయం అందులో మీరు కలుగచేసుకోకూడదు."

"నందలాల్! నేను నిన్ను నీ వకీలునన్న హోదాలో అడగడంలేదు. కొందరి దుఃఖాన్నిచూసి ఒకతోటి మానవునివలె దాని నివారణకై ఆలోచించి ఏదో చేద్దామనుకుంటున్నా."

"లక్ష్మి, ఆమెపిల్లలు అంటే మీకు బాగా సానుభూతి

వున్నట్టయితే వాళ్ళకు పెన్షన్ ఇప్పించండి. కుక్కలా పిల్లల్ని ఈనే ఆస్త్రీకి, తండ్రిమీద గుద్దులువేసే అటువంటి పిల్లలకు నేనుమాత్రం ఏమీ ఇవ్వలేను.''

నందలాల్ చాలా అస్పష్టంగా మాట్లాడటం, కుంవర్ సేన్‌కు చాలాకోపం తెప్పించింది. ఆయన అన్నారు, "నువ్వు మర్యాదమరచి హద్దులు దాటుతున్నావు. నేనులక్ష్మికి సహాయం చెయ్యగలను. అందుకుకాదు. నాఉద్దేశ్యంలో నువ్వే ఆపని చేయడంమంచిది. ఎందుకంటే అది నీకర్తవ్యం. కాని నువ్వుచూస్తే చాలా అపసవ్యంగా వ్యవహరిస్తున్నావు.

"నీవంటి దుర్బుద్ధిగల వానివల్ల నాకుకూడా హానికలుగ వచ్చు. ఇలా తలాతోకలేకుండా మాట్లాడేవాడు ఏ వకీలుదగ్గరైనా గుమస్తాగిరి చెయ్యడం కష్టం. నీమనస్సులో ఏదో వికారం వుత్పన్నమైనట్టుంది. నువ్వుదానిని దూరంచేసుకునే వరకూ గుమస్తాగిరినుంచి శెలవుతీసుకోమని నాఉద్దేశ్యం.''

ఈబెదరింపుతో నందలాల్ ధైర్యం ఎగిరిపోయింది. కాస్త తగ్గిమాట్లాడాడు, "పండిట్‌జీ నానౌకరీకి, నాఇంటి విషయాలకూ సంబంధం ఏముందండీ?''

"సంబంధం లేకేం? ఏబుద్ధిఅయితే నీఇంటి విషయాల్లో పనిచేస్తోందో, అదే ఇక్కడ కూడా పనిచేస్తోంది. ఒకచోటదాని తర్కశక్తి వికృతమయినట్టయితే రెండవచోట అది సరిగా పని చేస్తుందనడంలో సందేహముంది. నువ్వు నన్నేగోతిలోకో దింప వచ్చు. ఇకనువ్వు నీకువచ్చేది లెక్కలుచూసుకుని దయచెయ్య వచ్చు.''

"చివరకు మీరు ఏం చెయ్యమంటారో శెలవివ్వండి.''

"నేను కోరేదేమంటే, నీకొచ్చిన ఆదాయంలో సగం లక్ష్మికి, ఆమెబిడ్డలకిచ్చి తక్కిన దాంట్లో నువ్వు నిర్మల బ్రతకండి."

"అయ్యా ఇదిచాలా అన్యాయమండి! నాకు చాలా సుఖంనిచ్చే ఆమెకు నాల్గవవంతు, నన్నుకొట్టేపిల్లల తల్లికిసగం ఇవ్వటం ఎలావుంటుందండి?"

"నీకు పంచిపెట్టడం చేతకాదు గనుక కోడుతున్నారు. ఒక కులటకు నీ సంపాదనంతా ధారపోస్తూ, నీ ధర్మపత్ని, నీ పిల్లల తల్లి అయిన ఆమెకు ఏమీ ఇవ్వకపోవడం బాగా లేదు."

"మీరుచేసిన ఏర్పాటు నాకు నచ్చలేదండి. అసలు నాఆదాయాన్ని ఎలాఖర్చుపెట్టుకోవాలి అనే విషయం నిర్ణయించుకోవలసింది నేను."

"అలాగే. నువ్వు నాదగ్గర పని చెయ్యక్కరలేదు. నా గుమస్తాగా ఎవరుండాలో. ఎవరుండనక్కరలేదో నిర్ణయించుకునేపని నాది."

తలవాలేసుకుని కార్యాలయంనుంచి బయటకువచ్చాడు నందలాల్.

అతని దగ్గర ఛార్జీతీసుకుని పనినుంచి పంపించేశారు. కుంవర్ సేన్ రెండవ గుమస్తాద్వారానే పనినడుపుకుంటున్నారు.

ఆరోజునుంచీ కుంవర్ సేన్ గారికి పనిచాలా ఎక్కువయ్యింది. అయినప్పటికి రెండవగుమస్తా సహాయంతో పని గడిపివేస్తున్నారు.

సాయంకాలం టీ త్రాగేటప్పుడు ఆసంగతి తనభార్యతో చెప్పారు, కుంవర్ సేన్ సరోజనీదేవి విచారంతో అడిగింది.
"కాని లక్ష్మికుటుంబం ఎలా గడిచేది?"

"దానికి నేనొక ఏర్పాటు చేస్తున్నా. ఈవేళ గుమాస్తా ఫీజు క్రింద వచ్చినదాంట్లో ఖర్చులు, తదితరఫండు తీసివేయగా పదిరూపాయలు మిగిలాయి. ఇవి లక్ష్మికి పంపించు. ఒక గుమస్తాను స్థిరంగా పెట్టుకునేవరకు ఇలాజరుగుతూ వుంటుంది. తరువాత ఆలోచించవచ్చు."

ఈవిధంగా లక్ష్మి, ఆమెపిల్లలకు సహాయం లభిస్తుంది. దానితో పరమానంద్, ఇలా పిల్లలందరూ చదువు కొనిస్తున్నారు.

9

ఒకవారం రోజులువరకూ నందలాల్ రాలేదు. ఈలోపల ప్రతిరోజూ లక్ష్మి సరోజనీదేవిని కలుసుకునేందుకు వెడుతోంది. గుమాస్తాగిరిలో తనవాటాకు మిగిలినమట్టును తెచ్చుకుంటోంది. వారంరోజుల్లో అరవై రూపాయలు వరకూ వచ్చాయి.

ఇక కుంవర్ సేన్ గారు ఒకగుమస్తాను పెట్టుకోవాలని నిశ్చయించుకున్నారు. లక్ష్మికి ఆర్థికసహాయాన్ని గురించి కూడా దీర్ఘంగా ఆలోచించవలసివచ్చింది. కొంతకాలంవరకూ ఈ కుటుంబానికి తనదగ్గరనుంచి సహాయం ఇవ్వగలరు. కాని ఈకుటుంబాన్ని స్వయంపోషకంగా తయారుచెయ్యాలని ఆయన ఉద్దేశ్యం. సరోజనికి లక్ష్మిమీద బాగాగురి ఏర్పడింది. ఆమెఉద్దేశ్యంలో లక్ష్మి చాలామంచిది, సహృదయురాలు.

కమల విషయంలో కూడా ఆమెకు మంచి అభిప్రాయంవుంది. ఆకుటుంబానికి ఏమైనా చెయ్యాలని తనభర్తతో చెబుతూ వస్తోంది.

దానిమీదట ఒకరోజున కుంవరసేన్ పరమానంద్‌ను పిలిచిఅడిగారు, "ఏంచదువుతున్నావు?"

"ఈసంవత్సరం మెట్రిక్ పరీక్షకు కూర్చుంటున్నా."

"పాసవుతావా?"

"కనీసం ఎంతలేదన్నా ఫస్టుక్లాసులోవస్తాను."

"ఎక్కువయితే?" నవ్వుతూ అడిగారు కుంవర్ సేన్.

"రాష్ట్రంలో ప్రథముడుగా రావడానికి ప్రయత్నిస్తున్నా"

"అబ్బా! నువ్వు ప్రథముడుగా రాగలవని ధైర్యం వుందా? మీ మాష్టారు నీవిషయంలో ఏమంటారు?"

"మాష్టారుమాత్రం నన్ను పుస్తకాలులేని నిర్ధనుడుగా భావించి కేవలం పాసవుతావు అంటున్నారు. కాని స్కాలర్ షిప్‌కోసం తయారు చేసేవాళ్ళందరిని లాగించెయ్యగలనని నాకు గట్టిగా నమ్మకం వుంది."

ఆత్మవిశ్వాసంతో కూడిన ఈమాటలు వినగానే కుంవర్ సేన్‌కు నవ్వు వచ్చింది. ఆయన అడిగారు. "కాని పుస్తకాలు లేకుండా చదువెలా సాగుతోంది?"

"సుందర్‌లాల్ అనే నామిత్రుడొకతనున్నాడు అతను నాక్లాసే. అతను ఫుట్‌బాల్ బాగాఆడతాడు. నేను అతనుతో, ఒక ఏర్పాటుచేసుకున్నా. అతను నాకు తన పుస్తకాలిస్తాడు. నేనుమాత్రం నానోట్సులు ఇస్తాను."

"సరే ఒక పనిచెయ్యి," కుంవర్ సేన్ అన్నారు, "మీ యింట్లో చదువుకునేందుకు చోటు లేనట్టుంది. నువ్వు తిన్నగా స్కూలునుంచి ఇక్కడకురా. సాయంకాలం టీ అదీ ఇక్కడే తీసుకుని రాత్రి పదిగంటలవరకూ ఇక్కడే చదువుకో. తరువాత ఇంటికి వెళ్ళు.

"నువ్వు ఇక్కడకు వస్తూవున్నట్టయితే నిన్ను మీ నాన్న పనిలో పెట్టవచ్చని నా ఉద్దేశ్యం.

వాస్తవానికి పరమానంద్‌కు ఒక విషయంలో కష్టంగా వుంటోంది. చదువుకునేందుకు సుందర్ ఇంటికి వెళ్తుంటే అతనితల్లి కోపబడుతోంది. తన ఇంటివద్ద చదువు సాగదు. కుంవర్ సేన్‌గారి సలహా ప్రకారం సుందర్ దగ్గరనుంచి పుస్తకాలు తెచ్చుకుంటున్నాడు. వకీలుగారి ఇంట్లో కూర్చుని చదువుకుంటున్నాడు. నోట్సు తయారుచేసుకుని మరునాడు సుందర్‌కి ఇస్తుంటాడు. సుందర్ దానికి నకలు తీసుకుంటాడు. ఈ విధంగా ఇద్దరిపని గడిచిపోతోంది.

స్కూలునుంచి రాగానే పరమానంద్‌కు టీ త్రాగేందుకు పాలుదొరుకుతాయి. తరువాత రాత్రి తొమ్మిది గంటలు వరకూ అక్కడే కూర్చుని చదువుకుంటాడు. పిమ్మట రాత్రి భోజనం తన యింటికిపోయి చేస్తాడు.

అటు నందలాల్ తనవంటి గుమాస్తా కుంవర్ సేన్‌కు లభించడని ఆయన తనకోసం తిరిగి ఖబురు చేస్తాడని అనుకుంటున్నాడు. ప్రతిరోజూ కుంవర్ సేన్‌గారు చిన్న గుమాస్తాతో తంటాలు పడటం కనిపెడుతున్నాడు. కాని నాగంరోజులయినా కుంవర్ సేన్ తనవైపు కన్నెత్తికూడా చూడాకపోయే

సరికి తన మిత్రుడు రాధాకృష్ణను ఆయన దగ్గరకు పంపిం చాడు.

కుంవర్ సేన్ ఒకరోజున కచేరీలో బార్ రూమ్‌లో కూర్చుని వుండగా రాధాకృష్ణవచ్చి ముందు నిలబడ్డాడు.

కుంవర్ సేన్ అడిగారు, "ఏం రాధాకృష్ణ?"

"అయ్యా! నందలాల్ ఖాళీగా తిరుగుతున్నాడండి. చాలా ఇబ్బంది పడుతున్నాడు."

"అయితే స్వయంగావచ్చి ఎందుకు మాట్లాడ కూడదు?"

"అతనేమైనా అపరాధం చేశాడండి?"

"అవును మానవత్వాన్ని హత్య చెయ్యడానికి యత్నిం చాడు."

"అయ్యా! అతని ఇంటి విషయం అలా వుంచండి. మీ పనిలో ఏమైనా తప్పుచేస్తే దండించండి."

"నాపనికూడా సరిగా చెయ్యడని నాకు సందేహం కలి గింది అతని బుద్ధి మలినమయి పోయింది. అతను సారా త్రాగు తున్నాడు. వేశ్యల వెంబడి తిరుగుతున్నాడు. అతని భార్యా బిడ్డలు ఆకలితో మాడుతున్నారు. అటువంటి దుర్బుద్ధిగల వ్యక్తి నా దగ్గర గుమాస్తాగా పనికిరాడు."

"ఎలాగంటారు? మీరు నౌకరీనుంచి తీసివెయ్యగానే ఇదివరకు అతను కుటుంబానికి ఇచ్చేదికూడా ఇవ్వలేకుండా వున్నాడు."

"ఇదిగో చూడవయ్యా! అతను సగభాగం తన భార్యకు ఇస్తేసరేసరి. లేకపోతే అతను నా దగ్గర పనిచెయ్య నక్కర

లేదు. ఇక అతని భార్యా బిడ్డలంటారా. భగవంతుడే వున్నాడు."

"మీరు ఈ విధంగా చెయ్యడంవల్ల అన్యాయమే కాదు, క్రూరత్వం కూడా ప్రకటిస్తున్నారు."

కుంవర్ సేన్ కోపంతో అడిగారు "క్రూరత్వం ఎలా?"

"నందలాల్‌ను ఏదో అసంబద్ధమైన ఒక కారణంచేత తొలగించడం అన్యాయం. క్రూరత్వమంటారా, అది అతని భార్య లక్ష్మి యెడల ఆమెకు ఇదివరకు లభించేది కూడా లేకుండా చేశారు."

"నా ఉద్దేశ్యంలో అతని భార్యకు ఇదివరకటికంటే ఎక్కువ లభిస్తోందని. రెండు సంవత్సరాలలో అతని కొడుకు బాగా సంపాదించేలా ఏర్పాటు చేస్తున్నా. దానితో నంద లాల్ సంపాదన విషయమే మర్చిపోతుంది, లక్ష్మి."

ముఖం వాలేసుకుని వెనక్కు తిరిగాడు. రాధాకృష్ణ విషయమంతా నందలాల్‌కు వినిపించగానే మండిపడ్డాడు. ఏదైనా మరొక వకీలు దగ్గర పనికి కుదిరేందుకు ప్రయత్నం మొదలెట్టాడు.

ఈ విధంగా మరొక పదిహేను రోజులు గడిచి పోయాయి. కుంవర్ సేన్‌గారికి మరొక గుమస్తా దొరికాడు. క్రొత్త గుమాస్తా పేరు జీవన్‌లాల్. కుంవర్ సేన్‌గారు అత నితో కష్టమర్సు దగ్గర నూటికి పదవవంతు చొప్పున గుమస్తా ఫీజు తీసుకోమని, దానిలో మూడవవంతు పరమానంద్‌కు ఇవ్వవలసిందని చెప్పారు. జీవన్‌లాల్ కారణం అడిగాడు దాని మీదట కుంవర్ సేన్ అన్నారు.

"నందలాల్ నాతో పదహారేళ్ళు పనిచేశాడు. ఈ పదహారేళ్ళలోనూ చాలా కష్టపడి, తెలివి తేటలుగా పని చెయ్యడంవల్ల నా ప్రాక్టీసు పెరిగింది. దాని ఫలితాన్ని నువ్వు ఈనాడు అనుభవించబోతున్నావు. అందుచేత నువ్వు నీ భాగంలో కొంత నందలాల్ కుటుంబానికి పెన్షన్‌గా ఇవ్వ వలసివుంటుంది."

జీవన్‌లాల్ అంగీకరించాడు. మరొక వకీలు దగ్గర పదిశాతం తీసుకున్నా ఎక్కువే వస్తుందని అతనికి తెలుసు. అందుచేత కుంవర్‌సేన్‌గారి మాట అంగీకరించి ఆదాయంలో మూడవంతు పరమానంద్‌కు ఇస్తున్నాడు. దానితో పరమానంద్‌కు నెలకు మూడువందలు లభిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో ఆఫీసు పనుల్లో తనుకూడా కల్పించుకుంటే మంచిదనుకున్నాడు పరమానంద్. అది తన కర్తవ్యంగా భావిస్తున్నాడు. కాని పరీక్షలయ్యేవరకూ ఇటువంటివేవి కల్పించుకోవద్దని కుంవర్‌సేన్‌గారి ఆజ్ఞ.

ఇంతవరకూ నందలాల్‌కు ఏమీ పని దొరకలేదు. తన యోగ్యతచూసి ఏ వకీలయినాసరే తనను పనిలో పెట్టుకుంటాడని అతని ఉద్దేశ్యం. కాని ఏ వకీలు దగ్గరకైనా నౌకరీకి వెళ్ళినప్పుడు ప్రతివారూ "కుంవర్‌సేన్‌గారి దగ్గర ఎందుకు మానేశావు?" అని అడుగుతున్నారు. దానికి జవాబుగా నందలాల్ కుంవర్‌సేన్‌ను నిందిస్తున్నాడు. ఒకరితో, తన భార్యకు, కుంవర్‌సేన్‌కు సంబంధం కలిగిందని చెబుతుంటాడు, మరొకరితో కుంవర్‌సేన్ తన కూతురు కమలను వుంచుకున్నాడని చెపుతున్నాడు. ఈ విధమైన నిందలువిని ఏ మాత్రం తేడా

చ్చినా తమనికూడా ఈ విధంగానే దుయ్యబడతాడని ప్రతి
కీలు జడుస్తున్నాడు. లాహోరులో ప్రతివ్యక్తికి కుంవర్
కిన్‌ను గురించి తెలుసు. అందుచేత నందలాల్ మాటలు
వ్వరూ నమ్మలేదు.

పరిణామంగా నందలాల్ ఇంకా చెడ్డపేరు తెచ్చు
న్నాడు. దానితో నౌకరి దొరకటం ఇంకా కష్టమయి
యింది.

నందలాల్‌కు మరొకవైపున ఇంకా నిరాశ కల్గించే
ంగతి జరిగింది. పరమానంద్ తనని కొట్టిన రోజున ఇంటికి
వెళ్ళకుండా తిన్నగా హోటలుకువెళ్ళి నిర్మలను పిలిచి
న్నాడు, "నిర్మల! నేను ఇకమీదట నా భార్యను పూర్తిగా
డిచి పెట్టేశాను. ఇక మీదట ఒక ఇల్లు తీసుకుని నీతో
హ్యాటంగా కాపురం పెడదామనుకుంటున్నా."

ఇది వినగానే నిర్మల స్థంభితురాలైపోయింది. అటు
ంటి పరిస్థితి వస్తుందని ఆమె ఎప్పుడూ ఆశించలేదు. ప్రస్తుత
రిస్థితిని మార్చేందుకుకూడా ఆమెకు ఇష్టంలేదు. ఆమె
ంది.

"ఏం ఇప్పుడు బాగాలేదా?"

"కాని ఇది సంసారపక్షంలా లేదు. ఒక పెద్ద ఇల్లు తీసు
ంటాను. మంచి ఫర్నిచరు, వెండిసామాను, మంచికంబళీలు,
ట్టలు అన్నీ కొంటాను. మనం జీవితాన్ని బాగా ఆనందించ
చ్చు."

"నా ఉద్దేశ్యంలో ప్రస్తుత పద్ధతివల్లనే ఎక్కువ
ావుంటుందని."

"కాని ఇల్లు తీసుకునివుంటే బాగుంటుందని నువ్వే ఒకసారి అన్నావుగా."

"అది అయిదేళ్ళ క్రిందటిమాట. ఈ లోపల కాలం చాలా మారింది. నేను ఈ లోపుగా చాలా విషయాలు నేర్చుకున్నా. నాకిలా స్వతంత్రంగా వుండటమే బాగుంటుంది."

"అయినా ఆలోచించు."

"బాగా ఆలోచించే చెబుతున్నా."

నందలాల్ స్వప్నంలోకూడా పరిస్థితులు ఇలా వస్తాయని అనుకోలేదు. మరునాడు కుంవర్ సేన్ గారిదగ్గర ఉద్యోగం ఊడిపోయింది. కాని ఇంకా ఏదొక ఉద్యోగం దొరకకపోదనే గాఢ నమ్మకం మాత్రం వుంది. కువర్ సేన్ గారి దగ్గర కాకపోయినా మరొక వకీలు దగ్గరైనా దొరకకపోదు. ఈ ఆశతో బ్యాంకులోని డబ్బు తీసుకుని ఖర్చుపెడుతున్నాడు. హోటలులోనే ఒక గది అద్దెకుతీసుకుని, అక్కడే భోజనం అవీ తీసుకుంటున్నాడు.

బ్యాంకులోని డబ్బు తరిగిపోవటం మొదలెట్టేసరికి అతనికి విచారం కలిగింది. రాధాకృష్ణను కుంవర్ సేన్ గారి దగ్గరకు పంపాడు. కాని ఫలితం శూన్యమయ్యేసరికి చాలా తీవ్రంగా ఆలోచించవలసి వచ్చింది. ఉద్యోగంకోసం ప్రయత్నంకూడా గట్టిగా ఆరంభించాడు.

ఉద్యోగం ఊడి ఒక నెల దాటిపోయింది.

బ్యాంకు బాలెన్సు రెండువందలకు దిగిపోయింది. చాలా నిరాశ చెందుతున్నాడు. కుంవర్ సేన్ గారి కాళ్ళు పట్టుకుని బతిమాలుకుందామని అనిపిస్తుంది. కాని వెంటనే తను ఆయనమీద వేసిన నిందలు భూతంలా మనస్సులో మెదులు

తుంటాయి. తీరా వెళ్తే ఆయన ఇంటినుంచి కుక్కను గెంటి నట్టు గెంటేస్తే తన గతేమికాను.

తరువాత జీవన్‌లాల్ వకీలుగారి దగ్గర తన చోటులో స్థిరంగా పనిచేస్తున్నాడని తెలియగానే మిగిలిన ఆశకూడా మారమయిపోయింది. ఆఖరుకు ఎటూ తప్పక ఒక పతకం వేశాడు. ముందు జీవన్‌లాల్‌ను పనినుండి తరిమి వేసినట్ట యితే తరువాత వకీలుగార్ని క్షమార్పణ కోరుకుని పనిలో చేరవచ్చును.

అందుకోసమని ఒకరోజున జీవన్‌లాల్‌ను కలుసు కున్నాడు. సబ్ జడ్జికోర్టు బయట ఎవరికోసమో ఎదురుచూస్తూ ఉంచున్నాడు జీవన్‌లాల్. నందలాల్ అతని దగ్గరకువెళ్ళి నమస్కారం పెట్టాడు. జీవన్‌లాల్ అడిగాడు, "ఏమయ్యా! ఎక్కడైనా పని దొరికిందా?"

"నా పని మాట అట్లావుంచు అది దొరకనే దొరుకు తుంది. ఏదో ఒకటి రెండు గంటలు పనిచేశానంటే ఏడెనిమిది రూపాయలు సంపాదించుకోగలను! కాని నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నా."

"చెప్పు."

"గుమాస్తా లందరూ నూటికి పదివంతులు ఫీజు తీసు కుంటారని నీకు తెలుసుగా. అయినప్పటికి నువ్వు ఏడువంతులే తీసుకుంటున్నావు."

"తెలుసు. ఇతర గుమాస్తాలు పదిశాతం తీసుకున్నా నేను తీసుకునే ఏడుశాతమే ఎక్కువన్న సంగతికూడా తెలుసు."

"అయినప్పటికీ నీ వల్ల గుమాస్తా ఫీజు రేటు పడి పోతుందన్న భయం కలుగుతోంది. గుమాస్తా లందరూ కలిసి నిశ్చయించుకున్న దేమంటే, నువ్వు ఇవేళనుంచి పదిశాతం తీసుకో. లేకపోతే అందరూకలసి నిన్ను మరమ్మతుచేయిస్తారు."

జీవన్‌లాల్ నందలాల్ ముఖం చూస్తూ వుండి పోయాడు. దానిమీాదట నందలాల్ అన్నాడు. "నీ ఫీజులో మూాడవవంతు వకీలుగారు తన ప్రేయసికి ఇస్తున్నట్టు అందరికీ తెలుసు."

"ఆ సొమ్ము నీ భార్య కిస్తున్నట్టు నాకు తెలుసు. నువ్వు వకీలుగారి దగ్గర పదహారేళ్ళు పనిచేశావు. నీ కష్టం ఫలితంగా ఆయన ప్రాక్టీసు పెరిగింది. ఇవేళ నీ పరిశ్రమయొక్క ఫలితం నే ననుభవిస్తున్నాను గాబట్టి మూాడవవంతు నీ కుటుం బానికి ఇస్తున్నాను. నాకు విషయమంతా పూర్తిగా తెలుసులే."

"ఇదంతా వట్టి ఆర్భాటం. ఊరికే ఎవరు ఎవరికి సహాయం చేస్తారు? నా భార్య, కూతురు వున్నారు, నా కష్టంలోని భాగం లాక్కొని ఆ కులటలకు పెడుతున్నాడు."

జీవన్‌లాల్ కోపంతో అన్నాడు. "ఇకవాగుడు తగ్గించు నీ విషయం విన్నానులే. ఇక నువ్వు వెళ్ళొచ్చు."

"అదేమీా కుదరుదు జీవన్‌లాల్. రేపటికి కుంవర్ సేన్ గారి నౌకరీ విడిచిపెట్టెయ్యి. లేకపోతే పది శాతం ఫీజు ఇవ్వ మని నోటీసు ఇయ్యి. నీ హక్కు లభించిందా సరేసరి లేకపోతే ఉద్యోగం విడిచిపెట్టెయ్యవలసివస్తుంది. అలా చెయ్యకపోతే నీ ప్రాణాలకే మోసం వస్తుంది జాగ్రత్త."

జీవన్‌లాల్ చేతులు జోడించి, "మంచిది బాబూ! అయినప్పటికీ ఉద్యోగం మానాలంటే కొద్దిరోజులు పట్టనే పడతాయి."

జీవన్‌లాల్ కుంవర్‌సేన్ దగ్గరకు రాకపూర్వం ఒక క్రిమినలు వకీలు దగ్గర పనిచేశాడు. అందుచేత నందలాల్ వంటి దుర్మార్గులతో ఎలా వ్యవహరించాలో అతనికి బాగా తెలుసు.

నందలాల్ దగ్గరనుంచి వెళ్ళిపోయి ఒకచోట కూర్చుని ఒక ప్రార్థనాపత్రం రాయడం ఆరంభించాడు. ప్రార్థనాపత్రం పూర్తిచేసి వకీలుగారి దగ్గరకు తీసుకువెళ్ళాడు. ప్రార్థనాపత్రం లాహోరు డిప్యూటీ కమీషనరుగారి పేరవుంది. దానిలో వ్రాసినదేమంటే :

"అయ్యా!

నేను శ్రీ కుంవర్‌సేన్ అడ్వకేట్‌గారి దగ్గర గుమాస్తాను. వకీలుగారి ఇదవరకటి గుమాస్తా పేరు నందలాల్. అతనియొక్క చెడ్డనడవడిక, చెడుశీలం కారణంగా వకీలుగారు అతన్ని పనినుండి తీసివేశారు. అతను ఇవేళ నా దగ్గరకువచ్చి వకీలుగారి దగ్గర నౌకరు మానకున్నచో నా ప్రాణాలు మిగుల నివ్వనని బెదరించినాడు. నాకు నా ప్రాణరక్షణ విషయంలో భయంగావుంది. అంతచేత ప్రభువులు దయవుంచి నా ప్రాణ రక్షణకు కావలసిన ఏర్పాట్లు చేయవలసినదిగా ప్రార్థన."

"ఇదెలా ఋజువు చేస్తావు?" కుంవర్‌సేన్ అడిగాడు.

"అయ్యా! ఋజువుచేసే బాధ్యతనాది. దయచేసిమీరు మాత్రం అతన్ని ఆ కారణాలవల్లనే తీసివేశానని సమర్థించండి."

"అదిమాత్రం చేస్తానులే."

"అయితే సరేసరి." అని చెప్పి జీవన్‌లాల్ ఆ ఉత్తరాన్ని డిప్యూటీ కమీషనర్‌గారి సమ్ముఖానికి పంపించాడు.

ఉత్తరం చదివి డిప్యూటీ కమీషనర్‌గారు అతన్ని పిలిచి, "ఈ విషయాన్ని నిరూపించడం చాలా కష్టమోయ్."

"అయ్యా! మీరొక ఆఫీసరును దీనికొరకు ఏర్పాటు చెయ్యండి. నేనా విషయాన్ని వెంటనే నిరూపిస్తాను."

"సరే అలానే చేస్తాలే."

నందలాల్ జీవన్‌లాల్‌ను బెదరించాడే కాని, దాని పరిణామం వెంటనే యిలా వస్తుందని అతననుకోలేదు. అందుచేత మరొక పని వెదుక్కునేందుకుగాను కచేరీనుంచి బయటకు వచ్చి ఆలోచిస్తూ, గోల్‌బాగ్ వైపు వెళ్ళాడు. అతను రోడ్డు మీద వెళ్తుంటే తనప్రక్కనే ఇద్దరు స్త్రీలు వెళుతున్నారు. అందులో ఒకామె మెడలో మంచి అందమైన గొలుసువుంది ఆ గొలుసు చూడగానే నందలాల్ మనస్సులో పిశాచం నాట్యమాడింది. ఈ గొలుసు కొట్టేసి నిర్మల కిచ్చినట్టయితే ఒక నెలవరకూ పని జరుగుతుందని అనుకున్నాడు. దాన్ని ఎలా చేజిక్కించుకోవాలా అని ఆలోచిస్తున్నాడు.

స్త్రీ లిద్దరూ టౌనుహాలు, మెయోస్కూల్ ఆఫ్ ఆర్ట్సుకు మధ్యనున్న రోడ్డంట వెళుతున్నారు. ఆ రోడ్డుమీద ముఖ్యంగా జనం ఎవ్వరూవుండరు. ప్రస్తుతం కూడా ఆ రోడ్డు మీద వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు ఎవ్వరూలేరు. దానితో నందలాల్ ఉత్సాహం పెరిగింది. స్త్రీ లిద్దరూ రోడ్డు మధ్యకు

రాగానే వెనుకాలనేవున్న నందలాల్ పిలిచాడు, "అమ్మ గారూ. అమ్మగారూ"

వాళ్ళిద్దరూ ఆగి వెనక్కు తిరిగి అడిగారు, "ఏం ?"

నందలాల్ వాళ్ళదగ్గరగా వెళ్ళి ఒక్కసారి గొలుసు పట్టుకుని పుట్టుక్కునలాగాడు. గొలుసు తెగిపోయి అతని చేతిలోకి వచ్చింది. గొలుసు చేతిలో పట్టుకుని నందలాల్ పరుగుపెట్టాడు. రోడ్డువారనున్న తీగలుదాటి ఆర్ట్సు స్కూలు మైదానంలోకి వెళ్ళిపోయాడు. అక్కడనుంచి జంతు ప్రదర్శన శాల వెనక్కు వెళ్ళిపోయాడు. అక్కడనుంచి తిన్నగా పంజాబ్ పబ్లిక్ లైబ్రరీదగ్గరకు వెళ్ళి వెనక్కు తిరిగిచూశాడు. ఎవ్వరూ రావటంలేదు. ఆ స్త్రీలు కనీసం కేకలయినా పెట్ట లేదు.

ఇవన్నీ ఆలోచించటానికి నందలాల్‌కు సమయంలేదు. అతను తిన్నగా అనార్కలీ బజారునుంచి తన హోటలు చేరు కున్నాడు. హోటల్లో తన గదితలుపులు వేసుకుని జేబులో నుంచి గొలుసు తీశాడు. గొలుసు కొంక్కెం తెగిపోయింది. గోరుతో నొక్కి అతికివేశాడు.

సాయంకాలం నిర్మల వచ్చింది. గత నెలలో నంద లాల్ ఆమె కేమీ ఇవ్వలేకపోయాడు. అందుచేత నిర్మల చాలా కోపంగావుంది. ఇవేళ ఆఖరిసారిగా మాట్లాడి వెళ్ళి పోదామనివచ్చింది. వచ్చిన వెంటనే అంది. ఇదిగో చూడండి! నా తిండీ బట్టకు మీరు ఇవ్వకపోతే నేను మరొకదారి చూసు కుంటానని ముందే చెప్పాను. ఈసారి నెలపైగా అయ్యింది. కాని ఒక్క పైసకూడా ఇవ్వలేదు. రేపు నాకు యాభై

రూపాయలు కావాలి. మీరు ఇవ్వకపోతే మన సంబంధం ఇంతటితో సరని నా ఉద్దేశ్యం."

"నిర్మాలా రాణీ! ఇవేళ నాకు పనిదొరికింది. అక్కడ అడ్వాన్సు తీసుకుని నీ కొక మంచి వస్తువు తెచ్చాను. అది చూడగానే గత విషయాలన్నీ మర్చిపోతావని నా నమ్మకం.

"కాని ఒక్కమాట అడగాలనుకుంటున్నా. నేనంటే సర్వస్వం త్యాగంచేస్తాననేదానివి, అది నిజమా, అబద్ధమా?"

"అబద్ధంకాదు, నిజమే. కాని అది నాకు తిండి, కట్టుకునేందుకుబట్ట, నగలు తెస్తున్నంతకాలమే. మీరు ఒక నెల నుంచి ఏమీ ఇవ్వలేదు. పైగా ఇవ్వటానికి కూడా మీ దగ్గర ప్రస్తుతం ఏమీలేదు."

"నా నౌకరీ పోయినట్టు నీకు తెలియదా!"

"అయితే నేనేం చెయ్యను? మీ నౌకరీ వుంటే నాకేం లేకపోతే నాకేం. నాకుకావలసింది తిండి, నగలు మొదలైనవి"

"సరే ఇక పోనియ్యి. నీ కోసం ఒకమంచి బహుమతి తెచ్చాను."

అలా అని జేబులోని గొలుసు తీసి ఆమె చేతిలో పెట్టాడు. ఆమె గొలుసు చేతిలో పెట్టుకుని చూసింది. చాలా అందంగా వుంది. ఆమె అంది, "పది తులాలదాకా వుంటుందేమో! ఖరీదెంత?"

"ఖరీదు మాటెందుకులే. నీకు నచ్చిందిగా."

"చాలా బావుంది" గొలుసు మెళ్ళోవేసుకుని వెనక్కు తిరిగి నందలాల్ ఎదుట నుంచుంది. నందలాల్ కొక్కెం తగిలించాడు. తరువాత ఆమె లేచి అద్దంముందు నిలబడి చూసు

కుంది. చాలా అందంగావుంది. ఆనందంతో నందలాల్ ప్రక్కన కూర్చుంది.

నందలాల్ మళ్ళీ అన్నాడు. "మానవునికి, పిశాచానికీ ఒకటే భేదంవుంది. మానవుడు చేసిన మేలు మర్చిపోలేడు. పిశాచం మర్చిపోతుంది."

నందలాల్ ఏదో తనమీద కటాక్షిస్తున్నట్టుగా అనిపించింది నిర్మలకు. ఆమె అంది, "అది నిజమే. అందుచేతనే మీరు చేసిన వాగ్దానం నేను మరువలేదు. పిశాచమయితే మర్చిపోయేది."

"కాని నువ్వొక విషయం చెప్పావుగా."

"ఏమిటి ?"

"అదే. నువ్వు ప్రేమంటే పడిచచ్చిపోతున్నావని, అది తృప్తిగా లభిస్తోందని."

"అది నిజమే. ఈ నగలు, బట్టలు, బహుమతులు ప్రేమకు బాహ్యలక్షణాలు. ఇవిలేనిదే ఎవరైనా ప్రేమిస్తున్నట్లు ఎలా తెలుసుకునేది. మీరు అవన్నీ ఇవ్వటం ఆపు చెయ్యగానే మీరు ప్రేమించడంలేదనుకున్నాను."

"ఇప్పుడైనా నీ అనుమానం తీరిపోయిందా ?"

"పూర్తిగా"

ఆ సాయంకాలం చాలా తృప్తిగా, ఆనందంగా గడిచింది. రాత్రి భోజనానంతరం నందలాల్ నిర్మలను తీసుకుని సినిమాకు వెళ్ళాడు. తనగదికి తాళంవేసి మెట్లుదిగుతున్నాడు. ముందు నిర్మల దిగుతోంది, వెనుకాల అతను.

క్రిందకు దిగుతుంటే నందలాల్‌కు ఆ ఇద్దరు స్త్రీలు హోటలులోనికి రావడం కన్పించింది. అతని ముఖం తెల్లపోయింది. కాళ్ళు వణకడం ఆరంభించాయి. గోడమీద చెయ్యి ఆన్చినిలబడ్డాడు. తల తిరిగింది. స్పృహలేకుండా వుండిపోయాడు. క్రిందనుంచి నిర్మల పిలిచింది, "రండి" అని. అప్పుడుగాని స్పృహరాలేదు.

స్పృహవచ్చేసరికి ఆ స్త్రీలిద్దరూ మెట్లెక్కి అతని వైపు చూస్తూ నవ్వుతున్నారు. నిర్మల మెట్లక్రిందనుంచుని పిలుస్తోంది. అతను క్రిందకువచ్చిన తరువాత ఆమె అడిగింది.

"వాళ్ళెవరు ?"

"నాకు తెలియదు. నాకు తల తిరిగింది. హోటలువాడు మాంసంలో కారం ఎక్కువ వేసినట్టున్నాడు."

"వాళ్ళు మనిద్దరివంక చూసి నవ్వుతున్నారు."

"నాకు తెలియదు."

"అయితే నాకు తెలియకుండా మరొకసంబంధం ఏర్పరచుకొంటున్నారా ?"

"అదెలా జరుగుతుంది ?"

"ఏం ? మీ భార్యకు తెలియకుండా నాతో ఏర్పరచుకోలేదా ?"

"నిన్ను, ఆమెను పోలిక ఎక్కడ నిర్మలా ?"

"సరే ! మీ యిష్టమొచ్చింది చెయ్యండి ! నాకెప్పుడూ ఫరవాలేదు !" నాకు రేపు సాయంత్రానికి రూపాయలు కావాలి. అవి ఏర్పాటు చెయ్యండి."

నందలాల్ మాట్లాడలేదు. ఇద్దరూ టాంగా ఎక్కి ఎలిఫిన్‌స్టోన్ థియేటర్‌కు వెళ్ళారు.

11

పరమానంద్ రోజూ స్కూలు విడిచిపెట్టిన తరువాత వకీలుగారి ఇంటికివెళ్ళి అక్కడే చదువుకుంటున్నాడు. జీవన్‌లాల్ చాలా కష్టపడి పనిచేయడం చూస్తున్నాడు. తన తండ్రి రోజూ సాయంకాలం త్రాగి ఇంటికి వస్తుండేవాడు. కాని జీవన్‌లాల్ మాత్రం సాయంకాలం మళ్ళీ వచ్చి మరునాటి కేసులకు సంబంధించిన ఫైళ్ళు తిరుగవేసి కాగితంమీద వాటికి సంబంధించిన వివరాలు నోట్‌చేసి టేబిల్‌మీద వుంచుతున్నాడు. కుంవర్‌సేన్‌గారు రాత్రి క్లబ్బునుంచి వచ్చి భోజనం చేసిన తరువాత టేబిల్ దగ్గర కూర్చునేసరికి మరునాటి పనంతా తయారుచేసి వుండేది. అప్పటివరకూ పరమానంద్ స్కూలు పనిచేసుకుంటూ అక్కడే వుండేవాడు. వకీలుగారు వచ్చిన తరువాత ఇంటికి వెళ్ళిపోయేవాడు.

జీవన్‌లాల్ పనిచూసి కుంవర్‌సేన్ చాలా సంతృప్తి పడేవారు. సాయంకాలం వ్రాసే నోట్సు ఆయనకు బాగా సహాయంగా వుంటోంది.

పరిణామ స్వరూపంగా వకీలుగారి ప్రాక్టీసు పెరుగుతోంది. ఆయన ఫీజు పెంచారు. అయినప్పటికీ చాలామంది ఆయన దగ్గరకే వస్తున్నారు.

జీవన్‌లాల్ శ్రమలో ఒకభాగం తమకు లభిస్తోందనే విషయం పరమానంద్ చిన్న మనస్సులో వుత్పన్నమయ్యింది.

ఎందుచేతనంటే ఆధనంకోసం తనేమీ పనిచెయ్యడంలేదు. తన మనస్సులోని విషయాన్ని తల్లిముందు పెట్టకుండా వుండలేక పోయాడు పరమానంద్. ఒకరాత్రి భోజనం చేస్తూ తల్లితో అన్నాడు, "అమ్మా! వకీలుగారు ఎంత డబ్బిచ్చారు?"

"ఏం, ఎందుకు?"

"ఏమీలేదు. మనకీ డబ్బంతా ఊరికే లభిస్తోంది. జీవన్‌లాల్‌గారి పరిశ్రమతో మనం బ్రతుకుతున్నాం."

"అయితే నువ్వక్కడేమీ పనిచెయ్యడం లేదా?"

"నాకేమీ చేతేకాదు. పైగా పరీక్షలు ఇంకా పది హేనురోజులే వున్నాయి. ఏదైనా పనుంటే చెప్పమని ఒకసారి జీవన్‌లాల్‌ను అడిగాను. 'ముందు చదువుకో, తరువాత చూడచ్చు' అన్నారు."

"ఏమీ! వాళ్ళంతా చాలా మంచివాళ్ళు. వారందరూ సహాయపడకపోతే మనం ఆకలితో మలమలమాడి చచ్చేవాళ్ళం. ఇదంతా ఆ భగవంతుని దయని చెప్పాలి. సరోజినీదేవికి మీ తమ్ముడు నచ్చాడు. మనకు పెద్ద అండ లభించింది."

"కాని అమ్మా! మనం తీసుకున్నదంతా ఈ జన్మలో కాకపోయినా మరొక జన్మలోనయినా తీర్చవలసిందేగా."

లక్ష్మి చాలా తీవ్రమైన ఆలోచనలోపడింది. కొంచెం సేపువుండి అంది. "మనందరికీ తిండి బట్ట ఇవ్వవలసింది మీ తండ్రి అని నా ఉద్దేశ్యం: ఆయనే మీ అందరి జన్మకారకు డూను. మిమ్మల్నందరను పోషించవలసిన బాధ్యత ఆయనదే.

అందుచేత మనం జీవన్‌లాల్ దగ్గర తీసుకునేదంతా మీ తండ్రిగారికి తీర్చవలసివుంటుంది.

"అయితే మనం నాన్న దగ్గరనుంచి పొందేది ఎవరికి, ఎప్పుడు తీర్చాలి ?"

"నువ్వు పెళ్ళి చేసుకుని పిల్లలుకలిగినతరువాత పెంచి పెద్దచేసి చదువులు చెప్పించావంటే నీ ఋణం తీరిపోతుంది. నువ్వు వీలయినంత త్వరలో చదువు పూర్తిచేసి కర్తవ్య భారాన్ని మోయడానికి తయారుకావడం మంచిదని నా ఉద్దేశ్యం. దానితో జీవన్‌లాల్ దగ్గర నీ శ్రమకు తగినంతే మీ నాన్నపేర తీసుకోవచ్చు."

"ఎంత తీసుకోవాలి, అనేది నిర్ణయించడ మెట్లా ?"

"నమ్మకంతో ఎంత అవసరమైతే అంతే తీసుకో. అది మాత్రం నీ తండ్రి నీ కోసం ఇచ్చినట్లవుతుంది."

పరమానంద్‌కు ఈ యుక్తి ఎంతవరకు నచ్చిందో, చెప్పడం కష్టం. కాని పరిణామంగామాత్రం రెండవ ఆలోచన లేకుండా చదువులో లీనమైపోయాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచి ముఖం కడుక్కుని, స్నానాదులు పూర్తిచేసుకుని చదువుకునేందుకు కూర్చుంటాడు. ఉదయం తొమ్మిదిగంటలకు భోజనంచేసి స్కూలుకు వెళ్ళిపోతాడు. అక్కడనుంచి తిన్నగా వకీలుగారింటికి చేరుకుంటాడు. అక్కడ రాత్రి తొమ్మిదిగంటలవరకూ చదువుకుని సుందర్ సేన్‌గారు క్లబ్బునుంచి వచ్చినతర్వాత ఇంటికి వచ్చేస్తుంటాడు.

పరమానంద్ తాను చదివినదంతా సుందర్ కోసం నోట్సు తయారు చేస్తున్నాడు. కాని దానివల్ల తనకు కూడా

చాలా లాభం కలిగింది. అతనికి నోట్సులన్నీ కంఠస్థం వచ్చే శాయి. పరీక్ష ప్రెపరేషన్ శెలవులలో సుందర్ కు అల్ జీబ్రా జామెట్రీ చెప్పాడు. దానితో అవికూడా కంఠతావచ్చేశాయి.

పరమానంద్ ఇంటికి రెండుమూడు ఇళ్లు దూరంలో వుంది సుందర్ లాల్ ఇల్లు. అతని తండ్రి ధనవంతుడు. పైగా ఏకైకపుత్రుడు కావడంవల్ల డబ్బుకు లోటుండేదికాదు. కాని సుందర్ లాల్ తల్లిమాత్రం కొంచెం గయ్యాళిస్వభావం కలది. అందుచేత పరమానంద్ వాళ్ళింటికి వెళ్ళేవాడు కాదు. పరీక్షలుపూర్తయ్యాయి. తర్వాత కుంవర్ సేన్ పరమానంద్ ను తన కార్యాలయంలోనే వుంచుకుని పనినేర్పడం ఆరంభిం చారు. పరమానంద్ వ్రాత బావుంటుంది. అందుచేత నకళ్ళు వ్రాసే పని అప్పగించారు.

డిప్యూటీ కమీషనర్ గారికి అర్జీ దాఖలుచేసి వచ్చిన తరువాత ఆ రోజున ఆఫీసులో పనిచేసుకుంటున్నాడు జీవన్ లాల్. పరమానంద్ కూడా ఏదో ఒక నకలు వ్రాస్తున్నాడు. సాయంకాలం తెల్లని బట్టలువేసుకుని ఒక పోలీసు ఆఫీసరు జీవన్ లాల్ ను కలుసుకునేందుకు వచ్చాడు. అతను డిప్యూటీ కమీషనర్ గారి మనిషి అయివుంటాడని గ్రహించివేశాడు జీవన్ లాల్. కూర్చునేందుకు ప్రక్కనున్న కుర్చీచూపించి, "శెలవివ్వండి" అన్నాడు.

ఆయన కూర్చోగానే ఆరంభించాడు, "నువ్వు వకీలు గారి గుమాస్తా అయినంతమాత్రానఏమనుకుంటున్నావయ్యా? దావా వేసేముందు కారణం గట్టిగా చూపించాలని కూడా

తెలియదా? నందలాల్ నిన్ను చంపుతానని, ఎవరిముందు బెదిరించావు?"

జీవన్‌లాల్ మౌనంగా ఆయన ముఖంవైపు చూస్తున్నాడు.

అతను ఇంకా అన్నాడు, "చూడవయ్యా! పోలీసు వాళ్ళు నీ బాబుగారి నౌకర్లనుకున్నావా? నీ యిష్టమొచ్చినప్పుడల్లా నిజమో, అబద్ధమో చెప్పి వాళ్ళను నీ చుట్టూ త్రిప్పుకునేందుకు ఇది భాగవతమనుకున్నావా? ఇది నీ కోర్టు కాదు. పోలీసు డిపార్టుమెంటు, చెప్పు నీ దగ్గర ఋజువు ఏముంది?"

"సాక్ష్యం వుంది కాని, అసలు నువ్వెవరవు?" అన్నాడు జీవన్‌లాల్.

"నేను పోలీసు ఆఫీసర్‌ను."

"నువ్వు పోలీసు ఆఫీసర్‌లా లేవు. నీ దగ్గర ఋజువు ఏముంది? నా ఉద్దేశ్యంలో నందలాల్ మనిషిలా వున్నావు. అందుచేత వెంటనే గదినుండి బయటకుపో. లేకపోతే కమీషనర్‌కు ఫోను చేస్తాను."

దానిమీదట నవ్వి అన్నాడు, "అయితే పోలీసువాళ్ళను పిలిపించుకో."

"అయితే చూడు." ఈ సమయానికి వకీలుగారు ఆఫీసులో వుండరు. అందుచేత ఫోను జీవన్‌లాల్ దగ్గరనే వుంటుది. టెలిఫోను ఎత్తి డిప్యూటీ కమీషనర్‌గారి ఇంటి నెంబరు తిప్పాడు. జీవన్‌లాల్, కమీషనరుగారి గుమాస్తా అవతల ఫోను ఎత్తాడు. జీవన్‌లాల్ అన్నాడు, "నేను కుంవర్

సేన్ వకీలుగారి గుమాస్తాను. నందలాల్ అనే వ్యక్తి నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నాడని ఇవేళ కమిషనర్ గారికి అర్జీ ఇచ్చాను. ఇప్పుడు ఒకవ్యక్తి ఇక్కడకువచ్చి అయిదు వందలిస్తేనే కానిగదినుంచి బయటకు కదలనివ్వనంటున్నాడు. అతను నందలాల్ మనిషిలా వున్నాడు. మీరు వెంటనే... కాని అతను పారిపోయాడు. మా గేటుకీపర్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు కాని పారిపోయాడు."

డిప్యూటీ కమిషనర్ గారి క్లర్కు కుంవర్ సేన్ను, అయన గుమాస్తాను ఎరుగును. దానిమీదట జీవన్ లాల్ అన్నాడు. "ఏమయ్యా! ఇది నవ్వులాటకాదు. బయట గూండాలు నా ప్రాణాలు తీసేందుకు కాసుకుని వున్నారు."

"మంచిది. నేను సూపరింటెండెంటుకు ఫోన్ చేస్తాను. నువ్వు దగ్గరవున్న పోలీసు స్టేషన్కు ఫోనుచెయ్యి."

జీవన్ లాల్ దగ్గర పోలీసుస్టేషన్కు ఫోనుచేశాడు. స్టేషన్ ఇన్ఛార్జి ఇద్దరు కాన్స్టేబుల్స్ను పంపుతానన్నాడు. కొంచెంసేపు తరువాత సూపరింటెండెంటు దగ్గరనుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఆయన అడిగాడు. "కుంవర్ సేన్ వకీలుగారి ఇంటినుంచి మాట్లాడుతున్నావా ?"

"అవునండి."

"జీవన్ లాల్ వేనా."

"అవునండి."

"నేను పోలీసు సూపరింటెండెంటుని మాట్లాడుతున్నా. డిప్యూటీ కమిషనర్ గారి దగ్గరనుంచి ఫోను వచ్చింది. కొంత మంది గూండాలు నిన్ను ముట్టడించి వున్నారటగా ?"

"అవునండి ! అలాగే అనుకుంటున్నా. లావైన మనిషి ఒకతను లాగూ చొక్కా తొడుక్కొని ఇక్కడకు వచ్చాడండి. రాగానే అయిదువందలిమ్మని దెబ్బలాట పెడుతున్నాడండి. దానిమీదట డిప్యూటీ కమీషనర్ గారికి ఫోను చెయ్యగానే పారిపోయాడండి. కాపలా మనిషి పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒక గుద్దుగుద్ది మరీ పోయాడు."

"సరిగ్గా అటువంటి మనిషినే ఒకడిని నీ దగ్గరకు పంపానే."

"అతను మీ మనిషిలా లేడండి. ఏదో గూండాలా వున్నాడు. రాగానే అయిదువందలిమ్మని కేకలు మొదలెట్టాడు."

"సరే నేనే స్వయంగా వస్తాను."

తరువాత పది నిమిషాలకు సూపరింటెండెంటు, ఒక హెడ్ కానిస్టేబుల్ మోటరు సైకిల్ మీద వచ్చారు. సూపరింటెండెంట్ కాపలామనిషి, పరమానంద్ సాక్ష్యం తీసుకున్నాడు. వాళ్ళుకూడా జీవన్‌లాల్ చెప్పిన ఆనమాళ్ళు చెప్పారు.

దానిమీదట ఆయన అన్నారు; "రక్షణకోసం ఇద్దరు కానిస్టేబిల్స్‌ను ఇక్కడకు పంపిస్తాను. కాని అసలు విషయం ఋజువు కావటమెట్లా ?"

"ధన్యవాదాలండి. ఆ విషయం నాకు విడిచిపెట్టండి. నేను ఋజువుచేయగలనని నాకు పూర్తిగా నమ్మకంవుంది. మీరు, ఒక మేజిస్ట్రేటు, తెల్లబట్టలలో వచ్చి రేపు కచ్చేరిదగ్గర ఏదైనా మిఠాయికొట్లో వెనుకాల దాక్కోండి. నేను నందలాల్ నోటంటనే ఋజువు ఇప్పిస్తాను.

"సరే నేను ఆ ఏర్పాట్లు చేస్తాను."

విషయం నిశ్చయమయిపోయింది. మరునాడు సూప రింటెండెంటు, ఒక మాజిస్ట్రేటు, ఇద్దరు సాక్ష్యులు తెల్లబట్టలు వేసుకుని ఒక మిఠాయి దుకాణంలో తెర వెనుకాల దాగి కూర్చున్నారు.

12

నందలాల్ నిర్మలకు సినిమా చూపించి రాత్రి పన్నెండున్నర గంటలకు ఆమెను ఇంటివద్ద దింపి తన హోటలు గదికి తిరిగివచ్చాడు. గది తలుపులు తీసి లోనికి వెళ్తుంటే ఒక కవరు కన్పించింది. అతని కాలుతగిలి గది మధ్యకు వెళ్ళిపడింది.

అతను అది తీశాడు. దానిమీద ఏమీ పేరు వ్రాసిలేదు. కవరు లోపల ఒక ఉత్తరంవుంది. దానిలో ఇలా వుంది—

"మహాశయా!

నా గొలుసు ఒక అందమైన స్త్రీయొక్క కంఠంలో అలంకరించబడటం చూచి చాలా సంతోషించాను. మీరు గొలుసు ఎత్తుకుపోయినప్పుడు మిమ్మల్ని ఎందుకు పట్టించలేదా అనే విచారం నాకు లేదు. గొలుసు మీకు బాగా అవసరమయ్యుంటుందనే నా ఉద్దేశ్యం నిజమే అయ్యింది. మీ ప్రేయసి కంఠంలో గొలుసు చూసినతరువాత అది తుచ్ఛమైనదైనా బాగా వుపయోగపడిందనుకున్నా.

మీరు ప్రేమకోసం నడిబజార్లో దొంగతనం చెయ్యడం చూసి నేను మీ ప్రేమను ధన్యవాదాలర్పించాలనుకున్నా.

"నేనుకూడా ఒక ముఖ్యమైన పనిలోవున్నాను. మీరు అందులో సహాయపడితే చాలా బాగుంటుంది.

"నేను ఈ హోటల్లోనే 20 వ నంబరు గదిలో వుంటున్నా. మీకు మనస్సులో ఏదైనా చెయ్యాలనివుంటే ఉదయం నా గదిలోకి రావలసింది. ఉదయం ఫలహారం ఇక్కడే తీసుకుందువుగాని."

ఈ ఉత్తరం చదివిన తరువాత నందలాల్ విచారించాడు. ఈ స్త్రీలు తనని పోలీసులకు అప్పగించరు కదా అని భయం వేసింది. ఉత్తరం చాలాసార్లు చదివాడు. అఖరుకు తన మనస్సులోని సందేహాన్ని అణచుకున్నాడు. ఎందుచేతనంటే పట్టించడానికి అది సరియైన మార్గంకాదు. బహుశా వాళ్ళకు తన సహాయం చాలా అవసరమయ్యుండవచ్చు. కలుసుకుని విషయం తెలుసుకోవాలి.

రాత్రి చాలాసేపటివరకు ఈ ఉత్తరం అర్థంచేసుకుందామని ప్రయత్నిస్తూవున్నాడు. ఉదయం లేచి స్నానాదులు ముగించి బట్టలు ధరించి ఇరవయ్యోవ నంబరు గదిలోకి చేరుకున్నాడు. అతను నెమ్మదిగా తలుపులు తట్టాడు. ఒక స్త్రీ తలుపులు తెరిచింది. నందలాల్‌ను చూడగానే చిరునవ్వునవ్వి అంది-"ఓ వచ్చారా, రండి." ఇరవయ్యోవ నంబరు గది రెండు గదుల వాటా. ఒక దాని వెనుక మరొక గదివుంది. ముందు గదిలో కూర్చునేందుకు సోఫాలవీ వున్నాయి. నందలాల్‌ను సోఫాలో కూర్చోబెట్టి ఆమె వెనక గదిలోకి వెళ్ళింది. కొంచెంసేపటిలో ఇద్దరూ బయటకు వచ్చారు.

గది చాలా బావుంది. సోఫాముందు ఒక గుండ్రటి టేబిల్ వుంది. దానిమీద పూలకూజా లున్నాయి. గోడలకు మంచి మంచి దృశ్యాలుగల ఫోటోలు తగిలించి వున్నాయి. కిటికీలకు సిల్కు తెరలున్నాయి.

గొలుసు ఆవిడ వయస్సు ముప్ఫైసంవత్సరాలుంటుంది. ఆమె మెడలోనూ, చెవులకూ భూషణాలున్నాయి. బట్టలు సామాన్యమైనవే. అయినప్పటికీ శుభ్రంగా వున్నాయి.

ఆమె రాగానే నందలాల్ నమస్కారం చేశాడు. ఆమె చిరునవ్వునవ్వి నందలాల్ ప్రక్కనే సోఫాలో కూర్చుంది. కూర్చోగానే అడిగింది, "చెప్పండి, మీ ప్రేయసి సంతోషించిందా?"

"అవునండి."

"భగవంతుడు ఆమెను ఎప్పుడూ అలా వుంచుగాక. చాలా అందంగా వున్నట్టుంది. బహుశా మీరు డబ్బులేక చిక్కుపడుతున్నట్టున్నారు. నా అనుమానం నిజమేనా?"

నందలాల్ తలవంచుకొని అన్నాడు, "లేకపోతే అబద్ధమవుతుందా? విషయమేమంటే ప్రస్తుతం నాబ్యాంకు బాలెన్సు వందరూపాయలకంటె తక్కువగావుంది. నిన్న ఆమె కోరిక అడగ్గానే నేను నిరాశ చెందాను. నిన్న మీరు ఒంటరిగా కన్పించగానే గొలుసు లాక్కొని ఆమెమెడలో పెట్టివేశాను."

దానిమీదట ఇద్దరూ నవ్వుకున్నారు. తరువాత హోటలు సప్లయరు ఉదయపు ఫలహారం తీసుకువచ్చాడు.

పాలు, గ్రుడ్లు, రొట్టెలు, వెన్న మొదలైనవన్నీ అక్కడపెట్టి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక ఒకామె లేచి

తలుపులు లోపల గడియపెట్టి వచ్చింది. ఇప్పుడు ముగ్గురూ మాటలు ఆరంభించారు.

"మీరు ఇదేపని చేస్తుంటారా ?"

"అంటే ?"

"అదే. నడిబజార్లో దోపిడీ."

"లేదండి. అది అత్యవసర సమయంలో చేసిన పని."

"అయితే ఇంకేమి చేస్తారు ?"

"ప్రస్తుతం నిరుద్యోగిని. ఇదివరకు ఒకపెద్ద వకీలు దగ్గర గుమాస్తాను."

"ఎంత కాలం గుమాస్తాగా పనిచేశారు ?"

"దగ్గర దగ్గర పదహారేళ్ళు."

"అయితే మీరు చాలా ఉపయోగకరమైనవారు. అందుచేత మాతో సంబంధం ఏర్పరచుకోండి."

"మీరు ఏం పని చేస్తుంటారు."

"మానవునికి కావలసిన అత్యంతావసర వస్తువుసప్లయి చేస్తాం."

"ఆహారధాన్యాలు అమ్ముతారా ?"

"అంతకంటే అవసరమయినవి-స్త్రీలను."

నందలాల్ ఆశ్చర్యపోయాడు. దానిమీదట ఆమె అంది, "నాకూడా పదిమంది అమ్మాయిల్ని తెచ్చాను. వాళ్ళను ఒక హోటల్లో వుంచాను. కావలసినవారికి సప్లయిచేస్తుంటా

"మాకు ఒకటి కష్టంగా వుంటోంది. ఆడవాళ్ళమైనందున అన్నిపనులూ స్వయంగా చేసుకోలేం. ఈ నసీమ్‌కు

ఎవరెవరికి కావాలో బాగా తెలుసు. అయినప్పటికీ నిన్నంతా ప్రయత్నించేస్తే మూడు బేరాలు దొరికాయంతే.

"సరే మీ పేరేమిటి?" మాట మారుస్తూ అంది.

"మీ పేరు?"

నసీమ్ అంది, "ముందు నీ నామపరిచయం చెయ్యండే ఆయనెలా చెబుతారు?"

ఆమె నవ్వుతూ అంది, "హోటల్లో నా పేరు రామేశ్వరి అని వ్రాయించాను. అసలు నేను మహమ్మదీయురాల్ని. మీ పని మాత్రం రామేశ్వరిగానే గడచిపోతుంది."

"నా దగ్గర పదిమంది అమ్మాయిల ఫోటోలున్నాయి. మేము కావలసిన వాళ్ళదగ్గర కెళ్ళి ఫోటోలు చూపెస్తుంటాము. తరువాత కావలసినచోటకు అమ్మాయిని పంపిస్తుంటాము. కాని ఒకటి కష్టంగావుంది. మాకు ఇక్కడ ఎక్కువగా తెలియదు. అందుచేత కొనుగోలుదార్లు డబ్బు ఇచ్చేటప్పుడు దగా చేసి తక్కువ ఇస్తున్నారు.

"మీరు మా దగ్గర ఆ ఫోటోలు తీసుకువెళ్ళండి. ప్రతి అమ్మాయికి ఒక రాత్రికి, ఒక మగవానికి ఎంత రేటో ఫోటో వెనకాల వ్రాసివుంది. మీరు తెచ్చిన దాంట్లో పదవవంతు మీ కమీషను."

పదవవంతా! గుమాస్తా ఫీజుకూడా పదవవంతే. ఈ పనికి కూడా పదవవంతే. ఈ పని చాలా అపాయకరమైనదని, కమీషన్ చాలా తక్కువని ఆలోచిస్తున్నాడు. కాని కాసేపు ఆలోచించి దానికి అంగీకరించాడు.

13

పదిన్నరనుంచి సూపరింటెండెంట్, మేజిస్ట్రేటు మిఠాయి దుకాణంలో కూర్చుని వున్నారు. జీవన్‌లాల్ నందలాల్‌కోసం తెగ వెదుకుతున్నాడు. ఆ రోజున పన్నెండు గంటలకు బార్ రూమునుంచి వస్తున్నాడు నందలాల్. జీవన్‌లాల్ దగ్గరకెళ్ళి అన్నాడు, "నందలాల్! నువ్వు నా నిద్ర దూరం చేసేశావు"

"ఏం, ఏమయ్యింది?"

"రా, ఒక కప్పు టీ త్రాగి మాట్లాడుకుందాం."

నందలాల్ అతనితోపాటు మిఠాయిదుకాణం దగ్గరకు వెళ్ళాడు. అతను ఉదయం ఫలహారంచేసి నాలుగు గంటలయ్యింది. అందుచేత కడుపులో ఎలుకలు గోలుస్తున్నాయి. ఇద్దరూ మిఠాయిదుకాణం దగ్గరకు చేరి చెరొక కుర్చీలోనూ కూర్చున్నారు. వాళ్ళ వెనుకాల ఒక తెరవుంది. తెరవెనుకాల డిప్యూటీ సూపరింటెండెంట్ మొదలైనవాళ్ళు కూర్చున్నారు. జీవన్‌లాల్ అడిగాడు, "టీ త్రాగుతావా, లేక పూరీలేమైనా తింటావా?"

"ముందు పూరీలు తెప్పించు టీ తరువాతతీసుకోవచ్చు"

నాలుగు నాలుగు పూరీలు తెమ్మని ఆర్డరిచ్చాడు. నౌకరు పూరీలు తెచ్చేందుకు వెళ్ళగానే జీవన్‌లాల్ మాటలారంభించాడు. అతనన్నాడు, "నిన్న కుంవర్ సేన్‌గారి నౌకరీ విడిచిపెట్టకపోతే శాస్తి చేస్తానన్నావు కదూ?"

"అవును; కాని నువ్వు నేను చెప్పింది చేసేందుకు సిద్ధంగా వున్నావా?"

"సంవర్ సేన్‌గారితో చెప్పాను, నన్ను నౌకరీనుంచి తీసివెయ్యమని. ఆయన చాలాబాధపడ్డారు. గుమాస్తా లేకుండా పనిజరిగేట్టు లేదు. నేను విడిచిపెట్టి వెళ్ళిపోతే మరొక గుమాస్తా ఎప్పటికి వస్తాడోనని, అందుచేత ఆయన ఒకనెల అయినా వుండాలన్నారు. ఈ లోపల మరొక గుమాస్తానన్నా వెతుక్కుంటారు, లేకపోతే నా ఫీజు పెంచుతారు."

"అయితే ఆయన నన్ను మళ్ళీ ఎందుకు పెట్టుకోరు?"

"ఆ విషయం నే నాయన్ను అడగలేదు. పైగా నీ బెదిరింపు మాటకూడా ఆయనకు చెప్పలేదు."

"అయితే ఆయనతో చెప్పు, నా స్థానంలో ఎవరిని పెట్టినా వాడి ప్రాణాలు ఖాళీ అని" అన్నాడు.

ఈ లోపల సప్లయరు పూరీలు, కూర తీసుకువచ్చి వారిముందుపెట్టాడు. జీవన్‌లాల్ ఇంకా అన్నాడు," నా ఉద్దేశ్యంలో నీ బెదిరింపు బాగాలేదు. ఈ విషయం పోలీసులకు తెలిస్తే నిన్ను ఇబ్బంది పెడతారు."

"పోలీసులంటే నాకేమీ లెక్కలేదు. ఒకటి రెండు రోజుల్లో నువ్వు నౌకరీ విడిచిపెట్టకపోతే నీ పని బాగా వుండదు, జాగ్రత్త."

"నేను నీకు మరొకమాట చెబుతావిను. నువ్వు నన్నేమీ చెయ్యకుండావుంటే నీకు పనిదొరికేవరకూ రోజూ అయిదు రూపాయలిస్తాను".

"అయిదు ఎవడికి కావాలోయ్? అంతకంటె ఎక్కువే సంపాదిస్తున్నా. ఇవి చూడు?" అని జేబులోనుంచి తీసి అమ్మాయిల ఫొటోలు చూపించాడు.

"ఇవేమిటి ?" అనడిగాడు జీవన్‌లాల్.

"ఇవి అమ్మాయిల ఫొటోలు. ఒకరాత్రికి ఎంత ఫీజో వెనుకాల వ్రాసివుంది. ఇవేళరాత్రికి అయిదుగుర్ని బుక్ చేశాను. రెండువందల యాభై ఎడ్వాన్సు తీసుకున్నా. అందులో పాతిక మనకి."

"వాళ్ళెక్కడ దొరికారు నీకు ?"

"చూడు ! ఇది నీకు బావుంటుంది. దీని ఖరీదు......"

ఇంకా మాట్లాడనీయకుండానే పోలీసు ఆఫీసర్లు బయటకు వచ్చి అతన్ని చుట్టుముట్టారు. వాళ్ళను చూసి నందలాల్ పారిపోదామనుకున్నాడు. కాని సూపరింటెండెంటు భుజం పట్టుకుని పిస్తోలు చూపించాడు కదలవద్దని.

నందలాల్‌ని పట్టుకు తీసుకుపోయారు.

వెంటనే కచేరీలో నందలాల్ పట్టుబడ్డాడన్న సంగతి పాకిపోయింది. చాలా అలజడిగావుంది. రాధాకృష్ణ వినగానే పరుగెత్తుకు వచ్చాడు. దళారు డబ్బు రెండువందలయాభై అతని జేబులో వేసేశాడు, నందలాల్.

సాయంకాలం జీవన్‌లాల్ కార్యాలయానికి రాగానే ఈ విషయం చెప్పలేదు. పరమానంద్‌కు తెలియకుండా వుండాలని అతని ఉద్దేశ్యం. కాని అతనికి తెలియనే తెలిసింది.

కుంవర్‌సేన్ టీ తాగుతూంటే పోలీసులువచ్చి వకీలు గారి స్టేట్‌మెంట్ తీసుకువెళ్ళారు. దానితో పరమానంద్‌కు విషయం అర్థమయ్యింది.

పరమానంద్ ఇంటికి చేరగానే సంగతి తల్లికి చెప్పాడు. తన భర్త జైల్లోవున్నాడని తెలియగానే లక్ష్మి చాలా

దుఃఖించింది. రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. ఇప్పుడు ఏంచెయ్యాలా అని ఆమె మనస్సులోసంఘర్షణజరిగింది. భర్తను విడిపించడానికి ప్రయత్నంచెయ్యమని మనస్సు చెబుతోంది. కాని బుద్ధిమాత్రం "ఏంలాభం?" అంటోంది. కుంవర్ సేన్ గారి దయవల్ల బండి నడిచిపోతోంది. పరమానంద్ ఆయన కార్యాలయంలో పనిచేస్తున్నాడు. కొద్దికాలంలోనే తగినంతగా సంపాదించగలడని గట్టిగా నమ్మకంవుంది. అయినప్పటికీ నందలాల్ తన పతి అని ఏదో అంతర్వాణి ఆదేశిస్తోంది. తను భార్యకావటంవల్ల ఆయనను సహాయపడాల్సిందే. సరోజినిదేవికాళ్ళు పట్టుకున్నట్టయితే ఆమె భర్తతో చెప్పి విడిపించగలదని మనస్సు అంటోంది.

మనస్సుకు, సంస్కారాలకు సంఘర్షణ జరుగుతూనే వుంది. తెల్లవార్లూ నిదురపట్టలేదు. ఉదయమే పిల్లల్ని స్కూలుకుపంపించి, చిన్నపిల్లలతో వకీలుగారి ఇంటికివచ్చింది. కుంవర్ సేన్‌గారు కచేరీకి వెళ్ళేందుకు సిద్ధంగా వున్నారు. ఆయనముందుకు వెళ్ళి లక్ష్మి అంది, "నా భర్త విషయంలో పూర్తిగా తెలుసుకునేందుకు వచ్చానండి?"

"జీవన్‌లాల్ చెబుతాడు."

"నేను ఆయన్ని కలుసుకోవాలనుకుంటున్నా."

"అదికూడా జీవన్‌లాల్ ఏర్పాటు చేస్తాడు."

"నేను ఆయన్ని విడిపించాలనుకుంటున్నా."

అది వినగానే ఆశ్చర్యంతో చూశాడు కుంవర్ సేన్. అశ్రుపూరిత నేత్రాలతో లక్ష్మి ఆయనవంక చూడగానే ఆయన అన్నారు, "సాయంకాలం ఆవిషయం మాట్లాడదాం"

జీవన్‌లాల్ లక్ష్మిని తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్ళాడు. అక్కడ నందలాల్‌ను కలుసుకున్నారు. నందలాల్ మాట్లాడకుండా కూర్చున్నాడు. అతను లక్ష్మిని చూసినప్పటికీ ఏమీ మాట్లాడలేదు. ఏమనాలో లక్ష్మికి కూడా ఏమీ తోచలేదు. జీవన్‌లాల్ అన్నాడు, "ఈమె మీ కేసు వాదించమని వకీలుగారితో చెబుతోంది."

నందలాల్ నవ్వి ఊరుకున్నాడు. కలయిక ముగిసింది. కాని భార్యాభర్తలమధ్య ఏమీ మాటలు జరుగలేదు.

ఆరోజు సాయంకాలం మళ్ళీ కుంవర్‌సేన్‌గారిని కలుసుకుంది లక్ష్మి. కుంవర్‌సేన్ అన్నారు, "అమ్మాయిల దలారీ విషయంలో ఆరోపణ నిరూపించబడదు. ఎందుచేతనంటే ఒక్క అమ్మాయికూడా దొరకలేదు. కాని కేసు నడుస్తుంది. అయినప్పటికీ జామీనుమీద విడిపించవచ్చు."

లక్ష్మి ఏడుస్తూనేవుంది. కుంవర్‌సేన్ ఆలోచించి అన్నారు," కోర్టులోకి కేసు రానియ్యి. తరువాత ఎలా వీలయితే అలా చెయ్యవచ్చు."

14

నందలాల్ పట్టుబడినరోజు సాయంకాలం, నిర్మల యాభై రూపాయలకోసం నందలాల్ గదికి వచ్చింది. నందలాల్ గది తాళంవేసివుండటం చూసి అక్కడ కాసేపు వుండేదా లేక మళ్ళీ తిరిగివచ్చేదా అని ఆలోచిస్తోంది. ఆమె ఇంకా ఆలోచిస్తూండగానే ఇరువయ్యోవనంబరు గదిలో స్త్రీలు సామానంతా బండిలో వేయించివేస్తున్నారు. వాళ్ళుకూడా

నిర్మలను చూశారు. వాళ్ళు చిరునవ్వు నవ్వి దగ్గరకువచ్చి అడిగారు, "నందలాల్ కొరకు వచ్చారా?"

"అవును. ఏం?"

"మా కూడా క్రిందకు రండి. కొంచెం అవసరమైన పని వుంది."

వాళ్ళను గురించి తెలుసుకోవాలని నిర్మలకు కుతూహలంగా వుంది. పైగా నందలాల్ కూడా లేడు. అందుచేత వాళ్ళతోపాటు మెట్లుదిగి వచ్చింది.

వాళ్ళు బండిలో కూర్చోకముందే అన్నారు, "నందలాల్‌ను కలుసుకోవాలంటే పోలీసుస్టేషన్‌కు వెళ్ళండి ఆయన పట్టుబడ్డారు."

నిర్మల తెల్లబోయింది. కంగారుగా వాళ్ళవంక చూస్తోంది. దానిమీదట ఒకామె ఆమెను ప్రక్కకు తీసుకు వెళ్ళి అంది, "మేమిక్కడ ఇక ఒకక్షణం కూడా వుండలేము. నువ్వుకూడా ఇక అతన్ని విడిచిపెట్టెయ్యి. డబ్బు అవసరమైతే ఈ గొలుసు మార్వాడీ దగ్గర అమ్మెయ్యి. ఇదికూడా దొంగిలించిందే."

"అయితే మీ కదంతా తెలుసా?" నిర్మల అడిగింది.

"అవును. ఇది మాదే. నందలాల్ మా దగ్గర దొంగిలించాడు." అలా అని నిర్మల నక్కడే విడిచిపెట్టి, టాంగాలో కూర్చుని వెళ్ళిపోయారు. నిర్మల హోటలు సప్లయర్ని అడిగింది-"వీళ్ళు నందలాల్ పట్టుబడ్డాడంటున్నారు నిజమేనా?"

"అవునండి. ఇంతకుముందే పోలీసులువచ్చి ఆయన గది తనిఖీచేసి వెళ్ళారు?"

"ఆయన ఏం చేశారు?"

"పోలీసువాళ్ళనడం చాలావున్నాయని- దొంగతనం, అమ్మాయిలదలార్, చంపుతా నని బెదరింపు మొదలైనవి."

అది విన్న తరువాత నిర్మల చాలాసేపు ఆలోచించింది. 'గొలుసు కూడా దొంగిలించిందే, దాన్ని అమ్మివెయ్యి' అన్న ఆమె మాటలు ఆమె చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆమె హోటలునుంచి తిన్నగా నగలబజారుకు వెళ్ళింది. అక్కడ ఒక మార్వాడీకి తన గొలుసు చూపించి "ఏమి ఇస్తావు" అని అడిగింది.

గొలుసు చేత్తో పట్టుకుని నిర్మల ముఖంవైపు చూస్తూ అన్నాడు "అమ్మా ఎక్కడనుంచి తెచ్చావు?"

"ఏం?"

"ఇది రాగిదమ్మా. గిల్టునగల కొట్లో ముప్పావలా వుంటుందేమో?"

భయకోపాలతో నిర్మల దేహం వణకింది. ఆమె కళ్ళవెంట అశ్రువులు ప్రవహించాయి. ఆమె కొట్టువాడితో అంది, "నన్ను మోసగించారండీ. ఇలా ఇవ్వండి, తిరిగి ఇచ్చేస్తాను."

అతను ఆశ్చర్యంతో ఆమెముఖం చూస్తూ వుండి పోయాడు. అక్కడనుంచి తిన్నగా ఇంటికి వెళ్ళిపోయింది. గొలుసుదాచివేసి భవిష్యత్తునుగురించి ఆలోచిస్తూ కూర్చుంది.

ఇక నలుగురిలోను ముఖంకూడా చూపించకూడదని మనస్సులో నిశ్చయించుకుంది. నిర్మలతల్లి చాలాకాలంనుంచి

చెప్పుకొంది, నందలాల్‌ను విడిచిపెట్టి ఎవరినైనా పట్టుకోమని. కాని, ఎంతవెదికినా ఆమెకు నందలాల్ స్థానంలో వ్యక్తి దొరకలేదు. పైగా నందలాల్ కూడా ఆమెను నిరాశపర్చలేదు. ఇప్పుడు తన తల్లి సలహా మనస్సులో పట్టుపట్టింది.

నందలాల్ కేసు కోర్టులోకి వచ్చేంతవరకు అతను పోలీసు కస్టడీలోనే వున్నాడు. ఈ లోపల నిర్మల ఒక పెళ్ళి కాని యువకుని చేపట్టింది.

దగ్గర దగ్గర రెండునెలలు కేసు నడిచింది. తరువాత ఒక వెయ్యి జామీను క్రింద, ఒక వెయ్యి హామీ క్రింద కట్టి నట్టయితే విడిచిపెట్టడానికి అంగీకరించారు.

దానిమీదట ఎలా అయినాసరే డబ్బు ఏర్పాటు చెయ్యాలని లక్ష్మి పట్టుపట్టింది. తనే స్వయంగా కేసుపెట్టాను గాబట్టి తనే జామీను ఇవ్వడం కుదరదని కుంవర్ సేన్ గారు అంటున్నారు.

దానిమీదట లక్ష్మికి చాలా బాధకల్గింది. ఆమె తిండి మానేసి మంచంపట్టింది. లక్ష్మి దురాగ్రహంగా కూర్చుందని తెలియగానే కుంవర్ సేన్ సరోజినితో కలిసి ఇంటికి వెళ్ళారు. కుంవర్ సేన్ అన్నారు, "లక్ష్మి! నీ పట్టుదల బాగాలేదమ్మా."

"అయితే ఏం చెయ్యమంటారు?"

"అతను చేసిన అన్యాయానికి ఒక సంవత్సరం జైలు అనుభవించవలసిందే."

"కాని ఆయన నా భర్త! నేను అది చూడలేను."

"లక్ష్మి! నువ్వు మూర్ఖంగా మాట్లాడుతున్నావు! అతను నీకు ఖుష్బుకు ఇవ్వకుండా నీ యిష్టమొచ్చినచోటకు

వెళ్ళుతున్నాడు. తన పిల్లలను చదువుకునేందుకు పుస్తకాలుకూడా కొనకుండా త్రాగుడు త్రాగేవాడు. పరాయి స్త్రీలకోసం నగలు అప్పు కొనేందుకు నీ దగ్గర డబ్బులాక్కొని, నిన్ను కొట్టేందుకుకూడా సిద్ధపడేవాడు. నా ఉద్దేశ్యంలో అతడు తన పాపాన్ని అనుభవించవలసిందే. అలా న్యాయం జరుగకుండా అడ్డుపడేవాళ్ళు స్వయంగా పాపం పంచుకోవలసి వస్తుంది."

ఈ యుక్తులకు, ఈ ప్రశ్నలకు లక్ష్మి సమాధానం తెలియక మాట్లాడక వూరుకుంది. ఆమె తిండి మానివేసి మూడురోజులయ్యింది. చాలా నీరసంతో మంచంమీద పడి వుంది. తన మాటల ప్రభావం ఆమెమీద పడిందనుకున్నాడు కుంవర్ సేన్. ఆయనన్నాడు. "ఇక లేచి పండ్లరసం తీసుకో. నీ మీద చాలా బాధ్యతవుంది. పదిమంది పిల్లల్ని పోషించి చక్కబెట్టడం అటువంటి దుర్మార్గుణ్ణి విడిపించడంకంటె చాలా మంచిపని."

సరోజిని రమను రసం తీసుకురమ్మంది. రమ వంటింట్లోకి వెళ్ళి రసం తీసుకువచ్చింది. కాని లక్ష్మి రసం తీసుకోలేదు. ఆమె అంది, "మీరు నన్ను నా ఆత్మకు వ్యతిరేకంగా చేసేందుకు నిర్బంధిస్తున్నారు. నేను నా ప్రాణాన్ని ఆ భగవంతునికి అప్పగించేశాను. పిల్లలు కూడా అతని భిక్షయే. అందుచేత వాళ్ళనుకూడా ఆయనే చూస్తాడు. ఇక ఈ నిరుపయోగమైన శరీరాన్ని విడిచిపెట్టడం మంచిదని నా ఉద్దేశ్యం."

ఆమె మాటలు వినగానే వకీలుగారు, అతని భార్య ఆశ్చర్యంతో చూస్తూ వుండిపోయారు. కుంవర్ సేన్ తన కర్త

వ్యాన్ని పూర్తి చేశాననుకున్నాడు. ఆయన కేసు ముఖ్యభాగానికి తన పనేమీ బాగాలేదని చెప్పాడు. అయినప్పటికీ ఆమె మొండి పట్టుపడితే తనేమి చేయగలడు ? అందుచేత ఆయన వెళ్ళి పోయేందుకు సిద్ధపడ్డాడు. సరోజినీ ఏదో అందామనుకుంటూంటే వకీలుగారే అన్నారు, "నడు సరోజినీ ! బుద్ధి పనిచేయనిచోట వుండిమాత్రం ఏమి చేయగలం ?"

కొంచెంసేపు ఆలోచించి లక్ష్మికి నమస్కారంచేసి బయలుదేరింది సరోజిని.

దారిలో సరోజిని అంది, "నందలాల్‌ను విడిపించేందుకు ఏదైనా వుపాయం వెదకాల్సిందే."

"ఎందుకు ?" అని ఆశ్చర్యంతో అడిగాడు.

"లక్ష్మి ఏమైనా అయితే, పిల్లల బ్రతుకేమికాను?"

"అయితే పిల్లలపూచీ నేను పుచ్చుకున్నానా?"

"మీరు ఊరికనే కోపపడుతున్నారు. నందాలాల్ జైల్లో వుండటం మంచిదా కాదా అనేది ప్రశ్న కాదు. అనేక మంది అపరాధులు పట్టుబడకుండా తప్పించుకుంటున్నారు. అనేక హత్యలుజరుగుతున్నా, హంతకులందరూ పట్టుబడటం లేదు. దోషులను దండించవలసినపని దేశానిది. కాని మనం మాత్రం మనుష్యులం. ఎవరికైనా ఆపదవస్తే రక్షించవల మనేది మన కర్తవ్యం."

"లక్ష్మి! పరిస్థితుల న్యాయాన్యాయాల్ని పరీక్షించడానికి మన మెవరం? దారంటా వెళ్తుంటే ఒక ఇంటికి నిప్పంటు కుందనుకోండి. అది మనం చూశాం. ఆ ఇంట్లో ఇంటివాని పిల్లలు చిక్కడిపోయారు. వాళ్ళను రక్షించడానికి దగ్గరలో

ఎవరూ లేరనుకోండి. ఆ ఇంటికి ఎవరు నిప్పంటించారు, మంటల్లో వున్నవాళ్ళు ఏమి అపరాధం చేశారు అనే ప్రశ్న లతో నిమిత్తం లేకుండానే పిల్లల్ని అగ్నినుండి రక్షించేందుకు సిద్ధపడతాం. అలాచేస్తే తప్పుచేసినట్లా? ఎవరు అపరాధి, ఎవరు నిరపరాధి అనే విచక్షణ చేసేందుకు మనకు సమయం ఎక్కడుంటుంది?"

కుంవర్ సేన్ నుంచుని సరోజిని ముఖంచూస్తూ వుండి పోయాడు. సరోజిని నవుస్తూ అంది, "సరిగ్గా ఇదేసమయానికి ఏ అదృష్ట వశాత్తో మనం లక్ష్మీ కుటుంబానికి కావలసిన వాళ్ళమయ్యాం. పది ప్రాణాలు ప్రవాహమధ్యలో పడి వున్నాయి. ఇతరు లెవ్వరికీ వాళ్ళ సంగతి తెలియదు. ఏమీ చెయ్యలేరన్న సంగతి మనకు తెలుసు. అటువంటి పరిస్థితుల్లో మనుష్యులం కాబట్టి సహాయపడవలసిన బాధ్యత మనకుంది"

కుంవర్ సేన్ ఏమీ ఎదురు పలకలేకపోయారు. ఆయన అన్నారు, "సరే, నువ్వంటున్నావు కాబట్టి ఏదైనా ఉపాయం ఆలోచిస్తాలే."

సరోజిని ముఖంలో ఆనందం వెల్లువికింది. ఆమె సంతోషంతో అంది, "మీరలా చేస్తారని నాకు తెలుసు"

మరునాడు ఒక వెయ్యి రూపాయలు ప్రభుత్వపు ట్రెజ రీలో కట్టి జీవన్ లాల్ తో వెళ్ళి తన తండ్రికి జామీనుగా వుండ మని పరమానంద్ ను పంపించాడు, కుంవర్ సేన్.

15

చట్టబద్ధమైన కార్యక్రమమంతా పూర్తిచేసి నంద లాల్ ను విడిపించారు. బయటకు వచ్చిన తరువాత పరమా

నంద్ తనకు జామీను ఇచ్చాడని తెలియగానే చాలా ఆశ్చర్య పడ్డాడు. సిటీ మేజిస్ట్రేటు దగ్గర సంతకం పెట్టి బయటకు వచ్చిన తరువాత పరమానంద్ నడిగాడు, "నీకేమీ ఆస్తిలేదుకదా, జామీను ఎలా వప్పుకున్నారు?"

"నేను వెయ్యిరూపాయలు ప్రభుత్వ ట్రెజరీలో కట్టాను."

"ఆ డబ్బు నీ కెక్కడినుంచి వచ్చింది?"

"నాకు తెలియదు. అమ్మ ఇచ్చింది."

"ఆమె ఎక్కడనుంచి తెచ్చింది?"

వెళ్లి స్వయంగా అడగండి. ఆమె నాలుగు రోజులు నుంచి మంచం పట్టివుంది."

"ఎందుకు?"

"మీరు జైలునుంచి బయటకు వచ్చేవరకూ అన్నం తిననని వ్రతం పట్టింది."

నందలాల్‌కు తల తిరిగింది. అతను జైలులోవున్న మూడు నెలలూ బయటకు వచ్చిన తరువాత ఏ బొంబాయో, కలకత్తాయో వెళ్లి జీవనోపార్జన చేసుకోవాలనుకున్నాడు. ఇక లక్ష్మి ముఖంకూడా చూడకూడదని నిశ్చయించుకున్నాడు. పరమానంద్‌తో మాట్లాడకూడదనుకున్నాడు. కాని ఇప్పుడు పూర్తి వ్యతిరేకంగా జరిగింది. తనకు జామీనుగావున్నది పరమానంద్. లక్ష్మి తన కోసం ఆకలితో నాలుగురోజులునుంచి ఉపవాసం చేస్తోంది. అతను అక్కడే కచేరీ బయట ఆరుగు మీరాద తలపట్టుకొని కూర్చున్నాడు.

"నాన్నా వెళ్దామా!"

"ఏమీలేదు. తల తిరుగుతోంది."

అతను పరుగెత్తుకు వెళ్లి గ్లాసుతో నీళ్ళు తెచ్చాడు. నీళ్లు త్రాగగానే కాస్త త్రిప్పు తగ్గింది. అతను లేచి అన్నాడు, "నువ్వు నన్ను కొట్టేవాడివిగా ?"

ఇలా వాదనలో పడకూడదని పరమానంద్ అన్నాడు-

"నాన్నా ఇంటికి నడవండి. అమ్మ పరిస్థితి ఏమీ బాగాలేదు. మీరు వచ్చినట్టయితే ఆమె ఏదైనా తింటుంది"

కర్తవ్య విమూఢునిలా లేచి పరమానంద్‌తో టాంగా ఎక్కాడు. నందలాల్ ఇంటికి వెళ్ళగానే చూశాడు. ఇల్లు మునుపటికంటే బావుంది. పిల్లలుకూడా మంచి మంచి బట్టలు కట్టుకున్నారు. లక్ష్మి పరువుకూడా మునుపటికంటే బావుంది. ఆమె నీరసంగా మంచంమీద పడివుంది. అయినప్పటికీ నందలాల్ రాంగానే కలా, నిజమాఅని కండ్లు నులుముకుని చూస్తోంది. టాంగావాడికి డబ్బులిచ్చి పరమానంద్ లోపలికి వచ్చాడు. "అమ్మా ఇక ఏదైనాతిను. నాన్న విడుదలై పోయాడు."

"ఆ, ఊరుకోరా, ఇంకా నేను జీవించవలసిన అవసరం వుంది."

లక్ష్మి ఆరోగ్యం బాగుపడేసరికి ఒకవారం రోజులు పట్టింది. అప్పటివరకూ నందలాల్ తన ఇంట్లోనే వున్నాడు. అతనికి పరిస్థితంతా అర్థమయ్యింది. కుంవర్ సేన్ గారు తను లేనప్పుడు ఎలా సహాయపడిందీ, పరమానంద్ పని నేర్చుకోవడమూ, అంతా తెలిసింది.

దానిమీాదట అతను జీవన్‌లాల్‌ను లేవగొట్టి అతని స్థానంలో పనిచెయ్యాలా లేక మరొకచోట వెదుక్కునేదా అని ఆలోచించాడు. లాహోరులో మరే వకీలూ తనని పెట్టు కోడన్న సంగతి అతనికి బాగా తెలుసు. చాలా ఆలోచించిన తరువాత ఏదైనా పరాయిచోటకు పోవడం మంచి దనుకున్నాడు.

ఒక రోజున లక్ష్మి అంది, "మీరు వెళ్ళి వకీలుగారికి ధన్యవాదాలు చెప్పిరండి."

"దానివల్ల ఏం లాభం?"

"అది సహజధర్మం. ఆయన మీాకోసం, మీాకుటుంబం కోసం ఇంత సహాయం చేశారుకదా. అటువంటప్పుడు కృతజ్ఞత తెలియపరచడం మీా ధర్మం."

నందలాల్ చాలా అభిమానం తెచ్చుకుని అన్నాడు. "చూడు లక్ష్మి! ఆరోజుల్లో నేను వకీలుగారికి చాలా సహాయపడ్డాను. దాని కారణంగా ఆయనొక వెయ్యిరూపాయ లిచ్చారంటే మహా పెద్ద విషయంకాదు. ఇక నీ పోషణ కిస్తున్నారంటావా, అది నాకు తెలుసు ఎంత కిస్తున్నారో. నీ కుటుంబ గౌరవంమాట నా చేత చెప్పించకు."

"ఏమంటున్నారు? వకీలుగారి కింద మీకేమి స్వార్థం వుంది? ఆయన నెలకు మూడు నాలుగువందల రూపాయ లిస్తున్నారుకదా?"

"నువ్వు కమలను అమ్మివేశావని అందరూ అంటు న్నారు. దాని ఖరీదు నెలకు మూడువందలు ఏమీా ఎక్కువ కాదు."

లక్ష్మి తెల్లబోయింది. కాని ఏమీ అనలేకపోయింది. ఆమె మౌనంగావుండటంచూసి నందలాల్ అన్నాడు, "నువ్వు ఆరోగ్యం పొందేవరకూ వున్నాను. ఇక వెంటనే మరొక పట్టణానికి నౌకరు వెదుక్కునేందుకు వెళ్ళిపోతాను. ఇక్కడ నేను అందరిలోనూ తల ఎత్తుకు తిరగలేను."

"ఇక్కడవుండండి, లేకపోతే మరొకచోటవుండండి. అది మీ యిష్టం కాని మీరు కమలమీదవేసిన ఆరోపణం అబద్ధం, ఎవరు చెప్పారోకాని."

"ఆ నిజానిజాలు చర్చించవలసిన పని నాకు లేదు"

"అయితే దాన్ని ఇంటికి తీసుకువచ్చేస్తా."

"అయితే నింద ఆగిపోతుందా?"

"మరి ఏం చెయ్యను?"

"ఏం లేదు. నీ పని నువ్వు చూసుకో. నేనేదొక పని చేసుకుంటా."

ఈ మధ్య నందలాల్ రాధాకృష్ణను కూడా కలుసుకున్నాడు. జైలుకు వెళ్ళేముందు తనిచ్చిన డబ్బు అడిగాడు. రాధాకృష్ణ దాన్ని ఖర్చుపెట్టేశాడు. అయినా నూటయాభైవరకూ పూడ్చి ఇచ్చాడు.

నిర్మలతో మళ్ళీ సంబంధం ఏర్పరుచుకుందామని చూశాడు నందలాల్. కాని ఆమె పిలిపిస్తే రాలేదుకూడాను. ఒకరోజున దార్లోకన్పిస్తే, "నువ్వెవరవో నాకు తెలియదు" అంది.

ఈ విధంగా నందలాల్‌కు లాహోరులో ఆకర్షణలన్నీ నశించిపోయాయి. లాహోరుమీద విరక్తి కలిగింది. ఒకరోజున ఎవరితోనూ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

మానవుడు

ద్వితీయ భాగము

1

పరీక్షల్లో పరమానంద్ రాష్ట్రంలో ప్రథముడుగా వచ్చాడు. అతని మిత్రుడు సుందర్ కూడా ప్యాసయ్యాడు. కాని థర్డ్‌క్లాసులో. సుందర్ కాలేజీలో చదువాలనుకుంటున్నాడు. తను మంచి ఫుట్‌బాల్ ఆటగాడు కావటంవల్ల తనకు ఏ కాలేజీలోనైనాసరే సులువుగా ప్రవేశంలభిస్తుందని అతని ఉద్దేశ్యం. డి. ఏ. వి. కాలేజీలో అతనికి ప్రవేశం లభించింది.

పరమానంద్ భవిష్యత్తును వకీలుగారు నిర్మించ పూనుకున్నారు. పరీక్షా ఫలితాలు తెలిసిన నాలుగైదు రోజులకు అతన్ని పిలిచి అన్నారు, "పరమానంద్ నీకు కాలేజీలో స్కాలర్‌షిప్పులభిస్తుంది. ముందు చదువాలనుకుంటున్నావా?"

"పండిట్‌జీ! స్కాలర్‌షిప్పు వచ్చినా, నెలకి ఇరవై రూపాయలేగా, ఈ ఇరవై రూపాయలూ నేనేమి చేసుకోను? ఇంటి ఖర్చుమాట అటుంచండి ఇది కాలేజీ జీతానికికూడా చాలదు. నేను వెంటనే సంపాదించడం ఆరంభించి, జీవన్‌లాల్, మీరు ఇచ్చే సహాయాన్ని తీసుకొనడం మానేద్దామనుకుంటున్నా."

"కాని అది చాలా భారమైనపని. ఎలా నిర్వర్తించ గలవు?"

"మీరు నాకు సహాయపడండి. ఏవిధంగా ఎక్కువ సంపాదించగలనో చెప్పండి!"

"కాని మీ అమ్మ నువ్వు ఇంకా చదువాలంటోంది."

అమ్మమాట అలావుంచండి. నేనిక సంపాదన మొదలెట్టాలని నా ఉద్దేశ్యం."

"అయితే టైపు, షార్టుహాండ్ నేర్చుకోటం ఆరంభించు. ప్రస్తుతం నువ్వు నా పర్సనల్ సెక్రటరీగా వుండు. నెలకు యాభైరూపాయ లిస్తాను. నువు టైపు షార్టుహాండ్ నేర్చుకోగానే నీజీతం పెంచుతాను. గుమాస్తాగిరీలోని మూడవవంతు కూడా లభిస్తూంటుంది. దానికోసం నువ్వు జీవన్‌లాల్ కి కూడా సహాయం చేస్తూండు."

ఈ విధంగా పర...నంద్ జీవనచర్య నిశ్చయమయింది. అతను ఉదయం ఎనిమిది గంటలకు భోజనంచేసి వకీలుగారి కార్యాలయానికి చేరుకుంటాడు. ఎనిమిదిన్నరకు వకీలుగారు కార్యాలయానికి వస్తారు. రాగానే ఒక గంటసేపు ఆవేళ కేసులన్నీ తిరగవేస్తారు. తొమ్మిదిన్నరకు పరమానంద్ జీవన్‌లాల్ కచేరికి వెళ్ళిపోతారు. అక్కడ పరమానంద్ జీవన్‌లాల్ చెప్పినపని చేస్తాడు. సాయంకాలం టీ త్రాగి టైపు, షార్టుహాండ్ నేర్చుకునేందుకు వెళ్ళిపోతాడు. అక్కడ నుంచి ఏడుగంటలకు వకీలుగారి ఇంటికి వస్తాడు. అప్పుడు నకళ్ళు అవీ వ్రాయవలసి వుంటుంది. రాత్రి తొమ్మిదిగంటలకు ఇంటికి వెళతాడు.

తన తల్లికిఇచ్చే మూడువందల రూపాయలలోనూ, తన కష్టంకూడా వుందని ఇకనుంచి అనుకుంటున్నాడు పరమా

నంద్. సంపాదించడంలో తన యోగ్యతను పెంచుకునేందుకు షైపు,షార్టుహాండ్ నేర్చుకొనడంలో చాలా కష్టపడుతున్నాడు.

ఇప్పుడు పరమానంద్, అతని తమ్ముళ్ళు, చెల్లెళ్ళకు కట్టుకునేందుకు మంచిబట్టలు, మంచితిండి లభిస్తున్నాయి. పరిణామంగా పిల్లలందరూ బాగా రంగువచ్చి అందంగా తయారవుతున్నారు. చుట్టుప్రక్కలవాళ్ళు ఇదివరకు బీదతనంలో వాళ్లను చూసి మూతి ముడుచుకునే వారు. ఇప్పుడు పిల్లలను మెచ్చుకొనడం, వాళ్ళను బుజ్జగించడం చేస్తున్నారు.

ఇరుగు పొరుగువాళ్ళు ఇదివరకు లక్ష్మి అని పిలిచేవారు. ఇప్పుడు పరమానంద్ తల్లి అంటున్నారు. అప్పుడప్పుడూ పిల్లలందరినీ ముస్తాబుచేసి లక్ష్మి కుంవర్ సేన్‌గారి ఇంటికి తీసుకువెడుతూంటుంది. అప్పుడు ఇరుగు పొరుగువాళ్ళు ఆమెను చాలా వింతగా, గౌరవంతో చూస్తుంటారు.

కమల తరచు కుంవర్ సేన్‌గారి ఇంట్లోనే వుంటుంది. అక్కడ మంచి విశ్రాంతిగావుంది. ఆమెవల్ల సరోజినికికూడా సుఖంగావుంది. వయస్సువచ్చిన ఒకఆడపిల్ల బాధ్యత తగ్గింది, లక్ష్మికి. అందుచేత కమల అక్కడవున్నందుకు ఎవరికీ బాధగాలేదు. వారానికొకసారి ఆమె ఇంటికివచ్చి తల్లిని, తమ్ముళ్ళను, చెల్లెళ్ళనుచూసి వస్తూంటుంది.

కుంవర్ సేన్‌గారు పెంచుకున్న పిల్లవాడికి నామకరణం చాలా సందడిగా చేశారు. ఉదయం నామకరణం జరిగింది. సాయంకాలం మిత్రులందరకూ పార్టీ చేశారు. వెయ్యిమందికి పైగా అతిథులు వచ్చారు. పార్టీ చాలా ఉన్నత స్థాయిలో జరిగింది.

కమలకు పదహారేండ్లొచ్చాయి. అసలు నందలాల్ పిల్లలందరూ చాలా అందంగా, తెల్లగావుంటారు. అందు లోను కమలకు యౌవ్వనం రావటంవల్ల చాలా ఆకర్షణీ యంగా వుంది.

ఒకరోజున ప్రమోద్‌ని తీసుకుని తల్లిగారింటికి వచ్చింది. సందులోకి రాగానే, పొరుగింటి కుర్రాడు రామలాల్ అనే అతను ఎదురు వచ్చాడు. అతనికి వీధిచివర కొట్టువుంది. కమల ప్రక్కకు తప్పుకుని నుంచుంది. "అయినప్పటికీ రామలాల్ ఆమె ప్రక్కకువచ్చి నుంచుని అడిగాడు, "కమలా! నువ్వీ మధ్య కనబడటం లేదే."

"పెద్దమ్మ దగ్గరవుంటున్నా"

"మంచి మజాగావున్నావుకదూ?"

"అవునన్నయ్యా!" అని ఆమె వెళ్ళిపోయేందుకు సిద్ధ పడింది. కాని రామలాల్ అడ్డంనుంచుని, "పిల్లాడి పేరేంటి?" అన్నాడు.

"ప్రమోద్"

"నువ్వు మా యింటికి రావడంలేదేం?"

"ఇదివరకెప్పుడైనా వచ్చానా?"

"నువ్వు చాలా చిన్నదానివిగా వున్నప్పుడు"

"సరే, మళ్ళీ అలా చిన్నదాన్నయినప్పుడు, వస్తాలే."

రామలాల్ నవ్వాడు. కమల మెల్లెక్కి ఇంట్లోకివెళ్ళి పోయింది. రామలాల్ చూస్తూ వుండిపోయాడు.

విషయం అంతటితోనే సమాప్తికాలేదు. రామలాల్ వయస్సు ఇరువైయ్యేళ్ళుంటుంది. నందలాల్ కుటుంబ పరిస్థి

తులు బాగుపడగానే అతను మనస్సులో ఒక కల్పన చేసుకు కూర్చున్నాడు. కమలకు వకీలుగారికి సంబంధం వుందని అతని ఉద్దేశ్యం. దానిమీదట తనుకూడా స్వయంగా ఆమెతో సంబంధం ఎందుకు పెట్టుకోకూడదనుకున్నాడు. వకీలుగారి వయస్సు నలభై అయిదు ఏళ్ళుంటుంది. కాని తను మాత్రం వివాహంకూడా కాని ఒక నవయువకుడు.

అతనికి ఒకరోజు సంఘటన జ్ఞాపకంవుంది. కమలకు ఏడెనిమిదేండ్లు వుంటాయి. తనకు పదకొండు. పిల్లలందరూ దాకుడుమూత లాడుకుంటున్నారు. అతను కమలతో ఒక గదిలో దాక్కున్నాడు. అక్కడ ఇద్దరిలోనూ ఆలింగనం జరిగింది. కమలకు అప్పటిలో ఇదంతా తెలియదు. కాని రామలాల్ మాత్రం అవసరాన్ని జారవిడువకుండా ఆమెను ముద్దు పెట్టుకుని రుచిచూశాడు.

తరువాత ఇద్దరూ కలుసుకునే అవసరమేరాలేదు. రామలాల్ తండ్రిదుకాణంలో కూర్చుంటున్నాడు. కమల, తల్లికి మరొక పిల్లాడు కలగటంవల్ల పనుల్లో మునిగిపోయింది. ఆమె మీాద ఇంటిపనంతా పడింది.

తొమ్మిది సంవత్సరాల తరువాత ఆసంఘటనను జ్ఞప్తికి తెచ్చుకోగానే రామలాల్ మనస్సులో ఆశాకిరణం ఉదయించింది. అదే సాయంకాలం కమల పిల్లాణ్ణి తీసుకుని సందునుండి బయటకు వస్తుంటే, రామలాల్ దుకాణంనుంచి ఆమె దగ్గరకొచ్చాడు. కమల సందేహించింది. కాని రామలాల్ మాత్రం మాటలు ఆరంభించాడు. "ఎక్కడికి వెళ్తున్నావ్?" అని అడిగాడు.

"పెద్దమ్మగారింటికి."

"సరే, పిల్లాణ్ణి ఇలా ఇయ్యి, అంతదూరం తీసుకువెళ్ళే సరికి అలిసిపోతావు."

పిల్లాడు నిద్రపోతున్నాడు, అందుచేత కమలఅంది–

"అక్కర్లేదు. కొంచెందూరం వెళ్తే టాంగా దొరుకుతుంది."

"అయితే అక్కడదాకా అయినా ఇయ్యి."

కొంచెం ఆలోచించి అంది కమల, "సరేతీసుకో"

పిల్లాణ్ణితీసుకునేటప్పుడు కమల వక్షాన్ని అదిమివేశాడు రామలాల్. కమల ఆశ్చర్యంతో అతనివైపు చూస్తుంటే అతను నవ్వుతూ అన్నాడు, "కమలా! జ్ఞాపకముందా? ఒక రోజున దాగుడుమూతలాడుతుంటే ఇంట్లో క్రిందగదిలో దాక్కున్నాం."

"ఏమో నాకు జ్ఞాపకంలేదు. ఎప్పటి విషయం?"

"అబ్బ! అటువంటి విషయాలుకూడా ఎవరైనా మర్చిపోగలరా? నువ్వప్పుడు తొమ్మిదేళ్ళ దానవయ్యుంటావు. నేను పదకొండేళ్ళ వాడినయ్యుంటాను."

"నాకు జ్ఞాపకంలేదు."

"అయితే నేను జ్ఞాపకం చేస్తాను," అని వంగి కమల చెవి దగ్గర ముఖంపెట్టి అన్నాడు, "నేను నిన్ను ముద్దుపెట్టుకోగా, నువ్వుకూడా ముద్దుపెట్టుకున్నావు."

కమల ముఖం కందగడ్డలా ఎరుపెక్కింది. రామలాల్ మళ్ళీ అన్నాడు, "ఆవేళ అనుభూతి ఇప్పటివరకూ మనస్సునుంచి మాయంకాలేదు."

"అయితే కావచ్చు. నాకేమీ జ్ఞాపకంలేదు. రామలాల్ తనచెల్లెలు ముఖాన్ని ముద్దెట్టుకుంటే ఆశ్చర్యమేముంది? చెల్లెల్ని ఎవరైనా ప్రేమిస్తారుగా."

"అయితే మళ్ళా అటువంటి అవకాశాన్ని కల్పించు. జీవితమంతా నిన్ను జ్ఞాపకముంచుకుంటాను."

"అలాగే నష్టమేముంది?" అంటూ కమలకంఠం బొంగురుపోయింది. రామలాల్ కంఠంకూడా బొంగురు పోయింది. "అయితే ఎప్పుడు?" అని అడిగాడు.

వచ్చేనెలలో రక్షాబంధన్ వస్తోందిగా. నేను తోరణం కట్టేందుకు వస్తాను. అప్పుడు మాయింటికిరా. తోరణం కట్టిన తరువాత నీ చెల్లెలు ముఖాన్ని ముద్దుపెట్టుకో. చెల్లెలు అన్నగారి ఆశీర్వచనంతో కృతార్థురాలవుతుంది."

ఇంతలోనే టాంగా కన్పించింది. కమల ప్రమోద్‌ను వళ్ళో తీసుకుని బండిఎక్కి కూర్చొని అంది," అన్నయ్యా! మర్చిపోకు. నేను తోరణం కట్టేందుకు వస్తా!"

2

ఇది జరిగిన కొన్నాళ్ళకు లక్ష్మి కమలను, ప్రమోదను చూసేందుకు వెళ్ళింది. గతసారి రామలాల్‌తో జరిగిన సంగతంతా తల్లికి చెప్పింది, కమల. లక్ష్మి చాలా కంగారుపడింది. వెంటనే కమలవివాహం చేసెయ్యాలనుకుంది. కాని వరుడు ఎట్లా దొరికేది? వరుడు ఎవ్వరూ కన్పించడంలేదు. పైగా వివాహంచేసేందుకు కావలసిన సామగ్రికూడా దగ్గరలేదు. లక్ష్మి అంది, "వాడు చాలా దుష్టుడు. నేను చాలామంచి వాడనుకున్నా. కమలా! ఈసారి వాడు పలిచినా పలకకు."

కొంచెంసేపు ఆలోచించి అంది, "నా ఉద్దేశ్యంలో ఇక నీ వివాహం అయిపోవడం మంచిదని. పదిహేనవ ఏటనే నా పెళ్ళయిపోయింది."

"వివాహమా ?" కమల విచారంగా తల్లిముఖంవేపు చూస్తూ అంది, "అమ్మా! పెళ్ళిచేసుకుని నువ్వింత అనుభవించావుకదా! నన్నెలా చేసుకోమంటున్నావు ?"

"ఏం? వివాహం అందరూ చేసుకుంటారు. అదెప్పుడైనా జరిగేదే !"

"కాదమ్మా! నేనందరిలా మూర్ఖత్వంగా చేయలేను. నేను పెళ్ళిచేసుకోను."

"అలా ఎలా వీలవుతుంది ?"

"ఆ రోజున పెద్దమ్మకూడా అడిగింది. నేను చేసుకోనని ఆమెతోకూడా చెప్పాను. నువ్వనుభవించే కష్టాలన్నీ వర్ణించి చెప్పాను. దానిమీదట ఆమె ఒప్పుకుంది. ఆమె అంది, "కమలా! పెళ్ళి జంఝాటమే కాని అది కాకుండా వుండటం కష్టం. నువ్వుండగలిగితే మంచిదే." ఆవిడ ఉద్దేశ్యంలో ప్రతిమనిషిలోను ఒక అంశం పశుత్వముంటుందట. ఆ అంశం పైకివచ్చినప్పుడల్లా అతను పశువులా ప్రవర్తిస్తుంటాడు. మానవునిలో ఆ అంశం చాలా బలంగా వుంటుంది. దాని నెవ్వరూ ఆపుచేసుకోలేరు. నేనన్నాను-"పెద్దమ్మా! నేను పశువును కాను. నామీద నాకు నమ్మకం వుంది."

"అయినా తల్లీ!" లక్ష్మి అంది, "ఇది లోకం. లోకులు అనేక విధాలుగా అనుకుంటారు. మనం సమాజంలో జీవించా

లంటే దాని ఉద్దేశ్యాలను గౌరవించాలి. మనము వాటిని వ్యతిరేకించలేము."

"అయితే ప్రజలు నన్ను నిందిస్తారంటావు. ఏమని నిందిస్తారు?"

"ఒక యౌవ్వనవతి పరాయివాళ్ళ ఇంట్లో వుండటం చూసి ప్రజలేమైనా అంటే వాళ్ళను ఎలా నోరుమూయించడం?"

కమల కొంచెంసేపు ఆలోచిస్తూ కూర్చుంది. కూతురు వప్పుకుంది అనుకుంది తల్లి. దానిమీదట వరుణ్ణి ఎక్కడ వెదకాలా అనేచింత ఆవరించింది, ఆమె మనస్సులో. లోకులు కట్నం అడుగుతారు.

తనెక్కడినుంచి తేగలదు? ఈవిషయాలనుగురించి ఆలోచిస్తుండగానే కమల అంది, "అమ్మా! ప్రజలేమనుకుంటారా అని ఆలోచిస్తున్నా. లోకులు మూర్ఖులు. పెదనాన్నగారు నాన్నకంటెకూడా పెద్దవారు. ఆయన విషయంలో ప్రజలలా అనుకోవటం తెలివైన పనికాదు. అటువంటి మూర్ఖులకు జడిసి జీవితం నాశనంచేసుకోనటం తెలివైనపని కాదు. అందుచేత నేను పెళ్ళిచేసుకోను. ఈ మూర్ఖుల విమర్శలకు జంకటం నా కిష్టంలేదు."

"సమాజాన్ని వ్యతిరేకించడం మంచిపని కాదమ్మా."

"అమ్మా! నువ్వు విచారించకు."

కొద్దినెలల క్రితం ఇంటిపనులతో నలిగి కృశించివుండే కమల ఈమధ్య సజీవంతో, సచేతనత్వంతో, ఆత్మవిశ్వా

సంతోషం నిండివుండటం లక్ష్మి గ్రహించింది. ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంతో తనకే పాఠం చెబుతోంది.

తనపిల్లల తండ్రియొక్క అస్వాభావిక ప్రవర్తన యొక్క ప్రభావం తన పిల్లలమీద వివిధంగా పడుతున్నదీ ప్రత్యక్షంగా తెలుసుకుంది. ఒక యౌవ్వనవతి పెండ్లి అంటే అసహ్యించుకుంటోందంటే అది తన తండ్రి చూపిన ప్రవర్తనయొక్క ఫలితమే. అతను తనని పెట్టిన కష్టాలఫలితమే. లక్ష్మి ఈ విషయంలో సరోజినితో కూడా మాట్లాడింది. సరోజిని మరొక విషయం లేవదీసింది, "కమలవయస్సు ఇంకా పదహారేళ్ళే కదా! ఈ వయస్సులో పెళ్ళిచేస్తే చదువుకు ఆటంకంవచ్చి ఆమె మనోవికాసం ఆగిపోతుంది."

"కాని అది అనడం వివాహం జంఝాటమట. అసలు చేసుకోనంటోంది."

"చేసుకోపోతే సరేసరి. దానివల్లేమీ పాడవ్వదు. ఆమెకు పెద్దలతో తనమనస్సులోని విషయం వ్యక్తపరచగలిగేంత విద్య లభించవలసిందే."

"మనస్సుయొక్క ఆవేగాలలో పాడయిపోతుందేమోనని నా ఉద్దేశ్యం"

"అమ్మాయి చాలా మంచిది, నే నీ విషయాలలో మాట్లాడతాను." లక్ష్మి పిల్లలందరూ ఒకటే పరిస్థితుల్లో లేరు. కమలకు మనోవికాసానికి లభించే అవకాశాలు తక్కిన వాళ్ళకు లభించడంలేదు.

పరమానంద్ పనిలో బాగా నిమగ్నమయి వుంటున్నాడు. అందుచేత అతనిదృష్టి పెళ్ళివైపుగాని, అమ్మాయిల

వైపుగాని పోవటంలేదు. సదానంద్ కమల, పరమానంద్ల కంటె భిన్నప్రకృతి గలవాడు. చదువంటే ఎక్కువ ధ్యాస్నం కూడా లేదు. కథలు చదవటం, వినడం, విన్పించటంలో అత నికి అభిరుచి ఎక్కువ. ఆటలంటేకూడా మంచి ఇష్టం. అందు చేత శరీరంకూడా బాగా అభివృద్ధిచెందుతోంది. కథా సాహిత్యం చదవడంవల్ల శృంగారరసంవైపు మొగ్గుతోంది అతని అభిరుచి.

సదానంద్ వయస్సు పదునాల్గేళ్ళు పైన వుంటుంది. కౌమర్యావస్థలో వచ్చేమార్పు అతనిలో కన్పిస్తోంది. అతని మనస్సులో అనేక నూతనభావాలు వికసిస్తున్నాయి. అమ్మా యిల విషయంలో చదవడమంటే అతనికి చాలా అభిరుచి. అంతేకాకుండా తనతోటివాళ్ళమీద ప్రభావం సంపాదించా లని ప్రయత్నిస్తుంటాడు.

స్కూలుచదువులో అంత చురుగ్గావుండడు. కాని ఆటల్లో తనకంటె పెద్దవాళ్ళనుకూడా ఢీకించేస్తాడు. పరమా నంద్ ఎప్పుడూ క్లాసులోఫస్టు. పైగా మెట్రిక్లో రాష్ట్రంలో ఫస్టువచ్చాడు. కేవలం మాస్టర్లకు జడిసే ఇంటికిచ్చిన వర్కు చేస్తుంటాడు, సదానంద్. అది సమాప్తికాగానే వీధిలోకివెళ్ళి తక్కినవాళ్ళకు కథలుచెప్పడం, వినడం చేస్తుంటాడు. అతను కథలు చాలాచక్కగా చెబుతాడు. వీధిలోని మగపిల్లలు, ఆడ పిల్లలూకూడా అతని కథలు వినడానికి చాలా ఆత్రుత పడు తుంటారు.

శనివారం సాయంకాలం కమలను కలుసుకునేందుకు వెళ్తున్నాడు సదానంద్. వీధిలో ఆడుకునే పిల్లలు చూశారు

వెంటనే అతన్ని చుట్టుముట్టి "సదానంద్! కథలు చెప్పవా?" అని పీక్కుతిన్నారు.

"ఇవేళ అక్కడగ్గర కెళ్తున్నా. ఇవేళ కాదు."

"అలాకాదు. రేపు ఆదివారంగా. రేపు వెళ్ళొచ్చు."

"అలాకాదు ఈవేళే వెళ్ళాలి."

"ఈవేళ ఎలా వెళతావో చూస్తానుగా," ఒక ఆడ పిల్ల దగ్గరకువచ్చి అంది, "శనివారం కథ రోజు."

మరొక అమ్మాయి వచ్చింది. ఆమె సదానంద్ చెయ్యి పట్టుకుంది.

"అవును సదానంద్ అన్నయ్యా! నీ కథలు విని చాలా ళ్ళయింది" ఆ అమ్మాయిపేరు చమేలీ. దగ్గర దగ్గర సదానంద్ వయస్సు వుంటుంది. ఆమె సదానంద్ చెయ్యి పట్టుకుని ఒక ఇంటిఅరుగుమీద కూర్చోబెట్టింది. సదానంద్ కాదనలేక పోయాడు. అతను కూర్చోగానే అందరూ చుట్టుముట్టి కూర్చున్నారు. అప్పుడు అక్కడ పదిమందున్నారు. కథ ప్రారంభం కాగానే ఇంకా వచ్చారు. కొంచెంసేపటిలో పాతిక ముప్ఫై మంది చేరారు. సదానంద్‌కు ఆనుకుని కూర్చుంది చమేలీ.

ఇక కథవినిపిస్తే గాని లాభంలేదనిపించిన తరువాత సదానంద్ అన్నాడు "అయితే ఏం కథ చెప్పమంటారు?"

"ఇదివరకెప్పుడూ చెప్పనిది." అంది చమేలీ.

"అయితే వినండి" అని ఒక్కక్షణం కళ్ళుమూసుకుని ఏమి చెప్పేదీ నిశ్చయించుకున్నాడు సదానంద్. కథ జ్ఞప్తికి తెచ్చుకుని ఆరంభించాడు.

"ఒక వ్యాపారస్తుడున్నాడు. అతని పేరు ఫరీద్. అతనిది ఈజిప్టుదేశం. అతను అక్కడనుంచి సామాను ఓడలో వేసుకుని ఇతరదేశాలకు వ్యాపారానికి వెళ్ళేవాడు. అతను సామానుఅమ్మి లక్షలు లక్షలు సంపాదించి తన నగరానికి రాగానే అందమైన అమ్మాయి లనేకమంది అతన్ని పెళ్ళాడేందుకు సిద్ధపడ్డారు. అయినప్పటికీ అతనింతవరకూ వివాహం చేసుకోలేదు. ఎవరైనా అమ్మాయి అతని దగ్గరకు వచ్చినప్పుడు, "ఎందుకు వచ్చావు?" అనడిగేవాడు.

"నిన్ను పెళ్ళాడేందుకు."

"మరెవ్వరినైనా ఎందుకు పెళ్ళాడవు?"

"నువ్వు అందగాడవు."

"నువ్వు అబద్ధమాడుతున్నావు. నేను సాధారణమైనవాడను. నా వయస్సు నలభై ఏండ్లు. ఆడవాళ్ళను సంతోషపెట్టడం నాకు తెలియదు"

"తరచు అలాఅనగానే అమ్మాయిలు వెళ్ళిపోయేవారు. ఒకొ్కక్కర్తె "నువ్వు ధనవంతుడవు." అనేది.

"అవును. అదినిజమే. అందుకే నువ్వు నన్ను పెళ్ళాడదలచినట్టు ముందెందుకు చెప్పలేదు? సరే ఇవి తీసుకో."అని ఒక వెయ్యినాణాల సంచిఇచ్చి, "వెళ్ళి ఎవడైనా అందమైన యువకుణ్ణి చేసుకో" అనేవాడు.

ఈవిధంగా అమ్మాయిలందరూ అతనిదగ్గరనుంచి సిగ్గుపడి వెళ్ళిపోయేవారు. వాళ్ళను చూసి అతను తనలోతాను, "ఫరీద్! నీకు రెండవపేరు స్త్రీ" అనుకునేవాడు.

"ఒకసారి అతన్ని గురించి బాగా విన్నఅమ్మాయి ఒక్కర్తే అతనిదగ్గరకు వచ్చింది. ఆమెకూడా ఇతరులలానే వచ్చిందనుకున్నాడు, ఫరీద్. అందుచేత సూటిగా అడిగాడు, "నన్ను పెళ్ళాడేందుకు వచ్చావా?"

అమ్మాయి నవ్వి అంది, "నిన్ను గురించి ఏమనుకుంటున్నావ్?"

"నీలాంటి ముసలివాణ్ణి ఎవరు పెళ్ళాడతారు?"

"అయితే ఏంకావాలి? డబ్బు కావాలా?"

"డబ్బు నాదగ్గరే కావలసినంతవుంది. నాకూ ఓడలున్నాయి. నేను నిన్ను కొనగలను."

"అయితే ఎందుకు వచ్చావు?"

"నీ మనస్సులో ఆవరించిన దుంఖంయొక్క రహస్యాన్ని తెలుసుకుందామని వచ్చాను."

"నాకేమీ దుఃఖంలేదే?"

"నువ్వు అబద్ధం చెబుతున్నావు?"

"ఈ వేళవరకూ ఫరీద్ అబద్ధం ఆడలేదు. వ్యాపారులలో అతను నిజాయితీకలవాడని పెద్దపేరు". ఆ అమ్మాయి తను అబద్ధమాడుతున్నట్టు చెప్పగానే కోపంవచ్చింది. ముఖం కందిపోయింది. అది చూడగానే ఆమె నవ్వుతూ అంది, "ఫరీద్ అన్నయ్యా! ఆడవాళ్ళ బలహీనతమీద నీకు నవ్వడం అలవాటయిపోయింది. కాని నిజం వినడం నీకు ఇష్టంలేదు. ఎప్పుడూ పొగడ్తలతో నిండివుండటంవల్ల నీ దోషాలు మర్చిపోయావు."

"ఇప్పటివరకూ ఫరీద్ అబద్ధమాడతాడని ఎవ్వరూ అనలేదే."

"అయితే అయివుండవచ్చు. నువ్వు ఈ వేళే అబద్ధం మొదటిసారిగా ఆడివుండవచ్చు."

"ఏం అబద్ధమాడాను?"

"నీకు దుఃఖంలేదన్నావు. అబద్ధం."

"అయితే నేను దుఃఖిస్తున్నట్లు నీకు తెలుసా ? నాకేమి దుఃఖంవుంది?"

"నిస్సహాయంగా నీకు దుఃఖంవుంది. ఇంత డబ్బుసంపాదించినా ఆనందించలేనివాడు సుఖపడుతున్నాడనుకోలేము. ప్రతి మూడు సంవత్సరాల కొకసారి సముద్రంమీద ప్రాణాలకు తెగించి ప్రయాణం చేస్తుంటావు. ఇదంతా డబ్బు కోసం కాదు. నీకు లోభమూలేదు. నువ్విదంతా పంచిపెట్టేస్తున్నావు. స్త్రీలంటే నీకు మోహంలేదు. ఈజిప్టులోని అత్యంత సుందరాంగులు కూడా నీకోసం తమ యవ్వనాన్ని అర్పించడానికి సిద్ధంగావున్నారు. అయినప్పటికీ నీకేదో మరొకటి కావలసివుంది. కాని అది నీదగ్గరలేదు. అదేమిటో తెలుసుకునేందుకు వచ్చాను."

అమ్మాయి మాటలు విని ఫరీద్ కళ్ళుమూసుకు కూర్చున్నాడు. అతను చెబుతాడని ఎదురుచూస్తూ కూర్చొంది అమ్మాయి. చాలాసేపు అలానేకూర్చుని తరువాత ఆమె కళ్ళల్లోకి చూస్తూఅన్నాడు, "నాఅంతరాత్మలోని విషయం తెలుసుకుని ఏంచెయ్యగలవు?"

"నా ఉద్దేశ్యంలో నీకు లాభమే కలుగుతుంది. దాని తోపాటు నీమీదఅందరూవేసే అపవాదులు తొలగిపోతాయి."

"సరే అయితేవిను. ఇంతవరకూ ఆవిషయం ఎవ్వరికీ చెప్పలేదు. నీలో సానుభూతి కన్పిస్తోంది. అందుచేత నీకు చెప్పేందుకు సిద్ధపడుతున్నా.

"నాకప్పటికి పంతొమ్మిదేళ్ళ వయస్సువాడిని. నా జన్మలో అదే మొదటిసారి, ఆఖరిసారి కూడాను, వ్యాపారానికి వెళ్ళాను. ఆఫ్రికాతీరమంట పశ్చిమానికి వెళ్ళాము. యాత్ర [illegible] వారాలయినప్పటికీ మాకు నగరమేదీ కన్పించలేదు. ఒకవైపున, అపారసాగరం మరోకవైపున పర్వతాలు, [illegible], ఎడారులతో కూడిన ఒడ్డు.

"ఓడలో ఇరవైమందికి పైగా యాత్రికులమున్నాము. వందమందికి పైగా పనివాళ్ళున్నారు. అందరిలోనూ నేనే [illegible]. అందుచేత అందరూ నన్ను ప్రేమించేవారు.

"పున్నమరాత్రి చంద్రునికి నలువైపులా మేఘాలు ఆవరించాయి. ఇవన్నీ తుఫాను సూచనలు. పనివాళ్ళు తెరలు దించి ఓడను ఒడ్డుకు తీసుకువస్తున్నారు. ఓడ గట్టుకు అర మైలులో వుంది. ఇంతలోనే తుఫాను తీవ్రంగావచ్చి ఓడను సముద్రంలోకి నెట్టివేసింది. ఓడ కెరటాలకు ఊగుతోంది.

"మేమంతా భగవంతున్ని ప్రార్థిస్తున్నాం. కాని మా దురదృష్టవశాత్తు వ్యతిరేకంగా జరిగింది. ఒక పెద్దకెరటం రాగానే మాఓడ తల్లక్రిందులయిపోయింది.

దానితో చాలామంది నీటిలో మునిగిపోయారు. నేను కూడా [illegible] వేస్తున్నా. ఇంతలో నాకాలికి ఏదో తగి

లింది. నన్నెవరో పైకి ఎత్తుతున్నట్లనిపించింది. ఓడ ముక్కలయి పోయినట్టుంది. ఒకపెద్దకర్ర ఒకటొచ్చి నన్ను తగులుతుంది. అది తేలుతుంటే నాకెవ్వరు తోసింది. దాంతో అది పట్టుకుని నేను నీటిపైకి వచ్చాను.

"తుపాను ఇంకా తీవ్రంగా వుంది. అంతవరకు భయంతో దాన్ని కౌగిలించుకుని వున్నాను. [illegible] తుపాను ఆగిపోయింది. నేను సముద్రం మధ్యలో కర్రమీద తేలుతున్నాను.

వెన్నెల వచ్చింది. నలువైపులా సముద్రం [illegible] వుంది. ఓడలోనివారెవరూ ఎవ్వరూ కనిపించటంలేదు. [illegible] కర్ర ఆ కర్రసహాయంతో నన్ను నేను దక్షిణంవైపు గట్టుకు [illegible] కున్నాను. కెరటాల సహాయంతో గట్టుచేరాను [illegible] గట్టుచేరగానే నాకు నిద్రపోవాలనిపించింది. [illegible] చోటు చూసుకుని పడుకున్నాను. నిద్రలేచేసరికి [illegible] నేల మెరిసిపోతోంది. నేను లేచి కూర్చున్నాను. [illegible] చాలా నొప్పులుగావుంది. బాగా దాహం వేస్తోంది [illegible] దగ్గరకు వెళ్ళి కడుపునిండా నీళ్ళు త్రాగుదామనుకున్నాను [illegible] ఉప్పునీళ్ళు త్రాగటంవల్ల వచ్చే పరిణామాలు విన్నాను. [illegible] పోతే మంచినీరు ఎక్కడ దొరుకుతుందా అని ఆలోచిస్తున్నా [illegible] నలువైపులా చూశాను. కాని ఏమీ కనిపించలేదు. [illegible] వైపున దూరంగా ఏవో కొండలు కనిపిస్తున్నాయి. [illegible] కంతా [illegible] అనిపించింది. [illegible] కొంచెం దూరంలో పెద్ద పెద్ద ఇసుకదిబ్బలున్నాయి. [illegible]

[illegible]

నేను ఆదిబ్బలుఎక్కగానే ఆశబ్దం స్త్రీలకలవరంలా గోచరించింది. మనుష్యుల కంఠస్వరాలు వినిపించగానే నాకు ఆనందం వేసింది.

“నేను దిబ్బపైకి ఎక్కగానే నాకొక మనోహర దృశ్యం కన్పించింది. సముద్రం భూమిలోకి చొచ్చుకు రావటంవల్ల ఒకసరస్సుగా ఏర్పడింది. అందులో కొంతమంది స్త్రీలు స్నానం చేస్తున్నారు. అందరూకూడా నగ్నంగా వున్నారు. స్నానం చేస్తూ అనేక విధాలుగా అల్లరిచేస్తున్నారు. కొంతమంది గట్టు మీద గంతులువేస్తున్నారు.

“నేను చాలాసేపు ఈ ఆనందదృశ్యాన్ని చూస్తూ నిల్చున్నాను. వాళ్ళ ఆటలు చూస్తుంటే నా దాహంకూడా మర్చిపోయాను.

“నేను దిబ్బదిగి సరస్సువైపు వెళ్తుంటే ఒక స్త్రీ నన్ను చూసింది. అక్కడ మగవాళ్ళెవ్వరూ రారనే ఉద్దేశ్యంతో వాళ్ళు నిశ్చింతగా బట్టలువిప్పి స్నానంచేస్తున్నారు. నన్ను చూడగానే ఆశ్చర్యపోయారు. కాని వెంటనే సముద్రంలోకి భుజాలవరకూ నీళ్ళలోకిదిగి నుంచున్నారు. భయంతో నావైపు చూస్తున్నారు.

“నేను వాళ్ళబట్టలుకోసం నలువైపులా చూశాను. బట్టలు వాళ్ళకు విసిరివేసినట్టయితే కట్టుకుంటారు కదా అనుకున్నాను. తరువాత నేను నా విషయం మాట్లాడవచ్చు. కాని వాళ్ళబట్టలు కన్పించలేదు.

“నేను గట్టుమీదనుంచుని ఏదో అందామనుకుంటున్నా. వాళ్ళందరూ ఒక యువతిచుట్టూ మూగివున్నారు. ఆమె వారి

యజమానురాలులా వుంది. నేను గట్టుమీద అలానే నుంచుని వుండేసరికి ఒక స్త్రీ నావైపు తిరిగి అంది, "నీవెవ్వరవు ?"

"ఆమె నా భాషలోనే మాట్లాడటంచూసి నాకు ఆశ్చర్యం, ఆనందం వేశాయి. నేను నా పరిస్థితినంతా గట్టిగా వెల్లడించాను. "నేను చాలా దాహంతో వున్నాను. నాకు నీళ్ళుకావాలి." అని అన్నాను. దానిమీదట, వాళ్ళు ఏదో మాట్లాడుకున్నారు. తరువాత ఆ స్త్రీ నాతో అంది, "నువ్వు ముఖం నేలమీద పెట్టుకుని కళ్ళుమూసుకో. మా నై చూడకు. మేము బట్టలు కట్టుకునేందుకు వెడుతున్నాం.'

"నాకు మళ్ళీ దాహం తీవ్రంగా వేస్తోంది. ఆ ఏమీ అనకుండా ముఖం నేలవేపు పెట్టుకు పడుకున్నా వాళ్ళందరూ పైకిలేచివచ్చారు. మధ్య ఎవరో పున వాళ్ళందరూ చుట్టూమూగి గబగబా గుట్టఎక్కి వెనుకా వెళ్ళిపోయారు. నేను చూడనని మాటఇచ్చినా, చూడకుండా వుండలేకపోయాను.

"వాళ్ళందరూ తెల్లగా, అందంగా, పుష్టిగా వున్నా వాళ్ళు గుట్టవెనకకు వెళ్ళగానే నేను లేచినుంచుని ఆ చూస్తున్నా.

"కొంచెంసేపు పోయిన తరువాత ఒక యువతి తో బట్టలుకట్టుకుని నీళ్ళు తీసుకునచ్చింది. నేను దోసిలిపట్టగా ఆ పోసింది. త్రాగాను. అవి నీళ్ళనుకున్నాను కాని, నీళ్ళుకాద ఒకరకమైన కల్లు. నేనడిగాను, "ఇది మద్యంలావుందే."

"ఆమెఅంది. "అవును మద్యమే. కానిదీనివల్ల దాహ కూడాతీరుతుంది." నేనుఆస్త్రీనడిగాను," ఇకనేనుఎటువెళ్లను?

"నీ ఇష్టం."

"మీకూడా పొమ్మంటోంది మనస్సు."

"నాకూడానా?" ఆశ్చర్యంతో అడిగింది.

"ఇంకెక్కడికి వెళ్ళను? నేను పరదేశిని. ఎటు వెళ్ళాలో తెలియదు!"

"అయితే ఆగు. రాజకుమారి నడిగివస్తా."

"ఆమె ఆ గుట్ట వెనుకకు వెళ్ళింది. చాలాసేపటి తరువాత ఆమె వచ్చింది. ఆమె అంది, "నువ్వు మా బందీగా అవుతే నిన్ను తీసుకువెడతాము."

"నేను దానికితయారుగా వున్నాను." అన్నాను. నాకు ఉత్సాహం నిగ్రహించలేను. తరువాత ఆమె ఒక త్రాడు నాకు కట్టివేసింది, ఆవునో, గేదెనో కట్టినట్టుగా. అప్పు ఆ యువతులందరూ బట్టలు కట్టుకుని గుట్ట వెనుకాలనుంచి ఇవతలకి వచ్చారు. వాళ్ళ వెనుకాల నాలుగు సవారీబళ్లు వచ్చాయి. వాటిని ఒంటెలు లాగుతున్నాయి.

"నాపీకకు కట్టిన త్రాడుపట్టుకుని నన్ను ఆ యువతి ఒక అందమైన యువతి ముందుకు తీసుకుపోయింది. నేను ఆమెను చూడగానే ఆ ఆకర్షణకు లొంగిపోయాను. అది కళ్లు యొక్క ప్రభావమూ లేక నాలో ఏ అంతరిక ప్రేరణవల్లనో తెలియదు. నవ్వుతూ వంగి నమస్కరించాను. దానిమీదట ఆమె. "ఇతన్ని నాబండిలో ఎక్కించండి" అంది.

"నా మెడత్రాడు పట్టుకుని, లాక్కుంటూ తీసుకువెళ్ళి పెట్టెలాగున్న ఒక బండిలో కూర్చోబెట్టింది. నన్ను ఆ పెట్టెలో సుఖాన కూర్చోబెట్టింది. పెట్టె కింద చక్రాలున్నాయి. తరు

"ఆఖరుకు మూడవరోజు రాత్రి నేను నిరాశ చెంది నిద్రపోతున్నా. ఇంతలోనే ద్వారం తెరుచుకుంది. నేను ఉలిక్కిపడి లేచినుంచుని ఏదో అందామనుకుంటూంటే "ఉస్సు..." అని నన్ను మాట్లాడవద్దంది.

"చీకటిలో ముందు నాకు పురుషుడయ్యిందీ స్త్రీ అయ్యిందీ తెలియలేదు. పిమ్మట ఆ వచ్చిన వ్యక్తి చెవుదగ్గర ముఖంపెట్టి "రాజకుమారి పిలుస్తోంది" అన్నది.

"నేను ఉలిక్కిపడ్డాను. దానిమీదట ఆమె నాచెయ్యి పట్టుకుని నొక్కింది. ఇక ఆలోచించకుండా ఆమెకూడా వెళ్ళాను.

"నన్ను తీసుకువెళ్ళిన వ్యక్తి ఫ్రూంగీ. మేము గదినుంచి బయటకు రాగానే ఆమె గదితాళం వేసేసింది. మేము ఆ యింటినుంచి బయటకు రాగానేచూస్తే ద్వారపాలకుడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. తాళంచేతులు [illegible] నన్ను ఇంటినుంచి బయటకు తీసుకువెళ్ళింది. మేము రాజమహల్ వెనకవైపునుంచి వెళ్ళాము. అక్కడ ద్వారందగ్గర స్త్రీలు కాపలా కాస్తున్నారు. మమ్మల్నెవరూ అడ్డుచెయ్యలేదు. ద్వారంనుంచి లోపలికివెళ్ళి వరండాలోని మరొకద్వారందగ్గర నుంచున్నాం. ఫ్రూంగీ తలుపుకొట్టగానే తెరుచుకుంది.

"మేము లోపలికివెళ్ళాము. అక్కడనుంచి ఒక సందు లాంటిమార్గంవుంది. కొంతదూరం ఆసందవెంట వెళ్ళినతరువాత మరొకద్వారం తగిలింది. అక్కడ సైగచెయ్యగానే అది కూడా తెరుచుకుంది. ద్వారపాలకురాండ్రు మమ్మల్ని అడ్డగించలేదు. మేమొక వెలుతురుతో నిండిన గదిలోకి చేరు

కున్నాము. ఫ్రాంగీ నన్నక్కడనుంచోబెట్టి మహాకద్వారం గుండా వెళ్ళిపోయింది.

"రెండు మూడు క్షణాలలో ఫ్రాంగీ వెళ్ళిపోయిన ద్వారంనుంచి రాజకుమారి వచ్చింది. రాజకుమారి రాగానే నన్ను కౌగలించుకుంది. నేనామెను నాబాహువులలో నలిపి వేశాను. ఆమె అలా కౌగలించుకుని అంది, "నాతండ్రి నా వివాహం మా పినతండ్రి కొడుకుతో చేస్తున్నారు. అత నంటే నా కసహ్యం. నిన్ను కలుసుకోకముందు వివాహానికి అంగీకరించాను. కాని ఇప్పుడు చేసుకోను. ఈవేళ నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఇక్కడనుంచి మనమిద్దరం పారిపోదాం."

"నాతో వివాహమా ?"

"అవును. ఇప్పుడే, ఇలారా." అని నన్నొక నీటిగుండం దగ్గరకు తీసుకువెళ్ళింది. రాజకుమారి నాతో అంది, "ఈ కుండంలో స్నానంచెయ్యి. ఇవి నీ బట్టలు. ఇవి కట్టుకునివచ్చి వెయ్యి, తొందరగాచెయ్యి. సగంరాత్రి గడచిపోయింది."

"అటువంటి ఆనందదాయక విషయానికి నేనెందుకు ఆలస్యంచేస్తాను? స్నానంచేసి, బట్టలు కట్టుకున్నాను. అప్పటికి ఫ్రాంగీవచ్చి నాముఖంమీద, వంటికి సుగంధద్రవ్యాలు రాసి రాజకుమారి పడకగదిలోకి తీసుకువెళ్ళింది. ఆమె సున్నాం దగ్గర నాకోసం ఎదురుచూస్తోంది.

'తెల్లవార్లూ మేము ప్రేమలో మునిగితేలాము. సూర్యోదయానికి ముందులేచాము. రాజకుమారి నన్నొక ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళింది. అక్కడ కూర్చుని నాతో అంది, "వివాహంమాట అమ్మతో చెబుతాను. నాన్న ఒప్పు

కుంటే సరేసరి, లేకపోతే మనం రేపు ఇక్కడనుంచి పారి పోదాం. ఇక్కడకు డెబ్భైమైళ్ళదూరంలో నైలునదివుంది. ఆ నదీతీరంలో అనేక నగరాలున్నాయి. అక్కడకుపోయి సుఖంగా జీవిద్దాం.

'నేను రోజంతా గదిలో బందీగావున్నాను. గదిలో వెలుతురుకోసం పైన ఒక కిటికీవుంది. రాత్రి అయినట్టు దాని వల్ల తెలియగానే నేను రాజకుమారికోసం ఎదురుచూస్తూ నుంచున్నా. సగంరాత్రి అయిపోయాక పూంగీవచ్చి నన్ను రాజకుమారి శయనాగారంలో విడిచి వెళ్ళింది. అక్కడ మేము భోజనంచేసి, మద్యపానంచేశాము. గతరాత్రికంటే ఎక్కువగా ప్రేమలో మునిగి తేలాము.

'ఉదయం రాజకుమారి చెప్పింది, తనతండ్రి ఈ వివాహానికి యిష్టంగాలేడని. ఎల్లుండి ఆమె వివాహం తన పినతండ్రి కొడుకుతో జరపటం నిశ్చయమయిందట. అమ్మ మరొకసారి ప్రయత్నంచేస్తుంది. వప్పుకోనకపోతే రేపుపారిపోదాం, అంది.

'నిన్నటిరోజున వుంచిన గదిలోకి తీసుకువెళ్ళి మళ్ళీ వుంచింది నన్ను. రోజు గడిచేకొద్దీ నా ఆశలన్నీ మాయమయి పోతున్నాయి. రాజకుమారికాని, పూంగీకాని రాలేదు.

'ఆరోజు అర్ధరాత్రివేళ ద్వారం తెరుచుకుంది. రాజ కుమారి వచ్చింది. గదినుంచి బయటకు తీసుకువచ్చి నాకు ఆహారంపెట్టింది. తరువాత నన్ను మహల్‌లోనికి తీసుకువచ్చిన దారివెంట బయటకు వెళ్ళిపోయాం.

'మేము నగరంయొక్క తూర్పుద్వారందగ్గరకు చేరు కున్నాం. అక్కడ మాకోసం ఒక ఒంటెవుంది. రాజకుమారి

నన్నుకూర్చోబెట్టి తనుకూడా వెనుకాల కూర్చుంది. తరువాత ధ్రువనక్షత్రంచూసి తూర్పువైపుగా వెళ్ళాము.

'నైలునది [illegible]ఏభైమైళ్ళదూరంలో వుందన్న అంచనా తప్ప లేక దారితప్పామో తెలియదుకాని, అయిదురోజులు ప్రయాణంచేసినా నదిరాలేదు. మరిమూడురోజులు ప్రయాణం చేసినా నదిరాలేదు.

'మాదగ్గర త్రాగేనీరయిపోయింది. భోజనసామగ్రి కూడా అయిపోయింది. అన్నిటికంటే ముఖ్యవిషయం, మా ఒంటె దాహంతో చచ్చిపోయింది. మేము నలువైపులా పరిశీలించి సూర్యుడు ఉదయించేవైపు కాలినడకన ప్రయాణం సాగించాం. మేము చేతిలోచెయ్యి వేసుకుని వెడుతున్నాం. మధ్యాహ్నం రాజకుమారి అంది, "నేను నాప్రాణాలతోపాటు నీ ప్రాణాలుకూడా తీసినందుకు విచారిస్తున్నా. ఇక నేను బ్రతుకుతానన్న ఆశలేదు. మహాఅయితే సాయంకాలం వరకూ వెళ్ళగలం, తరువాత.....తరువాత... ..." అంటూ ఆమె కన్నీళ్ళుకార్చింది. నేను ఆమెను ముద్దుపెట్టుకున్నా. ఆమె నాకౌగిలిలో ఒదిగిపోయి అంది, "మనం లక్ష్యాన్ని చేరుకోకపోతే నన్ను నీవడిలోనే చనిపోనియ్యి."

'సమయం ఊరికే వ్యర్థపుచకూడదనుకున్నా. తూర్పుగా బయలుదేరాం. మధ్యాహ్నమయ్యింది. సాయంత్రమయింది. కాని నదిజాడకూడా కన్పించలేదు. రాజకుమారి బాగా అలసిపోయింది. కాళ్ళుతూలిపోతున్నాయి. అయినప్పటికీ నెమ్మదిగా నడుస్తున్నాం. నాభుజం పట్టుకుని నడుస్తున్నదల్లా ఒక్క-సారి భూమిమీదపడిపోయింది, రాజకుమారి. నా [illegible]

ఎండిపోయి బెరడులా తయారయ్యాయి. అయినప్పటికీ ఆమె పెదాలుమీద పెట్టి ఆమె నాలుకను తడిచెయ్యటానికి ప్రయత్నించాను. కాని ఏమీ లాభంలేకపోయింది. ఆమె ఊపిరి సరిగా ఆడటంలేదు. నిస్పృహగా పడిపోయింది. ఇంకేమీ చెయ్యలేకపోయాను, ఆమెను గుండెలకు హత్తుకుని కూర్చున్నాను. నెమ్మదిగా ఆమె ఊపిరి ఆగిపోయింది. అలా నాచేతులలోనే ప్రాణాలు విడిచింది.

'గత పదిరోజులూ ఆమెతో కలిసివున్నాను. అవి నాజీవితంలో అత్యంత ఆనందకరమైన రోజులు. ఆమె నన్ను తనివితీరా ప్రేమించింది. నాప్రేమవల్లనే రాజ్యాన్నీ, తల్లి తండ్రులను విడిచివచ్చింది. చివరకు ప్రాణాలుకూడా అర్పించింది.

'ఆమె ప్రాణాలుపోగానే నిరాశచెంది నేనుకూడా అక్కడేపడుకున్నా. అక్కడేపడుకుని ప్రాణాలువిడిచి పెట్టెయ్యాలని నిశ్చయించుకున్నా. అర్ధగడియకూడా కాలేదు, నన్నెవరో చెయ్యిపట్టుకుని నుంచోబెట్టారు. నేనులేచి చూశాను. రాజకుమారి నాముందు నుంచుంది. ఆమెలో ఏదోకాంతి ప్రకాశిస్తోంది. ఆమెశవంకూడా అక్కడేవుంది. నేను ఎదుటనుంచున్న రాజకుమారిని చూస్తూవుండిపోయాను. ఆమె నవ్వుతోంది. ఆమె చేతితో తన వెనుక రమ్మనిసైగచేసింది. నేను మళ్ళీ శవంవేపు చూశాను. కాని ఆమె పిలుస్తోంది. ఆమె రాజకుమారి అంతరాత్మని గ్రహించాను. నేనులేచి ఆమె వెనుకాల తూలుతూ బయలుదేరాను. ఆమె నన్ను తూర్పుకు బదులుగా దక్షిణానికి తీసుకువెళ్తోంది.

'వాస్తవానికి మేమునదికిదగ్గరలోనే వున్నాము. రెండు మైళ్ళు వెళ్ళగానే నదికన్పించింది. ఇంతవరకూ నదివైపు కాకుండా నదికి సమాంతరంగా ప్రయాణం చేస్తున్నాం.

'అలా ఆమె రెండుమైళ్ళు దారిచూపించిన తరువాత, నదినిచేరుకున్నాక ఆకాశంలో విలీనమయిపోయింది.'

షరీద్ ఈ కథచెప్పినంతసేపూ ఆమె ఏడుస్తూనేవుంది.

ఆమె అడిగింది, 'అయితే మళ్ళీఆమె కన్పించిందా ?'

'నాకు రోజూ రాత్రులు కన్పిస్తుంటుంది. కాని అదంతా స్వప్నంలా వుంటుంది.'

సదానంద్ కథ సమాప్తిచేసేసరికి అందరూ మౌనంగా కూర్చున్నారు. అందరూ ఏదో ఆలోచనా ప్రపంచంలో మునిగిపోయినట్టున్నారు. సదానంద్ అన్నాడు, "అబ్బ ! చాలా రాత్రయ్యింది, ఇకనేను వెడతాను."

ఇలా అని అతనులేచి నుంచున్నాడు. చమేలీ అతనికి ఆనుకుని కూర్చున్నదల్లా లేచినుంచుంది. సందులో చీకటిపడి పోయింది. సందుకు దూరంలో ఒక వీధిదీపం వెలుగుతోంది. దీపం ఊరికే పేరుకుమాత్రమేవుంది. సందులో చీకటి చీకటి గానే వుంది.

కథలు వినాలనుకున్నవాళ్ళు అక్కడే కూర్చున్నారు. కొంతమంది ఇళ్ళకు వెళ్ళిపోయారు. వెళ్ళే వాళ్ళలో సదానంద్, చమేలీకూడా వున్నారు. ఇద్దరి ఇళ్ళూ ఒకచోటనే వున్నాయి. అందుచేత ఇద్దరూ కలిసి వెడుతున్నారు. సదానంద్ చమేలీ ఇంటిముందునుంచి వెడుతుంటే ఎవరో అతని చెయ్యిపట్టుకులాగారు. సదానంద్ వెనక్కితిరిగి చూశాడు.

చమేలీ. ఆమెఅంది. "ఇలారా"

"ఎటు ?"

"మాయింటికి"

"ఎందుకు ?"

దానికి జవాబుగా అతన్ని చెయ్యిపట్టుకుని తన యింట్లోకి లాక్కుపోయింది. ఇంట్లో చమేలీతల్లి, చిన్న తమ్ముడు వున్నారు. కాని పై గదిలో వున్నారు. క్రిందంతా చీకటిమయంగావుంది. వరండాలోంచి ఒక గదిలోకి తీసుకు పోయింది. అక్కడకూడా చీకటిగావుంది.

"ఏమిటి చమేలీ ?" సదానంద్ అడిగాడు.

చమేలీ అతన్ని కౌగలించుకుని ముద్దుపెట్టుకుంది.

సదానంద్ గదినుంచి బయటకువచ్చేశాడు. అతని తలలో వికారంగావుంది. ఒక విశేషమైన స్పందనం అతని శరీరంలో వ్యాపించింది.

చమేలీ మెల్లెక్కిపోయింది. కాని సదానంద్ బయట అరుగుమీదనే కూర్చున్నాడు. చమేలీ కౌగిలింత అతని మనస్సులో ఒక విచిత్ర అనుభవాన్ని కలుగచేసింది అతడు దాన్ని అర్థంచేసుకోలేకపోయాడు. భార్యాభర్తలమధ్య ప్రేమ అంటే అతనికి తెలుసు. కాని చమేలీ తనని ప్రేమిస్తోందా ? ఆవిషయం అతని మనసులో అలజడిని లేవదీసింది. ఇంత వరకూ అతని మనస్సులో వీథిలోనిఅమ్మాయిలందరి యెడలా సోదరభావమేవుంది. కమల తననెప్పుడూ ఆలింగనం చేసుకో లేదు. అందుచేత చమేలీ ప్రవర్తన ఒక చెల్లెలులా వుండవల

సింది. లేదు. చమేలీ ప్రవర్తన రుచికరంగా వున్నప్పటికీ, ఉచితంగాలేదు.

అతనలా చాలాసేపు ఆలోచనల్లో మునిగివుండిపోయాడు. ఇంతలో క్రిందతలుపులువేసేందుకు చమేలీవచ్చింది. సదానంద్ అక్కడే కూర్చునేసరికి అంది, "సదా అన్నయ్యా?"

"నీ తలకాయ. నువ్వుచేసిన పనేమిటి?"

"ఇదిగో చూడు, అమ్మ నాకోసం చూస్తోంది. ఇక వెళ్ళు. నేను తలుపులు వేసుకోవాలి. రేపు కలుసుకుంటే మాట్లాడదాం."

సదానంద్ ఆమె తల్లిమాటలువిని, లేచి ఇంటికివెళ్ళిపోయాడు. అక్కడ తల్లి తనకోసం ఎదురు చూస్తోంది. సదానంద్ రావటంచూసి తల్లి అడిగింది; "సదా! అక్కదగ్గరకు వెళ్ళొచ్చావా?"

"లేదమ్మా! ఇవేళ శనివారం. కుట్టాళ్లు కథలు, చెప్పుకుంటున్నారు. అందుచేత వెళ్ళలేదు. రేపు తప్పనిసరిగా వెడతాను."

రాత్రి చాలాసేపటివరకూ సదానంద్ మనస్సులో సుఖస్మృతులు ఏదో అనిష్టం జరుగుతుందనే శంకలు రేకెత్తిస్తున్నాయి. చమేలీ ఆలింగనం చాలా ఆనందోత్సాదకంగా వుంది. కాని నైసర్గిక స్వరూపంలో అది అంతగా నచ్చలేదు. కాని ఎందుకు నచ్చలేదు? దానిమీద ఆలోచిస్తూ వున్నాడు. అతను బ్రహ్మచర్యమనే పదాన్ని తన స్కూలు మాస్టర్ల దగ్గర, పుస్తకాల్లోనూ విన్నాడు.

అతని చిన్నారి మనస్సులో దానికర్థం అమ్మాయి నుండి దూరంగా వుండటమే. చమేలీ తన బ్రహ్మచర్యాన్ని పాడుచేసిందనుకుంటున్నాడు.

చాలారాత్రి అయినతరువాతకాని నిద్రపట్టలేదు. అందు చేత ఉదయం ఆలస్యంగా లేచాడు. లేవగానే కమలను కలుసు కోమని జ్ఞాపకంచేసింది, తల్లి. స్నానం అవీ పూర్తిచేసి వకీలు గారి ఇంటికి వెళ్ళాడు.

మధ్యాహ్నంవరకూ అక్కడవుండి పెరేడ్ గ్రౌండుకు వెళ్ళాడు, అక్కడ కుర్రవాళ్ళతో కబాడీ ఆడాడు. అతను తన కంటే పెద్దవాళ్ళకన్నకూడా బాగా ఆడతాడు.

రెండుగంటలు ఆటలుఆడినమీదట, చమేలీ విషయం మర్చిపోయాడు. సాయంకాలం ఆకలి అయ్యేసరికి ఇంటికి తిరిగి వస్తే చమేలీ అక్కడ కూర్చునివుంది. అదిచూడగానే అతనికి అయిష్టం కలిగింది. రాత్రి సంగతి జ్ఞాపకం వచ్చింది.

చమేలీ వాళ్ళఇంట్లో ప్రభ, రమలతో చింతగింజలు ఆడుతోంది. లక్ష్మి ప్రక్కఇంటివాళ్ళ దగ్గరకువెళ్ళింది. సదా నంద్ రావడంచూసి ప్రభ అంది, "అన్నయ్యా! రొట్టెలు కూర, తీసుకుతినమంది అమ్మ."

సదానంద్ చమేలీని అవహేళన చేసేందుకుగాను కాళ్లు, చేతులు కడుక్కొని రొట్టెలుతీసుకు తింటున్నాడు.

రొట్టెలుతిని, నీళ్ళుత్రాగి, చేతులు కడుక్కొని వెళ్ళ టానికి సిద్ధమయ్యాడు. చమేలీ అడిగింది, "సదానంద్ ఎక్క డకు వెళుతున్నావ్?"

"ఇక్కడికే. ఇంకా నిద్రసమయం కాలేదుగా."

"ఈవేళకూడా కథలు చెబుతావా?"

"లేదు ఈవేళ వీధిలో ఎవ్వరూ వినేవాళ్ళులేరు."

"నేనున్నానుగా! రానా?"

"వద్దు"

పిమ్మట చమేలీలేచి సదానంద్‌తో క్రిందకు దిగి వచ్చింది. వీధిలో చీకటిగావుంది. ఇద్దరూ వీధిలోకి చేరగానే చమేలీ అంది, "మాయింటికిపద."

"ఎందుకు?"

"సీతతో మాట్లాడాలి."

"నువ్వు నిన్నచేసినపని బాగాలేదు."

"ఏం? అందులో తప్పేమివుంది?"

"వివాహం అయ్యేవరకూ అందరూ బ్రహ్మచర్యం పాటించాలి."

"అంటే?"

"ఏవిధంగా అర్థమయ్యేలా చెప్పాలా" అని ఆలోచిస్తు న్నాడు, సదానంద్. ఈ విషయంలో స్వయంగా తనకేమీ తెలియదు. అతనన్నాడు, "ఆడపిల్లలు, మగపిల్లలు కలుసుకో కూడదు."

"నీకేమీ తెలియదు సదానంద్. ఇలారా చెబుతాను. సుందరి తెలుసుగా? నా స్నేహితురాలు. గత ఆషాఢంలో పెళ్ళి అయ్యింది. ఆమె భర్త ఏమిచేస్తుంటాడో ఆమెను కలుసుకున్నప్పుడల్లా చెబుతూంటుంది,"

"కాని నీపెళ్ళీ అవలేదు. నాపెళ్ళీ అవలేదు. వివాహం ముందు అలా చెయ్యడం మంచిదికాదు. నీ పెళ్ళి ఎవరితో అవుతుంది.

"నా పెళ్ళి నీతోనే అవుతుంది."

"ఎందుచేత?"

"నువ్వు చాలా మంచివాడవు!"

"కాని నువ్వు నా చెల్లెలువుకదా?"

"ఎలాగ ? నేను మీ తల్లికి పుట్టలేదే!"

"కాని ఈవీధిలోని అమ్మాయిలందరూ నాచెల్లెళ్ళు."

"కాని ఈవీధిలోనే నీ పెళ్ళి కావచ్చుగా ?"

"అదిజరిగినా, తల్లిదండ్రుల ఇష్టంమీదనే."

"మా నాన్నగారు లేనేలేరు మా అమ్మకు ఏమీ తెలి యదు."

"ఏమైనాసరే, ఇదినాకు యిష్టంలేదు. నీకూ నాకూ పెళ్ళి జరుగదు. నేనింకా చదువుకుంటున్నా. మేము చాలా బీదవాళ్ళం."

చాలా కష్టంమీద సదానంద్ చమేలీనుంచి విడిపించు కోగలిగాడు. తరువాతకూడా ఏదోరోజున చమేలీ కలుస్తూనే వుంది.

తరచు సదానంద్ స్కూలునుంచి వచ్చేసరికి చమేలీ వస్తుంది. అప్పుడప్పుడూ వీధిలోను అప్పుడప్పుడూ ఇంటివద్ద కలుస్తుంది.

ఎప్పుడైనా ఏకాంతంలో మాట్లాడేందుకు అవకాశం లభిస్తుంది. అటువంటి అవకాశాలలో చమేలీ తను సదా

నంద్‌ను ప్రేమిస్తున్నానని, అతన్నే పెళ్ళాడతానని జ్ఞాపకం చేస్తుంటుంది. సదానంద్ మొదట్లో అలాజరగదంటూండే వాడు. తరువాత మాట్లాడకూరుకునేవాడు. అటుపిమ్మట ఆమె ప్రేమను స్వీకరించడం ఆరంభించాడు.

తరువాత ఒకటిరెండుసార్లు చమేలీ అతన్ని కౌగలించు కుంది. అయినప్పటికీ సదానంద్ ఆనందాన్ననుభవించాలనే ప్రలోభనంవల్ల మాట్లాడ కూరుకున్నాడు.

పరమానంద్ మెట్రిక్ పాసయి రెండుసంవత్సరాలు గడిచిపోయాయి. షైపు, షార్ట్‌హాండులలో నిపుణత పెరిగింది. అతను రోజూ ఉదయం ఆరోజు వకీలుగారి కేసులు వివరాలు షార్ట్‌హాండులో నోటుచేసికుని పిదప ఆయన వెళ్ళేముందుగా టైపుచేసి ఇస్తుంటాడు. దానివల్ల కుంవర్ సేన్‌గారికి చాలా అనుకూలంగావుంది. కేసులుకూడా బాగా గెలుస్తున్నాయి.

అందువల్ల వకీలుగారు నూటయాభై రూపాయలవరకూ జీతంపెంచారు. కమీషన్‌కూడా లభిస్తోంది. అందుచేత పర మానంద్ ఇంటిపరిస్థితి ఇంకా బాగుపడింది.

3

సదానంద్ మెట్రిక్‌పాసయినట్లయితే అతన్నికూడా ఏదైనా పనిలోపెట్టవచ్చని పరమానంద్ ఉద్దేశ్యం. దానివల్ల కుటుంబ ఆదాయం పెరుగుతుంది. ఒక పెద్ద ఇల్లు అద్దెకు తీసు కోవచ్చు. కాని అతనిఆశ ఫలించలేదు.

మెట్రిక్ రిజల్ట్సు తెలిసాయి. సదానంద్ నంబరు పేప ర్లో కన్పించలేదు. పరమానంద్‌కు చాలా దుఃఖం కలిగింది.

తనకువలె సదానంద్ చదువలేడని పరమానంద్‌కు తెలుసు. ఎందుచేతనంటే చదువులో తనకుగలదీక్ష సదానంద్‌కులేదు. అయినప్పటికీ సదానంద్ పరీక్షలో తప్పుతాడని అతడనుకోలేదు. సదానంద్ చాలా తెలివైనవాడు. మంచి ఆరోగ్యం గలవాడు.

సాయంకాలం ఇంటికిరాగానే తల్లిని అడిగాడు "అమ్మా సదానంద్ ఏడీ ?"

"ప్రొద్దున్న వెళ్లాడు, ఇంకారాలేదు."

"వాడు ఫేలయిపోయాడు."

"ఫేలా ?" తల్లి ఆశ్చర్యంతో అడిగింది. "ఇకమీదట ఏంచేస్తాడు."

"ఏం చేస్తాడు! నేను ఈవిధంగా పండిరుబ్బుతూంటే వాడు ఆవారాలా తిరుగుతూంటాడు."

"పరమానంద్ ! బజార్లో ఎక్కడైనా ఉన్నాడేమో చూడు."

పరమానంద్ తిన్నగా మెట్లుదిగి క్రిందకువచ్చాడు. సందు ఈ వైపునుంచి ఆ వైపుకు చూశాడు. సదానంద్ కాని అతని మిత్రులుకాని ఎవ్వరూలేరు. సందునుంచి బజారులోకివచ్చాడు రామలాల్ దుకాణం ఎదురుగుండా ఒకసభ తీరివుంది. అందులోనుంచుని ఒకవ్యక్తి పంజాబీ కవిత్వం వినిపిస్తున్నాడు. అక్కడగిని వింటున్నాడేమోనని అందులోకివెళ్ళి నుంచున్నాడు పరమానంద్. పాడేవారు ఎవరాఅతని తొంగి చూస్తున్నాడు. పాడేవాడు తన తమ్ముడేఅని తెలియగానే ఆశ్చర్యం, కంగారు వేశాయి. అతను బజార్లో ఒకమూల ఒకదిమ్మమీద

నుంచుని కవిత్వం వినిపిస్తున్నాడు. దగ్గర దగ్గర రెండుమూడు వందలమంది శ్రద్ధగా వింటున్నారు. అతను ప్రేమగీతం ఒకటి ఆలాపిస్తున్నాడు.

సదానంద్ కవిత్వంకూడా వ్రాసి పాడతాడని పరమానంద్‌కు తెలియదు. ఇంతమంది అతని కవిత్వం వినడంచూసి ఆశ్చర్యపోయాడు. అతని పాటలో రసము, అతని వాక్కులలో అర్థము, అతని భావ-భంగిమలలో ప్రభావం ఇమిడివుందని గ్రహించాడు.

ఇతను తన ఇంటి పరిస్థితిని బాగుపరచడంలో పనికి వస్తాడా లేడా అని ఆలోచిస్తున్నాడు. అతను తన సంపాదనను సదుపయోగపరుస్తున్నాడా ? సరిగ్గా అదేసమయానికి సదానంద్ పాట ఆపుచేశాడు. దానిమీదట వినేవాళ్లు, "మరొకటి, మరొకటి" అని అల్లరిచేశారు,

సదానంద్ మరొకటి వినిపిద్దామనుకుంటూంటే పరమానంద్ ముందుకువెళ్ళి పిలిచాడు అప్పుడు సదానంద్ తన నెంబరు ఈవేళ పేపరులో లేనట్లు జ్ఞాపకం చేసుకుని సిగ్గుపడుతూ వచ్చాడు. అన్నగారికూడా ఇంటికి బయలుదేరాడు.

తల్లి అడిగింది, "సదానంద్ ! ఎక్కడకు వెళ్ళావు ?"

"కొంతమంది బజార్లో కవిత్వం వినిపించమన్నారమ్మా కవిత్వం వినిపించడం మొదలెట్టగానే వందలాది మంది గుమి కూడారు."

"నేను గుంపులనేం చేసుకోను? మీ అన్నయ్యచూడు కష్టపడి ఇంటిని నడుపుతున్నాడు. నువ్వంటే తిండికోసం బజా

ర్లంటూ పద్యాలు పాడుతూ తిరుగుతున్నావు. నువ్వు ఫేలయి పోయావుట తెలుసా ?"

"ఆ తెలుసు! అమ్మా నాకు ఆల్‌జీబ్రా, జామెంట్రీ రావు. అవి రాకుండా మెట్రిక్ పాసవటంకష్టం."

"అయితే ఇలాతిని తిరుగుతూ వుంటావా ?"

"లేదమ్మా! రేపటినుంచి ఏదైనా పనిచేస్తాను. సంపాదించిందంతా నీకే ఇస్తుంటాను."

తల్లి సంతోషించింది. పరమానంద్‌కుమాత్రం ఇది నచ్చలేదు. సదానంద్ చాలాపైకి వస్తాడని కలలు కంటూండే వాడు. అవన్నీ పేకమేడల్లా కూలిపోయాయి. మెట్రిక్ ఫేలయి ఉద్యోగంకోసం వెదికితే ఏం దొరుకుతుంది. మహాఅయితే ముప్ఫైఅయిదు, నలభైరూపాయలిస్తారు. అందులో అమ్మ కేమి ఇస్తాడు. తన ఖర్చేమి గడుపుకుంటాడు.

అతను కోపంతో అడిగాడు, "అయితే చదువుముగిస్తా వన్నమాట మెట్రిక్ ఫేలయినవాడికి ఏం జీతం వస్తుంది ?"

దానిమీదట సదానందముఖం వంచుకుని కూర్చు న్నాడు. తల్లి అడిగింది, "అయితే ఏంపనిచేస్తావో చెప్పు ?"

సదానంద్ తలవంచుకునే అన్నాడు, "అమ్మా నాకు ఆల్‌జీబ్రా, జామెట్రీ రావు. ఎక్కడైనా హిందీ, సంస్కృతం, ఇంగ్లీషు చదువుకోమంటే చదువుకుంటాను."

"అయితే నీకోసం స్కూళ్ళు క్రొత్తవి పెడతారను కున్నావా ?"

స్కూల్లోకాదు. బయట చదువుకుంటా !"

"కాని తిండితిప్పలు ఎలాజరిగేది ?".

"దాని ఏర్పాట్లు నేనుచేసుకుంటాగా!"

"సరే. ఒకనెల తరువాత తిండికక్కావలసిన డబ్బు ఇవ్వకపోతేఇంట్లో నీకు భోజనం దొరకదు."

వాస్తవానికి సదానంద్ పరీక్షలో కూర్చోలేదు. కథలంటే అతనికి మహాయిష్టం. అందుచేత రోజంతా కథలు పుస్తకాలు చదువుతుంటాడు. అతను ప్రస్తుతం పంజాబ్ పబ్లిక్ లైబ్రెరీకి వెడుతున్నాడు. సమయం దొరికినప్పుడల్లా, అతను అక్కడకి వెడుతూంటాడు. కథలుపుస్తకాలు ఏవి దొరికినా తెచ్చుకుంటాడు.

ఈమధ్య కవిత్వం రాయడంలో అతనికి అభిరుచి కలిగింది. అందుచేత పంజాబీలో కవిత్వం వ్రాస్తున్నాడు. తక్కిన కుఱ్ఱవాళ్ళందరూ పరీక్షలకోసం చదువుకుంటూంటే సదానంద్ ఏదైనా పార్కులో కూర్చుని పద్యాలు వ్రాసుకుంటూ వాటిని సాయంకాలం ఏదైనా దుకాణం దగ్గర వినిపిస్తూండేవాడు.

పరీక్షలయి ఫలితాలు తెలిసేలోపల, మంచి కవిగా పేరుపొందాడు. తను ప్యాసుకానని అతనికి తెలుసు. అందుచేత ఫలితాలు తెలిసినరోజున అతనికి విచారమూ లేదు, చింతాలేదు. అయినప్పటికీ తను పరీక్షల్లో కూర్చోలేదని తల్లితోనూ అన్నగారితోనూ చెప్పలేదు.

కథలు చదవడంవల్ల అతని మనస్సులో అనేక ఆలోచనలు మెదులుతున్నాయి. కాని అవసరం లేకపోవడంవల్ల ఇంతవరకూ ఏమీ కార్యరూపంలోకి తీసుకురాలేదు. ఇప్పుడు అతను ఒక సవాల్‌ను ఎదుర్కోవలసివుంది. ఒక నెలలో తను

రొట్టెలు సంపాదించుకోవలసిన బాధ్యత మీద పడింది అందుచేత రాత్రులూ పగలూ ఆలోచిస్తున్నాడు. తనకు ఏ పని వీలవుతుందా అని వెదుకుతున్నాడు.

మరుసటిరోజు ఉదయంలేచాడు. ఇంతవరకూ మనస్సులో ఏ ఆలోచన నిలువలేదు. స్నానాదులు పూర్తిచేసి, భోజనంచేసి ఇంటినుంచి వెళ్ళేందుకు తయారయ్యాడు. దారి మీదట తల్లిఅడిగింది, "సదానంద్! ఎక్కడికి వెడుతున్నావు?"

"అమ్మా! నేను కథలుచెబుతాను గేయాలు పాడతాను. నేను ఇదేపని నేర్చుకుందామనుకుంటున్నా. కాని ఇది నేర్చుకునేందుకు చాలాసమయం పడుతుంది. అంతవరకూ పొట్ట గడిపేందుకు ఏదైనా పనివెతుకుకోవాలి."

"కాని ఈ పాటలు, కథలు ధనార్జనకు పనికివస్తాయా? పైగా నువ్వుకుటుంబభారాన్నికూడా కొంతవరకు మొయ్యాలి కదా? నీ పెళ్ళవుతుంది. కోడలువస్తుంది. ఆమెను మీనాన్న గారు నన్ను ఆకలితో ఉంచినట్టే వుంచుతావా?"

"లేదమ్మా! నేనీపని బాగానేర్చుకున్న తరువాత పెద్ద పెద్ద పుస్తకాలు వ్రాస్తాను. దానిమీద చాలాడబ్బువస్తుంది."

తల్లి మాట్లాడకూరుకుంది. ఆమెకీవిషయాలన్నీ తెలియవు. సదానంద్ మెట్లుదిగి వీథిలోకివెళ్ళి నుంచున్నాడు. అమ్మనోటంటా వివాహమనే మాటలు వినగానే చమేలీని చూడాలనిపించింది. ఈమాట ఆమెను పెళ్ళాడాలనే విషయం మీద ఆలోచిస్తున్నాడు. వీథిలోనుంచుంటే ఎక్కడోచోట

కనిపిస్తుందని వీధిలోనే చాలాసేపునుంచున్నాడు. కాని కన్పించలేదు.

ఆఖరుకు విసుగెత్తి సందునుండి బయటకు వచ్చాడు. రెండుమూడు బజార్లుదాటి గోల్ బాగ్ చేరుకున్నాడు. అక్కడ లాన్ మీదకూర్చుని తన భావాల నన్నిటినీ సమగ్ర పరుచుకుంటున్నాడు. అలా కొంతసేపయిన తరువాత విసిగెత్తి చాలా వీధులు దాటుకుంటూ సుర్జనసిం‌హ్ దుకాణందగ్గరకు చేరాడు. అక్కడ కొంతమంది కూర్చుని పచ్చని కాగితాలమీద ఏదో వ్రాయడం చూశాడు. వాళ్ళలో ఒకళ్ళిద్దరు కుఱ్ఱాళ్ళుకూడా వున్నారు. వాళ్లు ఏమిచేస్తున్నారో చూద్దామని దగ్గరకు వెళ్ళాడు. ఒక కుఱ్ఱవాడు కొన్ని పద్యాల నకళ్లు వ్రాస్తున్నాడు. అదిచూసి సదానంద్ అడిగాడు.

"అలా ఎందుకు వ్రాస్తున్నావ్!"

"ఈపుస్తకం అచ్చవుతుంది. ఇక్కడ వ్రాసిందే రేకుమీద బ్లాకు తయారవుతుంది. తరువాత అది కాగితాలమీత అచ్చవుతుంద"

"ఇలా వ్రాసినందుకు ఏమైనా ఇస్తారా?"

"అవును. నేర్చుకుంటావా?"

"నేను నేర్చుకోగలనా ?"

"నీ దస్తూరీ బాగుంటేసరి !"

"నా దస్తూరీ చాలా బాగుంటుంది."

"అక్కడ మేనేజరు కూర్చున్నాడు.మాట్లాడు."

సదానంద్ ఆలోచించాడు. ఈపనివల్ల ఆనందమూ కలుగుతుంది. తను పుస్తకాలుచదివి వ్రాయడంవల్ల జ్ఞానం

పెరుగుతుంది. పైగా డబ్బుకూడా వస్తుంది. సదానంద్ మేనే జరు దగ్గరకు వెళ్ళి అన్నాడు. "మేనేజరుగారు నాకుకూడా ఈపని నేర్పండి."

"ముందు వ్రాసి నీ దస్తూరీ ఎలావుంటుందో చూపించు."

"ఒక కాగితం, కలం ఇవ్వండి. నా దస్తూరీ బాగా వుంటుంది."

మేనేజరుగారు కలం, కాగితం ఇచ్చారు. "దీనిమీద ఈ పుస్తకంలోని పద్యాలు వ్రాసి చూపించు."

సదానంద్ అక్కడకూర్చుని నాలుగైదుపద్యాలు వ్రా చూపించాడు. మేనేజరుచూసి అన్నాడు, "ఇంకా ప్రా అవసరం. నెమ్మది నెమ్మదిగా వ్రాస్తే బాగుంటుంది. అక్షరా ఇంకా గుండ్రంగా వుండాలి. పైగా అన్నీ సమానం వ్రాయాలి. లేకపోతే బాగుండదు."

"పదిహేనురోజులు అభ్యాసం చెయ్యి. అప్పటివరక అయిన కాగితాలఖర్చు నువ్వేపెట్టుకో. తరువాత నువ్వు వచ్చేదీ లేనిదీ చెబుతాను."

సదానంద్ షరతులన్నిటికీ ఒప్పుకున్నాడు. వ్రాయ ఆరంభించాడు. మేనేజరు ఒక జానపదగీతాల స్క్రిప్టు నక చెయ్యమన్నాడు. సదానంద్ వ్రాయడం ఆరంభించాడు.

కొన్నిరోజులు అభ్యాసం చేశాకా, మేనేజరు క ఇవ్వడం ఆరంభించాడు. మొదటిరోజున రూపాయిపావ వచ్చింది. అది తల్లికి ఇచ్చాడు. దానిమీదట ఆమె అం "ఈ కాస్తా ఏమీ సరిపోతుంది?" అలా అని ఇంకా సంపా చేందుకు ఆశీర్వదించింది.

ఈమాత్రం గానితో తన ఖర్చుకూడా గడవదని సదా నంద్‌కుకూడా తెలుసు. కాని అతను తన రచనాశక్తిని సంపాందించుకుంటున్నాడు. ఒకానొకనాడు తను రచయిత కాగా, తన స్క్రిప్టులనే ఇతరులు నకళ్ళు తీయవలసివస్తుందని తనిఊహ. అది అతని ఆశాస్వప్నము. దాన్ని నిజం చేసు కొందుకు తయారయ్యాడు.

4

సదానంద్‌కూడా ఉదయం వెళ్ళిరాత్రి వస్తున్నాడు. ఉదయంనుంచి మధ్యాహ్నంవరకూ నకళ్ళువ్రాస్తూ టాడు. రోజుకు రెండూ, రెండున్నరదాకా వస్తోంది. ధ్యాహ్నం తరువాత ఒకగంట పని ఆపుచేసి ఇంటికవచ్చి జనంచేస్తాడు. ఒకగంట విశ్రాంతి తీసుకుని సరిగా లుగింటికి పంజాబ్ లైబ్రరీకి వెడతాడు. అక్కడ స్తకుని సాయంకాలం ఏడింటికి పరిచితుల దుకాణాల దగ్గ వెడతాడు. లేకపోతే నగరం బయటనున్న పార్కుకు డు. అక్కడ మిత్రులతో పద్యాలు పాడుకుంటూ రాత్రి పదకొండుగంటలవరకూ గడుపుతాడు.

ఈవిధంగా రెండుసంవత్సరాలు గడిచాయి. నకళ్ళు డంలో సదానంద్ చాలా నైపుణ్యాం సంపాదించాడు. వల్ల రోజుకు మూడున్నరవరకూ వస్తోంది. రోజూ తల్లికి రూపాయలిస్తున్నాడు. వారాంతానికి పైగా మిగిలింది పోస్టాఫీసులో సేవింగ్స్‌లో కడుతున్నాడు.

ఒకరాత్రి కవిత్వపు సభలో చాలా ప్రశంసలందుకుని వస్తున్నాడు. అతను సందులోకి రాగానే చమేలీ ఆపుచేసింది. సందులో బాగా చీకటిగావుంది. వీథిలోని దీపంకూడా ఆరిపోయింది. ఎదుట ఎవరో నుంచోగానే సదానంద్ ఎవరని అడిగాడు.

"చమేలి"

"చమేలి ? ఇక్కడ ఏం చేస్తున్నావు ?"

"నీకోసం ఎదురుచూస్తున్నా."

"ఇంటికి వెళ్ళు. అమ్మ వెదుకుతుంటుంది."

"లేదు. ఈవేళ అమ్మ పెళ్ళి మాటలకు వెళ్ళింది. మోహన్ నిద్రపోతున్నాడు."

"ఏంపని ?"

"మా యింటికిరా. కొంచెం పనుంది."

"ఇక్కడే చెబుదూ."

"ఇక్కడకాదు." అని చెయ్యిపట్టుకుని లాగుకువెళ్ళింది. ఇంట్లో క్రింద గదిలోకి తీసుకువెళ్ళింది. ఇంట్లోకి వెళ్ళగానే గది తలుపులువేసేసి దీపం వెలిగించింది. ఇద్దరూ చాపమీద కూర్చున్నారు. సదానంద్ అడిగాడు, "తొందరగా చెప్పు ఏం పనో"

"నువ్వు రోజంతా ఎక్కడ వుంటున్నావు ? పదిరోజుల నుంచి నీకోసం చూస్తున్నా."

"ఏంపని ?"

"నాపెళ్ళి అవుతోంది."

"నిజమేనా ? ఎక్కడ ?"

"రెండుమూడు రోజులలో తాంబూలాలు పుచ్చుకుంటున్నారు. తరువాత ఒకటిరెండు నెలలకు పెళ్ళవుతుంది."

"అటువంటప్పుడు నేను నిన్నీవిధంగా కలుసుకోకూడదు."

"కాని నేనుపెళ్లిచేసుకోను."

"ఏం ?"

"నేను నిన్నే పెళ్లిచేసుకుంటాను. నిన్ను ప్రేమించాను."

"కాని మీయమ్మ నిన్నుమరొకచోట చేస్తూంటే అదెలా వీలవుతుంది ?"

నేను ఇంటిపైనుంచి దూకి చచ్చిపోతాను."

"ఎలాచచ్చిపోతావు ?"

"ఇదిగో, నేను నిన్ను ప్రేమిస్తున్నా. నిజంగా ఆ పెళ్ళే కనుక జరుగవలసివస్తే నేను చచ్చిపోతాను. ఇది నువ్వు నమ్ము నమ్మకపో నీకు నమ్మకం లేకపోతే నువ్వే ఆ పెళ్ళికొడుకును చూసిరా. అతన్ని చూడగానే నమ్మకం కుదురుతుంది.

"అతనెవరు?"

"అతనిపేరు శివరామ్. డిబ్బీబజార్లో అతనిదొక చిన్న గాజుల దుకాణం. అతన్నిచూస్తే డోకువస్తుంది. ఒకరోజున మోహన్‌తో గాజులు కొనుక్కునేందుకు అతని దుకాణానికి వెళ్ళాను."

"అతనేనని నీకెలా తెలుసు?"

"మోహని మాఅమ్మదగ్గర తెలుసుకుని చెప్పింది. ఆమెకూడా స్వయంగా చూసేందుకు వెళ్ళింది."

"సరే నేనుకూడా చూసివస్తాను."

"అయితే ఎప్పుడు కనిపిస్తావు?"

"ఒకటి రెండురోజుల్లో. ఏదైనా ఉపాయం ఆలోచిస్తాను"

"నేను నిన్నే పెళ్ళాడతాను."

"కాని నేను సంపాదించేది రోజుకు మూడున్నరే?"

"నాఅదృష్టం ఎలావుంటే అలా జరుగుతుంది. నాకోసం చింతించకు"

"చూడు చమేలీ, వివాహమంటే పిల్లల ఆటకాదు. నేనింకా వివాహానికి యోగ్యుణ్ని కాదనుకుంటాను. రేపో ఎల్లుండో నిన్ను కలుసుకుంటాగా!" ఆమెను గంభీర ఆలోచనలోవిడిచిపెట్టి ఇంటికివెళ్లిపోయాడు సదానంద్. అతను తన వివాహం విషయంలో మట్టుకు ఇది అసంభవమనుకుంటున్నాడు. కమలకు, పరమానంద్‌కు వివాహం కానిదే తనకు చెయ్యదు తల్లి. తనింకా సంపాదంచేది చాలా తక్కువే. కమలకు ఇరువైయొక్క సంవత్సరాలు వస్తున్నాయి. ముందు ఆమె వివాహం జరగవలసిందే. తరువాత పరమానంద్‌ది. పరమానంద్ వయస్సు పందొమ్మిదివుంటుంది. తరువాత తనది.

అదికాకుండా వివాహంవల్ల తన అభిలాషలన్నీ మట్టి గలసిపోతాయని అతని ఉద్దేశం. తనొక ప్రసిద్ధ రచయిత, కవి, కావాలని కలలు కంటున్నాడు. తన ఆకాంక్షను స్మృతిపథంలోనికి తెచ్చుకోగానే వివాహం చాలా అరుచికరంగా వుంటోంది.

నగరంలోని సామాన్యజనంలో అతని ఖ్యాతి పెరుగుతోంది. కాని తను విద్వజ్జనులదగ్గర ప్రశంస పొందాలని

ఆకాంక్షిస్తున్నాడు. అందుచేత లైబ్రరీలో చాలా పుస్తకాలు చదువుతున్నాడు. నిరంతరం కవిత్వం వ్రాయడం అభ్యాసం చేస్తున్నాడు.

అయినప్పటికి చమేలీకి కాబోయే పతిని చూసివస్తానని మాటయిచ్చాడు. అందుచేత మరునాడు మధ్యాహ్నం లైబ్రరీకి వెళ్ళకుండా డిబ్బీబజారుకు వెళ్ళాడు. శివరావ్ దుకాణం దగ్గరకు చేరుకున్నాడు. దుకాణంలో ముప్ఫై ఆయిదు, నలభై ఏండ్ల మనిషి ఒకడువున్నాడు అతనిది ఒక కన్ను మెల్ల. దవళ్లు నొక్కుకుపోయి వున్నాయి. ముక్కు కొంగముక్కులావుంది. గడ్డం మాసిపోయివుంది. పైగా మెరిసిపోయింది కూడాను. మీసాలుకూడా మెరిసిపోయాయి.

ఒక్కవిషయం. దుకాణంనిండా చాలామంది కస్టమర్స్ వున్నారు. సదానంద్ ఒక ప్రక్కననుంచుని అవకాశం కోసం ఎదురుచూశాడు. కొంతమంది అమ్మాయిలు గాజులు వేయించుకుంటున్నారు. వాళ్లు వెళ్ళిపోగానే సదానంద్ అడిగాడు "బటన్సు వున్నాయా?".

దుకాణంలో ఒక నౌకరున్నాడు. శివరామ్ అతన్ని బటన్సు తీసుకురమ్మన్నాడు. అతను రాగానే సదానంద్ అడిగాడు, "మీపేరు శివరామ్ కదండీ?"

"అవును. ఏం?"

"ఏమీలేదు. మీ వివాహం జరుగుతోందికదూ?"

శివరామ్ మాట్లాడక కూర్చుని అతని ముఖంవేపు చూస్తున్నాడు.

సదానంద్ అడిగాడు, కొంచెం ఖరీదైన బటన్సు చూపించండి.

"నువ్వెవరవు ?" శివరామ్ అడిగాడు.

"నేను చమేలీ అన్నగారిని"

"వాళ్ళమ్మ అనడం చిన్నతమ్ముడున్నాడని. కాని నీకు మీసాలుకూడా వచ్చాయి"

"నేను వాళ్ళపెద్దమ్మ కొడుకును"

"ఏం చేస్తున్నావు !"

"ఏదో కూలిచేసుకుని పొట్ట గడుపుకుంటున్నా."

"అయితే నేను నచ్చానా !"

"నచ్చారు. మాలాంటిపేదవాళ్లకు మీరేభగవంతుడు. మీదుకాణమంతా సామానులతో నిండివుంది."

"షరబత్ త్రాగుతావా?"

"వద్దండి బావగారూ."

సదానంద్ బటన్సు తీసుకుని డబ్బులిచ్చివెళ్ళిపోయాడు.

శివరామ్ చాలా సంతోషించాడు. డబ్బు చాలా గొప్పదనుకున్నాడు.

శివరామ్‌ను చూడగానే సదానంద్‌కు నిరాశ కలిగింది. చమేలీ వివాహం అటువంటి వానితో జరగడం ఏమాత్రం ఇష్టంలేదు. చమేలీని రక్షించేందుకు ఏదీమార్గం కన్పించడం లేదు. అక్కడనుండి పార్కుకువెళ్ళి తన మనస్సులోని భావాలన్నిటినీ పద్యాలు అల్లుకున్నాడు. పిమ్మట మనస్సు కొంచెం తేలికపడింది.

తను స్వయంగా వివాహంచేసుకునేందుకు సిద్ధంగా లేడు. అందుచేత ఆదశలో ఆలోచించలేకపోతున్నాడు. మరొక దారీ కన్పించడంలేదు.

ఈవేళ లైబ్రరీకు వెళ్ళలేదు. ఇంటికి తిరిగివచ్చాడు. సాయంకాలం అవుతోంది. రామలాల్ దుకాణం దగ్గరనుంచి వెడుతుంటే రామలాల్ పిలిచాడు, "సదానంద్ !"

సదానంద్ అతనిముందుకువెళ్లి నుంచున్నాడు. రామలాల్ అడిగాడు, 'ఈవేళ ఎక్కడతిరుగుతున్నావు ?'

"ఈవేళ లైబ్రెరీకి వెళ్లలేదు. అందుచేత ఇంటికి వచ్చేస్తున్నా."

"ఈమధ్య కవిత్వం ఆగిపోయిందా ?"

"కవిత్వం జీవితమంతా ఉండేదే."

"అయితే ఇవేళ సభచేసేదా ?"

"వినేవాళ్ళు వుంటేసరి !"

"వినేవాళ్ళు బోలు మమంది వుంటారు."

"ఆరోజు ఫకీరుద్దీన్ కొట్టుదగ్గర సభజరిగితే రెండువేల మందివరకూ వచ్చారు."

"ఇక్కడకూడా చాలామంది వస్తారు. ఇక్కడ చాప వేసి అందరినీ పిలుస్తాను."

"నీయిష్టం."

"అయితేసరే రాత్రి తొమ్మిది గంటలకు"

"సరే, నేను ఇంటిదగ్గర తిండితిని వస్తాను"

సదానంద్ ఇంటికి రాగానే చమేలీని చూశాడు. ఆమె తనతల్లి దగ్గర కూర్చునివుంది. తనకోసం ఎదురుచూస్తోందని

గ్రహించాడు. సదానంద్ తల్లి లోపలికి వెళ్ళగానే చమేలీ నెమ్మదిగా అడిగింది, "వెళ్ళావా?"

"ఆ, చూసివచ్చాను."

"తరువాత!"

"నువ్వీ ఆపదనుంచి బయటపడే ఉపాయం ఆలోచిస్తున్నా."

"ఎలాగ?"

"రేపటికి చెబుతా?"

"చూడుసదా! ఆ మెల్లవాని ఇంటికి వెళ్ళేముందు శ్మశానానికివెళ్ళ నిశ్చయించుకున్నా. మేము చాలా బీద వాళ్ళం. అమ్మదగ్గర కట్నమిచ్చేందుకు డబ్బులేదు. ఎవరూ మా సంబంధం చేసుకునేందుకు సిద్ధంగాలేరు. మీరు చాలా మంచివాళ్ళు, డబ్బుకూడా అడగరు. నాకు మీరొక్కరే సహాయంగా కన్పిస్తున్నారు."

ఇలా అంటూ అంటూ ఆమె కళ్ళంటూ కన్నీళ్ళు తిరిగివచ్చాయి. సదానంద్ తల్లి వంటింట్లోంచి రొట్టెలు తెచ్చింది. కన్నీళ్ళు ఆమెకు కనబడకుండా చమేలీ మెట్లుదిగి క్రిందకు వెళ్ళిపోయింది.

తల్లి సదానంద్ ముందు రొట్టెలువుంచి అడిగింది, "సదానంద్! అక్కను కలుసుకున్నావా?"

"లేదమ్మా! చాలా ఆదివారాలు సభలులోనే గడిచి పోతున్నాయి. రేపు తప్పనిసరిగా వెళ్తాను."

"ఏమీ ఇంటిఖర్చు రోజురోజూ పెరిగిపోతోందంటున్నాడు. నీ రెండురూపాయలవల్ల పనిజరగడంలేదు."

"అదినిజమేనమ్మా! కాని ఇంతకంటె ఎక్కువ రావడంలేదు."

"నువ్వు సాయంకాలంకూడా ఎందుకు పనిచెయ్యకూడదు?"

"నేనింతకంటే ఎక్కువచెయ్యలేనమ్మా! ఈపనిలో బుద్ధి ఎక్కువ ఉపయోగించక్కరలేదు. కాని కళ్ళు, చెయ్యి అలసిపోతాయి. ఉదయమంతా పనిచేసేసరికే, అక్షరాలు చెడిపోతుంటాయి."

తల్లి మాట్లాడకూరుకుంది. సదానంద్ భోజనంచేసి ఈవేళ పార్కులో నిర్మించిన పద్యాలు కాగితంమీద వ్రాసుకున్నాడు. ఈ పద్యాలు బజార్లో పాడాలనుకున్నాడు. ఆ ఉద్దేశంతో మరొకసారి చదివి చూసుకున్నాడు.

పావుతక్కువ తొమ్మిదయింది. సదానంద్ తల్లితో అన్నాడు, "అమ్మా బజార్లో సభవుంది. అందుకు వెడుతున్నా."

"ఇవేళ విశేషమేమిటి?"

"విశేషమేమీలేదు. నా పద్యాలువిని చాలాళ్ళయ్యిందన్నాడు, రామలాల్. అతనే సభ ఏర్పాటుచేశాడు."

సదానంద్ మెట్లుదిగి వస్తూంటే చమేలీ మెట్లుదగ్గర ఎదురుచూస్తోంది. సదానంద్ అడిగాడు, "ఇక్కడ ఏం చేస్తున్నావ్."

"నీకోసం ఎదురుచూస్తున్నా."

"ఏమిటి సంగతి?"

"నాకు చాలా నిరాశ కలుగుతోంది. ఏమిచెయ్యాలో తెలియడంలేదు."

"నేనేమీఉపాయంఆలోచించలేదు. రేపుచెబుతాను."

"ఒకమాట చెప్పనా?"

"ఆ, చెప్పు."

"మనం రేపిక్కడనుంచి పారిపోదాం. కొంతకాలం తరువాతవచ్చి పెళ్ళయిపోయిందని చెబుదాం."

"అదేమీ బాగాలేదు. ఇక నేను వెడతాను. రేపు కలుసుకుని విషయమంతా చెబుతా"

సదానంద్ బజార్లోకి వెళ్ళగానే జనం ప్రోగయ్యారు. మిత్రులందరూ చుట్టుముట్టారు. ఒకతనన్నాడు, "సదానంద్ ఈమధ్య ఏం చేస్తున్నావు?"

"ఈమధ్య పనిచేసుకుంటున్నానయ్యా. ఉదయంనుంచి [illegible] వస్తుంటాను. [illegible] చాలా ప్రొద్దుపోతుంది."

"ఏం పని చేస్తున్నావు?" ఒకతనడిగాడు.

"పెద్ద విశేషమయిన పనేమీ లేదు. ఏదో తిండికి సరి పోతోంది."

రామలాల్ ప్రక్కకొట్టువాళ్ళకు, ఇరుగుపొరుగు వీధుల వాళ్ళకు కబురు పంపించాడు. బెంచీలూ, కుర్చీలూ వేయించాడు. సదానంద్ కవిత్వం చదువుతాడని చాటింపు వేయించాడు. వెయ్యిమందిదాకా వచ్చారు.

ఇటువంటి పెద్దసభలో కవిత్వంచెప్పి మూడేళ్ళయింది. ఈనాటి మునుపటిలా సిగ్గు, భయంలేవు. ప్రజలు తన కవిత్వాన్ని మెచ్చుకుంటారని ధైర్యంవుంది. కవిత్వంలో తాను

ముందుకు పోగలననే ఆత్మవిశ్వాసం, ఆశలతో వేదికపైకి రాగానే తన ఇష్టదైవమైన సరస్వతిని ప్రార్థించాడు.

అతని ప్రార్థనా పద్యాలు చాలా భక్తిమయంగా వున్నాయి. నాస్తికుని హృదయంలో కూడా అవి భక్తిభావం కలిగించేలా వున్నాయి. శ్రోతలందరూ భక్తితో తలలు ఊపుతున్నారు. నెమ్మదిగా అతని కవితామాధుర్యం అందరి మనస్సులనూ ఆకర్షిస్తోంది.

ఒక గంటతరువాత రామలాల్ సదానంద్ కు పాలు ఇచ్చాడు. అవి త్రాగి కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి తనకవిత్వాన్ని వినిపించడం ఆరంభించాడు. ఈసారి ముందుగా భగవంతునియొక్క మాయాలీలలను వర్ణించాడు.

తరువాత ఏకాఏకీని శివరామ్, చమేలీలయొక్కవివాహ సంగతిని చాలా కరుణరసంతో నింపి పద్యాలలో వినిపించాడు, శ్రోతలందరూ ఆ కథను శ్రద్ధగా విన్నారు. ఆ కథను వినిపించి సదానంద్ కూర్చున్నాడు. సదానంద్ కథవల్ల చమేలీ లాంటి రత్నం శివరామ్‌వంటి వ్యక్తికి భార్యగా కావటం అందరికీ నొప్పిగా తోచింది.

ప్రజలందరూ ఒకరిముఖం ఒకరు చూసుకుంటున్నారు. ఒకతనడిగాడు, "ఎవరు ఈమె?"

"ఈ వీధిలోనే ఒక వితంతువు వుంటోంది. ఆమె కూతురు."

"అయితే ఆ శివరామ్ ఎవరు?"

"అదే ఆ గాజులు దుకాణంవాడు!"

"అయితే చాలా అనిష్టమే జరుగుతోంది."

"అయితే వీళ్ళమ్మను మాన్పించేదెవరు ?"

"ఏం చేస్తుంది, మరొకవరుడు లభించనప్పుడు ?"

కార్యక్రమం సమాప్తయిపోయింది. ఇంటింటా చమేలీ చర్చయే. మరునాడు చమేలీ తల్లిని ఇరుగుపొరుగుస్త్రీలు అడగడం ఆరంభించారు. వాళ్ళలో రామలాల్ తల్లికూడావుంది. ఆమె చమేలీ తల్లిని అడిగింది, ఆ మెల్లవాడికి ఇస్తున్నావు, ఏమి ఇచ్చాడేమిటి ?"

"ఏమిటమ్మా! అలా అంటున్నావు? నేను భర్తృహీననైనా ఆడపిల్ల ఇంటిసొమ్ము తినేంతకర్మ నాకుపట్టలేదు."

"అయితే ఇంత పెద్దనగరంలో మరెవ్వరూ దొరకలేదా ?"

"అయితేచెప్పు. ఒకసారి రామలాల్ కి చేసుకోమని అడిగాను. ఏమిచెప్పావో జ్ఞాపకముందా ? రెండువేలుకట్నం అడిగావు. నాదగ్గర రెండువేలెక్కడున్నాయి ?"

"చూడమ్మా!" రామలాల్ తల్లి అంది, "రామలాల్ కి వాళ్ళమామగారు అయిదువేలిచ్చారు. నేను నిన్ను అడిగింది రెండువేలే. నేననేదేమంటే ఏదైనా మంచిపిల్లాడిని చూసి బీదవాడైనా చెయ్యకూడదా ? గుడ్డివాడు, కుంటివాడి కంటే, బీదవాడైతేనేం ?"

"ఎవరూ కన్పించందే ఏమిచేసేది ?"

"ఎందుకులేదు. నాగింటి జగనానంద లేడా. అతనిలో ఏమిలోపంవుంది ?"

ఇంతవరకూ చమేలీ తల్లికి జగనానంద్ దృష్టిలోకి రాలేదు. అయినప్పటికీ జగనానంద కుటుంబంలో చాలా

మంది వున్నారు. అమ్మాయి వీళ్ళందరికీ సేవలు చెయ్య గలదా, అని ఆలోచిస్తోంది. పైగా పరమానంద్ ఏదో సంపా దిస్తున్నాడు గాబట్టి లక్ష్మి కట్నం అడుగవచ్చు. ఆమె అడి గింది, "లక్ష్మి ఒప్పుకుంటుందా ?"

"ఎందుకు ఒప్పుకోదు ? ప్రయత్నం చెయ్యి. ఇంట్లో పదిమందిలోనూ ఎనమండుగురు కుఱ్ఱాళ్ళే. అందరూ సంపా దన ఆరంభించేసరికి లక్ష్మిఇల్లు బంగారమవుతుంది. ఇద్దరు ఇప్పుడే సంపాదిస్తున్నారు. దేవానంద్ వచ్చే ఏడాదికి సంపా దనలో పడతాడు."

ఇంట్లో ఎంతమంది వుంటేమాత్రం ఏంలాభం అను కుంటోంది. చమేలీతల్లి. ఆమె తన ఇంటిపరిస్థితినే ఆలోచించు కుంటోంది, చమేలీ పెద్దన్నగారు గనుక ఉన్నట్టయితే అతను సంపాదించేవాడు. ఈనాడు తనకీ తిప్పలు వుండేవికావు.

కాని తను శివరామ్‌కు మాట ఇచ్చింది. ఏ విధంగా ఆ మాట తప్పించుకోవాలో గంభీరంగా ఆలోచిస్తోంది. ఆమె మౌనంగా వుండటంచూసి రామలాల్ తల్లిఅంది, "ఏవమ్మా? నిన్నరాత్రి సదానంద్ చమేలీ విషయం పాడి వినిపించి నప్ప టినుంచీ, ప్రతివాళ్లు నిన్ను నిందిస్తున్నారు. నామాటవిని ఈ సంబంధం విడిచిపెట్టెయ్యి. నేను పరమానంద్ తల్లితో మాట్లాడి సంబంధం కుదురుస్తాను. ఏం? చెయ్యమంటావా !"

"నాదగ్గర ఇచ్చేందుకేమీలేదు!"

"ఇవ్వటం గివ్వటం ఏమీ అవసరంలేదు. లక్ష్మి చాలా మంచిది."

"అయితేచెయ్యి,"

5

సదానంద్ కవిత్వం పరమానంద్ కూడా విన్నాడు. సదానంద్ కవిత్వం, అతని ధోరణి నచ్చలేదు, రాత్రి ఏమీ అనలేదు. ఇద్దరూ అలసిపోయి వున్నారు. అందుచేత ఇల్లుచేర గానే నిద్రపోయారు. ఉదయం ఇద్దరూ స్నానంచేసి భోజనానికి కూర్చున్నారు. అప్పుడు పరమానంద్ అన్నాడు. "సదా! నువ్వు ఇతరుల విషయాల్లో కలుగచేసుకుంటున్నావు. అది అంత మంచిదికాదు."

"ఏమొచ్చింది అన్నయ్యా?"

"నువ్వు చమేలీ విషయంలో కవిత్వం వినిపించావు. అది చాలామొరటుగావుంది. ప్రజలు అటువంటి వివాదాస్పదమైన విషయాలు బాగా మెచ్చుకుంటారు. కాని నీకు ఏమి ఆపదవస్తుందో వాళ్ళకు తెలియదు."

"ఏం ఆపదవస్తుంది?"

"శివరామ్ నీమీద పరువునష్టందావా వెయ్యొచ్చు."

"నాదగ్గర ఏమి తీసుకుంటాడు. నాదగ్గరమాత్రం ఏముంది?"

"కాని దానివల్ల నీ కొచ్చిన లాభమేమిటంటాను."

"చమేలీ వివాహం ఆగిపోవచ్చు."

"ఎవరు ఆపుచేస్తారు, పైగా మరెవరు చేసుకుంటారు?"

"అన్నయ్యా! నువ్వు చట్టవిషయమంటున్నావు. నేను

భగవంతుణ్ని నమ్ముతాను. నేను భగవంతునికి విన్నవించుకున్నాను. ఇక ప్రజలలో ప్రేరణ కల్పించడం భగవంతునిపని. ఆయన ఈ పని ఎవరికి కప్పగిస్తాడో నాకేం తెలుసు?"

"ఏం మాటలు చెబుతున్నావు? నీ పద్యాలువిని భగవంతుడు చమేలీ పెళ్ళిచేస్తాడనా?"

"అన్నయ్యా! దీనివల్ల మనకేం నష్టంలేదు. భగవంతుడు చెయ్యకపోయినా, ఇప్పటికంటే పరిస్థితి పాడవదు."

"నీకు చెడ్డపేరు వస్తుంది. అమ్మాయిల విషయంలో మాట్లాడేవాణ్ణి ప్రజలు చెడ్డగాచెప్పుకుంటారు. నాఉద్దేశ్యంలో చమేలీకేమీ మంచి జరుగదు. పైగా ప్రజలు నిన్ను గూండా అనుకుంటారు. వాళ్ళమ్మ నీ కవిత్వం విన్నదంటే వచ్చి అమ్మతో దెబ్బలాడుతుంది."

సదానంద్ నవ్వాడు. "అన్నయ్యా! నేనేమీ అబద్ధం చెప్పలేదే?" అన్నాడు.

"ఏమి మాటలురా! పరాయిస్త్రీల అందాన్ని వర్ణించడం హిందువులలో చాలా చెడ్డవిషయమని తెలియదా?"

అల్పాహారం సమాప్తయిపోయింది. ఇద్దరూ తమతమ పనులకు వెళ్ళిపోయారు. మాటలు ఆగిపోయాయి.

మధ్యాహ్నం ఒంటిగంటకు పనిపూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు సదానంద్. అప్పటికి రామలాల్ తల్లి లక్ష్మి ప్రక్కన కూర్చుని మాట్లాడుతోంది. ఆమె తనను నిందించేందుకు వచ్చిందనుకున్నాడు. కాని లక్ష్మి సంతోషంగావుంది. అందుకు సదానంద్‌కు తన ఉద్దేశ్యంమీద సందేహం కలిగింది.

రామలాల్ తల్లి సదానంద్ దగ్గరకు వచ్చాక, అంది. "సదానంద్! రాత్రి నీకు పత్త్వం నీకు నగినవు తెచ్చిపెట్టింది."

"ఏమిటి పెద్దమ్మా!" సదానంద్ అర్థం తెలియక అడిగాడు. తల్లి అతన్ని దగ్గరకూరొచ్చిమని అంది, "చూడు! రామలాల్ తల్లి ఏమంటోందో?"

"ఏమంటోంది?"

"చమేలీతల్లి శివరామ్‌తో సంబంధం మానుకుని ఇక సదానంద్‌కు చేస్తానంటోంది."

"నువ్వేమన్నావు?"

"ఇంటికి లక్ష్మి వస్తుంటే కాదంటానా? నేను ఒప్పు కున్నాను."

"అన్నయ్యనడిగావా?

"అదేమిటి. అలా అడగవలసిన పనేలేదు. పైగా అలా అడగరుకూడాను."

"అన్నయ్య ఒప్పుకోడేమోనని నా ఉద్దేశ్యం."

"ఎందుచేత?"

"ఆ పిశాచాన్ని ఎవడు చేసుకుంటాడు?"

"నోరుముయ్యి?" లక్ష్మి కోపంగా అంది. "చూడు సదానంద్! నేనీ వివాహానికి అంగీకరించాను. చమేలీ నీ వదిన గాను కాబోతోంది. ఇక చిన్నప్పటి మాటలు విడిచిపెట్టెయ్యి. ఆమెను గౌరవించడం నేర్చుకో."

సదానంద్ నోటంట పిశాచం అనే మాటవినగానే రామలాల్ తల్లికి నవ్వు వచ్చింది. ఆమె "సదానంద్! ఇంటింటా చమేలీని నీకవిత్వంవల్ల చాలా బాగా చెప్పుకుంటు

న్నారు." అనిచెప్పి రాత్రి సదానంద్ చమేలీని వర్ణిస్తూ పాడిన పద్యం చదివింది.

ఆమె పద్యం వినగానే లక్ష్మిముఖం సిగ్గుతో ఎఱ్ఱబడింది. ఆమె చమేలీ తన కోడలనుకుంటోంది. ఇప్పటినుంచీ అందుచేత అటువంటి పద్యం వినగానే మాట్లాడ కూరుకుంది. సదానంద్ తలవంచుకున్నాడు, రామలాల్ తల్లి అంది, "అటువంటి అప్సరసను పరమానంద్ పెళ్ళాడడా ?"

మాట మార్చేందుకు సదానంద్ అన్నాడు, "అమ్మా భోజనంపెట్టు. పనికి వెళ్ళాలి."

దానిమీాదట రామలాల్ తల్లిఅంది, "ఆగు సదానంద్ ! రేపు సాయంకాలం మా ఇంటివద్ద చమేలీ వివాహం మీా అన్నయ్యతో జరపటానికి నిశ్చయించుకున్నాం.

"చమేలీతల్లి ఏమీా ఇవ్వదు. రామలాల్ వివాహం ఖర్చు పెట్టుకుంటాడు. నేను చేతులకు గాజులూ, ముక్కుపేసరా చేయిస్తాను."

సదానంద్ ఇదేమీా వినడంలేదు. తన ప్రయత్నం ఫలించడం మనస్సులో తలుచుకుని చాలా సంతోషిస్తున్నాడు. చమేలీ తనను వివాహమాడతానన్నా, పరమానంద్ కూడా తన సోదరుడేగా. పని పూర్తయిపోయిందనుకున్నాడు. చమేలీకి కొంచెం నచ్చచెప్పినట్టయితే ఆమె ఒప్పుకుంటుంది.

రామలాల్ తల్లి లక్ష్మితో అంతా నిశ్చయం చేసుకుంది. అందుచేత ఆమె లేచి నుంచుంటూ అంది, "ఇకనేను వెళ్తాను. అంతా సరిగ్గావుందిగా ?"

"ఆ, ఉందమ్మా !"

ఆమె వెళ్ళిపోయిన తరువాత కంచంలో రొట్టెలు పెట్టి లక్ష్మిఅంది, "చూడు సదానంద్! చమేలీ చాలా గుణవంతురాలు. బాగా పెరిగింది. అటువంటి సంబంధం మళ్ళీ దొరకడం కష్టం. మనమూ ఏమీ చెయ్యనక్కరలేదు. మనం బీదవాళ్ళం, చమేలీ తల్లికూడా బీదదే. నాకు చాలా ఆనందంగావుంది. పరమానంద్‌కూడా ఒప్పుకుంటాడని నాకు నమ్మకంవుంది."

"అమ్మా! నేను వేళాకోళానికంటున్నా! చమేలీ ఏదిన నాకుకూడా నచ్చింది. కాని ఆమెను తీసుకువచ్చి ఎక్కడ పెడతావు?"

"క్రిందగది ఇవేళనే శుభ్రంచేయించి వుంచుతాను. ఏదైనా పెద్దఇల్లు తీసుకునేంతవరకు పరమానంద్ అందులోనే కాలక్షేపం చేస్తాడు."

"బాగానేవుంద. ఇప్పుడు మనం ఏమేమిచెయ్యాలి?"

"నువ్వువెళ్ళి పరమానంద్‌కు విషయమంతాచెప్పు. కోడలికి మనం కొన్నివస్తువులుకొనాలి. పైగా ఒకసూట్ కూడా కుట్టించాలి." భోజనంచేసి ఇవేళకూడా లైబ్రరీకి వెళ్ళలేదు, సదానంద్. కుంవం సేన్‌గారి ఇంటికి వెళ్ళాడు. పరమానంద్ టైపు చేస్తున్నాడు. వకీలుగారు ఒకతీర్మానం యొక్క మూడుకు నకళ్ళుతియ్యమని యిచ్చారు. తీర్మానం యాభై ప్రత స్కేప్ కాగితాలుంటుంద. రాత్రి తొమ్మిదిగంటలకల్లా సమాప్తి చెయ్యాలనుకున్నాడు పరమానంద్. సదానంద్ వచ్చి, "అమ్మ పిలుస్తోంది" అన్నాడు.

"ఏం పని?"

"చాలా అవసరమైన పని"

"ఏమొచ్చింది? వెళ్ళి నాకు చాలా అవసరమైన పనుందని చెప్పు. రాత్రి పదిగంటలకు కాని రావడం వీలుపడదు."

"అన్నయ్యా! అమ్మ నీ పెళ్ళి నిశ్చయంచేసింది."

"షటప్" పరమానంద్ సదానంద్‌ను కసురుకుంటూ అన్నాడు.

"నవ్వులాటి కిది సమయంకాదు."

"వేళాకోళం కాదన్నయ్యా! చమేలీని నీ కిచ్చి పెళ్ళి చేసేందుకు రామలాల్ తల్లి నిశ్చయించివెళ్ళింది. వదినకు కొంచునగలు, బట్టలు తేవాలంటోంది అమ్మ."

పరమానంద్ కోపం దూరమయిపోయింది. అతను గంభీర ఆలోచనలో మునిగిపోయాడు. కొంచెంసేపుండి అన్నాడు; "అసలేం జరిగింది సదానంద్?"

"నాకేమీ తెలియదు! ఒంటిగంటకు ఇంటికి భోజనం చేసేందుకు వచ్చాను. రామలాల్ తల్లి అమ్మతో మాట్లాడుతోంది. ఆమె నాకీ విషయం చెప్పింది. భగవంతుడు నా ప్రార్థనవిని ఆ కార్యసిద్ధికి నిన్నేపంపినట్టున్నాడు."

"సరే నా పెబ్బెతో ఎంత అవసరమైతే అంత తీసుకోమని అమ్మతో చెప్పు. కావలసిన వస్తువులు కొనమను."

"ధన్యుడవు అన్నయ్యా!" సదానంద నవ్వుతూ అన్నాడు, "భగవంతుడు ప్రార్థన విన్నాడు."

"వెళ్ళు. వేళాకోళాని కిది సమయంకాదు. నాకు చాలపని వుంది."

సదానంద్ ఇంటికివచ్చేసరికి తల్లి ఇంటిదగ్గరలేదు. రమను అడిగాడు, "అమ్మ ఎక్కడకు వెళ్ళింది?"

"చమేలీతల్లిని కలుసుకునేందుకు వెళ్ళింది."

"వెళ్ళి అమ్మను పిలుచుకురా. నేను ఎదురుచూస్తున్నానని చెప్పు."

రమ పరుగెత్తుకు వెళ్ళింది. వెనుకాల సదానంద్ కూడా వెళ్ళి చమేలీ ఇంటిక్రింద ఎదురుచూస్తున్నాడు. సరిగ్గా ఆదేసమయానికి చమేలీఇంటి పైగదికిటికీ తెరుచుకుంది. చమేలీ క్రిందకు చూసింది. ఆమె ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఆమె తన మనస్సులోని ఆనందాన్ని ప్రకటిస్తోందని గ్రహించాడు సదానంద్.

పరమానంద్ ఈ వివాహానికి ఆనందించినట్లు గ్రహించాడు. చమేలీకూడా ఆనందించడం చూశాడు. ఈ వివాహానికి, తను చేసిన ప్రయత్నానికి తనుకూడా సంతోషించాడు. అతని మనస్సునుంచి ఒక భారం తొలగిపోయింది.

క్రిందకు రాగానే చమేలీ బట్టలకు కొలతలు తీసుకునేందుకు వెళ్ళానని చెప్పింది లక్ష్మి. పరమానంద్‌కు ఈ వివాహం నచ్చిందని, అతనుడబ్బులోదితీసి ఖర్చుపెట్టమన్నాడని చెప్పాడు సదానంద్. దానిమీద లక్ష్మి అంది, "పరమానంద్‌కు చమేలీ అంటే ఇష్టమేనని చెప్పానుగా."

పరమానంద్ పెళ్ళిఆనందంలో పనిపూర్తిగా చెయ్యలేకపోయాడు. పనిసంగతివిడిచిపెట్టేసి ఇంటికివచ్చేశాడు. తమ్ముళ్ళను, చెల్లెళ్ళను బజారుకు తీసుకువెళ్ళి వాళ్ళకు క్రొత్త బట్టలు, చెప్పులు కొన్నాడు.

తల్లి చమేలీకి బట్టలు, నగలు తీసుకువచ్చింది. పెళ్లి హడావిడి ఆరంభమయినట్టే.

ఆరాత్రి పరమానంద్, సదానంద్, తక్కినవాళ్ళు కలసి క్రిందగది శుభ్రం చేసేశారు. మరునాడు ఉదయం దానికి వెల్లవేయించారు.

ఇవేళ సదానంద్, పరమానంద పనికి వెళ్ళలేదు. రోజంతా సన్నాహంతోనే సరిపోయింది. మిత్రులను పిలవడం, మిఠాయితయారు చేయించడం, బట్టలు దర్జీదగ్గరనుంచి తెప్పించడం సరిపోయింది.

రామలాల్ ఇల్లు చాలా పెద్దది. ఇంటిముందు భాగంలో పెద్దవరండావుంది. అందులో వివాహానికి పేర్పాట్లు జరిగాయి. వీధిలోని ఇళ్ళవాళ్ళందరూ వచ్చారు. సదానంద్ కవిత్వంవల్ల ఈ పెళ్ళంటే, అందరికీ ఉత్సాహం కలిగింది. అందరూ తమ్ముడు అన్నగారికి వధువును తీసుకువచ్చాడంటున్నారు.

వివాహమయిపోగానే కోడలును ఆవేళనే ఇంటికి తీసుకువచ్చారు. చమేలీ, పరమానంద్ కుటుంబం ఇంటి క్రిందగదిలో కూర్చున్నారు. కమల, కుంవర్ సేన్, సరోజిని కూడా వచ్చారు. వాళ్ళుకూడా ఆ గదిలోకే వచ్చారు. సరోజిని చమేలీకి నగలు, బట్టలు తెచ్చింది. అందరూ కూర్చోగానే సదానంద్ అన్నాడు, "అమ్మా !ఒకపని వెంటనే చేసెయ్యి !"

"ఏమిటి ?"

"వదినపేరు మార్చెయ్యి."

"ఏం ?"

"అత్తవారింటికిరాగానే జరిగేపనేగా అది."

దానిమీదట సరోజిని అడిగింది, "ఈమె పేరేమిటి?"

"చమేలీ వదిన" అన్నాడు ఒకపిల్లవాడు.

దానిమీదట చమేలీ అత్తగారి చెవిలోఅంది, "నా పేరు మార్చవద్దు."

"ఏం?"

"నా బాల్యం మర్చిపోవడం ఇష్టంలేదు."

అదివిని పరమానంద్ అన్నాడు, "అయితే నన్నింకా పమీా అన్నయ్యా అంటావా?"

అందరూ నవ్వారు. దానిమీదట సరోజిని ఆమె తల నిమురుతూ అంది, "చమేలీ పేరుబాగానేవుంది, కాని కొంచెం బజారుపేరులావుంది. నువ్వు ఇంటిశోభను పెంపొందిస్తావుగా.

దానిమీదట ఆమె పేరు పుష్పావతిగా మార్చారు.

6

ఈ వివాహానికి సదానంద్ చాలా సంతోషించాడు. శివరామ్‌నుంచి చమేలీకి విముక్తి కలిగింది. పరమానంద్ వివాహమయిపోయింది. ఇక అతను శాంతచిత్తంతో తన పనిలో విలీనమైపోయాడు. తన ఆదాయం పెంచుకోవాలనే చింత కల్గింది. పరమానంద్ పెళ్ళిలో ఒక వెయ్యిరూపాయలు వరకూ ఖర్చుపెట్టాడు. ఆ విషయం తనకు తెలుసు. కాని తన సేవింగ్స్ బ్యాంకులో కేవలం రెండు వందలేవున్నాయి. పరమానంద్‌లా తనుకూడా ధనం ప్రోగుచెయ్యాలని నిశ్చ

యించుకున్నాడు. ఏ విధంగా ధనం సంపాదించాలి అని చాలా రాత్రివరకూ ఆలోచిస్తున్నాడు.

మరునాడు చమేలీ పరమానంద్ చాలాసేపటివరకూ లేవలేదు. మొదటిరాత్రి మధుర అనుభూతులతో తేలియాడి అలసి సొలసి నిదురపోయినట్టున్నారు. సదానంద్ కూడా ప్రొద్దు పొడిచేవరకూ లేవలేదు. పరమానంద్ లేవకపోవడంచూసి తల్లి పిల్లల్ని లేవగొట్టమని చెప్పింది. తాను స్వయంగా సదానంద్‌ను లేవగొట్టేందుకు వెళ్ళింది, "ఇవేళ పనికి వెళ్ళక్కర లేదా ?"

"చాలా ప్రొద్దు అయిందే." అంటూ లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి బట్టలు తొడుక్కుని అల్పాహారానికి సిద్ధమయ్యాడు. రాత్రి బజారునుంచి తెప్పించిన పూరీలు, మిఠాయి మిగిలాయి. అవే తిన్నాడు. సదానంద్ భోజనం చేస్తూ చేస్తూ రాత్రి ఆలోచనలను మళ్ళీ ఆరంభించాడు.

అవే ఆలోచనలతో ఇంటినుంచి బయలుదేరాడు సదానంద్. క్రిందకు చేరేప్పటికి పరమానంద్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్ళాడు. చమేలీ బట్టలు కట్టుకుని గంభీరంగా ఆలోచిస్తూ మంచంమీద పడుకునివుంది. సదానంద్ వరండాలోకి రాగానే చమేలీ పిలిచింది, "సదా అన్నయ్యా !"

సదానంద్ ఆమె ఒంటరిగా వుండటంచూసి లోపలికి వెళ్ళాడు. గదిలోకివెళ్ళి అడిగాడు, "ఏం వదినా ? ఏమిటి అంటున్నావు ?"

"సీతలకాయ అంటున్నా, ఇదేమిటి ఇలాచేశావు ?"

"ఏం చేశాను, వదినా!"

"నీమంచంమీద పడుకోబెట్టుకునే బదులు మరొక మంచంమీదకి త్రోసేశావ్?"

"అయితేమాత్రం చెడేమివుంది. ఎవరిమంచంమీద పడుకున్నావో అతను నాకంటే మంచివాడేగా!"

చమేలీ జవాబు చెప్పలేదు. ఆమె మౌనంగా వుండటంచూసి సదానంద్ ఆమె ముఖంవైపు చూశాడు. ఆమె కళ్ళల్లో అశ్రువులు నిండివున్నాయి. అతను వెనక్కి తిరిగి మాటలు ఎవరైనా వింటున్నారేమో అని చూశాడు. దాని మీదట అడిగాడు,

"ఏం జరిగింది వదినా? అన్నయ్య సరిగా ప్రేమించలేదా?"

"కాని నేను నిన్ను పెళ్ళాడదామనుకున్నాను. మొన్న మీఅమ్మవచ్చి మాట్లాడుతోవుంటే నీ విషయమనుకున్నా. కాని నిన్న మీ అన్నయ్యవచ్చి వేదికమీద కూర్చోగానే ఆశ్చర్యం, బాధకల్గాయి. ఆ అగ్నిహోత్రంలోపడి ఆహుతయిపోదామా అనిపించింది. కాని దానివల్ల లాభంలేదనిపించింది."

"అన్నయ్య ప్రతివిషయంలోనూ నాకంటె శ్రేష్ఠుడే, అతనిలో నువ్వు దోషం పట్టలేవు."

"కాని నాకు చెట్నీ తినాలనివుంటే హల్వా పెట్టావు."

"ఏం, చెట్నీ హల్వాకంటే బావుంటుందా?"

"బావుండటమనేది ఒక్కొక్కరి మనస్సునుబట్టివుంటుంది. నాకు అదే ఇష్టం."

"ఇకచాలించు వదినా! విషానికి బదులు అమృతం దొరికినందుకు సంతోషించాలి!"

"నువ్వు శివరామ్‌మాట చెబుతున్నావా? శివరామ్‌తో పెళ్ళిగనుక అవడంవస్తే ఆరోజే ఇంటికప్పునుంచి ఉరికి శ్మశానానికి చేరేదానిని."

"అయితే ఈ హల్వాకంటే అది మంచిదా?"

"అయితే ఇందులో నీ ప్రతిభ ఏముంది? నేను నిన్ను ప్రేమిస్తున్నాను కదా?"

"ఛీ! ఛీ!" సదానంద్ ముక్కుమీద వేలువేసుకుని అన్నాడు, "చమేలీ! కాదు కాదు పుష్పావతీ! నేనిక నీ చిన్న తమ్ముడను. అదృష్టంలో వ్రాసినట్టు అయిపోయింది. ఇక మీదట అటువంటి మాటలు అనవద్దు. చిన్ననాటి మాటలు మర్చిపో."

"కాని మర్చిపోగలనా?"

"ఎందుకుకాదు? నేనీవిషయంలో సహాయపడతానుగా?"

"ఏం చేస్తావు?"

"అది నీకు తరువాత తెలుస్తుంది."

ఇదంతావిన్నా చమేలీకి ఆనందం కలుగలేదు. సదానంద్ అన్నాడు, "చూడువదినా! ఇక నువ్వు పుష్పావతివి. చమేలీని మర్చిపో."

ఇలా అని సదానంద్ ఇంటినుంచి బయటకు వచ్చాడు. తిన్నగా ఫకీరుద్దీన్ దుకాణానికి వెళ్ళాడు. చమేలీ తన చిన్ననాటి విషయాలను మర్చిపోలేనంది. దానిమీదట తను రాత్రులు ఇంటిదగ్గర నిదురపోకూడదని నిశ్చయించుకున్నాడు.

ఈ విధంగా ఆమె మనస్సులోని పాతభావాలన్ని మారం చెయ్యొచ్చు అనుకున్నాడు.

సదానంద్ చెప్పులు విడిచి, చాపమీద పనిచేసేందుకు కూర్చున్నాడు. కూర్చోగానే మున్షీ అడిగాడు, "సదానంద్, నిన్నరాలేదేం?"

"అన్నయ్యపెళ్ళి. రోజంతా హడావిడిగావుంది."

"తాజ్ కంపెనీవాళ్ళు ఒక పుస్తకం పంపించారు. ఈ పుస్తకమంతా నువ్వే నకలుచెయ్యాలని వాళ్ళ ఉద్దేశ్యం. నేను ఖాళీలేదని చెప్పాను. కాని వాళ్ళు ఒత్తిడిచేశారు, పేజీకి అయిదణాలు ఇస్తానంటున్నారు."

"మున్షీగారు! ఆపని నేను చేస్తానుకాని, కొంచెం ఆలస్యమవుతుంది. తొందరపెడితే లాభంలేదు."

"ఎన్ని పేజీలుంటుంది?"

"మూడువందలుపైగా వుంటుంది. పదిహేనురోజుల్లో ఇచ్చెయ్యమంటున్నారు."

"పదిహేనురోజుల్లో అవ్వదు. పైగా నేను సాయంకాలం పనిచెయ్యడంలేదుకూడాను."

"చూడు సదానంద! డబ్బు చాలా విలువైన వస్తువు. కష్టపడితేకాని దొరకదు. నువ్వు సాయంకాలం తిరిగేకంటే, అయిదింటినుంచి తొమ్మిదింటివరకూ కూడా కూర్చున్నావంటే పదిహేనురోజులలో అయిపోతుంది.

సదానంద్ మజూరీ లెక్కించుకున్నాడు. పూర్తి పుస్తకానికి నూటయాభై పైబడి వస్తుంది. ఆరోజునుంచే పనిచెయ్యాలని మోహం కలిగింది. రోజుకు, రెండుకాగితాలు వ్రాయడానికి

చాలా కష్టపడాలి. కాని నిష్టగలవానికి అదేమీ అసాధ్యం కాదు. సదానంద్ మనస్సులో డబ్బుసంపాదించాలనే అభిలాష ఎక్కువయ్యింది. దానికి వెనక రచయిత కావాలనే వాంఛ కూడావుంది. ప్రజలు తనకవిత్వాన్ని మెచ్చుకుంటారు. అందుచేత తనొక్క పుస్తకంవ్రాసి స్వయంగా అచ్చువేయించాలను కున్నాడు. దానికి ధనం కావాలి.

ప్రస్తుతం అతను ఉదయం ఏడింటినుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వ్రాస్తున్నాడు. తరువాత ఇంటికివెళ్ళి భోజనంచేసి విశ్రాంతి తీసుకుంటాడు. తరువాత అయిదింటికి వెళ్ళి రాత్రి పదింటివరకూ పనిచేస్తున్నాడు. రాత్రి ఎక్కువ సమయం కావడంవల్ల అక్కడే పండుకునే ఏర్పాటుచేసు కున్నాడు. రాత్రులు ఇంటికిరానందుకు కారణం అడిగారు, అతని తల్లి, పరమానంద్. "ఒకపుస్తకం పదిహేనురోజుల్లో ఇచ్చివెయ్యాలి. అందుచేత రాత్రులు రావడం వీలుపడటం లేదు."

అతను రోజూ తల్లికి రెండు రూపాయ లిస్తున్నాడు. ఇది అతని నిజాయితీకి ప్రమాణంగావుంది.

పుస్తకం పదిరోజులలోనే సమాప్తమయిపోయింది. తల్లికి కొంతఇచ్చి, తన ఖర్చుపోగా మిగిలింది, సేవింగ్సబ్యాంకులో వేశాడు. ఈ విధంగా అతని బ్యాలెన్సు వందరూపాయలు పెరిగింది.

ఈ పనివల్ల మరొక సమస్య పరిష్కరించబడింది. అతనొక రోజున మేనేజర్‌తో అన్నాడు, "మేనేజర్ గారూ!

రాత్రులు పైగది ఖాళీగానే వుంటోంది. అక్కడ పండుకునేం దుకు అద్దెకు ఇవ్వండి."

ఈ పుస్తకం వ్రాసినన్నాళ్ళూ అక్కడనే పడుకున్నాడు. ఫకీరుద్దీన్ సదానంద్ ముఖంవైపు చూశాడు. సదానంద్‌కు, తల్లి, అన్నా చెల్లెళ్ళు వున్నట్టు అతనికి తెలుసు. అతనడిగాడు,

"ఏం? అమ్మతో దెబ్బలాడావా?"

"లేదండీ! ఇంట్లో ఒకేగదివుంది. అందులో ఎనమం దుగురుపడుకోవాలి. నేను ఒకపుస్తకం వ్రాయాలనుకుంటున్నా. అక్కడపిల్లల అల్లరిగా వుంటుంది."

"ఏం వ్రాస్తావు?"

"ఒకపుస్తకం."

మున్షీ నవ్వుతూఅన్నాడు, "ఏమాత్రంచదివావేమిటి?"

ఆప్రశ్న వెయ్యగానే సదానంద్ ధైర్యం సన్నగిలింది. కొంచెం ఆలోచించి అన్నాడు, "నేనుబాగా చదువుకున్న పండితుల కోసం వ్రాయను. నాలాటివాళ్ళకోసమే వ్రాస్తాను."

మేనేజర్ గంభీరంగా అన్నాడు. "చూడు సదానంద్! నువ్వు పాడే పద్యాలు వినడానికి బాగానే వుంటాయి. కాని చదవడానికి చాలా చప్పగావుంటాయి."

"మేనేజర్! నా ఉత్సాహం నాశనం చెయ్యకండి. ఈగది రాత్రి పడుకునేందుకు ఎంతకు ఇస్తారో చెప్పండి."

"నెలకయిదురూపాయలు."

"సరే. ఇవేళనుంచి, రాత్రులు ఇక్కడే పడుకుంటాను. రాత్రి ఏడుగంటలనుంచి, ఉదయం ఏడుగంటలవరకూ ఇది నాక్రింద వుంటుంది."

ఆరోజునుంచి సదానంద్ తన దినచర్య మార్చివేశాడు. ఆగదిలోనే నిద్రపోతున్నాడు, తనబట్టల ట్రంకుపెట్టె, తన పడక బట్టలు అక్కడకు తెచ్చివేసుకున్నాడు. ఉదయం సూర్యోదయానికి ముందుగానేలేచి కాలకృత్యాలు తీర్చు కుంటాడు. రోడ్డుమీద పంపుదగ్గర స్నానంచేసి బట్టలు తొడు క్కుని, పడక బట్టలుచుట్టి మూలట్రంకుమీద పెడతాడు. తరు వాత బజార్లో రెండణాలు పూరీలుతిని, రెండణాల లస్సీత్రాగి పని ప్రారంభిస్తాడు. ఏడుగంటలనుంచి ఒంటిగంటవరకూ నాలు గైదు రూపాయల పనిచేస్తాడు. అక్కడనుంచి ఇంటికివెళ్ళి భోజనంచేసి పడుకుంటాడు. రెండురూపాయలు తల్లికిచ్చి విశ్రాంతి తీసుకుంటాడు. మూడున్నరకు లైబ్రరీకి వెళ్తాడు. రాత్రి ఏడుగంటలవరకూ అక్కడవుండి, ఇంటికివచ్చి భోజ నంచేసి తనమకాంకువచ్చి వ్రాసుకుంటాడు. అతను తన మొదటి పుస్తకానికి, "పరిస్తాన్ యాత్ర" అని పేరుపెట్టాడు.

ఈ విధంగా పనిజరుగుతోంది. రెండు నెలలు గడి చాయి. ఈమధ్య అతను బయటవుండటంవల్ల లక్ష్మికి చింతగా వుంది. ఒకరోజున మధ్యాహ్నం భోజనం చేస్తుంటే లక్ష్మి అడిగింది, "సదా! నువ్వు బయటవుడటం బాగాలేదు. పుస్తకం పూర్తవ్వలేదా?

"లేదమ్మా! ఇక్కడ పనిజరుగదు."

"రాత్రిభోజనం ఎక్కడ చేస్తున్నావు?"

"అక్కడ ఒకదుకాణంవుంది. మూణ్ణాలయితే పొట్ట నిండిపోతుంది."

"ఇంటిదగ్గరకంటె బాగుంటుందా!"

"అదికాదమ్మా! ఇక్కడను రోజూ రాత్రి రావా లంటే సమయం వ్యర్థమయిపోతుంది."

"పుస్తకం వ్రాసి ఏం చేస్తావు?"

"అచ్చువేయిస్తాను. అమ్ముడయితే మంచి పేరు వస్తుంది.

"అంతేనా?"

"ఇంకేమి కావాలమ్మా?"

"నువ్వు బాగా డబ్బు సంపాదిస్తే ఒక పెద్ద ఇల్లు తీసుకోవచ్చు. దానిలో నువ్వు నీ భార్యతో వుండొచ్చు."

"చాల్లే అమ్మా! ఒకకోడలు సరిపోదా?"

"కోడలు నాకోసమా? నీకోసమే చెబుతున్నా."

"నాకక్కరలేదమ్మా!"

"ఏం?"

"అక్కరలేదమ్మా! అంతే. ముందు కమల, ప్రభ, రమలకు పెళ్ళిచెయ్యి" తల్లి గంభీర ఆలోచనలోపడి అంది, "సరే, పరమానంద్‌తో మాట్లాడతాను. కాని నువ్వసలు వాడికి కన్పించడంలేదే."

"అమ్మా! పుస్తకం సమాప్తయ్యాకా కలుసుకుంటాను."

తరువాత పడుకున్నాడు. కాని ఒక్కసారిగా మెలుకువ వచ్చేసింది. ఎవరో అతనికాలు గోకుతున్నారు. కళ్ళు తెరచి చూస్తే చమేలీ. పుల్లతో కాలు పొడుస్తోంది.

ఈమధ్య గదిలో పడుకుని రెండునెలలయ్యింది. అందు చేత అసలు చమేలీ కన్పించనేలేదు. సదానంద్ తల్లి చమేలీ

తల్లి ఇంటికి వెళ్ళింది. పిల్లలందరూ స్కూలుకు వెళ్ళారు సదానంద్ ఒంటరిగా వుండటంచూసి చమేలీ లేపింది.

అతనులేచి, "ఏమిటి వదినా?" అనడిగాడు.

దానికి సమాధానంగా చమేలీ అతని ప్రక్కన పడుకుంది. సదానంద్ ఇంకా అర్థంచేసుకుంటూంటేనే, ఆమె అతన్ని కౌగలించుకుని, ముద్దుపెట్టుకుంది. సదానంద్ ఆమె ఉద్దేశ్యం గ్రహించి వెంటనే బలవంతాన కౌగలి విడిపించుకుని లేచి నుంచున్నాడు. చమేలీకి కోపంవచ్చింది. కాని వెంటనే మళ్ళీ చేతులుచాపి కౌగిలిలోకి ఆహ్వానించింది. సదానంద్ తలవూపి అన్నాడు, "ఏమంటున్నావు వదినా! ఛీ! ఛీ! వదినగారు తల్లితో సమానమయినది?"

"కాని నేను నిన్ను ... ..."

సదానంద్ ఆమె ముఖంమీద చెయ్యిపెట్టి అన్నాడు, "ఏమంటున్నావు?"

"ఏం? మనస్సులోనిమాట చెప్పడం పాపమా?"

"మనస్సులోని విషయం ఆలోచించకుండా చెప్పడం పశుత్వం!"

"కాని నేను ఆలోచించే చెబుతున్నా. నా మనస్సు నిన్ను ప్రేమించమంటోంది."

"కాని స్త్రీ తన భర్తను మాత్రమే ప్రేమించాలి!"

"తన మరదిగారినికూడా ప్రేమించాలని బుద్ధిపుడితే?"

"చూడు వదినా! రహస్యంగా చెయ్యవలసినపని మంచిదికాదు."

"కాని మీ అన్నయ్యనుకూడా రహస్యంగానే ప్రేమిస్తానుగా."

"అయినప్పటికీ గదిలో ఏం జరిగేదీ అందరకూ తెలుసు. కాని ఎవరూ ఏమీ అనరు. వదినా! నీ హృదయం అన్నయ్య ఒక్కడితోనే ఎందుకు సంతృప్తిపడదు?"

"ఏమో ఎందుకనో తెలియదు. ఆయన చాలా మంచివారు నన్ను బాగా ప్రేమిస్తారు. అత్తగారికి తెలియకుండా తినేందుకు మిఠాయి అవీ తెస్తారు. ఆదివారం షికారుకు తీసుకు వెళ్తారు. అయినప్పటికీ నేను నేమీదే కలలుకంటాను. రోజంతా మనస్సు స్థిమితంగా వుండదు."

అలాఅని ఆమె తిరిగి సదానంద్ చెయ్యి తనచేతిలోకి తీసుకుంది. కాని సదానంద్ వెంటనే చెయ్యిలాక్కుని, "వదినా! కాస్త వళ్ళు తెలుసుకుని మసలు. నువ్వు మనిషివి. ఆవు, గేదెవు కాదు. నిన్ను నువ్వు గుర్తించుకో."

అతను వెంటనే చెప్పులు తొడుక్కుని ఇంటినుంచి దిగి వెళ్ళిపోయాడు. ఈవేళ మనస్సు అల్లకల్లోలంగావుంది. అందుచేత లైబ్రరీకి వెళ్ళలేదు. నగరంలోని పార్కుకువెళ్ళి ఏకాంతంలో పడుకున్నాడు. ఆలోచిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనానంతరం ఇంటివద్ద వుండకూడదని నిశ్చయించుకున్నాడు. చమేలీని ఒంటరిగా కలుసుకోకూడదు.

ఆమె స్పర్శవల్ల తనలో కామం జనించినట్టుగా అతను అనుభూతిని పొందుతున్నాడు. స్త్రీవాంఛ తనలో జనించినట్టుంది. అతను ఈ కోరికనుంచి బయట పడ్డాడు, అంటే అది తన సంస్కారాల ఫలితం. సంస్కారాలు గట్టివి కావడంవల్ల

తను బయటపడ్డాడు. వదినగారు తల్లివంటిది అనేభావన అతని మనస్సులో నాటుకుపోయింది. లక్ష్మణుడు కేవలం సీతయొక్క పాదాలే చూశాడు.

వాస్తవానికి చమేలీ మొదటిసారిగా సదానంద్‌ను తన యింటికి పిలిచి ప్రేమించే నాటికీ సదానంద్ చాలా ముందుకు పోయాడు. అతని మనస్సులో ఉన్నత భావాలు చిత్తంలో స్థిరత్వం, ఏర్పడ్డాయి. మనస్సు, ఇంద్రియాలమీద అధికారమే మానవుణ్ణి పైకి తీసుకువెళ్ళగలదని అతను బాగా గమనించాడు. కాని ఈసారి ఏకాంతంలో కూర్చోగానే ఇప్పుడు తల్లిమాటలు జ్ఞాపకం వచ్చాయి. తన తల్లిఅంది, "నువ్వు బాగా సంపాదించినట్టయితే ఒక పెద్దయిల్లు తీసుకోవచ్చు. అందులో నీ భార్యతో నీవు కాపురం చెయ్యవచ్చు. వాస్తవానికి తనకూ భార్య కావాలనిపించింది అతనికి. కాని సంసారి కావాలంటే ధనం కావాలి. దానికి రచయిత అయితే గాని లాభంలేదు.

కొంచెం ఇంచుమించుగా రెండుగంటలు సేపు చమేలీ తన పెళ్ళివిషయాలు ఆలోచించిన తరువాత లేచి పరమానంద్‌ను కలుసుకునేందుకు వెళ్ళాడు.

పరమానంద్ కచేరీనుంచివచ్చి మరునాటి ఫైళ్ళు తిరగ వేస్తున్నాడు సదానంద్‌ను రోడ్డుమీద చూడగానే అతని కోసం ఎదురుచూస్తున్నాడు. రెండున్నర నెలలక్రితం అతను తన వివాహవార్త తీసుకువచ్చాడు. ఇవేళ ఏ వార్త తెచ్చి వుంటాడో అని ఎదురుచూస్తున్నాడు.

సదానంద్ కార్యాలయంలోకిరాగానే నమస్కారంచేసి కుర్చీలో కూర్చున్నాడు. పరమానంద్ కొంచెంసేపు అతని ముఖంవేపు చూశాడు. తరువాత అతనేమీ మాట్లాడక పోవడంచూసి, తనిఫైళ్ళు సర్దుకుంటున్నాడు. పదిహేను నిమిషాలయ్యింది. అతను "కొంచెం సైపుచేసుకోవాలి, ఏదయినా పనుండి వచ్చావా?"

"లేదు. అమ్మ నిన్ను కలుసుకోమని చెప్పింది లైబ్రరీకి వెళ్ళకుండా ఇలా వచ్చాను."

"అయితే అమ్మ చెప్పినదానిమీద వచ్చావన్నమాట"

"రోజూ రావాలనే అనుకుంటున్నా కాని ఒకపనిలో మునగటంవల్ల రాలేకపోయాను."

"ఏం పని?"

"ఒక పుస్తకం వ్రాస్తున్నా."

"మెట్రిక్ కూడా ప్యాసు కాకుండానా?"

"మెట్రిక్ ప్యాసయిన వాళ్ళకంటే ఎక్కువే తెలుసు నాకు. నేను స్వయంకృషి విడిచిపెట్టలేదు."

పరమానంద్ తనకు దెబ్బకొట్టాడనుకున్నాడు. అయినప్పటికీ అనవసర సంశయం విడిచిపెట్టి అడిగాడు, "ఏంచదువుతున్నావు?"

"చరిత్ర, మతము, సాహిత్యము మొదలైన వాటిమీద పందలాది పుస్తకాలు చదివాను, వాటితోపాటు హిందీ, సంస్కృతం, ఇంగ్లీషుకూడా చదువుతున్నా."

"ఏం పుస్తకం వ్రాస్తున్నావు?"

"పుస్తకంపేరు పరిస్తాన్‌యాత్ర" పుస్తకం ఉర్దూలో వ్రాస్తున్నా. కథ మధ్యమధ్యలో పద్యాలుకూడా వ్రాస్తున్నా. దీన్ని చాలా రసవత్తరంగా తయారు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నా, తరువాత పుస్తకం ఒక ఆదర్శాన్ని చూపిస్తుంది. ఇంద్రియాలసుఖం స్థిరంకాదని చూపించడానికి ప్రయత్నించాను. వాటివే ప్రభావమైతే మనస్సుమీద పడుతుందో, అవే సంస్కారాలుగా వుంటాయి. ఇంద్రియాలయొక్క అనుభవాలు ఎలా వుంటాయో సంస్కారాలుకూడా అలానే వుంటాయి. మానవునియొక్క ప్రభావం ఆ సంస్కారాలయొక్క అధీనంలో వుంటుంది."

సదానంద్ మునుపటి సదానంద్ కాడని గ్రహించాడు పరమానంద్. ఇదివరకు ఆల్‌జీబ్రా చెప్పేవాడు. కాని ఇప్పుడు సదానంద్ మానవ ప్రకృతి, మానవ స్వభావంయొక్క విశ్లేషణం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. వాస్తవానికి మెట్రిక్ పాసయిన వ్యక్తికంటే ఎక్కువ తెలుసు. అయినా అన్నాడు, "నీ పుస్తకం బాగా అమ్ముడవదని నా ఉద్దేశ్యం. నువ్వింకా వయస్సులో చాలా చిన్నవాడవు. ప్రజలు చదివి నవ్వుకుంటారు"

"అందుకే అమ్ముడవుతుంది. నవ్వటానికి ప్రజలు ఎంతయినా ఖర్చుపెడతారు. కాని నేను పుస్తకం స్వయంగా ప్రింటుచేయించడంలేదు. తాజ్ కంపెనీవాళ్ళు దీన్ని అచ్చువేయిస్తున్నారు. డబ్బు వాళ్ళది ఖర్చవుతుంది. అమ్ముడయితే నాకు డబ్బువస్తుంది. పోకపోతే నష్టం ఏమీలేదు. కంపెనీదే నష్టం."

"అయితే అచ్చువేసేందుకు మనమేమీ ఖర్చుపెట్టక్కర లేదుగా"

"లేదన్నయ్యా!"

అది వినగానే పరమానంద్ సంతోషించి సైపు చేసుకుంటున్నాడు. పది పదిహేను పంక్తులు సైపుచేసి అతనన్నాడు, "నువ్వు రాత్రులు ఇంటివద్ద పడుకుంటే బావుంటుంది"

"ఇంటిదగ్గర వ్రాయడం కష్టం. రాత్రులే వ్రాసుకోవాలి. కాని అప్పుడు పిల్లలు అల్లరి చేస్తారు,"

పరమానంద్ మళ్ళీ సైపుచేస్తున్నాడు. ఒక నిమిషం తరువాత అన్నాడు, "సదా! మీవదిన నిన్ను ఎక్కువగా తలపెడుతూంటుంది. ఇంటికి వెళ్ళినప్పుడు కలుసుకుంటూవుండు"

సదానంద్ వళ్ళు గగుర్పొడిచింది. చాలా ప్రయత్నం మీద అపుచేసుకుని అన్నాడు, "నేను మధ్యాహ్నం వెళ్ళేసరికి క్రిందనిద్రపోతూంటుంది. ఈసారి లేపి కలుసుకునివస్తాను."

తరువాత పరమానంద్ తిరిగి సైపుచేసుకుంటున్నాడు. కమలను కలుసుకునేందుకు సదానంద్ లోపలికి వెళ్ళాడు. ఒక గదిలో ఆడుకుంటున్నాడు ప్రమోద్. సదానంద్ అతనిదగ్గరకు వెళ్ళి ఎత్తుకుని "ఏం చేస్తున్నావు?" అనడిగాడు.

"రావీనదికి వంతెన కడుతున్నా"

"మోటారుకారుకా! రైలుకా?"

"మోటారుకారుకు."

"అయితే నాన్నా! మోటారు కావాలి"

"పాపా తీసుకు వస్తారుగా."

"పాపా నీకు తెస్తారు. కాని నాకు?"

"ఏం?"

"పాపానే అడుగు."

8

చమేలీ వ్యవహారం సదానంద్ మనస్సును ఎంతగాయ పరిచిందంటే ఆరాత్రి పనిచెయ్యలేకపోయాడు. వేసవికాలం వచ్చింది. ఏప్రిల్ నెల ఆరంభం. అతను తనపుస్తకం స్క్రిప్టు తీసుకుని ఇంటిపైకి వెళ్ళి కూర్చున్నాడు. లైటు గోడకు తగిలించాడు. చాపవేసుకుని చదువుకుంటున్నాడు. కాని కళ్ళ ముందు చమేలీ, వీథిలోని తక్కిన పిల్లలు తిరుగుతున్నారు. పరిణామంగా చదువు విడిచిపెట్టి ఏవో ఆలోచిస్తున్నాడు.

ఈ విధంగా మూడుగంటలు కూర్చున్నాడు. కాని ఒక అక్షరం కూడా వ్రాయలేకపోయాడు. దానితో విసుగు వచ్చి కలం మూసివేసి పుస్తకాలు ప్రక్కన పడవేసి చాప మీద పండుకున్నాడు. అయినా నిద్రరాలేదు. నెమ్మది నెమ్మదిగా సమయం గడుస్తోంది, అయినా కన్ను మూత పడటం లేదు. దూరంగా గడియారంగంటలు వినిపిస్తున్నాయి. ఒంటిగంటయ్యింది, రెండయ్యింది, మూడయింది, నాలుగుకూడా అయింది ఇక తెల్లవారుతుందనుకుని లేచి కూర్చున్నాడు. ఒక గ్లాసుడు నీళ్ళు త్రాగి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. తల దిమ్ముగావుంది. స్నానంచేస్తే బావుంటుందికదా అనుకున్నాడు. క్రింద రోడ్డుమీదకువెళ్ళి పంపుదగ్గర కూర్చున్నాడు. దానివల్ల బుఱ్ఱవేడి తగ్గింది వళ్ళుతుడుచుకుని, అంగవస్త్రం కట్టుకోగానే నిద్రపట్టింది.

ఒక్కసారి మెలకువ వచ్చింది. ప్రొద్దెక్కింది. లేచి కూర్చున్నాడు. తన తోటి పనివాళ్ళు వస్తున్నారు.

ఒంటిగంటకు పని పూర్తిచేసుకుని, ఇంటికి వచ్చాడు. భోజనం పెడుతూ తల్లి అడిగింది, "నిన్న పరమానంద్‌ని కలుసుకున్నావా?"

"అవునమ్మా. నువ్వు చెప్పావుగా కలుసుకున్నాను."

చమేలీ పైగదిలోనే కూర్చుని చూస్తోంది. సదానంద్‌కు ఇది నచ్చలేదు. దానిమీదట అన్నాడు, "అమ్మా! వదిన పెళ్ళయి మూడునెలలయింది. కాని నువ్వింతవరకూ ఆమెకు పని చెప్పడంలేదు."

"జీవితమంతా ఆమె వుండాలిగానాయనా! ఈ శరీరం వున్నంతవరకూ దీనినిలా వుపయోగించవలసిందే, తరువాత వాళ్ళిష్టమొచ్చినట్టు చేసుకుంటారు."

"అలా కాదమ్మా! వదినకు సోమరితనం అలవాటయ్యిందంటే రేపు అన్నయ్యను బాధపెడుతుంది. లేవదినా కొంచెం బెల్లం పట్టుకురా. అమ్మా చెప్పవే బెల్లం ఎక్కడుందో."

అత్తగారు చెప్పకుండానే చమేలీ వంటింట్లోకి వెళ్ళి ఒక కుండలోనుంచి బెల్లంతీసి తెచ్చింది. సదానంద్ కంచంలో వేస్తుంటే టప్‌మని ఒక కన్నీటి బిందువు అతని కంచంలో పడింది, సదానంద్ ఆమెవంక చూసేలోపుగానే ఆమె వంటింట్లోకివెళ్ళిపోయింది. కళ్ళుతుడుచుకుని వచ్చింది. సదానంద్‌కు చమేలీమీద జాలికలిగింది, కాని ఆమె మనస్సులోని కోరి కను తీర్చలేదు. సదానంద్ బెల్లంతో ఆఖరి రొట్టె తింటు

న్నాడు. లక్ష్మిఅంది, "నిన్న పరమానంద్ కమలనుగురించి ఏమైనా చెప్పావా ?"

"లేదమ్మా!"

"జీవన్‌లాల్‌గారి అబ్బాయి హైకోర్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాడట. జీవన్‌లాల్ కమలను చెయ్యమని అడుగుతున్నాడు. కాని కమలవద్దంటోంది."

"ఏమంటోంది?"

"అమ్మకు పదకొండుమంది పిల్లలున్నారుకదా అని జడుస్తోంది. తనకుకూడా అలా వరుసగా పిల్లలు మొదలిడితే చస్తానంటోంది"

"నిజమే అంది. వివాహం అక్కర్లేనంతవరకు అలానే వుండమని చెబుతాను. తరువాత చూడొచ్చు."

"అదెలా కుదురుతుంది నాయనా? పెళ్ళవకపోతే దానికి సగం విషయాలే తెలియవు. బుద్ధి వికసించనే వికసించదు."

"అమ్మా! నేనూ పెళ్ళిచేసుకో కూడదనుకుంటున్నా. నేనుకూడా మూర్ఖుణ్ణేనా. పైగా మూర్ఖుడుగానే వుండిపోతానా !"

"ఆడపిల్లలకు, మగపిల్లలకు భేదంవుంది అబ్బాయి."

సదానంద్‌కు ఆ భేదం ఏమిటో అర్థంకాలేదు. అందుచేత మాట్లాడ కూరుకున్నాడు.

సదానంద్‌కు నిద్రవస్తోంది. కాని ఇంటిదగ్గర పండుకోనడం ఇష్టంలేదు. అందుచేత ఏదో పనుందనిచెప్పి తన మకాంకు వెళ్ళిపోయాడు.

ఈసమయానికి ఇల్లుదూరంగావున్న పనివాళ్ళు కొందరు అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. సదానంద్ కూడా వెళ్లి అక్కడ ఒక చాపమీద పండుకున్నాడు. తనపక్కనే పనిచేసే ఫిరోజ్ పడుకున్నాడు. ఫిరోజ్ వయస్సు ఇరువైయొక్క సంవత్సరాలుంటుంది. అతను అవివాహితుడు ఇంటి దగ్గరనుంచి వచ్చేటప్పుడు ఉదయం భోజనంకూడా తెచ్చు కుంటాడు. భోజనంచేసి ఒకగంట విశ్రాంతి తీసుకున్నాడు. సదానంద్ ఇవేళ మధ్యాహ్నమే రావడంచూసి ఆశ్చర్యంగా అడిగాడు, "సదానంద్! ఏం ఇవేళ మధ్యాహ్నమేవచ్చేశావు?"

"రాత్రి నిద్రపట్టలేదు. అందుచేత అలసటగావుంది."

"ఎందుచేత పట్టలేదు?"

"విశేషమేమీలేదు. ఏమోఎందుకో పట్టలేదు."

"ఎందుకో నేను చెప్పనా? నాకు కూడా అలాగే జరిగేది."

"ఎలాజరిగేది?"

"అప్పుడప్పుడూ రాత్రులు నిద్రపట్టదు. మొదట్లో నేను చాలా అశాంతిగా వుండేవాణ్ని. ఇప్పుడు దానికి మందు తెలిసింది."

"ఏం మందు?"

"యౌవ్వనంలో రక్తం వేడెక్కి తలకెక్కుతుంది. దాన్ని చల్లార్చాలి. లేకపోతే నిద్రపట్టదు."

"నేనివేళ ఉదయం పైపుక్రింద పదిహేను నిమిషాలు తలవుంచి స్నానం చేశాను. తరువాత నిద్రపట్టింది. కాని వెలుగు వచ్చేసింది."

"నేనయితే దేనిదగ్గరకైనావెళ్లి వేడి చల్లార్చుకునే వాణ్ని."

"కాని అది చాలా కష్టమైన విషయమే."

"పెళ్లిచేసుకునేకంటే సులువే."

"పెళ్లిఅంటే చాలా విషయాలుంటాయి."

"ఇతర విషయాలమాట విడిచిపెట్టు. పిల్లలంటావా? మనకెందుకు? భోజనం హోటల్లో చెయ్యవచ్చు. ఇక్కడే పడుకోవచ్చు. ఇక మిగిలింది యౌవ్వనోద్రేకం. దానికి దేనిదగ్గరకైనా తీసుకువెడతా నను."

"నువ్వెక్కడికెడతావు?"

"ఊరుబయట మాదిగదొక్కత్తెవుంది. కాస్త బాగా లేనప్పుడు అక్కడకు వెడతాను. అర్ధరూపాయతో పని జరిగిపోతుంది."

"అంతే?"

"ఆ. ఇవేళ నాకూడారా. తల ఎలా చల్లబడుతుందో చూద్దువుగాని."

"పోనియ్యి! నా కిలాగే నిద్రవస్తోంది."

ఫిరోజుద్దీన్ నిద్రఐపోయింది. అతనులేచి బయటకు వెళ్లిపోయాడు. కానీ ఈ విషయం సదానంద్ మనస్సులో సంఘర్షణ లేవదీసింది. ఫిరోజ్ తిరిగివచ్చేసరికి సదానంద్ మెలుకువగానే వున్నాడు. ఫిరోజ్ రావడంచూసి లేచి బయటకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. ఫిరోజ్ సదానంద్ కళ్ళు నిద్రలేక ఎఱ్ఱగా వుండటం చూశాడు. తనుకూడా బయలుదేరి అతనితోపాటు బయటకు వచ్చాడు.

సదానంద్ పార్కులోకి వెళ్లి పడుకుందామనుకుం
న్నాడు. ఫిరోజ్ తనకూడా రావడంలోని ఆశయం అర్థం
కుని అన్నాడు, "ఫిరోజ్ నీపని చూసుకో. నేను మరో
చోటికి వెళ్లి పడుకుంటాను."

"సదానంద్! నువ్వు అనవసరంగా బాధపడుతున్నా.
నువ్వు నాకూడా రాకపో తేసరేసరి. ఇక్కడికే తీసుకువస్తాను

"వద్దుబాబూ! అటువంటి ఏర్పాట్లేమీ చెయ్యనక్క
లేదు. నా నిద్రవిషయం నేనే చూసుకుంటాను."

"చూడు రాత్రినువ్వు గదిలో ఒంటరిగా వుంటా
మంచి అవకాశం తక్కువ డబ్బుతోనే అనుభవించవచ్చు.

"అదేం అక్కరలేదుబాబూ. నువ్వువెళ్ళు. రోజం
పనిచెయ్యలేదు. పనిచూసుకో."

"సరే రాత్రికి ఏర్పాటు చేస్తాగా" అంటూ త
వెళ్లిపోయాడు.

సదానంద్ ఏమీ జవాబు చెప్పకుండా టక్‌సాలీగే
దగ్గరకు వెళ్ళాడు.

ఫిరోజ్ వెళ్లిపోయాడు. సదానంద్ మనస్సులో తు
లేచింది. తను ఫిరోజ్ మంచివాడనుకునేవాడు. కాని
చెడ్డవాడుగా తేలాడు. తను ఎంతో మంచి వాడనుకున్నా

ఇవేళ బుర్రలో బాధగావుంది. పార్కులోకి వెళ్ళగా
నిద్రపోయాడు. తన మనోస్థితి నిన్నటిలాలేదు. కమల వివాహ
అక్కర్లేకుండా వుండగలిగినప్పుడు తనకొచ్చిన కష్టమేమిటి
దీనికికారణం చమేలీ, ఫిరోజ్ అనుకుంటున్నాడు. వాళ్ళ
మూర్ఖత్వమే తన మనోబాధకు కారణం.

చీకటిపడ్డ తరువాత లేచాడు. మనస్సు శరీరం కాస్త తేలికయ్యాయి. ఆనందంతో గదికి తిరిగివచ్చాడు. దారిలో కాణంలో రొట్టెలు తిన్నాడు. తనపుస్తకం వ్రాసుకునేందుకు దిలోకి వచ్చాడు.

తాళంతీసి గదిలోకి వచ్చాడు, పుస్తకం వ్రాసుకునేం కు అతను గతరాత్రి ఏమీవ్రాయలేదు. అందుచేత పైకి గానే చాపవేసుకుని వ్రాయటానికి కూర్చున్నాడు.

ఎనిమిదున్నరకు పనిదగ్గర కూర్చున్నవాడు పదింటివరకూ స్తూనే వున్నాడు. అతను తనువ్రాసిన పుస్తకం చదువు టే పాత్రలన్నీ కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. పుస్త లో కనిపించిన సవరణలన్నిటినీ చేస్తున్నాడు. అతనికేవో పాలు కనిపిస్తున్నాయి. వాటిని సరిచేస్తున్నాడు. దానివల్ల నికి సంతోషంగావుంది.

ఈవిధంగా అతను తన ఆలోచనా ప్రపంచంలో విహ స్తున్నాడు. ఇంతలోనే ఏదోచప్పుడయ్యింది. ఫిరోజ్, మనో వతి పైకివచ్చారు. సదానంద్ కంగారుపడ్డాడు. అమ్మాయి ని బట్టలు కట్టుకుంది. మహమ్మదీయ వస్త్రాలులా యి. వాళ్ళువచ్చి చాపమీద కూర్చున్నారు.

సదానంద్ అడిగాడు, "ఎలాపైకివచ్చారు."

"క్రింద తలుపులు తీసివున్నాయికదా."

పుస్తకం వ్రాయాలనే గోష్టిలో తాను తలుపులు య్యడం మర్చిపోయినట్టు సదానంద్‌కు జ్ఞాపకంవచ్చింది. ఆ మ్మాయిని చూశాడు తన అక్కగారివలె సన్నగా పొడ గా వుంది, రూపురేఖలు కూడా బాగున్నాయి. కళ్ళు

పెద్దవి. రంగు తెలుపు. ఆమె తనవైపు చూడటంలేదు. తన పమిట సర్దుకుంటోంది. సదానంద్‌కు ఫిరోజ్ మధ్యాహ్నం మాటలు జ్ఞాపకం వచ్చాయి. దానితో కంపించిపోయాడు. ఈపనికి తన మనస్సును సిద్ధంచెయ్యలేకపోయాడు.

సదానంద్ తనవంక చూడటంచూసి ఫిరోజుద్దీన్ లేచి నుంచుని అన్నాడు, "సదానంద్! ఈమె ఒక చక్కనియువతి జాగ్రత్తగావాడుకో. ఇకనేను నాకుకూడా చూసుకోవాలి. నేను వెడతాను."

"ఇంతరాత్రయిన తరువాతనా?"

"మా తమ్ముడికి మందుతీసుకువెళ్ళాలి. జ్ఞాపకం వచ్చింది. క్రిందతలుపులు వేసుకో."

ఈ అమ్మాయినికూడా తీసుకువెళ్ళమని సదానంద్ అందామనుకుంటూంటే ఫిరోజ్ మెట్లుదిగి వెళ్ళిపోయాడు. తలుపులువేసేందుకు సదానంద్ క్రిందకు వెళ్ళలేదు. అతను కూర్చుని అమ్మాయివంక చూస్తున్నాడు. ఆమెబాగా అందంగావుంది.

అతను గంభీరఆలోచనలో వుండటంచూసి అమ్మాయి అడిగింది; "అయితే నేను తలుపులు వేసిరానా?"

"ఎందుకు"

"ఎవరూ పైకిరాకుండా వుండేందుకు."

"ఎవరూ పైకిరారు కాని, నీపేరేమిటి."

"శబనమ్."

"ఎక్కడుంటున్నావు."

"దరియా సిధ్‌లో."

"తండ్రి ఏం చేస్తుంటాడు."

"లేడు.

"తల్లి !"

"వుంది. ఆమెకూడా ఇదేపని."

"అయితే నువ్వు వేశ్యవా ?"

"కాదు మాదగ్గర ఈపనికి లైసెన్సులేదు."

"అయితే నంబరులేని కారువన్నమాట."

అమ్మాయి నవ్వింది. సదానంద్‌కు ఈమాత్రం పరిచయంతో సంతోషం కలుగలేదు. అతను తరువాత అడిగాడు, "ఎప్పటినుంచి ఈపని చేస్తున్నావు ?"

"దగ్గర దగ్గర ఒక ఏడాదినుంచి."

"అయితే ఏమైనా ఇవ్వాలానీకు."

"మామూలుగా పదిరూపాయలు తీసుకుంటాను. కాని అన్నయ్యచెప్పడం మీరు మిత్రులట. పైగా బీదవారు కూడాను. ఏమిస్తే అదే తీసుకుంటాను."

"అయితే నీకు బీదవాళ్ళమీద జాలికూడా వుందన్నమాట."

"మేముకూడా బీదవాళ్ళమే. అందుచేత బీదవాళ్ళంటే సానుభూతి."

సదానంద్ మళ్ళ ఆలోచనలో పడ్డాడు.

ఇంతలోనే "భోజనం చేశావా ?"- అడిగాడు.

"అన్నయ్య దారిలో చేయించాడు."

"ఏ అన్నయ్య ?"

"ఫిరోజ్ అన్నయ్య !"

"అయితే నువ్వు ఫిరోజ్ చెల్లెలవా ?"

"స్వంత అన్నగారుకాదు. మీరుపూర్తిడబ్బుఇస్తే అతనికి కమీషన్ ఇవ్వాలి."

"చాలా మంచిదానివి. నడు, మీయింటిదగ్గర దిగబెట్టి వస్తాను."

సదానంద్ జేబులోనుంచి అయిదురూపాయలు నోటు తీసి ఆమెముందుపెట్టి పుస్తకం మూసివేశాడు.

"ఏమిటి ?" అమ్మాయి అడిగింది.

"నిన్నుచూడగానే నా అక్క జ్ఞాపకం వచ్చింది. లే, నిన్ను ఒంటరిగా ఎలా పంపగలను."

అమ్మాయి తెల్లబోయింది. ఆమె కరుడుగట్టుకు పోయినట్టు అనిపించింది సదానంద్‌కు. లేచి అన్నాడు, "నడు శబనమ్!"

"ఎక్కడికి ?"

"మీయింటికి."

"అది తాళం వేసివుంటుంది."

"ఏం ?"

"అమ్మకూడా ఎక్కడికో వెడుతుంది."

"ఇంట్లో ఇంకెవ్వరూ లేరా ?"

"మా అక్కయ్య వుండేది. కాని ఇప్పుడు ఆమె వేరుగా వుంటోంది."

"అయితే నువ్వుకూడా ఎవరినైనా పెళ్ళాడి వుండరాదు ?"

"ఎవరైనా మంచివాళ్ళు వెదుక్కుంటున్నా ?"

"ఈవిధంగానా ?"

"మరేమీ ఉపాయంలేదు అక్కయ్యకూడా ఈవిధం గానే వెనుక్కుంది. ఎవరోఒకరు దొరుకుతారని నా ఆశ."

"అయితే అమ్మ ఎప్పుడు తిరిగివస్తుంది?"

"ఉదయం అయిదింటికి రావాలి. నేనుకూడా అప్పుడే వెడతా."

దానిమీదట సదానంద్ గంభీర ఆలోచనలో మునిగి పోయాడు. ఆలోచించి అన్నాడు, "సరే, మంచిది. వెళ్ళి క్రిందితలుపులు వేసిరా."

శబనమ్ లేచింది. క్రిందితలుపులు వేసివచ్చి ముందు నుంచుంది. సదానంద్ తన కాగితాలు సర్దుకుని పెట్టెలో పెట్టు కున్నాడు. తరువాత ఆ అమ్మాయితో అన్నాడు, "ఈఅయిదు రూపాయలు నీ దగ్గర వుంచుకో. నువ్వికక్కడ పండుకో. నేను పైకి వెళ్తాను."

"మీరిక్కడే పండుకోండి. నేనేమీ అనను."

"నేను నీవంటే జంకడంలేదు; నాకు నేనే జడుస్తున్నా."

అలా అని తన పరుపు ఆమెకిచ్చి తాను ఒక దుప్పటి, దిండు తీసుకుని పైకివెళ్ళాడు.

ఇవేళ సదానంద్‌కు బాగా నిద్రపట్టింది. తాను ఏదో పెద్ద విజయం సంపాదించినట్టుగా అనుభూతిపొందాడు. మధ్యాహ్నం అసాధ్యమనుకున్న విషయం ఇప్పుడు చాలా సులువనిపించింది.

అతను రోజూనాలుగు గంటలకులేస్తాడు. లేచిఅమ్మాయి ఇంకా నిద్రపోతుంటే లేపుదామని క్రిందకు వచ్చాడు. లైటు

వెలుగుతోంది. తన పుస్తకం స్క్రిప్టు నేలమీద తెరచివుంది. కాని అమ్మాయిలేదు. క్రింద తలుపులు చూడ్డానికి వెళ్తే అవి దగ్గరగావేసివున్నాయి. కాని, గడియలేదు. ఆమె స్వయంగా వెళ్ళిపోయిందనుకున్నాడు. దీపంశిఖ పెద్దదిచేసి పైకివచ్చి పక్కబట్టలు సర్దుతున్నాడు. రాత్రి తన స్క్రిప్టు పెట్టెలోపెట్టి నట్టు జ్ఞాపకంవచ్చింది. కాని అది ఇప్పుడు నేలమీద తెరచి వుంది. శబనమ్ అదితీసి చదివినట్టుంది. ఈ సారి దగ్గరలోవున్న కలం, సిరాబుడ్డిమీద దృష్టిపడింది. "అయితే ఆమె రాత్రి వ్రాస్తూకూడా వుందన్నమాట" అనుకున్నాడు మనస్సులో. దానితో కంగారు పుట్టింది. తన స్క్రిప్టు పాడుచేసిందేమోనని భయమేసింది.

సదానంద్ పక్కబట్టలు సర్దటం ఆపుచేసి పుస్తకం చూశాడు. ఎదుట ఒకపేజీ తెరచివుంది. రాత్రి ఫిరోజ్ వచ్చే సరికి తానదే చదువుతున్నాడు. పద్యమొకటి సంశోధించబడి వుంది. సంశోధితపద్యం ఇంకా అందంగావుంది. సదానంద్ తక్కిన పేజీలుకూడా విప్పిచూశాడు. ఒకటి రెండుపద్యాలు సంశోధించబడి వున్నాయి. సదానంద్‌కు ఆశ్చర్యం, ఆనందం వేశాయి. పుస్తకం మూసివేశాడు. అట్టమీద ఒకపద్యం వ్రాసివుంది. దానిసారాంశంఇది, "రాత్రినుంచి నీ విషయంలో ఆలోచిస్తున్నా, అర్థంకాదు నీసంగతి ఎంతటికైనా."

సదానంద్ పక్కసర్దుతూంటే అయిదురూపాయలు నోటు కన్పించింది. పుస్తకం చదువుతూ చదువుతూ శబనమ్ మర్చిపోయిందేమో ననుకున్నాడు.

9

ఇవేళ ఫిరోజ్ ఆలశ్యంగా రాగానే మెనేజరు కసురుకున్నాడు, “ఇవేళ పనెలా పూర్తిచేస్తావు?” అని.

“తమ్ముడుకు జబ్బుగావుందయ్యా. మందు అదీ ఇవ్వాలి. ఇవేళ చాలాసేపు కూర్చుని పూర్తిచేసేస్తాను.”

సదానంద్ ఒంటిగంటకు పనిపూర్తిచేసి ఇంటికి వెళ్లే ముందు ఫిరోజ్‌ను ప్రక్కకుపిలిచి అన్నాడు, “రాత్రి శబనమ్ సబ్బు మర్చిపోయింది. ఆమెకు ఇచ్చివెయ్యి.” అని అయిదు రూపాయలనోటు ఇచ్చాడు. మళ్ళీ అన్నాడు, “ఇందులో కమీషన్ తీసుకోవద్దు. నేను నీకు వేరే రెండు రూపాయలు ఇస్తాను.”

సిగ్గుతో ఫిరోజ్‌ముఖం ఎఱ్ఱబడిపోయింది. అయినప్పటికీ అయిదు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. “నువ్వు మిత్రుడవు. నీ దగ్గర కమీషన్ తీసుకోను” అన్నాడు.

“చాల్లే. మిత్రత్వం చూపించనే చూపించావు. నీ కష్టానికి మజూరీ ఇది.” అన్నాడు.

సదానంద్ భోజనానికి ఇంటికి వెళ్ళాడు. ఫిరోజ్ శబనమ్ ఇంటికి వెళ్ళాడు. ఈవేళ సదానంద్‌కు భోజనం చమేలీ వడ్డించింది. ఆమె భోజనం వడ్డించటంచూసి సదానంద్ అన్నాడు; “అమ్మబదులు నువ్వే చెయ్యాలి ఈ పని, వదినా! అర్థమయ్యిందా?”

చమేలీనవ్వి గంభీరంగా నిట్టూర్చి ముందుకూర్చుంది, తన తల్లి కూర్చున్నట్టుగానే. సదానంద్ అడిగాడు, “వదినా! ఎంతవరకు చదువుకున్నావు?”

"అ ఆ ఇ ఈలు !"

"అబ్బ! ఏమీ" అన్నయ్య భార్యకు అంతమాత్రం ఎలా సరిపోతుంది? నువ్వు ఈవేళనుంచి చదువు ఆరంభించు. అన్నయ్యతో చెబుతాను, చదివించమని."

"కాదు; నువ్వు చెబితే చదువుకుంటాను."

"అన్నయ్య అయితే ఏం?"

"కాదు. నువ్వే చెప్పు."

"సరే, నేను మధ్యాహ్నమప్పుడు చెబుతాను. చూడు వదినా! మానవుడు ప్రగతివాంఛకుడు. అతడు ఒకే విధంగా వుండలేడు. ఒకటే విధంగా వుండాలనుకుంటే పశువుతో సమానం."

సదానంద్ ప్రక్కనుండవచ్చని చమేలీ ఉద్దేశ్యం. ఆమె చదువుకున్నట్టయితే తన ఇంద్రియాలమీద నిగ్రహం సంపాదించి, మానవత్వాన్ని సంపాదిస్తుందని సదానంద్ ఉద్దేశ్యం.

ఆవేళనుంచే చదువు చెప్పడం ఆరంభించాడు. హిందీ బాలబోధిని మొదలుపెట్టాడు. పాఠంచెప్పి వెళ్ళిపోతూంటే కమలదగ్గరనుంచి వచ్చింది, తల్లి "ఇదేమిటి?" అని అడిగింది.

"అమ్మా! పశువు మెడలో జ్ఞానపాశం వేస్తున్నా." అన్నాడు. ఇవేళ మకాంలోకి పడుకునేందుకు వెళ్ళలేదు. చమేలీకి చదువు చెప్పడంలో మూడున్నర అయిపోయింది. అందుచేత తిన్నగా లైబ్రెరీకి వెళ్ళిపోయాడు.

మామూలుగా సాయంకాలం హోటల్లో రొట్టెలుతిని తిన్నగా తన మకాంకు వెళ్ళాడు. రోజు జరిగేదానికి వ్యతిరే

కంగా గదితాళం తీసివుంది. గదిలో దీపం వెలుగుతోంది. పైకి వెళ్ళేసరికి శబనమ్ అక్కడ కూర్చునివుంది. ఆతనికి ఆశ్చర్యం వేసింది. శబనమ్ పెట్టెతీసి స్క్రిప్టు చదువుతోంది. సదానంద్ ఆశ్చర్యంతో అడిగాడు. "తాళం ఎలా తీశావు?"

"తాళం వెయ్యకముందే వచ్చాను. అన్నయ్య మేనేజరు దగ్గరనుంచి తాళం తీసుకున్నాడు."

"మేనేజరు ఏమీ అడగలేదా?"

"అడిగేవుండొచ్చు. అన్నయ్య ఏదో చెప్పివుండొచ్చు. నాకు తెలియదు. ఆయన నన్నిప్పుడే ఇక్కడ విడిచివెళ్లారు."

"ఫిరోజ్‌ని అన్నయ్య అంటున్నావు. ఆతను నీకేమవుతాడు."

"పెద్దమ్మకొడుకు."

"స్వయానా?"

"కాదు. వరుసకి."

"అయితే ఈవేళ ఎందుకు వచ్చావు. నిన్ను ముట్టనని తెలుసుగా."

"తెలుసు. అర్థమయ్యిందికూడా అయినా రెండు పనులున్నాయి. ఒకటి ఇది తిరిగి ఇవ్వడం" అని బ్లౌజులోనుంచి అయిదురూపాయలుతీసి సదానంద్ ముందువుంచింది.

"ఇచ్చివేస్తున్నావేం?"

"ఇది తీసుకునేందుకు నాకేమి అధికారంవుంది."

"నేను నిన్ను నా చెల్లెలు అనుకుని ఇచ్చాను. నువ్వు ఏకదానివని నువ్వే అన్నావుగా? బీదచెల్లెలుకు సహాయం

చెయ్యడం ధర్మం అనిపించింది. చెల్లెలు అన్నగారి దగ్గర తీసుకోవడంలో నష్టం ఏముంది?"

"కాని నేను మీచెల్లెలుగాఅనుకోను. అలా అనుకొని మీ దగ్గర తీసుకునేందుకు రాలేదు. ఇవేళకూడా చెల్లెలుగా రాలేదు."

"కాని ఏమని వచ్చావో నేను అంగీకరించలేదు. ఇవేళ ఏమనుకొని వచ్చావోమాత్రం తెలియదు."

"మరొక పని మిగిలింది. ముందు ఈడబ్బు తీసుకోండి. నేను ఊరికే తీసుకోదలచుకోలేదు. మీ పుస్తకం సగం నిన్న చదివాను. తక్కినసగం ఈవేళ చదవాలి."

"కాని ఇక్కడకు రాకపోయినా తెప్పించుకుని చదవ వచ్చుగా."

"మీ కథ చాలా మజాగావుంది."

"అవును నువ్వు పాల్గొన్నప్పటినుంచీ మరీ బాగుంది. తిండితిన్నావా?"

"ఆ, తిన్నాను. చూడండి ఇక్కడ ఏమి వ్రాశారో?"

"నీ తలకాయవ్రాశాను. ఇక నువ్వు ఇంటికివెళ్ళు. నేను నిన్న ఏమీ వ్రాసుకోలేదు. ఈవేళకూడా నువ్విక్కడ కూర్చుంటే నా బుద్ధిపాడవుతుంది."

"బుద్ధిలో చెడు ఏముంది?"

"నీకు తెలియదు. నేను యువకుణ్ణి. మంచి ఆరోగ్య వంతుణ్ణి. నీ లాంటి ఆడవాళ్ళ అమ్మాయిముందు కూర్చుంటే బుద్ధి తిరుగుతుంది."

"నేను ఆడదానా?"

"మరేమిటి? పదేసిరూపాయలకు అమ్ముడవుతున్నావుగా?"

"ఎవరు అమ్ముడవటంలేదు. ఈ కథ అమ్ముడుకావటంలేదా?"

"మానం అమ్ముకోడానికీ, పుస్తకం అమ్మటానికీ తేడాలేదా?"

"ఏమీ విశేషంగా కన్పించడంలేదు."

"పుస్తకం అమ్మటంవల్ల నా ఆరోగ్యమూ పాడవ్వదు. కొనుక్కునేవాడి బుద్ధీ చెడదు. చూసేవాడి మనస్సులోనూ వికారంపుట్టదు. సంఘంలో చెడ్డపేరూ రాదు. మానం అమ్ముకొనడంవల్ల అమ్మినవ్యక్తీ, కొన్నవ్యక్తీ ఇద్దరూ పాడవుతారు, చెడిపోతారు."

"ఇదంతా మానవుడు నిర్మించిన భ్రమపూర్వక నియమాల కారణంగానేకదా!"

"మానవుడు సమాజంలో బ్రతకడానికి కొన్ని సురక్షిత సూత్రాలను ఏర్పరచుకున్నాడు. వాటికి కట్టుబాటై వున్నంతకాలం సమాజ జీవితం సక్రమంగా నడుస్తుంది. స్త్రీ పురుషుల సంయోగం వివాహానంతరమే జరగాలని సమాజ నియమం. నువ్వు దానిని ఉల్లంఘిస్తున్నావు. దానివల్ల సమాజంలో అలజడి, వక్రత ఏర్పడుతుంది. ఈ విషయంలో నేను నీతో సహకరించలేను."

"సమాజంలో ఏమిజరిగవలసిందీ, దాని నియమాలు ఎలావుండాలో నిర్ణయించడం నీపనీ నాపనికాదు. ఆ నియమా

లలో మార్పు అవసరం అయితే చెయ్యడానికి సమాజం సిద్ధంగా వుంటుంది."

"మా పరిస్థితి మమ్మల్నిలా మారేందుకు బాధ్యుల్ని చేసింది. నాకు ఏడుపళ్ళు వుండగా నాన్నగారు పోయారు. అక్కవయస్సు పదేళ్ళుంటుంది. మాచుట్టాలెవ్వరూ సహాయం చెయ్యలేదు. అమ్మ పర్దా వేసుకునేది. ఆమె ఎక్కడా నౌకరీ చెయ్యలేదు. పైగా చదువుకోలేదు కూడాను.

"అంతే, అలా కొన్నిరోజులు గడిచాయి. తరువాత కష్టమయిపోయింది. మేము ఆకలితో మాడటం అమ్మచూడ లేకపోయింది. ప్రక్కఇంటి ఆయన్ను సహాయమడిగితే, మళ్ళీ తిరిగిరాదని భయం వెల్లడించాడు. ఒక షరతుమీద అయితే ఇస్తానన్నాడు. అది ఆయనను సంతృప్తిపరచడం.

"అమ్మ ఒప్పుకుంది. కాని అత నొక్కడే మమ్మల్నంద రినీ పోషించలేడు. మరికొంతమందిని అమ్మకు పరిచయం చేశాడు, అప్పటినుంచీ బండి ఇలా నడుస్తోంది.

"అమ్మ మాపెద్దక్కనుకూడా ఈవృత్తిలోనే దింపింది. ఆమెకొక పెద్దఆసామి దొరికాడు. మజాగావుంటోంది. ఫిరోజ్ ఆయనతో అక్కను కలిపాడు. అందుచేతనే నాకోసంకూడా ఈ విషయంలోనే మీతో నాపరిచయం జరిగింది.

"కాని మీరు చాలా మంచిగాకన్పడుతున్నారు. నిన్న రాత్రి అస్తమానం ఇక్కడపడివున్నాను. కాని మీరు నావంకైనా చూడలేదు. ఒకయువకుడు చెయ్యవలసిన పను లేమీ చెయ్యలేదు."

సదానంద్ నవ్వాడు. దానిమీదట శబనమ్ అడిగింది, "ఏం నేను తప్పుగా మాట్లాడానా?"

"లేదు. నేను ఒకమానవుడు ఎలా ప్రవర్తించాలో, అదేవిధంగా ప్రవర్తించాను. ఇటువంటిపనుల్లో పాల్గొనడానికి పిశాచాన్ని కాదు"

"మానవుడు జన్మించడం పిశాచంగా జన్మిస్తాడు. పైగా ఆ పిశాచత్వం ఎక్కడికీ పోదుకూడాను. అది అందరి మానవుల్లోనూ వుండేది. కొంతమంది కొద్దికాలం అణచి పెట్టుకోవచ్చు. కాని పిశాచం ఎప్పుడో ఒకప్పుడు బయట పడుతుంది."

"పిశాచం నాలోకూడావుంది. కాని నాసంస్కారాలు, నావిద్య నన్ను దానికి అతీతంగా వుంచుతాయి. నేను పెళ్ళి చేసుకోనిదే ఎవరినీ ప్రేమించలేను"

"అయితే నన్ను పెళ్ళిచేసుకోండి. అందుకేగా వచ్చింది."

"వివాహానికి నీ అందమొక్కటేకాదు, చాలా విషయాలు కావాలి."

"అంటే."

"అంటే నువ్వు మహమ్మదీయురాలుగానే వుంటావా లేక హిందువుగా మారతావా? నీ సంతానం హిందువులుగా వుంటారా ? మహమ్మదీయులుగానా ?

"ఇంకా చాలా విషయాలున్నాయి. పెళ్ళితరువాత ఎంత ఖర్చుతో కుటుంబం గడుపగలవు? నేను ఏమి సంపాదిస్తున్నానో నీకు తెలుసా?"

"ఇటువంటివి చాలా విషయాలున్నాయి. వివాహానికిముందు అవన్నీ ఆలోచించాలి."

"అవన్నీ అవుతాయి. నిన్న నేను డబ్బు సంపాదించేందుకు వచ్చాను. ఇవేళ ప్రేమించేందుకు."

"డబ్బు ఊరికేదారికితే అక్కర్లేదన్నావు. ఇదేవిధంగా ప్రేమనుకూడా పారవేయవచ్చు."

"పరీక్షించి చూడండి...రండీ......"అని చేతులు చాపింది. సదానంద్ బుఱ్ఱ వేడెక్కింది. అతను లేచినుంచుని అన్నాడు,

"నడువు, ఇంటికినడు. నువ్వు ఇక్కడ వుండవలసిన దానవుకాదు."

"ఎక్కడికెళ్ళను ? అమ్మ ఇంటిదగ్గరలేదు. కరీంకోసం అతనింటికి వెళ్ళింది."

"నువ్వెందుకు వెళ్ళలేదు ? మీ తల్లితో ఉండటానికి మనస్సు ఒప్పడంలేదా ?"

"ఒప్పుతోంది. కాని అంతకంటే ఎక్కువగా మీకోసం ఆరాటపడుతోంది."

"కాని నేను పెళ్ళికానిదే ఎవరినీ ముట్టుకోను."

"చూడండి ? ఇంకా ఎక్కువ బాధపెట్టకండి. మీరు రండి. జీవితాంతం మీ దాసీగా ఉంటాను"

"లాభంలేదు." అని సదానంద్ మెట్లుదిగి ఇంటికి వెళ్ళిపోయాడు. అక్కడ తల్లిచూసి సంతోషంతో అంది- సదా! వచ్చావా ? మంచిపనిచేశావు. కమల వివాహప్రసక్తి జరుగుతోంది. నీ ఉద్దేశ్యం ఏమిటి?"

పరమానంద్ తల్లిదగ్గర కూర్చుని చెబుతున్నాడు, "జీవన్‌లాల్‌గారి అబ్బాయి రెండువందలయాభై సంపాదిస్తున్నాడు. పాతికేళ్ళుంటాయి. అందంగా ఉంటాడు. ఇవేళ వకీలుగారు అతన్ని టీకి పిలిచారు. కమలకూడాఅక్కడేఉంది. అతను వెళ్ళిపోయిన తరువాత వరుడు అతడేనని పెద్దమ్మచెప్పారు."

"కమల మాట్లాడలేదు. దాన్నిబట్టి పెద్దమ్మ కమల ఒప్పుకుందనుకున్నారు. సదానంద్, నువ్వెళ్ళి అడుగు, నాతో మాట్లాడటంలేదు."

"అవును సదానంద్ ! నువ్వు రేపువెళ్ళి విషయం నిశ్చయం చెయ్యి."

"ఇవ్వటం పుచ్చుకోవడంలో ఏమంటున్నారు ?" సదానంద్ అడిగాడు.

"మనింటి పరిస్థితి జీవన్‌లాల్‌కి తెలుసు. ఏమీ అడగనని వకీలుగారితో చెప్పాడు. నగలు, బట్టలుకూడా అడగడు. దానిమీదట పెద్దమ్మ, 'కమల నాబిడ్డ. వివాహం నేనే చేస్తాను'అన్నారు."

కమలతో ఏమిచెప్పాలా అని సదానంద్ ఆలోచిస్తున్నాడు. అయినా అమ్మ పట్టును కాదనలేకపోయాడు. అతను అన్నాడు. "అమ్మా ! నువ్వుకూడారా వదినకూడా వస్తుంది. నేనుకూడా వస్తాను. మనందరిమాట కాదనలేదుగా."

మాటనిశ్చయమయ్యింది. మరునాడు భోజనాలయ్యాక వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

సదానంద్ అన్నాడు, "ప్రభ, రమలు సరే! చాలా రోజులయింది వాళ్ళనుచూసి."

మానవుడు

తృతీయ భాగము

1

మరునాడు సదానంద్ మకాంకు చేరగానే ఫకీరుద్దీన్ అడిగాడు, "సదానంద్! రాత్రి ఎక్కడున్నావు?"

"మాయింటికి వెళ్ళాను."

"తెల్లవార్లూ గది తీసేవుంది?"

"అయితే మీరు తాళం వెయ్యలేదేమో?"

"ఫిరోజ్ తాళం తీసుకు వెళ్ళాడే!"

"అయితే అతను వచ్చాక అడగండి."

ఫిరోజ్ వచ్చినతరువాత మేనేజరు కేకలు వేశాడు. "తాళం ఎవరికిచ్చావు?"

"ఏం, ఏమయ్యింది?"

"తెల్లవార్లూ గది తీసేవుంది. ఎవ్వరూ లేరు."

"అయితే సదానందకు తెలియాలి."

"నేనసలు రాత్రి రానేలేదు." అన్నాడు సదానంద్.

ఫిరోజ్ మాట్లాడటానికి పూనుకున్నాడు. మేనేజరు సదానందన్ని, ఫిరోజ్‌ని కేకలు వేశాడు.

మధ్యాహ్నం ఫిరోజ్ సదానంద్‌ని ఒకమూలకు తీసుకు వెళ్ళి అడిగాడు, "సదానంద్! ఏం జరిగింది!"

"వన్నడగకుండా ఆమెను ఎందుకు తీసుకువచ్చావు?"

"అయితే నువ్విక్కడకు వచ్చావా?"

"అవును. ఆమెతసపనికిబలవంతంచెయ్యగానే విడిచిపెట్టి వచ్చేశాను. తరువాత ఏమయ్యిందో తెలియదు."

"అయితే పెద్దమ్మఇంటికి వెళ్ళాలి."

సదానంద్ ఫిరోజ్‌ని విడిచిపెట్టి తనఇంటికి వెళ్ళి పోయాడు. భోజనంచేసి చమేలీకి పాఠంచెప్పి కమలదగ్గరకు బయలుదేరాడు. వెనుకాల లక్ష్మి, చమేలీకూడా అక్కడకు వచ్చారు. కమలతో సంభాషణ ప్రారంభమయ్యింది.

కమల అంది, "మీరందరూ నన్ను పెళ్ళికోసం ఎందుకు బలవంతం చేస్తారో నా కింతవరకూ అర్థంకాలేదు. అర్థమయితే ఒప్పుకుంటాను."

సదానంద్ అన్నాడు, "అక్కా! మానవునికి అనుభవంలో లేని విషయాలు అనేకముంటాయి. ప్రతివ్యక్తి ప్రతి విషయం అనుభవంద్వారా తెలుసుకోవాలంటే ప్రపంచంలో ఔన్నత్యాన్ని సాధించడం కష్టం. అందుచేత మన పూర్వుల అనుభవాలను ప్రమాణంగా తీసుకుని ముందుకుపోవాలి. రాముడు, కృష్ణుడు, శివుడు, బ్రహ్మ మొదలైన వారందరూ వివాహంచేసుకున్నారంటే మూర్ఖులయికాదు. వివాహం కాకపోతే వచ్చేనష్టం వాళ్ళకు తెలిసేవుంటుంది. మనం, మన దేవుళ్ళను ప్రమాణంగాతీసుకుని ముందుకు పోవాలి."

"వివాహంకాకుంటే నాకేమీ కష్టమనిపించదు."

"అదే నేననేది. నువ్వు క్రొత్త ప్రయోగం చేస్తున్నావు. అది చాలా భయంతో కూడిన విషయం. జీవన్‌లాల్ గారి అబ్బాయి యోగ్యుడు, అందమైనవాడు, బాగా సంపాదిస్తున్నాడు. అటువంటి అవకాశం మళ్ళీమళ్ళీ దొరకదు."

కమల మాట్లాడలేదు. అయిదింటికి జీవన్‌లాల్ కచేరీ నుంచి రాగానే సంబంధం నిశ్చయం చేశారు. సదానంద్ ఇంటికి రాగానే ఎవరో ఒకస్త్రీ, ఒకపురుషుడు ఇంటికివచ్చారని చెప్పింది రమ. ఫిరోజ్, శబనమ్ అయ్యుంటారనుకున్నాడు సదానంద్.

రాత్రి సదానంద్ మకాంకు వెళ్ళలేదు. ఇంటిదగ్గరనే నిద్రపోయాడు. కొద్దిరోజులు తాను వెళ్ళకుండావుంటే శబనమ్ కూడా నిరాశచెంది రావడం మానేస్తుందనుకున్నాడు.

మరునాడు మేనేజర్ అడిగాడు, "రాత్రి మళ్ళీ రాలేదేం?"

"అక్కయ్యపెళ్ళి స్థిరమయ్యింది. అందుచేత ఇంటి దగ్గరే పడుకున్నా. ఏం, రాత్రికూడా గది తెరిచేవుంచా?"

"అదేం కాదు. నువ్విక్కడ పడుకుంటూ ఉంటే నాకంటే ముందేవచ్చి పని ఆరంభించేవాడవు."

"కొద్దిరోజులపాటు నా రాత్రి ఆపుచెయ్యాలి. పెళ్ళి ఏర్పాట్లు చెయ్యాలి.

"పెళ్ళి ఎక్కడ చేస్తున్నారు?"

"ఇక్కడే ఒకాయన హైకోర్టులో పనిచేస్తున్నాడు."

"మంచిజీతమే వస్తున్నాదా?"

"అవును."

"నీ పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు ?"

సదానంద్‌కు ఈ ప్రశ్న అర్థంకానందున మేనేజర్ వంక చూస్తూవుండిపోయాడు. "ఏమిటి సంగతి ?" అనడిగాడు.

"ఏంలేదు. ఫిరోజ్ వాళ్ళపెద్దమ్మ నిన్న మీయింటికి వెళ్ళిందని చెబుతున్నాడు."

"ఏంపనిమీద ?"

"అత డదేమీ చెప్పలేదు."

మేనేజరుకు ఈ విషయంలో ఇంకా తెలిసికూడా చెప్పడంలేదని సదానంద్ ఉద్దేశ్యం. అంతటితో సంభాషణ ఆపుచేసి తనపని ఆరంభించాడు.

ఫిరోజ్ రాగానే తనపని ఆరంభించాడు. మధ్యాహ్నం ఇంటికివెళ్తుంటే ఫిరోజ్‌కూడా వచ్చాడు.

"నిన్న మాయింటికి వెళ్ళారా ?"

"అవును. శబనమ్‌తల్లికూడా వచ్చింది."

"బుర్కా వేసుకుందా ?"

"లేదు బుర్కా వేసుకుంటే వీధివాళ్ళందరూ చూస్తారని వేసుకోలేదు."

"ఏంపని ?"

"శబనమ్ నిన్న స్తమానం ఏడుస్తూ కన్నీళ్ళు కారుస్తూ వుంది."

"ఏం ?"

"ఆమె నిన్ను ప్రేమిస్తోంది ?"

"చాలా బావుంది. ముందు డబ్బుకోసం వచ్చింది. డబ్బు దొరకకపోయేసరికి కష్టమర్ నే ప్రేమింగేద్దామనుకుందా ?"

"డబ్బు ఇవ్వనేలిచ్చావురుగా. కాని తిరిగి ఇచ్చింది."

"అవును. ఆమెదృష్టిలో నావిలువ అయిదురూపాయలకంటే ఎక్కువ. నేను పది యిచ్చివున్నట్టయితే వెళ్ళిపోయివుండేది."

"అదికాదు మిత్రమా, నువ్వుగనుక ఆమెను మొదటి రాత్రి వుపయోగించుకున్నట్టయితే ఇతరులవలె నువ్వుకూడా ఆమెదృష్టిలో పడిపోయి వుండేవాడివి. ఆరాత్రి నువ్విలా ప్రవర్తించావు కాబట్టి నీవిలువ ఆమెదృష్టిలో చాలా పెరిగింది."

"అయినప్పటికీ నాస్థాయివరకూ ఆమె రాలేదు. నేను చెప్పినవిషయాలు పాటించటానికి ఆమె సంస్కారంచాలదు."

"నువ్వేమి చెప్పావు!"

"కొన్ని విషయాలు చెప్పాను. ఇంకా చెప్పాలి."

"అయితే నువ్వామెను కలుసుకుంటావా?" ఆనందంతో ఫిరోజ్ అడిగాడు.

"కలుసుకోడానికి నాకేమీ అభ్యంతరంలేదు. కాని ఆమె తెల్లవార్లూ ఇక్కడ కూర్చోబెడం నాకిష్టంలేదు. దాని వల్ల నాపని ఆగిపోతోంది."

"అయితే ఇవేళరాత్రి ఆమె, ఆమెతల్లి నిన్ను కలుసుకునేందుకు ఇక్కడకు వస్తారు. నువ్వు చెప్పవలసింది చెప్పు. వాళ్ళు నీస్థాయికి రాగలిగితే సరేసరి."

సదానంద్ చెప్పడమంటే చెప్పాడుకాని, ఈ అమ్మాయితో తనకు సంబంధమేర్పడిపోతున్నట్టు బాధపడ్డాడు.

దానితో గాంభీర్యం వహించాడు. ఈవేళ వద్దని చెబుదామను కునేలోపే ఫిరోజ్ వెళ్లిపోయాడు.

ఇది ఒకవిధంగా తాను వారికలియకను అంగీకరించి నట్టే. శబనమ్ తల్లికూడా వస్తుందని సదానంద్ ఆనందిం చాడు. ఫిరోజ్ అక్కడనుంచి తిన్నగా శబనమ్ఇంటికి వచ్చాడు. శబనమ్ గుమ్మంలోనుంచుని అతనికోసం ఎదురు చూస్తోంది. ఫిరోజ్ రాగానే అడిగింది, "ఏమయ్యింది?"

"అతను రాత్రి మకాంలోకి పడుకునేందుకు రాలేదు. ఈవేళ నువ్వు, మీయమ్మా వెళ్ళండి. అతనేదో ఇంకా చెప్పా లంటున్నాడు. ఏమైనా కట్నంమాటా?"

"అదేమీకాదు. ఆయన వివాహానికిముందు కొన్ని విషయాలు పాటించాలంటున్నాడు"

"అయితే కట్నంమాట ఏమిటి?"

"అదేంలేదు అన్నయ్యా! మనం బీదవాళ్ళమనే సంగతి ఆయనకు తెలుసు!"

"అయితే ఏం చేద్దాం!"

"ముందు లోపలికిరా. అమ్మ వంటచేస్తోంది. ఇవేళ నీభోజనం ఇక్కడే."

ఫిరోజ్ పైకివచ్చాడు. శబనమ్తల్లి ముప్పైఅయిదేళ్ళ ఒక అందమైన యువతి. ఆమె తనయౌవ్వనంలో శబనమ్ కంటే అందంగావుండేదా అనిపిస్తుంది. అందుచేత ఆమె వేశ్యలవలే ఏమీ అలంకరించుకోవలసిన అవసరంలేకపోయింది. ఆమె ఫిరోజ్తో "వరండాలోకూర్చో. భోజనం తెస్తాను."

అని వంటింట్లోకి వెళ్ళింది. శబనమ్ ఫిరోజ్ దగ్గరనే వుంది. ఆమె అంది, "అమ్మ నిన్ను పెళ్ళిచేసుకోమంటోంది."

"నన్నా ? ఫిరోజ్ నవ్వాడు, "నా అదృష్టంలో అది వ్రాసిలేదు."

"ఏం ? మహమ్మదీయులలో అలా జరుగుతూనే వుంటాయిగా ?"

"కాని సదానంద్‌ను చూసిన తరువాత నేను నీకు నచ్చను."

"కాని అమ్మ అనడం నువ్వుకూడా బావుంటావని."

"పెళ్ళి మీయమ్మా, నువ్వా చేసుకునేది ?"

"అమ్మను చేసుకుంటావా ?"

"అవును. ఆమె నీకంటే బావుంటుంది."

"అయితే అమ్మను రానియ్యి సంబంధం కుదురుస్తా!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

శబనమ్ తల్లి భోజనం తీసుకువచ్చింది. ఒక పెద్దపళ్ళెంలో పదిపదిహేను రొట్టెలున్నాయి. ముగ్గురూ కూర్చున్నారు. గ్లాసులలో నీళ్ళువున్నాయి. ముగ్గురూ నీళ్ళు తాగుతున్నారు.

శబనమ్ తల్లితో అంది, "అమ్మా! ఫిరోజ్ నిన్ను పెళ్ళిచేసుకుంటానంటున్నాడు"

"మంచిది?"

నువ్వు నాకంటే అందంగావున్నావంటున్నాడు."

"అయితే ఆలోచించవలసిన సంగతే. మహమద్ కూడా తనకంటె పెద్ద స్త్రీనే పెళ్ళాడాడు!"

"అయితే, నిశ్చయమయిపోయినట్టేగా ?"

"కాని విషయమేమంటే మహమ్మద్ తల్లి బ్రతికిలేదు. కాని ఫిరోజ్ తల్లి ఇంకా బ్రతికేవుంది. ఆమెఅభిప్రాయం తీసుకోవాలిగా?"

"ఆమె నిన్ను బాగా మెచ్చుకుంటుంది."

"ఎందుచేత?"

"నీవంటి పడుచుకోడలు దొరికినందుకు"

ముగ్గురూ నవ్వుకున్నారు. శబనమ్‌తల్లి, అంది, "చూడు ఫిరోజ్ ! మీరిద్దరూ ఆ హిందూకుఱ్ఱాడి వెంటపడ్డారెందుకు? నువ్వు చేసుకోవచ్చుగా"

"పెద్దమ్మా ! నాకు పెళ్ళిచేసుకోవాలని లేదు."

"ఏం?"

"నా సంపాదన బాగా తక్కువ. నాపొట్ట గడవటం కష్టం. దీని కెక్కడ పెట్టగలను?"

"అయితే సదానంద్ మాత్రం ఏం సంపాదిస్తున్నాడు."

"అతని వ్రాతబావుంటుంది. వేగంగాకూడా వ్రాస్తాడు అందుచేత రోజుకు నాలుగురూపాయలువరకూ వస్తాయి. నాకు రెండేవస్తాయి."

"అమ్మా ! పెళ్ళిలో సంపాదనే ముఖ్యంకాదు." అంది శబనమ్.

"అయితే ఏదిముఖ్యం ?"

"ముందుగా నేను ఆయన్ను ప్రేమించాను."

"అయితే ఆకలితో మాడుతున్నా ప్రేమిస్తావా !"

"ప్రేమకూ, ఆకలికీ సంబంధంలేదు."

"నువ్వు ఆయనపద్యాలు చూసి మురిసిపోతున్నావు. నా ఉద్దేశ్యంలో మరిరెండువిషయాలు ముఖ్యం. ఒకటి డబ్బు, రెండవది మతం."

"నేను ఈ రెండువిషయాలకూ ప్రాధాన్యం ఇవ్వను. మతం మనం ఏదనుకుంటే అదే."

"అలాకాదు. నువ్వు ఎందులోపుట్టావో అదేనీమతం."

"అమ్మా! వచ్చిన కష్టమేమంటే ఆయన హిందువు. నేను మహమ్మదీయురాల్ని."

"అయినా చేసుకోవచ్చు. చాలామంది ముస్లిముస్త్రీలు హిందువులను పెళ్లాడారు. వెంటనే వాళ్ళభర్తలుకూడా ముస్లిములుగా మారిపోయారు."

"కాని అది ఈవిషయంలో కష్టమమ్మా!"

"ఏం"

"ఒక స్త్రీప్రేమ ఆయన్ను క్రిందకు లాగలేకపోయినప్పుడు మతంనుంచి మార్పించడం చాలా కష్టం"

"అదే చూడాలి."

దానిమీదట ఫిరోజ్ అన్నాడు, "ఈవేళరాత్రి సదానంద పెద్దమ్మ, శబనమ్‌లతో కలుసుకునేందుకు ఒప్పుకున్నాడు."

"నిజమేనా!" శబనమ్‌తల్లి అడిగింది—

"అవును"

"అయితే" శబనమ్ తల్లి అంది, "ఇవేళ నిశ్చయమయిపోవాలి. సదానంద్ మనషరతులు ఒప్పుకుంటే సరేసరి. లేకపోతే రేపు ఫిరోజ్‌తో దీనిపెళ్లి అయిపోవాలి."

"అక్కర్లేదు పెద్దమ్మా! ఈ దయ్యాన్ని నేను చేసుకోను."

"ఏం?"

"ఇతరులు నిరాకరించినతరువాత నాకెందుకు?"

"అయితే ముందే చేసుకో, మీ యమ్మతో మాట్లాడతాను."

"కాని ఈ పిల్ల ఒప్పుకోందే?"

"ఒప్పుకోవే, శబనమ్!"

"నేను ఇతన్ని ప్రేమించడంలేదు."

"ప్రేమ తరువాత వస్తుంది."

"నాకు ముందే కావాలి."

"మీ యిద్దరి తంతు బాగానే వుంది."

ఫిరోజ్ అన్నాడు, "పెద్దమ్మా! ముందు సదానంద్‌తో మాట్లాడు. అతను ఒప్పుకుంటాడని నా ఉద్దేశ్యం. కాని కొంచెం తెలివి తేటలుగా మాట్లాడు. షరతులేమీ తగిలించకు. సదానంద్‌కు, శబనమ్‌కు ఇష్టమయితే నువ్వు షరతులు పెట్టడమెందుకు?"

శబనమ్ తల్లి మాట్లాడలేదు.

2

"ఆఁ, చెప్పండి ఏమిచెప్పాలో!" సదానంద్ శబనమ్ తల్లి నడిగాడు. సదానంద రాత్రిభోజనం చేసి వచ్చాక తల్లి,

కూతురూ వచ్చి కూర్చున్నారు. సదానంద్ రాగానే పనుందని చెప్పి ఫిరోజ్ వెళ్ళిపోయాడు. ఫకీరుద్దీన్‌కు ఈ విషయమంతా తెలిసేవుంటుందనుకున్నాడు, సదానంద్. బహుశా ఆయన దీనికి అంగీకరించేవుంటాడు. లేకపోతే ఆయన తాళం యిచ్చి వుండేవాడుకాదు. ఈ పరిస్థితులన్నింటినీ అర్థంచేసుకుని కూర్చుని ప్రశ్నించాడు.

శబనమ్‌తల్లి అంది, "ఆరోజున అమ్మాయి మిమ్మల్ని కలుసుకునేందుకు వచ్చింది. మీ ప్రవర్తనచూసి ఆమె మీ మోహంలోపడిపోయింది. పెళ్ళిఅక్కర్లేకుండానే మీదగ్గర వుండేందుకు సిద్ధంగావుంది. కాని పెళ్ళికాకుండా ఎవరితోనూ వుండనన్నారట, మీరు. అందుచేత మిమ్మల్ని పెళ్ళాడటానికి సిద్ధంగావుంది. ఇక మీరేమంటారో చెప్పండి?"

"నాఉద్దేశ్యంలో కొంచెం తప్పుజరిగినట్టుంది. నామాటలు శబనమ్‌కు అర్థంకాలేదు. పెళ్ళికాకుండా నేనేస్త్రీని భార్యగా వుంచుకోలేను. పైగా పెళ్ళిచేసుకునేముందు చాలా విషయాలు ఆలోచించాలి!"

"అయితే ఆలోచించేవుంటారు. అందుకే నేనువచ్చింది."

"అన్నిటికన్నా ముందు నాకు కాబోయేభార్య కుమారిగా వుండాలి. పోనీ ఆవిషయాన్ని విడిచిపెట్టినా ఫలితంగా నా కొచ్చే దేమిటో చూసుకోవాలి?"

"ఫలితంగా ఏమి కావాలి?"

"ప్రేమ. నేను చేసుకునేయువతి నన్ను ప్రేమించేదిగా వుండాలి. దానివల్ల ఇకముందైనా ఆమెపవిత్రంగా పతివ్రతలా వుండగల్గుతుంది."

"మా అమ్మాయి మిమ్మల్ని ప్రేమిస్తూనేవుంది. మీకోసం భోజనంకూడా సరిగా చెయ్యడంలేదు."

నిన్న మొన్నటివరకూ పదిరూపాయలకోసం తన శరీరాన్నర్పించేయువతి ఈవేళ ప్రేమతో క్రుమ్మగ్గిపోతోందంటే నమ్మడం కష్టం. ఆమె ప్రేమను పరీక్షించడానికి కొంత సమయంపడుతుంది. తరువాత నాకు నమ్మకం కలిగితే తక్కిన విషయాలు ఆలోచించవచ్చు."

"మీరు పెళ్ళివిషయం మాట్లాడుతున్నారా లేక బజార్లో ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు కొనేమాటంటున్నారా? శీలాన్ని పరీక్షించాలనడం బజార్లో తూకపు పరీక్షలా వుంది."

"ఉల్లిపాయలూ, పచ్చిమిరపగాయలూ కొనేందుకు పెద్దపరీక్ష అవసరంలేదు. కాని భార్యనువెన్నుకొనడంలో పరీక్ష, ఆలోచన అవసరం. ఉల్లిపాయలు మంచివికాకపోతే పెద్దనష్టముండదు. ఒకపావలాతో పోతుంది. భార్య మంచిది కాకపోతే నాజీవితమే పోతుంది."

"మీకు కావలసిందేమిటి?"

"నేను శబనమ్‌ను చేసుకుంటానని వెంటనే చెప్పలేను. కొంతసమయం ఇస్తాను. ఆమె ఈలోపల తనమంచిని నిరూపించుకోవాలి. నన్ను గట్టిగా ప్రేమిస్తోందని నమ్మకంకలిగినప్పుడు పెళ్ళిచేసుకుంటాను."

"ఆమాట నిశ్చయంకావడానికి ఎంత సమయం పడుతుంది?"

"అదెలా చెప్పడం?"

"చూడండి బాబూ! మేము పేదవాళ్ళం. అప్పటి వరకూ తిండీ బట్టా మాటేమంటారు?"

ఈప్రశ్న చాలా క్లిష్టమైనదే. దానిమీదట సదానంద్ అన్నాడు, "తిండి విషయం మామూలే. ప్రపంచమంతటా జరిగేపనే దీనికోసం ఆ వృత్తి చేయక్కర్లేదు. చాలా పను లున్నాయి, చేసుకుంటే"

"మీరు ఈమెను ఎలా కలుసుకుంటారు?"

"కలుసుకుంటేనే పనయిపోదు. ఇంకా ఆలోచించవలసి నవి చాలావున్నాయి? ఈమెకోసం ఇంకా చెయ్యాలి."

"అయితే నేను రేపటినుంచి మిమ్మల్ని కలుసుకునేం దుకు వస్తాను"— ఆనందంతో అంది శబనమ్.

"అచ్ఛా, అలావద్దు. నువ్విక్కడకు రావద్దు. నేను ఆలోచించి ఫీరోజ్ చేత కబురుచేస్తాను."

శబనమ్‌తల్లి ఇంటికివెళ్ళినతరువాత గదమాయించింది "చూడు శబనమ్! ఈ కుట్టాడు చాలా దగాబాజిలా వున్నాడు; నిన్ను చిక్కించుకుని ఆటలాడిద్దామని చూస్తున్నాడు, నువ్వ ఇతన్ని విడిచిపెట్టి ఫిరోజ్‌నికాని, ఎవరైనా మహమ్మదీ యుణ్ని చేసుకో."

శబనమ్ మాట్లాడకుండా వూరుకుంది. తల్లి తిట్టవల సిందంతా అయిపోయినతరువాత అంది, "అమ్మా! నిద్ర వస్తోంది. ఇక పడుకుంటా."

"పాలవాడికి డబ్బివ్వాలి. ఈరోజు రాత్రంతా నువ్వ ఎక్కడికీ వెళ్ళలేదు, నన్ను వెళ్ళనివ్వలేదు."

"ఫకీరుద్దీన్ దగ్గరకు వెళ్ళు."

"ఇప్పుడు పదయ్యింది. ఇంటిదగ్గర వున్నాడో లేడో. ఎక్కడికైనా వెళ్ళాడేమో."

"అమ్మా! ప్రయత్నంచెయ్యి!"

శబనమ్‌తల్లి బట్టలు మార్చుకుని బయటికి వెళ్లిపోయింది. శబనమ్ ఒక పద్యంవ్రాసుకుని గంటవరకూ తల్లికోసం చూస్తూవుంది. ఆమె రాకపోయేసరికి పనిదొరికిందనుకుంది.

ఉదయం తల్లి తిరిగివచ్చి, పాలవాడిబిల్లు చెల్లించి వేసింది. విశ్రాంతి తీసుకుని లేచేసరికి మధ్యాహ్నమయ్యింది. శబనమ్‌ను అడిగింది, "ఫిరోజ్ వచ్చాడా?"

"లేదు!"

"చూడు శబనమ్! ఫకీరుద్దీన్ అనడం సదానంద్ మహమ్మదీయుడుగా మారేవరకూ, వివాహానికి ఒప్పుకో వద్దని."

"ఏం?"

"ఎందుచేతనంటే నువ్వు మహమ్మదీయులపిల్లవు కాబట్టి."

"కాకపోయినట్లయితే ఏమయ్యేది?"

"అయితే నువ్వు ఇస్లాముమతాన్ని విడిచిపెట్టేస్తావా?"

"నేనింతవరకూ చేసేవృత్తి విడిచిపెట్టేశాను. ముందు ఏమిచేస్తానో ఎలా చెప్పడం?

"అయితే నీపెళ్ళి సదానంద్‌తో అవ్వదు." ఫిరోజ్ వచ్చాడు. అతను ఇంటినుంచి రొట్టెలు తెచ్చాడు. "వీటిని కాస్త వేడివేసిపెట్టు శబనమ్" అన్నాడు ఫిరోజ్.

శబనమ్ రొట్టెలుతీసుకుని వంటింట్లోకి వెళ్ళింది. ఆమె వెళ్లిన తరువాత ఫిరోజ్ అడిగాడు, "రాత్రి ఏంజరిగింది పెద్దమ్మా?"

"అతను పెళ్ళిచేసుకుంటాననని మాటఇవ్వనన్నాడు. శబనమ్‌కు తనని ప్రేమిస్తున్నట్టు నిరూపించడానికి అవకాశమిస్తానన్నాడు."

"అవకాశం ఎలా ఇస్తాడు?"

"తను శబనమ్‌ను కలుసుకుంటూంటాడట. దాన్నిబట్టి పరీక్ష చేస్తాడట."

"అయితే నువ్వు వప్పుకున్నావా?"

"నేనేమీ అనలేదు. అతనిఉద్దేశం శబనమ్‌ను నిరాకరించాలని. కాని ఆమెమాత్రం మెదలకుండా కూర్చుంది. ఆఖరికి శబనమ్ ఆతన్ని కలుసుకునేందుకు అతనిమకాంకు వస్తానంది. కాని, అతడు అంగీకరించలేదు. నీతో ఎక్కడ కలుసుకునేది చెబుతానన్నాడు."

"అయితే తిండి-బట్ట ఎలాగ?"

"అంటే నేను సంపాదిస్తే ఆమె తింటుదన్నమాట."

"అదేం బాగాలేదే?"

"ఏం బాగాలేదు?" శబనమ్ రొట్టెలు వేడిచేసి తెస్తూ అడిగింది.

"నిన్ను పరీక్షించేఆయనే నీఖర్చు భరించాలి."

"ఆయనేదో ఆలోచించి ఏర్పాటు చేస్తానన్నారుగా?"

"ఎప్పటికి చెబుతాడు?"

"ఆయనకు తోచినప్పుడు."

"అప్పటివరకూ?"

"ఫిరోజ్ అన్నయ్యదగ్గర అప్పతీసుకుని తింటాను."

3

సదానంద్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్ళేసరికి, కమల వివాహంగురించి మాట్లాడేందుకు సరోజినీదేవి వచ్చింది. ఆమె తమఇంటిదగ్గరే వివాహం జరగాలంటోంది. పెళ్లివారికి ఒకపూట భోజనం, వధూవరులకు బట్టలు, నగలు, సామాను తామే పెడతానంటోంది. ఇదంతా వకీలుగారి ఖర్చుమీదే నడవాలట. దానిమీదట సదానంద్, పరమానంద్‌లు తమ సంపాదనలోంచి ఏమిఇవ్వాలంటే అది ఇవ్వవచ్చు. సదానంద్ అనకం తాము చాలా బీదవాళ్ళం, అందుచేత వివాహం కూడా తక్కువఖర్చుతోనే జరగాలని.

సరోజినీదేవి అంది, "మీ చిన్నతమ్ముడు మోటారులో తిరుగుతూంటే మీరెలా బీదవాళ్ళు. మీ బీదతనంతో కమల వివాహానికి సంబంధమేముంది? వివాహంచేసేది మేము."

"ప్రమోద్‌నంటే మీరు పెంచుకున్నారు? కాని, కమలవిషయం వేరుకదా?

"కాదు, ఆమెవిషయంలోకూడా అంతే."

"చూడు లక్ష్మి! నేను రమాకాంత్ పిల్లను తీసుకోవడానికి అయిదువేలు ఇచ్చాను. కాని నువ్వు పిల్లవాడికిబదులుగా ఏమీ తీసుకోనకపోయేసరికి నాకళ్ళు తెరచుకున్నాయి. వాళ్ళసలు డబ్బుతీసుకోకూడదనిపించింది. అందుచేత వాళ్ళయెడల నామనస్సు విరక్తిచెందింది. ఆనాడే కమలవివాహంలో

అయిదువేలు ఖర్చుపెట్టాలని నిశ్చయించుకున్నాను. అంచేత అలాజరగవలసిందే. పైనమీాయిష్టమొచ్చినంత ఇచ్చుకోండి."

ఈ పరామర్శతరువాత కమలవివాహానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రోజూ మధ్యాహ్నం వకీలుగారిఇంటికి వెళ్తున్నాడు సదానంద్. అక్కడ పెళ్లిపర్పాట్లుచెయ్యడంలో తను చెయ్యవలసిందంతా చేస్తున్నాడు.

శబనమ్‌నుగురించి రాత్రులుతప్ప ఆలోచించడానికి సమయం దొరకడంలేదు. శబనమ్‌ను ఆమెతల్లిని, కలుసుకుని మూడురోజులయ్యింది. నాల్గవరోజున శబనమ్‌దగ్గరనుంచి ఉత్తరంవచ్చింది, "నేటికి మూడురోజులయ్యింది, కాని, మీరు మాటఇచ్చినట్టు నాకేమీా ఏర్పాటుచెయ్యలేదు. అందుచేత మీాదగ్గరకు రాలేకపోతున్నా. తరువాత అమ్మసంపాదనతో గడపటం నాకిష్టంలేదు. అందుచేత ఫిరోజ్‌దగ్గర అయిదు రూపాయలుతీసుకుని అమ్మకిచ్చాను. ఆడబ్బు అయిపోయే లోపుగా మీారేదైనా ఏర్పాటు చేస్తారని నా ఆశ."

ఈ ఉత్తరం వచ్చినతరువాత సదానంద్ ఏదో నిశ్చయించుకోక తప్పలేదు. ఏమిచెయ్యాలో సరిగ్గా తోచకపోయే సరికి ఉత్తరం వ్రాశాడు, "ఎల్లుండి మా అమ్మను కలుసుకోవలసింది. తరువాత ఆమె ఏమిచెపితే అదిచెయ్యి" అని వ్రాసి అడ్రసుకూడా వ్రాశాడు.

ఆ ఉత్తరం ఫిరోజ్‌కిచ్చి అయిదురూపాయలిస్తూ "ఇవి శబనమ్‌ నికిమ్మంది" అన్నాడు.

ఆరోజున మధ్యాహ్నం భోజనంచేసి లక్ష్మితోపాటు వకీలుగారింటికివెళ్తూ దారిలో అన్నాడు, "అమ్మా! ఎల్లుండి

మనింటికి ఒక అమ్మాయి వస్తుంది. ఆమె నన్ను పెళ్ళిచేసుకుంటానంటోంది. ఆమెను పరీక్షించి ఆమె యోగ్యురాలో కాదో నిశ్చయించు."

తల్లి నవ్వింది. ఆమె ఆశ్చర్యంతో సదానంద్ వంక చూస్తూ అంది, "ఆమెముఖంచూసి యోగ్యురాలో కాదో ఎలా చెప్పడం?"

"అమ్మా! నువ్వు ఒక్కరోజులోనే చెప్పనక్కరలేదు. ఆమెను బాగా పరీక్షించు. అప్పటివరకు నేను నా మకాంలోనే పడుకుంటాను."

"అదేం బాగాలేదు. పరాయిస్త్రీని మనఇంట్లో వుంచుకునేదెలా? ఆమె తల్లిదండ్రులు లేమనుకుంటారు?"

"తండ్రి లేడు, తల్లిశీలం మంచిదికాదు. ఈఅమ్మాయి నడతకూడా అంత మంచిదికాదు. కాని ఆమె ప్రవర్తనను చక్కబరుచుకుంటానని మాటఇచ్చింది. అమ్మా! అలా ఏర్పాటుచెయ్యగలవా? చెప్పు!"

తల్లి మాట్లాడలేదు. ఇద్దరూ మాట్లాడకుండా వెళ్తున్నారు. తల్లిమనస్సులో సంఘర్షణ జరుగుతోంది. ఆమె అంది, "చూడు నాయనా! ప్రవర్తన సరిగాలేని ఆ యువతిని మన ఇంట్లోకి తీసుకురావడం నాకు బాగాలేదు. దుష్ప్రవర్తన అనేది అంటువ్యాధి. దానినుంచి మనపిల్లలను దూరంగా వుంచాలంటే అటువంటివాళ్ళనుంచి దూరంగావుంచటమే."

"కాని ఆమె బాగుపడతానంటుంటే ఎందుకు కాదనాలి అనుకుంటున్నావు. నిజంగా ఆమె బాగుపడాలనుకుంటే మనం

కాదనడం పాపం. అందుచేత భగవంతునికార్యంలో అడ్డు పడకూడదనే నిశ్చయానికి వచ్చాను."

"కాని ఒక్కషరతు. ఆమె నామాట విననిరోజున ఇంటినుంచి పంపేంచివేస్తాను."

"అలాగేనమ్మా! ఎల్లుండి నిన్ను కలుసుకోమని ఉత్తరం వ్రాశాను. నువ్వు చెప్పినట్టుగా చెయ్యి."

"అలాగే. మనకు ఆధారం భగవంతుడే. మీతండ్రి వెళ్ళిపోయినప్పటినుంచీ మనకు ఆయనే ఆధారం. ఆయన లీలలు విలక్షణంగా వుంటాయి. మనబోటి క్షుద్రజీవులం అర్థం చేసుకోలేం! సరే, ఆమెను రానీయి. ఆమె నీకు తగినట్టుగా చెయ్యడానికి ప్రయత్నిస్తాను."

తరువాత ఇద్దరూ వకీలుగారియింటిలోనికి వెళ్ళారు.

మరునాడు శబనమ్‌దగ్గరనుంచి జవాబురాలేదు. సదానంద్ తన తల్లితో నిశ్చయించుకుని మాట్లాడక వూరకున్నాడు.

నిశ్చితమైనరోజున శబనమ్ సదానంద్ ఇంటికి వచ్చింది. ఆమె తలుపుకొట్టగానే, ఆమెకోసం ఎదురుచూస్తూన్న లక్ష్మి వచ్చి తలుపుతీసింది. తలుపుతీసి అమ్మాయిని నఖశిఖపర్యంతం చూసింది. రూపానికి అమ్మాయి బాగానేవుంది. ఆమె అడిగింది, "ఏంకావాలి?"

సదానంద్ తల్లిని గుర్తించేందుకు ప్రయత్నిస్తూ శబనమ్ అడిగింది "మీరు సదానంద్ తల్లి గారా?"

"అవును"

"నేను మిమ్మల్ని కలుసుకోవడానికి వచ్చాను."

"పైకిరా" అంది లక్ష్మి.

శబనమ్ లక్ష్మివెనుకాల పైకి వచ్చింది. పైన చమేలీ కూర్చునివుంది. పిల్లలందరూ స్కూలుకు వెళ్ళిపోయారు. చాపమీద కూర్చుని సదానంద్ తనకు వ్రాసిన ఉత్తరం చూపించింది, శబనమ్.

"సరే. నువ్వు నేను చెప్పినట్లు వప్పుకుంటావా?" అంది లక్ష్మి.

"అలాగేనండి. అందుకేగా వచ్చింది."

"అయితే ఈరోజునుంచి ఇక్కడే వుండు. ఇంటికి వెళ్ళనవసరంలేదు."

"ఏం ?"

"ఎందుకంటే నువ్వు నీతల్లినుంచి దూరంగావుండాలి."

"మా అమ్మ ఒప్పుకోదు."

"అయితే ఆమెను ఒప్పించు. చూడమ్మా! మీ తల్లి ప్రవర్తన మంచిదికాదట. నువ్వు మంచిగృహిణివి కావాలంటే ఆమెనుంచి దూరంగా వుండాలి."

తన తల్లిప్రవర్తన గురించి వినగానే శబనమ్ చాలా సిగ్గుపడింది. ఆమెముఖం ఎఱ్ఱబడిపోయింది. అదిచూసి లక్ష్మి అంది, "అమ్మా! ఈఇంట్లో రహస్యాలంటూ వుండవు. అందుచేత సదానంద్ నీవిషయం చెప్పాడు. ఏం చెప్పాడో మళ్ళీ నీకు చెప్పడమెందుకు ?"

శబనమ్ ఇటువంటిమాటలు వినడానికి సిద్ధపడి రాలేదు. కాని, ఇప్పుడు వినడానికి సిద్ధమయింది. ఆమె మౌనంగా వుండటం చూసి లక్ష్మి అంది, "ఒక అమ్మాయిని నాదగ్గరకు

పంపిస్తానని సదానంద్ చెప్పాడు. ఆ అమ్మాయితల్లి దుష్ప్ర
వర్తనకలదట. ఆ అమ్మాయిశీలంకూడా మంచిదికాదు. కాని
అమ్మాయి బాగుపడాలనుకుంది. కాబట్టి నేను నిన్ను పరీక్షించి
ఆపనికి తగుదువో లేదో చెప్పాలట. అయితే చెప్పమ్మా,
అతను చెప్పినదంతా నిజమేనా ?"

"నాలో మీరేం చూశారు ?"

"నేను చూసిందేమంటే నువ్వొక అందమయిన
అమ్మాయివి. శారీరకంగా నువ్వు సదానంద్ భార్య కావటా
నికి తగివున్నావు. కాని వివాహానికి శారీరికసౌందర్యమే
కాకుండా స్వభావము, సంస్కారమూకూడా తగివుండటం
చాలా అవసరం. ఆ విషయాలు తెలుసుకునేందుకు నువ్వు
నాతో వుండటం అవసరం"

"అయితే ఏంచేయమంటారు?"

"నీవిషయంలో నా సమ్మతిపొందాలంటే నువ్వు
నాదగ్గర వుండాలి."

"ఎన్నిరోజులు వుండాలి ?"

"అది నేను చెప్పలేను. నువ్వు ఎప్పుడు వెళ్ళాలంటే
అప్పుడు వెళ్ళొచ్చు. ఇప్పుడు వుండటం వుండకపోవడంకూడా
నీయిష్టం. కాని మాయింటిదగ్గర వున్నంతవరకూ నా ఆజ్ఞాను
సారం ప్రవర్తించాలి."

వివాహమయ్యేనతరువాత కూడానా ?"

"కాదు. తరువాత నీయిష్టం, నీభర్తఇష్టం. తరువాత
మీ వ్యవహారాల్లో కల్పించుకోను. సదానంద్ రాత్రులు తన
మకాంలో పండుకుంటాడు, నువ్వు ఇక్కడ నాదగ్గర వుండు

గాని. అతను మధ్యాహ్నం భోజనానికివచ్చినప్పుడు కలుసుకోవాలంటే కలుసుకోవచ్చు."

"నేను అమ్మదగ్గర సలహాతీసుకుని వస్తాను."

"అలాగే, ఆమె ఇష్టంలేనిదే రావద్దు. వచ్చేటప్పుడు ఆమె అంగీకరించినట్టుగా వుత్తరంతీసుకురా."

"మరొకవిషయం. నువ్విక్కడకు వచ్చినతరువాత నీ తల్లిదగ్గరకు వెళ్ళడానికి వీల్లేదు. కావాలంటే ఆమే ఇక్కడకు వస్తుంది."

"అయితే ఇది జైలులావుంటుందా?"

"జైలుకాదు, పాపవిమోచనస్థానమిది."

శబనమ్ తన పేరుచెప్పకుండానే వెళ్ళిపోయింది. ఆమె మళ్ళీ తిరిగిరాదని లక్ష్మిఉద్దేశం. అందుచేత ఆమె మెట్లు దిగగానే నవివ్వేసింది.

ఈ మాటలు వింటూవున్న చమేలీ ఆశ్చర్యంతో అడిగింది, "అత్తయ్యా! ఏమిటి, ఏమీ అర్థంకాలేదు?"

"సదానంద్ చాలా తెలివైనవాడయినట్టున్నాడు. ఈ అమ్మాయి పెళ్ళిచేసుకోమని బాధపెడుతూన్నట్టుంది. ఆమె నుంచి తప్పించుకొనేందుకు నాదగ్గరకు పరీక్షకు పంపించాడు. ఇక్కడ వుండమనగానే పారిపోయింది." ఆమె వెళ్ళిపోయినందుకు లక్ష్మి సంతోషించింది.

4

మధ్యాహ్నానాంతరం సదానంద్ భోజనానికి ఇంటికి రాగానే, లక్ష్మి ఆ అమ్మాయితో జరిగినమాటలన్నీ చెప్పింది.

సదానంద్ చిరునవ్వుతో, "అమ్మా! ఆమె పేరు అడిగావా?" అన్నాడు.

తల్లి స్తబ్ధురాలై పోయింది. అది చాలా ముఖ్యమయిన విషయమయినప్పటికీ తాను మర్చిపోయింది.

సదానంద్ అన్నాడు, "ఆమె పేరు శబనమ్. ఆమె మహమ్మదీయులపిల్ల. ఏదో కాస్తో కూస్తో చదువుకుంది. తెలివైనది. వేశ్యావృత్తి చేస్తుంది."

"ఈమె నీకెక్కడ దొరికింది?"

"మాదుకాణంలో ఒక కుర్రాడు పనిచేస్తున్నాడు. అతని పేరు ఫిరోజుద్దీన్. ఈమె అతని పెదతల్లికూతురు. ఈమెకు నాకూ పెళ్ళికావాలని అతనికోరిక."

సదానంద్ చమేలీకి చదువుచెప్పడానికి ప్రప్రక్రమించ గానే చమేలీ అంది, "అమ్మాయి చూడటానికి అందంగా మంచిదిలా వుంది."

"వదినా! నీకంటెమాత్రం బావుండదు. కొంచెం నలుపుకదా!"

"అబ్బే, నలుపుమాత్రం కాదు. చామనఛాయ వుంటుంది. కాని సదానంద్, రంగు కేంలే! కాస్త పౌడరుతగిలిస్తే నిమిషంలో మారిపోతుంది. రూపురేఖలుమాత్రం బావున్నాయి."

"అయితే ఆమెను పెళ్ళి చేసేసుకోమంటావా?"

"నా అభిప్రాయం అదే. సంస్కరణ వివాహానంతరం జరుగుతుంది."

"అమ్మ అలాఅంటే ముందే చేసివుండేవాణ్ని. కాని నేను ఆమెను పరీక్షిస్తున్నా. ఆమె నన్ను ప్రేమించానంటోంది. ఆమె నాకోరకు తనతల్లిని విడిచిపెట్టివుండగలదో లేదో చూడాలని నా ఉద్దేశ్యం."

ఈమధ్య సదానంద్ లైబ్రరీకి అప్పుడప్పుడు మాత్రమే వెళ్తున్నాడు. ఎప్పుడైనా విశేషమైనపనేమీ లేనిరోజున గ్రంథాలయానికి వెళ్ళుతున్నాడు.

దుకాణంలో ఫిరోజ్ శబనమ్‌విషయంలో ఏమీ చెప్ప లేదు. చాలారోజులు గడిచిపోయాయి. కాని శబనమ్ విషయంలో ఏమీ తెలియలేదు.

ఇంచుమించుగా పదిహేనురోజుల తరువాత ఫిరోజ్ సదానంద్‌తో అన్నాడు, "సదానంద్! శబనమ్ నిన్ను కలుసుకోవాలంటోంది."

"నేను వద్దనలేదే. నేను రోజూ మధ్యాహ్నం రెండు గంటలనుంచి మూడుగంటలవరకూ ఇంటిదగ్గరే వుంటాను. ఆమె అక్కడకు రావచ్చు."

"ఆమె రాత్రి దుకాణంలోకి వస్తానంటోంది."

"నేను ఈమధ్య దుకాణంలో పండుకోవటంలేదు. అక్కవివాహం నిశ్చయమయ్యింది. ఆ ఏర్పాట్లలో మునిగి వుంటున్నా. రాత్రులు ఇంటివద్దనే పండుకుంటున్నా."

"అయితే పుస్తకంవ్రాయడం అయిపోయిందా?"

"అవును. పుస్తకంవ్రాయడం అయిపోయింది. దాన్ని తాజ్ కంపెనీవాళ్ళకు ఇస్తున్నా. వాళ్ళు చదవటానికి అడిగారు."

"అయితే ఈరోజు సాయంకాలం నీ ప్రోగ్రాం ఏమిటి?"

"ఈరోజుసాయంకాలం మోరీద్వారందగ్గర కవిసమ్మేళనంవుంది. బహుశా అక్కడకు వెళ్తాను. రాత్రి పదిగంటలకుఅయిపోతుంది. తరువాత ఇంటికి వెళ్ళిపోతాను."

ఫిరోజ్ మాట్లాడలేదు. మధ్యాహ్నం భోజనంచేసి పెద్దమ్మఇంటికి వెళ్ళాడు. శబనమ్ ఇంటిదగ్గరనే వుంది. ఆమె తల్లి ఏవో కొనేందుకు బజారుకువెళ్ళింది. ఫిరోజ్ సదానంద్ మాటలు చెప్పగానే శబనమ్ వాళ్ళఇంటికివెళ్ళి కలుసుకునేందుకు సిద్ధపడింది.

ఫిరోజ్ అన్నాడు, "రాణీగారూ, తొందరేముంది?"

"నేనివేళ ఏదోఒకటి తేల్చేసుకోవాలి. అమ్మ అనుమతి వ్రాసిఇవ్వటానికికాని, ఆయనతో నావివాహానికిగాని అనుమతించడంలేదు."

"చూడు శబనమ్ ! సదానంద్‌తో నీ వివాహం జరుగదు. ఫకీరుద్దీన్ మీకోసం చాలాచేశాడు. ఆయనమీయమ్మకు నెలకు వందరూపాయలువరకూ ఇవ్వడం నాకు బాగా తెలుసు."

"చూడు ఫిరోజ్ ! నేను పెళ్ళిచేసుకోవడం జరిగితే సదానంద్‌నే చేసుకుంటాను. ఫకీరుద్దీన్ ఏమయినా అననీ, నిన్నుమాత్రం చేసుకోను."

"ఒకరోజున ఫకీరుద్దీన్ ఒక కవిసమ్మేళనానికి వెళ్ళాడు. అందులో సదానంద్ తన కవిత్వం వినిపిస్తున్నాడు. అతను పంజాబీలో కవిత్వంచెబుతున్నాడు. ఆ కవిత్వంలో సారం ఏమంటావేమో ?-రక్తపిపాసులయిన మహమ్మదీయులు ఈ దేశానికి వచ్చారు. అనేకమందిని పీడించి మహమ్మదీయు

లుగా మార్చివేశారు అని. ఈవిధంగా మహమ్మదీయ మతాన్ని బాగా ఎత్తిపాడిచాడు."

"ఇందులో మహమ్మదీయమతాన్ని ఎత్తిపాడిచిందేముంది? ఆకాలంనాటి మహమ్మదీయుల దుష్ప్రవర్తనను నిందించాడు."

"కాని మహమ్మదీయమతంకోసమే ఇవన్నీ జరగాయన్నాడుగా?"

"ఫిరోజ్? ఒకవిషయంమాత్రం వప్పుకోవలసిందే. ఆరోజుల్లో మహమ్మదీయమతం అవలంబించేంతవరకూ హిందువుల ప్రాణాలు దక్కేవికావు."

"ఇదంతా వ్యర్థప్రలాపన. మానవస్వభావానికి విరుద్ధంగా వుంది."

"అయితే హిందువులు వ్రాసిన చరిత్రఅంతా అబద్ధమంటావా? రైల్వేస్టేషనుదగ్గర హిందూదేవాలయాలను పడగొట్టి మసీదులు కట్టినవిషయంకూడా అబద్ధమంటావా?"

"అవును శబనమ్! హిందువులు ఎంత అబద్ధాలకోరులో నీకు తెలియదు. వీళ్ళంతా వైశ్యులు. వీళ్ళు తమలక్ష్యాన్ని సాధించేందుకు ఎటువంటి మోసాలయినా చేస్తారు."

"కాని, అన్నయ్యా! అమ్మ అతన్ని మహమ్మదీయుడుగా మార్చిగాని వివాహంచెయ్యనంటోంది."

"బాగానేవుంది."

"కాని ఇది మోసంకాదా? వాళ్ళు తమ స్వార్థంకొరకు మోసంచేస్తారంటున్నావు. కాని అమ్మ, షకీరుద్దీన్ ఇస్లాము కొరకు మోసంచెయ్యమంటున్నారు."

"అది అంత చెడ్డదికాదు. తన స్వార్థంకోసం చేసేతప్పు తప్పే. కాని, భగవంతుని గౌరవంకోసం చేసినతప్పు తప్పు కాదు."

"అదేగా ఆయన తనకవిత్వంలో అన్నది. తప్పేమి వుంది ?"

"కాని ఇస్లాముకుమాత్రం చెడ్డపేరువచ్చేలా నిందించాడు."

"ఇస్లాముకు కాదు, ఇస్లాము ప్రచారంచేసే నీలాంటి వాళ్ళకు చెడ్డపేరువచ్చేలా నిందించాడు."

"కాని ప్రతిచోటా జరిగేది ఇదేగా."

శబనమ్‌మనస్సులో మరొక భావం చెలరేగుతోంది. ఆమె తనజాతిలోని అయుక్తమైన ప్రవర్తననుంచి దూరంగా వుండాలనుకుంది. తనఇంటివాళ్ళు సదానంద్‌ను నిందించేకొద్దీ ఆమెహృదయంలో సదానంద్‌ఎడల అభిమానం, గౌరవం పెరుగుతున్నాయి.

ఫిరోజ్ వెళ్ళగానే అమ్మవచ్చింది. ఆమె అంది, "ఫకీరుద్దీన్‌గారు నీకోసం ఒకఅబ్బాయిని చూశారు. నేను అతన్ని చూసేందుకు వెళ్ళాను. బజార్లో అతనిదొక చిన్న చెప్పులకొట్టు. అతనిపేరు నజీర్. దుకాణంపేరు నజీర్ షూకంపెనీ. అతనివయస్సు ఇరవై, ఇరవయ్యొకటి వుంటుంది. ఎఱ్ఱగా వుంటాడు. చారెడేసికళ్లూ అతను, మంచి అందంగా వుంటాడు. నాకు బాగా నచ్చాడు. స్వంతదుకాణం వుంది. యువకుడు, ఆరోగ్యవంతుడూను."

"అయితే అతన్ని నువ్వేచేసుకో అమ్మా! అంత అందంగావుండి నీకు నచ్చినప్పుడు ఇకనేం? యువకుడయిన తండ్రిరావడం నాకూ ఇష్టమే. పైగా ఈ వయస్సులో నీకూ ఆసరాగా వుంటాడు."

తల్లి కళ్లెర్రచేస్తూ అంది, "ఈ సదానంద్‌లో ఏం చూశావేంటి? ఇతరులెవ్వరూ నీకు నచ్చడంలేదు!"

"నేను ఇతరులెవ్వరినీ చూడనేలేదు."

"అయితే చూపించనా?

"నువ్వు తీసికెళ్ళి చూపిస్తే, నేను కాబోయేభార్యనని తెలుసుకుని, ఉన్నవీ లేనివీ కల్పించుకుని ప్రవర్తిస్తాడు. దానితో అతని నిజస్వరూపం తెలియదు. నే నీవేళ ఒంటరిగా వెళ్దామనుకుంటున్నా - ఏం వెళ్ళనా?"

"నువ్వు కార్యమంతా చెడగొడతావు!"

"చూద్దువుగానిగా. నేనెవర్నైనదీకూడా అతనికి తెలియదు."

"నచ్చినట్లయితే వివాహం చేసుకుంటానని మాట ఇచ్చినట్టయితే వెళ్ళనిస్తాను."

"అందుకనేగా వెళ్ళేది."

సాయంకాలం నాలుగుగంటలకు శబనమ్ చీర, జంపరు తొడుక్కుంది. బాగా ముస్తాబయి బయలుదేరింది. కళ్ళకు సుర్మాపెట్టుకుంది. లిప్‌స్టిక్‌కూడా వేసుకుంది. బజారుకువెళ్లి నజీర్ షూకంపెనీకి ఎదుట నిలబడింది. దుకాణం చిన్నదే అయినా బాగా సరుకుతో నిండివుంది. దుకాణం ముస్తుం

దగ్గర నుంచుంది. దుకాణంవాడు ఆమెను నఖశిఖపర్యంతం చూసి చిరునవ్వుతో "ఏం కావాలి ?" అని అడిగాడు.

"నాకాళ్ళకు జోళ్ళుకావాలి. కొంచెం మేలురకం కావాలి ?"

"పాదం చూపించండి, ఏసైజో ?" అన్నాడు వాడు.

శబనమ్ దుకాణంలోపలికి వెళ్ళి కుర్చీలోకూర్చుని తన కాలి కోళ్ళు విప్పింది. కాలు పీటమీదపెట్టింది.

"చాలా చిన్నపాదాలే."

"అవును; పెద్దవికావడంలేదు. ఏంచెయ్యను ?"

నజీర్ ఒక ఎఱ్ఱని చెప్పులజత తీసి ఆమెకాళ్ళకు తొడిగాడు. అతను పాదాన్నినొక్కి చెప్పుతొడుగుతూంటే శబనమ్ బాధపడుతున్నట్టుగా "ఆ..." అంది.

"ఓ మీ పాదాలు చాలా నాజూకైనవే!"అంటూ నొక్కటం తగ్గించాడు.

"ఇలా ఇవ్వండి, నేనే తొడుక్కుంటాను"అందిశబనమ్.

"వద్దండీ! నేనే తొడుగుతా. ఈసారి బాధగా వుండదు లెండి."

"ఆఁ ఎందుకు లెద్దురూ. మీరు పాదాలుపట్టుకు కూర్చున్నారు."

నజీర్ ఆమెకళ్ళవంకచూస్తూ పాదంకొంచెంనొక్కాడు. శబనమ్ చిరునవ్వు నవ్వింది. అతనుకూడా చిరునవ్వు నవ్వుతూ, మంచిది మరొక జతవుంది. అది చూపిస్తానుండండి." అన్నాడు. తరువాత లేచి, మరొకజత తీశాడు.

అతను దాన్ని తొడిగినతరువాత శబనమ్ అంది. "ఇది బావుంది. కాని ఖరీదు చాలావుండొచ్చు."

"ఎక్కువేమీ కాదు. మీరు తీసుకెళ్ళండి. డబ్బంటారా? అదేవస్తుందిలెండి !"

అలా అని నజీర్ శబనమ్‌ముఖంవంక చూశాడు. శబనమ్ అంది, "అయినా చెప్పండి. ఖరీదు ఇవ్వవలసిందేగా?"

"మీ చిరునవ్వొక్కటి చాలు."

"అయితే మా చిరునవ్వువిలువ అంత ఎక్కువా లేక ఈ జోళ్ళధర తక్కువా?"

"మీ చిరునవ్వుకు విలువలేదు. ఈ చెప్పులజతేమిటి, ఈ కొట్టంతా ఆ ఒక్క చిరునవ్వుకు బలిచెయ్యగలను."

"ఓ! అయితే ఇంకా మీ పెళ్ళికాలేదా?"

"లేదు. ఏం?"

"ఇంటిదగ్గర ఎవ్వరూ అడిగేవాళ్ళులేకపోతే; అటువంటిమాటలే వస్తాయి"

"ఎవరైనా వుంటేమాత్రం మిమ్మల్ని పోటీచెయ్యగలరా? మీకు మీరేసాటి."

"అయితే ఇది తీసుకుపోనా:. నాకు నచ్చింది."

"తప్పకుండాను."

"అయితే ఈవేళరాత్రి తొమ్మిదిగంటలకు సఫీర్‌వీధిలోని మహతాగారియింటికివచ్చి దీనిఖరీదు తీసుకువెళ్ళండి."

"అదృష్టవంతుణ్ణి, తప్పకుండా వస్తాను. మీపేరు చెప్పారుకాదు?"

"రామప్యారీ. మహాతా .మా అన్నయ్య. ఈమధ్య ఢిల్లీ వెళ్ళాడు."

శబనమ్ జోళ్ళుతీసుకుని వెళ్ళిపోయింది. నవ్వుతూ ఇంటికి చేరుకుంది. అక్కడ తల్లిముందు జోళ్ళుపడవేసి, "తీసుకో, మీ నజీర్ దగ్గరనుంచి తీసుకువచ్చాను."

తల్లికి ఆమెమాటలు అర్థంకాలేదు. "ఎంతకు తెచ్చావు" అనడగింది.

"కాస్త రెండు కళ్ళూ తిప్పి."

"అంతే!"

శబనమ్ జరిగినదంతా చెప్పి అంది "నేనిప్పుడు సదానంద్‌ను కలుసుకునేందుకు వెళ్తున్నా. ఆయనతో విషయం తేల్చుకునిగాని రాను."

"అతన్ని ఎక్కడ కలుసుకుంటావు ?"

"పంజాబ్ పబ్లిక్ లైబ్రరీలో. ఆయన అక్కడ నాలుగింటినుంచి ఆరుగంటలవరకూ వుంటారు. నేను అక్కడికే వెళ్తున్నా."

"ఎప్పుడు వస్తావు."

"రాత్రి భోజనాలకుముందే వచ్చేస్తా."

"కాని, వాళ్ళఇంట్లో వుండటానికిమాత్రం నేనంగీకరించను."

"ఏం ? నువ్వు నన్ను వ్యభిచారులయిండ్లకు పంపించే దానవుగా !"

"అది వేరేవిషయం."

"మంచిది."

సదానంద్ లైబ్రరీలో వుండడని, సాయంకాలం ఏడు గంటలకు మోరీపార్కులో కవిసమ్మేళనానికి వస్తాడని, శబ నమ్‌కు తెలుసు. వచ్చిన ఇబ్బందేమంటే అక్కడ చాలామంది వుంటారు. ఆమె అక్కడకు ఒంటరిగా ఎలా వెళ్ళేది? సదా నంద్‌ను ఎలా పిలిచేది? ఆమెకు ఒక విషయం తట్టింది. ఆమె ఫిరోజ్‌నుకూడా తీసుకువెళ్ళాలనుకుంది. అందుచేత ఇంటినుంచి తిన్నగా అతని దుకాణానికి వెళ్ళింది. కాని లోపలికి వెళ్ళ కుండా కొంచెం దూరంలో బయటనుంచుని చూసింది. షకీ సుల్తాన్‌కు కన్పించకూడదని ఆమెఉద్దేశ్యం.

ఫిరోజ్ తన చాప సర్దుకుంటున్నాడు. అందుచేత ఆమె దుకాణంముందునుంచి వచ్చి, కొంచెందూరం వెళ్ళి రోడ్డు మీద నుంచుంది. శాహదరా వెళ్ళేందుకు ఫిరోజ్ అటు నుంచే వెళ్తాడు. అయిదునిమిషాలలో ఫిరోజ్ పెద్దపెద్దఅంగలు వేసుకుంటూరావడం చూసింది. అతను దగ్గరకురాగానే అతని వెంట వెళ్తూ, శబనమ్ అడిగింది, "ఫిరోజ్‌అన్నయ్యా! ఎక్క డికి వెళ్ళుతున్నావు?"

"ఇంటికి, శాహదరా."

"ముందు నావెంటరా."

"ఎక్కడకు?"

"మీ సదానంద్‌తో అంతా నిశ్చయం చేసుకునేందుకు వెళ్తున్నా."

"పెద్దమ్మ కోప్పడుతుంది."

"అడిగేవచ్చాను."

"కాని ఆమె నీకోరకు మరొకవరుణ్ణి"చూసివచ్చింది?"

"తెలుసు." అలా అని శబనమ్ నజీర్ వృత్తాంతమంతా వినిపించింది. దానిమీదట ఫిరోజ్ అన్నాడు, "అయితే మాత్రం ? నువ్వొక యువకుణ్ణి మోహంలోముంచి, పైగా అతన్ని హేళనచేస్తున్నావా ?"

"కాదన్నయ్యా ! అతనే స్వయంగా నా పాదాలు ముట్టుకుని మురిసిపోయాడు. నా ఒక్కచిరునవ్వుకు తన దుకాణాన్నంతా అర్పించగలనని అన్నాడు. నేనేమీ అతనిమీద మోహంచూపించలేదు. తనే స్వయంగా పండినపండులా రాలి క్రిందపడిపోయాడు."

"అయితే కావచ్చు. మాలాంటి యువకులు నీలాంటి సీతాకోకచిలుకలు బజార్లో తిరుగుతుంటే వశంలో వుండలేరు. అందుచేతనే మహమ్మదు మీకు పరదాపద్ధతిని పెట్టాడు."

"వాహ్ ! మీ అసమర్థతను దాచిపెట్టుకునేందుకు, దోషాన్ని ఇతరులనెత్తిమీద రుద్దుతున్నావే ?"

"హజరత్ మహమూద్ మాకంటే చాలా సమర్థుడు. నేను ఏవో పచ్చిపచ్చిమాటలతో సమర్థించుకునేందుకు ప్రయత్నించడంలేదు. నువ్వు అప్సరసలా అలంకరించుకున్న అందాన్ని వొలకబోస్తూ వెళ్ళినప్పుడు నజీర్ మోహంతో ఉక్కిరిబిక్కిరైపోయాడంటే తప్పేముంది?"

"కాని ఈ అందం సదానంద్‌ను ఎందుకు మోహంలో ముంచలేదు?"

"అతని ఆరోగ్యం బాగాలేదని నా అనుమానం."

"కాని అతనిముఖంలో నజీర్ ముఖంలోకంటే. నా ముఖంలోకంటే ఎక్కువ తేజస్సువుంది. అతనంటే నాకు

ఎక్కడలేని ఆకర్షణాను. ఎందుచేతంటావు? నాకుకూడా అటు వంటి సందేహంవచ్చింది. కానీ ఆలోచించగా అది నిరాధార మనిపించింది."

వాళ్ళు ఆ వీధిదాటి మరోకవీధిలో అడుగుపెట్టారు. శబనమ్ అంది, "ఫిరోజ్ అన్నయ్యా! నీచెల్లెలిజీవితం బాగు పడటం నీ కిష్టంలేదా? అమ్మ తను చేసేపని, నాచేత చేయించే పని ఏమంత మంచిది? చూడు. నువ్వొకోంచెం ఎదుటబడ్డు కన్పి స్తోంది. ఆసరాచూపించావంటే నేను ఈదేస్తాను."

ఫిరోజ్ అంగీకరించాడు. అతనన్నాడు, "నడువు. కాని నాపేరుమాత్రం మధ్యకు లాగకు. ఎటువెళ్ళాలి, చెప్పు."

"ముందు మైక్లోడ్ రోడ్డుదగ్గర వకీలు కుంవర్ సేన్ గారి ఇంటికివెళ్దాం. అక్కడ లేకపోతే మోరీపార్కులోని కవిసమ్మే ళనానికి వెళ్దాం."

"అయితే రాత్రి శాహదరా వెళ్ళలేను."

"వెళ్ళొద్దు. మాఇంటిదగ్గరే పడుకుందువుగాని. ఫిరోజ్ రేపటికి ఏదోఒకటి నిశ్చయమయిపోతుందని నామనస్సు చెబు తోంది. ఫకీరుద్దీన్ నాకు బాగా తెలుసు. ఈ నజీర్ అతను నిశ్చయించిన అబ్బాయే."

ఇద్దరూ చేంబర్లేన్ రోడ్డుదాటి మైక్లోడ్ రోడ్డుదగ్గరకు వచ్చారు. మైక్లోడ్ రోడ్డుమీదనుంచి వెళ్ళుతుంటే శబనమ్‌దృష్టి పక్కనున్న ఒకఆవరణమీద పడింది. ఆవరణకుబయట ఒక బోర్డుకట్టివుంది. దానిమీద, "మిషన్ ఆవరణ. బీదలకు, కష్ట ులలోవున్నవారికి ఆశ్రమము. రండి, ఏసుప్రభువుపడిలో ఆశ్ర

యముపొందండి. ఆయన ఆశ్రయము, రక్షణ ఎల్లరకూ లభించును." అని వ్రాసివుంది.

శబనమ్ నిలబడిపోయింది. క్రైస్తవులు, తమ దగ్గరకు వచ్చినవారందరికీ ఆశ్రయం ఇస్తారని ఆమె వినివుంది.

ఆమె బయలుదేరింది. ఫిరోజ్ అడిగాడు, "అదేమిటి ?"

"చదువలేకపోయాను"

"ఏసుక్రీస్తునుగూర్చి ఏమైనా వ్రాసివుందా ?"

"అవును," అని ఆమె మనస్సులో ఆలోచిస్తోంది.

మైక్లోడ్ రోడ్డుమీద వకీలు కుంవర్ సేన్ గారి ఇల్లు చేరుకోగానే అక్కడ పెళ్ళి అలంకరణాలు, అవీ కన్పించాయి. పందిరి వేశారు. విద్యుద్దీపాలు పెడుతున్నారు. తోరణాలు, రంగుకాగితాలతో చేసినబుట్టలు, దండలు వ్రేలాడుతున్నాయి. "ఇక్కడ ఏమి జరుగుతుంది బాబూ?" అని ఫిరోజ్ ఒకరి నడిగాడు.

"వకీలుగారి కూతురు వివాహం."

"సదానంద్ ఎక్కడ దొరుకుతారు?"

ఆయన ఫిరోజ్, అతని ప్రక్కన నుంచున్న అమ్మాయి వంక తదేకంగాచూసి, "ఎందుకు?" అనడిగాడు.

"ఆయనతో పనుంది."

"ఏమిటో చెప్పండి, నేనతని అన్నగార్ని."

ఫిరోజ్ ఏంచెబుదామా అని ఆలోచిస్తూండగానే శబనమ్ ముందుకువచ్చి అంది "ఈరోజు కవిసమ్మేళనం ఉందికదండీ. నేనుకూడా అందులో పాల్గొనేందుకు అమృతసర్ నుంచి వచ్చాను. నేను ఇక్కడకు వచ్చినట్టయితే నన్ను సమావేశా-

నికి తీసుకువెళ్తానని పండిట్‌జీ వ్రాశారు. నన్ను సమ్మేళనంలో పరిచయం చేస్తానని వ్రాస్తారు."

అతను పరమానంద్—"అతడక్కడికి వెళ్ళిపోయాడే!" అన్నాడు.

"మాకు కొంచెం ఆలశ్యమయింది. బండిలేటయ్యింది."

5

మోరీపార్కులో రెండుమూడువేలమంది జనం ప్రోగయ్యారు. లాహోరులో కవిత్వంచెప్పగలిగే ప్రసిద్ధకవులందరు సమావేశానికి హాజరయ్యారు. అందులో ఉర్దూ, హిందీ, ఫారసీ, పంజాబీ భాషలలో కవిత్వంచెప్పగల ప్రసిద్ధకవులంతా వున్నారు. పంజాబీకవులలో సదానంద్ చాలా పేరుగలవాడు. ప్రజలు అతని కవిత్వంవినడానికి చాలా ఆత్రుతగావున్నారు.

సమ్మేళనం ఏడుగంటలకే ప్రారంభమయ్యింది. చిన్న చిన్న కవులందరూ తమ కవిత్వాలను వినిపిస్తున్నారు. తొమ్మిది గంటలనుంచి ప్రసిద్ధకవులు తమతమ కవిత్వాలు వినిపిస్తారు. ముందుగా సదానంద్ పేరు చదువగానే సదానంద్ లేచినుంచుని తనకవిత్వం మధురకంఠంతో వినిపించాడు. సదానంద్ కవిత్వం శ్రోతలను ఆనందడోలికలలో ముంచెత్తింది. ఇంతలో శబనమ్ ఒక ఉత్తరం వ్రాసి సదానంద్ దగ్గరకు పంపించింది. సదానంద్ అది చదువుకుని లేచివచ్చి బయట శబనమ్‌కోసం వెదుకుతున్నాడు. సరిగ్గా అదేసమయానికి ఫిరోజ్ దగ్గరకువచ్చి అన్నాడు, "సదానంద్! మమ్మల్ని చాలా బాధపెట్టావు!"

"ఆమె ఎక్కడ?"

"ఆమె కూర్చుంది." అని గడ్డిమీదకూర్చున్న శబ నమ్‌వైపు చూపించాడు. సదానంద్ దగ్గరకువెళ్ళి, "ఇక్కడ ఏమిచేస్తున్నావు ?" అని అడిగాడు.

"ఒకస్త్రీ ఒంటరిగాకూర్చుని ఏమిచేస్తుంది ?"

"అలాగా, నడువు ! ఇక్కడ బావుండలేదు."

ముగ్గురూ పార్కుబయటకువచ్చారు. ఫిరోజ్‌అన్నాడు; "మేము నిన్ను వెదుక్కుంటూ మైక్లోడ్‌రోడ్డువెదుక్కుంటూ దగ్గరకు వచ్చాము. అక్కడ వివాహసన్నాహాలు జరగటం చూసి నువ్వు ఉంటావేమోననుకున్నాం. తరువాత అక్కడ నుంచి ఇటువచ్చాం. నీ కవిత్వం అయిన తరువాత నిన్నుపిలువ గలిగాము."

పార్కుబయటఒకచెట్టుక్రింద కూర్చుని, వాళ్ళనుకూడా కూర్చోమని అన్నాడు - ఇవేళ "నాకోసం వచ్చారేం"

"ఇవేళే కాదు. ఇదివరకు చాలాసార్లు రావడం జరిగింది. కాని మిమ్మల్ని ఈసారిమాత్రమే కలుసుకోగలిగాం."

"నువ్వు మాఅమ్మను కలుసుకున్నావు. కాని మళ్ళీ ఎప్పుడూ రాలేదేం ?"

"మీ అమ్మగారు మాతల్లిదగ్గరనుంచి ఉత్తరం తెమ్మన్నారు. కాని అది సాధ్యంకాలేదు. ఈవేళ ఏదో వంకపెట్టి మీరేంచెబుతారోనని ఇలావచ్చాను."

"శబనమ్! నువ్వింకా మైనరువు. నువ్వు మీ తల్లి అనుమతి లేకుండా ఎక్కడకీ వెళ్ళటానికి వీలులేదు. నిన్ను తీసుకువెళ్ళినవ్యక్తి నేరస్థుడవుతాడు. అందుచేత మీతల్లి నువ్వుమా ఇంటిదగ్గర వుండేందుకు ఇష్టపడకపోతే మైనారిటీ

తీరేవరకూ ఆమెదగ్గరనేవుండు. కావాలంటే నీకు నెలకు ఇరవైరూపాయలు ఖర్చుకు పంపిస్తుంటాను."

"ఖర్చుమాటలా వుంచండి. రేపో ఎల్లుండో ఒక చెప్పులదుకాణంవాడితో నావివాహంకూడా అయిపోతుంది."

"అయితే నేనేమిచేయగలను?"

"మరేమీ మందులేదా దీనికి?"

"మందువుంది. కాని పట్టణంలో చాలా అల్లరి జరుగుతుంది. హిందువులు, మహమ్మదీయులు కొట్టుకుంటారు. కొంతమంది చస్తారు. మరికొంతమంది గాయపడతారు. అంత ప్రమాదంతోకూడిన పని నేను చెయ్యలేను."

"కాని అలా ఎందుకు జరుగుతుంది. తల్లిదగ్గర వుండటం యిష్టంలేదని నేనే స్వయంగా చెబుతాను."

సదానంద్ కొంచెంసేపు ఆలోచించాడు. తరువాత అన్నాడు "ఒక్కమాట. నువ్వు హిందువుకాలేవు. నీవివాహం స్వయంగా చేసుకోలేవు. నీ తల్లి సంరక్షణనుంచి బయటకు రాలేవు. ఇక మిగిలినదల్లా ఒక్కటేపని. న్యాయస్థానానికి వెళ్ళి మీ అమ్మవృత్తి, ఆమె నీచేతచేయించే వృత్తినిగురించి చెప్పుకో. అప్పుడు న్యాయనస్థానం నీరక్షణకొరకు ఏదోఒక ఏర్పాటుచేస్తుంది."

"కాని న్యాయస్థానంలో నేను మాఅమ్మకు వ్యతిరేకంగా సాక్ష్యంచెబితే అందరూ నన్ను హేళనచేస్తారు. అయితే మీరు నన్ను వివాహం చేసుకుంటారా?"

"నేను పెళ్ళాడటానికి ఒక్కటే షరతు. మాఅమ్మ దగ్గరకు వెళ్ళి వుండు. ఆమె సిఫారసుచేసినట్టయితే నిన్ను చేసు కోవడానికి అభ్యంతరంలేదు.

"కాని ఇప్పుడది ఎలా సాధ్యం? నాకు ఇరువయొక్క సంవత్సరాలు వస్తేకాని మైనారిటీ తీరదు. ఇంకా నాలుగు సంవత్సరాలు పడుతుంది. అప్పటివరకూ ఎక్కడవుండేది?"

"నువ్వు రేపుఉదయం వకీలుగారి ఆఫీసుకురా. అక్కడ ఆయనతో ఆలోచించి నిర్ణయించుకుందాం!"

"మరేమీ ఉపాయంలేదా? ఈవేళ మనిద్దరంకలసి పారిపోకూడదా?"

"లేదు. ఎల్లుండి కమలక్కపెళ్ళి. నేను పారిపోవాలన్నా పోలేను. పైగా నాదృష్టిలో అదిబాగాలేదు."

"అయితేమరి?"

"రేపుఉదయం ఎనిమిదిగంటలకు వకీలుగారిఆఫీసుకు వచ్చివెయ్యి. మాట్లాడుకుందాం."

6

మరునాడుఉదయం సదానంద్ దుకాణానికి పనిచేసేం దుకు వెళ్ళాడు. మేనేజరు అతనివంక పరీక్షగా చూశాడు. సదానంద్‌కు అదేమీ అర్థంకాలేదు. అతనేమీ పట్టించుకో కుండా తనపనిలో నిమగ్నమయిపోయాడు. ఫిరోజ్‌కూడా వచ్చాడు. సదానంద్ ప్రక్కనే కూర్చుని పనిచేస్తున్నాడు. వాళ్ళిద్దరూ మౌనంగా పనిచెయ్యడంచూసి మేనేజరు ఫిరోజ్‌ని దగ్గరకు పిలిచాడు.

"పెద్దమ్మనింటికి వెళ్ళావా?" అన్నాడు.

"లేదు."

"అయితే వెళ్ళు. సదానంద్ ఇక్కడ వున్నాడని ఆమెతో చెప్పు."

"మేనేజర్ విషయమేమిటి?"

"ఏమీలేదు. సదానంద్ మీద అనుమానంవుందని రాత్రి పోలీసులకు రిపోర్టుఇచ్చాము."

"కాని, మేనేజర్! ఆమెను లేవుకుపోవడానికి సదానంద్ రాత్రి నిరాకరించాడే. పైగా అటువంటిపనంటే సదానంద్‌కు ఇష్టంలేదుకూడాను."

"అయితే ఆమె ఎక్కడకువెళ్ళింది?"

"ఏమో, ఎవరికి తెలుసు? ఏ నదిలోనో మునిగిపోయిందేమో? మీరంతా ఆమెను బాగా పీడించారు."

"ఊరికే వాగకు. స్వయంగా ఇటువంటి పనిచేసే స్వభావంకాదామెది."

"సదానంద్‌ను ఎందుకు అడగకూడదు."

"పోలీసులకు సమాచారం అందిందని తెలిస్తే, అతను ఎక్కడో దాగివుంటాడు."

"మేనేజర్! మీరు పొరపాటుపడుతున్నారు!"

"సరే వెళ్ళు. పెద్దమ్మను తీసుకురా."

ఫిరోజ్ వెళ్ళి శబనమ్‌తల్లిని తీసుకువచ్చాడు. ఆమె రాగానే మేనేజర్ సదానంద్‌నుకూడా పిలిచాడు. మేడమీద గదిలోకివెళ్ళి అక్కడమాటలు ఆరంభించారు. ఈ సన్నాహమంతా చూసి శబనమ్ పెళ్ళివిషయంలో తనతో మాట్లాడ

తారేమో అనుకున్నాడు సదానంద్. కాని శబనమ్ రాత్రి పారిపోయిందని చెప్పగానే అతను స్తబ్ధుడైపోయాడు. శబనమ్ తల్లి అడిగింది, "సదానంద్ ! ఆమె ఎక్కడవుందో చెప్పు."

"ప్రమాణంచేసి చెబుతున్నా. నాకేమీ తెలియదు."

ఫిరోజ్ సదానంద్‌తో అన్నాడు, "రాత్రి నేను ఆమెతో ఇల్లు చేరుకునేసరికి, గదిలో మేనేజరు, పెద్దమ్మ నజీర్ పెళ్ళివిషయంలో మాట్లాడుకుంటున్నారు. మేమిద్దరం గదిబయట చీకటిలో నుంచిని వాళ్ళమాటలు వింటున్నాం. నజీర్ అన్నాడు, "నేను మౌలవీగారిని కురానుచదివేందుకు రమ్మన్నాను. అమ్మ తీసుకువస్తూంటుంది."

"ఈమాటలు వినగానే శబనమ్ అంది, "నేను నాగది లోకి వెళ్తాను. నువ్వు లోపలికివెళ్ళి వివాహంవద్దనిచెప్పు."

"నేను గదిలోకివెళ్ళగానే పెద్దమ్మ అడిగింది, "శబనమ్ ఏది ?" అని; నేనన్నాను- తన పడకగదిలోకి వెళ్ళింది. కాని ఆమె యిష్టంలేనిదే పెళ్ళి జరగటానికి వీల్లేదు. లేకపోతే మనం చేతికి బేడీలు పడతాయి."

"నజీర్ నవ్వుతూ అన్నాడు, "ఆ బాధలు నేను పడ తాతే. ఆమె మైనరు. ఆమెతల్లి ఈ వివాహం చేయిస్తూంది."

"నేనన్నాను, "సరే. కాని, ఆమె తల్లివృత్తివిషయం న్యాయస్థానానికిపోయి చెప్పివేసిందంటే, వేలు ఖర్చుపెట్టినా బయటపడటంకష్టం. అటువంటతల్లికి తన సంతానంయొక్క వివాహం చెయ్యడానికి అధికారంలేదు."

ఈమాటలువిని పెద్దమ్మ 'ఈవిషయం సదానంద్ చెప్పాడా !' అంది.

'అవును. అతని అన్నగారు ఒక వకీలుదగ్గర గుమాస్తా. అతనే ఈవిషయం చెప్పివుండవచ్చు."

"అయితే అది అలాచెయ్యకముందే దాన్ని పీకపిసికి నరకానికి పంపిస్తాను. తల్లినే నిందలపాలుచేద్దామని తలిస్తే దానికి జరుగవలసినశాస్తి ఇదే.' అంటూలేచి శబనమ్‌గదిలోకి వెళ్ళింది. కాని మరుక్షణంలోనే కంగారుగా వచ్చి, 'అది దిలోలేదు.' అంది.

"ఇదివిని అందరూ లేచి నుంచున్నారు. ఆసమయానికి నజీర్‌తల్లి మాలవీని తీసుకువచ్చింది. వాళ్లుకూడా శబనమ్ పారిపోయినసంగతి విని కంగారుపడ్డారు. శబనమ్‌ను వెదకడం ఆరంభించాము. రాత్రి పన్నెండుగంటలయిపోయింది. నేను ఇంటికివెళ్ళి పండుకున్నాను. వీళ్లు మీయింటికివచ్చివుంటుం దని అనుకుంటున్నారు. పోలీసులకు రిపోర్టుకూడా యిచ్చారు."

ఇది వినగానే సదానంద్ నిశ్చేష్టుడయిపోయాడు. దాని మీదట శబనమ్‌తల్లి అడిగింది," సదానంద్ నీ ఉద్దేశ్యంలో ఎక్కడకు వెళ్లివుంటుందంటావు ?"

"ఏదయినా అఘాయిత్యంచేస్తుందేమోనని నాకు భయంగావుంది. నన్ను తీసుకుని పారిపొమ్మని అడిగింది. నేను అంగీకరించకపోయేసరికి ఆమెముఖం తెల్లబడిపోయింది. ఆమె నజీర్‌తో వివాహంచేసుకోకూడదని నిశ్చయించుకుంది. నేను నాఅన్నగారి సలహాతీసుకునేందుకుగాను. ఈ ఉదయం ఎనిమిది గంటలకు రమ్మని చెప్పాను. ఈ సమయానికి రావాలి."

అదేసమయానికి దేవానంద్ వచ్చాడు. రాగానే సదా నంద్‌తో అన్నాడు, "పోలీసులు నీకోసం వెదుకుతున్నారు.

ఇంటికికూడా వచ్చారు. ఇల్లుకూడా తనిఖీచేశారు. వాళ్ళు ఎవరో ఒకఅమ్మాయిని వెదుకుతున్నారు. నీకీవిషయం చెప్ప మని అమ్మ పంపించింది"

సదానంద్ అన్నాడు, "నువ్విక్కడే వుండు. ఒకవేళ పోలీసులు గనుక నన్ను పట్టుకుంటే నువ్వీవిషయం వెళ్ళి అన్నయ్యకు చెప్పు."

దేవానంద్ మేడదిగి క్రిందకువచ్చాడు. అదే సమయా నికి పోలీసులు అక్కడకువచ్చారు. పైకివెళ్ళి సదానంద్‌ను అరెస్టుచేసి స్టేషనుకు తీసుకువెళ్ళేందుకు సిద్ధమయ్యారు.

ఫిరోజ్ హెడ్‌కానిస్టేబిల్, పోలీసు సూపరిండెంటులతో "మేము ఆరాతీశాము. శబనమ్ ఇతనిదగ్గర లేనేలేదు." అని అన్నాడు.

"అది సరేలే. మేమువిచారణకోసం తీసుకువెళ్తున్నాం."

దేవానంద్ పరుగెత్తుకుని పరమానంద్ దగ్గరకు వెళ్లాడు. అతను జీవన్‌లాల్ సలహా తీసుకున్నాడు. పరమా నంద్ స్టేషన్‌కువెళ్ళి జామీనుమీద విడిపించుకురమ్మని చెప్పాడు జీవన్‌లాల్.

పరమానంద్ స్టేషన్‌కువచ్చేసరికే పోలీసులు సదా నంద్‌ను విడిచిపెట్టేశారు. అయినప్పటికి తనమీద గూఢచారు లను నియమించివుంటారని సదానంద్ అనుమానం.

మానవుడు

చతుర్ధభాగము

1

ప్రభ, రమలు కవలలు. చిన్నప్పటినుంచీ ఇద్దరూ ఒకే కంచంలో తిని ఒకేమంచంమీద పండుకున్నారు. ఆటపాటలలోకూడా ఇద్దరూ కలిసేవుంటారు. ప్రకృతి రూపురేఖలు కూడా ఒకేవిధంగా ప్రసాదించింది. రమకు కుడిబుగ్గమీద పుట్టుమచ్చ ఉంది. ప్రభకు లేదు. ఇద్దరినీ గుర్తుపట్టడం దానివల్లనే. ఇంటివాళ్ళకే ఈ భేదం తెలుసు. బయటవాళ్ళకు ఇద్దరినీ గుర్తుపట్టడం చాలా కష్టంగా ఉండేది.

నందలాల్ ఇల్లువిడిచివెళ్ళేసరికి వాళ్ళవయస్సు ఏడు సంవత్సరాలు. వాళ్ళు స్కూలుకు వెళుతున్నారు. కాని ఇంటిదగ్గర శ్రద్ధచూపనందున ఇంకా ఒకటవతరగతిలోనే ఉన్నారు.

నందలాల్ వెళ్ళిపోయినతరువాత ఇంటిపరిస్థితి బాగుపడటం ఆరంభించింది. లక్ష్మి పిల్లల చదువుమీద శ్రద్ధవహిస్తోంది. దానితో ప్రభ, రమలు చదువులో అభివృద్ధిలోకి వెళుతున్నారు. వాళ్ళు ఈ రెండు సంవత్సరాలలోనూ మూడు తరగతులు చదివివేశారు. ఈ రెండుమూడుసంవత్సరాలు వాళ్ళ జీవితాలలో సంఘర్షణతో కూడుకున్నవి. వయస్సు పెరిగిపోతున్నా చదువులో తక్కువలోనే ఉంటున్నారు. తమకంటే చిన్నఅమ్మాయిలతో క్లాసులోకూర్చోడానికి వాళ్ళకు సిగ్గుగా

ఉంటోంది. పైగా తక్కినపిల్లలుకూడా వాళ్ళను ఆక్షేపించ డానికి తగినట్టు వాళ్ల బట్టలుకూడా చాలా హీనంగా ఉండేవి. వాళ్ల పుస్తకాలుకూడా చిరిగిపోయిఉండేవి. పెన్సిళ్లో, కాపీ పుస్తకాలో సక్రమంగా ఉండేవికావు.

పిల్లలందరూ స్కూలు ఇంటర్వెల్‌లో చిరుతిళ్ళు కొనుక్కుతినేవారు. కాని వీళ్ళదగ్గర డబ్బులులేనందువల్ల వాళ్ళముఖాలు చూస్తూవుండేవారు.

ఎలాగో మూడుసంవత్సరాలుగడిచిపోయాయి. ఇప్పుడు తమ తోటిపిల్లలతో క్లాసులో కూర్చుంటున్నారు. ఇక సిగ్గు పడవసిలన విషయమేమీలేదు. బట్టలుకూడా తెల్లటివి కట్టు కుంటున్నారు. ఖరీదైనవిమాత్రం కాదు అయినప్పటికీ వాళ్ళకు జేబుఖర్చుకు ఇచ్చేటంత బాగాలేదు వాళ్ళయింటి ఆర్థికపరిస్థితి.

ఇదేవిధంగా మరికొంతకాలం గడిచిపోయింది. ఇప్పుడు వాళ్ళవయస్సు పదమూడేండ్లు. ఏడవతరగతి చదువుతున్నారు. ఇద్దరూ తమతల్లిలా, అందంగా తయారవుతున్నారు. కౌమారావస్థలోనికి ప్రవేశించడంవల్ల వాళ్ళమనస్సులలో భావాలు వికసిస్తున్నాయి. అయినప్పటికి వాళ్ళ అవసరాలకు కావలసిన సామగ్రి సమకూరడంలేదు.

ఒకరోజున ఒకఅమ్మాయికి వాళ్ళను ఏడిపించాలని బుద్ధిపుట్టింది. ఇద్దరూ స్కూల్లో ఒక్కపైసాకూడా ఖర్చు పెట్టకపోవడం ఆమె చూసింది. వాళ్ళతల్లిదండ్రులు చాలా బీదవాళ్ళనీ, అందుచేత వాళ్ళ ఖర్చుకు డబ్బుయివ్వలేకపోతు న్నారనీ, ఆమె అభిప్రాయం.

ఉదయం ఇంటర్వెల్. వాళ్ళ స్నేహితురాలు మోహిని స్కూలుబయట బండివాడిదగ్గర బఠానీలు కొనుక్కు తింటోంది. అక్కచెల్లెళ్లిద్దరూ కొంచెందూరంలో నుంచున్నారు. వాళ్ళను చూడగానే మోహిని పిలిచింది, "ప్రభా! ఏయ్ ప్రభా! బఠానీలు తింటావా ?"

"అక్కర్లేదు; నువ్వే తిను." అంది ప్రభ.

"ఏం, బాగుండవా ?"

దానిమీతట ఇద్దరూమాట్లాడలేదు. మోహిని ప్రభదగ్గరకువెళ్ళి చెయ్యిపట్టుకుని బండిదగ్గరకు లాక్కువచ్చింది. బండివాడితో "ఈమెకుకూడా ఒకగిద్దెడు ఇయ్యి." అంది.

ప్రభకు తినాలనిలేదు. కాని రమ వెనుకాలే చూస్తూ నుంచునివుంది. మోహిని అది చూసింది. విషయంగమనించి రమనుకూడా అక్కడకు తీసుకువచ్చింది. ముగ్గురూ బఠానీలు తింటున్నారు. తినేసినతరువాత మోహిని తనఖర్చు అణాఇచ్చి, "మీరిద్దరూ చెరిఅర్ధణావి తిన్నారు, త్వరగా డబ్బులిచ్చేసి రండి, గంటమ్రోగేలా వుంది." అంది.

రమ, ప్రభలముఖాలు తెల్లబడిపోయాయి. ముఖాల్లో ఎక్కడా రక్తపుచుక్కకూడా లేదు. పారిపోయే మోహినిని పిలిచింది ప్రభ "మోహినీ! మోహినీ!" కాని మోహిని పరుగుపరుగున స్కూలులోకి వెళ్ళిపోయింది.

బఠానీలవాడు ఆ అమ్మాయిమోసాన్ని అర్థంచేసుకున్నాడు. వాళ్ళిద్దరి కంగారూ చూశాడు. అతను అడిగాడు, "ఏం అమ్మాయిలూ, ఏమయ్యింది ?"

"ఏమీలేదు." ధైర్యం తెచ్చుకుని అంది రమ.

ఆమె కళ్ళవెంట నీళ్ళువచ్చాయి. కంఠం వణుకుతోంది. ఆమె అంది, మాదగ్గర డబ్బులులేవు. ఆమె మమ్మల్ని బల వంతాన తినమంది. ఆమె డబ్బులిచ్చేస్తుందనుకున్నాము."

"మరేం ఫరవాలేదులెండి. డబ్బులు రేపివ్వండి."

ఇద్దరూ భగవంతునికి అనేక ధన్యవాదాలర్పించారు.

"రేపు తప్పకుండా ఇస్తాము" అని ఇద్దరూ స్కూల్లోకి వెళ్ళిపోయారు. దారిలో రమ అడిగింది. "ఇప్పు డేమిచేద్దాం?"

"అమ్మదగ్గర నాలుగుడబ్బులు తీసుకుని ఇచ్చేద్దాం?" ప్రభ అంది.

"ఈ మోహిని చాలా మోసంచేసింది. నువ్వుకూడా వెంటనేవెళ్ళి తినడం ఆరంభించావు. మనం ఒకళ్ళకు పెట్ట లేనప్పుడు ఇతరులు పెట్టినదికూడా తినకూడదు!"

"సరే! ఇకముందు అలాగేచేద్దాం. ఇప్పుడు ఏంచేద్దాం? అమ్మను ఏమని అడిగేది?"

"నువ్వు బాధపడకు. నేను చూస్తానుగా."

విశ్రాంతిసమయం పూర్తికాగానే ఇద్దరూ క్లాసురూము లోకి వెళ్ళిపోయారు. మోహిని వాళ్ళిద్దరిమధ్యా కూర్చుంది. వాళ్ళ యిబ్బందిని తెలుచుకొని ఆమె మనస్సులో చాలా సంతోషిస్తోంది.

రమమనస్సులో ఏ విధంగా పగతీర్చుకోవాలా అని ఆలోచిస్తోంది. మోహిని చేసినమోసానికి బదులుతీర్చుకోవా లని ఆమె ఉద్దేశ్యం. ఆమె తనచెల్లెలు ప్రభకు ఏమీ తెలియు దనుకుంటోంది.

ఆక్షేపించేందుకని మోహిని ప్రభను అడిగింది, "ప్రభా! డబ్బులిచ్చేశావా?"

"ఆ." రమ జవాబుచెప్పింది.

"ఎక్కడనుంచి తెచ్చావు?"

"మా అమ్మదగ్గరనుంచి."

"మీ అమ్మ మీఖర్చుకు డబ్బుఇవ్వదని చెబుతుండే దానివి?"

"అవును. కాని నీలాంటి పిశాచాల మోసాలకులోనై అవస్థపడకుండా ఒకరూపాయి ఇచ్చివుంది."

"అయితే నేను పిశాచాన్నా?" మోహిని కోపంతో అడిగింది.

పంతులమ్మ ఇటుచూసింది. ఆమె మోహినిముఖం మీద కోపంచూసి కసురుకుంది, "మోహినీ, మాట్లాడకుండా కూర్చో. లేకపోతే బయటకు గెంటివేస్తాను."

మోహిని మాట్లాడకుండా కూర్చుంది. గంటఅయిపోయింది. పంతులమ్మ బయటకు వెళ్ళిపోయింది. తరువాత గంటలో రావలసిన పంతులమ్మ ఇంకా రాలేదు, రమ తన చొక్కాకుపెట్టుకున్న సూదితీసింది. తను స్కూలుకురాకముందు దేవానంద్ చొక్కాకు మాసికలువేసింది. తరువాత అది తన చొక్కాకు గ్రుచ్చివుంచింది. అది ఇప్పుడుబాగా పనికివచ్చింది. పంతులమ్మ బయటకువెళ్ళగానే ప్రక్కఅమ్మాయితో మాట్లాడుతూ మాట్లాడుతూ రమ సూదితో మోహినితొడలో పొడిచింది. మోహిని బాధతో లేచినుంచుంది. రమ తన

ప్రక్కనున్న అమ్మాయితో అంటోంది, "హిందీమాష్టారు రారు."

"ఏం?" ఆ అమ్మాయి అడిగింది.

"ఆమెకు తలపోటుగావుంది."

అప్పుడే క్లాసులోని పిల్లలందరిదృష్టి లేచినుంచున్న మోహినివైపు పోయింది. ఆమె హటాత్తుగా లేచినుంచోనడం వల్ల పుస్తకాలన్నీ నేలమీదపడిపోయాయి. కొన్ని డెస్కు క్రిందకు జారిపోయాయి.

మోహినికి బాధ కొంచెం తగ్గగానే రమవైపు చూసి అడిగింది, "నువ్వు చేసినపనేమిటి?"

"ఏంచేశాను?"

"బయటకు నడువు చెబుతాను."

"చెబుదువుగానిలే" అంది రమ. ఆ దేసమయానికి మరొక పంతులమ్మ వచ్చింది. అమ్మాయిలందరూ వాళ్ళవాళ్ళ స్థానాల్లో కూర్చున్నారు. మోహిని బెంచీక్రిందకుమారి పుస్తకాలు తీసుకుంటోంది. దానిమీదట పంతులమ్మ మందలిస్తూ అడిగింది, "మోహినీ! క్రిందకూర్చుని ఏంచేస్తున్నావు?"

ఆమె బయటకువచ్చి అంది, "మాష్టారూ! పుస్తకాలు పడిపోయాయి. తీసుకుంటున్నా."

మోహిని తిరిగి క్రిందకూర్చొని పుస్తకాలు తీసుకుంటోంది. అప్పుడు ఆమెపర్సు జేబులోంచి జారి బయటపడిపోయింది. అది చూసి రమ దాన్ని కాలితో మూడవబెంచీక్రిందకు తోసేసింది.

గంటఅయిన తరువాత మోహిని అంది, "ఒసే రమా! ఈవేళ బయటకు రా, నీ పనిచెబుతా."

"కాని నేనేం చేశాను?"

"నువ్వు నన్ను సూదితో గ్రుచ్చావు."

"నేను నీమీద ఒట్టువేసి చెబుతున్నా. నేను మాత్రం గ్రుచ్చలేదు."

"నామీద పెట్టేందుకు? మీయమ్మమీద పెట్టు."

"ఆ, అలాగే పెడుతున్నా."

దానిమీదటకూడా మోహినికి సంతోషంకలుగలేదు. ఆమె అంది, "బయటకు నడు చెబుతాను."

ప్రభ రమకంటే బలమైనది. ఆమె మోహినిజడపట్టుకుని గుంజి, "అలాగే, చూద్దాంలే." అంది.

వీళ్ళిద్దరున్నారనేవిషయం మోహినికి జ్ఞాపకంవచ్చింది. కొంచెం శాంతించింది. ఇంతలో ఆఖరిగంట పంతులమ్మ వచ్చింది. ఆమె పాఠంచెబుతోంది. కాని రమమాత్రం మనస్సులో ఆలోచిస్తోంది. సూదిగ్రుచ్చుటవల్ల మజాగానేవుంది. కాని అంతమాత్రంతో సరిపెట్టకూడదు. ఇంకొకటేదైనా చెయ్యవలసిందే.

దానిమీదట ఆమెకు మోహినిపర్సు జ్ఞాపకంవచ్చింది. అది మూడవబెంచీక్రింద కన్పించింది. అందులో ఇంకా డబ్బులుండి వుంటాయని తోచింది. క్రిందపడినప్పుడు బరువుగా వున్నట్టు శబ్దమయ్యింది. ఇటువంటి ఆలోచనలతో స్కూలు సమయం అయిపోయింది.

అమ్మాయిలందరూ లేచి వెళ్ళిపోతున్నారు. గంట కొట్టగానే మోహినికూడా వెళ్ళిపోయింది. ఇక్కడవుంటే అక్కచెల్లెళ్ళిద్దరూ తనపనిపడతారని బెదరిపోయింది.

అమ్మాయిలందరూ వెళ్ళిపోగానె రమ మూడవబెంచీ క్రింద దూరి పర్సు తెరచిచూచింది. అందులో ఒక అయిదు రూపాయలనోటు, కొద్దిగా చిల్లర వున్నాయి. రమ అయిదు రూపాయలు, చిల్లర జేబులోవేసుకుని పర్సు కిటికీలోంచి దూరంగా విసిరివేసింది.

ప్రభకేమీ అర్థంకాలేదు. "రమా ఏమిటి?" అనడిగింది.

"ఏమీలేదు. నడువు ?" అంది.

ఇద్దరూ స్కూలునుంచి బయటకువచ్చి ఇంటికి వెళ్ళిపోయారు. మరునాడు ఇంటినుంచి స్కూలుకు వెళుతుంటే ప్రభ అడిగింది, "బండివాడిడబ్బులు అడిగితీసుకున్నావా ?"

"నాదగ్గర వున్నాయిలే అన్నయ్యదగ్గర అడిగి తీసుకున్నా."

"ఎంత తీసుకున్నావు ?"

"పదణాలు. మనిద్దరికీ ఒకవారంరోజులు వస్తాయని ఇచ్చాడు." ప్రభమనస్సులోని చింత దూరమయిపోయింది. బండివాడు ఇంటర్వెల్‌కు కొంచెం ముందుగా వస్తాడు.

ఇద్దరూ క్లాసులోకవెళ్ళి కూర్చోగానే మోహినికూడా వచ్చి కూర్చుంది. రమ మోహినిని పిలిచింది, "మోహినీ! ఇలారా. మాదగ్గర కూర్చోవా ?"

మోహినిముఖంలో చింత, శోకం నిండివున్నాయి. ఆమె వచ్చి అంది, "నిన్న నా డబ్బుపోయింది."

"డబ్బే!" ఆమె విచారం ప్రకటిస్తూ అంది.

"నిన్న ఇంటర్వెల్ తరువాత పర్సుతీసి డబ్బులు బండి వాడికి ఇచ్చాను. తరువాత దొడ్డికి వెళ్ళాను. అక్కడే పడిపోయి నట్టుంది. ప్యూను పర్సువెదికి ఇచ్చాడు. కాని డబ్బుమాత్రం లేదు."

"ఎంతవుండాలి?"

"అయిదురూపాయలనోటు, కొన్ని అణాలూను,"

"అంత ఎందుకు తెచ్చావు?"

"అదే పెద్దపంతులమ్మగారుకూడా అడిగారు. నేను ఊరికినే తెచ్చాను. ఇప్పుడేం చెయ్యను?"

"అంత డబ్బుండికూడా నువ్వు మాడబ్బులు ఇవ్వ లేదంటే నమ్మలేకుండావున్నాను."

మోహిని సిగ్గుతో మౌనంగా కూర్చుంది. ఈ వేళ మోహిని రమ, ప్రభలతో కూడా లేదు. ఇంటర్వెల్‌లో రమ, ప్రభ లిద్దరూ బండివాడిదగ్గరకు వెళ్ళి నిన్నటి డబ్బులు ఇచ్చి వేసి బఠానీలు తింటానికి కూర్చున్నారు. అదే సమయానికి మోహిని అటు వచ్చింది. రమ పిలిచింది. "మోహినీ! ఇవేళ బఠానీలు తినవా?"

"నా డబ్బుపోయింది."

"రద్దు. మేము కొనిపెడతాం. నీకుమల్లే కాదు." మోహిని సిగ్గుతో అక్కడనుంచి వెళ్ళిపోదామని చూస్తోంది. కాని రమ ఆమెచెయ్యిపట్టుకుని లాక్కువచ్చింది. తనప్రక్కన కూర్చోబెట్టుకుంది. బండివాడితో రమ అంది, "ఈ మోహినికూడా [illegible]"

ప్రభకు సందేహంవచ్చింది. ఈవేళ రమ విచ్చలవిడిగా ఖర్చుపెడుతోంది. అందుచేత మోహిని వెళ్ళిపోయినతరువాత అడిగింది. "నువ్వు నిన్న కిటికీనుంచి విసిరింది, పర్సుకదూ?"

"ప్రభా! మాట్లాడకు. దాని తెలివితేటలకు ప్రాయశ్చిత్తం అదే. నిన్న ఆమెపుస్తకాలు పడిపోయినప్పుడు పర్సు కూడా పడిపోయింది. ఆ పర్సుతీసుకోవడం మర్చిపోయింది."

"కాని ఇది దొంగతనంకదా?"

"మోసకత్తెను మోసగించడం దొంగతనంకాదు."

"అమ్మకు తెలిస్తే బాదుతుంది."

"ఎలా తెలుస్తుంది? నువ్వు చెప్పకు."

"మనస్సులో భయంగా వుంది"

"ఇందులో భయపడవలసిందేముంది? చూడు! మోహిని మనకు చాలా దగాచేసింది. బండివాడు నిన్ననే గనుక డబ్బులిమ్మనికూర్చుంటే మనపనిఏంకాను. అతనుకుంచి వాడుకాబట్టి దయచూపించాడు. కాని మోహినిమాత్రం తను చేసినపనికి విచారించలేదు."

ప్రభమనస్సు చాలా మంచిది. అయినప్పటికి ఇద్దరూ చాలాస్నేహంగా ఒకరిమీద ఒకరికి విరోధభావంలేకుండా వుంటుంటారు. రమమనస్సు చాలా చంచలమైనది. ప్రభ ఆమెచెప్పింది వింటుండేది.

ఈ సాధారణమైన సంఘటనయొక్క పరిణామం చాలా తీవ్రంగారూపొందింది. అయిదురూపాయల పదణాలుఖర్చయ్యే సరికి ఇద్దరికీ బజార్లో మిఠాయి మొదలైన మంచి మంచి పదార్థాలుతినడం అలవాటైపోయింది. ఉన్నరూపాయలన్నీ

ఖర్చయిపోయాయిరా! కాని అలవాటుచేసుకున్నతరువాత మానడం కష్టంగావుంటుంది. జీవితం డబ్బులులేకుండా చాల నీరసంగా వుంటోంది.

ప్రభ తన అలవాటును మర్చిపోయి మామూలుగా వుంటోంది. కాని రమస్వభావానికి అలాజెయ్యడం సాధ్యం కాలేదు. పరిణామస్వరూపంగా ముందు అమ్మదగ్గరవి, పరమానంద్ దగ్గరవి, తరువాత పొరుగింటివాళ్ళదగ్గర డబ్బులు దొంగిలించడం ఆరంభించింది.

పొరుగిండ్లకు వెళ్ళినప్పుడు ఎక్కడైనా అణా బేడా పడివుంటే ఎత్తుకొచ్చేసేది, రమ. ఒకరోజున రామాలాల్ తల్లిదగ్గర పావలా దొంగిలించుకొచ్చింది. ఈవిధంగా వచ్చిన డబ్బు దగ్గర నిలువనేనిలవదు. దొంగకు ఖర్చుపెట్టేయాలని వుంటుంది. వాస్తవానికి డబ్బును ఖర్చుపెట్టడంలోనే మజాగా వుంటుంది.

రామలాల్ ఇంటినుంచి రాగానే ఏంకొనాలా, అని ఆలోచిస్తోంది, రమ. ఆమె బజారుకువెళ్ళి ఏదైనాకొందామని ఆలోచిస్తోంది . ఆమెదృష్టి రోడ్డుప్రక్కనున్న ఒక ఫ్యాన్సీ కొట్టులోని హెయిర్ క్లిప్పులమీద పడింది. ఆమె ఆకొట్టు దగ్గరకు వెళ్ళి నుంచుంది. ఆడపిల్లలందరూ తమజుట్టు ముడి వేయటానికి క్లిప్పులు వాడుతుండేవారు. రమ, ప్రభల జుట్టు క్లాసులో అందరిపిల్లలకంటే బాగా పొడవుగావున్నా, వాళ్ళ దగ్గర క్లిప్పులులేవు.

"రమ దుకాణంవాడి నడిగింది, వీటి ఖరీదెంత ?" అని.

"నాలుగేసి అణాలు."

"రెండణాలవి లేవా?"

దుకాణంవాడు రమముఖం చూశాడు. తరువాత కొంచెం ఆలోచించి అన్నాడు, "నీదగ్గర రెండణాలే వున్నాయా? సరే ఇది తీసుకువెళ్ళి తక్కినడబ్బులు రేపు యివ్వు."

"లేదు. నాదగ్గర పావలావుంది. కాని నాకు రెండు కావాలి."

"కాని ఇది ఒక్కటే పెట్టుకుంటారే?"

"అయినా సరే, నాకు రెండుకావాలి."

"అయితే రెండే తీసుకువెళ్ళండి. పావలా తరువాత ఇవ్వావొచ్చు."

"అక్కర్లేదు. చిన్నవి చూపించు. నేను అరువు తీసుకోను.

"సరే, పావలాకే ఈరెండూ తీసుకువెళ్ళండి."

"ముందు ఎక్కువ చెప్పావేం? బాగా వడుక్కుందా మనుకున్నావా?"

"లేదమ్మాయ్! వడుక్కోవాలనుకోలేదు,అం. ఇక వడుక్కుంటా. నీకేమికావలసినాసరే పావలాఇచ్చి అన్నీతీసుకుపో."

"నిజమేనా?" రమ ఆశ్చర్యంతో అడిగింది.

"అవును. ఈ షోకేస్‌లోవున్నవన్నీ పట్టుకుపో. పావలా ఇవ్వు సరిపోతుంది."

"అందరికీ అలానే ఇస్తుంటావా?"

"లేదమ్మా! ఇది నీ ఒక్కదానికే."

"ఏం?"

"జవాబుకావాలా ?"

"అవును."

"అయితే ఇదితీసుకువెళ్ళి ఇంటిదగ్గర ముఖంచూసుకో. నీ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది," అని కొట్టువాడు ఒక చిన్న అద్దం తీసియిచ్చాడు."

"ఇదికూడా ఆ పావలాక్రిందనేనా ?"

"అవును." కొట్టువాడు అన్నాడు, "దానితోపాటు ఇస్తున్నాను." అలాఅని ఒకకవరులో అద్దము, రెండుక్లిప్పులు ఒక దువ్వెన, ఒక స్నోసీసా వేసి ఆమెచేతిలో పెట్టాడు.

రమ ఆ బండిల్ తీసుకొని పావలాతీసి ఇవ్వబోయింది. కాని కొట్టువాడు తీసుకోలేదు. "పావలా ముందే ఇచ్చేశా వమ్మాయ్ !" అన్నాడు.

"లేదే !"

కొట్టువాడు నవ్వుతూ అన్నాడు, "ఓ అందాలరాణీ ! నువ్వు పావలా ముందే యిచ్చివేశావు. నువ్వు మర్చిపోయావు. వెళ్లు, ఇంకా బేరాలు వస్తున్నాయి."

రమ ఆ బండిల్ పట్టుకుని ఇంటికి వెళ్ళిపోయింది. కొట్టు వాడు ఏమిటి యిలా యిచ్చాడని ఆమెకు కొంచం హైరా నుగావుంది. పావలా తనచేతిలోనే వుంది. సామానుకూడా తనచేతిలోనే వుంది. అదెలా సాధ్యమవుతుంది ? ఆమె మన స్సులో దుకాణంవాడి మూర్ఖత్వానికి నవ్వుకుంది.

2

రమమనస్సును ఏదో అజ్ఞాతభయం ఆవరించింది. అందుచేత కొట్టువాడు ఇచ్చినసామానంతా దాచిపుంచింది. తల్లికి చూపించడానికి వీలులేదు. ఏదో తప్పుచేసినట్టుగా మనస్సు బాధపడుతోంది. అయినప్పటికీ ఆమె ఆవస్తువులను తిరిగి యిచ్చివెయ్యలేదు.

ఆ సంఘటన జరిగిన చాలారోజులతరువాతమాట. అదే బజారునుంచి వెళుతుంటే దుకాణంవాడు పిలిచాడు. తనపేరతనికి ఎలాతెలుసునా అని రమకు ఆశ్చర్యంవేసింది. అతను "రమాదేవి !"అని పిలిచాడు.

రమ అటుతిరిగి చూడగానే అతనడిగాడు, "ఈమధ్య ఏమీ తీసుకునేందుకు రావడంలేదేం?"

"నువ్వు ఇదివరకు వస్తువులకు ఖరీదు తీసుకోలేదు. మరి మళ్ళ వచ్చేదెలా ?"

"అయితే వాటిఖరీదు ఇచ్చివెయ్యి."

"ప్రస్తుతం నాదగ్గరలేదు."

"పోనీ. గోళ్లరంగు మంచిదవచ్చింది. తీసుకుంటావా"

"వద్దు. నాకక్కర్లేదు." ఇదివరకు తీసుకున్నసామానే తను దాచిపెట్టవలసివచ్చింది. ఆవిషయం జ్ఞాపకంవచ్చింది.

"అసలు వచ్చిచూడు. ఆ గోళ్లకు వేస్తాను. చాలా అందంగావుంటాయి." అందం అనేమాట వినగానే రమమనస్సులో లోభం మొదలయింది. ఆమె అడిగింది, "ఖరీదెంత?"

"[illegible]"

"నువ్వు అబద్ధమాడుతున్నావు. రెండుపైసలకు రంగు ఎలా వస్తుంది."

"నీలాంటి అమ్మాయిలకు నా కొట్టువద్ద..."

"ఏం, నాలో ఏముంది ?"

"నేనిచ్చిన అద్దంలో ముఖంచూసుకోలేదా నువ్వు ?"

రమ చాటున తన ముఖం అద్దంలో చూసుకుంది. కాని అందులోని అర్థం ఆమెకు తెలియలేదు. దానిమీదట కొట్టువాడన్నాడు, "అయితే ముఖం అందంగా అగుపించలేదా నీకు ?"

కొట్టువాడు తనని ప్రశంశించుతున్నట్లనిపించింది రమకు. అట్లా అనిపించడం అదే మొదటిసారి. అందుచేత ఆమె ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడిపోయింది. కొట్టువాడు రంగుసీసా మూతతీసి బ్రష్‌తో ఆమెగోళ్ళకు రంగువెయ్యడం ఆరంభించాడు. ఒకదానితరువాత ఒకటిగా అయిదువ్రేళ్ళకూ రంగు వేసేశాడు. గోళ్ళు రంగుతో ఎఱ్ఱగా ప్రకాశించడంచూసి చాలా ఆనందించింది రమా. ఆమెఆనందాన్ని చూసి సీసాను ఒక కాగితంలోకట్టి రమచేతిలోపెట్టి, "తీసుకువెళ్ళు. దీని ఖరీదుకూడా ఇదివరకటివాటితోనే చెల్లిద్దువుగాని."

"రమ చేత్తో సీసాపట్టుకుని విస్మయంతో అతనిముఖం చూస్తూ వుండిపోయింది. తరువాత బయలుదేరింది.

"కొట్టు జాగ్రత్తగా చూస్తూవుండు." అని నౌకరుతో చెప్పి కొట్టువాడు బయటకువచ్చి రమవెంట బయలుదేరాడు. రమ తమసందులోనికి వెళ్తూంటే అతడన్నాడు, "ఇంకొక నంచివస్తువు వుంది. మాయింటికివచ్చినట్లయితే ఇస్తాను."

రమ నిలబడిపోయింది అతనితో వెళ్ళడమా లేదా అని మనస్సులో ఆలోచిస్తోంది కొంచెం ఆలోచించి అంది ?

"నేనిక్కడ నుంచుంటాను, వెళ్ళి తీసుకురా."

"అబ్బే, ఈ నడిబజార్లో ఇవ్వడం బాగుండదు. భయపడకు. ఇక్కడేగా మా యిల్లు."

రమ అతనితోపాటు వెళ్ళేందుకు తిరిగిందో లేదో ఒక బలమైన యువకుడు వచ్చి దారికి అడ్డంగా నుంచున్నాడు. రమ గుర్తించింది. అతను తమ ప్రక్కఇంటివారి అబ్బాయి సుందర్. పరమానంద్ మిత్రుడు. అతనిలా నుంచోవడంలో భావం రమకు అర్థంకాలేదు.

సుందర్ దుకాణంవాడిని ఒక పోటు పొడిచాడు. దుకాణంవాడికి తలతిరిగింది. అదే సమయానికి మరొకతను, దుకాణంవాడి మిత్రుడేమో, వచ్చి సుందర్ తో కలియబడ్డాడు. అతను సుందర్ మెడ పట్టుకున్నాడు. కాని సుందర్ అతననుకున్నదానికంటె బలవంతుడు. అతను ఒక్క ఊపులో పట్టు విడిపించుకున్నాడు. ఈసారికొట్టువాడు సుందర్ని పొడవటానికి సిద్ధపడ్డాడు. కాని సుందర్ ఇద్దరినీకూడా కొట్టివెయ్యగలడు. అతను దుకాణంవాడి మిత్రుడి ముఖంమీద ఒక గుద్దు గుద్దాడు. దానితో ముఖంతిరిగి క్రిందపడ్డాడు. ఈసారి వాళ్ళిద్దరూ లేచి ఉమ్మడిగా సుందర్ మీద విరుచుకుపడ్డారు. సుందర్ ఒక్కడయినా వాళ్ళను బాగా బాదుతున్నాడు.

ఇంతలో చుట్టుప్రక్కల జనం అందరూ ప్రోగవడం మొదలెట్టారు. ఇదిచూచి కొట్టువాడు అక్కడనుంచి జారుకోవడం మంచిదనుకున్నాడు. అతను పారిపోయాడు. అతను

పారిపోవడం చూచి అతని మిత్రుడుకూడా పారిపోయాడు. అప్పటికి జనం బాగా ప్రోగయ్యారు. సుందర్ ఆజనాన్ని లెక్కచెయ్యకుండా, "నడురమా! నిన్ను ఇంటిదగ్గర విడిచి పెట్టివస్తాను." అన్నాడు.

అదిచూసి ప్రజలేమనుకున్నారో చెప్పడం కష్టం. కాని సుందర్ వెళ్ళిపోయినతరువాత అందరూ అతన్ని పొగడటం మొదలెట్టారు.

జనంనుంచి దూరంగావెళ్ళగానే సుందర్ రమనడి గాడు, "ఏది, ఆ రంగేది ?"

"అది నేనే అవతల పారవేశాను."

"ఇలారా." అని ఒకపైపుదగ్గరకు తీసుకువెళ్ళి "చేతులు కడిగివేసుకో. అమ్మ చూస్తే బాదుతుంది." అన్నాడు.

చేతులనున్న రంగుకడిగించివేసి సుందర్ రమను వాళ్ళ ఇంటివైపు తీసుకువెళ్ళాడు. ఇంటిలోకివెళ్ళేముందు సుందర్ రమతో అన్నాడు, "రమా! ఇక ఆబజార్లోకి ఎప్పుడూ వెళ్ళొద్దు. పరమానంద్ నామిత్రుడు. నువ్వు అతనిచెల్లెలివి. ఇక ఎప్పుడైనా నువ్వా కొట్టువాడితో మాట్లాడటంచూశా నంటే కాళ్ళువిరగగొట్టేస్తాను. జాగ్రత్త."

సుందర్ ఆ బజార్లోనుంచివెళ్తుంటే అతనికి రమ కనిపిం చింది. కొట్టువాడు ఆమెగోళ్ళకు రంగువేస్తున్నాడు. తనకి పర మానంద్ యింటిపరిస్థితి బాగా తెలుసు. అతనిచెల్లెలు గోళ్ళకు రంగుకొనగలదని అతను ఊహించలేదుకూడాను. అయితే జరుగుతున్నదేమిటి? అతను కొంచెందూరంలో నుంచుని చూస్తున్నాడు. దుకాణంవాడి కళ్ళుమిటకరించడం చూసి అతి

నికి సందేహంవచ్చింది. అతనుఅలాగే నుంచుని పరీక్షగా వాళ్ళను చూస్తున్నాడు. కొట్టువాడు రమవెనుకాలనే వెళ్ళటం చూచి తనుకూడా వెంటబడ్డాడు. సందు దగ్గరకు వెళ్ళిన తరువాత దుకాణంవాడు రమను మరొక సందులోకి రమ్మంటు న్నాడు. రమ సందేహంతో నిలబడి వుండిపోయింది. వెంటనే సుందర్ వచ్చి వాళ్ళ వెనుక నుంచున్నాడు. వాళ్ళిద్దరూ వెనక్కు తిరగగానే సుందర్ ఎదురయ్యాడు. కొట్టువాడు అతణ్ణి తప్పుకోమన్నాడో లేదో ఒక్కగ్రుద్దుగుద్దాడు. ముందు ఎవరు యుద్ధం ఆరంభిస్తే వారికేజయం దక్కుతుందని సుందర్ విస్వాసం. అందుచేత తనే ముందు కయ్యానికి దిగాడు.

రమ స్థిమితంగా ఇల్లుచేరుకుంది. కొట్టువాడి అభిప్రాయం ఆమెకు కొద్దిగా అర్థమయ్యింది. ఆమెప్రయత్నంతో తన మనస్సులోని విషయాలు దాచివుంచింది. కాని ప్రభకు మాత్రం విషయాలన్నీ తెలిశాయి. ఆమె ప్రభతో ఆ కొట్టు వాడిచ్చిన వస్తువులన్నిటిని గూర్చి చెప్పింది. రాత్రి ఇద్దరూ మంచంమీద పడుకున్నప్పుడు ఆరోజు జరిగిన సంఘటనకూడా చెప్పింది. ప్రభ అంది "అతనిదగ్గర వస్తువులు తీసుకోవద్దని నేను చెప్పనేచెప్పానుగా."

"కాని ఇలా జరుగుతుందని నాకేం తెలుసు ? అందు వల్ల ఎటువంటి హాని కలుగుతుందో నేను ఊహించలేక పోయాను. కాని నేను రెండవసారి అతనికొట్టుదగ్గరకు వెళ్ళ కుండా వుండవలసింది."

"కాని నువ్వు అతనిఇంటికి వెళ్ళేందుకుకూడా సిద్ధపడ్డావుగా?"

"నా కతని ఇంటికి వెళ్ళాలనిలేదు. కాని ఏదో మంచి వస్తువు ఇస్తాననగనే నాలో ఆశపుట్టివుంది, అంతే! అతని పన్నాగంలో చిక్కుకుపోయాను? సుందర్ పరుసగా గుద్దులు వెయ్యగానే ఇద్దరూ పారిపోయారు."

"సుందర్ చాలా మంచివాడు."

"అవును. తాను పరమానంద్ మిత్రుణ్ణని చెప్పాడు. మళ్లీ ఎప్పుడైనా అటువస్తే కాళ్ళు విరగ్గొడతా నన్నాడు."

అప్పటినుంచి వారిద్దరూ, సుందర్ గురించి తరుచుగా చెప్పుకుంటున్నారు. రమ, ప్రభలు స్కూలుకుగాని, బజారుని గాని వెళ్ళినప్పుడల్లా సుందర్ తమను వెంబడిస్తున్నట్టు అనిపించేది. దానివల్ల కుఱ్ఱకారు తమని అల్లరిచేయరని వాళ్ళకు నిశ్చింతగావుండేది.

రాత్రులు నిద్రపోయేముందు ప్రతిరోజూ సుందర్ని గురించి చెప్పుకునేవారు. అక్కచెల్లెళ్ళిద్దరూ సుందర్ని ప్రశంసించేవారు. సుందర్ బలమైనవాడు, వీరుడు, అందమైనవాడు అని పొగుడుతుండేవారు.

రమ ఇప్పుడుకూడా ప్రక్కవాళ్ళ ఇంటికి వెళ్ళి వాళ్ళకు కావలసిన సామానులు బజారునుంచి తెచ్చిపెడుతోంది. ఈ విధంగా ఆమెకు ఇతరులుపనులు చేసిపెట్టడంవల్ల అందులో డబ్బులు మిగుల్చుకోటానికి అవకాశంచిక్కుతోంది. ప్రభ రమను అటువంటిపనులు మానెయ్యమని చెబుతుండేది. కాని రమ కది అలవాటయిపోయింది.

ఒకరోజున రమ సుందర్ ఇంటికి వెళ్ళింది. సుందర్ తల్లి ఆమెకు ఒకరూపాయి ఇచ్చి రామలాల్ కొట్లోకి వెళ్ళి అర్ధరూపాయి పంచదార తెమ్మంది.

రమ రూపాయితీసుకుని పంచదార తెచ్చేందుకుబయలు దేరింది. ఆమె అలా వెళ్ళగానే సుందర్ వచ్చాడు. తల్లి అంది, "సుందర్! ఎక్కడకు వెళ్ళావు. రమను పంచదారకు పంపాను చూడు!"

"అయితేనేం? ఇప్పుడే తీసుకువస్తుంది."

"అబ్బాయ్! అది మంచిదికాదు. డబ్బులు మిగుల్చు కుంటుంది."

"పనిచేస్తోందిగా, తీసుకున్నా బాధలేదు. నువ్వు దాని చేత ఊరికే పనిచేయించుకుందామనుకుంటూనేం?"

సుందర్ రమపక్షంవహించటం చూసి తల్లి ఆశ్చర్యపోయింది. సుందర్ తల్లిముఖంమీద విస్మయంచూసి అన్నాడు, "అమ్మా! రమ నాస్నేహితుడు సదానంద్ చెల్లెలు. అతను ఈ వాడలోని వారికందరికీ కథలు, పాటలు చెప్పి ఆనందపరుస్తాడు. అతనిచెల్లెళ్ళు వాడలోనివాళ్ళందరికీ పనులు చేస్తుంటారు. కానీ ఎవరూ వాళ్ళకేమీ ఇవ్వరు. అటువంటప్పుడు వాళ్ళేమిచేస్తారు? పావలా, బేడ ఎక్కడ కనిపించినా ఎత్తుకుపోతారు. నేననుకోవడం వాళ్ళు చేస్తున్నది సబబే."

తల్లికి ఈ మీమాంస అర్థంకాలేదు. ఆమె అంది, "రామలాల్ దుకాణందగ్గరకు వెళ్ళు. అర్ధరూపాయి పట్టుకురా."

"అబ్బ ఆగవే! ఈవేళ రెండుగంటలు ఫుట్‌బాల్ ఆడి వచ్చాను. వళ్ళంతా హూణాం అయిపోయింది. మధ్యలో ఒకణా తీసుకుందనుకో, ముంచుకుపోయేదేముంది?"

"అయితే నువ్విలా అంటున్నావని మీనాన్నతో చెబుతాలే!"

"చెప్పు. అమ్మ ఈఅమ్మాయిలచేతడూరికినేపనిచేయించు కుంటోందని నేనుకూడా చెబుతాలే."

ఇదివరకు సుందర్, పరమానంద్‌లిద్దరూ సహాధ్యాయులు. ఆరోజుల్లో తను పుస్తకాలవీ ఇచ్చి పరమానంద్‌కు సహాయం చేసేవాడు. పరమానంద్ రాష్ట్రంలో ప్రథముడుగా వచ్చినప్పటికీ కాలేజీలో చదువలేకపోయాడు. కాని సుందర్ థర్డుక్లాసులో పాసయినప్పటికీ కాలేజీలో చేరాడు. ఫుట్‌బాల్ ప్లేయరుకావడంవల్ల కాలేజీలో అతనంటే మంచి పేరువుంది. అతనిప్పుడు డి. ఎ. వి. కాలేజీలో థర్డ్ఇయర్ చదువుతున్నాడు.

ఇవేళ క్రిస్టియన్ కాలేజీ టీముకు తమటీముకు మ్యాచ్ వుంది. ఆటసమయమంతా అయిపోయింది కాని ఎవ్వరు గోల్ చెయ్యలేదు. అందుచేత అదనంగా పదిహేనునిమిషాలు సమయంఇచ్చారు. ఈ పదిహేను నిమిషాలలోనూ క్రిస్టియన్‌కాలేజీ వాడొకతను ఫౌల్‌చేశాడు. అందుచేత ఇవతలపక్షంలోని సుందర్‌ను కిక్ చెయ్యమన్నారు. ఆటఅయిపోవడానికి రెండు నిమిషాలు మాత్రమే సమయంవుంది. ఆట ఎవ్వరూ గెలవరనుకున్నాడు సుందర్. ఒక్కటే ఉపాయంవుంది. గట్టిగా

బాల్ ను గోల్ లోకి తన్నడమే. అతను కిక్ చేశాడు. బంతి తిన్నగాపోయి గోల్ కట్టకుతగిలి గోల్ లోపడింది.

ఫౌల్ గోల్ నుంచి చాలాదూరంలో అవటంవల్ల గోల్ అవుతుందని ఎవ్వరూ అనుకోలేదు.

సుందర్ చేసిన గోల్ తమకాలేజీకి విజయాన్ని సాధించి పెట్టింది. సుందర్ ను కాలేజీవిద్యార్థులు, ప్రొఫెసర్లు బాగా మెచ్చుకున్నారు. విద్యార్థులతన్ని ఎత్తుకుని గ్రౌండుచుట్టూ త్రిప్పివేశారు.

ఇక ఇంటికిరాగానే తల్లి రమమీద ఫిర్యాదుచేసింది. ఆరోజు లభించిన విజయంముందు ఒక అణాదొంగిలించబడటం అతనికి ఏమీ విశేషమనిపించలేదు. కాని తనతల్లికి నచ్చచెప్పడమెలా? అతనితల్లి ఫుట్ బాల్ మ్యాచ్ ఎప్పుడూ ఆడనూలేదు, చూడనూలేదు. సుందర్ అద్దంలో ముఖం చూసుకుంటున్నాడు. ఇంతలో నేరమ పంచదార తీసుకువచ్చింది. రమ పంచదారపొట్లం, ఎనిమిదణాలు సుందర్ తల్లి చేతికిచ్చింది. సుందర్ తల్లి పంచదారపొట్లం చేతితో బరువుచూచి, "ఎంతది తెచ్చావు" అనడిగింది:

"అర్థరూపాయిది."

"ఇది తక్కువలా వుందే."

"అంతే ఇచ్చాడు."

"ఎక్కడనుంచి తెచ్చావు?"

"రామలాల్ దుకాణందగ్గర."

"సుందర్! కాస్త ఈ అమ్మాయి వెంట వెళ్ళు. నాకు అర్థరూపాయి ఇచ్చాడు. శేషం పావు రావాలి."

"రమా! ఇది తక్కువలావుంది. సుందర్! నువ్వు వెళ్ళు. అమ్మాయికయితే అణాయో బేడో విడిచిపెట్టగలను. కాని రామలాల్‌ను మాత్రం విడిచిపెట్టడానికి వీల్లేదు;"

అద్దంలో తనముఖం చూసుకుంటూవున్న సుందర్ ఇటుతిరిగి తనతల్లివైపు రమనుచూశాడు. తల్లిముఖం కోపంతో ఎఱ్ఱగావుంది. అతనికొక ఆలోచనతట్టింది. అతనన్నాడు, "సరే నన్నా! వెళ్తాను. నడువు రమా! ఇవేళ రామలాల్‌తో దెబ్బలాటపెట్టుకోవాలి."

సుందర్ తల్లిచేతుల్లోంచి పంచదారపొట్లం తీసుకుని; రమతోపాటు బయలుదేరాడు. ఇల్లుదాటగానే, "సుందర్ అన్నయ్యా! నువ్వు వెళ్ళి స్వయంగా అడుగు. నేనిక్కడే నుంచుంటాను." సుందర్ ఆమెముఖంలోకి చూస్తూ, "నిజం చెప్పు ఎంతది తెచ్చావు?" అన్నాడు.

రమ అంది, "ఆరణాలది. బేడ నాదగ్గరవుంది." అని బొడ్లోతీసి సుందర్‌కి ఇవ్వబోయింది. సుందర్ అన్నాడు, "అది నీ దగ్గరే వుంచుకో. ఇక్కడే నుంచో. పారిపోవద్దు. నే నిప్పుడే వస్తాను."

సుందర్ రామలాల్ దుకాణందగ్గరకు వెళ్ళి, "రామలాల్! ఈ పొట్లంలో మరొక రెండణాల పంచదార ఎక్కువ వెయ్యి."

రామలాల్ రెండణాల పంచదార తూచి. పొట్లంలో పోసి మళ్ళీ కట్టిఇచ్చాడు. సుందర్ సందులోకి వచ్చేసరికి రమ ఇంకా గోడకానుకుని నుంచునివుంది. ఆమె పారిపోయివుంటుం దనుకున్నాడు. ఆమె అక్కడే నుంచోవడంచూసి ఆశ్చర్య

పోయాడు. అతనన్నాడు, "ఎనిమిదణాలది కట్టించుకు వచ్చాను."

రమ అంది, "అయితే ఈ రెండణాలు తీసుకో."

"వద్దు, నువ్వు వుంచుకో. నిజం చెప్పినందుకు బహుమతిగా ఈ రెండణాలుకూడా వుంచుకో."

రమ తీసుకోవడంలేదు. ఆమె మనస్సులో చాల సిగ్గు పడుతోంది. ఆమె తలవంచుకుని, "సుందర్ అన్నయ్యా! నేను బేడదొంగిలించాను. క్షమించు." అంది.

"ఊరుకో పిచ్చిదానా. పరమానంద్, సదానంద్ నామిత్రులు. నువ్వు వాళ్ళచెల్లెలివి. ఈ బేడకూడా తీసుకో. కాని మరొక్క విషయం. నువ్వు దొంగతనం మానేసినట్టయితే రోజూ నీకు బేడఇస్తూ వుంటాను, సరే ఇక వెళ్ళు."

దీనివల్ల రమకు చాలా సిగ్గువేసింది. మళ్ళీ ఎప్పుడూ సుందర్ ఇంటికి వెళ్ళలేదు. దానితోపాటు ఆమె దొంగతనం కూడా మానేసింది. అదేసమయంలో సదానంద్ తల్లికి రోజూ రెండురూపాయలు తన సంపాదననుంచి ఇవ్వడం ఆరంభించాడు. లక్ష్మి అందులోనుంచి పిల్లలకు రోజూ వాళ్ళ ఖర్చుకు యిస్తోంది.

పరమానంద వెళ్ళినరోజున సుందర్ కూడా వచ్చాడు. పెళ్ళిసమయంలో రమ ఒకమూల నుంచోడం చూశాడు. సుందర్ దగ్గరేవున్నాడు. అతను రమవంక చూశాడు. ఇద్దరి చూపులూ కలియగానే సుందర్ నవ్వాడు. రమముఖం సిగ్గుతో ఎఱ్ఱబడిపోయింది. సుందర్ ఆమె సిగ్గును దూరంచేస్తూ

దుకుగాను అడిగాడు "రమా ! ఈమధ్య మాయింటికి అసలు రావడంలేదేం ?"

రమ మాట్లాడలేదు. దానిమీదట సుందర్ అడిగాడు, "ఇప్పుడు ఆపని చెయ్యడంలేదుకదా ?"

"లేదు." రమ నెమ్మదిగా అంది.

"అయితే నీ బహుమానం చాలా పెరిగివుంటుంది."

"ఏమిటి బహుమానాలంటున్నావ్ సుందర్?—"సదానంద్ బుట్టతో లడ్డులు తెస్తూ అన్నాడు. అటునుంచి వెళ్తూ సుందర్ మాటలు విన్నాడు.

"ముందు లడ్డులుపెట్టు. తరువాత బహుమానాలమాట మాట్లాడదాం"

3

సుందర్ బి.ఏ.పరీక్షలు వ్రాశాడు. పరీక్షలంత బాగా వ్రాయలేదు. అందుచేత ఇకముందు చదవడం అనవసరమనుకున్నాడు. పెళ్ళిచేసుకుని ఉద్యోగంచూసుకుని జీవితంలో స్థిరపడిపోవాలని నిశ్చయించుకున్నాడు.

పరీక్షాఫలితాలు తెలిశాయి. అతను థర్డుక్లాసులో పాసయ్యాడు. యూనివర్సిటీ కార్యాలయంనుంచి పరీక్షాఫలితాలు చూసుకుని, మనస్సులో ఊహాసౌధాలు నిర్మించుకుంటూ వస్తున్నాడు. ఇంతలో సందులోకి సదానంద్ ప్రవేశించిడంచూశాడు. సుందర్ వెనుకనుంచి పిలిచాడు, "సదానంద్ !"

సదానంద్ ఆగాడు. సుందర్, పెద్దపెద్ద అంగలువేసు కుంటూ తనవైపురావడంచూసి "ఏమిటి సంగతి?" అనడిగాడు.

"ఒక ముఖ్యమైనవిషయం. పైకి నడువు. పెద్దమ్మ దగ్గర చెబుతాను."

"అయితే రా."

ఇద్దరూ ఇంటిపైకి వెళ్ళారు. అమ్మ రొట్టెలుకాల్చి వంటింట్లోంచి బయటకువచ్చింది. ఆమె వాళ్ళిద్దరినీ చూసి అంది, "రా సుందర్! ఈవేళ నీకు విందుచేస్తాను. కూర్చో. "ఒసే రమా!" ఆమె రమను పిలిచింది. రమ ప్రభతో వంటింట్లో సామానుసర్దుతోంది.

"కొంచెం బెల్లంపట్టుకురా." అని పిలిచింది.

"అమ్మా! సంగతేమిటి?" చాపమీదకూర్చుంటూ సదానంద్ అడిగాడు.

"కూర్చో." అంది. సుందర్ని కూర్చోమనడం, బెల్లం తెమ్మనడం చూసి పిల్లలందరూ చుట్టూమూగారు. ఈమధ్య స్కూలుకు వేసంగిశెలవులిచ్చారు. అందుచేత పిల్లలందరూ ఇంటిదగ్గరే వున్నారు. సుందర్కూడా సదానంద్ప్రక్కనే కూర్చుంటూ, "తీసుకురా పెద్దమ్మా! వెయ్యి." అంటూ జేబులోనుంచి రుమాలుతీసి వడిలో పరచుకున్నాడు.

కుండలోనుంచి బెల్లపుఅచ్చుతీసి పట్టుకువచ్చింది, రమ. లక్ష్మి బెల్లంముక్కవిరిచి సుందర్నోట్లో వేసింది. సుందర్ కొంచెం కొరుక్కునితింటూ, తక్కినది రుమాలులోచుట్టి జేబులో పెట్టుకున్నాడు. "పెద్దమ్మా! ధన్యవాదాలు. పుత్ర

పౌత్రులతో, ధనధాన్యాలతో వర్ధిల్లమని ఆశీర్వదించు పెద్దమ్మా!"

సదానంద్ ఇంకా ఆశ్చర్యంతో చూస్తున్నాడు. అతని కేమీ అర్థంకాలేదు. అందుచేత తల్లిని అడిగాడు, "అమ్మా! విషయమేమిటో నాతోకూడా చెప్పమ్మా!"

దేవానంద్ ఈసారి దగ్గరకువచ్చి అన్నాడు, "అన్నయ్యా! నేను చెబుతాను. సుందర్ అన్నయ్య బి. ఏ. ప్యాసయ్యాడు."

సుందర్ ప్యాసయినవిషయం తల్లికి చెప్పింది దేవానందే. అందుచేతనే అతన్నిచూడగానే లక్ష్మి బెల్లంపెట్టింది.

"ఎక్కడివాడవురా నువ్వు? ప్యాసవటానికి ఇంకా అయిదువందలమంది అయ్యారు. వాళ్ళందరికీ యిలా బెల్లం ఎందుకుపెట్టలేదు?"

"నేను ఈబెల్లం మరొకందుకు తీసుకున్నాను."

అందరూ సుందర్ వైపు చూస్తున్నారు. సుందర్ అన్నాడు, "పెద్దమ్మా! నేను నా పెళ్ళివిషయంలో నీతో సంప్రతించాలని వచ్చాను. నువ్వు నామనస్సులోని విషయం తెలుసుకుని నాకు బెల్లంపెట్టావేమో అనుకుంటున్నాను."

సుందర్ మౌనంగా కూరుకున్నాడు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. లక్ష్మిమాత్రమే అడిగింది "సంబంధం ఎక్కడ నిశ్చయమయ్యింది?"

"పెద్దమ్మా! అదే చెబుదామనివచ్చాను. కాని వీళ్ళందరూ చుట్టూమూగి నన్ను చెప్పనివ్వకుండా చేశారు."

సదానంద్ అందరినీ వెళ్ళిపొమ్మన్నాడు. పిల్లలు వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళిపోవడంచూసి సుందర్ అన్నాడు, "పెద్దమ్మా! ఈ బెల్లం నా పెళ్ళిసంబంధం నిశ్చయించే సందర్భంలోనే తిన్నాను. నేను సదానంద్ ఎదుట నిన్ను రమను నాకిచ్చి పెళ్ళిచెయ్యమని అడగటానికి వచ్చాను."

ఈ ప్రసంగంవిని లక్ష్మి, సదానంద్ ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్లు ఏమాటా చెప్పలేకపోయారు. సుందర్ తన మాటలయొక్క పరిణామం వాళ్ళముఖాల్లో చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. సదానంద్ నోరుతెరచి అన్నాడు, "సుందర్! మీ తల్లిదండ్రులు చాలా ధనవంతులు. మీరు క్షత్రియులు. మేము బ్రాహ్మణులం. మీ తల్లిదండ్రులు అంగీకరించరు."

"పెద్దమ్మా! నేను క్షత్రియులు, బ్రాహ్మణులు అనే భేదాన్ని ఒప్పుకోను. ఇక మీఉద్దేశ్యం ఏమిటో చెప్పండి. అందుచేతనే ముందుగా మిమ్మల్ని అడిగేందుకు వచ్చాను. మీకు ఏదయినా అభ్యంతరంవుంటే చెప్పండి నేను మాట్లాడను. లేకపోతే మా తల్లిదండ్రులను ఒప్పించుకునే ప్రయత్నం చేస్తాను."

"ముందు మీ తల్లిదండ్రులను ఒప్పించు. తరువాత మేము ఒప్పుకుంటాము."

"వాళ్లెందుకు ఒప్పుకోరు? నాకు ఇరువయొక్కసంవత్సరాలు వచ్చాయి. నాపెళ్ళి చేసుకునేందుకు స్వతంత్రుణ్ణి. పైగా నేను ఆటగాడినీ, నాకు అపజయమనేదే తెలియదు."

సదానంద్ నిర్ణయంచేసివేశాడ : అతనన్నాడు, "నీ తల్లిదండ్రులు ఒప్పుకున్నట్టయితే ఏమీ బాధలేదు. ఒకవేళ వాళ్ళు ఒప్పుకోకపోతేమట్టుకు మానిర్ణయం మార్చుకునే అధికారం మాకుంది."

సుందర్ వెళ్ళిపోయాడు. లక్ష్మి, సదానంద్ ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. వారు ఈ నూతనసంఘటన యొక్క పరిణామం ఏవిధంగా జరుగుతుందా అని ఆలోచిస్తున్నారు. లక్ష్మి అంది, "సదానంద్! నాకీవిషయం కొంచెం తికమకగా కనబడుతోంది. ఈ రమ ఇల్లిల్లూ తిరుగుతూంటుంది. కొంపతీసి ఏదైనా ముప్పుతెచ్చేపని చేసిందేమోనని భయంగా వుంది."

సదానంద్‌కు చమేలీవిషయం జ్ఞాపకంవచ్చింది. ఈ సందేహం మనస్సులో కలుగగానే అతను గంభీరఆలోచనలో మునిగిపోయాడు. చాలాసేపటివరకు ఇద్దరూ ఈవిషయంమీద ఆలోచిస్తూ వుండిపోయారు. సదానంద్ ఆఖరుకు తనఅంగీకారాన్ని తెలుపుతూ అన్నాడు, "అమ్మా! తప్పుపని చేసిందో, చెయ్యలేదో. కాని సుందర్ వివాహమాడతానని కోరుతున్నప్పుడు మనం అంగీకరింపవలసిందే. తరువాత వదినతోచెప్పి రమ యిష్టాయిష్టాలుకూడా తెలుసుకోమను."

"కాని బ్రాహ్మణుల అమ్మాయిని క్షత్రియులకిస్తే లోకులేమంటారు?"

"అమ్మా! వధూవరులకు ఇష్టమయినప్పుడు లోకులేమనుకుంటారోనని ఆలోచించడం వ్యర్థం. నీ సందేహామే నిజమై

నట్లైతే నువ్వీ వివాహానికి ఒప్పుకోకపోయినా కుటుంబానికి చెడ్డపేరువస్తుంది."

"ఒకవేళ సుందర్ తల్లి ఒప్పుకోకపోతేః ఆవిడ చాలా చెడ్డది. అమ్మాయి జీవితం నరకతుల్యంచేసివేస్తుంది."

"ఆమె ఒప్పుకోదు. కమల వివాహసమయంలో ఆమె చాలా చాడీలుచెప్పి చాలా గల్లంతుచేసింది. ఆమె జీవన్ లాల్ భార్యను కలుసుకుని ఆమెదగ్గర మనకుటుంబాన్ని దుమ్మెత్తిపోసింది."

"అవును. నీకెలా తెలిసింది."

"వివాహానంతరం జీవన్‌లాల్ ఆమె చెప్పినచాడీలన్నీ వకీలుగారికి చెప్పారు. ఆయన ఆమెమాటలు నమ్మనందుకు చాలా సంతోషించాడు. జీవన్‌లాల్ కమలను చాలా ప్రశంసిస్తున్నాడు."

"పరమానంద్ నడగకుండా నువ్వు సుందర్‌కు మాట ఇచ్చేశావు!"

"ఎందుచేతనంటే సుందర్ గురించి అన్నయ్యకు బాగా తెలుసు. అతనుసమర్థుడు, శీలవంతుడు, కుటుంబాన్ని వృద్ధిలోకితేగలడన్న సంగతి అన్నయ్యకు బాగా తెలుసు."

పరమానంద్ రాగానే రమ ప్రస్తావన వచ్చింది. సదా సంపద చెప్పినట్టుగానే పరమానంద్ ఉద్దేశ్యంకూడా తేలింది. అతను తల్లితో అన్నాడు, "అమ్మా! వ్యతిరేకించకు. ఈ సంబంధం చాలా బాగుంటుంది?"

రమ, ప్రభలు రాత్రి పండుకునేముందు ఇదేవిషయం మాట్లాడుకున్నారు. వేసవికాలంకావడంవల్ల అందరూ మేడ

పైనే పండుకుంటున్నారు. రమ, ప్రభలు ఒకేపక్కమీద పండుకుంటున్నారు. ఈవేళ ప్రభ ఏదో ఆలోచిస్తూ రమవైపు వీపు పెట్టి పండుకుంది. రమ చాలాసేపు చూసింది. కాని ప్రభ తనవైపు తిరగటంలేదు. కొంచెంసేపుండి రమ మీదుగా దాటి ఆమెముఖంవైపు తిరిగి పడుకుంది. ప్రభ ఏడుస్తోంది. రమ అడిగింది. "ఏమిటి ప్రభా! అన్నయ్య తిట్టాడా?"

ప్రభ మాట్లాడటంలేదు. దానిమీదట రమ ఆమెను కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటూ అడిగింది, "ప్రభా! ఏం జరిగింది? చెప్పు. నాకూ బాధగావుంది"

"నీదగ్గర దాపరికాలుకూడా వున్నాయని నాకు తెలియదు. నువ్వు నీపెళ్ళి నిశ్చయించుకున్నట్టుకూడా నాతో చెప్పలేదు!"

"నేను పెళ్లినిశ్చయించుకున్నానని ఎవరు చెప్పారు?"

"నువ్వు, సుందర్ ముందే పెళ్లినిశ్చయించుకున్నారని, లేకపోతే సుందర్ అంత హఠాత్తుగావచ్చి నిస్సంశయంగా ఎందుకు అడుగుతాడని-అమ్మ అంటోంది."

"ప్రభా! అది నిజంకాదు. నాకు, అతనికి మధ్య ఎప్పుడూ మాటలు జరుగలేదు. అన్నయ్యపెళ్ళికి ఏవో ఒకటి రెండు మాటలు మాట్లాడుకున్నాము. అప్పుడుకూడా అతన్ని "అన్నయ్యా! అనే పిలిచాను. ఆతరువాత మరెప్పుడూ అతనితో మాట్లాడలేదు."

"ఎలా నమ్మేది? అతను నన్నుకూడా ఎరుగును. పైగా నేను నీకంటె బాగుంటాను. అయినప్పటికీ నిన్నే పెళ్లాడతా నంటున్నాడు."

"ఆవిషయం అతన్నే
వరకూ నేను పెళ్లాడనని నీకు

"కాని నేను సుందర్

"అయితే చేసుకో, నేను

"అయితే నువ్వతన్ని ప్రేమిం

"నువ్వు ప్రేమిస్తున్నావా? ఎంది

"అతను చాలా మంచివాడు."

"నీ కొక్కదానికేనా? మనిద్దరికీనా?"

"నాకు చాలా మంచివాడనిపిస్తాడు."

"నాకూ అలానే అనిపిస్తాడు. కాని అతనికి మనిద్దరిలో ఎవరునచ్చుతారనేది అసలుప్రశ్న. ప్రభా! నేను నీకోసం ప్రయత్నిస్తాను."

"చాల్లే. అంతా పాడుచేసి, ఇంకేమి ప్రయత్నం చేస్తావు?"

"చూద్దువుగాని ఏంచేస్తానో?"

ఇద్దరూ ఒకరినొకరు కౌగలించుకుని పండుకున్నారు.

4

చాలారోజులవరకూ గూఢచారులు సదానంద్ ని వెంబడిస్తూనేవున్నారు. కాని అతను తిరిగేచోట్లన్నీ తనిఖీచేసిన తరువాత శబనమ్ అతనిదగ్గరలేదని నిర్ణయానికొచ్చారు. నెమ్మదిగా శబనమ్ను వెదకడం మానివేశారు. శబనమ్తల్లి, ఫిరోజ్ ఆఖరుకు ధైర్యంతెచ్చుకున్నారు. శబనమ్తల్లికి తను చేసిన

డు

అప్పుడప్పుడు సదానంద్‌ని
ఎప్పుడో ఒకప్పుడు సదా
పెట్టుకుంటుందని ఆమె ఒక
ఆమె సదానంద్‌తో మంచి
ంతే తానువారిద్దరికలియకకు ఆటంకం

ల్లి ఫిరోజ్‌ను, ఒంటరిగా సదానంద్‌ను కలుసు
ంది. "సదానంద్! ఏమైనా జాడ తెలిసిందా!"
డుగుతుంది.

"లేదమ్మా!"

"నేను చేసినపనికి చాలా పశ్చాత్తాపపడుతున్నాను. అప్పుడు నాఖర్మఎలావుందోకాని, ఆమెఎంత చెప్పినావినలేదు."

"ఇప్పుడేం చేయగలం! నేను మీ అనుమతి లేకుండా ఆమెను చేసుకునేవాణ్ణికాదు. కాని మీకు నామీద నమ్మకం లేదు."

"నీమీద నమ్మకంవుంది. కాని శబనమ్‌మీద నమ్మకం పోయింది. ఆమె మైనారిటీదాటినతరువాత నా ఇష్టంలేకుం డానే వివాహంచేసుకుంటుందని, నాకు గట్టిగా అనిపిస్తోంది."

"అవును. ఆమెలో నాలుగుసంవత్సరాలవరకూ నాకోసం వుండగల్గే ధైర్యం, ఓపిక వుండి ఈ వృత్తి మానేసినట్లయితే నేనామెను తప్పకుండా పెళ్లాడవలసివుంటుంది. అంత తపస్సు చేసే వ్యక్తులమీద భగవంతునికికూడా దయకలుగుతుంది. ఇక నామాటేమిటి."

ఆమాట వినగానే శబనమ్‌తల్లి ఏడ్చింది. సుశోకన అటువంటి అవకాశంచూసుకుని సదానంద్ అన్నాడు," ఇక నువ్వీ వృత్తిమానేసి ఏదైనా మంచి గౌరవమైన వృత్తి చెయ్యరాదూ ?"

"కేవలం నలుగురైదుగురు వ్యక్తులతోనే నాకు సంబంధంవుంది. వాళ్ళదగ్గరకుతప్ప మరెవ్వరిదగ్గరకూ వెళ్ళను. నాపొట్ట గడచేది దానివల్లనే."

"కాని ఇది గౌరవమైనపనా?"

"నేనీపని గౌరవంగానే చేస్తున్నాను. మా మహమ్మదీయులలో ఒక్కరోజు మాత్రానికే వివాహానికి అంగీకారం వుంది. నేను మహమ్మదీయురాల్ని. నియమంగా ఒక్కరాత్రికి ఒక్కపురుషునితోనే వుంటాను. రాత్రి వివాహంచేసుకుని ఉదయం విడాకులిచ్చేస్తున్నట్టుగా భావిస్తాను. పగలంతా అవివాహితగానే వుండిపోతాను."

సదానంద్ నవ్వాడు. శబనమ్‌తల్లి అంది, "మామతంలో దాన్ని అంగీకరించారు. అందుచేత నేను చేసేపని గౌరవమైనదే అని నా ఉద్దేశ్యం,"

"అది మీమతంలో గౌరవమైనదే కావచ్చు. కాని ఆరోగ్యానికి, శీలానికి హానికారి."

"నేనలా అనుకోను. నాతో సంబంధంవున్నవాళ్ళందరూ గౌరవంగల పెద్దమనుష్యులు. వాళ్ళఆరోగ్యం నాఆరోగ్యంకూడా బాగానేవున్నాయి. నాకిక పిల్లలుకూడా పుట్టరు. అందుచేత శీలంవిషయంలో నాకిక ఎలావున్నా బాధలేదు."

ఆమెతర్కాన్ని సదానంద్ చాలా తప్పుగా భావించాడు. ఇటువంటి చెడ్డపనులకు మహమ్మదీయమతం సిద్ధాంతాల ఆధారం కల్పిస్తున్నందువల్ల, అతనిదృష్టిలో అది ఇంకా హీనమైపోయింది.

ఆఖరికి ఒకరోజున శబనమ్ బ్రతికేవున్నట్టుగా సదానంద్‌కు ప్రమాణం దొరికింది. అతను పంజాబీ పబ్లిక్ లైబ్రరీలో చదువుకుంటుంటే, రోజూ లైబ్రరీలో తనకుమల్లే చదువుకునే ఒకఅమ్మాయి అతనిదగ్గరకు వచ్చి కుర్చీలో కూర్చుంది. సదానంద్ చదువులో బాగా మునిగివున్నాడేమో అతడామెను చూడలేదు. కొంచెంసేపు ఆమె అలానే కూర్చుని తరువాత పలుకరించింది, "క్షమించండి. మీరేమి చదువుతున్నారో తెలుసుకోవచ్చా?"

సదానంద్ ఆమెకేసి చూశాడు. షుమారు యిరవై సంవత్సరాల యువతి తనవైపు నవ్వుతూ చూడటం చూశాడు. సదానంద్ కొంచెం ఆలోచించి అన్నాడు, "తెలుసుకుని మీరేంచేస్తారు?"

"మీరు అంత ఏకాగ్రతతో చదవడంచూసి, అదేదో చాలా మంచిపుస్తకం అనిపిస్తోంది. నేనుకూడా చదువుదామని."

"ఇది ఒక ఇటాలియన్‌యాత్రీకుడు, మార్కోపోలో, షాజహాన్‌దర్బారును వర్ణించిన అధ్యాయం."

"ఓ! మీకు చరిత్రఅంటే ఇష్టమా?"

"అవును."

"నేను మీతో మాట్లాడాలనివచ్చి ఈ కుర్చీలో కూర్చు న్నాను. కాని మీరు తలఎత్తనేలేదు."

"నాతో మాట్లాడాలనా? ఏంకావాలి మీకు?"

"నేను మీపేరు తెలుసుకోవాలి."

"పేరు తెలుసుకుని ఏంచేస్తారు?"

"అది తరువాత చెబుతాను. ముందు మీపేరు సదా నంద్ అవునో కాదో చెప్పండి."

సదానంద్ శ్రద్ధగా ఆమెను పరికించాడు. చాలా అందంగావుంది. రంగు కొంచెం నల్లగావున్నా రూపురేఖలు బాగున్నాయి.

సదానంద్, "అవును, నాపేరే." అన్నాడు.

"అయితే ఈఉత్తరం మీదే. దీన్ని ఇక్కడ చదువ కండి. ఇంటికిపోయి చదివి ఏమైనా జవాబువ్రాయవలసివుంటే వ్రాసి ఇదేపుస్తకంలో వందవపేజీలో పెట్టి దానిస్థానంలో వుంచండి, ఆ జాబు అందవలసినచోటుకు అందుతుంది."

"నేను మీపేరు తెలుసుకోవచ్చా?"

"ఏం, నాకుకూడా ఏదైనా వ్రాస్తారా?"

"ఉత్తరంవ్రాయననుకోండి. కాని నేను ఈ ఉత్తరం గూర్చి ఏమైనా వివరాలు తెలుసుకోవాలంటే ఎట్లాగ?"

"అదేమీ అవసరముండదు. మీరు జవాబివ్వదలచు కున్నట్టయితే, ఈ పుస్తకంలోపెట్టి వెళ్ళండి. సరే, ఇక నేవెళ్తాను. టైమయ్యింది."

ఈ ఉత్తరం శబనమ్‌దగ్గరనుంచి అయివుంటుందని సదానంద్ గటిగా అనుకున్నాడు. ఉత్తరం జేబులో పెట్టుకుని

పుస్తకంచదవటం ప్రారంభించాడు. కాని ఆ ఉత్తరం తెచ్చిన అమ్మాయి అతనికళ్ళముందు ప్రత్యక్షమవుతోంది. అతని మనస్సులో ఉత్తరం చదవాలనే ఆతురత ఎక్కువయిపోతోంది. అందుచేత అతను ఆ పుస్తకం యిచ్చివేసి ఇంటికి బయలుదేరాడు. అప్పుడు టైము అయిదుగంటలే అయింది. అక్టోబరునెలలో అయిదయినప్పటికీ ఇంకా చాలా ప్రొద్దు వుంటుంది. అందుచేత ఇంటికివెళ్ళకుండా దగ్గరలోవున్న పార్కుకు వెళ్ళి కూర్చుని ఉత్తరంతీసి చదవనారంభించాడు. అందులో ఇలా వ్రాసివుంది—

"మహాశయా ! నమస్కారాలు.

"మీకీ వుత్తరం ఈవిధంగా అందజేయటం మరోలా అనిపించవచ్చు. మీకు అందచేయడానికి నాకింకొక మార్గం అగుపించలేదు.

"మీ యింటిఅడ్రసు నాకు తెలియదు. మీదుకాణానికి వ్రాయడం నాకు యుక్తమనిపించలేదు. నా యడ్రసువ్రాయటానికికూడా వెరుస్తున్నాను. నాకు నావాళ్ళు ఎవ్వరిమీదా నమ్మకంలేదు.

"ఆరోజున మిమ్మల్ని కలుసుకొని ఇంటికి వెళ్ళేసరికి నాపెళ్ళికి సన్నాహాలు జరుగుతున్నాయి. అది చూడగానే వెనక్కుతిరిగి వచ్చి ఈ వుత్తరం వ్రాసినచోటకు చేరుకున్నాను.

"నాకిక్కడ అన్నివిధాలా సుఖంగావుంది, అయినప్పటికీ నామనస్సు బాగుండటంలేదు.

"మిమ్మల్ని పోలీసులుపట్టుకున్నట్టు, మీదగ్గర ఏమీ కన్పించకపోగా మిమ్మల్ని విడిచిపెట్టేసినట్టు నాకు తెలిసింది. నాతల్లి నావివాహం నాయిష్టానికి వ్యతిరేకంగా ఎక్కడైనా చేయగలదనేవిషయంకూడా నాకు తెలుసు. అందుచేత మైనారిటీ తీరేవరకూ నేను ఇలా రహస్యంగా వుందామనుకుంటున్నాను.

"నేనున్నచోట నాకన్నివిధాలా రక్షణవుంది, ఇకముందు రక్షవుంటుందికూడాను. అయినప్పటికి మీమీద నాకు ప్రేమవుంది. ఆ ప్రేమయే నన్ను నాలుగు సంవత్సరాల పరీక్షలో కృతార్థురాలిని చెయ్యగలదని నావిశ్వాసం.

"మీరెలావున్నదీ, గడువు తరువాత నన్ను వివాహమాడేదీ లేనిదీ తప్పకుండా తెలియపరుస్తారని నాఆశ."

ఈ ఉత్తరంచదివి సదానంద్ ఆశ్చర్యపోయాడు. అతనికి జవాబు వ్రాయలనేవుంది. కాని అతనిమనస్సులో రెండు ప్రశ్నలు తలెత్తాయి. ఒకటి తాను శబనమ్ అడ్రసు తెలుసుకునేదా లేదా? రెండు – ఈ విషయం శబనమ్ తల్లికి చెప్పటమా, చెప్పకపోవటామా–అని!

ఆ రాత్రే అతను ఉత్తరం వ్రాసేశాడు.

"ప్రియమైన శబనమ్! నీఉత్తరం చదవగానే చాలా సంతోషమయ్యింది. ఇక్కడ అందరూ నువ్వు ఆత్మహత్య చేసుకున్నావేమోనని అనుకుంటున్నారు. నేను అప్పుడప్పుడూ మీతల్లిని కలుసుకుంటున్నాను, ఆమె తనుచేసినపనికి పశ్చాత్తాపపడుతున్నట్టు కనబడుతోంది. కాని నేనావిషయం నిశ్చయంగా చెప్పలేను. నిన్ను కలుసుకోవాలని నాకు తీవ్రమైన

కోరికవుంది. కాని పరిస్థితులను దృష్టిలోవుంచుకుని చూసి నట్టయితే, నువ్వు ప్రస్తుతానికి దాగివుండటమే మంచిదని పిస్తోంది.

"ఇక నువ్వు అడిగినప్రశ్నకు సమాధానం - నేనింత వరకూ వివాహంచేసుకోలేదు. ఇప్పట్లో చేసుకోనుకూడాను. ఇక నీతో వివాహమంటావా? ఆ సమయంవచ్చేవరకూ నేనేమీ చెప్పలేను. నేను చేసుకునేఅమ్మాయి, మంచిది, శీలవతి, నమ్మదగినది అయ్యుండాలి. నాభార్య వంటచేయడం, బట్టలుకుట్టడం, ఇల్లు సరిదిద్దుకోవడం, పిల్లల్ని పెంచడం మొదలైన గృహకృత్యాలలో ప్రవీణురాలై వుండాలి. అన్నివిధాల ఆమె హిందూస్త్రీవలే వుండాలని నాఆశయం:"

మరునాడు సదానంద్ వుత్తరాన్ని నిశ్చితస్థానంలో పెట్టివచ్చాడు. మరునాడు సాయంకాలం చదివేందుకు అదే పుస్తకం తీసిచూసేసరికి ఉత్తరం అందులోలేదు. బహుశా ఉదయమే ఎవరైనావచ్చి వుత్తరం తీసుకువెళ్ళారేమో అనుకున్నాడు.

అతను లైబ్రేరియన్‌ని అడిగాడు, "ఏమండీ, ఇవేళ ఎవరైనా ఈ పుస్తకం తీసిచదివారా?"

"అవునండీ. ఉదయం ఒకఅమ్మాయి తీసుకుని ఒక గంట చదివింది." లైబ్రేరియన్ సదానంద్‌ని బాగా ఎరుగును. సదానంద్ కొన్నిసంవత్సరాలనుంచి ప్రతిరోజూ వచ్చి చదివే వాళ్ళలో ఒకడు. అతడు విషయమేమిటని అడిగాడు. సదానంద్, "ఏమీలేదండి. నేను పుస్తకంలో గుర్తుపెట్టాను. అది లేదు." అన్నాడు.

సదానంద్ ఉత్తరం వెళ్ళిపోయిందనుకున్నాడు. ఉత్తరానికి జవాబువస్తుందని అనుకున్నాడు. శబనమ్ జీవించివున్నదన్నసంగతి ఆమెతల్లికి చెప్పాలని నిశ్చయించుకున్నాడు, సదానంద్. దానివల్ల ఆమెకు ధైర్యంకలుగుతుంది. కాని శబనమ్‌జాడ తెలిసేవిషయాలేవీ చెప్పదలచుకోలేదు. అందుచేత శబనమ్‌ఉత్తరం ఫిరోజ్‌కిస్తూ అన్నాడు, "ఈ ఉత్తరం నిన్న పోస్టులోవచ్చింది. మీ పెద్దమ్మకు చూపించు. ఆమె జీవించివుందని తెలియగానే ఆవిడ సంతోషించవచ్చు."

ఆ ఉత్తరం పోలీసులకివ్వబడిందని తెలియగానే సదానంద్ చాలా ఆశ్చర్యపోయాడు. బహుశా శబనమ్‌తల్లి ఆ ఉత్తరం ఎలావచ్చిందని, ఎక్కడనుంచి వస్తుందని అడిగేందుకు తన దగ్గరకు వస్తుందనుకున్నాడు. శబనమ్‌తల్లి ముందు పశ్చాత్తాపపడటం ఇప్పుడు మళ్ళీ పోలీసులసహాయాన్ని కోరడం అతని కాశ్చర్యాన్ని కలిగించింది.

మరునాడు పోలీసులు అతన్ని కలుసుకునేందుకు దుకాణానికి వచ్చారు. సి. ఐ. డి. ఇనస్పెక్టరు శబనమ్-ఉత్తరాన్ని చూపెడుతూ 'దీన్ని గుర్తుపట్టగలరా' అన్నాడు.

"అవును, ఇది శబనమ్ వ్రాసినది నేనామె వ్రాతను గుర్తుపట్టగలను."

"ఇది ఎవరికి వ్రాసింది?"

"మొన్న నాకు పోస్టులో వచ్చింది. దీనిమీద ఎవరి పేరూ వ్రాసిలేదు. కాని ఉత్తరంలోని విషయాన్నిబట్టి నాకే అని చెప్పగలను."

"మీరు దీనికి జవాబులు వ్రాశారా?"

"లేదు. ఎక్కడకు వ్రాయాలో నాకు తెలియదు.

"మీకు తెలిసినట్టయితే ఏమిచేసివుండేవారు?

"తనరక్షణకోసం డిప్యూటీ కమీషనర్ గారిముందు హాజరుకమ్మనేవాణ్ణి. అక్కడకువెళ్ళి తనతల్లి లైసెన్సులేని ఒక వ్యభిచారిణి అని, తనచేతకూడా ఆ వృత్తిచేయించాలని చూస్తోందని, అందుచేత తనకు రక్షణకావాలని కోరుకోమని వ్రాసేవాణ్ణి."

పోలీసుఆఫీసరు సదానంద్ వంక చూస్తూవుండిపోయాడు. ఆయన కొంచెం ఆలోచించి అన్నాడు. "మీరు అమ్మాయి తల్లికి ఇంత వ్యతిరేకులైతే ఈ ఉత్తరం ఆమె కెందుకు ఇచ్చారు?"

"ఒకరోజున ఆమెతల్లి శబనమ్ ఆత్మహత్యచేసుకుందే మోనని ఏడుస్తోంది. అందుచేత ఈ ఉత్తరం ఆమెకివ్వటం నా కర్తవ్యమనుకున్నాను."

పోలీసు ఇన్‌స్పెక్టరుకు అవసరమైన విషయమేదీ దొరక లేదు. అతను వెళ్ళిపోయాడు. కాని సదానంద్ మీద మళ్ళీ సి.ఐ.డి. పోలీసులను నియోగించారు.

5

శబనమ్‌తల్లి ప్రవర్తనకుసదానంద్ చాలనిరాశ చెందాడు. పోలీసు ఇన్‌స్పెక్టరు వెళ్లిపోయినతరువాత సదానంద్ ఫిరోజ్‌ని ఒకమూలకు పిలిచి అన్నాడు, "మీ పెద్దమ్మ ఇలా చేసిందేమి టయ్యా? ఈ ఉత్తరం ఎక్కడినుంచి వచ్చిందో తెలుసుకుందా మని నేను ప్రయత్నించేద్దామనుకుంటున్నా.

కాని పోలీసులు ఈవిషయంలో కలుగచేసుకుంటూవుంటే నేనేమిచేసేది ?"

"సదానంద్ ! నిన్ను కలుసుకుని, ఆమె అడ్రసుకోసం ప్రయత్నంచెయ్యమని పెద్దమ్మతో చెప్పాను. ఉత్తరాన్నిబట్టి చూస్తే శబనమ్ నీజవాబుకోసం చూస్తూంటుందని తెలుస్తోంది. అందుచేత ఆమె నిన్ను కలుసుకునేందుకు తప్పకుండా ప్రయత్నంచేస్తుంది. కాని ఒక్కవిషయం నీకు తెలియదు. ఫకీరుద్దీన్ అంటే పెద్దమ్మకు చాలాగురి. అందుచేత అతనే ఉత్తరం పోలీసులకు అందజేసివుంటాడు."

"శబనమ్‌కు తనతల్లి నన్ను పోలీసులచేత పట్టించినట్టు తెలుసు. ఈ ఉత్తరం పోలీసులకు అందినట్టుగాకూడా ఆమెకు తెలుస్తుంది. దానిఫలితంగా ఆమె ఇక నాకెప్పుడూ జాబు వ్రాయదు. దానితో ఆమెజాడ తెలుసుకోనడం వీలుపడదు." ఫకీరుద్దీన్‌దగ్గర పనిచేయడం మానెయ్యాలని సదానంద్ నిశ్చయించుకున్నాడు. అతనికిప్పుడు అక్కడే పనిచెయ్యాల్సిన అవసరంలేదు. చాలాచోట్ల అతన్ని ఎరుగున్నవారున్నారు. అందుచేత మరొకచోట పనిదొరకడం సులువే. ఆరోజునే మరొకచోట పనికోసం వెతికేందుకు నిశ్చయించుకున్నాడు.

వార్తాపత్రికల్లో నకళ్ళువ్రాసేపనికి యోగ్యులైనవారిని తీసుకుంటారు. కాని జీతం తక్కువఇస్తారు. సదానంద్ అక్కడ పనికోసం ప్రయత్నించడం వ్యర్థమనుకున్నాడు. పైగా పత్రికల్లో పనిచేయడంవల్ల వ్రాతకూడా చెడిపోతుంది. ఎందుచేతనంటే ఎక్కువగంటలు పనిచేయాలి. కాని పుస్తకాలప్రెస్

బలో పనిచేయడం మంచిది. ఇనామిప్రెస్సు చాలా పెరు కెక్కింది. అందుచేత అక్కడికెళ్లేందుకు నిశ్చయించుకున్నాడు.

తాజ్ అండ్ కంపెనీవారికి తను చాలాపుస్తకాలు నకళ్ళు వ్రాసి ఇచ్చాడు. పైగా అతను రెండుమూడుసార్లు ఆ కంపెనీలో తాను నకళ్ళు వ్రాసి ఇచ్చిన కాపీలు కొన్నాడు. అందుచేత తాజ్ అండ్ కంపెనీ యజమాని నసీరుద్దీన్ దగ్గరకు వెళ్ళి అన్నాడు, "అయ్యా! నేనీ పుస్తకాల నకళ్ళు వ్రాసి నట్టుగా నాకొక సర్టిఫికెట్టు ఇవ్వండి."

"నసీరుద్దీన్ కొంచెం ఆలోచించి అన్నాడు, "నేనలా సర్టిఫికెట్టు ఇవ్వలేను. నేను ఫకీరుద్దీన్ కంపెనీలో వ్రాయిం చాను. ఆయన ఎక్కడ వ్రాయించాడో, ఎవరిచేత వ్రాయిం చాడో నాకేం తెలుసు?"

"కాని నేను వ్రాయటం మీరు చాలాసార్లు చూశారు కదండీ."

"నేనలా వ్రాసి ఇవ్వలేను. నువ్వు ఫకీరుద్దీన్ చేత ఎందుకు వ్రాయించకూడదు?"

తనకు సర్టిఫికెట్టు వ్రాసిఇవ్వడానికి ఆయనకు ఇష్టం లేదని సదానంద్ గ్రహించాడు. అందుచేత ఆవిషయాన్ని విడిచిపెట్టేశాడు. కాని తను వ్రాసిన పుస్తకంయొక్క స్క్రిప్టు ఆయనదగ్గరే వుంది. అందుచేత అడిగాడు, "సరేలెండి, నేను ఫకీరుద్దీన్ దగ్గర వ్రాయించుకుంటాను. కాని నేను మీకొక స్క్రిప్టుఇచ్చాను. దాని విషయంలోఏమి తేల్చారు?"

"పుస్తకం మా తమ్ముడికి నచ్చలేదు. అది ప్రచురిం చము."

"అయితే దయచేసి స్క్రిప్టు వాపసుచేసెయ్యండి."

"మరోకసారి రండి, ఎక్కడవుందో తమ్ముడికిమాత్రమే తెలుసు."

"ఎప్పుడు రమ్మంటారు ?"

"ఒక వారంరోజులతరువాతరండి. వెదికి వుంచుతాం."

సదానంద్‌కు షకీరుద్దీన్‌దగ్గర సర్టిఫికెట్టు తీసుకోవాలని లేదు. అందుచేత సర్టిఫికెట్లేమీ లేకుండానే "ఇనామీప్రెస్"కి చేరుకున్నాడు. అక్కడ తను తనపనితనం ట్రయిల్‌వ్రాసి చూపించాడు. దానిమీదట అతన్ని పనిలోపెట్టుకున్నారు. ప్రొఫెసర్ రామలాల్‌గారు వ్రాసిన వెయ్యిపేజీలపుస్తకాన్ని నకలువ్రాయమని సదానంద్‌కు అప్పగించారు. మరునాటి నుంచి సదానంద్ పనిచేయనారంభించాడు.

సదానంద్ ఇక్కడ పనిచేయడం ఆరంభించి ఒకనెల పైగా అయింది. ఒకరోజున జీతంతీసుకునేందుకని మేనేజరు దగ్గరకు వెళ్ళాడు. మేనేజరు ఒకపుస్తకంయొక్క 'ఫారము' ప్రూఫుచూస్తున్నాడు. సదానంద్‌దాన్ని చూడగానే ఆశ్చర్య పోయాడు. అది పుస్తకంయొక్క మొదటిఫారమే. దాని మొదటిపేజీమీద పుస్తకంపేరు వ్రాసివుంది. పుస్తకంపేరు "పరిస్తాన్‌యాత్ర" దానితో అతనికి తనపుస్తకం జ్ఞాపక మొచ్చింది. మొదటిపేజీమీద సంపాదకులు. రచయిత యొక్క పేరుకూడా ముద్రించివున్నాయి సంపాదకులు తాజ్ అండ్ కంపెనీవారు రచయిత కబీరుద్దీన్. అతను నసీరుద్దీన్‌గారి చిన్నతమ్ముడు. దాని[illegible] వాళ్ళు తన పుస్తకాన్ని దొంగిలించి తమది చేసు[illegible]నని సందేహం

వచ్చింది, మేనేజరుగారు ప్రూఫుచదివేసిన తరువాత ఒకసారి చూసియిస్తానని తీసుకున్నాడు. అతను పుస్తకంయొక్క పీఠిక చదివి, తక్కినపేజీలుకూడా ఒకసారి చూశాడు. ప్రతిఅక్షరం తన పుస్తకంలోనిదే. ప్రూఫు వాపసుచేస్తూ అతనన్నాడు, "దీని నకలు ఎవరు వ్రాస్తున్నారండి?"

"రామనాథ్."

"బాగా వ్రాయడంలేదండి."

"వాళ్ళు ఇచ్చేది పేజీకి పావలావుంటుంది."

"అయితేమాత్రం."

సదానంద్ తనజీతం తీసుకుని, నకళ్ళువ్రాసే పైగది లోకి వెళ్ళాడు. రామనాథ్ 'పరిస్తానుయాత్ర'యొక్క రెండవ ఫారము నకలువ్రాస్తున్నాడు సదానంద్ చూచాడు, స్క్రిప్టు కూడా తనదే. అది చూడగానే అతనికొక విషయంతట్టింది. అతను తనపని కట్టిపెట్టి మేనేజరుతో చెప్పి తిన్నగా జిల్లా కచేరి చేరుకున్నాడు. పరమానంద్‌ను వెదికి విషయమంతా చెప్పాడు. పరమానంద్ కుంవరుసేన్‌గారి అసిస్టెంటు వకీలు గారితో చెప్పి పుస్తకం అచ్చువేయిస్తున్నందుకు 'ఇంజక్షన్' యిప్పించేందుకు సబ్‌జడ్జీగారికోర్టులో అర్జీ దాఖలుచేశాడు.

సబ్‌జడ్జీగారు పుస్తకంఅచ్చుకాకుండా ముందే ఇంజక్షనుచేయించడం బావుండదన్నారు. పుస్తకం అచ్చువేయించినతరువాతైతే అపహరించినందుకు దావా చెయ్యొచ్చు నన్నారు.

దానిని [illegible] కుంవర్‌సేన్‌గారి అసిస్టెంటు ఠాకూర్‌దాస్ "అయ్యా! [illegible] పుస్తకంయొక్క స్క్రిప్టు నకలువ్రాసేవాని

దగ్గర వుంది. పుస్తకం అచ్చువేయించగానే దాన్ని కాల్చి వేస్తారు. అప్పుడు పుస్తకం వ్రాసినతను సదానంద్ అని నిరూపించడం చాలా కష్టమవుతుంది అందుచేత వెంటనే పుస్తకం ముద్రణ ఆపుచెయ్యమని ఆజ్ఞ వేసి, ఆ పుస్తకానికి సంబంధించిన వస్తువులన్నిటినీ వశపరచుకోవలసిందిగా పోలీసువారికి ఆజ్ఞ వేయడం చాలా అవసరమండీ." అన్నాడు.

ముద్రణ ఆపుచెయ్యడానికి, పోలీసులద్వారా ఆ పుస్తకానికి సంబంధించిన సామానులన్నీ వశపరచుకోటానికి ఆజ్ఞ అయ్యింది. ఒంటిగంటకల్లా పోలీసులనుతీసుకుని సదానంద్ 'ఇనామీ ప్రెస్'కి వచ్చాడు. ప్రెస్ మేనేజరు ముందు చాలా కోపగించాడు. కాని తరువాత విషయాన్నంతా తెలుసుకుని చాలా సంతోషించాడు. ఆయన సదానంద్‌ను అడిగాడు. "అయితే ఈపుస్తకం వ్రాసింది నువ్వేనా?"

"అవునండి."

"తాజ్ కంపెనీవారు చాలా చెడ్డవాళ్లే!"

"ఇప్పుడు విషయం కోర్టుకి వెళ్ళిందికదండీ. ఇక చూడాలి. వాళ్ళపని. మీరుమాత్రం నాకు సహాయం చెయ్యాలి."

ప్రెస్ వారు ఆజ్ఞప్రకారం ముద్రణఆపుచేసి స్క్రిప్టు, ముద్రించిన ఫారాలు పోలీసులకు అప్పగించారు. కాని తాజ్ కంపెనీవారివల్ల కష్టంవచ్చింది. ప్రెస్‌లో స్క్రిప్టుయొక్క కొన్నిఫారాలే వున్నాయి. తక్కినవి కంపెనీవారిదగ్గరనే వున్నాయి. పోలీసులు అక్కడకు వెళ్ళగానే వారు తమదగ్గర

ఏమీలేవని జవాబిచ్చారు. దానిమీదటఇన్‌స్పెక్టరు, "అయితే మీఇల్లు, కోట్టు తనిఖిచెయ్యవలసివుంటుంది." అన్నాడు.

దానితో నజీరుద్దీన్ చాలా కంగారుపడ్డాడు. వెంటనే స్క్రిప్టు, తక్కిన కాగితాలు తీసియిచ్చేశాడు.

మరునాడు కేసు కోర్టుకి వచ్చింది. తాజ్‌కంపెనీవారు ముందు ఏవో తప్పుడుమాటలుచెప్పి తప్పుకుందామనుకున్నారు. కేసు మరునాటికి వాయిదాపడింది.

కాని అదేమీ లాభంలేదని తెలుసుకుని నజీరుద్దీన్ కుంవరుసేన్‌గారిఇంటికి రాజీచేసుకునేందుకు వచ్చాడు. పది శాతం రాయల్టీఇచ్చేందుకు, పుస్తకంమీద సదానంద్‌పేరు పెట్టేందుకు, దావాఖర్చులు ఇచ్చేందుకు, తాజ్‌కంపెని ఒప్పుకుంది, దానితో విషయం ముగిసింది.

6

సుందరు, సదానంద్, అతని తల్లిని రమతో వివాహం చేసుకునేందుకు అనుమతి తీసుకుని ఇంటికిరాగానే తల్లితో "అమ్మా నేను పాసయ్యాను." అన్నాడు.

"చాలాసంతోషం. నీ చదువు పూర్తయ్యిందిగా."

"కేవలం ఆరుసంవత్సరాలతరువాత."

"ఎక్కడ ఆరేళ్ళు ? పదహారేళ్ళు చదివావు,"

"అదే అంటున్నానమ్మా. స్కూల్లో పదేళ్ళు చదివాను. అది పిల్లలందరూ చేసేపనే. ఇకపోతే ఇంటర్‌లో ఒక ఏడాది. బి. ఏలో ఒకఏడాది తప్పాను. కాని, అమ్మా! పగటి వేళ ఎన్నితప్పులుచేసినా రాత్రివేళ్యేసరికి మర్చిపోతాము.

ఇప్పుడు నేను పాసయ్యిపోయానుగా. నువ్వు పండుగ చెయ్య వలసిందే?"

"ఏ పేరుపెట్టి పండుగ చెయ్యను?"

"నా పెళ్ళిచేసి పండుగ చెయ్యి."

"ముందు సంపాదన నేర్చుకో."

"నేను ఉద్యోగానికి అప్లికేషను పెట్టనే పెట్టాను. ఒకటి రెండురోజుల్లో ఆఫీసర్లను కలుసుకుంటాను. ఒకసారి ఉద్యోగంలో ప్రవేశించానంటే ఇకచూడు. అందులో పైకిపోవడం చాలా సులువు."

"సుందర్! నువ్వు కబుర్లుచెప్పడంలో చాలా గొప్ప వాడివేలే. ఆమాత్రం శ్రద్ధ చదువులో చూపించినట్టయితే రెండేళ్ళక్రితమే చదువు పూర్తయ్యివుండేది."

"అమ్మా! ఈ రెండేళ్ళలోనూ నేర్చుకున్న విష యాలు, తక్కిన కుఱ్ఱాళ్ళు జీవితమంతా గడిపినా నేర్చుకో లేరు. నువ్వే చూద్దువుగానిగా, నౌకరీ ఎంత తొందరగా దొరు కుతుందో."

"సరే, ఉద్యోగం దొరకనియ్యి, పిల్లను వెదుకు తాను."

"ఎక్కడ వెదుకుతావు? ఈ వాడలో అయిదేసి అడ గుల అమ్మాయిలు చాలామంది వున్నారుగా. ఒకదాన్ని చేసెయ్యి."

"నీకు తగినవాళ్లు ఎవరున్నారు?"

"ఒకర్తె నాకు తెలుసు. పరమానంద్ చెల్లెలు రమ బాగావుండదా?"

"ఏమిటి రమా! అ దొంగదా ? దాన్ని చేసుకోటానికి వీల్లేదు,"

"ఏం?"

"వాళ్ళు బ్రాహ్మణులు. వాళ్ళమ్మ ఒప్పుకోదు."

"ఆమె ఒప్పుకుంటుంది."

"ఆమె ఒప్పుకున్నా నేను మాత్రం ఒప్పుకోను. నీ పెళ్ళాం ఒక దొంగదికావటానికి వీల్లేదు."

"అమ్మా! చిన్నప్పటిమాటలు మర్చిపోవాలి. ఇప్పుడామె చాలా మంచిది. ఆమె నాకు బాగా నచ్చింది."

"ఓ అలాగా ? ఆమె దొంగదేకాదు, ఇప్పుడు వ్యభిచారిణి అనికూడా తెలిసింది."

"అమ్మా! ఊరుకోవే, నీమాటలకేంకాని!"

"పరమానంద్ అక్కగారు, కమలని వకీలుగారు వుంచుకున్నారు. ఇప్పుడు రమ నిన్ను బుట్టలోవేసుకుంది,"

మూడునాలుగురోజుల తరువాత సుందర్‌ని వాళ్ళ తండ్రి ఆఫీసులో చీఫ్‌ఆఫీసర్‌ని కలుసుకోమని కబురుపంపించాడు. సుందర్ వెళ్ళి ధైర్యంగా ఆఫీసర్‌దగ్గర షేక్‌హాండ్ తీసుకున్నాడు. ఆఫీసర్ ఒక ఆంగ్లోఇండియన్. పేరు మిస్టర్ బ్రైస్టన్ ఆయన చదువుకునేరోజుల్లో ఒక పెద్ద ఫుట్‌బాల్ ప్లేయర్. అందుచేత సుందర్ రాగానే ఆయన, "నువ్వు ఫుట్‌బాల్ ఆడతావా ?" అని అడిగాడు.

"అవునండీ గత ఆరుసంవత్సరాలనుంచీ నేను మీ కాలేజీటీములో ఆడుతున్నాను. మేము చాలా టోర్నమెంట్సులో గెలిచాముకూడాను."

"అయితే నువ్వు మంచి ప్లేయరువన్నమాట ?"

సుందర్ తన కోటుబటన్సుతీసి, లోపల మెడల్స్‌తో నిండివున్న వాస్కెట్ చూపించాడు. ఆ మెడల్సు అన్నీ చూసి బైస్టన్ ఆశ్చర్యపోయాడు. ఆయన లేచి ఒకటిరెండు మెడల్సు చదివాడు, తరువాత తనసీటులో కూర్చుని అన్నాడు, "మిస్టర్ సుందర్‌లాల్! నేనూ ఫుట్‌బాల్‌ప్లేయర్‌నే ఒక మంచి ప్లేయర్ కావడం జీవితంలో సఫలత్వానికి సూచకం. నీకు ఉద్యోగంఇస్తాను. ప్రస్తుతానికి జూనియర్ గ్రేడ్‌లో వేస్తాను. కాని అఫీసుటెస్టువుంది. అందులో కూర్చుందువు గాని. నువ్వు అందులో పాసవుతావని నాకు గట్టినమ్మకం వుంది. వెంటనే నీకు ప్రమోషన్ వస్తుంది."

సుందర్ ధన్యవాదాలుచెప్పి బయటకువచ్చాడు. ఒక గంటలో ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. అది తీసుకుని అదేఆఫీసులో పనిచేసే తన తండ్రిదగ్గరకు వెళ్ళాడు. ఆయన పేరు చరణదాస్. అయన సూపరింటెండెంట్ ప్రస్తుతం నాలుగువందలయాభై రూపాయలుజీతం సుందర్ అప్పాయింట్ మెంట్ ఆర్డరు ఆయనకు చూపించగానే ఆయన చాలా సంతోషించి అన్నాడు, "నువ్వు పెళ్ళికావాలంటున్నావని మీయమ్మ చెప్పింది. ఇక ఆ ఏర్పాటుచేసివేస్తాను."

"కాని నాన్నా!" సుందర్ తన తండ్రిప్రక్కన కుర్చీలో కూర్చుంటూ అన్నాడు, "పరమానంద్ చెల్లెలు రమని చేసుకుంటానని కూడా చెప్పాను,"

"కాని వాళ్ళు బ్రాహ్మణులే:".

"అవునండి. మాలవాళ్ళుమాత్రం కాముగా?"

"కాని వాళ్ళు ఒప్పుకుంటారా?"

"నేను సదానంద్‌ని ఒప్పించాను. ఇంట్లో అతని మాటను ఎవ్వరూ కాదనరు."

"సదానంద్‌కి హిందూమతమంటే చాలా గట్టినమ్మకమే! మరి వర్ణాంతరవివాహానికి ఎలా అంగీకరించాడు?"

"నాన్నా! అతను ప్రభుత్వోద్యోగులను బ్రాహ్మణులుగానే భావిస్తాడు. విద్యనభ్యసించిన వారందరూ బ్రాహ్మణులేనని అతని ఉద్దేశ్యం."

"అలాగైతే ఫరవాలేదు. కానీ మీయమ్మ ఒప్పుకోదు. రమ దొంగఅనీ, శీలం మంచిదికాదనీ అంటోంది."

"నాన్నగారూ! పరమానంద్ అక్క కమలనుకూడా అట్లానే అనేది. జీవన్‌లాల్ భార్యను కలుసుకుని మరీ చెప్పి వచ్చింది. కాని ఈనాడు జీవన్‌లాల్ కమలను చాలా పొగుడుతున్నాడు."

"నువ్వు రమను దేవి అంటున్నావు అవునా?"

సుందర్ నవ్వుతూ అన్నాడు, "నాన్న! ఆమెచాలా అందంగావుంటుంది."

"మరి సుందర్‌కు సుందరియే దొరకాలిగా?"

ఆ సాయంకాలం యూనివర్శిటీగ్రౌండ్సులో మ్యాచ్ ఆడివస్తున్నాడు సుందర్. అనార్కలీబజార్లో సదానంద్ కన్పించాడు. సుందర్ సదానంద్‌ను కేకవేసి పిలిచాడు, "సదానంద్! గుడ్ న్యూస్!" నాకు నౌకరీదొరికింది."

"మంచిది. కంగ్రాచ్యులేషన్స్. ఎక్కడ?"

"నాన్నగారి ఆఫీసులోనే. ప్రస్తుతం యాభైరూపాయలే ఇస్తారు. కాని వెంటనే ప్రమోషన్సు వస్తుంటాయి. నేను ఫుట్‌బాల్ ప్లేయరునన్న సంగతి నీకు తెలుసుగా! నేను ప్లేగ్రౌండ్సులో ఎప్పుడూ నెగ్గుతూనేవచ్చాను. రెండునెలలలో ఆఫీసర్ గ్రేడ్స్ వెస్తువుంటుంది. తప్పకుండా పాసవుతాను."

"అయితే మాకందరికీ పార్టీయివ్వవలసిందే."

"అలాగే. కాని..." కొంచెం ఆలోచించి అన్నాడు; "లాభంలేదు. నీకు నేనుపార్టీ ఏమీ ఇవ్వకూడదు. రమ నీకంటే చిన్నదేగా. చెల్లెలియింటిదగ్గర నువ్వెలా తింటావు? అందుచేత పిల్లలందరికీ మిఠాయిపంపిస్తాను."

"అయితే మీ అమ్మా, నాన్నా పెళ్ళికి ఒప్పుకున్నారా?"

"నాన్నగారు ఒప్పుకున్నారు. అమ్మమాత్రం ఒప్పుకోలేదు. ఆమె అనుమతిలేకుండానే వివాహంజరుగుతుంది."

"కాని ఈవిషయంలో కంగారుఏముంది? మీ అమ్మగారికి ఆలోచించేందుకు సమయమివ్వండి."

"కాని ఈలోపల మరొకళ్లు ఎత్తుకపోతే?"

"అంటే?"

"అంటే ఏముంది? మరొకడు రమను పెళ్లాడేస్తే?"

"అలా జరిగితే మరొకర్తె వుందిగా?"

"ప్రభా, కాని నేను ప్రభను చేసుకోను."

"అది బాగానేవుంది సుందర్! కాని వాళ్ళిద్దరూ కవలలన్నసంగతి నీకు తెలిసేవుండాలి. ఒకర్తె ఏమితింటే రెండవదికూడా అదే తింటుంది. ఇద్దరూ ఒకచీరకం కట్టుకుంటారు.

ఒకర్తె ఎవరినివివాహంచేసుకుంటానంటుం ే రెండోవదికూడా అతన్నే చేసుకోవాలంటోంది. మాయింట్లో ఏమిజరుగుతుందో నీకు తెలుసా ? రమ, ప్రభలిద్దరూ నిన్నేచేసుకుంటానంటున్నారు. చాలా కష్టపడి అలా జరగకూడదని నచ్చచెప్పాము. ఇప్పుడు ఇద్దరిపెళ్ళిళ్ళూ ఒకేరోజున జరగాలని పట్టుబడుతున్నారు."

సుందర్ ఈ సమస్య వినగానే ఆశ్చర్యపోయాడు. ఇద్దరూ ఇంటికిదగ్గరకు వస్తున్నారు. సుందర్ సదానంద్ మాటలఅర్థాన్ని గ్రహించదానికి ప్రయత్నిస్తున్నాడు. దాని తాత్పర్యం అర్థంకాగానే సుందర్ అన్నాడు, "సదానంద్ ! అయితే ప్రభకోసం నేనొక మంచివరుణ్ణయినా వెదకాలి, లేక ఇద్దరినీపెళ్ళయినా చేసుకోవాలన్నమాట, మొదటివిషయంలో ప్రయత్నిస్తాను. భగవంతుడి దయవుంటే ఇద్దరిపెళ్ళి ఒకేసారి జరుగుతుందిలే."

"మేమూ ప్రయత్నిస్తున్నాము."

"కాని సదానంద్ ! ఒక్కవిషయం. రమనుమాత్రం నేను పెండ్లిచేసుకోకతప్పదు. ఇది నిశ్చయం."

"ఏం ? ప్రభనెందుకు చేసుకోకూడదు ? ఆమెలోవున్న చెడ్డేమిటి ?

"అబ్బే, అదేం కాదు. రెండుసంవత్సరాలనుంచి రమనే నాభార్యగా ఊహించుకుని కలలుకంటున్నా. ఆమె నావస్తువే అయినట్టుగా నా మనస్సులో ఏర్పడిపోయింది. గత కొన్ని నాళ్ళనుంచి అమ్మతో ఆమెకోసం దెబ్బలాడుతున్నా. ఇప్పుడు నీవారు మార్పుచెయ్యడానికి ప్రయత్నిస్తే ఏమీ బాగుండదు,"

సదానంద్ మాట్లాడలేదు. ఇద్దరూ సందులోకి వచ్చారు. సుందర్ అన్నాడు, "నడువు. పెద్దమ్మతో కూడా చెప్పివస్తాను. రమపెళ్ళి నాతో నిశ్చయంకావలసిందే. పెళ్ళికి ముందుగా మనం మరొక యోగ్యుడైన వరుణ్ణి వెదకాలి. ఇద్దరిపెళ్ళిళ్లూ ఒకేసారి జరగాలి."

సదానంద్‌కి సుందర్‌ని తమయింటికి తీసుకువెళ్ళాలని లేదు. కాని అతను ఊరుకునేవాడుకాదు. సదానంద్ వెనకాల వస్తున్నాడు. సుందర్ మెట్లెక్కి "పెద్దమ్మా! నేను సుందర్‌ని" అన్నాడు.

లక్ష్మివంటచేస్తోంది. రమ, ప్రభలను అక్కడ కూర్చోబెట్టి ఆమె వచ్చింది.

"రాసుందర్! క్రిందిగది ఖాళీగానేవుంది. అక్కడ కూర్చుందాం." చచ్చినట్టు సుందర్ వెనక్కు తిరిగాడు. అత నడిగాడు, "ఇవేళ వదిన లేదా?

"ఆమె వాళ్ళ తల్లిగారింటికి వెళ్ళింది." పరమానంద్ గదిలోకి వెళ్ళి ఇద్దరూ అక్కడ కూర్చున్నారు. సదానంద్ అగ్గిపెట్టె తెచ్చి దీపం వెలిగించాడు. సదానంద్ మాటలు ఆరంభించాడు, "అమ్మా! ఈరోజున సుందర్ బి. ఏ. పాసయినాడు. రమను కోరడానికవచ్చాడు. ఈవేళ ఉద్యోగం దొరికింది. రమ, ప్రభ లిద్దరినీ అడుగుతున్నాడు. తనకోసం రమని, తన మిత్రునికొరకు ప్రభని,"

"ఏమిత్రుడు?"

"ఇంకా నిశ్చయంకాలేదు." సుందర్ అన్నాడు, "సదానంద్ చెప్పిందేమంటే ఇద్దరివివాహాలు ఒకనాడే కావాలటగా. అందుచేత మరొకవరుణ్ణి వెదుకుతాను.

"చాలాసంతోషం నాయనా! కాని ఆ వరుడుకూడా నాకుమల్లే పరమానంద్‌కి, సదానంద్‌కి నచ్చాలి."

"పెద్దమ్మా! నేనంతా చేసి చూపెడతాగా. ప్రభకు వరుణ్ని వెదికేభారం నాది. అప్పటివరకూ వివాహానికి ఆగుతా కూడాను. కాని రమ నాకోసం ఖాయమైనట్టే."

"అంటే."

"అదంతా సదానంద్ చెబుతాడులే. నేను వెళ్ళి తాంబూలాలకు నాన్నగారినిపంపిస్తాను.

సుందర్ తండ్రిగారిని పంపలేకపోయాడు. ఇంట్లో తల్లి మహాభారతం సృష్టించింది. సుందర్ రాగానే తండ్రి, "అదిగో సుందర్ వచ్చాడు. మీరిద్దరూ తేల్చుకోండి." అన్నారు.

"ఏమిటి నాన్నా ఫైసలాచేసేది ?"

"అదే, రమను చేసుకునేది, లేనిది ?"

"చూడమ్మా! నేను రమనుతప్ప ఇంకెవ్వరినీ చేసుకోను. నువ్వు ఒప్పుకున్నాసరే లేకపోయినాసరే నాకేమీ ఇబ్బందిలేదు, నాన్నగారు అంగీకరించారు. నువ్వుకూడా ఒప్పుకుంటే మంచిది."

"నేను రమలాంటి పిల్లను నాఇంట్లో వుండనివ్వను. పైగా లక్ష్మికుటుంబంతో నేను సంబంధంపెట్టుకోలేను."

"సరే! నేను రమను పెళ్ళిచేసుకుంటే నువ్వేంచేస్తావు చెప్పు.

"నేను దానిని ఇంట్లోకి రానియ్యను."

"దానిదేముంది! పెళ్ళికాకముందే నేనొక ఇల్లు అద్దెకు తీసుకుంటాను. అందులోకి నీ యిష్టమైతే వద్దువుగాని లేకపోతే లేదు."

"ఆ ఇంటిఖర్చు ఎలానడుపుతావు? ఏభై రూపాయలతో సంసారం ఎలా నడుస్తుంది?"

"అదంతా నేను చూసుకుంటానులే. నువ్వేమీ బాధ పడకు!"

"నీపెళ్ళికి మీనాన్నగార్ని ఒక్కపైసాకూడాఖర్చుపెట్ట నివ్వను. బీదవాళ్ళపిల్లను చేసుకుని బీదవాడివై పోతావు."

"బీదవాళ్ళపిల్ల భాగ్యవంతుల ఇంటికివచ్చి భాగ్యవంతు రాలే అవుతుంది. చూద్దువుగానిగా ఏం చేస్తానో!"

"నీపెళ్ళికి ఎవరూ రాకుండా లక్ష్మిపిల్లలందరిమీదా దుష్ప్రచారంచేస్తాను."

"నేను వాళ్ళందరూ చాలా మంచివాళ్ళని గట్టిగా ప్రచారం చేస్తాను, దానితో అందరూ నిన్ను పిచ్చిదను కుంటారు."

చరణదాస్ నవ్వి అన్నాడు, "చాలు చాల్లేండి! ఆడ వాళ్ళకుమల్లే దెబ్బలాడుకుంటున్నారేం? ఇష్టమొచ్చినపిల్లను చేసుకునేందుకు సుందర్‌కి అధికారంవుంది. సుందర్ చేసుకునే అమ్మాయిని నిందిస్తే మనికే అప్రదిష్ట. ఆమె నిజంగా చెడ్డ దైనా మనం ఏమీ ఆరోపించకూడదు."

"కాని అటువంటిదానితో వివాహంచేసుకోకూడదని నాఉద్దేశ్యం."

"ఎటువంటిపానితో ?"

"రమ దొంగది."

"ఆమె చిన్నప్పుడు చేసేది, కాని అది పిల్లలందరూ చేసేపనే. కాని ఇప్పుడు ఆమె అటువంటిపనులు చెయ్యడం లేదుగా."

"నువ్వు ఆమె దొంగతనాన్ని కప్పిపుంచావుగా ?"

"ఎవరన్నారు?"

"ఆమె ఆరణాలపంచదార పట్టుకువెళ్ళిందని రామలాల్ చెప్పాడులే. నువ్వు మళ్ళీ రెండణాలది అందులో పోయించుకు వచ్చావుట."

"అమ్మా ! అంతేకాదు: ఆమె తను చేసినపని వప్పు కుంది. క్షమార్పణ అడిగింది. అందుకుగాను నేను మరొకబేడ బహుమానంకూడా ఇచ్చాను. ఆమె ఇప్పుడు పూర్తిగా మారిపోయింది."

"చూడవే !" చరణదాస్ అన్నాడు, "రమతో వివాహ ప్రస్తావనవచ్చినప్పటినుంచీ నేను అనేకమందిని లక్ష్మికుటుంబం, వాళ్ళ పిల్లల్నిగురించి అడుగుతూవచ్చాను. ప్రతివాళ్ళూ కుటుంబాన్ని, పిల్లల్ని పొగిడినవాళ్ళే. మరి నీమాటలు నమ్మే దెట్లా ? సుందర్కిష్టమయినప్పుడు చేసుకోమని నాఉద్దేశ్యం."

"సరే, తండ్రీకొడుకులిద్దరూ ముందే నిశ్చయించు కున్నప్పుడు ఇక నాకేం ? ఇక ఎటొచ్చీ పెళ్ళిలో నేనూ కూర్చోవాలిగా ? లక్ష్మితో అంతా మాట్లాడితేగాని నేను కూర్చోను."

"నువ్వింకేమి మాట్లాడుతావులే ? నేనంతా మాట్లాడేశాను. ఇక నాన్నగారు వెళ్ళి తాంబూలాలుతీసుకొని ముహూర్తం పెట్టుకోవడమే."

ముహూర్తంపెట్టుకున్నా సరే, లేకపోయినాసరే, కాని కట్నాలు - కానుకలు మాటమాత్రం నేను మాట్లాడితీరతాను."

"వాళ్ళదగ్గర ఏమి తీసుకుందామనుకుంటున్నావు ."

"వాళ్ళతో సంబంధంచేసుకుని బీదవాళ్ళమవుతావేమో చూసుకోవాలిగా!"

"అయితే డబ్బుఅడగడంవల్ల బీదవాళ్ళమవుతామా లేక అడగకుండా వుండటంవల్లనా ?"

"చూడబ్బాయి! బీదవాళ్ళపిల్లలకైతే కట్నాలురావు. అదే డబ్బువున్నవాళ్ళ పిల్లలకైతే బాగా కట్నాలు వడుక్కుంటారు."

"అయితే నాకవ్వబోయే అత్తవారింటిని బాగా వడుక్కుంటావన్నమాట."

ఇక దెబ్బలాట నాపుచెయ్యాలనే దృష్టితో చరణదాస్ అన్నారు, "సరే. నీ ఇష్టమొచ్చినట్టు చెయ్యి."

ఈ మాటలతో చాలా ప్రొద్దుపోయింది. అందుచేత చరణదాస్ పరమానంద్‌ని కలుసుకోలేదు. మరునాడు ఉదయం పరమానంద్ సైకిలుతీసుకుని తన డ్యూటీకి వెళ్తూండగా చరణదాస్ అతనిదగ్గరకు వెళ్ళి అడిగాడు, "పరమానంద్ ! ఏమైనా తొందరపనుందా?"

"లేదండి మీరు శెలవివ్వండి!"

"అయితే నడువు, కాస్తదూరం అలా వెళ్ళొద్దాము?"

ఇద్దరూ సందుదాటి వీధిలో అడుగుపెట్టారు. ఆయన అన్నారు, "సుందర్ బి.ఏ. పాసయ్యాడు."

"అవును. తెలిసిందండి. చాలా సంతోషించాను."

"నిన్న ఉద్యోగంలో ప్రవేశించాడు."

"చాలా సంతోషం."

"ఇక అతనిపెళ్ళికూడా చేసివేద్దామనుకుంటున్నా."

"చాల మంచిఉద్దేశమే."

"మీచెల్లెలు రమతో చేద్దామనుకుంటున్నా."

"పెద్దమ్మ ఏమంటున్నారు?"

"మా యిద్దరిఅభిప్రాయాలూ ఏకీభవించడంలేదు."

"అంటే నన్నేమనుకోమంటారు?"

"సుందర్‌తల్లి ఈవివాహానికి అంగీకరించడంలేదు. నేను మాత్రం నా అనుమతి తెల్పాను. కానిదానివల్ల ఏమవుతుంది? మీ అన్నదమ్ములు అంగీకరించాలిగా? నేను మీ అనుమతి కోరుతున్నా."

"మేము సుందర్‌ని ఒక యోగ్యుడైన వరుడుగా భావిస్తున్నాము. కాని సుందర్‌తల్లి అంగీకారంలేకుండా పెళ్ళి ఎలా జరుగుతుందని? ఏదోవిధంగా సుందర్‌తల్లిని ఒప్పించడం మంచిదని నా ఉద్దేశ్యం."

"నీఉద్దేశ్యం మంచిదే. కాని నా అనుభవాన్నిబట్టి చెబుతున్నాఅది అసంభవం."

"అయినా ప్రయత్నంచెయ్యవలసిందే."

"అది జరుగుతూనేవుంది. వివాహమయ్యిన తరువాత కూడా జరుగుతుంది. అయినప్పటికి మీచెల్లెలు అత్తగారి విముఖతను అంగీకరించియే చెయ్యాల్సివుంటుది."

"అయితే మమ్మల్ని ఏమి చెయ్యమంటారు?"

"రమ నా కూతురేగనుక అయినట్టయితే అటువంటి పరిస్థితుల్లో పెళ్ళిచేసేవుండేవాణ్ణి."

పరమానంద్ విస్మయంతో చరణదాస్ ముఖం చూస్తున్నాడు. ఇటువంటి విషమపరిస్థితుల్లో ఆయన అలా మాట్లాడతారని ఎప్పుడూ ఆశించలేదు. దానిమీదట అతనన్నాడు, "బాబూ! ఈమె మీబిడ్డయే. మీఇష్టంవచ్చినట్టు చెయ్యండి. మేముకూడా మీ కట్టుబాళ్ళమే."

"అయితే మాట నిశ్చయమయినట్టేగా. తాంబూలాలు ఎప్పుడు తీసుకుందాం?"

"అది మీరే నిర్ణయించండి. కాని మేము డబ్బులేనివాళ్ళమన్న సంగతి మీకు తెలుసుగదా! మేమేమీ ఇవ్వలేం కేవలం అమ్మాయినిమాత్రమే మీ కప్పగించగలం."

"దానికి నువ్వేమీ బాధపడకు. కాని ఒక్కవిషయం మాత్రం దృష్టిలోవుంచుకో. సుందర్ తల్లి ఏమైనా అడిగితే ఇవ్వటానికి అంగీకరించు. ఆఏర్పాట్లు నేను చూసుకుంటాను."

ఈవిషయం పరమానంద్‌కు నచ్చలేదు. అతనడిగాడు, "అంటే మీ ఉద్దేశ్యమేమిటి? అయితే మీదగ్గర డబ్బుతీసుకుని సుందర్ తల్లికి వేమిస్తున్నట్టుగా చూపించమంటారా? ఇదే మీ ఉద్దేశ్యమయితే ఈవివాహం జరుగదు. మేము ఒక

శుభకార్యాన్ని మోసంతో ఆరంభించలేను. పైగా మరొక్క
టేమంటే ఈసారి అలాచేస్తే రేపు ప్రభవివాహానికి ఏమిచేసేది?"

చరణదాస్‌కీ విషయం అర్థమయ్యింది. ఆయనన్నారు,
"పరమానంద్! నువ్వు అన్నది బాగానేవుంది! నీ ఇష్టమొచ్చి
నట్టు చెయ్యి. నేను, సుందర్, అయిదుగురు పెద్దలు వస్తాము.
తాంబూలాల పని పూర్తిచేసుకు వెళ్తాము. నువ్వు మాకోసం
కొబ్బరికాయలు, అవీ సిద్ధంచేసివుంచు."

సుందర్ తల్లి మధ్యాహ్నం లక్ష్మిఇంటికి చేరుకుంది.
పిల్లలందరూ స్కూలుకు వెళ్ళారు. సదానంద్ మధ్యాహ్నం
భోజనంచేసేందుకు వచ్చాడు. చమేలీ ఇంటిపని చేస్తోంది.
సుందర్ తల్లి మెట్లుఎక్కుతూ, "లక్షీ! ఓ లక్ష్మి!!" అని
పిలిచింది.

లక్షి వంటింట్లోనుంచి వచ్చి ఎవరు పిలిచారా అని
చూస్తోంది. సదానంద్ కూడా ఆమెరావడంచూసి ఆశ్చర్యంతో
నిలబడిపోయాడు. చమేలీకూడా పనిమానేసి అక్కడకు
వచ్చింది. సుందర్ తల్లిని గౌరవంతో కూర్చోబెడుతూ లక్ష్మి
అంది, "ఇవేళ మీరు రావడంవల్ల మాఇల్లు చాలా పవిత్ర
మయ్యింది. ఏమి పనిమీదవచ్చారో శెలవివ్వండి? మేము
మీకేమి సేవచెయ్యగలము?"

"విషయమంతా మీకూ తెలిసేవుంటుంది. సుందర్
తండ్రి ఈవేళ పరమానంద్‌ని కలుసుకున్నారు. పరమానంద్
నన్ను మిమ్మల్ని కలుసుకుని తక్కినవిషయాలు మాటాడ
మన్నాడట."

"పరమానంద్ ఉదయం వెళ్ళాడు, రాత్రిఅయ్యే వరకూ రాడు. అతను సుందర్ తండ్రితో ఏమన్నదీ మాకేమీ తెలియదు. అదేమిటో, మీరే చెప్పండి."

"అదే ఏమ వివాహంసంగతి. వర్ణభేదాలు తాను పాటించనన్నాడట, పరమానంద్. తన చెల్లెల్ని క్షత్రియుల ఇంట చెయ్యడానికి సిద్ధంగావున్నాడు. ఇక తక్కినవిషయాలు మాట్లాడేందుకు నేను వచ్చాను"

"చెప్పండక్కా!" లక్ష్మి అడిగింది.

"అదే కట్నాలూ కానుకలూ విషయాలు మాట్లాడదామని. అబ్బాయి. బి. ఏ. ప్యాసయ్యాడు. రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు"

"అవన్నీ సదానంద్ చెప్పాడు."

"నాకు మీ కుటుంబపరిస్థితి తెలుసు. రిమతండ్రి వెళ్ళిపోయినందువల్ల ఆర్థికపరిస్థితి బాగాలేదు అయినప్పటికి ఏదో వ్యవహారం కాబట్టి తేల్చుకోవలసివచ్చింది. మరొకళ్ళయి నట్లయితే అయిదువేలకు తక్కువ తీసుకునేవాళ్ళం కాదు. మీరుకాబట్టి కనీసం రెండువేలు రొక్కం ఇవ్వండి. లేకపోతే వివాహం జరగటం కష్టం."

ఆ మాటలు వినగానే సదానంద, లక్ష్మి కాసేపు స్తబ్దులై పోయారు. వాళ్ళేమీమాట్లాడకపోవడంచూసి సుందర్ తల్లి అంది, "వివాహసమయంలో నగలు, బట్టలు కాకుండా అబ్బాయికి బంగారపు గడియారం, ఒక సైకిలు, ఒక గ్రామ ఫోను తప్పకుండా పెట్టాలి."

ఈసారి సదానంద్‌కు హేళనచేద్దామనిపించింది. అత నన్నాడు, "పెద్దమ్మా! మేమంతకంటే చాలా ఎక్కువే ఇద్దామనుకుంటున్నాము. ఇవేకాకుండా మీకొక పట్టుచీర, నగలసెట్టు ఇద్దామనుకుంటున్నాం."

"వర్థిల్లు నాయనా! నాకు నగలంతగా అవసరంలేదు. కాని, సుందర్ తండ్రిగారికి ఒక బంగారపు గడియారపు గొలుసు పెడితే బావుంటుంది. చూడబ్బాయి! మాకొక్కడే కొడుకు. అందుచేత అతనిపెళ్ళికి కోరికలన్నీ నెరవేర్చుకోవాలి. పెళ్ళిలో విందుమాత్రం చాలా బాగావుండాలి. సుందర్ మిత్రులందరూ చాలా సంతోషించాలి."

"పెద్దమ్మా! అవన్నీ జరుపుతాంగా. బాబయ్యగారిని పంపించు. మేము అన్నీ మాట్లాడుకుంటాము. అన్నట్టు ఒక విషయం చెప్పడం మర్చిపోయాను. మా వకీలుగారు రమ వివాహానికి ఒక మోటరుకారు ఇవ్వాలంటున్నారు. కాని నాకు మాత్రం ఒక ఏనుగుని ఇవ్వాలనివుంది. కాని సుందర్ తండ్రి దాన్ని ఎక్కడ కడతారా అనిభయంగా వుంది."

సదానంద్ తనని హేళనచేస్తున్నాడని సుందర్ తల్లికి సందేహం వచ్చింది. అందుచేత ఏమని జవాబుచెప్పాలా అని ఆలోచిస్తోంది. సదానంద్ ఆమె మౌనంగావుండటం చూసి అన్నాడు, "పెద్దమ్మా! పెళ్ళివారందరికి భోజనాలతోపాటు ఒకొక్క తలపాగకూడా పెడదామనుకుంటున్నాం."

"సదా! నోరుమూసుకో." లక్ష్మి సదానంద్ ధోరణి అర్థంచేసుకుంటూ అంది.

"ఏమమ్మా ఇంకేమి కావాలి? ఇద్దరం అన్నగార్లం సంపాదిస్తున్నాము. చెల్లెలుకు ఆమాత్రం పెట్టలేమా?"

"కాస్త ఆగు. అక్కగారు ఏదో చెబుతున్నారు."

సుందర్ తల్లి అంది, "అమ్మాయి అన్నగారు ఇవన్నీ పెట్టాలన్నప్పుడు ఇక నేను చెప్పవలసినపనిలేదు. కాని ఒక్క విషయం. ఇదంతా కేవలం వేళాకోళంగనుక అయితే అమ్మాయి ఒక్కరోజుకూడా మాయింటిదగ్గర గడపటం కష్ట మవుతుంది."

"పెద్దమ్మా! మాకంతా తెలుసులే. నువ్వు దేనికీ బాధ పడనవసరంలేదు. నువ్వు సుందర్, వాళ్ళ నాన్నని పంపించు. మే మన్నివిషయాలూ మాట్లాడుకుంటాము."

సుందర్ తల్లి వెళ్ళిపోయినతరువాత లక్ష్మి సదా నంద్ తో అంది, "ఏమిట్రా, అలా అన్నావు?"

"లేకపోతే ఏమిటమ్మా? ఈవిడ మనల్ని వేళాకోళం చెయ్యడానికి వచ్చినట్టుంది. మనం బీదవాళ్ళమని తెలిసికూడా రెండువేలు అడిగేందుకు వచ్చిందిచూడు."

"కాని నాయనా! పెద్దవాళ్ళని హేళనచెయ్యడం ఏ పరిస్థితుల్లోనూ మంచిదికాదు. పైగా ఆమె రమకు అత్తగారు కాబోతోంది."

"అమ్మా! కట్నం ఇవ్వవలసివస్తే పెళ్ళిజరుగదు. సుందర్ కి ఈ పెళ్ళిచేసుకోవాలనే గనుక వుంటే, ఏమీ తీసు కోకుండా చేసుకుంటాడు. ఈవిడ ఈకార్యానికి అడ్డంకులు వెయ్యడానికే వచ్చిందనుకుంటాను."

7

రాత్రి సుందర్, అతనితండ్రి రాగానే సదానంద్ సుందర్ తల్లి ఏమేమి కోరిందో చెప్పాడు. దానిమీదట చరణ దాస్ నవ్వుతూ అన్నారు, "సదానంద్! నువ్వుకూడా ఒక కారు, ఒక ఏనుగు, పెళ్ళివారందరికీ పాగాలు పెడతావన్నావుగా, చూడబొచ్చాయి! నాకంతా తెలుసు. ఇటువంటి స్త్రీకి రోగంకుదర్చాలంటే ఒక్కటేఉపాయం. అదేమంటే పూర్తిగా హేళనచెయ్యడమే.

"బుధవారం ఉదయం ఎనిమిదిగంటలకు తాంబూలాలు తీసుకోడానికి ముహూర్తం నిశ్చయించాము. మీరంతా సిద్ధంగావుండండి. మేము ఏడుగురుం వస్తాము. ఏదో సామాన్యమైన ఏర్పాట్లు చెయ్యండి."

పరమానంద్, సదానంద్ లిద్దరూ కలిసి తాంబూలాలకు కావలసిన ఏర్పాట్లన్నీ మాట్లాడుకున్నారు. వచ్చేవారికందరికీ మిఠాయి, పాలు ఏర్పాటుచెయ్యాలి. తాంబూలాలలో యిచ్చేందుకు ఒకపళ్ళెం లడ్లు, అయిదురూపాయల రొక్కం, పళ్లెంపైన కప్పేందుకు ఒక పట్టురుమాలు కావాలి. ఇంతకంటే ఏర్పాట్లేమీ అక్కర్లేదు.

ఈ విషయాలన్నీ, ఆలోచించుకుంటూ మరునాడు లైబ్రెరీకి వెళ్తూంటే శబనమ్‌దగ్గరనుంచి ఉత్తరం తెచ్చిన అమ్మాయి కలిసింది. ఆమెకూడా వస్తోంది. సదానంద్ భయంతో అన్నాడు, "చూడండి, నామీద సి. ఐ. డి. పోలీసులను వేశారు. ఒకవేళ మీరుగనుక నాతో ఎక్కువసేపు

వున్నట్లయితే వాళ్ళు అనుమానించి మిమ్మల్నిగూడా వెంబ డించవచ్చు." ఆ అమ్మాయి ఇదివిని కంగారుపడ్డది, పిమ్మట "అయితే మిమ్మల్ని ఎక్కడ, ఎప్పుడు కలుసుకోమంటారు?" అని అంది.

"లైబ్రరీయే సురక్షితస్థానము. అయినా నేను నిశ్చ యంగా చెప్పలేను."

"సరే, మంచిది. నేనే స్వయంగా మిమ్మల్ని కలుసు కునేందుకు ప్రయత్నిస్తాను. ఈమధ్య మీరు ఇంటికి ఎన్ని గంటలకు వస్తున్నారు!"

"మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు."

"మంచిది ఏర్పాటు చేస్తాను."

"కాని కలుసుకొనడం చాలా అవసరమా?"

"అది నాకు తెలియదు. నేను నాస్నేహితురాలి సందేశం మీకు చేరవేయాలి. ఆమె ఉత్తరం కవరులో మూసివుంది. అందులో అవసరమైనది వుందో లేక అవసరం లేనిదో నాకు తెలియదు.

"నాతో సంపర్కంపెట్టుకొనడం చాలా ప్రమాదం. ఆలోచించండి."

ఆ అమ్మాయి సదానంద్ దగ్గరనుంచి వెళ్ళిపోయింది. సదానంద్ వున్న విషయాన్ని తెలియబరచి తాను మంచిపనే చేశాననుకున్నాడు.

కాని సదానంద్ ఇల్లుచేరుకునేసరికి తల్లి ఒక మూసి వున్న కవరుయిచ్చింది. ఆమె అంది "పదిపన్నెండు సంవత్సరాల

సుఖ్దాను ఒకతను ఈ కవరు నీకిమ్మని పదిగంటలకు ఇచ్చి వెళ్ళాడు."

కవరుమీద ఏమీ అడ్రసులేదు. సదానంద్ కవరు చించి ఉత్తరంతీశాడు. దానికి పైనగాని క్రిందగాని పేరేమీ వ్రాసిలేదు.

ఉత్తరం శబనమ్‌దే. అందులో ఇలా వ్రాసివుంది. "మీ ఉత్తరం అందింది. నాకు కొంచెం ధైర్యంకలిగింది. కాని మీరు నన్ను ఒకసరైన హిందూస్త్రీగా చూడాలని కోరిక తెల్పారు! ఇక్కడ నేనున్నచోట హిందువులను పశువుల్లా భావిస్తారు. హిందువులు అయిదువేల సంవత్సరాలనాటి పాత ఆచారాలలో చిక్కుకుని తమకు కష్టాలు తెచ్చిపెట్టుకునేదే కాకుండా, చుట్టుప్రక్కల వున్నవారి నెత్తిమీదకూడా వాటిని రుద్దుదామనుకుంటారని వీరి భావన. హిందువులలో విధవుల కష్టాలు, స్త్రీలను ఆటబొమ్మలులా చూడటం, రాళ్ళను దేవుళ్ళుగా కొలవటం, అన్నివిధాల మానవత్వాన్నుంచి దూరమైన సూత్రాలను అంగీకరించి పాటించడం మొదలైనవన్నీ బాగా కన్పిస్తుంటాయి. అయితే మీరు నన్ను కూడా ఈరకానికి చెందిన మనిషిగా మారమనా చెప్పేది? నేను మీరు అలాఅంటారని అనుకోలేదు. ఈ విషయంలో మీకు వ్రాయవలసింది వ్రాస్తారని ఆశిస్తున్నా. ఇక మీరు వ్రాసిన తక్కినవిషయాలు పాటించేందుకు పూర్తిప్రయత్నం చేస్తాను. ఆవిషయాల్లో నేను మీరు చూడగలరని నమ్మకంగా చెప్పగలను."

సదానంద్ తల్లి అంది, "ఆ అబ్బాయి రేపు నాలుగు గంటలకు జవాబుకోసం వస్తానన్నాడు."

"మంచిది. ఉత్తరానికి జవాబివ్వవలసివుంటే వెంటనే ఇస్తాను."

సదానంద్ ఆరాత్రే కూర్చుని ఉత్తరంవ్రాశాడు. అతను ఇలా వ్రాశాడు.

నువ్వు నీ మనస్సులో సందేహమడగటానికి సాహసించినందుకు చాలా సంతోషించారు. అందుకే వ్రాస్తున్నాను.

ఏ విషయంలోనైనా, ఆఖరుసత్యం ఏమిటో, వెంటనే ఒప్పుకోవడం అంత తెలివైనపనికాదు. తమ తెలివితేటలమీద నమ్మకం లేనివాళ్ళే అటువంటిపనులు చేస్తుంటారు. అందుచేత ప్రతివిషయంమీద క్రొత్తక్రొత్త ప్రశ్నలు వినడానికి సిద్ధంగావుండటం, ఆ విషయాన్ని ఒక నూతనదృక్పథంతో చూడటానికి ప్రయత్నించడమనేది ఒక మానవునియొక్క తెలివితేటలను, అతనియొక్క ప్రగతిమార్గాన్ని తెలియపరుస్తుంది. అదే హిందువులలోనున్న ప్రత్యేకత పునాదీను. హిందువులలో పరమాత్మునిదగ్గరనుంచి అతి చిన్నవిషయం దాకా విమర్శలు వినడానికి,. చేయడానికి సిద్ధంగావుంటారు. అలా చేసినవారిని హిందూమతంనుంచి బహిష్కరించారు. అతను అలా చేసినందుకు శిక్షార్హుడుగాకూడా భావించరు.

"మాలో రాముడు, కృష్ణులను భగవంతుడుగా భావిస్తారు. అయినప్పటికి వారుచెప్పిన విషయాలను నిందించేవారు అనేకమంది వున్నారు. వారు అలా చేసినప్పటికీ హిందువులే.

రాముడు తన భార్య సీతను అరణ్యానికి పంపించినందుకు చాలామంది ప్రజలు నిందిస్తారు. కాని వారందరూ హిందువులు కాదనబడరు. అలాగే కృష్ణుణ్ణి వ్యభిచారిగా భావించే వారుకూడా అనేకమంది వున్నారు.

"హిందువులలో మాంసాహారులూ వున్నారు, శాకాహారాలూ వున్నారు. నాస్తికులూ వున్నారు, ఆస్తికులూ వున్నారు.

"నువ్వు నేను చెప్పింది అర్థంచేసుకొన్నావనుకుంటాను. హజరత్ మహమ్మద్ సాహబ్‌ని భగవంతునిదూత అని ఒప్పుకోనివారు మహమ్మదీయులు కాలేరు. అలాగే మహమ్మద్ సాహబ్‌గారితో సమానమైనవారు వున్నారనేవాళ్ళం దరినీ మీరు 'కాఫిర్‌లంటారు" అలా హిందువులలో లేదు.

"హిందువులలో మనస్సు ఎటుమళ్ళితే అటు ఎగరడానికి అవకాశంవుంది. దానికి హద్దులంటూ ఏమీలేవు. సూగురువులు మాకు వేరువేరువిషయాల నంగీకరించాలని చెబుతారు. కాని వాటినికూడా అంగీకరించకపోవడం అనేది వ్యక్తియొక్క మానసిక స్థితినిబట్టి వుంటుంది.

అలా అయినప్పటికీ హిందూ సమాజాన్నంతటిని ఏకం చేసేవి మా ధర్మంలో కొన్నిసూత్రాలు వున్నాయి. అవి కేవలం శీలానికి సంబంధించినవి. మా ధర్మంలో పది సూత్రాలు వున్నాయి. ధర్మమంటే అమల్లో పెట్టదగినది. అదేవిధంగా మహమ్మదీయమతంలోనూ క్రైస్తవమతం లోనూకూడా ఇంచుమించుగా అవే సూత్రాలు వున్నాయి. అందుచేత సూత్రాలు చూసుకుంటే అన్నిమతాలలోనూ

ఇంచుమించుగా ఒకటే. కాని నేను ముందు వ్రాసిన విషయాల్లోనే తక్కిన మతాలవారికి హిందువులకు తేడా వుంది. ఆ విషయాల్లోనే నా భార్యను హిందూ స్త్రీగా వుండాలని నా కోరిక.

"ఒక్కమాట. ఉత్తరం నేను ఇంటిదగ్గరలేనప్పుడు మాత్రమే ఇంటికి పంపించవలసింది. పోలీసులు నన్నే వెంబడిస్తున్నారు, కాని మాయింటిని కాపలా కాయడంలేదు. అది చాలా అదృష్టకరమైన విషయము."

మరునాడు ఆ కుఱ్ఱవాడే వచ్చి తల్లిదగ్గర వుత్తరం తీసుకువెళ్లాను. తల్లి అడిగింది. "సదా! ఈ అబ్బాయి ఎవరు? ఆ ఉత్తరం ఎవరిది?"

"అమ్మా! నీదగ్గరకు పంపించిన అమ్మాయి వుండే, ఆమె నీదగ్గరనుంచి తన తల్లిదగ్గరకు వెళ్ళింది. ఆమె తల్లికి ఆమె హిందువు అయిపోతుందేమోనని భయంవేసింది. అందుచేత వెంటనే వివాహానికి ఏర్పాట్లుచేసింది. ఒకరాత్రి ఒక మహమ్మదీయ కుఱ్ఱవాడితో పెళ్ళిచెయ్యడానికి సిద్ధపడింది. కాని ఈలోపల ఆమె పారిపోయింది.

"ఆమెదగ్గరనుంచే వచ్చింది వుత్తరం. ఇరవయొక్క సంవత్సరాలుదాటిపోగానే నన్ను పెళ్ళిచేసుకునేందుకు వస్తానంటోంది. కాని ఆమె నాభావాలకు అనుకూలంగా మారేవరకూ నేను పెళ్ళిచేసుకోనని వ్రాశాను."

"ఇప్పుడు ఆమె వయస్సెంత?"

"పద్దెనిమిది వచ్చాయి. ఇంక మూడు సంవత్సరాలలో ఆమె మేజర్ అవుతుంది."

"అప్పటివరకూ నువ్వు వివాహం చేసుకోవా ?"

"నా పెళ్ళికి ఇంకా ఆలశ్యంవుంది. ఆమె మేజర్ కాగానే నా షరతులు కూడా పూర్తిచేసినట్లైయితే ఆమెనే పెళ్ళి చేసుకోవచ్చు."

తల్లి మాట్లాడలేదు. ఆగదువుకుముందే సదానంద్ వివాహంకావాలని ఆమె మనస్సులో భగవంతుని కోరుకుంది.

8

ముహూర్తంపెట్టిననాడు, సుందర్, చరణదాస్, ఇద్దరు చుట్టాలు ముగ్గురు మిత్రులు వచ్చారు. మిఠాయి తిని, పాలు త్రాగి, మిఠాయిపళ్ళెం, అయిదు రూపాయలు తీసుకుని వెళ్ళిపోయారు. సంబంధం నిశ్చయమైపోయినట్టే. సందులో ఈ విషయంఅందరికీ తెలిసిపోయింది.

ఇంటివద్ద సుందర్ తల్లి చరణదాస్ మిఠాయి పట్టించుకు రావడంచూసి కారం మిరియాలు నూరడం మొదలెట్టింది. వాళ్ళురాగానే పరమానంద్ ఏమిచ్చాడు ?" అని అడిగింది.

"అమ్మా ! ఈ మిఠాయి, అయిదురూపాయలూను." అన్నాడు సుందర్.

"అంతేనా?"

"పైగా తన చెల్లెలి నిచ్చేందుకు మాట ఇచ్చాడు."

"అయితే ఈ మిఠాయి ఎందుకు తెచ్చావు ?"

"మనం తినేందుకు; కావలసిన వాళ్ళందరకూ పంచి పెట్టేందుకు."

"ఈ మిఠాయి ఎంతమందికని పంచిపెట్టేది?"

"అయితే మనకు డబ్బులేదా ఏమిటి? ఈవేళే మిఠాయి కొట్లో ఒక మణుగులడ్లు తయారుచేసి పంపించమని చెప్పివచ్చి వచ్చాను. సాయంకాలానికి వచ్చేస్తాయి. నువ్వు వాటిలో కావలసిన వారందరికీ పంచిపెట్టు."

"నువ్వు అన్నీ నీ యిష్టప్రకారమే కానిచ్చేటప్పుడు, అవికూడా స్వయంగానే పంచిపెట్టు."

"సరేలేమ్మా! నేనే పంచిపెడతాలే. పెళ్ళి నాకైనప్పుడు నిన్ను కష్టపెట్టడమెందుకు?"

ముహూర్తం పెట్టుకున్నరోజున రమా, చమేలీతో అంది, "వదినా! ప్రభ వివాహంకానిదే నేనుకూడా వివాహం చేసుకోనని అన్నయ్యతో చెప్పు."

"చూడు రమా! మీ అన్నయ్య పెళ్ళయింది. కమల క్కయ్య వివాహంకూడా అయ్యింది. ఇప్పుడు నీ పెళ్ళి అవుతుంది. ప్రభదికూడా అయిపోయిందంటే నమ్ము."

"కాని ఆమెదికూడా నాతోపాటే జరగాలని."

"ఏం?"

"మేమిద్దరం కవలలంగా? వదినా! నా వివాహం అవుతుందని తెలిసినప్పటినుంచీ ప్రభ చిక్కిపోతోంది. నాకు కూడా ఏమీ బాగుండలేదు."

చమేలీ ఈ విషయం పరమానందంతో చెప్పింది. ప్రభ నీరసపడుతున్నట్టు అతనుకూడా కనిపెట్టాడు. అందుచేత అతనికి విచారం వేసింది.

ప్రభకోసం తగినవరుణ్ణి వెదకటం ఆరంభించాడు.

చమేలీ ఒరోజున ప్రభకు నచ్చచెప్పింది. కాని ఆమె అంది, "నేను ఆనందంగావుండేందుకు పూర్తి ప్రయత్నంచేస్తున్నాను. కాని అది నావశంలోని మాటకాదు. మేమిద్దరం రొట్టె, బట్టలు, తక్కిన శారీరిక అవసరాలన్నిటినీ సమానంగా పంచుకుంటున్నాం. కాని ఒకరి ప్రేమను ఎలాపంచుకోగలము? ఆ విషయం నాకు బాగా తెలుసు. అయినప్పటికీ నా ఆకలి నశించిపోయింది. రాత్రులు నిద్రపట్టడంలేదు. చదువటానికి మనస్కరించడం లేదు."

కొద్ది రోజులుపోయిన తరువాత ప్రభ, రమతో తన వివాహానికి అడ్డుచెప్పవద్దని చెప్పింది. రమ జవాబిచ్చింది. "కాని ఇది నేను నీకోసం చెయ్యడంలేదు. నువ్వు లేకుండా జీవితం గడపటం నాకు చాలా కష్టమనిపిస్తోంది,

"సరే అది ఒప్పుకున్నాను. కాని నువ్వు పెళ్ళిచేసుకోకపోవడం, నాపెళ్ళి మరొకచోట జరగడం మన వియోగాన్ని ఏవిధంగా తగ్గిస్తుంది? కాని ఒక్కటే జరగాలి. మనిద్దరికీ ఒక్కరే భర్తవుండాలి, కాని అలా జరుగదు. అలాచేసుకునేందుకు ఎవ్వరూ ఇష్టపడరు. మిగిలిన దేది జరిగినా మన సమస్య పరిష్కారంకాదు."

"అసలువిషయమేమంటే, జరగనున్నది జరిగేతీరుతుంది. రమ, ప్రభలు ఏమనినా, ఏమి చేసినా అది ఏవిధంగా జరగబోయే సంఘటనలను మార్చలేదు. ఏదో అజ్ఞాతశక్తి ప్రభావంతో సంఘటనలు జరుగుతున్నాయి. వాటిని మార్చుదామనుకోనడం నిష్ప్రయోజనం.

సుందర్ ప్రభకోసం వరుణ్ణి వెదుకుతున్నాడు. సదానంద్, పరమానంద్. కుంవర్ సేన్ గారు కూడా వెదుకుతున్నారు. కాని ఫలితం ఏమీ కనిపించడం లేదు.

కాలం గడచిపోతోంది. సుందర్ తాంబూలాలుపుచ్చుకుని అయిదునెలలయ్యింది, అతని ఆఫీసరు గ్రేడ్ టెస్టులో కూర్చునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. తక్కిన ఆఫీసర్లతో స్నేహం చేసుకునేందుకు రైల్వేక్లబ్బుకు వెళ్తున్నాడు. అక్కడ కూడా టెన్నిసు మొదలైనవి ఆడుతున్నాడు.

పరీక్ష జరిగింది. అందులోకూడా పాసయ్యాడు. ఆఫీసర్లతో స్నేహం చెయ్యడంవల్ల వెంటనే ప్రమోషన్ వచ్చింది. అతన్ని స్టోర్ సూపరింటెండెంటు నియమించి జలంధర్ పంపించివేశారు. అతను జలంధర్ వెళ్ళి, అక్కడ ఇల్లు తీసుకున్నాడు. పరమానంద్ ని తన వివాహానికి ముహూర్తం పెట్టమని ఒత్తిడి చేయడం ఆరంభించాడు.

దానిమీదట లక్ష్మి, పరమానంద్, సదానంద్, చరణదాస్ అందరూ కూర్చుని మాట్లాడుకున్నారు. రమ వివాహం చేసివెయ్యవలసిందేనని నిశ్చయమయ్యింది. చరణదాస్ అన్నారు. "సుందర్ వివాహంరోజున పదిగంటలకు లాహోరు వస్తానని వ్రాశాడు. పైగా వివాహం అయినతరువాత ఎనిమిది గంటలబండికి భార్యను తీసుకుని వెళ్ళిపోతాడట. వివాహానంతరం భార్యను తీసుకువెళ్ళేటప్పుడు కట్నం కానుకలు ఏమీ తీసుకువెళ్ళను అని వ్రాశాడు."

ఇటువంటి మాటలవల్ల లక్ష్మికి చాలా దుఃఖం కలిగింది. ఆమె చరణదాస్‌తో అంది "మా బీదతనాన్ని ఈ విధంగా బయటపెట్టడంవల్ల మీకు, సుందర్‌కి కలిసివచ్చేదేముంది?"

చరణదాస్ అన్నారు; "చెల్లాయి! నువ్వేమి చెబితే అది సుందర్‌కి వ్రాస్తాను. ఈ వివాహం అతనే నిశ్చయించుకున్నాడు, అతనికోరికయే నా కోరిక."

దానిమీదట సదానంద్ అన్నాడు, "మామయ్యా! వ్రాయనవసరంలేదు. నాకు సుందర్ స్వభావం బాగా తెలుసు. మాకు చెడ్డపేరు రావడం అతనికి ఇష్టంలేదు. మన మాన మర్యాదలను కాపాండేందుకే అలా వ్రాశాడు. శివాలయంలో వివాహం చేద్దాం. పెళ్ళివారి నాహ్వానించే భారం మనది. ఇక చెల్లెలికి ఏమి ఇచ్చామూ అనేది బయటివారి కనవసరం. అందుచేత చెప్పేదేలేదు."

సదానంద్ తెలివితేటలు పరమానంద్‌కి తెలుసు. అందుచేత అతని సలహా నంగీకరించాడు. విషయం నిశ్చయంమయిపోయింది.

పెళ్ళి ఇంత సూక్ష్మంగా చేసివెయ్యాలనడం సుందర్ తల్లికి నచ్చలేదు. కాని ఆమె ఈ పెళ్ళిని నిరాకరించినప్పటి నుంచీ, ఎవ్వరూ ఆమె సలహా తీసుకోడంలేదు.

ఇదంతా భగవంతుని లీల అనుకుని ఆమె మాట్లాడలేదు. ఆమె వాడలోని ప్రతి ఇంటికీ వెళ్ళి రమ, రమ అన్నగార్లనూ నిందించడం మొదలెట్టింది. కానీ ఏమీ లాభంలేకపోయింది. రమ వివాహ ముహూర్తం పెట్టివేశారు. వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుందర్ శుభలేఖలు చుట్టాలకు,

మిత్రులకూ, ఆఫీసులోని తోటి ఉద్యోగులందరికీ పంపించాడు. వాడలోని వారందరినీ కూడా పిలిచారు. లోకులు ఈ వివాహాన్నిగూర్చి చరణదాస్‌గారిని అడగటం ఆరంభించారు. "ఏమండీ? మీ ఆవిడ కోడల్ని రానివ్వనంటున్నారు. మరి పెళ్ళి ఎలా చేస్తున్నారు?"

చరణదాస్ శాంతంగా "ఈ వివాహానికి మా ఆవిడ అంగీకారం లేదండి. అయినప్పటికి ఆడపిల్లవారు, మగపిల్లాడి వారు అంగీకరించారు. నా ఉద్దేశ్యంలో వాళ్ళు బాగానే చేస్తున్నారు. మా ఇంట్లోకి కోడలు రాదు. అంతకంటే ఆమె చేసేది మాత్రం ఏముంది!"

ప్రజలందరూ నవ్వుకునేవారు. ఈ తమాషా చూడటానికి అందరూ పెళ్ళినాడు సమావేశమయ్యారు. సుందర్ స్నేహితులైన ప్లేయర్సు అందరూ వచ్చారు. వివాహంలో ఏవిధమైన అల్లరు చెయ్యొద్దని సుందర్ వాళ్ళతో చెప్పివుంచాడు.

వివాహం నిర్విఘ్నంగా సాగిపోయింది. సుందర్ భార్యను తీసుకుని ఆలయంనుంచి తిన్నగా రైలుస్టేషన్‌కు వెళ్ళిపోయాడు. చరణదాస్ వాళ్ళను బండి ఎక్కించి ఇంటికివచ్చే
...కి భార్య కైకేయిలా కోపగృహంలో పడుకొనివుంది. అది
...ాస్ పక్కన నవ్వాడు. సుందర్‌వల్లి ముఖం
...న్న భర్తను చూసి, "వివాహం

"అవునండి, దేవిగారూ! దీన్నిబట్టి చూస్తే వివాహం భగవంతుని దగ్గరనే నిశ్చయమైనట్టు తేలుతోంది. నీలాంటి ఆడవాళ్ళు పెళ్ళిళ్ళు చెయ్యనూలేరు, ఆపాలేరు."

"మీ సహాయం లేకపోతే ఈ పెళ్ళి జరిగేదేకాదు,"

"నువ్వన్నది నిజమే కాని నా మనస్సులో ఈ వివాహానికి ప్రేరణ కల్పించిందికూడా భగవంతుడే. సుందర్ రమను చేసుకుంటానని చెప్పినప్పుడే అతని సెలక్షను మంచిదనిపించింది నాకు. ఎవ్వరూ చెప్పనిదే నాకలా ఎందుకనిపించింది? భగవంతుడే ఈ విషయం నా మనస్సుకి నచ్చచెప్పాడని నా ఉద్దేశ్యం."

అయితే ఈ వివాహాన్ని వ్యతిరేకించమని నా మనస్సులో చెప్పింది ఎవరు?"

చూడవే! నీ ఉద్దేశ్యం భగవంతుడు కల్పించినదేగనుక అయితే వివాహం ఆగిపోయివుండేది. కానీ అది ఆగలేదు. అందుచేత నిన్ను ప్రేరేపించినది భగవంతుడు కాదు, పిశాచమని అర్థంచేసుకో."

"అయితే నా మనస్సులో భగవంతుణ్ణి చొరబడనీయలేదు కదా, పిశాచం భగవంతుడికన్నా బలమైనదా?"

"కాదు. కాని నువ్వు నా హృదయద్వారాన్ని ఎంత చిన్నదిగా చేసుకున్నావంటే అందులో భగవంతుని మహత్తు ప్రవేశించడానికి వీల్లేకపోయింది. ఇతరులకుకూడా భావాల్లు వుంటాయనే విషయం నువ్వెప్పుడూ తెలుసుకోలే...
కూడా గౌరవించాలి. అబద్ధమాడ...
చిన్నదయిపోతుందని నువ్వెప...—

"కాని సుందర్ కోడల్ని తీసుకుని ఆశీర్వచనకోసం నా దగ్గరకు వస్తాడనుకున్నాను."

చరణదాస్ నవ్వుతూ అన్నాడు, "అలా ఎందుకనుకున్నావు? వివాహం చేసుకోగానే మొదటిరోజునే తనభార్యను నీ తిట్లు వినిపించడానికి వస్తాడనుకున్నావా ?

"కాని నేను ఆశీర్వదించడానికి సిద్ధంగా కూర్చున్నాను. ఇదిగో చూడండి. కోడలికోసం ఏమి తీసిపెట్టానో" అంటూ తన తలదగ్గర పెట్టుకున్న మెడలో పెట్టుకునే కంటెని తీసి చూపించింది. "ఈ మంగళసూత్రం స్వయంగా కోడలుమెళ్ళో వేద్దామనుకున్నాను."

"అయితే నువ్వక్కడికి ఎందుకు రాలేదు. నిన్ను ఎవరు రావద్దన్నారు ?"

"నాకిప్పుడు అక్కడికి వచ్చేందుకు సిగ్గుగా వుంది."

"ఏం ?"

"నేను కోడల్ని బాగా తిట్టానుగా ?"

"ఇప్పుడే ఆశీర్వాదాలు ఇవ్వటానికి ప్రాయశ్చిత్తం చెయ్యవలసిందే. సుందర్ మళ్ళీ కోడల్ని తీసుకొని లాహోరు వస్తాడుగా, అప్పుడు ఇద్దువుగానిలే."

"అయితే వాడు వస్తాడా ?"

"కోడలుతల్లి, అన్నలు, అక్కలు ఇక్కడే వున్నారుగా. ఆమె వస్తుంది. సుందర్ కూడా వెంటవస్తాడు.

9

శబనమ్ ఉత్తరం వచ్చి ఆరునెలలుపైగా అయ్యింది. ...నందసె వెంబడించడం మానివేశాడు. సదా

వండ్ పుస్తకం "పరిస్తానుయాత్ర" తయారయి మార్కెట్టులో అమ్మకానికి వచ్చింది. ఆ పుస్తకం చదివి నచ్చినవాళ్లు వ్రావే ఉత్తరాలు సదానంద్‌కు వస్తున్నాయి. సదానంద్ తన విజయానికి సంతోషించి ఉత్సాహం వ్రాయడానికి ప్రయత్నం ఆరంభించాడు.

అతనింకా 'ఇనామిప్రెస్'లోనే పనిచేస్తున్నాడు. అందుచేత ఫిరోజ్ మొదలైనవాళ్ళెవ్వరూ కనబడడంలేదు. నెమ్మదిగా ఫిరోజ్, శబనమ్ తల్లి. ఫకీరుద్దీన్ మొదలైనవాళ్ళను మర్చిపోతున్నాడు.

ఒక రోజున అనార్కలి బజారులో తనకు లైబ్రరీలో శబనమ్ ఉత్తరం అందించిన అమ్మాయి కన్పించింది. ఇద్దరూ ఒక దుకాణం దగ్గర కలుసుకున్నారు. ఆమె సదానంద్‌ని చూడగానే నవ్వుతూ, "నన్ను గుర్తు పట్టారా?" అని అడిగింది.

సదానంద్ పరీక్షగా చూసి అన్నాడు, "అవును మీ స్నేహితురాలు ఎలా ఉందో చెప్పండి ? మళ్లీ ఉత్తరం ఏమీ రాలేదు".

"మీరు వ్రాసిన ఆఖరి ఉత్తరం ఆమెకు నచ్చలేదు."

"అందుకు చాలా విచారిస్తున్నా. కాని నేను చాలా సరళంగా వ్రాశాదు."

"మీరెంత సరళంగా వ్రాసినా, అర్థంచేసుకోనడానికి చదువరియొక్క విద్యాభ్యాసంపై వుంటుంది".

సదానంద్ ఆమె తెలివి తేటలకు ఆశ్చర్యపోయాడు ఆమె ముఖం చూస్తూ వుండిపోయాడు. దాని గి•

అడిగింది, "ఇంకా పోలీసులు మిమ్మల్ని వెంబడిస్తూనే వున్నారా ?"

"లేదనే నాఉద్దేశ్యం. ఎప్పుడూ ఎవరినీ చూడలేదు".

"నేను మీపుస్తకం "పరిస్తాని యాత్ర" చదివాను."

"మీ కెక్కడ దొరికింది ?"

"ఒకరోజున శబనమ్ చాలా ప్రశంసిస్తోంది. నేను ఒక బుక్ స్టాల్‌లో చూశాను. వెంటనే ఒక కాపీ తీసుకున్నాను. శబనమ్ చదివి వినిపించింది. చాలా రసమయంగావుంది."

"అయితే మీరు స్వయంగా చదవలేదా?"

"లేదు; నేను ఉర్దూ చదువుకోలేదు. హిందీవచ్చు."

"కాని ఆ పుస్తకంలోని భాషకూడా ఉర్దూయే,"

"నేను ఉర్దూ అర్థం చేసుకోగలను."

సదానంద్ సరుకులు కొంటూంటే సంభాషణ ఆగిపోయింది. ఆ అమ్మాయి కూడా పౌడరు, క్రీమ్ కొనుక్కుంది. సదానంద్ సరుకులు పొట్లం కట్టించి తీసుకుంటూంటే ఆ అమ్మాయి అంది. "నేను మిమ్మల్ని కలుసుకోవాలంటే లైబ్రరీలో కలుసుకోవచ్చా ?"

"నేను ప్రతిరోజూ అక్కడకు వెళ్తున్నా."

"అయితే ఏదో ఒకరోజున కలుసుకుంటాను."

ఒకరోజున ఆమె కలుసుకునేందుకు వచ్చింది. ఆమె కలుసుకోనడంవల్ల ప్రయోజనమేమీ వుండదని సదానంద్ ఉద్దేశ్యం. శబనమ్ ఎందుకో తనమీద కోపగించింది. అంచేత •. ఉత్తరం రాదు. ఉత్తరం రానప్పుడు ఆ అమ్మాయిని ...ం చేసేదేముంది.

అందుచేత" ఆమె వచ్చి తనప్రక్కనున్న కుర్చీలో కూర్చోగానే అతనికి ఆశ్చర్యం వేసింది. అతను ఏమిటి అన్నట్టుగా ఆమెవంక చూశాడు, ఆమె, "చదువుకుందామని కూర్చున్నాను." అంది.

"మీరు శబనమ్ ఉత్తరం తెచ్చారేమో అనుకున్నాను."

"నేను ఆమెతో చెప్పకుండానే వచ్చాను. నేనుమిమ్మల్ని కలుసుకునేందుకు వెళ్తున్నానని చెబితే ఆమె తప్పక ఉత్తరమిచ్చివుండేది."

"మంచిది." అని సదానంద్ పుస్తకం చదువుకుంటున్నాడు.

ఆమె, "ఏం చదువుతున్నారు ?" అనడిగింది.

"ఇది 'కథాసరిత్సాగరము' అనే ఒకవిఖ్యాత సంస్కృత గ్రంథము."

"అందులో ఏముంటుంది ?"

"చాలా మంచికథలున్నాయి."

"కాని ఇది ఇంగ్లీషులోవుందే ?"

"అవును. కాని, మూలం సంస్కృతంలోనే వుంది. ఇది ఇంగ్లీషు అనువాదము."

"అయితే నేనుకూడా చదవాలి."

సదానంద్ టైమవ్వగానే లేచి పుస్తకం యిచ్చివేసి వెళ్ళిపోతుంటే ఆమెకూడా బయటకు వచ్చేసింది. ఇద్దరూ కలిసి నడుస్తున్నారు.

"మీారెటు వెళ్తారు ?" అనడిగింది అవా

"ఏమైనా పనుందా?"

"అదే, మీ పుస్తకాన్ని గురించి అడుగుదామని."

"అడగండి. నా కిప్పుడేమీ పనిలేదు. తిన్నగా ఇంటికి వెళ్తున్నా."

"అయితే నడవండి. మీ ఇల్లుకూడా చూస్తాను."

సదానంద్ మాట్లాడకుండా నడుస్తున్నాడు. నడుస్తూ నడుస్తూ ఆ అమ్మాయి అంది, "మీరు మీ పుస్తకంలో గుణవతి అనే పాత్రను సృష్టించారు కదా, అటువంటి స్త్రీని మీరెప్పుడైనా చూశారా?"

"అందులో విచిత్రమైన విషయమేముంది? నేనామెను ఒక సాధారణ స్త్రీగానే భావిస్తున్నాను."

"గుణవతి తన తండ్రిని, అన్నగారిని కుమారుని చాలా ప్రేమిస్తుందే?"

"ఏ స్త్రీ అలా చెయ్యదు?"

"కాని ఆమె ప్రేమ సఫలం కాలేదుగా?"

"ప్రేమ సఫలమే అయ్యింది. ఆమె కష్టాలలో వున్నప్పుడు ముగ్గురూ ఆమె రక్షణకోసం వస్తారుగా?"

"అయితే ప్రేమయొక్క సాఫల్యం అంతేనా?"

"అది సాఫల్యత యొక్క బాహ్యచిహ్నము. ప్రేమ నేది దీపంలాంటి ఒక జ్యోతిర్మయభావము. ఒక దీపంతో ...లో దీపాన్ని వెలిగించవచ్చు, అలాగే ఒకరి హృదయం ...కొకరి హృదయంలో ప్రేమను ఉత్పత్తిచేయ ...దయాల్లోనూ. మానవునిలో

ప్రేమజ్యోతి జ్వాజ్వల్యమానమైనప్పుడు పరోపకారమనేది ఒక మామూలు లక్షణమయిపోతుంది.

"అదే గుణవతి చేసిందికూడాను. పరిస్తాన్ దేశంలో సౌందర్యోపాసన ఎక్కువగా జరుగుతుంది. అక్కడ సౌందర్యం అనేది శారీరక రూపురేఖల నాధారంగా చేసుకుని ఎంచబడుతుంది. గుణవతి ఈ ప్రపంచంనుంచి తప్పజారి పరిస్తాన్ చేరుకుంటుంది. అక్కడ జీవితం సులభంగా గడవటానికి అవకాశాలు, ఆ సుందరభూమిని చూసి తన తండ్రి అన్నగారు, కుమారులను అక్కడకే పిలిపిస్తుంది. ఇక్కడ ఆమె వారిని ప్రేమించినట్లే, పరిస్తాన్‌లోకూడా ప్రేమిస్తుంది, ఇక్కడ ప్రేమావుంది, ఈర్ష్యావుంది. పరిస్తాన్‌లో ప్రేమాలేదు. ఈర్ష్యాలేదు. అందరూ శృంగారంలో మునిగివున్నారు.

"గుణవతి ప్రేమను చూసి పరిస్తాన్ నివాసులు ఆమెను ఒక అద్భుత జంతువుగా చూడటం అరంభించారు. అక్కడ ప్రేమ అనేది ఒక్కరియెడలనే వుంటుంది. అంటే అది ప్రేమ కాదు కామమన్న మాట. గుణవతిలా తన కుమారుణ్ణి, అన్నను ఒకే విధంగా ప్రేమించే వ్యక్తు లెవ్వరూ వుండరు. పైగా ఆమె అక్కడవున్నవారిని ఒక అవహేళనాదృష్టితో చూస్తుండేది. అక్కడ అటువంటి దృక్పథం ఎవ్వారికీ వుండదు.

"అందుచేత పరిస్తాన్‌లో గుణవతి జీవితం విచిత్రంగా తయారయ్యింది." ఆమె జీవితం పంజరంలో ..

తయారయ్యింది.

"ఇది నేను వ్రాసిన కథ. విలక్షణం అనేది గుణవతిలో లేదు, పరిస్తాన్‌లోని ఆచార - వ్యవహారాలలో వుంది."

"అయితే మీరు ఈ ప్రపంచంలో ప్రేమ, ఈర్ష్యల మేళవింపుతో కూడుకున్న జీవన పద్ధతినిఆలోచనా వ్యవహారా మెచ్చుకుంటారా ?"

"నేను దేనిని మెచ్చుకుంటాను ? దేనిని మెచ్చుకోను, అనే విషయాలు చెప్పేందుకు పుస్తకం వ్రాయలేదు. పరిస్తాన్‌లో వర్ణించినటువంటి ఒక కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించాను. అక్కడకు మానవుడుకనుక చేరుకున్నట్టయితే ఎటువంటి పరిస్థితులకు లోనవుతాడో వ్రాయటానికి ప్రయత్నించాను. మంచీ, చెడ్డలనుగురించి చెప్పాలని నా అభిప్రాయం కాదు.

"మీరు రెండవ వుత్తరంలో హిందుధర్మాన్ని గురించి చేసిన వ్యాఖ్య అసత్యం కాదా ?"

"అందులో అసత్యమేముంది ? వాస్తవానికి మీరు ధర్మమంటే మతమనే దృష్టితో చూస్తుంటారు. ధర్మానికీ మతానికీ అంతర్యం వుంది. హిందూఅనేది ఒక మతంకాదు. హిందూధర్మము. ధర్మం ఆచరణకు సంబంధించినది. కాని భావాలతో కాదు.

ఆచరణ అనేది వ్యక్తిగత భావాల నాధారంగా చేసుకుని పెరగదు.

అది సమాజంయొక్క సామూహిక నిర్ణయాల అధీ...కుంది. భావాలనేవి అలాకాకుండా వ్యక్తి ...ాద ఇతరులకు అధికారముండదు,

మతమనేదిభావాలయొక్క సంగ్రహం. ఒకరకమైన భావాలను అంగీకరించేవారు, ఒకమతస్థులు అవుతారు. కాని ఒకరకమైన ఆచరణను పాటించే వారందరూ ఒక ధర్మంయొక్క అనుయాయులవుతారు.

"ఉదాహరణకు గోమాంస భక్షణ హిందువులలో విసర్జించబడింది. అదిఒక ఆచరణ. ఇది హిందూ సమాజంలో ఆచరణగా వున్నంతకాలం గోమాంస భక్షణచేసేవారందరూ అహిందువులుగా అయిపోతుండేవారు.

"హిందువులలో అభిప్రాయభేదాలమీద అనేక సమూహాలు ఏర్పడ్డాయి. వైష్ణవులు, శైవులు, శాక్తులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు, ఆర్యసమాజీకులు మొదలైన అనేకమంది వున్నారు. పైగా ఈమతాలలో అనేక మతాంతరాలుకూడా వున్నాయి. అయినప్పటికీ వీరందరూ, హిందువులే. అందుచేత వీరు భావైక్యతను, ఆచరణ ఐక్యతను వేరువేరుగా చూస్తుంటారు. భావవిభేదాలను పురస్కరించుకుని ఒకరిలో ఒకరు దెబ్బలాడుకోరు. అందుచేత ఆచరణ అనేది ధర్మానికి మూలమైనది.

"ఒక్క విషయం చెబుతాను. ఒక క్రైస్తవుడు టెన్ కమాండ్ మెంట్సు ఆశించినంతమాత్రాన హిందువుకాదు. అతని ఆచార వ్యవహారాలు హిందువుల ఆచారవ్యవహారాల నుంచి విభిన్నం కాబట్టి అతను అహిందువు అవుతున్నాడు. ఈనాడు హిందూదేశంలోని క్రైస్తవమతం అవలంబి... వారందరూ హిందూసమాజంయొక్క ఆచార... టినీ విడిచిపెట్టేశారు."

"ఏయే ఆచారాలను విడిచిపెట్టేశారు!

"అన్నపానాదులలో శుద్ధతను సగోత్రవివాహాల నిషేధం, వివాహ విచ్ఛేదనిషేధం మొదలయినవన్నీ విడిచిపెట్టేశారు. ఈ విషయాలన్నీ హిందూధర్మాచార్యులు నిర్ణయించినవి. ఆ హిందూ విద్వాంసులు నియమించిన ఆచారాలను విడిచిపెట్టయ్యాగానే వారు హిందువులనుంచి దూరమయిపోయారు."

ఆ అమ్మాయి సదానంద్ మాటలను శ్రద్ధగావింటోంది. సదానంద్ ఇల్లు చేరుకున్నారు. సదానంద్ నుంచొని అన్నాడు, "ఇదేనండి మా ఇల్లు. మేము చాలా బీదవాళ్ళం. మీరు అందుకు ఫరవాలేదంటే రండి భోజనం చేద్దాం, ఇది భోజనసమయం".

"వద్దు ఈరోజు వద్దు. మరొకరోజు వస్తాను. ఈవేళ మనిద్దరిపరిచయం ఆరంభమయ్యింది. ఎంతవరకూ వెళ్తుందో."

"నేననుకోవడం పరిచయం ఇంకా ఆరంభంకా లేదనే. ఇంకా మీరు మీ పుట్టుపూర్వోత్తరాలు చెప్పారుకాదు."

"ఓ! నేను మర్చేపోయాను. క్షమించండి. మీరు నాకు ముందే తెలుసు. ఇల్లుకూడా చూశాను. నేను ఇక్కడివరకూ రాకముందే నాపేరు చెప్పివుండవలసింది. నాపేరు శాంతి పీటర్. నేను శ్రీ గుర్దాదాస్‌పీటర్ గారి చెలెల్ని. ఆయన క్రిస్టియన్ కాలేజీలో హిస్టరీ ప్రొఫెసరు. నేను క్రిస్టియన్ గరల్స్‌స్కూలులో టీచర్‌ను."

"నేను నా తప్పును దిద్దుకున్నాననుకుంటాను. మరొక మీ దర్శనం చేసుకుంటాను. ఇక వస్తాను."

10

శాంతిపీటర్‌తో పరిచయం సదానంద్‌కి ఒక నూతన అనుభవాన్ని కలుగజేసింది. ఆమె అరగంటకుపైగా మౌనంగా అతని మాటలు వింటూంది. ఆమె ఏకాగ్రతతో అలా వింటూండం కేవలం సభ్యతకోసమేనా లేక తన భావాలను అర్థంచేసుకుంటోందాఅన్న సందేహం సదానంద్ మనస్సులో ఉదయించింది. మళ్ళీ కలుసుకున్నప్పుడు దానికి సమాధానం తెలుసుకుందామనుకున్నాడు. అందుచేత తరువాత కలయిక కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు.

ఆశించినదానికంటె ముందే ఆమె వచ్చింది. సదానంద్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తాడని, మూడు నాలుగు గంటలవరకూ ఇంటిదగ్గర వుంటాడన్నసంగతి ఆమెకు తెలుసు. అందుచే ఒకరోజున రెండు గంటలకు అతని ఇల్లు చేరుకుంది.

సదానంద్ భోజనానంతరం విశ్రాంతి తీసుకుని, చమేలీకి చదువు చెబుతున్నాడు. ఈమధ్య చమేలీ 'హితోపదేశము' అనే పుస్తకం చదువుతోంది.

చమేలీ చదువుకుంటూంటే ఎవరో క్రింద తలుపులు కొట్టారు. ప్రభ ఈ మధ్య స్కూలుకు పోవడంలేదు. కిటికీలో నుంచి ఎవరా అని తొంగి చూసింది. ఆమె చూసి, ఒక అమ్మాయి వచ్చిందని, సదానంద్‌ని అడుగుతోందని చెప్పింది. ఆమె శాంతి అయ్యుంటుందనుకున్నాడు సదానంద్. ప్రభను వెళ్ళి ఆమెను తీసుకురమ్మని చెప్పాడు. అతను చమేలీకి విగ్రహమనే భాగంనుంచి పాఠం చెబుతున్నాడు.

ప్రభ వెళ్ళి శాంతిని పైకి తీసుకువచ్చింది.

"రండి శాంతిదేవిగారూ!" సదానంద్ అన్నాడు, "నేను మీకు మా కుటుంబాన్ని పరిచయంచేస్తాను."

శాంతి కడుపుతోవున్న చమేలీ ప్రక్కన కూర్చుంది. ప్రభ ఇద్దరి వెనకాల కూర్చుంది. లక్ష్మి ఇంటిమీద బట్టలు ఆరవేస్తోంది. సదానంద్ అన్నాడు, "ఈమె మా వదిన. నా చిన్ననాటి స్నేహితురాలు: పేరు పుష్పావతి."

శాంతి రెండు చేతులతో నమస్కారం చేసింది. సదానంద్ అన్నాడు.

"ఈమె నా చెల్లెలు ప్రభ. ఈ మధ్య ఇంటిపనులు చేస్తోంది. పైగా తన కవల రమవియోగంతో ఏడుస్తూ కూర్చుంటోంది."

ప్రభ కోపంగా సదానంద్‌వంక చూసింది. కాని వెంటనే నవ్వు తెచ్చుకుని ఆమెకు నమస్కారం చేసింది.

సదానంద్ అన్నాడు, "మరొక వ్యక్తి వున్నారు. ఆమె మా తల్లి. ఇప్పుడు ఆమె ఇంటిమిద్దెమీద ఏదో పనిచేస్తుంది. ఆమెను పరిచయం చెయ్యడం అత్యంతావసరం. ప్రభా! అమ్మను పిలుచుకురా"

ప్రభ పైకి వెళ్ళింది. శాంతి అంది, "మీ చెల్లెలు ఇంటి పని చేస్తుందన్నారుకదా, మరి మీ వదిన ఏంచేస్తారు?

"అయితే నేనేమి చేస్తున్నానో మీకు తెలియలేదా:" నవ్వుతూ చమేలి అంది, "నేను ఈయన అన్నగారి ప్రతిరూపాన్నొకదానిని తయారు చేస్తున్నా" ముగ్గురూ నవ్వుకున్నారు. శాంతి అంది, "నేనివేళ ఒక సందేశం తీసుకువచ్చాను."

"శబనమ్‌దగ్గరనుంచా? అయితే ఇలా ఇవ్వండి"

"నోటితో చెప్పాల్సిందే."

"ఏమిటి?"

ఈవేళ మీరు ఆమెతో టీ తీసుకునేందుకు రావాలి"

"ఆమెతోనా? ఆమె ఇల్లు ఎక్కడ?"

"ఆమె వుండటం... జలంధర్‌లో కాని నన్ను కలుసుకునేందుకు వస్తూవుంటుంది. ఈవేళ ఆమె వచ్చింది. నేను మిమ్మల్ని కలుసుకో బోతున్నానని చెప్పగానే, మిమ్మల్ని టీకి ఎందుకు పిలువకూడదన్నది? అన్నయ్య ఒప్పుకున్నారు. అందుచేత మిమ్మల్ని పిలవడానికి వచ్చాను."

"అయితే వెళ్దాం. ఒక్కదారిని రెండుపనులూ అవుతాయి. శబనమ్‌ను చూసినట్టవుతుంది. మీఅన్నగారితోనూ పరిచయం చేసుకోవచ్చు."

తల్లి క్రిందకురాగానే సదానంద్ శాంతిని ఆమెకు పరిచయం చేశాడు. లక్ష్మి టీ తీసుకోమని అడిగింది. కాని అది టీ సమయం కాదు. లక్ష్మి కూర్చోగానే శబనమ్ ప్రస్తావన వచ్చింది? శాంతి అంది, "ఆమె ఎక్కడ వున్నదీ చెప్పడానికి నాకు అధికారం లేదు. అది ఆమె స్వంత రహస్యం.

"అయినప్పటికీ ఆమె ఘోరతపస్సు చేసిందన్న విషయం ఒప్పుకో వలసిందే. ఇప్పుడు ఆ తపస్సు ఫలితం అనుభవించే సమయం దగ్గరకు వచ్చింది. కొద్ది నెలలలోనే ఆమెకు ఇరవైయొక్క సంవత్సరాలువస్తాయి: అప్పుడు ఆమె తల్లి థంంనుంచి బయట పడగలదు."

"నేను ఇప్పుడు ఆమెను కలుసుకునేందుకు వెళ్తున్నా. ఆమె ఇప్పుడప్పుడే బయటకురగటం ప్రమాదకరమే. ఎవరైనా గుర్తుపట్టినట్లైయితే పెద్ద సమస్య ఎదురవుతుంది."

శాంతి చిరునవ్వు నవ్వింది. ఇద్దరూ ఇంటినుండి బయటకురాగానే సదానంద్ అడిగాడు, "ఎటు వెళ్ళాలి ?"

"చర్చిరోడ్డున ఒక ఇంట్లో సగం పోర్షనులో వుంటున్నారు. అటే వెళ్ళాలి,"

ఇద్దరూ జట్కా కట్టించుకున్నారు. బండిలో సాహిత్య విషయాలే మాట్లాడారు. హైకోర్టుకు వెనుకాల ఒక పెద్ద చర్చివుంది. శాంతి అన్నగారియిల్లు దాని ప్రక్కనే వుంది, సగభాగంలో ఒక వకీలుగారు వుంటున్నారు. తక్కిన సగభాగంలోనూ దుర్గాదాస్ పీటర్ వుంటున్నాడు. వకీలుగారి పేరు సయ్యద్ అమీర్ ఖాన్. ఆయన వయసు నలభై ఏళ్ళు పైబడివుంటుంది. వకీలుగారికి ఒక కూతురు ఉంది. ఆమె పేరు సయీదా. ఆమె క్రిస్టియన్ కాలేజీలో బి. ఏ. చదువుతోంది. ఆమె హిస్టరీతీసుకుంది. దుర్గాదాసుగారి శిష్యురాలు. వాస్తవానికి అందువల్లనే ప్రొఫెసర్ గారికి ఈఇల్లు దొరికింది.

సయీదా బాగా అందంగా వుంటుంది. ఆమె ప్రొఫెసర్ గారితో ఏదో సంబంధం పెట్టుకున్నట్టుంది. ప్రొఫెసర్ గారు ఈఇంట్లోకి వచ్చినప్పటినుంచీ సయీదా ఆయనచుట్టూ తిరుగుతోంది సయ్యద్ అమీర్ ఖాన్ గారు ఇదంతాచూసే మాట్లాడక ఊరుకున్నాడు.

ఈవేళకూడా ఆమె ప్రొఫెసర్ గారిని కలుసుకునేందుకు వచ్చింది. ప్రొఫెసర్ గారు ఏదో పనిమీద బయటకువెళ్ళారు.

శబనమ్, సయీదాలిద్దరూ మాట్లాడుకుంటున్నారు. శాంతి. సదానంద్‌లిద్దరూ రాకమునుపే శబనమ్ సయీదాకు తన పూర్తి వృత్తాంతం చెప్పింది.

శబనమ్ ఒక అనాథ స్త్రీ యని, జలంథర్‌లో క్రైస్తవుల అనాథాలయంలో వుంటోందని సయీదాకి తెలుసు. ప్రొఫెసర్‌గారే ఆమెకు అనాథాలయంలో ప్రవేశం ఇప్పించారు. అందుచేత శబనమ్ ఆయనకు చాలా కృతజ్ఞురాలు. కాని ఆమె తరచుగా జలంథర్‌నుంచి వచ్చి ప్రొఫెసర్‌గారి ఇంట్లో ఒకటిరెండు రాత్రులు గడపడం సయీదాకు నచ్చలేదు. అందుచేత శబనమ్ విషయంలో పూర్తి వివరాలు సేకరించాలనుకుంది.

శబనమ్ ఈ రోజు చాలా ఆనందంగా వుంది. ఒక పెద్ద ఇంటి మహమ్మదీయుల అమ్మాయితో తాను స్నేహం చేసుకుంటున్నాననుకుంది. అందుచేత వెంటనే తన చరిత్రనంతటినీ ఆమెకు చెప్పివేసింది. సయీదా ఆమె యెడల పూర్తి సానుభూతి చూపించింది. కాని శబనమ్ తన కథయొక్క ఆఖరుభాగం చెబుతూంటే సయీదా ముఖం ఎఱ్ఱబడిపోయింది. శబనమ్ అంది, "నేను పండిత సదానంద్‌ని కలుసుకుని ఇంటికి వెళ్ళగానే గదిలో నజీర్, ఫకీరుద్దీన్ మాట్లాడుకుంటున్నారు. నేను బయటేనుంచుని వారిమాటలు విన్నాను. ఫకీరుద్దీన్ అంటున్నాడు, ఒక యువతికిగాని యువకునికిగాని వివాహం చేసుకోవాలని బుద్ధిపుట్టినప్పుడు పెళ్ళి చేసుకోకుండా వుండకూడదు. ఈ వేళ నజీర్‌కు ఏమిజరిగిందో చూడు. ఒక హిందూ స్త్రీపడ జోళ్ళు కొనేందుకు వచ్చింది. కాస్త కళ్ళుత్రిప్పి, పళ్ళు

చూపించగానే మనవాడు మోహంలో పడిపోయాడు. అంతే. ఆమె ఆ జోళ్ళను డబ్బివ్వకుండా తీసుకుపోయింది. ఆమె చెప్పులు తీసుకుని వెళ్ళిపోతూ ఒక అడ్రసు ఇచ్చింది. డబ్బు వసూలు చేసేందుకు అడ్రసుగల చోటికి వెళ్ళేసరికి అటువంటి అమ్మాయి ఎవ్వరూ లేరన్నారు.

"ఈకథ విని మాఅమ్మ నవ్వింది. ఆమె నేను ఇంటి దగ్గర విడిచిపెట్టిన చెప్పులు తీసుకువెళ్ళి, 'ఈ జోళ్ళేనా లేక మరేవైనా ఇంకొకరికి ఇచ్చావా ?" అని అడిగింది,

"ఆజోళ్ళు చూడగానే నజీర్ స్తబ్ధుడైపోయాడు. ఫకీరుద్దీన్ అన్నాడు, 'అయితే ఇతన్ని మూర్ఖుణ్ణిచేసి జోళ్ళు తెచ్చినది శబనమ్ ఏనా ! అటువంటప్పుడు ఇక ఆలశ్యం చెయ్యడం మంచిదికాదు. శబనమ్‌కి రెక్కలు వచ్చాయి. ఇక ఆమె బజారున పడుతుంది. నేను మౌలవీని పిలిచి వచ్చాను. అతను రాగానే వివాహం చేసేద్దాం.'

"నేను ఫిరోజ్‌తో నాగదిలోకి వెళ్తున్నాని చెప్పి, నేను వివాహానికి సిద్ధంగా లేననికూడా చెప్పాను. అతను గదిలోకి వెళ్ళగానే వెనుక్కు తిరిగి తిన్నగా రత్నచంద్ రోడ్డుమీద మిషన్‌బంగళాకు చేరుకున్నాను. అక్కడ ఫాదర్ డేవిడ్‌ని కలుసుకుని కథంతా చెప్పాను.

"అప్పటినుంచీ దాక్కుని జలంధర్ అనాథాలయంలో వుంటున్నాను. అప్పటినుంచి నా దృష్టిలో బాగా మార్పు వచ్చింది. ఫాదర్ విలియమ్స్ హిందువులను ఒక పనికిమాలిన జాతిగా ఎందుకు అనేవారో నాకు అర్థమవుతోంది. ఎందుచేతనంటే సదానంద్ కాని, లేక ఎవరైనా హిందువులు కాని నాకు

సహాయం చెయ్యలేకపోయారు. నేను సదానంద్‌ని చేసుకో వాలనుకున్నా. కాని అతను ఫిలాసఫీ చెప్పడం మొదలెడు తున్నాడు. ఆతను నన్నుహిందూస్త్రీవలె మారమంటున్నాడు. పైగా నేను మేజర్ అయిన తరువాత వాళ్ళఇంట్లో వాళ్ళతల్లి పరీక్షించేందుకు వుండాలట. వీటన్నిటితోనూ నా మనస్సు విరిగిపోయింది. నాలుగుసంవత్సరాల నుంచీ నేను అతనికోసం ఎదురుచూశాను. కాని ఇంకా వాళ్ళ తల్లి సంరక్షణ క్రింద వుండాలిట.

"నాకు హిందువులకంటె క్రైస్తవులే మంచివాళ్ళుగా కన్పిస్తున్నారు. ప్రొఫెసర్‌గారు నన్ను ప్రేమిస్తోన్నారు. నేను మేజర్ కాగానే మేము పెళ్ళిచేసుకుంటాము. అసలిప్పుడే 'మాన్ అండ్ వైఫ్' లా వుంటున్నాం."

ఈ మాటవినగానే సయీదాముఖం ఎఱ్ఱబడి పోయింది. ఆమె ఇంకా అవివాహిత కాబట్టి వివాహానికిముందే 'మాన్' అండ్ లైఫ్' మాట వినగానే సిగ్గుపడుతుందేమో ననుకుంది శబనమ్. అమె ఈ విషయంలో ఇంకా ఏదో చెబుదామను కుంటూంటే శాంతి, సదానంద్ లిద్దరు వచ్చారు. సదానంద్‌ని చూడగానే సయీదా ఆశ్చర్యపోయింది. అతను పచ్చని. నిండైన విగ్రహం. అతని ముఖంలో ఒక విధమైన తేజస్సు వుంది. అది చదువుకున్న యువకులలో చాలా తక్కువ మందిలో వుంటుంది. కాని శబనమ్ అతను చాలా బీదవాడని చెప్పింది. నకళ్ళు వ్రాయటంద్వారా రోజుకు రెండుమూడు రూపాయలు సంపాదిస్తున్నాడట. ఆ విషయం జ్ఞప్తికి రాగానే

సదానంద్‌ని చూడగానే ఆమెలో ఏర్పడిన ఉత్సాహం సన్నగిలిపోయింది.

శాంతి సయీదాను పరిచయంచేసింది. ఇక వారందరూ ప్రొఫెసరుగారిరాక కోసం ఎదురుచూస్తున్నారు. సదానంద్ శబనమ్‌తో మాట్లాడుతున్నాడు. శబనమ్ అంది, "వచ్చే నెలలో నేను మేజర్ అవుతున్నాను. అప్పుడు నేను బాహాటంగా నా యిష్టం మొచ్చినవారిని చేసుకోవచ్చు. అందుచేత వివాహవిషయంలో మీ అభిప్రాయాలు ఒకసారి విందామని మిమ్మల్ని పిలిపించాను.

"నా అభిప్రాయాలలో మార్పేమీ రాలేదు. నాభార్య పవిత్రంగా వుండాలి. అందుకుగాను ఆమె నా తల్లి అధీనంలో వుండాలి."

అది చాలా కష్టమైనపని. నేను అంతవరకూ వేచివుండలేను. నా వివాహం నా ఇరువయ్యొకటవ జన్మదినోత్సంనాడు జరుగుతుంది."

"శబనమ్! చాలా సంతోషం. నన్నుకూడ పెళ్ళికి పిలిచినట్లయితే ధన్యవాదాలు చెప్పేందుకు వస్తాను."

శబనమ్ మనస్సులో ఏదో ఆలోచించుకుంటోంది. సదానంద్ అడిగాడు, "వివాహం లాహోరులోనే జరుగుతుందా లేక ఎక్కడైనా, బయటా?"

జలంధర్‌లోని అనాథాలయం చర్చిలో జరిగినట్లయితే బావుంటుందనుకుంటాను. అదే నిశ్చయించుకునేందుకు వచ్చాను."

ఆమె ప్రొఫెసర్ గారితో నిశ్చయించేందుకు వచ్చిందనుకున్నాడు సదానంద్. వరుడు ప్రొఫెసర్ గారే అయ్యుంటారని అతను అనుకున్నాడు. దానితో అతని మనస్సుకు శాంతిలభించింది. తనేగనుక శబనమ్‌ని వివాహం చేసుకోవలసివస్తే చాలా విషయాలు పరిష్కరించవలసి వుండేది. ఒక మహమ్మదీయ యువతిని, ఒక హిందూయువకుడు, అదయినా లాహోరు అంతటిలోనూ ప్రసిద్ధకవిగా పేరుపొందిన తనుచేసుకోనడం చాలా అలజడి పుట్టిస్తుంది.

సదానంద్ వరుడెవరు అనేవిషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నంచెయ్యలేదు. ఆమెతో తన వివాహంకాకుండా వుండటమే మంచిదనుకుని తృప్తిపడ్డాడు. అతను మాట మారుస్తూ అన్నాడు. "నేను మీ యమ్మమీద నమ్మకంతో నీ ఉత్తరం చూపించాను. ఆమె నా ఎదుట తనుచేసినదానికి పశ్చాత్తాపపడుతూండేది. కాని ఉత్తరం పోలీసులకు అందించింది. అంతే పోలీసులు నా వెంటబడ్డారు."

"మా అమ్మ విషయం అలా వుంచండి. నాకామె సంగతి వినాలని లేదు."

"సరే. తరువాత నేను ఫకీరుద్దీన్ దగ్గర నౌకరీ మానేశాను. దానితో మీ యమ్మ దర్శనమే కాలేదు."

శబనమ్‌మాట మార్చివేసింది. ఆమె అంది, "నేనీవేళ రాత్రి తొమ్మిదిగంటలబండికి వెళ్తున్నా. మీరునాతో స్టేషను వరకూరాగలరా?"

"నువ్వు రమ్మంటే వస్తాను."

ఇంతలో ప్రొఫెసర్ దుర్గాదాస్ వచ్చారు. శాంతి సదానంద్‌ని పరిచయం చేసింది. ఇద్దరూ చేతులు కలిపి కూర్చున్నారు. ప్రొఫెసర్‌గారు రాగానే టీ ఏర్పాటుచేశారు. ఇంతలో సయ్యద్ అమర్‌ఖాన్‌గారుకూడా వచ్చారు. ఈ పార్టీలో దుర్గాదాస్ వచ్చేనెల పదవతారీఖున శబనమ్‌తో తన వివాహం జరుగుతుందని తెలియపర్చారు. వకీలుగారు కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు. అప్పుడే సయీదా లేచి టాయిలెట్ గదిలోకి వెళ్ళిపోయింది. అక్కడ రెండు నిమిషాలుండి తిరిగి పార్టీలోకి వచ్చింది.

టీ త్రాగినతరువాత ఒకగంట మాట్లాడుకున్నారు. శబనమ్ జన్మదినోత్సవంరోజున దుర్గాదాస్‌తో ఆమె వివాహం కావడం నిశ్చయమైపోయింది.

11

శబనమ్ వెళ్ళే బండి రాత్రితొమ్మిదిగంటలకు బయలుదేరుతుంది. సదానంద్, శబనమ్ ఇద్దరూ ఎనిమిదిగంటలకు ఇంటినుంచి జట్కాలో బయలుదేరారు. బండిలో శబనమ్ ఏదో అపరాధం చేసినట్టుగా బాధపడుతోంది. సదానంద్ ఆ విషయాన్ని గమనించాడు. అందుచేత అతనన్నాడు, "శబనమ్? నీ మనస్సు ఏదో బాధపడుతూన్నట్టుంది. కారణం ఏమిటో తెలుసుకోవచ్చా."

"రెండు కారణాలున్నాయి. నేను మిమ్మల్ని ప్రేమించానని చెబుతూ వచ్చాను. కాని ప్రొఫెసర్‌గారని పెళ్ళిచేసుకోడానికి అంగీకరించాను."

"శబనమ్! మానవుడు తన మనస్సులోని విషయాన్ని గ్రహించడంలో ఒకొక్కప్పుడు తప్పటడుగు వేస్తూంటాడు. ప్రస్తుతం నువ్వు ఆ తప్పును ముందే సరిదిద్దుకున్నందుకు చాలా సంతోషించాలి."

"నేను నా విషయంలో చెప్పడంలేదు. మిమ్మల్ని నిరాశపెట్టినందుకు బాధ పడుతున్నా."

"దానిని నిరాశ అనుకోవలసిన పనిలేదు. నువ్వు నా పరీక్షలో కృతార్థురాలవైనట్లయితే నిన్ను తప్పకుండా చేసుకునేవాణ్ణి. కాని ఇప్పుడు ఏమీ నిశ్చయించుకోలేదుగా. నువ్వు పరీక్షలో హాజరు కానేలేదు. అటువంటి పరిస్థితుల్లో ఈవేళ నీ మాట వినగానే నిరాశ కాదుకాని, హైరానుమాత్రం పొందాను.

"హైరాను ఎందుకంటే నువ్వు ప్రేమ విషయంలో చాలా తొందరపడి నిర్ణయం తీసుకుంటున్నావు. కాని ఇప్పుడైనా నువ్వు సరియైన నిర్ణయం తీసుకున్నందుకు చాలా సంతోషిస్తున్నా." ఇద్దరూ స్టేషను చేరుకున్నారు.

శబనమ్ సెకండ్ క్లాస్ టికెట్టు తీసుకుంటూంటే సదానంద్ దృష్టి ఒకవ్యక్తిమీదపడింది. అతను సి.ఐ.డి. పోలీసని అనుమానం వచ్చింది. ఆతను వారిద్దరిని చూడగానే స్టేషన్లోని పోలీసు స్టేషన్వైపుకు వెళ్ళడం కూడా చూశాడు. సదానంద్‌కి వెంటనే విషయమంతా అర్థమయ్యింది. శబనమ్ ఇంకా మైనరే. అందుచేత ఆమె తల్లి యిచ్చిన రిపోర్టు ననుసరించి పోలీసులు ఆమెను పట్టుకోవచ్చును. తను ఆమెవెంట వుండటం మంచిదికాదు. అందుచేత వెంటనే అతను

"శబనమ్, నువ్వు ప్లాట్‌ఫారంమీదికి వెళ్ళు. నేను వెంటనే నీ దగ్గరకు వస్తాను."

శబనమ్ ఏదో అందామనుకుంది. కాని సదానంద్ అదేమీ వినకుండా ఒకటవనంబరు ప్లాట్‌ఫారమ్‌కి వెళ్ళిపోయాడు. శబనమ్ బండి మూడవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌నుంచి బయలుదేరుతుంది. ఆమె వంతెన ఎక్కి వెళ్ళవలసివుంటుంది. సదానంద్ జనసమూహంలో కలిసిపోయి చూస్తున్నాడు. పోలీసులు ఆమె వెనుకాల నడుస్తున్నారు. ఆమె వంతెన దిగగానే ఆమెను చుట్టుముట్టారు.

సదానంద్ అక్కడనుంచి వెళ్ళిపోవడమే మంచిదనుకున్నాడు. అతను అక్కడనుంచి ఏడవ ప్లాట్‌ఫారమ్‌మీదికి వచ్చి అక్కడ గేటుదాటి బయటకు వచ్చేశాడు. బయటకు రాగానే జట్కా కట్టించుకుని తిన్నగా దుర్గాదాస్‌గారి ఇల్లు చేరుకున్నాడు. అక్కడ శాంతివుంది. ప్రొఫెసర్‌గారు ఏదో పనుండి బయటకు వెళ్ళారు. సదానంద్ విషయమంతా శాంతికి చెప్పాడు. శాంతికి ఒకవిషయం తట్టింది. ఆమె ఒక కాగితం మీద విషయమంతా వ్రాసి తన అన్నగారి టేబిల్ మీద వుంచి సదానంద్‌తో మిషన్ బిల్డింగుకు ఫాదర్ డేవిడ్‌ను కలుసుకునేందుకు వెళ్ళింది. ఫాదర్ డేవిడ్ నిద్రపోయేందుకు బెడ్‌రూములో ప్రవేశిస్తున్నాడు.

సదానంద్ జరిగినదంతా చెప్పగానే ఆయనన్నాడు, "నువ్వు ఆమె వెంట వెళ్ళకూడదు. నిన్ను పోలీసులు గుర్తుపట్ట గలరు. నీవల్లనే పోలీసులు శబనమ్‌ని గుర్తుపట్టివుంటారు."

ఆయన ఇనస్పెక్టర్-జనరల్ మిస్టర్ స్మితికి టెలిఫోను చేశాడు. ఆయన ఎంక్వాయిరిచేసి ఇప్పుడే చెబుతానన్నాడు. డేవిడ్ అన్నాడు, "మిస్టర్ స్మిత్! ఆ అమ్మాయి మేజర్. ఇప్పుడు క్రిస్టియన్ అయిపోయింది. ఆమెను కస్టడీలో పెట్టవద్దని నాకోరిక. నేను ఆమెకు జామీను ఇచ్చేందుకు సిద్ధంగా వున్నాను. ఆమెను మిషన్ బిల్డింగ్ కి పంపించవలసింది."

పదినిమిషాల తరువాత ఇనస్పెక్టర్-జనరల్ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. అయనన్నాడు, "ఫాదర్ డేవిడ్! స్టేషన్లో అమ్మాయి ఒకతనుతో కన్పించింది. పోలీసులు ఇద్దర్నీ పట్టుకోవాలనుకున్నారు. కాని ఆ అబ్బాయి బయటినుంచే తిరిగి వెళ్ళిపోయినట్టున్నాడు. అందుచేత ఆ అమ్మాయిని మాత్రమే పట్టుకోగలిగారు.

"అయితే కూడావచ్చిన ఆ అబ్బాయి ఎవరు?

"సదానంద్ అనే ఒకహిందువు. అతను మహమ్మదీయ అమ్మాయిలను హిందువులుగా మార్చేందుకు ప్రయత్నిస్తుంటాడు."

ఫాదర్ డేవిడ్ నవ్వుతూఅన్నాడు, "ఈ పోలీసువాళ్ళు ఏమికథలల్లుతారయ్యా! ఈ అమ్మాయి జలంధర్ లో క్రిష్టియన్ అనాథాలయంలో వుంటోంది. ఆమె తండ్రిలేడు, అమె తల్లి ఆమెచేత వేశ్యావృత్తి చేయించాలనుకుంటోంది. అమ్మాయి పారిపోయివచ్చి అనాధాలయంలో ఆశ్రయంతీసుకుంది. ఈ విషయం జరిగి మూడుసంవత్సరాలైంది. ఇవేళ తనకాబోయే భర్తతో వివాహం నిశ్చయించుకునేందుకు వచ్చింది. తిరిగి తొమ్మిదిగంటలకు జలంధర్ వెళ్తోంది. ఆమె వెంట వున్నది

ఆమెను కాబోయే భర్తయొక్క నౌకరు. అమ్మాయిని పట్టు కొనడంచూసి పారిపోయి అతనిక్కడికి వచ్చాడు."

ఇనస్పెక్టర్ జనరల్ కొంచెం ఆలోచించి అన్నాడు, "ఆమెను విడిచిపెట్టమని నే నిప్పుడే ఆర్డరువేస్తాను. కాని ఎప్పుడైనా ఆమె అవసరం అయితేమట్టుకు మీరు హాజరు చెయ్యవలసివుంటుంది."

"అలాగే! హాజరుచేసే బాధ్యత నాది."

"అయితే బండి తీసుకుని నంబర్-3 పోలీసుస్టేషన్‌కి వెళ్ళండి. అమ్మాయిని మీకు అప్పగిస్తారు."

ఫాదర్ డేవిడ్ బండి తీసుకుని స్టేషన్‌కు వెళ్ళారు. స్టేషన్‌లో శబనమ్‌తల్లి, ఫకీరుద్దీన్ వున్నారు. ఒక క్రిష్టియన్ ఫాదర్ శబనమ్‌ని తీసుకువెళ్ళడానికి రావడంచూసి ఆశ్చర్యపోయారు. ఫాదర్ డేవిడ్ శబనమ్‌ని తీసుకువెళ్ళేందుకు సిద్ధపడేసరికి శబనమ్‌తల్లి అడిగింది, "మీరు ఈమెను ఎక్కడికి తీసుకువెళ్తున్నారు."

"అనాధాలయానికి."

"నేనీమె తల్లిని. ఈమె నా దగ్గర వుండవలసిందే."

"సరే; కాని తల్లి కూతురుచేత నీచవృత్తిచేయించడానికి ప్రయత్నిస్తేమాత్రం, తల్లినిజైలులో వేయించవలసివుంటుంది. "నువ్వు కచేరీలో ఏదైనా కేసు పెట్టావంటే, నీ ప్రవర్తన, నృత్తులను గురించి వెల్లడిచేస్తాం. కాస్త తెలివి దగ్గరపెట్టుకుని మాట్లాడు, తరువాత అనుభవించవలసివస్తుంది." అన్నాడు డేవిడ్ హెచ్చరిస్తూ. ఫకీరుద్దీన్, శబనమ్‌తల్లి ఈ మాటలు వినగానే చాలా కంగారుపడ్డారు. శబనమ్ ఫాదర్ డేవిడ్‌తో

మిషన్‌బిల్డింగ్‌కు వెళ్ళిపోయింది. దారిలో శబనమ్ అడిగింది, "ఇదంతా సదానంద్ చేసిన మోసమేనంటారా ?"

"అతను మిషన్ బిల్డింగులోనే కూర్చున్నాడు. తనని తరచుగా వెంబడించే ఆ సి. ఐ. డి. ఇనస్పెక్టరే చూశాడంటున్నాడు. సదానంద్ నీతో పట్టుబడివుంటే విడి పించటం చాలా కష్టమైవుండేది. అందుచేత అతను అక్కడ నుంచి జారి బయటపడటమే మంచిదనుకున్నాను. అతను అక్కడనుంచి తిన్నగా ప్రొఫెసర్ గారియింటికి వచ్చేశాడు.

శబనమ్ మిషన్‌బిల్డింగుకువచ్చేసరికి, శాంతి, దుర్గాదాస్ ఆమెకోరకు యెదురుచూస్తున్నారు. ఈ సంఘటనను గూర్చి చర్చిస్తూన్నారు. సదానంద్ అన్నాడు– "ఈ సి.ఐ.డి. చెప్పిన మీదగనుక పోలీసులురావడమంటే అంతతొందరగా రాలేదు. శబనమ్ నాతో స్టేషన్‌కు వస్తోందని ఎవరో ముందే పోలీసు లకు తెలియపర్చి వుండాలి. అక్కడ మీరాకను తెలియపర్చ డానికి సి.ఐ.డి. ని ప్రత్యేకంగా వుంచిట్టున్నారు."

"కాని అలా చెప్పింది ఎవరై వుంటారు?" దుర్గాదాస్ అడిగాడు. శబనమ్ వచ్చి, ఈరోజున తను సయీదాకు తన కథనంత టిసీ చెప్పానని చెప్పగానే, ఆ విషయం తెలిసింది. అందరూ ఆమెనే అనుమానించారు. సయీదా తనని పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేస్తుందని అందుకుగాను తనని మహమ్మ దీయుడు కమ్మంటోందని దుర్గాదాస్ చెప్పాడు. శబనమ్ క్రిస్టి యన్‌గా మారి తనకు భార్య అవుతోందని తెలియగానే ఆమె మండిపడి వుంటుంది. బహుశా ఆ క్రోధంతో పోలీసులకు తెలియపర్చివుండవచ్చు.

ఈసంఘటన పరిణామంగా సదానంద్ దుర్గాదాస్ ఇంటికి వస్తూ వెళ్తున్నాడు. సదానంద్ మంచి కవిత్వం వ్రాస్తాడని శబనమ్ శాంతితో చెప్పింది.

శాంతి. 'పరిస్తాన్ యాత్ర' చదివింది.

అందుచేత సదానంద్ వచ్చినప్పుడల్లా కవిత్వంమీద మాట్లాడుకునేవారు.

12

సుందర్‌తో రమ వివాహమయ్యి ఎనిమిది నెలలయ్యింది. కాని సుందర్ లాహోరు వస్తాననికూడా అనలేదు. ఒకటి రెండుసార్లు చరణదాస్‌గారే కొడుకుని, కోడల్నీ చూసేందుకు జలంధర్ వెళ్ళారు. ఆయన ఎప్పుడు వెళ్ళినా ఉదయంబండికి వెళ్ళి సాయంకాలానికి వచ్చేసేవాడు. తనవల్లనే సుందర్ లాహోరు రావడమూ లేదు. కోడల్నీ తీసుకురావడంలేదని సుందర్ తల్లికి తెలుసు. అందుచేత ఆమెమనస్సులో చాలా సిగ్గు, విచారంకూడా చెందింది.

ఒకరోజున తెల్లవారుజామునే ఆమె స్నానాదులు ముగించి ముస్తాబవుతోంది. చరణదాస్ అడగాడు, "శ్రీమతి గారూ! ఎక్కడికి ప్రయాణం?"

"జలంధర్. సుందర్ని కలుసుకునేందుకు."

"కలుసుకునేందుకేనా లేక దెబ్బలాడటానికి కూడానా?"

"రెండూ చెయ్యటానికి, కలుసుకుని ఇన్ని నెలలవరకూ ఎందుకు రాలేదో దెబ్బలాడతాను. రమ ఈ పాఠం నేర్పి నట్టయితే దాన్ని నాలుగు జాడించి వస్తాను."

"అయితే నేనూ రావలసిందే?"

"ఎందుకు?"

"నీ దెబ్బలాట, తమాషా చూచేందుకు."

"అయితే నేను తమాషా చెయ్యడానికి వెళ్తున్నానా?"

"నువ్వు ఏమి చేస్తావో నీకే తెలుసు. కాని నేను తమాషాచూడటానికి వస్తాను."

"అయితే నేను వెళ్ళను."

"ఏం? నా సాంగత్యమంటే విసుగుపుట్టిందా?"

"శ్రీమాన్‌గారూ! అది కాదు. ఆడవాళ్ళ నాట్యం చూడటానికి మీకు సిగ్గువెయ్యదూ. కాని మగవాళ్ళముందు నాట్యంచెయ్యడానికి నాకు సిగ్గు వేస్తుంది."

"ఓసీ నీ అదృష్టం బంగారంకాను! నేను నీ నాట్యం చూడనులేవే?"

చరణదాస్‌కూడా తొందరగా స్నానాదులు ముగించు కొని ఇద్దరూ జలంధర్ వెళ్ళారు. అది ఆదివారం. సుందర్ ఇంటిదగ్గరేవున్నాడు. సుందర్ రైట్వే‌స్టోర్ సూపరింటెండెంటు

అయినప్పటినుంచీ నెలకు మూడువందలయాభై జీతం తెచ్చు కుంటున్నాడు. జలంధర్‌లో గవర్నమెంటు బంగళా ఇచ్చారు. అందుకు నెలకు నలభై అద్దె కట్టవలసివుంటుంది.

రోడ్డుమీద తల్లిదండ్రులిద్దరూ జట్కా దిగుతూండటం చూసి, చెప్పులైనా తొడుక్కోకుండా వెళ్ళి బండివాడికి కిరాయిచ్చి ఇద్దరినీ లోపలికి తీసుకువచ్చాడు.

ఇద్దరినీ గదిలో కూర్చోబెట్టి రమను పిలిచాడు, "రమా! రమా! ఎవరొచ్చారో చూద్దువుగాని రా."

రమ అత్తగారు రావడంచూసింది. అందుచేత ఆమె అత్తగారికి మామగారికి సాష్టాంగపు ప్రణామం చేసింది. సుందర్ తల్లి ఆమె కాళ్ళమీదపడటంచూసి తలనిమురుతూ ప్రేమతో ఆశీర్వదించడం మొదలెట్టింది, "సౌభాగ్యవతివి కావమ్మా! లే!"

అలా అని ఆమె వివాహంలో ఇవ్వాలనుకున్న కంటె తీసి ఆమె మెడలో వేసి, "నీకు ఆనందమయ్యిందికదా?" అంది.

రమ లేచి మళ్ళీ వెనుక గదిలోకి వెళ్ళిపోయింది. సుందర్ తల్లి అంది, "సుందర్! నువ్వు లాహోరు రాలేదేం?"

"అమ్మ పిలువనప్పుడు ఎలావచ్చేది? అన్నా! నువ్వు పిలిస్తే తప్పకుండా వస్తాను."

"చూడు, ఇంటిదగ్గరనుంచి బయలుదేరేటప్పుడు నీతో బాగా దెబ్బలాడి, రమనుకూడా తిట్టాలని బయలుదేరాను. కాని అది వినయంతో కాళ్ళమీదపడగానే నాకోపం ఎగిరి పోయింది."

"అమ్మా! అయితే ఇవేళ మిఠాయిపంచిపెట్టవలసిందే. నువ్వివేళ రమఅంటే సంతోషపడ్డావు. అందుకు పూరీలు, క్షీరాన్నం, మిఠాయి, మంచి మంచి కూరలు చేయిస్తాను."

"అలా అని సుందర్ నౌకరుని పిలిచాడు. నౌకరు రాగానే అన్నాడు, "తులసీ! వెళ్ళి అమ్మగారితో పూరీలు మొదలైనవన్నీ చెయ్యమని చెప్పు. వెళ్ళు, ఇవేళ నేను చాలా ఆనందంగా వున్నాను."

"అయ్యగోరూ! అమ్మగారూ ఇందాకటినుంచీ తాము చాలా ఆనందంగా వునోరంటున్నారండి. అందుకని పూరీలు క్షీరాన్నం అన్నీ చేస్తున్నారు!"

"సరే, వెళ్ళి, అమ్మకు టీ, మిఠాయి పట్టుకురా."

రమ టీ, మిఠాయిలు ట్రేలో పెట్టుకుని రాగానే చరణ దాస్ అడిగారు."

"అమ్మా,! రమా! తులసీ నువ్వు చాలా ఆనందంగా వున్నావంటున్నాడు. నువ్వు పూరీలు; క్షీరాన్నం చేస్తున్నావటగా ఏం జరిగింది అమ్మాయ్!"

టేబిల్ మీద ట్రే వుంచి రమ తివాచీమీదనే కూర్చుంది. ఆమె అంది.

"అత్తయ్య ఆశీర్వదించారుగా. అంతకంటె ఆనందం ఇంకేంవుంది ?"

చరణదాస్, అతని భార్య టీ త్రాగుతూంటే రమ అంది, "బయట ఒక అమ్మాయి నుంచుని వుంది. నే నామెతో మాట్లాడిరానా ?"

"అలాగేనమ్మా ! వెళ్ళు." చరణదాస్ అన్నారు.

"కాని ఆమె ఎవరు ?" సుందర్ అడిగాడు.

"సదానంద్ చెల్లెలినంటోంది."

"సదానంద్ చెల్లెలంటూంటే నీకు తెలియదా ?"

"ఎవరు అలా అయ్యుంటుంది. చెల్లెలు కావటానికి ఎవరో నిరాకరిస్తారు ? లాభకరమైనదేగా ?"

"కాని ఒక్కొక్కళ్ళు భార్యకావడానికి కూడా నిరాకరించరు."

"అవును. నాలాంటిదైతే సరి." అని రమ గదినుంచి బయటకు వచ్చింది. ఆమె ఇంటివెనుకకు వెళ్తూంటే సుందర్, తక్కినవారందరూ నవ్వుకోనడం వినిపించింది.

ఆమె శబనమ్. సదానంద్ తనచెల్లెలు జలంథర్‌లో వుంటోందని ఎప్పుడో మాటలసందర్భంలో అన్నాడు. శబనమ్ ఆమె అడ్రసు అడిగి తీసుకుంది.

రమ తన పరిచయంచెప్పి, ఇవేళ లాహోరునుంచి తన అత్తమామలు వచ్చారని చెప్పింది. అందుచేత మరొక సారి రమ్మని చెప్పింది. లేకపోతే తనఅడ్రసు ఇచ్చినట్టయితే, తనే స్వయంగా వస్తానంది.

శబనమ్ అంది. "వద్దుచెల్లాయి! ఇక్కడ నా అడ్రసు యిచ్చినా లాభంలేదు, రేపు నేను లాహోరు పెళ్ళికివెళ్తు న్నాను. నేను రావడంలో ఉద్దేశ్యమేమంటే, నువ్వూ, మీ ఆయన నాపెళ్ళికి రమ్మని చెప్పడానికి."

"అయితే రేపు మీ వివాహం జరుగుతుందా? చాలా సంతోషకరమైనవార్త."

"అవును! అక్కడకు సదానంద్‌కూడా వస్తారు. ఆయనతల్లిని, చెల్లెలుప్రభను కూడా ఆహ్వానించాము."

"మేము రాలేమని నా ఉద్దేశ్యం. అయినా ఆయన్ని అడుగుతాను. బహుశా ఆయనకు వెళ్ళాలని వుండొచ్చు."

"అలాగే. తప్పకుండాను."

రమ లోపలికివెళ్ళి సుందర్‌ని ఒకగదిలోకి పిలిచి శబనమ్ వివాహం, ఆమె ఆహ్వానంమాట చెప్పి, ఏమి చేద్దాం? అని అడిగింది. సుందర్ అన్నాడు, "నాకు శెలవు దొరకదు. మనవివాహానంతరం మొదటిసారిగా నువ్వు ఒంటరిగా వెళ్లటం మంచిదికాదు. ఆమెతో మేము రాలేమని చెప్పు. మన అభినందనాలను స్వీకరించి మనం ఇచ్చే బహుమతిని తీసుకోవాలని చెప్పు. ఆమెపేరు, అడ్రసు తీసుకో."

సుందర్ పెట్టిలోని రెండు మెటల్ ఫ్లవరువేజ్‌లు తీసి కాగితంలోబెట్టి తండ్రికిఇస్తూ అన్నాడు, "నాన్నా! వెళ్ళగానే ఇవి సదానంద్‌కి అందజెయ్యండి. కార్డుకూడా వాటిలోనే వుంది. ఈ రెండింటిని ఆ ఎడ్రసుకు అందజెయ్యమని చెప్పండి. కార్డుమీద ఇలావ్రాశాడు—

"విత్ ది బెస్ట్ కాంప్లిమెంట్స్ ఆఫ్ మిస్టర్ అండ్ మిసెస్ సుందర్‌లాల్ ఆన్ ది అకేషన్ ఆఫ్ ది ఆస్పీషియస్ మారేజ్ సెర్‌మనీ ఆఫ్ మిస్టర్ డి. పీటర్ అండ్ మిసెస్ ఎస్. పీటర్."

వెళ్ళేముందు సుందర్ తల్లి, కొడుకుదగ్గర కొన్నాళ్ళు వుంటానని చెప్పింది. కాని చరణదాస్ అడిగాడు "అయితే నేనేం చెయ్యను? ఎక్కడ తినను? ఇల్లు ఎవరు చూస్తారు?"

"వెళ్ళగానే ఒకనౌకరుని పెట్టుకోండి. అంతవరకూ హోటల్లో తినండి."

"మరి మధ్యాహ్నం నేను లేనప్పుడు ఎవరైనా తాళం బద్దలుగొట్టి నగలన్నీ పట్టుకుపోతే?"

అది వినగానే సుందర్ తల్లి కంగారుపడింది. లాహోరు వచ్చేస్తానంది. సుందర్ నవ్వుతూ అన్నాడు, "అమ్మా! చాలా ఆస్తి దాచివుంచినట్టున్నావు?"

"అవును! మీ నాన్నగారు జీవితమంతా సంపాదించింది?"

"ఎవరికోసం దాచావమ్మా?"

"మీ నాన్నగారి వృద్ధాప్యంలో పనికి వస్తుందని."

అయితే అమ్మా! నువ్వు చాలా మంచిదానివే."

"నే నెలాగామంచిదాన్నే. నువ్వు సర్టిఫికేట్టు యివ్వనక్కరలేదు. కాని నామాటెవరైనా వింటేనా? నువ్వు నేను చెప్పిందివింటే పదివేలు తెచ్చే పిల్లను చేసివుండేదాన్ని."

"సరే నువ్వు విననప్పుడు నేనేమి చెయ్యను ?"

"అమ్మా! కాని, రమలాంటి అందమైనది, గుణవంతు రాలు కాదుగా. పదివేలు తెచ్చింది నెత్తికెక్కికూర్చుంటుంది. కాని రమ చూడు ఆవులా సౌమ్యంగా ఏది చెబితే అదే వింటుంది."

"అబ్బాయి ! కాని ఆవుకూడా అప్పుడప్పుడు పోట్లు పొడుస్తుంటుంది."

"నువ్వు తెచ్చే పెద్దపులిఅయితే నన్ను నమిలి మింగే స్తుంది."

"సరే, లాహోరు ఎప్పుడు వస్తావు ?"

"అమ్మా ! నువ్వు ఎప్పుడు రమ్మంటావు."

"వచ్చే ఆదివారం రా. సరేనా ?"

"అలాగే ! తప్పకుండా వస్తాను."

356

మానవుడు

పంచమ భాగము

1

శబనమ్ వివాహం నిర్విఘ్నంగా పూర్తి కాలేదు. చర్చిలో వివాహం జరుగుతూంటే బయట పదిపదిహేను వేల మంది మహమ్మదీయులు కేకలు వేస్తున్నారు. మైనారిటీ తీరని ఒక మహమ్మదీయయువతిని బలవంతాన క్రైస్తవురాలిగా మార్చి వేస్తున్నారని మహమ్మదీయుల ఫిర్యాదు.

చాలామంది మహమ్మదీయులు చర్చిలోపలకు వచ్చేశారు. వివాహ ప్రమాణాలు చేస్తుంటే, మహమ్మదీయులు, "వివాహం జరగటానికి వీల్లేదు" అని కేకలు వెయ్యడం ఆరంభించారు.

ఫాదర్ డేవిస్ బల్ల ఎక్కి హిందూస్తానీలో ఒక ఉపన్యాసం ఇచ్చాడు. ఆయనన్నాడు, "ఇది భగవంతుని ఆలయము. ఇక్కడ హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు అనే భేదాలేమీ లేవు. మానవులందరూ సమానులే. మానవులలో కొంతమంది మత్సరకుల ప్రభావానికి లొంగిపోయి అల్లరి చేస్తారు. ఈ అమ్మాయి, శబనమ్ మహమ్మదీయుల ఇంట పుట్టిన మాట నిజమే. కాని ఆమె దుర్గాదాస్‌ని

చేసుకునేందుకు నిర్ణయించుకుంది. ఇందులో మీరు అడ్డు పెట్టవలసిన విషయమేముంది?..."

చర్చిలో ప్రోగుపడిన మహమ్మదీయులు, "వివాహం జరగటానికి వీల్లేదు. అమ్మాయి మైనరు." అని కేకలు వేశారు.

వారందరినీ శాంతపరచేందుకుగాను డేవిడ్ బిగ్గరగా చెప్పాడు, "సరే మంచిది. మీరంతా చర్చినుంచి బయటకు వెళ్ళండి. నేను వివాహం ఆపుచేస్తాను."

"అమ్మాయిని మేము మా వెంట తీసుకుపోతాము."

"ఎక్కడికి తీసుకువెళ్తారు?"

"వాళ్ళమ్మదగ్గరకు."

"అయితే వెళ్ళి ఆమెను తీసుకురండి. నేనా అమ్మాయిని అప్పగించివేస్తాను." దానిమీాదట మహమ్మదీయులు ఒకరితో ఒకరు సంప్రదించడం మొదలెట్టారు. సదానంద్ ఫాదర్ డేవిడ్‌తో అన్నాడు, "శబనమ్‌ని వెనుకద్వారం గుండా బయటకు పంపించివేసి ఏదైనా ఇంట్లో దాయాలి. పైగా పోలీసులకు ఫోను చెయ్యడంకూడా మంచిది."

క్రైస్తవులకు ఇది ఒక క్రొత్తసమస్యగా పరిణమించింది. ఇంతకుముందుగా మహమ్మదీయులు హిందువులతో విరోధంగా వుండేవారు. బ్రిటిష్‌ప్రభుత్వాధికారులు వారిలో తగవులుచూసి ఆనందించేవారు. దెబ్బలాటలు, కొట్లాటలు, దోపిడీలు జరిగినప్పుడుకాని వారి రాజదండం లేచేది కాదు.

అద్దైనా హిందువులు మహమ్మదీయులను బాదటం మొదలెట్టి నప్పుడే ప్రయోగించేవారు.

ఫాదర్ డేవిడ్ ఫోన్ కాల్ పోలీసులకు అందగానే బ్రిటిష్ సామ్రాజ్యంయొక్క బలగమంతా క్రైస్తవమతాన్ని, చర్చిని కాపాడేందుకు విరుచుకుపడింది. తుపాకీలతోనూ, లాఠీలతోను, గుఱ్ఱాలతోను పోలీసులు పదినిమిషాలలో అక్కడకు చేరుకున్నారు. అప్పటికే కొంతమంది మహమ్మదీయులు చర్చికి నిప్పంటించారు. కాని వెంటనే పోలీసులు గుఱ్ఱాలను జనంమీదికి విడిచిపెట్టారు. నిప్పంటించేవారిమీద తుపాకులు కాల్చారు. పారిపోయేవాళ్ళందరినీ లాఠీలతో మోదారు. చూస్తుండగానే పదివేలమంది సమూహం చెల్లా చెదురైపోయింది. ఫైర్ ఇంజన్స్ వచ్చి మంటలార్పాయి. పోలీసులరక్షణలో వివాహంజరిగిపోయింది.

పారిపోయే మహమ్మదీయులసమూహం బజార్లో హిందువులదుకాణాలన్నీ దోచుకోడం, దొరికిన హిందువుల నల్లా బాదడం మొదలెట్టారు. రెండుగంటలు అనార్కలీ బజార్లో భీభత్సం జరిగిపోయింది.

చర్చిలో వివాహం పూర్తయినతరువాత, వచ్చిన అతిథులందరూ వెళ్ళిపోయాక నగరంలో శాంతిస్థాపనమాట జ్ఞాపకంవచ్చింది పోలీసులకు. చాలా కష్టంమీద సాయం కాలానికి శాంతి ఏర్పడింది. రాత్రికూడా కొన్ని హిందూ బజార్లలో కర్ఫ్యూ విధించారు.

ఫాదర్ డేవిడ్ వివాహమయిపోయినతరువాత కొంచెం అభిమానంతో అన్నాడు, "మన శక్తినంతమైన ప్రభుత్వం గౌరవనీయుల రక్షణకోసం తీసుకున్న జాగ్రత్తకు, శ్రమకు మేము చాలా కృతజ్ఞులం."

ప్రొఫెసర్ గారి ఇంట్లో భోజనాలఏర్పాటు జరిగింది. భోజనానంతరం గుర్దాదాస్ తనభార్యతో పోలీసులసంరక్షణలో హనీమూన్‌కి నైనీటాల్ వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిపోయినతరువాత శాంతి సదానంద్‌తో విచారంతో అంది, "నాకిక్కడ ఒంటరిగా భయంగావుంది."

"అయితే మాఇంటికి వచ్చెయ్యి. అమ్మదగ్గర వుందువుగాని."

"మీఇంట్లో ఖాళీ ఎక్కడవుంది?"

"మేమందరం ఒక పే గదిలో పడుకుంటాము. అన్నయ్యా. వదినా క్రిందిగదిలో పడుకుంటారు."

"సదానంద్! కొద్దిరోజులు మీరిక్కడే వుండండి."

"నాకేమీ భయంలేదు; కాని మీప్రక్కనున్న సయీదా చాలా డేంజరస్ పెర్సన్. చూస్తున్నాముగా ఈవేళ దీపంఆర్పివేసి ఎలా పడుకున్నారో."

"అయితే నన్ను మిషన్‌హౌస్‌లో దిగబెట్టివెళ్ళండి. నేనక్కడ ఫాదర్ డేవిడ్‌తో వుంటాను."

ఈనాటి సంఘటనలు శాంతిమనస్సుమీద విచిత్రప్రభావాన్ని కలుగజేశాయి. వారందరూ చర్చిమీదకు ఎందుకు వచ్చారు? వాళ్ళు పోలీసులకు రిపోర్టు ఎందుకు

ఇవ్వలేదు! వాళ్ళు అనేదిగనుక సరియైనదైతే కోర్టులో దావా ఎందుకు చెయ్యకూడదు? శబనమ్‌తల్లి వాళ్ళలో లేదు. అయితే వారందరూ ఎవరు? వాళ్ళకేమి సంబంధం వుంది? ఇటువంటి ప్రశ్నలనేకం ఆమె మనస్సును కలత పెట్టాయి.

ఈ సంఘటనజరిగిన కొన్నిరోజుల తరువాత ఆమె ఫాదర్ జేవిడ్‌తో ఈ విషయాలనుగూర్చి మాట్లాడుతోంది. ఫాదర్ జేవిడ్ అన్నాడు, "హిందువులు మహమ్మదీయులను అసహ్యించుకుంటారు. అందుచేత వారందరూ హిందువులకు వ్యతిరేకంగా నిలబడతారు. మీ అన్నయ్యపేరు హిందువుల పేరు గాబట్టి, వారందరూ చర్చిమీద దాడిచెయ్యడానికి వచ్చారు."

ఈమాటలు శాంతికి రీజనబుల్‌గా కన్పించలేదు. ఆమె అడిగింది, "ఫాదర్! అన్నయ్య హిందువుఅని వీళ్ళకి ఎవరు చెప్పారు? అలా చెప్పినతను ఎందుకు చెప్పివుంటాడు? శబనమ్‌తల్లి అలా చెయ్యదు. ఎందుచేతనంటే అలాచేస్తే తనగుట్టు బయటపడి, తనకే ముప్పువస్తుంది. పైగా చర్చిలో హిందువులవివాహాలు జరుగవని ఎంత మూర్ఖుడికైనా తెలుస్తుందికదా?"

"అమ్మా! ప్రజలమనస్సులు అన్నీ ఆలోచించేపరిస్థితుల్లో వుండవు!" శాంతికి అప్పటికీ తృప్తికలుగలేదు. ఆమె మధ్యాహ్నం భోజనాలవేళకు సదానంద్ ఇంటికి వెళ్ళింది. కాని అతను ఇంట్లోలేడు. లక్ష్మి, ప్రభ లిద్దరే

ఇంట్లోవున్నారు. ఆమె అడిగినమీదట లక్ష్మి చెప్పింది, "శబనమ్ పెళ్ళినాడు జరిగిన సంఘటనను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సదానంద్‌ని పిలిపించారు."

"కాని దీనితో ఆయన కేమి సంబంధంవుంది?"

"అతనికే తెలియాలి. ఎవరికి సంబంధంలేదో వాళ్ళ కేమి తెలుస్తుంది?"

"ఆ సంఘటనజరిగి వారంరోజులుపైగా అయ్యింది. ఇప్పుడు పోలీసులకు దర్యాప్తుచెయ్యవలసిన అవసరం వచ్చిందా?"

"విషయమేమంటే పోలీసులు చర్చిదగ్గర జనాన్ని చిందరవందర చేసెయ్యగానే జనం అనార్కలీబజారునుంచి పారిపోతూ అక్కడి కొట్లను దోచుకున్నారు. కాని లాహోరు గేటుదగ్గరకు రాగానే హిందూయువకులు చాలామంది ప్రోగుపడి వాళ్ళను ఎదుర్కొన్నారు. దానిమీదట పోలీసులు వచ్చి అయిదుగురు హిందూయువకులను తీసుకుపోయారు. వాళ్ళమీద కేసుపెట్టడానికి దర్యాప్తుచేస్తున్నారు."

"ఎంతమంది మహమ్మదీయుల్ని పట్టుకున్నారు?"

"ఇంతవరకూ ఒక్కణ్ణికూడా పట్టుకోలేదు."

"సదానంద్ ఈ సంఘటనజరిగినప్పుడు చర్చిలోనే వున్నారుగా. ఆయన్ని ఎందుకు పిలిపించారు?"

"ఏమో తెలియదు. వచ్చినతరువాత తెలుస్తుంది."

కాని సదానంద్ రాలేదు. శాంతి చాలాసేపు ఎదురు చూసింది. బజారులో ఒకతను రాములాల్ దుకాణందగ్గరకు

వచ్చి సదానంద్ కూడా బంధింపబడ్డారని చెప్పాడు. రామ లాల్ ఈ విషయం లక్ష్మికి చెబుతూంటే శాంతికూడా విన్నది.

శాంతి ఇక అక్కడవుండటం మంచిదికాదనుకుంది. ఫాదర్ డేవిడ్‌కి ఇనస్పెక్టర్ జనరల్‌తో స్నేహంవున్నట్లు ఆమెకు తెలుసు. అందుచేత ఫాదర్ డేవిడ్ సహాయంతో ఈ సమస్య పరిష్కరించబడుతుందనుకుంది.

ఆమె మిషన్ బిల్డింగుకు రాగానే తిన్నగా ఫాదర్ గదిలోకి వెళ్ళింది. ఫాదర్ ఎందుకు వచ్చావని అడిగాడు. ఆమె తను లక్ష్మిఇంట్లో విన్నదంతా చెప్పింది తరువాత అంది, "పోలీసులు చాలా అన్యాయంచేస్తున్నారు."

"అవును. నువ్వు చెప్పినదంతా నిజమైతే, అది అన్యాయమే. కాని రాజ్యాన్ని పరిపాలించడంలో మనం చర్చిలో చెప్పుకునే న్యాయాన్యాయాలవ్యాఖ్య పనికిరాదు. అది రాజ్యపరిపాలనలో మారుతూంటుంది"

"కాని నేను చర్చిలో శాశ్వతసత్యంయొక్క వ్యాఖ్యయే జరుగుతుందనుకున్నాను"

"చూడు. నిన్న నన్నుకూడా పోలీసులు పిలిచారు. అపరాధులమీద కేసుజరిపించమని డిప్యూటీ కమీషనర్ గారు పోలీసువారిని ఆజ్ఞాపించారు. వాళ్ళు ఆనాడు చర్చి లోకి ప్రవేశించి తిక్కిన మహమ్మదీయులచేత అల్లరిచేయిం చిన ఫకీరుద్దీన్‌ని పట్టుకున్నారు. కాని అతను పోలీసు సూప రింటెండెంటుకు కావలసినవాడు. ఏదో కేకలువేసి విడిచి పెట్టేశారు. కాని న్యాయంజరిపిస్తున్నామని చూపెట్టేందుకు

ఎవరినో ఒకరిని పట్టుకుని కేసునడిపించవలసిందే. అందుకని హిందువులను పట్టుకుంటున్నారు. అయిదుగురు యువకులను పట్టుకున్నారు. సదానంద్ వారి లీడర్ 'అని చెప్పి, అతన్ని కూడా పట్టుకునివుంటారు.

"నాచేతకూడా ఒక కాగితంమీద సాక్షిగా సంతకం చేయించుకున్నారు. అందులో సదానంద్‌కు శబనమ్‌తో వివాహం కావలసివుందని, అతను ఆమెను కలుసుకునేందుకు వస్తూవుంటాడని వ్రాసివుంది. శబనమ్ నుర్గాదాస్ ప్రేమలో చిక్కుకుంది. అందుచేత సదానందే హిందువులను, మహమ్మదీయులను పురికొల్పాడు. సదానంద్ ఫకీరుద్దీన్‌ని రెచ్చగొట్టగానే, ఫకీరుద్దీన్ మహమ్మదీయులను రెచ్చగొట్టాడు."

శాంతి నవ్వింది. ఫాదర్ డేవిడ్ దానిమీదట శాంతి చాలా సంతోషించిందనుకున్నాడు. ఆయన యింకా చెప్ప సాగాడు—"అసలువిషయమేమంటే పోలీసులు మన చర్చిని, మన తక్కినభవనాలను రక్షించారు. అందుచేత పోలీసుల మాటను సమర్థించడం మనకర్తవ్యం."

"కాని నిరపరాధులను పట్టుకుంటున్నారుకదా, వాళ్ళకు శిక్షపడదా?"

"శిక్ష ఎవరికీ పడదు. అందరినీ విడిచిపెట్టేస్తారు. ముందు కోర్టులో వీరందరికీ శిక్షపడినా, హైకోర్టులో వీళ్ళు అప్పీలుచేయిస్తారు. అక్కడ శిక్ష రద్దయిపోతుంది. లేకపోతే తగ్గిస్తారు."

"కాని మీరు భగవంతుని సేవకులుకదా. మీరు అబద్ధమాడకూడదు."

"సత్యాసత్యాలనిర్ణయం ఆ కార్యంయొక్క ఉద్దేశ్యాన్ని దృష్టిలో వుంచుకుని చెయ్యాలి. ప్రజలమీద బ్రిటిష్ ప్రభుత్వం యొక్క ప్రభావం దృఢంగా వుండాలి. అది ఒకమహత్తర సత్యం. అది వున్నంతకాలమే మనపని జరిగేది. మహమ్మదీయులు ప్రభుత్వానికి మంచి సహాయకులు. లాహోరు పోలీసులలో ఎనభై శాతం మహమ్మదీయులే. అందుచేత మహమ్మదీయులకు కోపం తెప్పించడం అన్యాయం, అక్రమం కూడాను. అలా జరుగకుండా చేయటంలోనే మన చర్చి, మన సంప్రదాయాలగౌరవం నిలబడివుంటాయి."

* * *

2

ఈ సంఘటనమీద ఫాదర్ డేవిడ్ చేసినవ్యాఖ్య, ఆయన పోలీసులకు సాక్ష్యమివ్వడం శాంతిమనస్సులో ఆందోళన లేవదీశాయి. దుర్గాదాస్ హనీమూన్‌నుంచి తిరిగి రాగానే శాంతి అన్నగారిదగ్గర వుండేందుకు వెళ్ళిపోయింది. సదానంద్‌ని పట్టుకున్నందుకు దుర్గాదాసుకి చాలా ఆశ్చర్యం వేసింది. ఈ సంఘటనఫలితంగా శాంతి మరుసటి ఆదివారం ఫాదర్ డేవిడ్ 'సెర్మన్' వినేందుకు వెళ్ళలేదు. ఆమె అన్నగారు, శబనమ్ అడిగినప్పుడు, "నాకు మరొకచోట ముఖ్యమైన పనుంది, వెళ్ళాలి" అని చెప్పింది.

ఆమె అన్న, వదినలు చర్చికివెళ్ళగానే ఆమె సదానందం ఇంటికి వెళ్ళింది. పరమానందం ఆరోజు ఇంటిదగ్గరనే వున్నాడు. దానినిబట్టి శాంతికి పరిస్థితంతా అర్థమయ్యింది. పరమానందం చెప్పాడు, "ఫాదర్ డేవిడ్ సాక్ష్యమివ్వక పోయినా, లేక అబద్ధమాడకుండావున్నా అసలు ఈ కేసు జరిగేదేకాదు. మేజిస్ట్రీటుగారు జామీనుమీద విడిపించడానికికూడా అంగీకరించలేదు. ప్రస్తుతం ఇరవయ్యొక్కమంది హిందువులను జైల్లోవుంచారు. వారందరిమీద తిరుగుబాటు దారులని కేసుపెడతారు." శాంతి అడిగింది, "ఏమండీ! వీరిలో ఎంతమంది మహమ్మదీయులున్నారు?" "ఎవ్వరూ లేరు. కొంతమంది మహమ్మదీయులనుకూడా పట్టు కున్నట్లయితే ఇది మామూలు తిరుగుబాటుక్రింద లెక్కలోకి వస్తుంది. దానిమీదట నూటఏడవసెక్షనుక్రింద అందరినీ జామీనుమీద విడిచిపెట్టవలసివుంటుంది. అందుచేత పోలీసులు మహమ్మదీయులెవ్వరినీ పట్టుకోలేదు."

మరునాడు శాంతి హైకోర్టుకు వచ్చింది. అపరాధులను అక్కడకు తీసుకువస్తారని అనుకుంది ఆమె. కాని ఎవ్వరినీ తీసుకురాలేదు. దానితో శాంతికి కొంచెం నిరాశకలిగింది. కాని ఆమెకు కేసువినడానికి అవకాశందొరికినందుకు ఆనందించింది. కుంవర్ సేన్‌గారు జామీనుమీద అపరాధులను విడిచిపెట్టేందుకు అర్జీ దాఖలుచేశారు. పైగా పోలీసులు మూర్ఖత్వంతోనూ, పక్షపాతంతోనూ పనిచేస్తున్నారనీ ఆయన ఆరోపించారు. ఆరోజు జరిగిన సంపూర్ణసంఘటనను వివరిస్తూ ఆయన అన్నారు, "వివాహం ఒక మహమ్మదీయ

యువతికి ఒక క్రైస్తవునికి జరగవలసివుంది. మహమ్మదీయ యువతి మైనర్ అంటున్నారు. స్వాభావికంగా మహమ్మదీయుల కోపమంతా క్రైస్తవులమీదనే వుంటుంది. వారందరూ చర్చినిముట్టడించి, తగులబెట్టారుకూడా. పోలీసులు మహమ్మదీయుల సమూహాన్ని చెల్లాచెదురుచేశారు. ఆ గుంపు అనార్కలీబజారునుంచి పారిపోతూ అక్కడ హిందువులకొట్లన్నిటిని దోచుకున్నారు. దొరికిన హిందువులనల్లా కొట్టారు. లాహోరుగేటుదగ్గర కొంతమంది కొట్లవారు తమ ప్రాణాలను, దుకాణాలను రక్షించుకునేందుకు తామే సిద్ధపడ్డారు కాని పోలీసులు అక్కడకు వెళ్ళలేదు. తిరుగుబాటు, అల్లరి అణగిపోయాయి. తరువాత పోలీసులు లాహోరుగేటుదగ్గరకుపోయి అక్కడి దుకాణాలవారిని పట్టుకుని వారిమీద తిరుగుబాటుదారులని కేసుపెట్టారు. తరువాతకూడా కొంతమందిని పట్టుకున్నారు. వారందరూకూడా హిందువులే.

“యునర్ ఎక్సెలెన్సీని ప్రార్థించేదేమంటే వీరిమీద ఏ పరిస్థితుల్లోనూ కేసు జరగటానికి వీల్లేదు. పెద్దపెద్ద యాక్ట్సు విధించడంవల్లనే ఏ వ్యక్తీ అపరాధికాదు. ఇటువంటి భ్రమపూర్ణమైన, దుర్బలమైన ఆధారాలమీద పట్టుకోబడిన వ్యక్తులమీద ఇటువంటి పెద్దపెద్ద అపరాధాలు ఆరోపించి, వారి స్వేచ్ఛనరికట్టడం, వారి అపరాధం నిరూపించకపూర్వమే దండన విధించినట్టవుతుంది. ఈ పట్టుబడినవారిలో ఎవ్వరూ, ఎప్పుడూ అపరాధిగా నిరూపించబడలేదు. ఇదివరకు శిక్షఅనుభవించిన వ్యక్తి ఎవ్వరూ లేరు. అందుచేత

కేసునడపడానికి వీరిని జామీనుమీద విడిచిపెట్టడంలో ఏమీ వంటి హానిలేదు. న్యాయవిచారణకు ఎటువంటి అడ్డంకులూ రావు."

ప్రభుత్వవకీలు జామీనుమీద విడిపించడానికి వ్యతిరేకంగా ఏదో చెప్పబోతుంటే చీఫ్ జస్టిస్ అతన్నే అడగడం ఆరంభించారు.

"తిరుగుబాటు ఎక్కడ ప్రారంభమయ్యింది?" ఆయన అడిగారు.

"రోమన్ కాథలిక్ చర్చిలో"

"చర్చిలో ఏమి జరుగుతోంది, తిరుగుబాటువాళ్లు ఏమి ఆపుచేయాలనుకుంటున్నారు?"

"అక్కడ జరిగే వివాహాన్ని."

"పెళ్ళిచేసుకునేవారు ఏ మతస్థులు?"

"అమ్మాయి మహమ్మదీయురాలు."

"అయితే మహమ్మదీయులే చర్చిమీద దాడిచేసి వుంటారు."

"కాని ఈ కుట్రను నడిపించింది ఒక హిందువు."

"ఇది ఒక కుట్రఅని, దానిని నడిపించింది ఒక హిందువు అని చెప్పేది పోలీసులు. దానిమీద న్యాయాలయం విచారణ జరుపుతుంది. దానికి కారణం మరొకటి కూడా వుండొచ్చు. కాని అసలు తిరుగుబాటు చేసినవారిలో ఒక్కరినికూడా ఎందుకు పట్టుకోలేదు?"

ప్రభుత్వవకీలు మాట్లాడలేదు.

"మహమ్మదీయుల దుకాణాలు ఎన్ని దోపిడీచేయ బడ్డాయి?"

"ఒక్కటికూడా లేదు."

"అయితే మీరు హిందువుల దుకాణాలన్నీ దోచుకో మని మహమ్మదీయులను రెచ్చగొట్టారని మీ అభిప్రాయమా?"

ప్రభుత్వవకీలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయాడు. అతను కేవలం ఇలా అన్నాడు. "ప్రభుత్వం చేసిన ఆరోపణలనుబట్టి జామీనుమీద విడిచిపెట్టేందుకు వీలులేదు."

ఛీఫ్ జస్టిస్ గదమాయించి అన్నాడు. "పోలీసులు ఏవో ఆరోపణలు చెయ్యొచ్చు. కాని వాటిని నిరూపించ డానికి ఆధారాలేవి. పైగా వారిని జామీనుమీద విడిచి పెట్టడంవల్ల వచ్చే ప్రమాదమేముంది?"

ప్రభుత్వవకీలు మాట్లాడలేదు. దానిమీదట హైకోర్టు అయిదేసివేల జామీనుమీద ప్రతివారిని విడిచిపెట్టేందుకు అంగీకరించింది.

పోలీసువారిని వారించినందుకు శాంతి ఆనందించింది. పరమానంద్ ఖైదీలందరికీ జామీనులు దాఖలుచేసి వారిని విడిచిపెట్టేందుకు కాగితాలుతీసుకుని జైలుదగ్గరకు వెళ్ళాడు.

ఆ సాయంకాలమే సదానంద్‌ని కలుసుకునేందుకు శాంతి వారింటికి వెళ్ళింది. సదానంద్ ఇంటిదగ్గరే వున్నాడు. శాంతి తనవిషయం తెలుసుకునేందుకు హైకోర్టుకువచ్చిన విషయం పరమానంద్‌వల్ల తెలుసుకున్నాడు. ఆమె తన

యెడల ఈవిధమైన ఆసక్తి చూపించినందుకు చాలా సంతోషించాడు. ఆమెకు ధన్యవాదాలు చెప్పాడు.

తరువాత జైల్లో ఆరోగ్యపరిస్థితులనుగురించి మాట్లాడుకున్నారు. తన అన్నగారు, వదిన వచ్చేశారని చెప్పగానే సదానంద్ వారిని కలుసుకునేందుకు వెళ్ళారు. శాంతి అతని వెంటే వుంది. ఆమె మార్గంలో తనమనసులో ఉత్పన్నమయిన ఆలోచనలను వెల్లడించింది. ఆమె అంది. "ఫాదర్ డేవిడ్ మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారు. అలా అసత్యం ఎందుకు చెప్పారని నేనడిగాను. దానివల్ల చర్చికి, క్రైస్తవసంప్రదాయానికి లాభంకలుగుతుందని, అందుచేత అది అసత్యమైనా వాస్తవానికి సత్యమేనని ఆయన చెప్పారు"

సదానంద్ అన్నాడు, "ఆయన ఆవిధంగా సాక్ష్యమివ్వడంవల్ల చర్చికి, క్రైస్తవసంప్రదాయానికీ లాభం కలుగుతుందన్నమాట నిజమే. కాని అబద్ధాలతో లాభాన్ని పొందేచర్చి, దాని సాంప్రదాయాలలో సత్యం ఏముంది?"

"అయితే ఏసుప్రభువు నిజంకాదా ?"

"అలా అని నేననడంలేదు. ఆయన సంపూర్ణజీవితం, ఆయన ప్రతి ఒక్క ప్రయాస చర్చికొరకూ కాదు, ఒక సంప్రదాయంకొరకూ కాదు. ఆయన మానవులందరి ఉద్ధరణకోసం పాటుపడ్డాడు. ఈచర్చి సంప్రదాయాలూ స్వార్థపరులైనవారు సృష్టించినవి."

"కాని హిందూసంప్రదాయంమట్టుకు లేదా ? మీరు ఎప్పుడూ హిందువులను సమర్థిస్తూనే మాట్లాడుతారుగా ?"

"చాలామంది హిందువుల ఉద్దేశాలలో 'హిందూ'

కూడా ఒక సంప్రదాయమే. కాని నేను 'హిందూ' ఒక అసంప్రదాయక సాంప్రదాయకమంటాను. పూజాపునస్కారాలలోనూ, భావాలలోనూ ప్రతివారికీ స్వాతంత్ర్యాన్ని ఇచ్చినప్పుడు, హిందూమతం సంప్రదాయికతకు విరుద్ధమంటాను."

శాంతి గంభీరఆలోచనలో పడిపోయింది. సదాశివన్ మాట్లాడకుండా నడుస్తున్నాడు. వెళ్తూ వెళ్తూ ఒక్కసారి శాంతి అడిగింది. "ఒకవేళ ఎవరైనా ఏసుప్రభువును, ఆయన చెప్పినవిషయాలను మహత్తరమైనవిగా భావించినట్లయితే మీరు అతనిని హిందూమతంనుంచి బయటకు పంపి వేస్తారా?"

"ఏసుప్రభువును ఒకమహాత్ముడుగా భావించేవారిలో నేనొకణ్ణి. ఆయన చెప్పినవన్నీ మహత్తరవిషయాలే. హిందూ ధర్మంలో భావస్వాతంత్ర్యం ఒక ముఖ్యమైన, ఆధారభూతమైన విషయంగా వున్నంతకాలం, అతను హిందువుగానే వుంటాడు."

"హిందువులు తమ మతప్రచారంకోరకు ఎప్పుడూ బలప్రయోగం చెయ్యలేదా?"

"బలప్రయోగంమాట అటువుండగా, హిందువులు హిందు వేతరులు హిందువులుగా మారేందుకుకూడా అంగీకరించేవారుకాదు. కాని అదికూడా ఒక అయుక్తిసంగతమైన వ్యవహారమే. తరువాత హిందువులలోని కొంతమంది ఆచార్యులు హిందు వేతరులు హిందువులు గా మారడానికి అంగీకరించారు. కాని హిందువులు తమ మతప్రచారంకోరకు బలప్రయోగంచేసినట్లు చరిత్రలో ఎక్కడా లేదు."

"శబనమ్‌స్థానంలో ఒక హిందుస్త్రీయేగనుక వున్నట్టయితే హిందువులు ఏమిచేసివుండేవారు?"

"ప్రజలు ఏమిచేసివుండేవారో నేనెలా చెప్పగలను? ఈరోజుల్లో ప్రపంచంలో అయుక్తిసంగత వ్యవహారాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. కాని నాకు తెలిసినంతవరకు, హిందువులెప్పుడూ అటువంటి పనుల్లో తమంతట తాము చట్టాన్ని వ్యతిరేకించడం జరుగలేదు."

"తప్పనిసరి పరిస్థితుల్లో వేరుగా జరుగవచ్చు. మహమ్మదీయులు అనార్కలీబజార్లో ప్రతిదుకాణాన్నీ దోచుకుని లాహోరుగేటువరకూవచ్చినా పోలీసులు హిందువులరక్షణకు రాలేదు. అందుచేత ఇక తప్పక హిందువులు లాఠీలు తీశారు. కాని అది చట్టాన్ని వ్యతిరేకించడంకాదు. ఇండియన్ పీనల్-కోడ్‌లో అలా చేసేందుకు అనుమతివుంది. కాని స్వేచ్ఛగా హిందువనని ఎవ్వరూ చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు.

"నేనింకా లోతుకుపోతున్నాను. ఒకవేళ హిందువులెవరైనా అలాచేసినట్లయితే అది పొరపాటే. అది హిందూ జీవిత మీమాంసకే వ్యతిరేకం."

ఈ మాటల్నిబట్టి శాంతి మనస్సు వ్యక్తిగతవిషయాల మీదకు పోయింది. ఆమె అడిగింది, "మీరు ఎంతవరకూ చదువుకున్నారు?"

"యస్. యస్. యల్. సి. ఫెయిల్."

శాంతి ఆశ్చర్యంతో అడిగింది. "ఆరోజున మీరు అన్నయ్య లైబ్రరీనుంచి కార్లైల్ వ్రాసిన 'ఫ్రెంచి రివల్యూ

షన్' తీసుకుని చదువుతున్నారు కదూ? అది బి. ఏ. ప్యాసయిన
వాళ్ళకుకూడా అర్థంచేసుకోవడం కష్టంగా వుంటుందే?"

"భాషల్లో ప్రావీణ్యత, పరీక్షలు ప్యాసవడంవల్ల రాదు,
అభ్యాసంవల్ల వస్తుంది."

"కాని భాషయేకాకుండా మీరు మాట్లాడేపద్ధతి మీ
యుక్తులు, మీ జ్ఞానం గ్రాడ్యుయేట్స్‌కి కూడా అవదు."

"అదంతా అభ్యుదయంయొక్క ఫలితమే. నేను
రోజూ రెండుమూడు గంటలు స్వాధ్యాయనం చేస్తాను."

ఇద్దరూ ప్రొఫెసర్ దుర్గాదాస్ గారి ఇంట్లోకి ప్రవేశిం
చారు. ప్రొఫెసర్ గారు ఇంట్లో లేరు. శబనమ్ ఒక్కర్తే
వుంది. ఆమె హృదయపూర్వకంగా ఆహ్వానించింది.

"రండి, సదానంద్ గారూ! నన్ను మీరు ఒక్క
దెబ్బతో ఒక అంతస్థునుంచి మరొక అంతస్థుకు చేరవేసి
నందుకు మీకు చాలా కృతజ్ఞురాల్ని. నేను నా ప్రస్తుత
జీవితంతో చాలా ఆనందంగా వున్నాను."

"చాలా సంతోషకరమైన విషయం. ప్రొఫెసర్
గారుకూడా అలాగే భావించినట్లయితే ఇక అంతకంటె కావ
లసినదేముంది!"

"అది ఆయనే చెబుతారు. అద్దంలో చూసేవాని
ప్రతిబింబమే దానిలో సరిగ్గా కన్పించేటట్లయితే ఆమాట
ఆయన మనస్సులోనే సమూలంగా ప్రతిబింబంగా వుంటుంది."

"అదే, అద్దం సరియైన ప్రతిబింబాన్ని ఇస్తోందో లేదో
చూడాలి."

శబనమ్ నవ్వుతూ అడిగింది. "అయితే నామాట సరియైనదో కాదో మీకు సందేహమెందుకు?"

"మొదటిసారి అది తప్పయ్యిందిగా. అయినప్పటికీ నేనీసారి సందేహించడంలేదు."

శబనమ్ మాటమార్చేస్తూ అంది, "మీ రెండవ పుస్తకం ఎప్పటికి వస్తుంది?"

"ఇప్పుడింకా వ్రాస్తున్నాను. పూర్తయినతరువాత గాని ఎప్పుడు ప్రచురింపబడేదీ తెలియదు. ఈసారి హిందీ లోనే వ్రాస్తున్నా."

"ఏం?"

"ఉర్దూ కంటే, హిందీలో వ్రాయడం సులువనిపించింది."

"ఏమిపేరు పెట్టారు?"

"పేరు ఇంకా పెట్టలేదు. పుస్తకం సమాప్తమయిన తరువాతకాని నిర్ణయించలేం. విషయం చెబుతాను. మానవునియొక్క అదృష్టం అతని పనులలో ఒక మహత్తర ప్రేరణగా పనిచేస్తుందని వ్రాయాలనుకుంటున్నా. మానవుడు ప్రయత్నంద్వారా ఆ ప్రేరణకు అతీతుడుకావచ్చు. కాని అందుకు చాలా నిష్ఠ అవసరం. మానవునిపుట్టుక, విద్య, వ్యాపారంలో జయం, వివాహం, మృత్యువు ఏవీ అతని చేతిలో లేవు. ఇవన్నీ మానవుడు ఈజన్మలో కాకుండా ఎక్కడనుంచో తీసుకొనివస్తాడు. అయినప్పటికీ ప్రయత్నం ద్వారా వాటిని కొంతవరకు ముందూ - వెనుకా చేసుకోగలడు. ఇవికాకుండా మానవుడు చెయ్యగల్గేపను లనేకం

వున్నాయి. ఉదాహరణకు అదృష్టంకొద్దీ మీ జీతం నంద రూపాయలే అనుకోండి. అందులో పొదుపుచేసి ఏదైనా ఉపకారార్థం ఉపయోగించవచ్చు. మీరు నడిచి అమృతసర్ వెళ్ళాలనుకోండి. మీరు వేగంగా నడిచి ఒకటి రెండు గంటలు సమయం కాపాడుకోవచ్చు. అలా మిగిలినసమయాన్ని భవిష్యత్తులో ఒక మంచిపనికి ఉపయోగించుకోవచ్చు. ఎవరైనా ఒక కురూపిఅమ్మాయిని చేసుకొని ఆమెతోనే సంతోషించి ఆనందంగావుండవచ్చు. అదేవిధంగా ప్రయత్నక్షేత్రం కూడాను. దానివల్ల కొంతవరకూ జీవితం సుఖవంతమవుతుంది. పైగా చాలమట్టుకు భవిష్యత్తు దానిమీదనే ఆధారపడివుంటుంది"

"అయితే మీరు మానవునియొక్క అర్థంలేని విషయాలనుగూర్చి వ్రాయాలనుకుంటున్నారా?"

"అవును; మానవజీవితంలోని అర్థంకాని విషయాలను అర్థంచేసుకునేందుకు, అర్థంచేసేందుకు వ్రాస్తున్నాను."

దానిమీదట శాంతి అంది. "అయితే అది మానవ చరిత్ర అవుతుంది."

"అవును. అందుచేత నా పుస్తకానికి 'మానవుడు' అనేపేరే తగివుంటుంది. అయినప్పటికీ పుస్తకం తయారయినతరువాతనే పేరుపెట్టవచ్చు."

3

సదానంద్, తక్కిన ఇరువయ్యొక్కమంది తిరుగుబాటుదారులమీద కేసు ప్రారంభమయ్యింది. పోలీసు వకీలు

కేసును ప్రారంభిస్తూ అన్నాడు. "సదానంద్ ఒక ఘోర హిందూపక్షపాతంగల కవి. అతను బజార్లలోనూ, కవి సమ్మేళనాలలోనూ హిందూ-మహమ్మదీయులలో ఈర్ష్యను పెంపొందించే కవిత్వం చెబుతుంటాడు. అతని కవిత్వం చాలా ప్రతిభావంతంగాకూడా వుంటుంది. ఇతను చాలా సార్లు ప్రజలను ఉద్రేకపరచి వారు చెయ్యనిపనులుకూడా చేయించాడు"

"ఈ సదానంద్ ఈ తిరుగుబాటుకు నాయకుడు. ఇతను శబనమ్‌ని ప్రేమించేవాడు. ఇతను చెప్పినమీదటనే శబనమ్ తల్లి దగ్గరనుంచి పారిపోయి దాక్కుంది. సదానంద్ తన బాధ్యత వదిలించుకునేందుకుగాను ఆమెను క్రైస్తవుల అనాథాలయానికి పంపించాడు. కాని మధ్యమధ్య కలుసుకుంటూవున్నాడు. కాని మధ్యలో శబనమ్ ప్రొఫెసర్ దుర్గాదాస్‌ని ప్రేమించింది. దానితో సదానంద్‌కి చాలా నిరాశకల్గింది.అందుచేతనే అతనీ తిరుగుబాటు చేయించాడు. అతను వేషంమార్చుకుని మసీదులలోనికివెళ్ళి మహమ్మదీయులను పురిగొల్పి, వివాహంరోజున చర్చిదగ్గిర సమూహపరచాడు. అక్కడ జనం ప్రోగుపడ్డతరువాత ఏమి జరిగింది అనేదానితో ఈ కేసుకు సంబంధంలేదు. నిప్పు అంటించేవాని దోషం అగ్గిపుల్ల గీసి నిప్పు అంటించేవరకే. తరువాత ఏమి అంటుకుంది, ఎంతవరకు కాలింది, అనేది అతని అధీనంలో లేదు. అతనిపని నిప్పు అంటించడంమట్టుకే.

"సదానంద్ తిరుగుబాటును లేవదీసి చర్చిదగ్గర జనాన్ని ప్రోగుచేశాడు. ఇది పోలీసులకేసు. ఇది నేరం.

దీన్ని కుట్ర అంటారు. సదానంద్, తక్కిన ఇరువయ్యొక్క-మంది శిష్యులు."

ఈవిధంగా కేసు ఆరంభించి ప్రభుత్వవకీలు తన సాక్షులను పిలిపించారు. మొదటిసాక్షి శివరామ్. అతను బోనులోనుంచుని సాక్ష్యం చెప్పడం ఆరంభించారు. ప్రభుత్వ వకీలు వేసిన ప్రశ్నలకు సమాధానంగా అతను సదానంద్‌ను గూర్చి చెబుతున్నారు.

"నేను సదానంద్‌ను ఎరుగుదును. అతను మున్షీ నందలాల్ గారి కుమారుడు. మున్షీ నందలాల్‌ని నూటపదవ సెక్షనుక్రింద జైల్లోవుంచారు. ఈ అబ్బాయి ఒకసారి చమేలి అన్నగారినని చెప్పి మా కోట్లోకి వచ్చారు. చమేలీతో నా పెళ్ళి నిశ్చయమయ్యింది. నన్ను కలుసుకున్న తరువాత ఇతను నామీద అశ్లీలమైనపద్యాలువ్రాసి వాడలోవున్న అందరినీ సభచేసి అవి వినిపించారు ఆ పద్యాలలో నేను కురూపినని, మూర్ఖుణ్ణని కాకపోతే కాస్త డబ్బువుందని; అటువంటి నేను గులాబీవంటి చమేలీని అపహరిస్తున్నానని మొదలైనవెన్నో విషయాలున్నాయి.

ఆ కవిత్వం విని జనం అందరూ నామీద మండిపడి చమేలీతల్లిని ఒత్తిడిచేసి నాతో సంబంధం తెగతెంపుచేయించారు. చమేలీవివాహం సదానంద్ అన్నగారు పరమానంద్‌తో అయ్యింది.

దానిమీదట కుంవర్ సేన్‌గారు క్రాస్ చేశారు. కుంవర్ సేన్ చమేలీ ఫోటో ఒకటి సాక్షికి చూపించి అడిగారు, "ఈ ఫోటోలోవున్నవారిని గుర్తుపట్టగలవా?"

"ఆ, ఈమే చమేలి. ఈమెతోనే నావివాహం జరుగవలసింది." కుంవర్ సేన్‌గారు మరొకఫోటో చూపించారు. "సరే, ఇతనెవరో తెలుసా?" అనడిగారు.

"అవును. ఇది నాఫోటోయే. కాని నాకళ్ళు కొంచెం చిన్నవిగా పడ్డాయి." కుంవర్ సేన్‌గారు మేజిస్ట్రేట్‌తో అన్నారు, "ఈ రెండుఫోటోలూ కేసుఫైల్లో వుంచండి. ఈ సాక్షియొక్క మంచితనం, నమ్మకం వీటినిబట్టి తెలుస్తుంది."

రెండవసాక్షి ఫాదర్ డేవిడ్‌ని పిలిచారు. ఆయన అన్నాడు, "నేను సదానంద్‌ని ఎరుగుదును. నేనితన్ని ప్రొఫెసర్ దుర్గాదాస్‌గారి ఇంట్లో చూశాను. సదానంద్ పెళ్ళి శబనమ్‌తో కావలసింది. కాని తరువాత శబనమ్ దుర్గాదాస్‌ని చేసుకుంది."

దానిమీదట కుంవర్ సేన్‌గారు క్రాస్ చేశారు. సమాధానంగా ఫాదర్ చెప్పారు, "నేను సదానంద్‌తో ఎప్పుడూ మాట్లాడలేదు. నేనొకనాడు సంబసుకి పోలీసుస్టేషన్‌కి వెళ్లాను. నేను శబనమ్‌ని విడిపించుకువచ్చాను."

కుంవర్ సేన్‌గారు అడిగారు, "సదానంద్ శబనమ్‌ని ప్రేమించాడని మీకెవరు చెప్పారు?"

"శబనమ్ చెప్పింది."

"మీరెప్పుడైనా వాళ్లు ప్రేమించుకోవడం మీ కళ్ళతో చూశారా?"

"లేదు."

"చెవులతో వాళ్ళ ప్రేమకలాపాలు విన్నారా?"

"లేదు."

"అయితే మీరు చెప్పినదంతా ఎక్కడో విన్నదా?"

"అవును."

"వివాహసమయంలో సదానంద్ ఎక్కడవున్నాడు?"

"చర్చిలో"

"బయట గందరగోళం జరిగేటప్పుడు సదానంద్ మీకు టెలిఫోన్ చేశాడుకదూ?"

"అవును."

"మీరు సదానంద్ బయట మహమ్మదీయులకు నేతృత్వంవహించడం చూశారా?"

"లేదు, నేనసలు బయటకి వెళ్ళలేదు."

ఈవిధంగా సాక్షితరువాత సాక్షి వచ్చారు. కుంవర్ సేన్ అందరినీ రెండు మూడుప్రశ్నలతోనే రంగు తేల్చి పంపించివేశారు. కేసు ప్రారంభించాక కార్యక్రమం పదిహేనురోజులు పట్టింది. సిటీ మేజిస్ట్రేటు ముద్దాయిలనందరినీ నేరస్థులుగా భావించి దావాను సెషన్సుకోర్టుకు పంపించాడు.

ఈమధ్య ప్రతిరోజూ స్కూలుపని పూర్తికాగానే శాంతి సదానంద్ ఇంటికి వెళ్తోంది. ఆమె తరచు సదానంద్‌ని

తన ఇంటికి తీసుకువెళ్తోంది. అక్కడ ఇద్దరూ అనేక విషయాలమీద చర్చించుకుంటున్నారు. శాంతి తన మనస్సులోని సందేహాలను విడమర్చి చెబుతుంది. తరువాత సదానంద్ చెప్పేదంతా శ్రద్ధగా వింటుంది. ఈవిధంగా ఆమెకు మనోవికాసం కలుగుతోంది. ఫాదర్ డేవిడ్ పోలీసులఎదుట దొంగసాక్ష్యం చెప్పడం ఆమెమనస్సును గాయపరిచింది. అప్పటినుంచీ ఆమె మనస్సులో క్రైస్తవమతాన్నుంచి దూరంచేసే ఆందోళన బయలుదేరింది. అప్పుడప్పుడు వారి మాటలు విని శబనమ్‌కూడా ఆశ్చర్యపోయేది. శాంతి, సదానంద్‌లిద్దరూ వాదన చేసేటప్పుడు ఇద్దరు పహిల్వానులు కుస్తీ పడుతున్నట్టుగా వుండేది. తరచు శాంతి జవాబు చెప్పలేక పోవడంకూడా ఆమె చూస్తుండేది.

ఒకరోజున శాంతి అంది, "ఏసుప్రభువు, నన్ను నమ్మండి, మీకు స్వర్గద్వారాలు తెరచుకుంటాయి." అన్నాడు. అదే విషయాన్ని శ్రీకృష్ణుడుకూడా అన్నాడు, 'సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణాం వ్రజ అహం త్వాం సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః'

"నేను రెండింటికీ భేదం లేదంటాను."

"అయితే మీరు హిందువులే. మను తన మనుస్మృతిలో చెప్పినట్టుగానే, ఏసుప్రభువుకూడా పరమాత్ముని పది ఆజ్ఞలు (Ten commandments) అనే పేరుతో పది ధర్మసూత్రాలను చెప్పాడు. మహాపురుషుల భావనలన్నీ ఒక్కటేనని చెప్పవచ్చును."

"అయినప్పటికీ ఈ పదినియమాలే కాకుండా, హిందువులు నమ్మేవి చాలా విషయాలున్నాయి. హిందూ సమాజంలో వుండే విధానాలు నాకు ఏమాత్రమూ నచ్చలేదు."

"అందులో మీకు నచ్చని విషయా లేమున్నాయి?"

"ఆ విషయాన్ని గురించి మనం మాట్లాడుకోవలసిన అవసరం లేదనుకుంటాను. మనం మరొక విషయం మీద మాట్లాడుకో కూడదా ?"

"మాట్లాడుకోవచ్చు, కాని ఈ విషయంమీద భావ వినిమయం ఎందుకు కాకూడదు ? తక్కిన మతస్థుల వలె నేను కూడా మా మతం మీద విమర్శను వినలేననా? అలా అనుకుని మీరీ విషయం మీద మాట్లాడటంలేదంటే మీరసలు నన్ను అర్థం చేసుకోలేదన్న మాట. నన్నుగూర్చికాని లేక నా భావాలను గూర్చికాని ఇతరులేమనుకుంటున్నదీ నేను తెలుసుకోవలసిన అవసరముంది. కాని అదే మీరు చెప్పడానికి ఇష్టపడటం లేదు.

"ఇంగ్లీషు నాగరికతను అలవరచుకున్నవారు తాము అంగీకరించే విషయాల మీదనే మాట్లాడుతారు. దానికి కారణమేమంటే వారు తమ అభిప్రాయాలను ఖండించడం సహించలేరు. కాని ఇది హిందువులు చేసే పనికాదు. విరోధులుచెప్పే మాటలువిని వాటిని అధ్యయనం చెయ్యడం మా వ్యవహారంలో ఒక భాగంగా తలంచుతాము."

"పైగా మీకిష్టం కాని విషయాలన్నీ నాకు నచ్చుతాయని మీ రెలా అనుకున్నారు?"

"మానవుని స్వాతంత్ర్యాన్నిగూర్చి మీరు చాలా

చెబుతూంటారు కాని స్త్రీలకు వివాహం చేసుకొనడంలో గాని, వివాహ-విచ్ఛేదంలోగాని స్వాతంత్ర్యం వున్నట్లు నా కెక్కడా హిందువులలో కనిపించడంలేదు. ఆ విషయంలో మీరేమంటారు ?"

"అయినప్పటికీ హిందువులలో తమ భర్తలను విడిచి పెట్టేసిన స్త్రీలు అనేకమంది వున్నారు. భర్తను విడిచిపెట్టి నంతమాత్రాన వారు అహిందువులు కాలేదు."

"అవును. కాని వారిని నీచులుగా చూస్తారుగా ?"

"మంచి-చెడ్డ; శ్రేష్ఠము-నీచము అనేవి సాపేక్ష శబ్దాలు. సమయాన్నిబట్టి వాటి అర్థం విలువ మారుతూంటుంది. కాని, అంతమాత్రంచేత ఏ స్త్రీనో హిందూమతం నుంచి బయటకు గెంటేందుకు ఎవ్వరూ సాహసించలేరు."

"హిందూ సమాజం ఒక విశాలసాగరంలాంటిది. అందులో అన్ని తరగతులవారూ, అన్ని భావాలవారూ వుంటారు."

"అయితే ఏ పరిస్థితుల్లోనైనా ఒకే భర్తకు భార్యఅయి వుండటం ఒక మహత్తర విషయమా ?"

"ఇవేళ హిందూసమాజంలో అది ఒక మహత్తర విషయంగానే పరిగణింపబడుతోంది. రేపు అది ఒక విలువ లేని విషయంగా పరిగణింపబడవచ్చు. అందులో హిందూ-అహిందూ అనే ప్రశ్నయేరాదు. హిందువులలో కొన్ని ముఖ్యవిషయాలున్నాయి. వాటిని ఉల్లంఘించినవారు హిందువులు కాదు. అవేవో చెబుతావిను. ఈనాటి హిందూ నియమాలలో గోహత్యకాని, బ్రాహ్మణహత్యకాని చేసినవ్వా !

హిందూమతంనుంచి దూరం అవుతాడు. ఇక్కడ ఒకవిషయం చాలా ముఖ్యమైనది. ఆవు అంటే మానవ-శిశువులపాలనకు పాలునిచ్చే జంతువుగానూ, బ్రాహ్మణుడు అంటే విద్వజ్జనులుగానూ అర్థం చెప్పుకుంటే, ఆ నియమాలలో తప్పేమివుంది?

"అదేవిధంగా వర్ణాశ్రమ ధర్మము, పునర్జన్మ, కర్మ సిద్ధాంతాలను నమ్మేవారిని హిందువులంటారు. వర్ణము జన్మాన్ని బట్టి కాకుండా వృత్తినిబట్టి అనుకున్నట్టయితే, దానిని అంగీకరించడానికి మీకేమీ బాధ వుండదుగా ?

"తక్కిన మతాలకంటే హిందూ మతంలో వున్న విలక్షణత ఏమంటే, అందులో భావ స్వాతంత్ర్యము ఇచ్చినప్పటికి ఆచరణకు ఒక వ్యవస్థను ఏర్పరిచారు. ఆ వ్యవస్థను పాటించిన వ్యక్తిని శ్రేష్ఠుడుగానూ, పాటించని వారిని తక్కువ వారిగానూ చూస్తారు."

"అయితే భర్త అయోగ్యుడైనప్పుడు కూడా వివాహ విచ్ఛేదం ఉచితం కాదంటారా ?"

"వివాహ - విచ్ఛేదం అవసరమయ్యే సంఘటనలు వుండవచ్చు. కాని అది సామాజిక నియమం కాలేదు. అది ఎక్సెప్షన్‌గా భావిస్తారు. కాని ఆ ఎక్సెప్షన్ అనుకునే పరిస్థితికి లోనయ్యే స్త్రీ పురుషులకు సామాజిక నియమాలను పాటించే వారికి లభించినంత గౌరవం లభించదు. అయినప్పటికీ గౌరవ గౌరవాల కొలబద్ద కాలానుసారంగా ప్రతిచోటా మారుతూ వుంటుంది. వివాహ విచ్ఛేదమనేది దగ్గర భవిష్యత్తులోనే గౌరవమైన విషయంగా మారుతుందేమో, ఎవరు చెప్పగలరు? ఇంతకూ చెప్పుకోదగ్గ విషయమేమంటే ఎవరైనా

భర్తను విడిచిపెట్టేసినంత మాత్రాన హిందూమతం నుంచి బయటకు గెంటబడవలసిన అవసరం లేదు."

రెండవ వివాహం పురుషులవలే స్త్రీ లెందుకు చేసుకో కూడదు?"

"ఎవరైనా స్త్రీ మొదటి భర్తను విడచిపెట్టేసి రెండవ వివాహం చేసుకుంటే ఎవరు కాదనగలరు? ఆమె చేసింది మంచిపనిగా చూడక పోవచ్చు. అదే విధంగా పురుషుల విషయంలోనూ జరుగుతుంది. ఒకటే వివాహం కాని ఒక్క తే భార్య గాని వున్నవారికి వున్న గౌరవం రెండవ పెళ్ళి చేసుకున్నవానికిగాని, ఇద్దరు భార్యలున్నవానికి గాని లభిం చదు."

"అయినా ఇద్దరు భర్తలున్న స్త్రీని నిందిస్తారు కాని, ఇద్దరు భార్యలున్న పురుషుని నిందించరు."

"తిరిగి మీరు అదేమాట అంటున్నారు. గౌరవా గౌరవములనేవి ప్రతి సమాజంలోనూ కాలాన్నిబట్టి అనేక రకాలుగా మారుతూవచ్చాయి, మారతాయి కూడానని చెప్పానుగా. కాని సిద్ధాంతం మాత్రం అదే. ఒక్క వివాహం చేసుకున్నవానికి లభించినంత గౌరవం, రెండు వివాహాలు చేసుకున్నవానికి లభించదు. హిందూ సమాజంలో పురుషుడు రెండు వివాహాలు చేసుకోనడం అంత ప్రమాద కరంగా భావించబడలేదు. దానికి కారణం వుంది. హిందూ సమాజంలో పుత్రుడే తండ్రి సంపదకు వారసుడు. ఒక స్త్రీకి ఇద్దరు భర్తలు వున్నట్టయితే, ఎవరు ఏ తండ్రి కొడుకో నిర్ణ యించడం అసాధ్యమైపోతోంది. అప్పుడు ఆస్తి పంపకంలో

చాలా కష్టాలు వస్తాయి. అదే పురుషుడు బహు పత్నీ వ్రతాన్ని పాటించడంలోనైతే అటువంటివేమీ వుండవు.”

“అంటే హిందూ సమాజంలో ఉత్తరాధికార సిద్ధాంతాలు సరిగా లేవన్నమాట.”

“అయ్యుండవచ్చు. ఈ సమస్యను పరిష్కరించడానికి స్త్రీకి కూడా సంపద ఏర్పాటు చెయ్యొచ్చు. అటువంటప్పుడు ఇద్దరు భర్తలను చేసుకునే స్త్రీకి కూడా, ఇద్దరు భార్యలను చేసుకున్న పురుషునితో సమానంగా గౌరవం వుండొచ్చు. అటువంటప్పుడు ఉత్తరాధికార నియమాలను కూడా మార్చవలసి వుంటుంది.

“ఇప్పుడు ఆర్థికవిధానాలు మారుతున్నాయి. దానితో గౌరవా గౌరవాల కొలబద్దలుకూడా మారతాయి. ఒక ధనవంతురాలు రెండవ వివాహం చేసుకుని గౌరవం పొందవచ్చు.”

తరువాత చాలాసేపు ఆ స్త్రీలో స్త్రీ పురుషులకు సమాన హక్కులు వుండాలా లేదా అనే విషయంమీద చర్చ జరిగింది. అటువంటి వ్యవస్థవల్ల వచ్చే నష్టాలను సదానంద్ శాంతికి నచ్చజెప్పాడు.

4

శాంతి ఉద్దేశ్యంలో హిందూసమాజం ఒక సడలిపోయిన వ్యవస్థ. ఎటుచూసినా ఆమెకు ప్రమాదకరమైన వ్యవస్థయే కనిపించేది. ఇవేళ మొట్టమొదటిసారిగా స్త్రీల హక్కులనుగూర్చి ఇంత విశిష్టమైన చర్చ జరిగింది. సదా

నంద్ చెప్పిన ఒకవిషయం ఆమెకు బాగా నచ్చింది. అదే మంటే, ఒకవ్యక్తిని గౌరవించడం, అవమానించడం ఒకటి, ఆ వ్యక్తిని సమాజంనుంచి బహిష్కరించడం మరొకటి. మహమ్మదీయులు, క్రైస్తవులలో మహమ్మదు, ఏసుప్రభువు చెప్పినది కాదనేవారిని ఆయా సమాజాలనుంచి బహిష్కరించడం వుంది. కాని, గీతలో కృష్ణభగవానుడు చెప్పిన, 'మామేకం శరణం వ్రజ'ను అంగీకరించనివారిని అహిందువులుగా చూడరు. హిందువులలో మోక్షానికి వేరువేరు మార్గాలను చెప్పిన ఆచార్యులు చాలమంది వున్నారు. అందరినీ కృష్ణుడుతో సమానమైన పూజ్యనీయులుగానే భావించారు.

ఇవేళ శాంతి హిందూసమాజాన్ని ఇంతవరకూ చూసే భావన దెబ్బతింది. హిందూసమాజాన్ని ఆమె ఇంతవరకూ రంగుటద్దాలతో చూసింది. అవి తీసివేయగానే ఆవేళ దాని నిజస్వరూపం తెలిసింది.

పరిణామస్వరూపంగా, అటు దావా జరుగుతోంది. ఇటు శాంతి సదానంద్‌లలో హిందూసమాజంలోని అనేక వ్యవస్థలమీద భావవినిమయం జరుగుతోంది.

నెమ్మది నెమ్మదిగా శాంతికి హిందూసమాజం యొక్క నిజస్వరూపం అర్థమవుతోంది. ఇదికూడా మనుషుల సమాజమేనని ఆమె అనుకుంది. దానిలోని సభ్యులుకూడా మనుషులే పశువులుకాదు. తక్కిన సమాజాల సభ్యులవలే వారుకూడా తప్పులు చేస్తూంటారు. అందుచేత ఒక సమాజాన్ని మరొక సమాజంతో పోల్చేటప్పుడు వ్యక్తుల వ్యవ

హారాలనుకాదు, ఆయా సమాజాలకు ఆధారభూతమైన సిద్ధాంతాలను పోల్చిచూడాలని తెలుసుకుంది.

ప్రతి సమాజంలోనూ పొల్లు అధికంగా వుంటుంది. నిజంగా పనిచేసే వ్యక్తులు చాలా తక్కువవుంటారని ఆమె అర్థంచేసుకుంది. ఏ సమాజంయొక్క శ్రేష్ఠతనైనా ఆ కొద్ది మంది విశిష్టవ్యక్తుల జీవితాలనుబట్టి అంచనా వెయ్యాలి. అంతే కాని బహుసంఖ్యాకులను కాదు. వారు తరచుగా పశువులై వుంటారు.

ఏపని చెయ్యడంవల్ల సమాజంనుంచి బహిష్కరిస్తారు అనేదే చూడవలసిన విషయం.

సదానంద్ దావా సెషన్స్‌కోర్టు తరువాత హైకోర్టుకు వెళ్ళింది. ఈ దావాలో ఇరువయ్యొక్కమంది యువకుల జీవితంలో ఒక సంవత్సరం పోయింది. చాలామంది వకీళ్ళు ఫీజు లేకుండానే నిరంతరం పనిచేశారు. అసత్యమైన దావా చేసినందుకు హైకోర్టు పోలీసులను నిందించింది. ముద్దాయిలను విడిచిపెట్టేసింది.

ఈ అసభ్యమైన దావాచేసిన పోలీసుఅధికారులకు ప్రభుత్వం ప్రమోషన్‌ఇచ్చింది. అంతటితో ఆవిషయం ముగిసింది.

తరచుగా శాంతి ఫాదర్ డేవిడ్‌తో దావానుగూర్చి మాట్లాడుతుండేది. ఫాదర్ డేవిడ్ అబద్ధంచెప్పి చాలా నష్టాన్ని తెచ్చిపెట్టారని శాంతి ఆరోపించేది. అది నిజంగా పెద్దపాపం. కాని 'చర్చి' కొరకు చేసినపాపంకూడా పుణ్యమే అవుతుందని ఫాదర్ దృఢవిశ్వాసం.

దానివల్ల క్రైస్తవసంప్రదాయానికి ప్రభుత్వసహాయం వుంటుంది. దానితో క్రైస్తవసంప్రదాయం అభివృద్ధిచెందుతుంది.

"మిస్ పీటర్! నేను చెప్పిన ఈ చిన్నఅబద్ధం ప్రభుత్వంమనస్సులో క్రైస్తవులు ప్రభుత్వానికి ఒక మంచి డిఫెన్స్ లైన్ అనే భావాన్ని కలుగజేసింది. అందుచేతనే క్రైస్తవులకు ప్రభుత్వంలో పెద్ద పెద్ద ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ఇది ఎంతటి పుణ్యకార్యం. దానికిబదులుగా ఒక ఇరవైమంది విద్యాహీనులసమయం ఒకసంవత్సరం పోతేమట్టుకు నష్టమేముంది?"

"కాని ఫాదర్! మీలాంటి మతగురువులే ముఖ్యమైన సిద్ధాంతాలకు స్వస్తిచెప్పినట్లైతే, హిందువులందరూ క్రైస్తవులు తమ మతప్రచారంకోసం పాపం పుణ్యం,సత్యం అసత్యం ఉచితం అనుచితం అనేవిచక్షణను కోల్పోయారని అనుకోరా? వారు మోసగాళ్లు, వారి ఆత్మ అపవిత్రమైనది అని అనుకుంటారు."

"అలా ఎవరనుకుంటారు? అటువంటి విషయాలు ఆలోచించడానికి ఎవరికి అవకాశంవుంది. సామాన్యులందరూ క్రైస్తవులుకావడంవల్ల మంచి ఉద్యోగాలు, అందమైన అమ్మాయిలూ, ప్రభుత్వంలో పలుకుబడి దొరుకుతాయని అనుకుంటారు."

ఫాదర్ డేవిడ్ వ్యవహారంతో శాంతి క్రైస్తవమతంలోవున్న నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయింది. ఇప్పుడు ఆమె ఆదివారంనాడు చర్చికి వెళ్ళడంలేదు. ఫాదర్ డేవిడ్

దగ్గరకువెళ్ళి తన అనుమానాలు తీర్చుకోవడం, ఆయన ముందు అపరాధాలను స్వీకరించడం మానివేసింది.

ఆమె స్కూల్లో పిల్లలకు హిందీ చెబుతుంది. స్కూల్లో చదువుకునే పిల్లలు చాలామంది హిందువులే. మునుపటివలే హిందూసమాజాన్ని నిందించడం మానివేసింది. ఇప్పుడు ఆమెనోటంట అప్రయత్నంగానే సీత, సావిత్రుల ప్రశంసలు వెలువడుతున్నాయి.

ఆమె మహాభారతకథను, అమ్మాయిలకు చెబుతూంటే, ఒకపిల్ల లేచి అడిగింది, "ద్రౌపదికి అయిదుగురు భర్తలు వున్నారుకదండి!"

శాంతి అంది, "అవును, కాని అది ఎప్పటివిషయమో తెలుసా?"

"ఎప్పటిదండి మాష్టారూ?"

"అప్పటికింకా మోజెస్ (ఆదమ్‌కు పదవతరంలో జన్మించిన ఒక మతసంస్కర్త) మహాత్ముడు జన్మించలేదు. ఈనాడు చాలా నాగరికులుగా భావింపబడే ఇంగ్లండు, అమెరికా ప్రజలు ఆ కాలంలో కోయలులా అడవులలో చెట్ల మీద జీవించేవారు. వారికి బట్టలుకట్టుకోడం చేతకాదు. వివాహపద్ధతియే తెలియదు. క్రిందటిరోజు తమభర్త ఎవరో స్త్రీలు మరచిపోయేవారు."

తమ అధ్యాపికలో ఈ పరివర్తనానికి అమ్మాయిలందరూ చాలా ఆశ్చర్యపోయారు.

కొంతమంది క్రైస్తవులఅమ్మాయిలు హెడ్‌మిస్ట్రెస్‌కు శాంతిదేవిలో వచ్చినమార్పును తెలియజేశారు. ఒకరోజున

ఆమె తనగదిలోకి పిలిచి అడిగింది. "నువ్వు క్లాసుల్లో హిందూ మతాన్ని పొగుడుతున్నావని తెలిసింది. నిజమేనా ?"

"హిందూమతం సంగతి నాకు తెలియదు. కాని ప్రాచీనభారతీయుల విషయాలు నిందింపతగినవి అనుకోను. పిల్లలకు పాఠంచెప్పేటప్పుడు ఆవిషయాలు వచ్చినట్లైతే పూర్వీకులను నిందించేవారివాదనను ఖండిస్తుంటాను."

"వాళ్ళు మన పూర్వీకులుకారు. ఒకవేళ అయినా వారితో మన కేమి సంబంధం? మనం వారి ధర్మాన్నికాని, వారి ఆచారవ్యవహారాలనుగాని అంగీకరించముగా ?"

"అక్కగారూ! అయినప్పటికీ వారు మన పూర్వీకులే. వారు అనాగరికులు విద్యావిహీనులు అనేది నిజంకాదు. మరొక్కవిషయం నేను చెప్పవలసింది హిందీసాహిత్యంకాని, భారతీయులను నిందించడం నాపనీకాదు."

"మిస్ పీటర్! ఈ స్కూలుఖర్చు ఏటా ఒకలక్ష అవుతుందన్న సంగతి నీకు తెలుసు. ఆదాయం ముప్పైవేలు కంటె వుండదు. తక్కినఖర్చును క్రైస్తవమతప్రచారం కోసం క్రైస్తవులలోని ధనవంతులే ఇస్తున్నారు. మనం సీత, ద్రౌపది, పద్మినులను ప్రశంసించడం మొదలెడితే స్వాభావికంగా వారి ఆచారాలను, భావాలను ప్రశంసించినట్టే అవుతుంది. అటువంటప్పుడు క్రైస్తవమతాన్ని ఎవరు తీసుకుంటారు ?"

"మనకు జీతాలనిచ్చేవారి ఆశయాలను మనం పాటించినట్టు జరుగదు.

"ఈవిధమైన పని ఈ స్కూలుఆశయాలకు విరుద్ధమని నేను హెచ్చరించవలసివస్తోంది."

శాంతిదేవికి ఇది ఒక నూతనఅనుభవం. ఆమె స్కూల్లో చాలా జాగ్రత్తగా పనిచేస్తోంది. క్లాసులో ఇటువంటి సంఘర్షణకు దారితీసే విషయాలేవీ రాకుండా చూసుకుంటోంది. అటువంటి విషయాలేమైనా వచ్చినట్లైతే ఆమె మాటమార్చివేస్తోంది.

సదానంద్ మానవుని కార్యాలన్నీ తరచు అదృష్టం యొక్క ప్రేరణవల్ల జరుగుతాయని చెప్పాడు. దానిలోని సత్యం శాంతికి అర్థమవుతోంది. ఆమె సదానంద్ సంపర్కంలోకి రావడం, అతనిభావాలు తనమనస్సును మార్చివేయడం, ఈనాడు ఉద్యోగంవూడిపోయే పరిస్థితుల్లో పడటం- అన్నీ ఏదో ఒక అతీతశక్తిప్రేరణవల్ల జరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. అలా జరుగకుండా ఆమె ప్రయత్నంచేస్తోంది. కాని పరిస్థితులు విరుద్ధంగా పనిచేస్తున్నాయి. అదృష్టం ఆమె పురుషార్థానికంటే బలవత్తరమైనదిగా ఋజువవుతోంది.

5

సదానంద్ దావానుంచి ముక్తిపొందగానే తనపని ప్రారంభించాడు. అతని మొదటిపుస్తకం 'పరిస్తాన్‌యాత్ర' మొదటి సంస్కరణ పూర్తయిపోయింది. రెండవసంస్కరణ ముద్రింపబడుతోంది. మొదటిసంస్కరణలో అతనికి వెయ్యి రూపాయలు వచ్చాయి. దానితో అతనికి మంచి ప్రోత్సాహంలభించింది. రెండవపుస్తకం వ్రాయడం ఆరంభించాడు.

ఇప్పుడతని దినచర్యలో మార్పువచ్చింది. ఉదయం ఏడుగంటలకు నకళ్లువ్రాసేపనికి వెళ్తాడు. అక్కడ నాలుగు రూపాయల పనిచేసి ఒంటిగంటకు ఇంటికివస్తాడు. భోజనం చేస్తాడు. చమేలీ ప్రభదగ్గర చదువుకుంటుంది. ఒకగంట, విశ్రాంతితీసుకుని సదానంద్ ఏదైనా తోటలోకి వెళ్తాడు. అక్కడ ఏకాంతంగా కూర్చుని మానవుని లోపాలు, విభేదాలగూర్చి వ్రాస్తుంటాడు.

ఇంటిదగ్గర మరొక సంఘటన జరుగుతుంది. ప్రభ రోజురోజుకు చిక్కిపోతోంది. చమేలీకి పుత్రుడు కలిగాడు. ప్రభ ఆ పిల్లవాణ్ణి పెంచుతూంది. కాని రోజురోజుకీ ఆమె శరీరం శుష్కించిపోతోంది. ఆమె దుర్బలమైన, తేజోహీనమైన ముఖాన్ని చూసి సదానంద్ చింతిస్తున్నాడు. ఇంట్లో అందరికీ ఆమె ఒక చింతాకారణంగా వుంది. సదానంద్ తరువాతవాడైన దేవానంద్ ఆర్ట్సు స్కూల్లో చిత్రకళ నభ్యసిస్తున్నాడు. అక్కడ చదవడం పూర్తయిపోయింది కాని ప్రసిద్ధకళాకారులు వేసినచిత్రాలకు ప్రతిచిత్రాలను తయారుచేస్తున్నాడు. అతను కూడా ప్రభవిషయంలో విచారిస్తున్నాడు. అతనొకరోజున తల్లితో, "అమ్మా! ప్రభకు పెళ్లి చేసెయ్యి" అని చెప్పాడుకూడాను.

"ఆమె వివాహంచేసుకోనంటోంది. పైగా ఈస్థితిలో ఆమెను ఎవరు చేసుకుంటారు?"

విషయం అంతటితోనే ముగిసేది. కాని దానితో ఎవరికీ సంతోషంకలిగేది కాదు. ఒకరోజున రమను కలుసుకునేందుకు సదానంద్ జలంధర్ వెళ్ళాడు. ఆమె వివాహ

మయ్యి సంవత్సరంన్నరపైగా అయ్యింది. కాని ఆమె ఇంత వరకూ లాహోరు రాలేదు. రమ, సుందర్ ఇద్దరూ తామె వ్వరినీ కలుసుకునేందుకు వెళ్ళకూడదనుకున్నారు. ఎవరికి వారిని చూడాలనివున్నా జలంధర్ వెళ్ళి కలుసుకుని వస్తు న్నారు. అందుచేత సుందర్ తండ్రి ప్రతినెలా వెళ్ళి చూసి వస్తున్నారు. సుందర్ తల్లి కూడా రెండుసార్లు వెళ్ళివచ్చింది. లక్ష్మి, సదానంద్, పరమానంద్, దేవానంద్‌లలో ఎవరో ఒకరు అప్పుడప్పుడు వెళ్ళి చూసివస్తున్నారు. ఈసారి సదా నంద్ వెళ్ళినప్పుడు ప్రభవిషయం చర్చకువచ్చింది. రమ ఒకమాట అన్నది. దానితో సదానంద్ ఆమెముఖం చూస్తూ వుండిపోయాడు. రమ అన్నది, "సదాఅన్నయ్యా! ఈవిషయం విచిత్రంగా కన్పించవచ్చు. కాని అదే మంచిదనుకుంటాను. ప్రభను ఈయనకు చేసెయ్యండి."

"సుందర్‌కా?"

రమ తలవంచుకుని, "అవును. నష్టమేముంది?"

సదానంద్ పట్టిపట్టి రమముఖం చూస్తున్నాడు. అతను మాట్లాడకపోవడంచూసి రమ అన్నది, "అది నీకు అమ్మకు, తక్కినవాళ్ళకు ఎంతవరకు నచ్చుతుందో నాకు తెలియదు. కాని అలా చెయ్యడంవల్లనే ఆమె బ్రతుకుతుందని నా ఉద్దేశ్యం. ప్రజలు కవలశరీరాలు రెండయినా ఆత్మ ఒక్కటే నని చెబుతుంటారు. ఏమైనాసరే అలా చేసినట్లైతే నేను చాలా ఆనందిస్తాను."

"కాని రమా! వివాహం చేసుకోవలసింది సుందర్.

ఇద్దరు భార్యలను పోషించవలసిన భారం అతనిమీద వుంటుంది."

"నేను ఆయన అనుమతితోనే చెబుతున్నా."

సుందర్‌ని వేరే తీసుకువెళ్ళి సదానంద్ రమ ప్రస్తావనను వినిపించాడు. అతను ఆశ్చర్యమేమీ చూపకుండానే అన్నాడు, "గతవారం మీ అమ్మగారు వచ్చినప్పుడు ప్రభ విషయమంతా చెప్పారు. దానిమీదట రమ, నేను ఆలోచించుకున్నాము. ఆమె ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇదొక్కటే ఉపాయమని నిశ్చయించుకున్నాము.

"లోకులు నన్ను నిందిస్తారని నాకు తెలుసు. మిమ్మల్ని కూడా నిందించవచ్చు. కాని సమాజంయొక్క ఇష్టప్రకారం మనకర్తవ్యాన్ని నిశ్చయించుకునేందుకు మనం పశువులం కాదు. మనమొక మనోవైజ్ఞానికపరీక్ష చేస్తున్నాము. పైగా ఆ పరీక్షయొక్క ఫలితాలు తెలుసుకునే చేస్తాము."

"నేను అమ్మతో మాట్లాడుతాను."

"నువ్వు వస్తావని నేను ఎదురుచూస్తున్నాను. నీ ప్రస్తావనలోని ఆశయాన్ని అర్థంచేసుకుని నన్ను హేళనచెయ్యవను కుంటాను."

"సరే, ఒకవేళ అమ్మ, ప్రభ అంగీకరించారనుకో, ఏమి చెయ్యను?"

"మీరు నాకు వైర్ ఇవ్వండి. నేను రమను మీదగ్గరకు పంపిస్తాను. ఆమె ప్రభ, తల్లి, నిన్ను, పరమానంద్‌ని తీసుకునివస్తుంది. ఇక్కడ ఇదే ఇంట్లో సూక్ష్మంగా వివాహం జరిగిపోతుంది. రేపు మానాన్నగారు వస్తున్నారు. నేను

విషయం ఆయనతో కూడా మాట్లాడతాను."

"సుందర్! నువ్వు నీ ఆర్థికపరిస్థితిని, ఆరోగ్యాన్నీ ఆలోచించుకున్నావా ?"

"నేను ప్లేయర్‌ని. ఫీల్డ్‌లో రోజూ అనేకసార్లు రెస్క్‌లు తీసుకోవలసివుంటుంది. కాని నాకేమీ భయంలేదు. ఈ వివాహమన్నా భయంలేదు. ఏదైనా చెయ్యవలసినప్పుడు నిర్భయంగా చేసివేస్తాను."

"సదానంద్ లాహోరు తిరిగివచ్చినతరువాత సుందర్, రమలు చెప్పినవిషయం తల్లికి తెలియపరచాడు. అది వినగానే లక్ష్మి స్థబ్దురాలై పోయింది. ఆ విషయం పరమానంద్‌కు చెప్పగానే, అతను దాన్ని ఒక అవమానకరమైన ప్రస్తావనగా భావించాడు. కాని సదానంద్ ఆ ప్రస్తావనను సమర్థించాడు. ఒక పశువుకైతే వాతావరణంలో అనుకూలించే శక్తివుండదని తల్లికి, పరమానంద్‌కి తెలియచెప్పాడు. మానవుడు అలా కాకుండా పరిస్థితులకు అనుకూలంగా మారగలడు. మనవిషయంలో అక్కచెల్లెళ్ళిద్దరను ఒకరికే చెయ్యడం లాభదాయకం. మనం అలా చెయ్యొచ్చు."

ప్రభకు ఆవిషయం చెప్పగానే ఆమె ఏడ్పుప్రారంభించింది. ఎందుకో ఆమె చెప్పలేదు. పగలూ, రాత్రికూడా ఏడుస్తూనేవుంది. సదానంద్ అది అంతులేని ఆనందంయొక్క స్వరూపం అనుకున్నాడు.

శాంతి సదానంద్‌ని కలుసుకుని నెలపైగా అయ్యింది. అతను పుస్తకంవ్రాయడం ఆరంభించినప్పటినుంచీ ప్రొఫెసర్ దుర్గాదాస్‌గారి ఇంటికి వెళ్ళలేదు. అందుచేత శాంతినిగాని,

శబనమ్‌ని గాని చూడలేకపోయాడు.

ఈవేళ శాంతిస్కూలుకు మధ్యాహ్నం శెలవు. సెయింట్ బైసెడిట్ జన్మదినం. స్కూల్లో పిల్లల ఆటలు, మీటింగ్ వున్నాయి. శాంతి మధ్యాహ్నం ఒంటిగంటకు సదానంద్ ఇంటికి వచ్చింది. పిల్లవాణ్ణి ఎత్తుకుని చమేలి గుమ్మంలో నుంచుంది. శాంతి ఆమెను అడిగింది, "సదానంద్ వచ్చారా లేదా ?"

"వస్తారు. చాలాళ్ళకు కన్పించారు. ఎక్కడ వుంటున్నారు ?"

"వదినా ! మీరు మాఇంటికి రావడంలేదేం ?"

"మీరు పెద్దవాళ్ళు. పిలవకుండా అక్కడకు వచ్చేందుకు నాకు భయంగావుంటుంది."

"ఓ ! కాని నాకు మీయింటికి రావడానికి భయం వెయ్యదే."

"ఒకటి—మీరు చదువుకున్నవారు. రెండు—స్కూల్లో మాస్టరుగా వుంటున్నారు. మూడు – మీరు మమ్మల్ని కలుసుకునేందుకు రావడంలేదుగా – సదానంద్ కొరకే వస్తున్నారు."

శాంతి కిలకిలా నవ్వింది. నవ్వుతూ అంది, "సరే వదినా ! ఇవేళ మిమ్మల్ని కలుసుకునేందుకే వచ్చాను. మీ ఇంటికి వెళ్దామా ?"

"రండి," చమేలి శాంతిచెయ్యిపట్టుకుని తనగదిలోకి తీసుకువెళ్ళింది.

"ఇదే నాగది. పెద్దఇల్లొకటి అద్దెకుతీసుకుందామని

అనుకుంటున్నాము. కాని ఏవో ఆటంకాలు వస్తూనేవున్నాయి. ఇప్పుడు సదానంద్ దావానుంచి బయటపడి గట్టిగా పని చేస్తున్నారుగా. మేము ఇల్లువెదకడం ఆరంభించాలి."

"ప్రభ ఏమిచేస్తోంది?"

"ఈవేళ ఉదయంనుంచీ ఏడుస్తోంది."

"ఏం, కారణమేమిటి?"

"ఏమీ చెప్పడంలేదు. కాని ఈమెకు తన అక్కగారు అంటే చాలా ప్రేమఅని మాకు తెలుసు. ఆమె వియోగంలో ఈమె కృశించిపోతోంది."

"మీరు ఆమెకు వివాహం చెయ్యడంలేదేం?"

"ఆమె ఒప్పుకుంటేగా?"

"నేనామెను కనుక్కోనా?"

"సదానంద్ వస్తూవుంటారు. ఆయన్ని అడగండి."

"ఆడపిల్లలవిషయంలో ఆయన కేమి తెలుసు?"

"మాఇంట్లో అందరికంటే ఆయన్నే తెలివైనవాడుగా భావిస్తాను."

ఆవిషయం శాంతికి ఆశ్చర్యం కలిగించింది. ఆమె చమేలీని పరమానంద్‌విషయంలో అనుగుదామనుకుంది. ఇంతలోనే సదానంద్ వచ్చాడు. శాంతి చమేలీతో మాట్లాడడంచూసి, ఆమెవైపే చూస్తూ నుంచున్నాడు. శాంతి లేచి నమస్కారం చేసింది. సదానంద్ నమస్కారంచేస్తూ అడిగాడు, "ఇవేళ ఎలావూడిపడ్డారు?"

"చాలారోజులనుంచి మీదర్శనం కాలేదు. మీరు రాలేదు. అందుచేత నేనే వచ్చాను. చూడండి, మీ వదిన

ఏమంటున్నారో. నేను మీకోసమే వస్తున్నానుకాని ఆమెను కలుసుకునేందుకు రావడంలేదట. అందుచేత ఆమె మాఇంటికి ఎలారాగలను అంటోంది."

"నిజమే అంది."

"అయితే ఈవేళ నేను వారిఇంటికే వచ్చాను. అమ్మ ఇంట్లో భోజనం చేస్తాను. దానితో ఆమె మాఇంటికి వచ్చినప్పుడు అక్కడ భోజనంచేస్తుంది."

సదానంద్ నవ్వాడు. చమేలీ చూస్తూవుండిపోయింది. సదానంద్ అన్నాడు, "అయితే వదినా! భోజనంపెడ్డించు. లేకపోతే వీరింటికి వెళ్ళినప్పుడు ఏమీ పెట్టరు."

చమేలి పిల్లాణ్ణి మంచంమీద పండుకోబెట్టింది. పిల్లవాడు వడిలోనే నిదురపోయాడు. ముగ్గురూ పైఅంతస్థులోకి వెళ్ళారు. చమేలి వంటింట్లోకి వెళ్ళింది. సదానంద్ తల్లితో అన్నాడు, "అమ్మా ఈవేళ ఈవిడ మనింటిదగ్గరే భోజనం చేస్తారు."

"మంచిది! చాలా సంతోషం."

"కాని అమ్మా! మీరు పాత్రలు పారవెయ్యవలసివుంటుందేమో? నేను క్రైస్తవమతస్థురాల్ని"

సదానంద్ జవాబిచ్చాడు "అప్పుడు చాలా మజాగా వుంటుంది. భోజనంచేసినతరువాత పాత్రలుకూడా ఉచితంగా లభిస్తాయి."

లక్ష్మి జవాబు చెప్పకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది. చమేలి పకోడీలు, పూరీలు తయారుచేస్తూంది, ప్రభ మిద్దెమీద కూర్చుని ఏదో పుస్తకంచదువుతోంది. తక్కిన పిల్లి

లందరూ స్కూలుకివెళ్ళారు. శాంతి ప్రభవిషయంలో అడిగింది.

"మీరు ఆమెవివాహం ఎందుకు చెయ్యడంలేదు ?"

"ఒక మంచి చదువుకున్నఅబ్బాయిని చూశాము. కాని ఆవిషయం ప్రభకు తెలియగానే తిండీతిప్పలు మానేసింది. ఇక తప్పక ఆ ప్రయత్నం విడిచిపెట్టేశాము. రమ ఈమెను సుందర్‌కిచ్చి చెయ్యమని సూచనచేసింది."

"సుందరతోనా ? ఏమైనా పిచ్చెక్కిందా ?"

"సుందర్ ఆమెప్రస్తావనను అంగీకరించాడు. సుందర్ తండ్రికూడా ఏమీ అడ్డుచెప్పలేదు."

"నాకదేమీ అంత నచ్చలేదు."

"మేము దానికి అంగీకరించాము. కాని షరతు ఏమంటే ప్రభకూడా ఇష్టపడాలి."

"అయితే మీరు ప్రభతో ఈవిషయం చెప్పారా ?"

"ఈపని ఉదయం అన్న ఆమెతో చెప్పింది."

"అయితే ఆమె ఏమి జవాబు చెప్పింది ?"

"ఆమె ఏడవటం మొదలెట్టింది."

"అంటే...?"

"నేను వాటిని ఆనందభాష్పాలుగా భావించాను. అయినా రెండుమూడురోజులు పరీక్షించిగాని ఆమెఅభిప్రాయం నిక్కచ్చిగా చెప్పలేము."

"అయినప్పటికీ ఈ ఇరవదొవ్యోశతాబ్దంలో ఒకవ్యక్తికి ఇద్దరుభార్యలు వుండటం మోటుగా కన్పిస్తుంది."

"మోటుగావున్నా, దానివల్ల ప్రభ సుఖపడినట్లైతే

దానివల్ల హాని ఏమీలేదనుకుంటాను. హిందువులలో పురుషుడు రెండువివాహాలు చేసుకోవచ్చు. రెండువివాహాలు విశేషపరిస్థితుల్లోనే అంగీకరించబడ్డాయి. ఇంతకంటే పరిస్థితుల్లో విశేషం ఇంకేమి కావాలి?"

"మీ హిందువులు బాగున్నారు! ప్రతివిషయంలోనూ ఒక యుక్తిని కల్పిస్తారు?"

"దానినే ఎడాప్టబిలిటీ అంటారు. ఏజాతిలో ఎడాప్టబిలిటీ అధికంగావుంటుందో అది ప్రపంచంలో ఎటువంటి పరిస్థితుల్లోనైనా జీవించగలశక్తిని కలిగివుంటుంది."

"చూడండి శాంతిదేవి! హిందూజాతి, దాన్నే ఆర్యజాతిఅంటారు–చాలా పురాతనమైనది. ఈనాటి సాహిత్యకారులుకూడా అది పదివేల సంవత్సరాలనాటిదని ఒప్పుకుంటారు. వేదాలువ్రాయబడినప్పటినుంచీ వాటినే ప్రమాణగ్రంథాలుగా భావిస్తూ భగవంతునిలో అగాధవిశ్వాసం కలిగివున్న మేము ఇప్పటివరకూ జీవిస్తూనేవున్నాము. దాని కారణం ఏమంటే మేము వేదాలలో చెప్పబడిన ముఖ్యసూత్రాలను అనుసరిస్తూవచ్చాము. కాలగమనంలో పరిస్థితులను అనుకూలంగా మార్చుకోగలిగేశక్తి మాలో వుంది."

"ఈ రెండువివాహాలపద్ధతికూడా ఉద్దేశ్యరహితమైనది కాదు. ఇది మా ఎడాప్టబిలిటీకి చిహ్నము."

6

చమేలీ, లక్ష్మి, భోజనంవడ్డించి తీసుకువచ్చారు. చమేలి వంటింట్లోకివెళ్ళి పూరీలు తయారుచేస్తోంది. లక్ష్మి

వారిదగ్గర కూర్చుని వడ్డిస్తోంది. శాంతి తింటోంది, "అమ్మా! మీకుమారుడు ఏమంటున్నారో. చూడండిమీరు ఈపాత్రలు అపవిత్రమయ్యాయని పారవేస్తారుట. నేను వాటినికూడా తీసుకువెళ్ళొచ్చునట. ఎంత ఆనందమైనవిషయం! భోజనంతో పాటు పాత్రలుకూడా దొరుకుతున్నాయి."

"అవునమ్మా! కాని నాకు మరొకసందేహం కలుగుతోంది."

"ఏమిటి ?"

"బ్రాహ్మణులఇంట భోజనంచేస్తే జన్మజన్మాంతరాల నుంచికూడా వచ్చే పాపాలన్నీ పోతాయి. నువ్వు చాలా శీలవతివి, నాగరికురాలవుకూడాను. మాయింటిభోజనం తినగానే ఎంత పవిత్రురాలవవుతావంటే ఇక నువ్వు క్రైస్తవుల ఇంట వుండదగవు. అందుచేత నిన్ను మాయింటిపిల్లగా చేసుకుని ఇక్కడే వుంచేసుకుంటాము."

శాంతిముఖం సిగ్గుతో ఎఱ్ఱబడిపోయింది. సదానంద్ అన్నాడు. "అమ్మా! నీకు ఇద్దరు కూతుళ్ళు చాలరా ?"

"చాల్లే. నాకు ఇదివరకే ముగ్గురుకూతుళ్ళు వున్నారు. రమ, ప్రభ, పుష్పలు. ఇప్పుడు ఈమెకూడా వచ్చినట్టయితే నష్టమేముంది ?"

సదానంద్, శాంతి నవ్వుతున్నారు. కాని ఆమెముఖం కందగడ్డలా ఎఱ్ఱగా అయిపోతోంది. చమేలీ మరికొన్ని పూరీలు తీసుకువచ్చింది. శాంతి ఇక తినలేనంది. చమేలి ఆశ్చర్యంతో అడిగింది. "ఇంతేనా ?"

"నేను రొట్టెలు తినేవచ్చాను. పాత్రలుదొరుకుతా

యని ఆశతో కూర్చున్నాను. కాని అమ్మ అవి నాకు కాకుండా చేసేశారు.''

"నువ్వు రెండుమూడు పూరీలేకాదు, ఒక చిన్న ముక్క తిన్నా బ్రాహ్మణురాలివైపోతావు. ఇప్పుడిక అందులో సందేహమేలేదు.''

"అమ్మా! దగ్గరకుచేరినంతమాత్రాన ధర్మపరివర్తన చేసివేసేందుకు హిందువులు మహమ్మదీయులునంటివాళ్లు కాదు.''

"నువ్వు చాలా నిస్వార్థుడవే. ఒక మంచి అమ్మాయి మారుతూంటే కాదంటున్నావు.''

భోజనానంతరం సదానంద్‌బయటకువెళ్లేందుకు బయలుదేరాడు. శాంతికూడా అతనివెంట బయలుదేరింది. ఆమె అడిగింది, "ఎక్కడకు వెళ్తున్నారు?''

"రోజూ ఏదోఒక ఏకాంతప్రదేశానికి వెళ్ళి నాపుస్తకం వ్రాసుకునేవాణ్ణి. కాని ఈవేళ నీవు ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడకు వెళ్దాం.''

"అయితే ఇంటికివెళ్దాం నడవండి. అన్నయ్య కాలేజి నుంచి వచ్చేసివుంటారు. శబనమ్‌వదినకూడా వుంటుంది. అక్కడ వారిని కలుసుకుని తరువాత ఎక్కడికైనా షికారుకు వెళ్దాం.'' అంది ఆమె. "నడవండి'' అన్నాడు, సదానంద్.

శబనమ్ వరండాలోకూర్చుని చంటిపిల్లాడి మేజోళ్ళు అల్లుతోంది. సధానంద్, శాంతి రావడంచూసి లేచి వారిని కలుసుకునేందుకు వచ్చింది. సధానంద్‌కి నమస్కారంచేస్తూ

శాంతిని అడిగింది, "ఈవేళ ఈయన్ని ఎక్కడ పట్టుకు వచ్చావు?"

"ఈయన్ని పట్టుకోడానికి చాలాదూరం యాత్ర చెయ్యవలసివచ్చింది. చాలాకష్టంమీద ఈయన తల్లిచేత ఈయనకు శెలవుయిప్పించి తీసుకువచ్చాను."

"ఓహో!" శబనమ్ అంది, "అయితే అమ్మగారు పాలుత్రాగే పిల్లవాణ్ణి నీకూడా పంపించారన్నమాట. మంచిది, అయితే ఈ అబ్బాయిగారికి మిఠాయి తెస్తాను."

సదానంద్ శబనమ్‌అల్లే మేజోళ్ళు చూశాడు. అతనన్నాడు, "అయితే ఈమె పాలుత్రాగే పిల్లాడికోసం మేజోళ్లు అల్లటంకూడా ఆరంభించిందా?"

శాంతి నవ్వింది. ఆమె అంది, "మీరు రెండునెలల నుంచి రాలేదుగా? ఈలోపల చాలావిషయాలు జరిగాయి."

శాంతి చాలా ఆనందంగావుంది. శబనమ్‌కూడా తన స్థితికి చాలా తృప్తిగావుంది. అందుచేత నవ్వులతో సందడిగా వుంది. శబనమ్ మాటమారుస్తూ అంది, "సదానంద్! మీ వివాహానికి మమ్మల్ని ఎప్పుడు పిలుస్తారు?"

"ఎవరైనా దేవి ఈ భూలోకంలో అవతరించి నామీద కృపాదృష్టి చూపినప్పుడు."

"మీరు కవిత్వంచెప్పి మీ అన్నగారికి వధువును తెచ్చారని విన్నాము. ఆమె పేరేమిటి? పైగా కోర్టులో మీ కేసు తన కాబోయే భార్యను మీ కవిత్వంతో ఎత్తుకుపోయి మీ అన్నగారికి చేయించారని చెప్పినతను ఎవరు?"

"అతను శివరామ్. ఒకకన్ను గుడ్డిది, నలభైరెండు

సంవత్సరాల వయస్సు. పొడుగాటి వంకరముఖం. పక్షవాతం రావడంవల్ల కుంటివాడయ్యాడు."

"అవును. అతనికి కాబోయేభార్యను తన్నుకుపోయి మీ అన్నయ్యకు చేయించారు. ఇప్పుడు ఎక్కడైనా కవిత్వం చెప్పి మీకుకూడా ఒకఅమ్మాయిని సంపాదించుకోండి."

కవిత్వం చెప్పనేచెప్పాను. కాని దాని ప్రభావమేమీ కనపడలేదు."

శాంతి అడిగింది. "ఎక్కడ చెప్పారు? ఎవరిమీద ప్రభావంపడలేదు."

ఒకరోజున పబ్లిక్ పార్కులో కవిసమ్మేళనంలో చెప్పాను. ఆ అమ్మాయిమీద, తాత్కాలికప్రభావం పడింది. కాని కాలగమనంలో అది దూరమైపోయింది."

"అయినప్పటికీ నిరాశ చెందవలసిన అవసరంలేదు. మళ్ళీ ప్రయత్నంచెయ్యండి." శాంతి అంది, "విజయం లభించవచ్చు. ఒక వేళ లభించకపోతే మళ్ళీ ప్రయత్నించండి. మీరు కర్మయోగంలో నమ్మకంకలవారుగా."

అప్పుడే ప్రొఫెసర్‌గారు వచ్చారు. సదానంద్ కూర్చునివుండటంచూసి ఆయన అడిగారు, "దేనికొరకు ప్రయత్నించమంటున్నావు శాంతీ?"

"ఒకసారి ఈయన ఒక అమ్మాయిమీద కవిత్వం చెబితే ఆమె ఈయనఅన్నగారిని పెళ్ళాడిందని వదిన చెప్పింది. మరొక సారి కవిత్వంచెప్పినట్లైతే మరొక అమ్మాయి ఈయన్ని చేసుకుంటుందని మేము సలహాఇస్తున్నాము."

"ఓ, అర్థమయ్యింది! సదానంద్‌గారు ప్రయత్నం ఈవేళ ఇక్కడనుంచే ప్రారంభించండి."

శబనమ్ నాకవిత్వానికి నన్ను మోహించి మళ్ళీ నన్ను పెళ్ళాడటానికి సిద్ధపడితే చాలా అల్లరిజరుగుతుంది. అందుచేత నాకు భయంగావుంది."

"ఇప్పుడే మీకాళ్ళకు బేడీలుపడిపోయాయి. ఈ నేజోళ్ళు చూడలేదా?"

"చూశాను. కాని కవిత్వంయొక్క ప్రభావంవల్ల ఆమె బేడీలనుకూడా తెంచుకుని జారిపోతే, మీరేమి చేస్తారు?"

"ఏం శబనమ్?" ప్రొఫెసర్‌గారు నవ్వుతూ అడిగారు, "ఈయన అంత మంచి కవిత్వం చెబుతారా?"

"మంచి-చెడ్డల విషయం ఈయనకంటె పెద్దకవులే నిర్ణయించాలి. నాకు తెలిసినంతమట్టుకు ఈయన కవిత్వం హృదయానికి గుచ్చుకునేలా వుంటుంది."

"అయితే సదానంద్! ఇవేళ ఇక్కడ కవిత్వం చెప్ప వలసిందే"

"నా కవిత్వానికి శబనమ్ నన్ను మోహించినప్పటి నుంచీ స్త్రీలముందు కవిత్వం చెప్పగూడదని నిశ్చయించు కున్నాను."

ప్రొఫెసర్ అడిగారు, "కాని ఇక్కడ మిమ్మల్ని మోహించేవారు ఎవరున్నారు? శబనమ్‌మీద, ఇక మీమాయ పని చెయ్యదుగా, ఇక......"

శాంతి మధ్యలోనే అంది, నా సంబంధం లేనేలేదు.

ఈయనతల్లి "నాలుగుపూరీలు తినిపించి 'నువ్వు మా అమ్మాయివయిపోయావు' అన్నారు."

"అయితే సరే. ఇప్పుడు ఇక్కడ మీకవిత్వం మీద మోహితులయ్యేవారు నేనుతప్ప ఇంకెవ్వరూ లేరు."

టీవచ్చింది. శాంతి అంతరికీ టీఇస్తుంటే శబనమ్ అన్నది, "శాంతిదేవీ! ఆరోజు వ్రాసిన కవిత్వం నువ్వే వినిపించు."

"అయితే బాగా నేవుంటుంది. శాంతిదేవి కవిత్వం వినిపించినట్లైతే, నేనుకూడా వినిపిస్తాను" సదానంద్ అన్నాడు.

"హుర్రే! హుర్రే!!" ప్రొఫెసర్‌గారు చప్పట్లు కొడుతూ అన్నారు.

"చాలాబావుంది. అయితే ఈవేళ ఇక్కడ కవిసమ్మేళనం అన్నమాట."

"కవిసమ్మేళనమే కాదు. శాంతిదేవి తనకవిత్వం వినిపించినట్లైతే, నాకవిత్వం నేను వినిపిస్తాను."

"శాంతీ! టీ నేను ఇస్తాను. నువ్వు నాకాఫీ తీసుకురా."

"ముందు టీ త్రాగనివ్వండి. తరువాత నాలో దాచుకునివున్న దుర్బలత్వాన్ని ఈయనముందు వెల్లడిస్తాను."

టీ త్రాగడం పూర్తికాగానే శాంతి తనగదిలోకి వెళ్ళి తనపద్యాలకాగితం తీసుకువచ్చింది. ఆమె తనపద్యాలు వినిపించింది. తరువాత సదానంద్ తనకవిత్వం వినిపించాడు. ప్రొఫెసర్‌గారి ప్రోత్సాహంమీద శబనమ్‌కూడా తనకవిత్వం వినిపించింది.

7

కవిత్వాలు వినిపించడం పూర్తయినతరువాత శాంతి సదానంద్‌ని అడిగింది, "ఇప్పుడు మీ ప్రోగ్రాం ఏమిటి ?"

"ఈవేళ నేను వ్రాయడానికి కూర్చోలేదు. అందుచేత పనేమీ లేదు. రాత్రి ఎనిమిదిగంటలకు, భోజనాలసమయానికి ఇంటికి చేరుకోవాలి. లేకపోతే అమ్మ దిగులుపడుతుంది."

"ఇప్పుడు అయిదున్నరేగా అయ్యింది. పదండి, అలా కాసేపు తిరిగివద్దాం."

"నేనివ్వేళ ఒకవ్యాసం వ్రాయాలి. అంచేత ఇక్కడే వుంటాను. మీరు వెళ్ళండి." అన్నారు ప్రొఫెసర్‌గారు.

శాంతి తనగదిలోకివెళ్ళి డ్రెస్ మార్చుకునివచ్చింది. ఆమె ఈరోజు చాలా విలువైనబట్టలు కట్టుకుంది. ముఖానికి పౌడర్ వ్రాసుకుంది. పెదాలకు లిప్‌స్టిక్ వేసింది. సదానంద్‌కు అదేమీ అర్థంకాలేదు. అతనడిగాడు; "వెళ్దామా ?"

ఇద్దరూ ఇంటినుంచి బయలుదేరారు. తిన్నగా లారెన్స్ గార్డెన్‌కి వెళ్ళారు. శాంతి తన ముస్తాబుకు కారణంచెప్పాలనుకుని అన్నది, "ఇవేళ మీతో షికారు వెళ్దామనుకోగానే స్కూలుటీచర్ డ్రెస్ తీసివెయ్యాలనిపించింది."

"నాతో షికారుకురావడానికి ఈ విలువైనబట్టలు వేసుకోవలసిన అవసరమేముంది ?"

"మిమ్మల్ని సిటీలో చాలామంది ఎరుగుదురు. అందుచేత మీతో వచ్చే స్త్రీకూడా ఒక పెద్ద ఇంటిఆవిడలా కన్పించాలిగా. పైగా వారు కన్పిస్తారేమోనని నాకు భయం వేసింది."

"వారు, ఎవరు ?" సదానంద్ నవ్వుతూ అడిగాడు.

"అయితే స్త్రీలు 'వారు,' 'ఆయన'అని ఎవరినంటారో కూడా తెలియదా ?"

"ఓ, అదా ? అయితే నన్ను కూడా ఎందుకు తీసుకు వచ్చారు ? నేను మీ ఇద్దరమధ్యా అడ్డంకాదా ? ఆయన్ను నాకు పరిచయంచేస్తానంటే నేనుకూడా మంచిబట్టలు వేసుకుని వచ్చేవాణ్ణేగా ?"

"ఆయన్ని మీకు పరిచయంచెయ్యడానికి కే మిమ్మల్ని కూడా తీసుకువచ్చింది. మీకు పెద్ద విలువైనబట్టలేమి అవసరంలేదు. భగవంతుడు మీకు సహజమైన అందాన్నే ప్రసాదించాడు. అందమైనబట్టలు లేకపోయినా మీరు అందంగానే కన్పిస్తారు."

"సరే ! బట్టలమాట అలా వుండనియ్యి. ఆయనతో వివాహం కావలసింది నీకు. అలంకరించుకోవలసిందికూడా నువ్వే. నాకు ఆయన్ని కలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది. ఆయనెవరు ? ఏం చేస్తుంటారు ?"

"ఆయన కవిత్వంచెబుతుంటారు. కథలపుస్తకాలు వ్రాస్తుంటారు. నగరంలోనే వుంటున్నారు. ఈవేళ ఇటు షికారుకువస్తారని విన్నాను."

"ఓ!" శాంతి తనని దృష్టిలోవుంచుకునే చెబుతోందని సదానంద్‌కు పూర్తిగా నమ్మకం కలిగింది. ఇదివరకే ఆమె తనని ప్రేమిస్తున్నట్టు అతనికి తెలుసు. అయినా ఆమెచెప్పినది అర్థంకానట్టుగా నటిస్తూ అడిగాడు.

"ఏమిపేరు? ఆయనతో పరిచయంచేసుకోవడం నాకు లాభదాయకనే అనుకుంటాను."

"పేరా? చూడండి, నేను క్రైస్తవురాల్ని. కాని హిందూస్త్రీలవలే తమ ప్రియులయొక్క పేరు చెప్పకపోవడ మనే పద్ధతి నాకు చాలాఇష్టం."

ఆరోజు ఆమె తనతో వివాహాన్నిగూర్చి తప్పకుండా మాట్లాడుతుందనుకున్నాడు సదానంద్. తానీవిషయాన్ని గూర్చి మనస్సులో చాలాసార్లు మననంచేసుకున్నాడు. తను ఒక మెట్రిక్ ఫెయిల్డ్ వ్యక్తి. జీవనోపార్జనకొరకు నకళ్ళు వ్రాసే పనిచేస్తూ, సామాన్యంగా చదువుకున్నవారికొరకు కథలు, పద్యాలూ వ్రాస్తుంటాడు. ఆమె ప్రొఫెసర్ గారి చెల్లెలు. బి. ఏ., బి. టి., పాసయ్యింది. నెలకు నూటయాభై సంపాదిస్తుంది. నాగరికత - సంస్కారంగల స్త్రీ. ఆమె తనని చేసుకోదనుకున్నాడు. పైగా తాను గట్టిహిందువు. ఆమె క్రైస్తవురాలు. ఈసంబంధం జరగటం అసంభవమనితలంచి తన మనస్సులో అటువంటి ఆలోచనలను త్రోసివేస్తూవచ్చాడు.

కాని ఇవేళ ఏకాఏకిని ఈ విధంగా విషయంముందుకు రాగానే చాలాజాగ్రత్తగా మాట్లాడుతున్నాడు. అతను ప్రస్తావన మార్చివెయ్యాలనుకునిఅన్నాడు, "అయితే హిందూ సంస్కారాలు ఇంకా మీమనస్సులో వున్నాయా?"

"అవును. సంస్కారాలుచూసి మనస్సుచూచి దూరం కానడం చాలాకష్టం. పైగా 'ఆయన' కూడా హిందువే. అటువంటప్పుడు, ఆ సంస్కారాలను మాపుకోవలసిన అవసరం కూడాలేదనుకుంటాను."

"కాని, శాంతిదేవీ! మీరు హిందూసమాజాన్ని ఒక పాతది, పనికిరానిదిగా చూస్తారుగా. అటువంటప్పుడు ఈ సంబంధం ఎలా ఏర్పడింది? ఆయన బాగా ధనవంతుడా? లేక ఏదైనా పెద్దపదవిలోవున్నాడా?".

"మా క్రైస్తవులలో వివాహాలు భగవంతుని ఇంట నిశ్చయమవుతాయని నమ్మకం. హిందువులుకూడా అలానే భావిస్తారనిమీరు చెప్పారుగా. అటువంటప్పుడు ధనం,పదవులను చూడవలసిన అవసరంలేకపోయింది. భగవంతుడుచూసి ఇది సరిగావుందని అనుకుని వుంటాడు, అందుచేతనే ఈ వివాహానికి ప్రేరణ లభిస్తోంది."

"అయినా ఆయన ఎవరు?"

"ఆయన ఒక కవి,పుస్తకాలు వ్రాస్తారని చెప్పానుగా"

"ఆయన ఎక్కడ వుంటున్నారు?"

"శాహల్మీగేటుదగ్గర ఒక సందులో."

"అయితే వివాహానంతరం నగరంలో ఒక ఇల్లు తీసుకుంటారా? ఇప్పుడున్నవీధి చాలా మురికిగా వుంటుందే."

"ఆవిషయం నేనాయన్ని అడగలేదు."

"అయితే వివాహానంతరం క్రైస్తవుడుగా మారిపోతాడా?"

"ఆవిషయం తెలుసుకోవలసిన అవసరంలేదు."

"అయితే ఆయనతో వివాహం నిశ్చయమయిపోయిందా?"

"ఈవేళ అవుతుంది. నేను మీఎదుట మాట్లాడదా మనుకుంటున్నా. మీరు సిఫారసు చెయ్యాలి."

సదానంద్ ఆలోచించి అన్నాడు, "మీకు సిఫారసు చెయ్యడానికి నాకు చాలా సంతోషంగావుంది. కాని మీ విషయంలో నాకు ఎక్కువగా తెలియదు. మీరు ఎక్కడి నివాసులు? మీరు క్రైస్తవులు ఎలాఅయ్యారు? క్రైస్తవ, హిందూధర్మాలమీద మీ అభిప్రాయాలేమిటి?"

"అయితే మీకవేమీ తెలియదా? మీరు ఏదో విధంగా ఇప్పటికి ఆ విషయాలన్నీ తెలుసుకునేవుంటారనుకున్నాను."

"కొన్నివిషయాలు తెలుసుకున్నాను. అవైనా ప్రత్యక్షంగా చూడటంవల్లనే."

"అయితే మీకు నావిషయంలో ఎంతవరకు తెలుసునో చెప్పండి. తక్కినవి నేచెబుతాను. దాన్నిబట్టి నా విషయంలో మీరు బాగా చెప్పగలుగుతారు."

"చూడండి! శాంతిదేవి ప్రొఫెసర్ దుర్గాదాస్‌గారి సహోదరి అని నాకు తెలిసింది. ఆవిడ బి. ఏ; బి. టి. వరకూ చదువుకుంది.

గరల్స్ క్రిస్టియన్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. నెలకు నూటయాభై రూపాయలు జీతం. అయిదడుగుల నాలుగుఅడుగుల ఎత్తు, చురుకుగా, అందంగా, బాగా వుంటుంది......"

"ఇక చాల్లెండి." శాంతి సగంలోనే అంది. అవన్నీ

పనికిరాని విషయాలు మీరు తెలుసుకున్నారు. వాటివల్ల నన్నుగురించి మీరేమీ చెప్పలేరు. వినండి, నా సంగతులు చెబుతాను.

"మేము జలంధర్ నివాసులం. మాతండ్రి, పినతండ్రి, పెదతండ్రి అందరూ ఒక సమిష్టికుటుంబమే. అన్నయ్య జన్మించిన తరువాత మా పినతండ్రి చనిపోయాడు. విధవ అయిన మాతల్లి, మేమిద్దరు పిల్లలం మా పెదతండ్రిగారి దయవల్ల బ్రతుకుతున్నాం. మానాన్న చనిపోయేముందు, మా పెదనాన్న ఆస్థిపంచివేసి తరువాత మా వాటాలోనిదే మాకోరకు ఖర్చుపెడుతూవచ్చాడు.

"అన్నయ్య ఆరవతరగతిలోకి రాగానే అమ్మ చనిపోయింది. తరువాత మాకు తక్కువరకం తిండీ, నలిగిపోయి చిరగటానికి సిద్ధంగావున్న బట్టలు ఇచ్చేవారు. అట్లాగే ఏదో విధంగా రోజులు గడుస్తున్నాయి. అన్నయ్య ఎప్పుడూ తన క్లాసులో ఫస్టుగా వచ్చేవాడు. అందుచేత ఆయనకు ఫీజులేదు. కొంత ఉచితవేతనంకూడా ఇచ్చేవారు. నేను నాల్గవతరగతి చదువుతుండేదాన్ని. ఫీజు, పుస్తకాలకు డబ్బు అడుగుతుండేదాన్ని.

"ఒకరోజున పెదనాన్న అన్నయ్యని పిలిచి ఇక మా ఖర్చు తాను భరించలేనని చెప్పారు. మా తండ్రిగారి వాటాకు వచ్చిన డబ్బంతా ఖర్చయిపోయిందట. అందుచేత అన్నయ్యని చదువుమానేసి ఏదైనా కొట్లో నౌకరుగా చేరమన్నారు.

"అన్నయ్య స్కూలు హెడ్‌మాష్టారు దగ్గరకు వెళ్ళి తనపేరు కొట్టివెయ్యమని చెప్పగా, ఆయన కారణం అడిగారు. అన్నయ్య పరిస్థితినంతా ఆయనకు చెప్పాడు. హెడ్ మాష్టరు విలియమ్‌పీటర్ ఒకక్రిస్టియన్ ఫాదర్. ఆయన అన్నయ్యను స్కూలు మానవద్దని చెప్పాడు. మేమిద్దరం క్రైస్తవ అనాథాలయంలో వుండేందుకు ఏర్పాటు చేశాడు. మేము పెదనాన్న గారి ఇల్లు విడిచిపెట్టి అక్కడ వుంటున్నాము. అన్నయ్య చదువులో ఎప్పుడూ ఫస్టు రావడంవల్ల అనాథాలయంలో మమ్మల్నిద్దరినీ బాగా చూసేవారు.

"మెట్రిక్‌లో అన్నయ్యకు స్కాలర్‌షిప్ వచ్చింది. రెవరెండ్ పీటర్ లాహోరు క్రిస్టియన్ కాలేజీలో చదువుకు నేందుకు ఏర్పాటు చేశారు. అప్పుడు నేనుకూడా లాహోరు వచ్చేశాను. అప్పుడే ఆయన మాకు క్రైస్తవ మతాన్ని ఇచ్చారు. అప్పటినుంచీ అన్నయ్య దుర్గాదాస్ పీటర్‌గాను, నేను శాంతిపీటర్‌గాను మారాము.

"నేను లాహోరు వచ్చేసరికి తొమ్మిదవతరగతి చదువు తున్నా. మేము రత్నచంద్‌రోడ్డునవున్న మిషన్ హవుస్‌లో వుండేవాళ్ళము. అక్కడ మాకు ఫాదర్‌డేవిడ్‌తో సంబంధం ఏర్పడింది.

అన్నయ్య ఎమ్. ఏ. పాస్‌కాగానే ఆ కాలేజీలోనే ఉద్యోగం దొరికింది. ఆయన ప్రొఫెసర్ అయ్యారు. నేను బి. టి. చదివి మా స్కూల్లోనే టీచర్‌గా చేరాను. అన్నయ్య మిషన్ - హవుస్‌లో వుండటం మానేసి ఈ యింట్లో సగం అద్దెకు తీసుకునివుండటం ఆరంభించాడు.

"మా పెదతండ్రి చేసిన కఠినమైన పని, మిష్టర్ పీటర్ మరియు ఫాదర్ డేవిడ్ ఇద్దరూ చూపించిన సానుభూతి నాలో హిందువులయెడ వ్యతిరేక భావాలను సృజించాయి. అదికాకుండా ఫాదర్ డేవిడ్ ప్రతివారం చేసే ఉపన్యాసాలు నా మనస్సులో హిందువుల మీద ఘోరమైన ఈర్ష్యను కలుగజేశాయి. కాని శబనమ్ దావాలో ఫాదర్ డేవిడ్ అబద్ధమాడటం, పైగా అలా చెప్పినందుకు ఆయన చూపించిన కారణం నా కళ్ళు తెరిపించాయి.

"తరువాత మీతో చాలా విషయాలమీద చర్చ జరుపడంవల్ల నాకళ్ళకున్న రంగుటద్దాలుతొలగిపోయాయి."

"ఇప్పుడు నేను క్రైస్తవురాలను కాను. నేను హిందువును కాకపోయినా హిందువులను ద్వేషించడంలేదు. నేను ఏ మతమూ లేనిదానిని కూడా కాదు. పరమాత్మ, ఆత్మ, మంచికార్యాలకు మంచిఫలితం అనేవాటిమీద నాకునమ్మకం వుంది. ఎవరైనా 'మీరు ఏధర్మాన్ని అంగీకరిస్తారు,' అని అడిగినట్టయితే 'మానవ ధర్మాన్ని' అని చెబుతాను.

"సరే, ఈ పరిచయం సరిపోతుందా, లేదా ? దీనినిబట్టి మీరు నాకు మంచి ప్రభావపూర్ణమైన సిఫారసు చెయ్యగలరా, లేదా ?"

ఇద్దరూ లారెన్సగార్డెన్‌లో తిరుగుతూ మాట్లాడుకుంటూన్నారు. సదానంద్ ఆమె ప్రశ్నకు జవాబు చెప్పాడు, "పరిచయం చెయ్యడానికీ, సిఫారసు చెయ్యడానికి కావలసిన విషయాలన్నీ తెలిశాయి. కాని ఆ మహాశయుడెవరో

కన్పించడం లేదే! ఆయనకెవరైనా అన్నదమ్ములున్నారా, లేక ఒంటరివాడా:?"

"వారిదొక పెద్దకుటుంబం. వారికి తల్లికూడా వుంది. ఒక అన్నగారు, అయిదుగురు తమ్ముళ్ళూ వున్నారు. ఒక అక్కగారు, ఇద్దరు చెల్లెళ్ళువున్నారు. ఇద్దరికి పెళ్ళయి పోయింది. మూడవ ఆమెవిషయం ఆలోచిస్తున్నారు."

"అలాగయితే కుటుంబీకులతో మాట్లాడవలసిందే. ముఖ్యంగా అన్నగారు, తల్లితో తప్పక మాట్లాడాలి."

"తల్లిపాపం సౌమ్యురాలు. ఆమెవిషయంలో నాకేమీ బాధలేదు, ఇక ఆయన అన్నగారివిషయంలోనే ఆలోచించాలి. ఆయన ఒక పెద్దవకీలుగారి గుమాస్తా అట. తప్పకుండా ఆయన చాలా తెలివైనవాడు, లోభి అయి వుంటాడు. మీరు ఆయన్ని కలుసుకోండి. ఆయన తనతమ్మునికి అంగీకారం తెల్పినట్టయితే పని అయిపోతుంది."

"చాలా కష్టమైనపనే అప్పగించారు. అయినా ప్రయత్నిస్తాను. ఇప్పుడు ఏడున్నర అవుతుంది. ఎనిమిదిగంటలకల్లా అమ్మముందు హాజరుకావాలి. ఇక మీరు చెప్పే ఆయనెవ్వరోకాని ఇంతవరకూ రానేలేదు. ఇప్పుడేమిచెయ్యాలో చెప్పండి."

"ఏంగుచేతనో ఆయన రాలేదు. మరొకవిధంగాకూడా జరిగివుండవచ్చు. ఆయనవచ్చి దాక్కొని మన మాటలన్నీ వింటూండవచ్చు. ఏమైనాసరే మనమిక వెళ్ళవలసిందే. అక్కడ మీతల్లి మీచెవులు నలిపితే ఆ పాపం నాకంటుకుంటుంది."

8

రమ ప్రస్తావన ప్రభకు చెప్పి వారం రోజులుపై గా అయ్యింది. లక్ష్మి, సదానంద్ ఈ ప్రస్తావనయొక్క ప్రభావం ప్రభమీద ఏవిధంగా వుంటుందో పరీక్షిస్తున్నారు. ప్రభ నోటితో ఏమాటా చెప్పలేదుకాని, ఆమె జీవనపద్ధతిలో చాలా మార్పువచ్చింది. ఆమె ఆనందంగాకనిపిస్తోంది. దానిని బట్టి ఈ వివాహం ఆమెకు ఇష్టమేనని అనుకున్నారు లక్ష్మి, సదానంద్.

మరొకయువకునితో వివాహం చేస్తామని చెప్పినప్పుడు ప్రభ భోజనం మానివేసింది. కాని ఈ సారి అలా ఏమీ చెయ్యలేదు.

ఈ విషయం రమకు వ్రాశారు. ఒకరోజున సుందర్, రమ లిద్దరూ లాహోరువచ్చి ప్రభను తీసుకువెళ్ళారు. ఆమెను కొన్నాళ్ళు తన దగ్గరవుంచుకుని ఆమె భావాలు వివాహానికి అనుకూలంగా వున్నట్టయితే, ప్రభతల్లికి వ్రాసి, ఆమెరాగానే వివాహం చేసుకోవాలని సుందర్ ఉద్దేశ్యం.

ప్రభ, రమ లిద్దరూ కలిసే పడుకుంటున్నారు, ఇద్దరూ తమ తమ విషయాలు చెప్పుకునేందుకు అవకాశం లభిస్తోంది. మొదట్లో కొన్నాళ్ళు ప్రభ రమ ప్రశ్నలకు సమాధానం చెప్పేదికాదు. తరువాత నెమ్మదిగా తన మనస్సులోని సందేహాలు చెప్పడం ఆరంభించింది. ప్రభ అడిగింది, "అయితే నువ్వు మామిడిపండు, జామిపండు పంచియిచ్చినట్టుగా భర్తను కూడా పంచి వేస్తావా?"

"ఏం? అందులో కష్టమేముంది?

"లోకంలో స్త్రీలందరు అటువంటి విషయాన్ని చాలా ఈర్ష్యతో చూస్తారుగా? మన వీధిలో రామి వుండేది తెలుసుగా? ఆమెభర్త వేశ్యదగ్గరకు పోయివస్తే ఆమె చాలా దెబ్బలాడేది."

"అది వేరేవిషయం. వేశ్య రామిభర్తదగ్గర డబ్బంతా దోచుకునేది. రామికి ఒక్క పైసాకూడా మిగిల్చేదికాదు."

కాని సోమ, భామ సవతులిద్దరూ ఎప్పుడూ దెబ్బలాడుకుంటూ ఉండేవారే?"

వాళ్ళిద్దరూ మూర్ఖులు. వాళ్ళభర్త ఇద్దరికీ రెండు చీరలు తీసుకువస్తే ఒకరికంటే ఒకరికి ఎక్కువ ఖరీదైనదికావాలనేవారు. దానితో ఇద్దరూ దెబ్బలాడుకునేవారు. ఎవరికి ఏమి ఇచ్చిందో మరొకరికి తెలియకుండా వాళ్ళభర్త ఇద్దరినీ వేర్వేరు యిళ్ళలో పెట్టాడు."

"కాని ఒక విషయం. మనయిద్దరికీ అమ్మకుమల్లే సంతానం కలగడం ఆరంభిస్తే మన ఇంటిపరిస్థితి ఏమీ బాగుండదు."

ప్రభా! అలా జరుగదు. ముందుగా మనకంతమంది పిల్లలు పుట్టనే పుట్టరు. పైగా అమ్మ ఇల్లు పిల్లలు ఎక్కువమంది కలగటంవల్ల కాదు, నాన్న త్రాగుడుకు. వేశ్యలకు ఖర్చుబెట్టడంవల్ల బాగుండేది కాదు."

"ఏమైనా, మనిద్దరినీ నీ భర్తనే పోషించాలి."

"భగవంతుడు నీకుకూడా భర్తను యిస్తాడులే."

ఈ యుక్తులేవీ ప్రభను వివాహానికి వశీకరించలేక పోయాయి. సుందర్‌లాల్ కూడా చాలా నచ్చజెప్పాడు. కాని ఆమె వినలేదు.

కొన్నాళ్ళ తరవాత లక్ష్మి వచ్చింది. ఆమె ప్రభకునచ్చ జెప్పింది. ప్రభ అంది. "నేను వివాహం చేసుకోను. కాని సుందర్ నన్ను చెల్లెలుగా చేసుకుని తన ఇంట్లో వుంచుకుంటే నా సమస్య తీరిపోతుంది. నాకురమ మీదద మోహం. తక్కిన ఎవరిమీదా లేదు."

సదానంద్ కూడా వచ్చాడు, ప్రభమాటలు విని ఆశ్చర్యపోయాడు.

సుందర్‌తో మాట్లాడాడు. సుందర్ అన్నాడు, "ప్రభ అలానే వుండటానికి ఇష్టపడితే, నాకేమీ అభ్యంతరంలేదు."

కాని ఆలోచించవలసిన విషయమేమంటే, ప్రభ వివాహంకాకుండా అక్కడ వుండటం ప్రజలలో చెడ్డప్రచారా నికి దారితీస్తుంది. కాని వారిద్దరూ వివాహం చేసుకునేందుకు కూడా సిద్ధపడినప్పుడు, అలావున్నప్పటికీ భేదమేమీలేదు. ఒక వేళ సుందర్ ప్రభలమధ్య అనుచితసంబంధం ఏర్పడినా ప్రమాద కరమైనదేమీ లేదు. ప్రభ సుందర్ భార్య అయితేమట్టుకు మాత్రం ఏమయ్యింది? ఇక సందేహించవలసినదల్లా సుందర్ ఉద్దేశ్యాలు దృఢంగా వుంటాయా, వుండవా అనేదే. వివాహ మనేది జరిగినా జరుగకున్నా భేదమేమీ లేదు. ఇక మిగిలినదల్లా ప్రభ ఖర్చుమాట. తాము ప్రతినెలా కొంతధనం పంపిస్తూ వుండవచ్చు.

సదానంద్ లాహోరు వచ్చినతరువాత పరమానంద్ పరిస్థితినంతా చెప్పాడు. పరమానంద్ అన్నాడు, "కుంవర్ సేన్ గారి విషయం వేరు. ఆయనది పెద్దవయస్సు. ఆయనతో కమల వివాహంమాట కూడా ఎప్పుడూ రాలేదు. ప్రభ సుందర్‌లకు వివాహమనే ప్రస్తావన వచ్చింది. అటువంటి పరిస్థితుల్లో వారిద్దరూ సంయమంతో వుండటం కష్టం. ఆమాట ఎలావున్నా, బయట వారి దృష్టిలో అది అసత్యంగా వుంటుంది. మనకు ఇంకా తమ్ముళ్ళు వున్నారు. ఒకసారి చెడ్డ పేరు వచ్చిందంటే వాళ్ళ పెళ్ళిళ్ళుకావడం చాలకష్టమవుతుంది."

సదానంద్ అన్నాడు, "అన్నయ్యా మానవునికి పశువులకు ఒకభేదంవుంది. పశువులు జీవితమంతా సంస్కారాల అధీనంలో పనిచేస్తుంటాయి. పశువులలోవలెనే మానవునిలో కూడా సంస్కారాలు వుంటాయి. అయితే అవి భిన్నంగా వుంటాయి. ఈ భేదమేకాకుండా మానవునిలో 'బుద్ధి' అనేది వుంటుంది. దాని సహాయంతో అతను వాతావరణానికి అనుకూలంగా ప్రవర్తిస్తుంటాడు. వాతావరణం సంస్కారాలకు విరుద్ధంగా వున్నట్టయితే, సంస్కారాలను త్యాగం చెయ్యవలసివుంటుంది. అదే మానవత్వం.

ప్రభ పరిస్థితి విలక్షణమైనది. సమాజంలో నియమాలు, పద్ధతులు విలక్షణ పరిస్థితులకొరకు ఏర్పడలేదు. అందుచేత ఆ నియమాలు, పద్ధతులద్వారా ఏర్పడిన మన సంస్కారాలు ఈ విలక్షణ సమస్యకు పరిష్కారం చూపించలేవు. అందుచేత ప్రభ కొరకు మనమొక నూతనమార్గం వెదకాల్సిందే."

"నువ్వు ఈవిధంగా తర్జనభర్జన చేసినప్పటికీ నా ప్రశ్న అలానేవుంది. అపకీర్తిని ఎలా ఎదుర్కోగలేది ?"

"చూడన్నయ్యా! నువ్వు ఒకరోజులో నిర్ణయించుకుని వివాహం, చేసుకున్నావు. మనల్ని ఎవరేమి చేశారు? ప్రజలు చమేలీ నా ప్రియురాలని అనేవారు కాని మన వ్యవహారంలో సరిగా వుండగానే అందరూ మాట్లాడుకూరుకున్నారు. అదే విధంగా రమ వివాహానికి కూడా చాలా గడిబిడి జరిగింది. సుందర్ తల్లి పెద్దతుపాను లేవదీసింది. మనం బ్రాహ్మణులమైనప్పటికీ ఒక క్షత్రియునికి చేశాము. ఎవరేమిచేశారు ?"

"నేను మరొక విషయం చెబుతాను. నేను ఒక క్రైస్తవుల అమ్మాయిని చేసుకోవాలనుకుంటున్నాను. అమ్మ అంగీకరించింది. ఇకనువ్వుకూడా అంగీకరించినట్టయితే పెళ్ళిచేసివేసుకుంటాను. లోకులు ఒకటి రెండురోజులు అల్లరి చేస్తారన్న సంగతి నాకు తెలుసు. కాని నాభార్య ధైర్యంతో ఆగగలిగిందంటే ప్రజలే మాట్లాడుకుంటారు. కొంతకాలం పోయిన తరువాత మమ్మల్ని నిందించిన ప్రజలే, మమ్మల్ని ప్రశంసిస్తారు."

లక్ష్మి ఇంట్లో సదానంద్ చెప్పినదానికి తిరుగులేదు. అతను తనమాటలను మానవత్వమనే త్రాసులో తూచి చెబుతుంటాడు. దానితో అతని మాటలను ఖండించడానికి ఎవరికీ ఆధారం దొరకదు.

"అయితే నువ్వు శాంతిని చేసుకోడానికి నిశ్చయించుకున్నావా ?"

"మీకేమీ అబ్జెక్షన్ లేకపోతేను."

"నేనొక్క విషయం చెబుదామనుకుంటున్నా. ఆమె బాగా చదువుకున్నది. స్కూల్లో టీచరు. మనఇంట్లో ఆమె వుండగలదా?"

"అన్నయ్యా! నేనామెతో ఏమీ దాయలేదు ఆమె చాలాసార్లు అమ్మను కలుసుకుంది. మనఇంటి పరిస్థితులన్నీ ఆమెకు బాగా తెలుసు. అయినప్పటికీ ఆమె వివాహానికి సిద్ధంగానేవుంది. మరొకవిషయం. వివాహప్రస్తావన ఆమె దగ్గరనుంచే వచ్చింది."

"అది బాగానేవుంది. కాని చాలామంది యువతీ యువకులు కామోద్రేకంలో కంగారుగా ఒక నిర్ణయానికి వచ్చి తరువాత పశ్చాత్తాపపడటంకద్దు."

"అయితే ఒక పనిచెయ్యండి. నేనొకరోజున ఆమెను టీకి పిలుస్తాను. ఆమె వచ్చినట్టయితే ఆవిషయాలన్నీ మాట్లాడవచ్చు."

ఇవేళ మాటల ఫలితంగా ప్రభకు ప్రతినెలా పాతిక రూపాయలు పంపించడానికి నిశ్చయించుకుంది, లక్ష్మి అలా పంపించవలసిన అవసరంలేదని సుందర్ కబురుపంపించాడు. అయినా లక్ష్మి పంపిస్తూనేవుంది.

ప్రతివారం ప్రభదగ్గరనుంచి ఉత్తరం వస్తోంది అక్కడ సమాచారాలన్నీ సదానంద్‌కి తెలుస్తున్నాయి. ఒకనెల తరువాత, తానుమిషనరీవారు స్థాపించిన కుట్టుపని స్కూల్లో చేరానని ప్రభ ఉత్తరంవ్రాసింది. ఆమెవ్రాసింది

"సుందర్ అన్నయ్యదయవల్ల నా ఆరోగ్యం బాగుపడు తోంది. నేను కుట్టుపని నేర్చుకుంటున్నాను. రెండుసంవత్స రాలలో మీకు, సుందర్ అన్నయ్యకు, భారం లేకుండా చెయ్యగలనని అనుకుంటున్నాను."

* * * *

9

ఒకరోజున శాంతి ఒంటిగంటకు సదానంద్‌ని కలుసు కునేందుకు 'ఇనామ్‌ప్రెస్' దగ్గరకువెళ్ళింది. సదానంద్ ఆశ్చర్యంతో అడిగాడు, "శాంతిదేవీ ఏమిటి విశేషం? ఇవేళ నేనే మిమ్మల్ని కలుసుకునేందుకు వద్దామను కుంటున్నా."

"మీరు సాయంకాలం అయిదు గంటలకుగాని రారు. కానిమీతో ఇప్పుడేపనివుంది. అందుచేత స్కూలుకి ఒకగంట శెలవుపెట్టి వచ్చాను. అదిగో, జట్కా ఆపుచేసి వచ్చాను, టైములోపల వెళ్ళిపోవాలని."

"ఏపనిమీద వచ్చారు?"

"మీ అంగీకారం కావాలి. ఇదిచూడండి" ఆమె బ్యాగ్‌లోనుంచి తీసి ఒకఉత్తరం ఇచ్చింది. అది పరమా నంద్ వ్రాసిన ఉత్తరం: ఇలా వ్రాసివుంది,

"మిస్ శాంతి పీటర్!"

నమస్తే. ఇవేళ సాయంకాలం నాలుగున్నరగంటలకు శ్రీ కుంవర్ సేన్ వకీలుగారి ఇంటివద్ద వారు, వారి ధర్మపత్ని

సరోజనీదేవీ, నాతోనూ టీ తీసుకునేందుకు రావలసిందిగా మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ధన్యవాదాలు.'

"బావుంది. ఇందులో నన్ను అడగవలసిన దేముంది?"

"అయితే నేను వెళ్ళనా?"

"వెళ్ళకూడదనుకోవటానికి కారణమేమైనావుందా?"

"మీరు అక్కడవుంటారా?"

"నన్నెవరూ పిలువలేదే."

"అయితే నెనొక్కర్తెను ఎలా వెళ్ళేది?"

"ఇక్కడకు ఎలా వచ్చారో అలానే జట్కాలో వెళ్ళండి."

"నాకు భయంగావుంది."

"ఏం! వాళ్ళేమీ భూతాలు కాదుగా?"

"ఒకరు వకీలు, మరొకరు వకీలుగుమాస్తా. ఇద్దరూ నన్ను ప్రశ్నలతో పచ్చడి చేసేస్తే, ఏం చేసేది?"

"పచ్చడి రుచిగావుంటే నేను తినేస్తాను."

"అదే సందేహంగావుంది. వారికి ఏమైనా తయారు చెయ్యడం వచ్చోలేదో నాకు తెలియదు. మీ అమ్మగారు కూడా అక్కడ వున్నట్లయితే బాగా రుచికరంగా తయారయ్యేది. వారు పచ్చడిచేయనే చేస్తారు కాని, తినడానికి పనికిరాకుండా ఎక్కువగా మాడ్చేస్తారని నామనస్సు చెబుతోంది."

"అదేంకాదు శాంతిదేవి! మీరు ఊరకనె భయపడుతున్నారు. సరోజినీదేవి మంచికూర తయారుచేస్తారు. ఆమె మిమ్మల్ని ఎట్లా తయారుచేస్తారంటే, నామాట అలా వుం

చండి, మిమ్మల్ని చూచిన ప్రతివారు మిమ్మల్ని పొందాలని కోరుకుంటారు."

"ఇక చాల్లెండి. పొగడ్త ఎక్కువైపోయింది. మీనోటితోనే నన్ను అక్కర్లేదనకుండా, ఒక వకీలుగారిద్వారా చెప్పించిన వాగ్దానం తప్పించుకుందామనుకుంటున్నారు."

"అయితే నేను ఏదైనా మాటఇచ్చానా? ఎప్పుడు?"

"ఆరోజున లారెన్స్ గార్డెన్‌లో నోటితో అనక పోయినా కళ్ళతో అన్నారుగా?"

"ఇప్పుడు నా కళ్ళేమంటున్నాయి?"

శాంతి టైముచూసుకుని అంది, "సాయంకాలం ఏడుగంటలకు రండి. వేడివేడి టిఫిను దొరుకుతుంది."

సదానంద్ ఫక్కునన్నాడు. "మంచిది, కాస్త ఆకలికడుపుతో వస్తాను."

అయితే భోజనం అక్కడే ఏర్పాటవుతుంది."

ఈ టీపార్టీ విషయం సదానంద్‌కి తెలుసునని, బుద్ధిపూర్వకంగానే అతన్ని పిలువలేదని శాంతి అర్థంచేసుకుంది. దానినిబట్టి తనని పరీక్షించబోతున్నారని ఆమె అనుకుంది. మనస్సును గట్టిబరుచుకుని సమయానికి అక్కడకు చేరుకుంది.

పరమానంద్ గేటుదగ్గర నుంచుని ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు. శాంతి జట్కానుంచి దిగగానే పరమానంద్ నమస్కారంచేసి అన్నాడు, "రండి. వకీలుగారు లోపల మీకోసం ఎదురుచూస్తున్నారు."

"మీ అమ్మగారుకూడా వచ్చారా?"

"లేరు ఆమెరాలేదు. ఏం?"

"ఆవిడ నా వకీలు. ఆవిడ లేకుంటే నేను దావాలో ఓడిపోతాను."

"మీరు ఆమెకు ఫీజు ఇవ్వలేదేమో! లేకపోతే ఆవిడ వచ్చివుండేది."

"ఫీజు ఇవ్వనే ఇచ్చాను. ఆవిడదగ్గర నా 'రన్నింగ్ ఎకౌంటు' వుంది. ఆవిడకు ఈవేళ వాయిదా వున్నట్టు తెలిసి యుండదు. లేకపోతే ఆమె తప్పక వచ్చివుండేవారు."

"అయితే మీరు న్యాయాలయాన్ని కేసు వాయిదా వెయ్యమని అడగండి."

"ఇద్దరూ హాల్లోకి వచ్చారు. ఇద్దరూ నవ్వడంచూసి సరోజినీదేవి అడిగారు, 'ఏమిటి పరమానంద్?"

"మనవకీలుగారు వున్నారుకాని, ఈవిడ వకీలుగారు రాలేదని ఈవిడ జడుస్తున్నారు."

"ఈవిడ వకీలు ఎవరు? సదానందా?" కుంవర్ సేన్ అడిగారు.

"కాదండి" శాంతినమస్కారం చేసి కుర్చీలో కూర్చుంటూ అంది.

"నేను నా వకాలత్ నామాను వీరితల్లికి ఇచ్చాను."

"ఆవిడ రాలేదే?"

"ఆవిడకు తెలియలేదనుకుంటాను. అందుచేత ఆవిడ వచ్చేంతవరకుగాను మరొకడేటు ఇస్తే బావుంటుందేమో?"

"అప్పటికి టీ చల్లారిపోతుంది." సరోజినిఅంది.

"అఖర్చు నామీంద వెయ్యండి."

"ఈ విషయం చాలా గంభీరమైనది. ఇది కోర్టు

స్పెషల్ సెషన్. మీమీద క్రాస్ ప్రశ్నలు ఆరంభించవచ్చని నా ఉద్దేశ్యం. అవసరమయినట్టయితే మీపక్షపు వకీలు గారు తరువాత క్రాస్ చెయ్యడానికి అంగీకారం ఇస్తాం."

"న్యాయాలయం ఆజ్ఞ వేసినప్పుడు ఇక తప్పదుగా." కుంవర్ సేన్ నవ్వుతున్నారు. పరమానంద్ టీ కలుపుతున్నాడు. అందరూ ఒక్కొక్క కప్పు టీ త్రాగినతరువాత కుంవర్ సేన్‌గారు మాటలు ఆరంభించారు. ఆయన అడిగారు. "శాంతిదేవీ! సదానంద్ ఆర్థికపరిస్థితి మీకు తెలుసు. అతను ఒక చదువుకున్న సమాజంలో తిరిగే భార్యయొక్క ఖర్చు భరించగలడా లేదా అనేది చెప్పడం కష్టం. ప్రస్తుతం అతను రోజుకు నాలుగైదురూపాయలు సంపాదిస్తున్నాడు. వివాహానంతరం మీరు ఉద్యోగం చెయ్యగలరా, లేదా అనేది ఆలోచించవలసిన విషయం. పైగా ఒక హిందువుని వివాహమాడటం మీస్కూలువారికి ఎలావుంటుంది? బహుశా వివాహానంతరము మీరక్కడ పని చెయ్యడం వీలుపడదేమో! వివాహానంతరం మీ ఆర్థికపరిస్థితి ఇది. తక్కినవిషయాలతో మాకు సంబంధంలేదు. మీరు క్రైస్తవులా, హిందువులా అనే విషయాలు మీరు, మీ భర్త చూసుకోవలసిందే. కాని కుటుంబంయొక్క ఆర్థికపరిస్థితి, మీపరిస్థితులను బాగా అర్థంచేసుకోండి. మేము మీ వివాహానికి మా అనుమతిని ఇస్తున్నాం."

శాంతి గంభీర ఆలోచనలో మునిగిపోయింది. ఆమె వకీలుగారి మాటలువిన్నది. తరువాత తన మనస్సులోని విషయాన్ని సరియైనమాటల్లో చెప్పింది. "నాకీ పరిస్థితులన్నీ

బాగా తెలుసు. ఆ స్కూల్లో నా ఉద్యోగం వుండదన్న సంగతికూడా నాకు తెలిసినదే. అయినప్పటికీ 'వివాహాలు భగవంతుని ఇంటిలో నిశ్చయమవుతాయి' అన్నవిషయం మీద నాకు నమ్మకంవుంది."

అది మేముకూడా ఒప్పుకుంటాము. కాని వివాహాలు నిశ్చయించుకునేందుకు భగవంతుడు మనకు బుద్ధినికూడా ఇచ్చాడు. మనం ఆ బుద్ధిని ఉపయోగించుకోనకపోతే, భగవంతుని నిర్ణయాన్ని మనం అంగీకరించినట్లు ఎలా అనుకోగలం?"

"భగవంతుడు బుద్ధితో మాట్లాడడు. అతను మానవుని హృదయంలో నివసిస్తాడు. అక్కడనుంచే తన ఆదేశాన్ని పంపిస్తాడు. చూడండి! ఈ వివాహం జరుగాలనే నా కోరిక. ఇక పోషణసమస్య అంటారా? అది జరుగుతూనే వుంటుంది. మేమిద్దరం ఏదొక దారి వెదుక్కుంటాం!

"ఇప్పుడేకాదు, ఎప్పుడైనాసరే స్థితిగతులు ఒక విధంగా వుంటాయని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?" మానవుడు ఈ దుస్తరసాగర తరంగాలమీద ఒక గడ్డిపరక వంటివాడు. అతను తన ప్రయత్నం, సాధన చేస్తూనే వుంటాడు. కాని పరిణామం భగవంతునిచేతిలో వుంటుంది."

శాంతి ఆవిధంగా చెప్పినతరువాత ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. అందరూ మౌనంగా మిఠాయితిని టీ త్రాగుతున్నారు. ఆఖరున కుంవర్ సేన్ గారు అన్నారు, "శాంతి దేవీ! నువ్వు పెద్ద పెద్దవకీళ్ళ నోళ్లే మూసివేయగలవు. ఇక నీకు వకీలు అవసరమేముంది? ఇవేళ నిర్ణయం నీపైనే జరిగింది."

పరమానంద్ నవ్వుతూ అన్నాడు. "క్షమించాలి వదినా! సదానంద్ మీతో పూర్తిపరిస్థితులు చెప్పాడో లేదోనని నాకు సందేహం కలిగింది. అందుచేత మిమ్మల్ని ఇక్కడికి రప్పించి కష్టపెట్టాము. మేము బీదవాళ్ళమన్నే విషయం తెలిసినప్పటికీ మీరు తీసుకున్న నిర్ణయానికి మా ధన్యవాదాలు."

10

శాంతిదేవి సదానంద్‌లిద్దరూ కోర్టులో అవసరమైన కాగితాలమీద సంతకాలుచేసి బయటకువచ్చారు. శాంతి అంది, "మనం పదినిమిషాలు చర్చికిపోయివస్తే బావుంటుందని నాకోరిక."

సదానంద్ అబ్జెక్టు చెయ్యలేదు. ఇద్దరూ టాక్సీలో మిషన్‌హావుస్‌చర్చికి వెళ్ళారు. అక్కడ ఫాదర్ డేవిడ్ ఆల్టర్‌ముందు దీపాలు వెలిగించి వారికోరకు ఎదురు చూస్తున్నాడు. ప్రొఫెసర్ దుర్గాదాస్, శబనమ్‌లిద్దరూ అక్కడే వున్నారు. సదానంద్ శాంతిదేవితో ఆల్టర్‌ముందుకు వెళ్ళి నుంచున్నాడు. ఫాదర్‌డేవిడ్ ప్రార్థనచేసేవరకు ఇద్దరూ మోకాళ్ళమీద నుంచున్నారు.

అక్కడనుంచి ఇద్దరూ సదానంద్ ఇంటికివెళ్ళారు. లక్ష్మి ఒక పెద్దఇల్లు అద్దెకు తీసుకుంది. పరమానంద్ బంధుమిత్రులనందరిని ఆహ్వానించాడు. ఇంటిముందు వివాహవేదిక వేశారు. పురోహితుడు వివాహంచేయించడానికి సిద్ధంగా వున్నాడు.

అంతమందిజనం రావడంచూసి శాంతి అడిగింది, "ఇక్కడ ఏమిజరుగుతోంది?"

"ఇక్కడ వీరందరిముందూ మనం భార్యాభర్తలయినట్టుగా ప్రమాణస్వీకారం చెయ్యాలి."

"ఇంకా దానిఅవసరమేముంది? మనం రెండుసార్లు ప్రమాణాలు చేశాముగా?"

"మరొకసారి చేద్దాం. నష్టమేముంది?"

"ఇదేమిటి?" వేదికను చూపిస్తూ శాంతి అడిగింది.

"ఇది పూజాస్థానము."

"ఇక్కడ ఏమిజరుగుతుంది?"

"మనదాంపత్య జీవితాన్ని సుఖమయంగాను, చిరస్థాయిగాను వుంచమని భగవంతున్ని ప్రార్థిస్తారు."

"అది మనం పూర్తిచేసే వచ్చాముగా?"

"ఇక్కడకూడా మళ్ళీ జరుగుతుంది. మా బంధుమిత్రులందరూ చూస్తారు."

"నాకేందులో ఏమీసారమున్నట్టు కన్పించడంలేదు."

"అయితే అయ్యుండవచ్చు."

"ఇక్కడ ఏమిజరుగుతుంది?"

"ప్రార్థన జరుగుతుందని చెప్పానుగా. అవిగోచూడు రెండు వున్నతి ఆసనాలు వున్నాయి. ఒకటి నాకొరకు, రెండవది నీకొరకు. నేను ఒక ఆసనంమీద కూర్చుంటాను. రెండవదానిమీద నువ్వు కూర్చోవాలి."

"నాకు అలసటగావుంది."

"అయితే లోపలికిపోయి విశ్రాంతి తీసుకో."

"అప్పటివరకూ వారేమి చేస్తారు?"

"చూస్తూవుండు. ఏదో మార్గం కనిపెడతారు."

"సరే కానివ్వండి. నేను లోపలికి వెళ్తాను."

సదానంద్ శాంతిని, ఆమెకోరకు అలంకరించబడిన ఒకగదిలోకి తీసుకువెళ్ళాడు. అక్కడ ఆమెను కూర్చోబెట్టి ట్రంకుపెట్టిలోనుంచి ఆమెదొక పెద్దఫొటో తీశాడు.

శాంతి ఆశ్చర్యంతో అడిగింది, "దానితో ఏమిపని వుంది?"

"చూస్తూవుండు. నేను నీకు బదులుగా దీనిని వుంచుతాను."

శాంతి ఆశ్చర్యంతో చూస్తూ వుండిపోయింది. సదానంద్ వేదికదగ్గరకువెళ్ళి ఒక ఆసనంలో శాంతచిత్రాన్ని వుంచి, రెండవదానిలో తనుకూర్చుని, "పురోహితులు వారూ! ఆరంభించండి" అన్నాడు. పురోహితుడు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. కుంపర్ సేన్, సదానంద్ నవ్వుతున్నారు. పురోహితుడు, "సదానంద్" అలా జరగకూడదు!" 'ఏం' అన్నాడు సదానంద్.

"యజ్ఞంలో భార్యాభర్తలిద్దరూ వుండాలి."

"కాని ఇద్దరిలోనూ, అనివార్యకారణాలవల్ల ఒకరు లేనట్టయితే వారి మూర్తిని ప్రతిష్టాపన చేస్తారుగా?"

"మనలో అట్లా జరుగదు."

సదానంద్ నవ్వుతూ, "మనలో అంటే?" అని అడిగాడు.

"వైదిక-ధర్మాన్ని పాటించేవారిలో పత్నీ లేక యజ్ఞం సఫలంకాదు."

"రాముడు వైదికధర్మావలంబి కాదా?"

"అవును. ఆయన ఆద్యుడే."

"ఆయన అశ్వమేధయజ్ఞం చేసినప్పుడు సీత ద[illegible]పోగా ఆమె మూర్తినే ప్రతిష్ఠాపించాడుగా."

"చాలా చిత్రంగావుందే!"

"శాస్త్రిలుగారూ! మీకు ప్రమాణం చూపిస్తానుగా. రాజపుత్రులలో వరుడు యుద్ధానికిపోయినప్పుడు అతని ఖడ్గాన్ని వుంచి వివాహంచేసేవారు."

ఏమి చెయ్యాలా అని శాస్త్రిలుగారు ఆలోచిస్తున్నారు. కుంవర్ సేన్‌గారు అన్నారు, "శాస్త్రిలుగారూ! ఆరంభించండి. హిందువులలో ప్రతి ఒక్క పరిస్థితులలోనూ కార్యం జరిపించడానికి ఉపాయాలు దొరుకుతాయి. హిందూసమాజం స్టీమ్‌రోలర్ వంటిది. విఘ్నాలూ, ఆటంకాలు దీని క్రిందపడి పిండి పిండైపోతాయి."

శాస్త్రిలుగారు కార్యమారంభించారు. 'ఓం విశ్వాని దేవ...' మొదలైనమంత్రాలతో యజ్ఞం ఆరంభమైంది. అప్పటికి వాడలోని జనమంతా వచ్చారు. ముందు ఈ సంఘటనకు అందరూ గుసగుసలాడుకున్నారు. కాని సదానంద్ తన స్థానంలో కూర్చొని తదేకధ్యానంతో యజ్ఞంలో పాల్గొంటున్నాడు అతనలా వుండటంచూసి తక్కినవారందరూ మాట్లాడకుండా తరువాత ఏమిజరుగుతుందా, అని చూస్తున్నారు.

అగ్నిగుండం వెలిగించేసరికి సదానంద్‌కి జనంలో గొడవ వినిపించింది. పురోహితుడు "ఓం భూర్భువస్వః .." అంటూ కర్పూరం అగ్నిగుండంలో వేస్తుంటే చ్చి రెండవ ఆసనంమీద ఫొటో ప్రక్కకుతొలగించి కూర్చుంది. మంత్రాలు చదువుతూ చదువుతూ లుగారు ఆగిపోయారు. సదానంద్ నవ్వాడు. తరు ఒకపాత్ర ఆమె చేతిలోవుంచి, "నేను చెప్పినట్లలా చెయ్యితల్లి" అన్నారు.

యజ్ఞం పూర్తయిపోయింది. శాస్త్రిలుగారు ఆశీర్వ దించి అన్నారు. పగలంతా మర్చిపోయి సాయంకాలం ఇంటికి వచ్చినా ధన్యవాదాలను అక్షులుగానే భావించాలి"

అందరూ అభినందనలు తెల్పారు. మిత్రులు, బంధు వులూ వధూవరులకు బహుమతులను చదివించారు.

తరువాత. భార్యాభర్తలిద్దరూ ఏకాంతంలో కలుసు కున్నప్పుడు యజ్ఞంమాట జ్ఞాపకం తెచ్చుకుంటూ అన్నది, "మీది చాలా విచిత్రమైన సమాజము. కేవలం ఒకచిత్రం లోనే పనిజరిపి వేస్తారు."

"అవును! ప్రజలు భగవంతుని పటాన్నివుంచి. దానికిభగవంతుని అస్తిత్వాన్ని ఆరోపించి పూజించేటప్పుడు శాంతిదేవియొక్క అసలైన పటంతోపని ఎందుకుజరిపి వేయ కూడదు?"

శాంతికి చర్చిలోని ఏసుప్రభువు, వర్జిన్ చిత్రాలమాట జ్ఞాపకం వచ్చింది. దానితో ఆమె మనస్సులోని సంశయ దూరమైపోయింది."

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA117B151
పుస్తకం పేరు	మానవుడు
తారీఖు	28/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	429
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	4
లేని పేజీలు	123 to 126
తయారు చేసినది	Aswini
పేజీలు విడదీసినది	thasin
స్కాన్ చేసినది	sandhya
పరీక్ష చేసినది	prathyusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good